శ్రీమద్భగవత్
గీతారహస్యము

కర్మయోగ శాస్త్రము

లోకమాన్య బాలగంగాధర తిలక్



ప్రథమ సంపుటము

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమద్భగవత్
గీతారహస్యము

అను

కర్మయోగశాస్త్రము

ప్రథమ సంపుటము

మహారాష్ట్రభాషయందు

లోకమాన్య శ్రీ బాలగంగాధర తిలక కృతము

శ్రీ నోరి సుబ్రహ్మణ్యశాస్త్రిచే ఆంధ్రీకృతము

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2003

GITĀ RAHASYAMU - I

by

Sri Balagangadhara Tilak

Translated from Marathi
by
Sri Nori Subrahmanya Sastri

Edited by
Sri M. Ramakrishna Sastry
Sri Mudivarti Kondamacharya

T.T.D. Religious Publications Series No. 282

© All Rights Reserved

Re-Prints : 1997, 2003

Copies : 2,000

Price : 40-00

Published by :
Sri Ajeya Kallam, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 501.

Printed at
Adisri Screens
Tirupati.

ముందుమాట

ఉపనిషద్వాఙ్మయం అంతా గోవుగా, గోపాలనందనుడు దోగ్ధగా, నరుడైన పార్థుని మీది వాత్సల్యంతో సుబుద్ధుల సార్థక్యానికి అందించిన అమృతం భగవద్గీత.

మరణశీలి అయిన మానవుడిని జననమరణ రూప సంచార చక్రంనుంచి తప్పించగల ఏకైకశాస్త్రం బ్రహ్మవిద్య అమృతత్వసిద్ధి కేర్పడింది. ఈ స్థితి చేరేందుకు శాస్త్రకారులు విభిన్న మార్గాలను సమాజానికీ సాధకులకూ అందించినా వేటి కవి విడిగా ఉండి పోయాయి. అన్ని మార్గాలను సంకలనం చేసుకున్న అమృత భాండం భగవద్గీత. ఆ యా వ్యక్తుల అర్హతావకాశాలకు అనుగుణంగా భిన్న భిన్నమార్గాలు వాటిని ఆచరించే విధానాలను తరతరాలకూ అందించిన లౌకిక పారలౌకిక శుభ సుఖదాయిని అది. ఫలాపేక్షరహిత బుద్ధితో ఏ విధానాన్ని అనుసరించగలిగినా, ఐహికంగా జీవన్ముక్తుడై పరంలో పునరావృత్తిరహిత పరమ పదాన్ని సాధకుడు పొందగలుగుతాడు. అన్ని విధానాలను అనుసరించగలిగితే చెప్పవలసిన పనే లేదు.

అసలు భగవద్గీత భిన్నధర్మ కర్మ మార్గ సంకలనమనే భావన కూడా వున్నది. గీతామార్గాలు సర్వజన శ్రేయోదాయకాలనేందుకు దీనికి ఉర్దూభాషలో 20 అనువాదాలదాకా ఉండడం, వివిధ పాశ్చాత్యభాషలలో ఇది అనువాదం కావడంఇందుకు నిదర్శనం. మొగలాయీ రాజకుమారుడు గీతాసారాన్ని గ్రోలిన ధన్యజీవి అని చరిత్ర తెలుపుతున్నది.

వాస్తవానికి భగవద్గీత భిన్న కర్మమార్గాల సంపుటీకరణమని లోకమాన్య బాలగంగాధర తిలక్ వంటి మహానీయులు భావించారు.

గీతా ఆదర్శాలను అనుష్ఠించి తరించిన ఆ కర్మయోగి తిలక్ మహారాష్ట్ర భాషలో సమాజానికందించిన గీతారహస్యగ్రంథానికి శ్రీనోరి సుబ్రహ్మణ్యశాస్త్రి గారి ఆంధ్రానువాదాన్ని ఆస్తికజనులకు అందించే అపూర్వావకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నాం.

లోగడ ముద్రించిన మూడు సంపుటాల ప్రతులు చెల్లిపోయిన కారణాన వీటిని పునర్ముద్రిస్తున్నాం.

తమ అనుభవాన్ని తాత్త్విక సంవదను రంగరించి లోకమాన్యులందించిన ఈ గీతారహస్యం అఖిలాస్తిక జనాదరణ పొందగలిగితే ఇందరి ఆశ, మా ప్రయత్నమూ చరితార్థమైనట్లే.

కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు.

అథ గ్రంథకర్తృ సమర్పణమ్

శ్రీగీతార్థః క్వ గంభీరః వ్యాఖ్యాతః కవిభిః పురా,
ఆచార్యై ర్యశ్చ బహుధా క్వ మేఽల్ప విషయామతిః.

తథాపి చావలాదస్మి వక్తుం తం పునరుద్యతః,
శాస్త్రార్థాన్ సంముఖీకృత్య ప్రజ్ఞానవైద్యైః సహోచితైః.

తమార్యాః శ్రోతు మర్హంతి కార్యాకార్య దిదృక్షవః,
ఏవం విజ్ఞాప్య సుజనాన్ కాళిదాసాక్షరైః ప్రియైః.

బాలో గంగాధరశ్చాఽహం తిలకాన్వయజో ద్విజః,
మహారాష్ట్రే పుణ్యపురే వసన్ శాండిల్యగోత్రభృత్.

శాకే మున్యగ్ని వసుభూ సంమితే శాలివాహనే,
అనుసృత్య సతాం మార్గం స్మరంశ్చాపి వచోహరేః.

సమర్పయే గ్రంథ మిమం శ్రీశాయ జనతాత్మనే,
అనేన ప్రీయతాం దేవో భగవాన్ పురుషః పరః.

---

* యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్.

గీతా. 9. 27

లోకమాన్య శ్రీబాలగంగాధరతిలకు గారి

సంగ్రహజీవన చరిత్రము

ఏ మహనీయుఁడు దొరతనమువారి బిరుదు లైహికాముష్మిక సాధనము అని భ్రమ నొందక "లోకమాన్యుఁ"డను ప్రజ లిచ్చిన బిరుదువే జగద్విఖ్యాతిఁ గాంచెనో, యే మహామహుఁడు దేశోద్ధరణమున కై కంకణ ముఁ గట్టుకొన్నవారి కెల్ల రకును మకుటప్రాయుఁడై వక్యావక్తియందు హరిశ్చంద్రునివగిది కడుఁ బాములఁ బడియును సత్యమును స్థాపించు నుండెనో, యే మహోన్నతుఁడు భారతమాతృపుత్రులకెల్ల గురుస్థానము నలంకరించి రాజకీయ సాంఘిక విషయములందువలెనే, హిందూమత విషయములో సైతము కృషిఁజేయుచు హిందూమతమునకు నూతనో జ్జీవమును గలిగించుచుండెనో, యే మహామహుని పాదరజము కోటి నంతనే వర్షపీడావరిహారం మగునని యౌతమల్ ప్రాంతములందలి మహా రాష్ట్రజనులు భావించుచుండిరో, యే పద్మనివంపన్ను నాంధ్రులు "భగవాన్ తిలక" యని పేర్కొన సాగిరో యా 'లోకమాన్య బాలగంగాధర తిలక' ధీవరుని పావనచరిత్రమును సంగ్రహముగ నెఱింగుట మహా భాగ్యము కదా!

మహారాష్ట్రమున రాజ్య మేలిన షిష్యాలను, నానాఫడ్నివీస్, రాస్తే, గోపాలకృష్ణగోఖలే మొదలగు జగద్విఖ్యాతపురుషు లెల్లరును కొంకణస్థ (అనఁగా: పశ్చిమాద్రి పర్వతములకును- (Western Ghats) అరబ్బీ సముద్రమునకును మధ్య నుండు దేశములోని) చిత్పవనబ్రాహ్మణులు. అట్టి పేరొందిన బ్రాహ్మణవంశస్థుఁడగు గంగాధరరామచంద్రతిలక్ (తిలక యను గృహనామముగల రామచంద్ర రావుగారి కొమరుఁడగు గంగాధర రావు) అనువారు మహారాష్ట్రదేశములోని రత్నగిరి యను పట్టణమున నొక పాఠశాలలోఁ బ్రధానోపాధ్యాయులుగ నుండిరి. వీరిభార్య పార్వతీ

బాయి యను సతీమణి. ఈ దంపతు లొక కొమరుని ముప్పురు కొమా ్తె లను బడసిరి. ఈ కొమరుఁడే మన యిప్పటి కథానాయకుఁడగు బాల గంగాధరతిలక్. వీరు శాలివాహనశకపు సం॥ 1778 కి సరియగు రాక్షస సంవత్సర ఆషాఢబహుళ 6 షష్ఠి బుధవారము (కీ.శ. 1856 సం॥ జూలై 23) శుభలగ్నమున జనన మందిరి. వీరికి బల్వంతరావు (లేక బాల గంగాధరతిలక్) అని నామకరణముఁ జేసిరి. బల్వంతరావు గారికి పదేండ్లగునాటికి వారి తల్లియగు పార్వతీబాయియు, వారి పదునాఱవ యేట తండ్రి గంగాధరరావును కీ ర్తిశేము లైరి. గంగాధరరావు సదాచార సంపన్నుఁడగు పండితుఁడు. తన కొమరుఁడగు బల్వంతరావునకుఁ జిన్న తనమునుండి సద్విద్యాబుద్ధులు దగు రీతిఁ గఱపుచుండెను. అందుచే బల్వంతరావు తన పదునై దవయేట హూణభాషలోఁ బ్రవేశపరీక్షయం దుత్తీర్ణుఁ డయ్యెను. మరుసటి సంవత్సరమునసే పితృవియోగ మాయెను. ద్రవ్యోపపత్తి కిఁ గొఱఁతలేమిచే నాంగ్లపాఠశాలయందుఁ జదువుచు క్రీ.శ. 1876 వ సంవత్సరమున బి. ఏ పట్టపరీక్ష నిచ్చెను. పిదప మూఁడేండ్లకు నుత్తమన్యాయవాదిపరీక్ష (యల్.యల్.బి) యందును గృతార్థులైరి. కుశాగ్రబుద్ధియగు బల్వంతరావునకు దేశాభిమాన ముగ్గుపాలతోనే పోయఁ బడినది. అది యీ తరుణమున నాతనిని కార్యరూపమునఁ జూవఁ బ్రేరే పింపఁజొచ్చెను. ఆగర్కార్, విష్ణుశాస్త్రి, చిప్లంకార్, నామజోషి మున్నగు దేశాభిమానులతో నిప్పుడు మైత్రి కుదిరెను.1880 సంవత్సరమున బల్వంత రావు, నూతనాంగ్లపాఠశాల నొకదానిం బ్రతిష్ఠించి దానియభివృద్ధికై రేయింబవళ్లు తదేకనిష్ఠతోఁ బనిసేయుఁ చుండెను. పాఠశాలాభివృద్ధి కడుఁ దృప్తికరముగ నుండెను. కావున తగు ప్రయత్న పూర్వకముగ నొక కళాశాల (The Fergusson College) ను 1884 వ సంవత్సరమున స్థాపించి వీరంద ఱం దుపాధ్యాయులుగ నుండిరి. బాలగంగాధరతిలకు గారు గణితశాస్త్రమును, ప్రకృతిరసాయనశాస్త్రాదులను, సంస్కృత మునుఁ గూడ బోధించుచుండిరి. వేతనమునకై పాటుపడు సామాన్యపు నుపాధ్యాయులవలెఁగాక, వీ రనేక విశేషాంశములను బోధించుచుండు టచే వీరియెడ విద్యార్థు లవరిమితానురాగముతో మెలఁగెడువారు. "కళాశాలలో సంస్కృతమును బోధించునంతటి పాండిత్య మి మహ నీయున కెట్లుకలిగెను? ఏ గురువునొద్ద వీ రుపదేశము నొందిరను ప్రశ్నలు

సహజముగఁ బొడమునుగాని గురుముఖమున నభ్యసింపకయే వీరు స్వయముగ వేదములను, షడ్దర్శనములను కరతలామలకముగఁ జేసి కొనిరి. ఇట్టి ధీమంతునెడల ననురాగము జనింపనివా రుందురా?

వీరిచే స్థాపితమైన పైకళాశాల దొరతనమువారివలన నెట్టి యుప కారమును బొందకయే, యీ దేశమునకుఁ బ్రతిష్ఠ నార్జింపవలయునని యి మ్మహనీయుల యాశయము. కాని ఆగర్కారు మొదలగు సహకారులు భిన్నాభిప్రాయు లగుటంజేసి, దినదినాభివృద్ధిఁ గాంచుచున్న కళాశాలా ధ్యక్షులలో భిన్నాభిప్రాయములును, తన్మూలముగు వైషమ్యములును బొడము సూచనలు గన్పట్టెను. అట్టియెడ నీ యుత్కృష్టప్రతిష్ఠాపన మంత రించు ననుభీతివలనను, మఱికొన్ని కారణముల వలనను, తన మనస్సాక్షికి విరుద్ధముగఁ జరింపనివాఁ డగుటచే, వీ రాకళాశాలతోఁ దనకుఁ గల సంబంధమును 1891 వ సంవత్సరములో వదలుకొనిరి. ఇందువలన నుభయపక్షముల వారికిని వాదములు హెచ్చినవి. ప్రతికక్షులలోని ఆగర్కారుగారు "కేసరి" యనుపత్రికను, తిలకుగారు "మహారాష్ట్ర" యను పత్రికను స్థాపించి వాదప్రతివాదములను జరుపసాగిరి. వీదవ కొన్నినాళ్ల కిరుపక్షములవారును సంపూర్ణ దేశాభిమాననిరతులు గావున నొకరి నొకరు నిందించుటను మాని మరల మిత్రులైరి. వీ రిరువురు కొల్లాపురపుమహారాజగు శివాజీరావు బహద్దర్‌గారి విషయములోఁ దమ పత్రికలయందు తీవ్రచర్చను జరిపిరని దండాధ్యక్షుఁడు (Magistrate) వీరిరువురను నేరస్థులఁ జేసి 100 దినములు కారాగారమున నుండునట్లు విధించెను. అటుపిదప వీ రిరువురకును సాంఘిక మతవిషయములలో భిన్నాభిప్రాయములు పొడమినందున ఆగర్కారుకేసరిపత్రికను విడనాడి 'సుధారక్' అను పత్రిక నారంభించిరి. పండిత పక్షపాతియగు తిలకు గారు కేసరి పత్రికనుసైతము స్వీకరించి నడుపుచుండిరి.

ఇట్టిస్థితిలో నిండియాదేశపు శాసననిర్మాణసభలో "అంగీకార వయస్సు చట్టము" (Age of Consent Bill) విషయమై చర్చయొకటి ప్రారంభ మాయెను. అది హిందువుల సాంఘిక మతవిషయకమైనది. "దొరతనమువా రిట్టి విషయములలో నెట్టి బదవామీఁ గలుగఁజేసికొనినను హిందూప్రజలయాచారమునకు భంగకర" మని తిలకుగారికి తోఁచినది.

కావున నట్టి వట్టము వధిక్షేపించుచు పండితులపక్ష మవలంబించి యతిధైర్య స్థైర్య, సామర్థ్యములతో మహనీయులగు తిలకుగారు తీక్ష్ణముగ వ్రాసిరి. ఈ తరుణమువనే పుణే (పునా) వట్టణములో న్యాయశాస్త్ర పాఠశాల (Law College) నొకదానిని నెలకొల్పి తిలకుగా రందు బోధించుచుండిరి. ఇది మొదలు మన మహనీయులు రాజకీయాందోళనమువఁ గడు శ్రద్ధతో విశేషముగఁ బనిచేయసాగిరి.

శ్రీయుత లోకమాన్యుల రాజకీయ ప్రయత్నములును, అందువలన నా సత్యసంధునకుఁ గలిగిన యిక్కట్టులును ప్రస్తుతము మన కవసరము లేదని తోఁచినమ నట్టి ముఖ్యవిషయములు లేక, వారి జీవితచరిత్ర యపంపూర్ణముగము, హాస్యాస్పదముగ నుండుటవే నీ క్రింద నించుక వానిని మందలింపవలసి వచ్చినది.

మహారాష్ట్రభాషలోఁ బ్రచురిత మగుచున్న "కేసరి" పత్రికవలననే లోక మాన్యుల పేరుప్రతిష్ఠలు మహారాష్ట్రదేశమునందు హెచ్చు కాఁ బొచ్చెను. ఇంతియకాక పుణేనగరమునఁ బ్రసిద్ధినొందిన "బావట్" కేసువలనను, ముంబయి (బొంబయి)రాష్ట్రీయ మహాసభకుఁ గార్యదర్శిగా నుండి చేసిన పనివలనను, రాయగడమువందు శివాజీమహారాజుయొక్క సమాధిని పునరుద్ధరణఁజేసి దేశమునం దా మహారాజుస్మరణ చిహ్నమును గౌరవించుటవలనను, పుణేపట్టణమున పురపాలకసభలో సభ్యుఁడుగ నుండి వహించిన శ్రద్ధవలనను, ముంబయిరాష్ట్రీయ శాసననిర్మాణసభలో గౌరవ సభ్యుఁడుగ నుండినందునను, సార్వజనిక సభయందుఁ జేసిన కృషి వలనను తిలకుగారి కీర్తి దిగంతముల వ్యాపించి వారికి ప్రజానాయకత్వ మిప్పించెను.

ఇట్టి సమయమున పుణేనగరమున మహామారిదాడ్యము ప్రబల మైనది. ఈ వ్యాధి నణఁచుటకు దొరతనమువారు చేయుప్రయత్నములు ప్రబల కర్తవ్యకరము లాయెను. అల్లరు లారంభమాయెను. 1897 వం॥ జూన్ నెల 22వ తేదినాడు 'ర్యాండు, లెఫ్టినెంటు అయర్స్టు' లను నై రోపియోద్యోగులు దుర్మరణము నొందిరి. ఇట్టిస్థితిలో నీ యల్లరులఁ గూర్చి కేసరిపత్రిక నింహనాదముఁ జేసెను; పూనాలో జరిగిన శ్రీ శివాజి పట్టాభిషేకోత్సవదివసమున లోకమాన్యుఁ డిచ్చిన యువన్యాసము 1897

సం॥ జూన్ 15 వ తేదియందు ప్రచురితమాయెను. ఈ సందర్భములు దొరతవమువారికి దుస్సహములై తిలకువంటినాయకులను శిక్షించినచో నల్లరులు తగ్గునని యెంచి, తిలకుగారిపై బొంబయిలోని యున్నత న్యాయస్థానమున (High Court) రాజద్రోహపునేర మారోపింపఁబడి విచారణకు వచ్చెను. ఈ యభియోగమునకు పంచాయతీలుగా నాల్గు రైరోపీయనులును, ముప్పురు భారతీయులు నేర్పఱుపఁబడిరి. వీరిలో నైరోపీయషట్కము తిలకుగారిని 'దోషి' యనియు, ముప్పురు భారతీయులు 'నిర్దోషి' యనియు నభిప్రాయము నిచ్చిరి. న్యాయమూర్తి స్ట్రాచీ (Justice Strachy) గా రెక్కువమంది యభిప్రాయానుసారముగ శ్రీతిలకు గారికి ఒకటిన్నరపంపత్సరము కారాగారమునఁ గఠినశిక్ష ననుభవించునట్లు తీర్మానించిరి. ప్రధానన్యాయస్థానము వఱకు (Privy Council) నభియోగము కొంపోఁబడినది (అప్పీలు చేయఁబడినది) గాని తిలకుగారి కుపయోగము లేకపోయెను. అయినను సంస్కృతవిద్యాభిమాని యగు మాక్షుముల్లరు (Prof. Max Muller) గారి ప్రేరణమున దొరతనము వారు తిలకుగారిని 1898 సం॥ సెప్టంబరునెల 8 వ తేది శిక్షనుండి విడుదలఁ జేసిరి. కారాగృహమునుండి విడుదల కాగావే తిలకుగారు చెన్నపురిలో జరిగిన దేశీయమహాజనసభ కేతెంచి, యచటినుండి సింహళము వఱకును యాత్రగావించి పునాపానగరము మరలఁజేరి శ్రీ శివాజీమహారాజుయొక్క పట్టాభిషేకదినోత్సవము నతివైభవముతో జరుప నారంభించిరి.

మహారాష్ట్రదేశములో నొక సర్దారు "బాబామహారాజు" అను వతఁడు స్వర్గస్థుఁడగుతఱి (7-8-1897) బాలగంగాధరతిలకు, శ్రీకృష్ణ కవర్డీ, రావుసాహెబ్ కంభోజ్కార్, నాగపూర్ కార్‌గార్లను తన యాస్తికి పాలకులుగా (Trustees) నియమించి, వారియిష్టానుసారము తనకు, తన భార్యయగు శ్రీ తుకువార్‌బాయి (లేక తాయిమహారాజు) యోగ్యుఁడగు చిన్నవానిని స్వీకార మొనర్పుట కనుజ్ఞ నిచ్చుచు మరణశాసనమును వ్రాసెను.

వీరిలో రావుసాహెబ్ గారును, పిదప నాగపూర్‌కార్ గారును ట్రస్టీలై యుండుట మానుకొనిరి. తిలకుగారును, కవర్డిగారును, కంభోజ్కార్ గారును తాయిమహారాజు నిచ్ఛానుసారముగ వారి భర్తృవంశము

నకు సంబంధించిన జగన్నాథ్ అనువాని నేర్పాటుచేసి, తాయిమహారాజుచే దత్తస్వీకారము యథావిధిగఁ జేయించిరి. కాని, కొందఱి దురాలోచనల వలన నామె మఱియొక చిన్నవానినింగూడ స్వీకరించి జగన్నాథుని వెడలఁగొట్టెను. అంత జగన్నాథుని దత్తునుగూర్చి ట్రస్టీలు పునహా యందలి సబ్‌జడ్జిగారి న్యాయస్థానమున వ్యాజ్యెమునఁ దెచ్చి యచ్చట జయ మొందిరి. కాని తాయిమహారాజు బొంబయి హైకోర్టులో నప్పీలు చేసి గెలిచినది. అయినను ట్రస్టీలు ప్రధానన్యాయస్థానమున (Privy Council) నప్పీలు చేయఁగా జగన్నాథుని దత్తత స్థిరపడి వీరికి జయము గలిగినది. ఈ సందర్భమున తిలకుగారును, మఱికొందఱును అబద్ధపు సాక్ష్యమును చెప్పినట్లును, మోసముచేసినట్లును వారిపై నేర మారోపింపఁబడినది. ఇందుకై తిలకుగారికి వదునెనిమిదిమాసములు కారాగారపు కఠిన శిక్ష విధింపఁబడెను. కాని అపీలులో తిలకుగారు జయ మొందిరి. మఱియు నీ వ్యవహారమునందు తిలకుగారు వారి పరోపకారబుద్ధికై ప్రధానన్యాయ స్థానమువలన మెప్పు వడసిరి.

స్వదేశోద్యమము, విదేశవస్తు బహిష్కారము, జాతీయవిద్య, స్వరాజ్యాందోళనముల విషయములలో తిలకుగారు చేసినకృషి యింతింత యని వ్రాయ నలవికాదు. సర్వకాలసర్వావస్థలయందును దేశాభిమానమే స్వర్గతుల్యముగ నెంచు మహనీయుఁ డిట్టి విషయములలోఁ బట్టుదలను పెంపుచేయునుగాని యుపేక్షవహించునా? సమర్థవిద్యాలయము, పైసా నిధి (Paisa Fund) తలేగాను నందలి గాజుసామగ్రిఁ దయారుజేయు యంత్రశాల మున్నగువానికి వీరే కారకు లన ఁజెల్లును. వీ రెల్లప్పుడును రాజ్యాంగవిధానమునందలి లోపముల నతితీక్ష్ణముగను, నిర్భయముగను, సహేతుకముగను 'కేసరి', 'మహారాష్ట్ర' పత్రికలయందు విమర్శించుచు చర్చించుచుండువారు. 1907 వ సంవత్సరము డిసంబరు నెలలో సూరతు పట్టణములో సమావేశమైన దేశీయమహాజనసభకు విఘ్నము రటస్థించి నది. అప్పటి నుండియు దేశీయప్రముఖులలో మితవాదులు, అతివాదులు అని రెండుపక్షము లేర్పడినవి. తిలకుగారును వారి యనుచరులును అతి వాదులుగ భావింపఁబడిరి. మితవాదులు దొరతనపువారి యనుగ్రహము నకు పాత్రులై రి. తిలకుగారి సూరతు దేశీయమహాజనసభ విఘ్ను మగుటకు కారణమని మితవాదులు చెప్పి తిలకుగారిని నిందించుచువచ్చిరి. ఇంత

వఱకుమ తిలకుగారు మితవాదులయభిప్రాయములకు లొంగక పోవుటయే గాక యప్పటి మితవాదు లంద ఱిపుడు వారి యభిప్రాయమును సరియే యని యొప్పుకొనిరి.

1908 వ సం. జూలై నెలలో మరల రాజద్రోహపు నేరము తిలకు గారిపై యారోపింపఁబడెను. అందుకై బొంబయిలోని యున్నత న్యాయ స్థానము (High Court) న విచారింపఁబడిరి. న్యాయమూర్తి "దావరు" గారు తిలకుగారిని నేరస్థులని తీర్మానించి యాఱుసంవత్సరములు కారా గారబద్ధునిగాఁ జేసిరి. కొద్దికాలము 'బర్మతి' యందు కారాగారవాసము చేయించిన పిదప తిలకుగారిని బర్మాయందలి 'మాండలే' (Mandalay) కు రహస్యముగఁ గొంపోయి యచ్చోట కారాగారమున దొరతనమువా రుంచిరి. కాని, కఠినశిక్షనుండి విడిశిక్షఁజేసి, దొరతనమువారు, తిలకు గారికి గ్రంథములు పఠించుట కవకాశ మొసఁగిరి. మాండలేయందు శిక్ష ననుభవించు కాలమువ ని మహనీయుని సహధర్మచారిణి సత్యభామ ఱాయి స్వర్గస్థురా లాయెను. ఈవార్తను విని ధైర్యముచెడక భగవంతుని పై భారము వైచి తిలకుగారు శిక్షాకాలమును పూర్తిగ జరపి 1914 వ సంవత్సరములో విడుదలచేయఁబడిరి. అప్పటినుండియు మరల దేశోప కారకార్యములయందు బద్ధకంకణులై శ్రీమతి అనిబెసంటు దొరసాని గారికి సాయ మొనర్చుచు సతివాదులను మితవాదుల నేకముచేయుటయే గాక 1916వ సంవత్సరారంభమున పునహానగరమం దొక "ఆంగ్ల సామ్రాజ్యాన్తర్గత స్వరాజ్య సంఘము" ను స్థాపించి తత్సంఘమున్ను కధ్యక్షుఁ డుగ నుండి స్వరాజ్యప్రాప్తియే భరతఖండమునకుఁ బరమావధి యను వమ్మకముతో నలుదెసల సంచరించి యువన్యాసముల నిచ్చుటమూలము నను, పత్రికలయందు వ్యాసములు రచించి ప్రకటించుట మూలము నను అతిశ్రద్ధతో పర్యవేక్షణ జేయుచున్నారు. "రాజ్యాంగ విషయము లలో సహజముగ నభిప్రాయ భేద మెల్ల వారికివలె నాకుఁగూడ నుండి నందువలన చక్రవర్తిగారి పరిపాలనమునకు నేను విరుద్ధభావమును వహించితిననిగాని, విరుద్ధముగఁ బనిచేయుచుంటిననిగాని యెంచుట సాహస్యాస్పదము. అది నా యుద్దేశముగాని యాశయముగాని కాదు. పరిపాలనావిధానముల మార్పుటకు నై ర్లెండులో నై రిషస్వరాజ్యవాదులు ప్రయత్నించుచుండువ ట్లిండియాలో మనము ప్రయత్నించుచున్నా

మనియును, దొరతనమువారిని వెడలఁగొట్టుటకుఁ బ్రయత్నించుట లేదని యును నేను స్పష్టపఱచుచున్నాను.... — నాగరికతగల పరిపాలనా విధానముననేగాక, కాలక్రమమున హిందూదేశములోని యన్ని జాతులకు నన్ని తెగలకు నేకీభావముఁ గలిగించి తన్మూలమున పయుక్తశాతీయత పెంపుఁబొందునట్లు బ్రిటిషు పరిపాలనము మహోపకార మొనరించు చున్నదని వ్యాయముగఁ జెప్పఁబడుచున్నది. స్వాతంత్ర్యమును ప్రేమించు బ్రిటిషువారు గాక ఇంకెవరైనను మన పరిపాలకులైనచో మన జాతీయాదర్శము నింతగా నిర్మించి పెంపుఁజేయుటకు మనకు సహకారులై యుందురని నేను నమ్మను. ఇదియును బ్రిటిషు పరిపాలనమునఁగలుగు నితర ప్రయోజనములను హిందూదేశాభివృద్ధిఁగోరు ప్రతివారును పూర్తిగ నెఱింగియున్నారు" అని శ్రీతిలకుగారు వ్రాసినారు. ("Bal Gangadhar Tilak," Ganesh & Co, PP. 346-347) బ్రిటిషు సామ్రాజ్యమునం దింత యభిమానముగల శ్రీతిలకుగా రెట్లు రాజద్రోహియగును?

1918 వ సంవత్సరాంతమున లక్నఁపురి (లక్నో) యందును, 1917 వ సంవత్సరాంతమునఁ గలకత్తా (కలకత్తా) నందును జరిగిన దేశీయమహాజనసభల కీ మహనీయుఁడు దతిపై భవముతో నేగి తన వాగ్గుంభనచే మాతృభక్తిని వెదచల్లెను. ఇండియాదేశపు పరిస్థితుల నింగ్లాండులోని ప్రజకుఁ దెల్పి, మన దేశమునకు స్వరాజ్యము నిచ్చునట్లు వారి సహాయులఁజేయుటకై ఆంగ్లసామ్రాజ్యస్థ స్వరాజ్య సంఘమువారిచే నియమింపఁబడి శ్రీతిలకుగారును, కవర్ధిగారును, కేల్కారుగారును, విపినచంద్రపాలుగారును, పత్యుదు హుస్సేనుగారును ఇండియాదేశపు ప్రభుత్వమువారి యనుమతిఁబొంది యీ 1918 వసం ఏప్రిల్ నెల 27 వ తేదిని బొంబయి పట్టణమునుండి యింగ్లాండునకు రాయబారులుగఁ బయనమై సింహళముఁజేరిరి; కాని ఇంగ్లండులోని బ్రిటిష దొరతనము వారి యుత్తరువుచొప్పున వా యుద్యమమును బ్రస్తుతము మానవలసివ వారై పైనలుపురును తమ యునికివట్లకు మరలిరి.

రాజకీయాంశములయం దెన్నియిక్కట్టులు వాటిల్లినను, ధైర్యమును బోనాడక, సత్యమునందు నిరుపమానమగు భక్తిదలఁగలిగి,

స్వార్థముఁ ద్యజించి, లోకోపకారదీక్షితుఁ డగుటచే నీ మహాత్మునియెడ "లోకమాన్య" బిరుదము సార్థకమైనది. ప్రపంచమువం దంతట వీరిని గౌరవింపనివా రుండరు.

ఈ లోకమాన్యుఁడు లోకోత్తరమగు "మృగశీర్షానక్షత్రము" అను (Orion) గ్రంథమును ఆంగ్లభాషయందు వ్రాసి, ఋగ్వేదము క్రీస్తు శకమువకుఁ బూర్వ మధ్యమము నాలుగుపేలసంవత్సరముల క్రిందట మండినట్లు సిద్ధాంతము చేసెను.

1897 వ సంవత్సరమున నీ మహామహుఁడు చెఱసాలయం దుండి (Arctic Home in the Vedas) "వేదములయందలి యార్యుల యుత్తర ధ్రువ (లేక సముద్ర) నివాసము" అను ససాధారణగ్రంథ విశేషములు గల గ్రంథమును వ్రాసెను. అం దనేకయుగములక్రిందట నార్యు లుత్తర ధ్రువప్రాంతనివాసులై యుండి రనియుఁ బిదపఁ గారణాంతరములచే దక్షిణాభిముఖముగ వచ్చి రనియును వందుఁ గొందలు భరతభూమి కరుదెంచి రనియు, వారే యార్యావర్తమును తమ నివాసముగఁ జేసికొని రనియును వేదములను బ్రహ్మణములుగఁ గైకొని వ్రాసియున్నా రనియు. పాశ్చాత్యపండితులు పయిత మీ గ్రంథమును దిలకించి యత్యద్భుత మొంది యదివఱకుఁ దమకుఁగల యభిప్రాయములను మార్చుకొని శ్రీలోకమాన్యుని సిద్ధాంతము నంగీకరించిరి.

1903 వ సంవత్సరము మొదలు 1914 వ సంవత్సరమువఱకు నాఱు సంవత్సరములు కారాగృహముఁ డయ్యును, నతీవియోగముగల్గినను, ప్రవాస మువ నుండుతరి సైతము హిందూమతము ముద్దరించవఱచుని వలయు గ్రంథసామగ్రిని పేకరించికొని విమర్శనబుద్ధితోఁ బఠించి హిందూమతము నకు వన్నె దెచ్చిన నీ భగవద్గీతారహస్యమును తన హైందవసోదరులకు నుపదేశించుటకై మాతృభాషాభిమాని గావున స్వభాషయగు మహారాష్ట్ర భాషయందు భాషాపై చిత్రములను బెంపొందింపుచు "గీతారహస్యము లేక కర్మయోగము" అను నుద్గ్రంథమును వ్రాసి 1914 వ సంవత్సర ములోఁ జెఱసాలయందుండి విముక్తిఁ బొందిన వెంటనే ప్రచురపఱచెను. ఈ గ్రంథ మమూల్య మగుటచే మహారాష్ట్రభాషాయలవాటులేని యితర పండిత పామరజను లెల్లరకును, ముఖ్యముగుపట్లు గుజరాతి, హిందీ

భాషలలో భాషాంతరీకృతమై కర్ణాటాంధ్ర ద్రావిడాది భాషలయందు సైతము భాషాంతరీకరణంబు గావింపఁబడుచున్నది.

శ్రీలోకమాన్యతిలకుగారికి మువ్వురు కొమార్తెలును, మువ్వురు కొమారులును గలిగిరి. కొమార్తె లందఱును వివాహితలై తమతము భర్తలతోఁ గాపురములఁ జేయుచు సుఖముగ నున్నారు. పెద్దకొమారితకు 37 యేండ్లప్రాయము. కాని పెద్ద కుమారుఁడు బి. ఏ. పరీక్షయం దుత్తీర్ణుఁడై 1903 వ సంవత్సరములో నకాలమరణమునొంది తలిదండ్రులకు మితిమీరిన దుఃఖముఁ గావించెను. ఇపు డుండు కుమారులిరువురిలో పెద్దవాఁడు రామచంద్రరావనువాఁడు. అతఁడిరువది మూఁడేండ్లవాఁడు. రెండవవాఁడు శ్రీధరరావు. ఇతఁడిరువదియొక్క యేండ్లవాఁడు. వీరిరువురును కళాశాలలయందుఁ జదువుచున్నారు.

హిందూమత పోషకుఁడును, ప్రజానాయకుఁడును, పండితోత్తముఁడును, కర్మయోగియును, పరోపకారధురంధరుఁడును, సత్యసంధుఁడును, ధైర్యసాహస సద్గుణసంపన్నుండు నగు శ్రీలోకమాన్య బాలగంగాధరతిలకుచే నాంధ్రలోకమున కొసంగఁబడిన యీ యుత్కృష్ట గ్రంథము నాంధ్రు లెల్లరును బఠించి కృతార్థు లయ్యెదరుగాత! శ్రీకృష్ణ భగవానులు లోకమాన్య బాలగంగాధరతిలకునకు నాయురారోగ్యైశ్వర్యాదులొసంగి ప్రపంచమునందెల్ల నీ గ్రంథప్రభావ మప్రతిమానముగ వెలయించు గాత!

"ఓం తత్సత్"

తెనాలి,
15-8-1918.

పెద్దిభట్ల లక్ష్మీనరసింహం,
ప్లీడరు.

గ్రంథకర్తయొక్క ప్రస్తావన

సంతాంచీ ఉచ్ఛిష్టేఁ బోలతోఁ ఉత్తరేఁ,
కాయ్ మ్యా పామరేఁ జాఁవ్ వేఁ హేఁ.

– నేను చెప్పు వాక్యములు సత్పురుషుల యుచ్ఛిష్టము. పామరుఁడ నగు నేను వాని భేదము నే మెఱుంగఁ గలను: – తుకారాం

శ్రీమద్భగవద్గీతపై ననేకములగు సంస్కృతభాష్యములు, టీకలు లేక ప్రాకృత భాషాంతరములు, మఱియు విస్తరణలు, సర్వసామాన్యములగు నిరూపణములు నుండఁగా నీ గ్రంథమును ప్రచురించుటకు కారణము గ్రంథారంభముననే చెప్పఁబడినను, గ్రంథములోఁ బ్రతిపాద్యములందు కొన్ని విషయములయొక్క వివేచనయందు చేయుటకు వీలులేకపోవుటచే వానినిఁ బ్రకాశింపఁజేయుటకై ప్రస్తావన దక్క మఱియొక మార్గ మేమియు లేదు. వీనిలో మొదటిది గ్రంథకర్తను గురించిన విషయము (స్వవిషయము). నాకు భగవద్గీతతో మొదటి పరిచయము నేటికి సుమారు నలువదిమూఁడు సంవత్సరముల క్రిందట నైనది. క్రీ. శ. 1872 వ సంవత్సరమున నా తండ్రిగారు, తా మంతిమావస్థయం దుండి భగవద్గీతపైనున్న "భాషావిృతి" యనుపేరి ప్రాకృతటీకను తమకు వినిపింపుమని నా కాజ్ఞ యొసంగిరి. అప్పుడు (అనఁగా: నా వదునాఱవ యేట) గీతలయొక్క భావార్థము పూర్తముగఁ దెలిసికొనుటకు శక్యము గాకుండెను. అయినను బాల్యమున మనస్సునకు సంభవించిన సంస్కారము స్థిరమయి యుండును గావ సంస్కృతముయొక్కయు వాఙ్మయాభాషయొక్కయు నభ్యాస మధికమైన పిదప గీతలపైనున్న సంస్కృతభాష్యములమ, ఇతరములగు టీకలమ ఇంగ్లీషునందమ, మహారాష్ట్రీమునందును ననేకులగు పండితులచేఁ జేయఁబడిన వివేచనలమ సైత మప్పుడప్పుడు చదువుచుంటిని. కాని వ్యకీయులతో యుద్ధము చేయుట గొప్ప దుష్కార్యమని యెన్ని కిమ్మఁడైన యర్థును నా యుద్ధమువందే

ప్రవర్తింపఁజేయుటకుఁ జెప్పఁబడిన గీతలయందు బ్రహ్మజ్ఞానముచేఁగాని, భక్తిచేఁగాని మోక్షి మెట్లు లభించును? లేక యిట్టి గ్రంథమున మోక్ష మార్గముయొక్క వివేచన యేల చేయఁబడియును? అను శంక మనస్సున నే గల్గి యుదియే ముందు ముందు ప్రబలుచుండెను. కారణ మేమన: గీతలయొక్క టీకయందును దానికి తగిన సమాధానము గన్పట్టలేదు. ఈ శంక నాకే గాక యితరుల కేరికిని గలిగియుండకపోదు. కాని టీకలనే చూచుచుందు మేని టీకాకారులచేఁ జెప్పఁబడిన సమాధానము సరియైనది కాకున్నను నదిదక్క మఱియొక సమాధాన మేమియు స్ఫురింపదు. కాన నన్ని టీకలను భాష్యములను దూరముగ నునిచి కేవలగీతలనే స్వతంత్రముగ విచారించుచు వలుమారు పారాయణములనుఁ జేసియుంటిని. అప్పుడు టీకాకారుల శైలిని వదలి మూలగీత నివృత్తి కొఱకుఁ గాదనియు, కర్మయోగపరమనియు, వేయేల? గీతయందున్న 'యోగ' మను వ్యస్త పదమే 'కర్మయోగ' మను నర్థమునఁ బ్రయోగింపఁబడిన దనియు నేను దెలిసికొంటిని; మహాభారతమును, వేదాంతసూత్రములను, ఉపనిషత్తులను, వేదాంతశాస్త్రముపై నున్న సంస్కృతగ్రంథములను, ఆంగ్ల గ్రంథములను పఠించినను నా యభిప్రాయమే దృఢమైనందున దానిని లోకమునఁ బ్రకాశింపఁజేయుటవలన నీ విషయమును గుఱించి యూహాపోహ లధికముగ నగు ననియు, నిజమును నిశ్చయించుటకు సౌలభ్యము గలుగుననియు నూహచే నీవిషయములను గురించి నాలుగైదు స్థలముల యందు వేర్వేఱు సమయముల సభలలో నుపన్యసించితిని. 1902-వ సంవత్సరము జనవరినెలలో నాగపూరున నొక యుపన్యాసముఁ గావించితిని. మఱియు, కరవీర, సంకేశ్వరమఠాధిపతులగు శ్రీ జగద్గురు శంకరాచార్యులవారి సమక్షమున వారి యాజ్ఞ ననుసరించియె 1904-వ సంవత్సరము ఆగష్టునెలలో నీ విషయమునే యుపన్యసించితిని. నాగపూరులోఁ గావింపఁబడిన యుపన్యాస మప్పటి వార్తావర్తికలలో ప్రకటింపఁబడినది. నాకుఁ దోచిన యీ విషయమును వెల్లడింపవలయు ననుతలంపుననే యవకాశము లభించినప్పు డెల్లను కొంతమంది గొప్పవిద్వాంసుల సమక్షమునను వాదోపవాదముల జరపుచుంటిని. నా మిత్రులలోనే శ్రీపతి బువా భింగార్కరుగా నొక రుండిరి. వారి సహవాసమువే భాగవతసంప్రదాయము సందున్న కొన్ని మహారాష్ట్రభాష యందలి

గ్రంథములఁ జూచుట సంభవించెను. గీతారహస్యములోఁ జెప్పఁబడిన కొన్నివిషయములు బువాగారికిని నాకును జరిగిన వాదోపవాదముల యందే మొదట నిశ్చయింపఁబడెను. బువాగా రీ గ్రంథమును జూచు వఱకును జీవించియుండక పోవుట నాకు మిగుల దుఃఖకరముగ నున్నది. అది యట్లుండనిండు. ఇట్లు గీతలయందు ప్రతిపాద్యములై విషయము ప్రవృత్తిపరమైనదే యను మతము స్థిరపడినది. దానిని వ్రాయుదమను నిశ్చయము బహుకాలము క్రిందటనే కలిగెను. కాని ప్రస్తుతమందుఁ గన్పట్టుచున్న భాష్యములయందును, టీకలయందును, భాషాంతరముల యందును స్వీకరింపఁబడని యీ గీతాతాత్పర్యము (అనఁగా: ప్రాచీను లగు టీకాకారులచే నిశ్చయింపఁబడని తాత్పర్యము) నాకు మాత్ర మేల గ్రాహ్యము కాదో కారణముఁ జూపక గ్రంథారంభమునఁ బ్రకరణచిత్రి నేని మిక్కిలి యన్యాయమై యుండును; టీకాకారుల యందఱ మతమును నంగ్రహించి వానియందుండు లోపములను సకారణముగఁ జూపించుట యును, గీతాధర్ముల నితర ధర్ములతో లేక తత్త్వజ్ఞానముతో సరి పోల్చి చూచుటయు నను కార్యము బహుప్రయాససాధ్యమయినందున నది కొలఁదిదినములలో స్పష్టముగ నువపాదింప శక్యముగాకుండెను. కాన నేను గీతలపై నొక క్రొత్త గ్రంథమును శీఘ్రముగనే ప్రకటించ నున్నానని నా మిత్రులగు రా.రా. దాజీసాహెబ్ ఖరేగారిని కొంతకాలము వఱచి మొదటనే ప్రకటించినను, నట్లుచేయుటకు నాకు సంపూర్ణమగు సామగ్రి యప్పటికి లేదని తోఁచినందున గ్రంథము వ్రాయుట యను కార్యము జరుగకయేయుండెను; పిదప 1908 వ-సంవత్సరమున శిక్షితుఁడనై బ్రహ్మదేశము (బర్మా) లో మాండలేయను పట్టణమున నున్నప్పు డీ గ్రంథము వ్రాయువిషయమున బొత్తుగ నిరాశనుబొంది యుంటిని. కాని గ్రంథము వ్రాయుటకు నావశ్యకమగు పుస్తకాది సామగ్రి పునహా (పుణ్యపురి) నుండి నాయుండుచోటికిఁ గైకొనివెళ్ళుటకు దొరతనమువా రనుమతించినందున 1910-11 సంవత్సరములసంధిలో (శక. 1832) కార్తిక శు 1, ఫాల్గున బ. 30 (అమావాస్యలోపల గ్రంథముయొక్క సామాన్యస్వరూపము (ముసాయిదా) మాండలేలో కారాగృహమున మొదట వ్రాయఁబడినది. పిమ్మట నా యా సమయములయందుఁ దోఁచిన విషయముల నప్పుడప్పుడు వ్రాయుచుండినను, పుస్తకము లన్నియు

నా యొద్ద లేనందున ననేక-స్థలములయందున్న లోపముల నచ్చోటినుండి విముక్తుఁడనై న పిదపఁ బూర్తిగా సవరించితిని. ఇప్పటికి నీ గ్రంథములో వ్రాయవలసిన విషయము లన్నియుఁ బూర్తియైనవి యని చెప్పుటకు వీలులేదు. కారణ మేమి యన: మోక్షముయొక్కయు నీతి ధర్మముల యొక్కయు సిద్ధాంతములు గూఢము లయినందున వాని విషయమై ప్రాచీనులు నవీనులు నై న యనేక వండితులును, వ్యర్థముగ గ్రంథ బాహుళ్యముచేయక యీ చిన్నగ్రంథమునందు నిర్ణయించుట కవకాశము కానంత, విస్తృతమగు వివేచనఁ జేసియున్నారు. కాని మహారాష్ట్ర కవివర్యు లగు మోరోపంతుగారు—

కృతాంతకటా మల-ధ్వజ-జరా దినోఁ లాగలీ,
పురఃసర-గదాం సర్వేఁక్షగదతాం తనూభాగలీ.

– యమని సేనలోని విమలమగు ధ్వజము నా కివ్వుడు కొంచెము కన్పట్టుచున్నది. రోగములతో యుద్ధముఁజేయుచు నా దేహము క్షీణించుచున్నది అని చెప్పినట్లు నా స్థితియుఁ బ్రస్తుతమున నటులే యయినది. గృహస్థాశ్రమ మందున్న సహచారిణియు మొదట వరమవదమును బాపించినది. కాన మనచే గ్రహింపఁబడిన విషయమును, నాకు స్ఫురించిన విచారమును లోకములోఁ బ్రచురించితి నేని యెవరై న సమానధర్ములు (నావంటివారు) ముందు వెలువడి పూర్తిచేయుదు రని నమ్మి యీగ్రంథ మును ప్రచురింపఁ దలంచితిని.

సాంసారికకర్మలు గౌణములని, లేక త్యాజ్యములని నిశ్చయించి బ్రహ్మజ్ఞానము, భక్తి మొదలగు కేవల నివృత్తిపరమగు మోక్షమార్గమే గీతలయందు నిరూపింపఁబడిన దను మతము నాకు సమ్మతము కాకున్నను మోక్షప్రాప్తి కిగల మార్గము బొత్తిగ విపేచింపఁబడలేదని నే నన నని యారంభమునందే ముఖ్యముగఁ జెప్పుచున్నాఁడను. వేయేలఁ ప్రతిమఁ జూడును శుద్ధమగు పరమేశ్వరస్వరూపమును దెలిసికొని దానినుండి తన యొక్క బుద్ధిని శక్యమైనంత నిర్మలముగను పవిత్రముగను చేసికొనుట గీతాశాస్త్రిమసారముగ నీ జగమున నెల్లవారికి నవశ్యకర్తవ్య మనియు నీ గ్రంథమున స్పష్టముగ నిరూపించితిని. కాని యిది గీతకు ముఖ్యమగు

విషయము కాదు. యుద్ధముచేయుట క్షాత్రధర్మమైనను, తులక్షయము మొదలగు ఘోరపాతకములు. వివరితముగ సంఘటిల్లును. కావున నీ యుద్ధము మోక్షప్రాప్తిరూపమగు నాత్మకల్యాణమును నశింపఁజేయునో యట్టి దానినిఁ జేయుదునా? మానుదునా? యని యర్జునుఁడు యుద్ధారంభమునందె కర్తవ్యమోహమును బొందెను. కాన నా మోహమును నివర్తింపఁజేయుటకై వేదాంతశాస్త్రాధారమున శుద్ధముగ కర్మాకర్మలను మోక్షోపాయమును పూర్ణముగ విపేచించి మఱియుఁ గర్మ లెప్పుడును వీడవు, వీడుటకు వీలుపైతము లేదనియు నిశ్చయించి యీ యుక్తిచే కర్మచేసినను, నే విధమైన పాపమును తగులక తుదకు మోక్షము పైతము లభించునో, యా యుక్తియే యనఁగా: జ్ఞానమూలకమును భక్తి ప్రధానము నగు కర్మయోగమే గీతలయందు భగవంతుఁడు ప్రతిపాదించె నని నా యభిప్రాయము. కర్మాకర్మలయొక్క లేక ధర్మాధర్మఫుల యొక్క యీ వివేచనమునే యాధునికులగు కేవలాధిభౌతిక పండితులు నితిశాస్త్రమని పేర్కొనుచున్నారు. ఈ వివేచనము గీతలలో నెట్లుచేయఁబడినదో సామాన్యపద్ధతి ననుసరించి గీతలలోని శ్లోకానుసారముగ వ్యాఖ్యానముచేసి నిరూపించుటకు సాధ్యము కాకపోలేదు. కాని, వేదాంతము, మీమాంసము, సాంఖ్యము, కర్మ విపాకము, లేక భక్తిమున్నగు శాస్త్రములయందున్న యనేక వాదముల యొక్కయు ప్రమేయముల యొక్కయు నాధారముచే కర్మయోగము గీతలయందు ప్రతిపాదింపఁబడినదనియు నా శాస్త్రము లప్పుడప్పుడు మిక్కిలి సంకుచితముగ ప్రతిపాదింపఁబడినవనియు నా శాస్త్రీయసిద్ధాంతములను ప్రథమమున తెలిసి కొనవలయుననియు, లేనిచో గీతలయందున్న వివేచనముయొక్క రహస్యము పూర్ణముగను శీఘ్రముగను మనస్సునకుఁ దోఁపదనియు నిశ్చయించి యిందులకై గీతలయం దే యే విషయములను సిద్ధాంతములను చెప్పఁబడినవో వానిని శాస్త్రీయరీతి ననుసరించి ప్రకరణములుగ విభజించి దానియందున్న ముఖ్యములగు యుక్తివాదములను సైతము గీతారహస్యమునందు మొదట సంక్షేపముగ నిరూపించినాఁడను. ఈ పుస్తకమునందు మొదట వ్రాయఁబడిన గీతారహస్య మను నిబంధన మీ విధముగ కర్మయోగమును గురించి వ్రాయఁబడినదియు, స్వతంత్రమైనదియు నగు నొక చిన్న గ్రంథ మని చెప్పవచ్చును. కాని యేమి

చెప్పినను ఇట్టి సామాన్య నిరూపణమునందు గీతలయందున్న శ్లోకము లలో ప్రతిశ్లోకమును పూర్ణముగ విచారించుట శక్యము గాకపోయెను. కాన తుదకు గీతలలోని శ్లోకము లన్నింటికి నర్థముబ్రాసి పూర్వాపర సందర్భములు మనస్సునకుఁ దోఁచు నిమిత్తమును, లేక ప్రాచీనులగు టీకాకారులు తమతమ సంప్రదాయసిద్ధికొఱకు గీతయందలి కొన్ని శ్లోకముల నెట్లు తికమకచేసినదియు (గీ. 3.17-18: 6-3; మఱియు 18-2 చూడు) స్పష్టముగ నిరూపించుటకును, లేక గీతారహస్యమునఁ జెప్పఁబడిన సిద్ధాంతములలోను, గీతలయందున్న సిద్ధాంతములలోను గీతలయం దున్న సంవాదాత్మక పద్ధతి ననుసరించి, యే యే సిద్ధాంతము లెక్క డెక్కడ నెట్లున్నది చూపుటకును, టీకారూపముగ భాషాంతరమునుజేసి యా యా స్థలములయందు క్రింద టిప్పడి వ్రాసితిని. ఈ రీతిని బట్టి కొన్ని కొన్ని విషయములకు ద్విరుక్తి యయిన దనుటలో పందేహము లేదు; కాని గీతాగ్రంథముయొక్క తాత్పర్యవిషయమై సామాన్యులగు చదువరు లకుఁ బ్రస్తుతమునఁగల్గు భ్రమను పూర్ణముగ నివారించుట మఱియొక రీతిచే శక్యముగాదని తోఁచినందున గీతారహస్యవివేచనమును గీతల యొక్క భాషాంతరముకంటె వేఱుగ వ్రాసితిని; మఱియు దాని మూల మున వేదాంతము, మీమాంసము, భక్తి, మొదలగు విషయములయందు, గీతలయొక్క సిద్ధాంతములు, భారతము, సాంఖ్యశాస్త్రము, వేదాంత సూత్రములు, ఉపనిషత్తులు, మీమాంసయు మొదలగు మూలగ్రంథము లలో నెక్క డెక్కడ వ్రాయఁబడినవో వానిని పూర్వమునం దున్న ఇతి హాసములతోడను నాధారములతోడను గాన్పించుటకును, పన్న్యాసము కర్మయోగము నను రెండుమార్గములయందును గల భేదమును స్పష్టముగ నుపపాదించుటకును లేక గీతల నితరములును ధార్మికములు నగు మత ముల తోడను తత్త్వజ్ఞానములతోడను పోల్చివ్యావహారికమగు దృష్టిచే గీతలయందుఁ గల మాహాత్మ్యమును యోగ్యముగ నిరూపించుటకును మిక్కిలి యుపకారము గలిగెను. గీతలపై ననేక విధములగు టీకలు బయలువెడలి గీతార్థము ననేకు లనేక విధములఁ బ్రతిపాదింపనిచో నా గ్రంథమునందున్న సిద్ధాంతములకు నాధారభూతములగు మూల పంస్కృతవచనములను వ్రాయుట కేమియు నవసరము లేకపోవును. కాని యీ కాల మిట్టిది కానందున నాచెప్పఁబడిన గీతార్థము, లేక సిద్ధాంతము

యుక్తమైనదియగునా ? కాదా ? యను విషయమై యనేకులు సంశయ పడవచ్చును. కాన నేఁజేయు సిద్ధాంతములకుఁగల యాధారమును వా యా స్థలములయందు వ్రాసి మిక్కిలి ముఖ్యమగు ప్రదేశములయందు మూల సంస్కృతవచనములను సైతము భాషాంతరము కావించి వ్రాసియుంటిని. వీనిలో నెక్కువ వచనములు తఱుచుగ వేదాంతగ్రంథములయందే ప్రమాణ ముగఁ గైకొనఁబడియుండుటచేఁ జదువరుల కా వచనము సహజముగ తెలిసి యుండుటంబట్టి వానియందున్న సిద్ధాంతములను, మనస్సులో నుంచుకొనుటకు, సులభముగ నుండు ననియు, సంస్కృతవచనములను వ్రాయుటకు మఱియొక యంతరాయము గలదు. చదువరు లందఱును సంస్కృతమును దెలిసినవారే యగుట సంభవింపనందున సంస్కృతము నెఱుఁగనివారలు సంస్కృతశ్లోకములను వదలి చదువుదురేని యా వచన ముల యర్థ మెచ్చోటను సందేహాస్పదముగ నుండఁగూడదనియు మొత్తముపై గ్రంథము నీ తీరున రచించితిని. దీనిమండి సంస్కృత శ్లోకములకు శబ్దార్థములంబట్టి భాషాంతరము చేయక వాని సారాంశము లనే యనేక స్థలములయందు నిర్వహింపవలసి వచ్చెను. కాని మూల శ్లోకములను తప్పక పైనవ్రాసినందున నీ రీతింబట్టి కొంచెమైనను భ్రమ చెందుదురని భీతిలేదు.

కోహినూరుమాణిక్యము విషయమై హిందూస్థానములో నుండి ఇంగ్లాండునకుఁ గైకొనిపోయినపిదప నచ్చో నూతనమైన ప్రకాశము వెలువడిన దనియు, దానివలన నది మిక్కిలి కాంతితోఁ గాన్పించుచుండు ననియు లోకమునందు ప్రవాదముకలదు. మాణిక్యమునకు సంబంధించు నీ న్యాయము సత్యరూపమగు రత్నమునకును సంబంధించును. గీతల యందున్నధర్మము సత్య మయినదియు నభయమైనదియు నను విషయ మయి సందియ మేమియు లేదు. కాని యిది యే కాలమువ నే స్వరూప మునఁ జెప్పఁబడినదో దేశకాలాదుల స్థితి మాఱినందున నా తేజ స్సునీకుల కంటి కివ్వు డా రీతిగఁ గాన్పించుట లేదు. ఏ కర్మ మంచిదో, ఏ కర్మ చెడుదో నిశ్చయింపఁబడక పోవుటయేగాక కర్మ సౌనర్పవలయునా? వలదా? యని సైతము సామాన్యముగ ప్రశ్నచేయుకాలమునందు గీతలు చెప్పఁబడియుండుటంబట్టి వానియందు విశేషభాగ మివ్వడు కొందఱ కవా

వశ్యకముగఁ దోఁచుచున్నది. మఱియు నివృత్తి మార్గీయులగు టీకాకారులాగీతలకు మిక్కిలి వ్యాఖ్యానములను జేసియుండుటచే గీతలయందున్న కర్మ యోగవిచేచన మనేకులకు ప్రస్తుతము దుర్బోధముగ నున్నది. ఇంతియు కాక యీ కాలమున పాశ్చాత్యుల దేశమున నాధిభౌతికజ్ఞానము విశేషముగ వృద్ధిఁ బొందుచున్నందున నధ్యాత్మశాస్త్రానుసారముగ పూర్వ కాలమునందు చేయఁబడిన కర్మయోగవివేచనలు ప్రస్తుతకాలమున పూర్ణముగ ననుకూలములు కావనియు ననేకులగు దీనులైన విద్వాంసుల యభిప్రాయమైయున్నది. ఈ యభిప్రాయము సరియైనది కాదని నిరూపించుటకై గీతారహస్యమునందలి వివేచనలయందు గీతలయొక్క సిద్ధాంతములతో పదృశములగు పాశ్చాత్యపండితులయొక్క సిద్ధాంతమును సేనాయాకడ సంక్షేపముగ ప్రాసియుంటిని. యథార్థముగఁ జూచితిమేని గీతలయందున్న ధర్మాధర్మవివేచనల నీ విధమునఁ బోల్చిచూచుటచే గలుగు నధికమగు ప్రాబల్య మేమియు లేదు. అయినను ప్రస్తుతకాలమందుఁ గలిగిన యాధిభౌతికశాస్త్రముయొక్క యత్యద్భుతపూర్వమగు వృద్ధిచే నెవరియొక్కబుద్ధి యా శాస్త్రమున నమ్మకముగలది యాయెనో, లేక ప్రస్తుతకాలమునందున్న యేకదేశీయమగు విద్యాశిక్షణపద్ధతిచే నీతిశాస్త్రముయొక్క విచార మాధిభౌతికదృష్టితో ననఁగా: బాహ్యవిచక్షణమునే చేయఁబడవలయునని శిక్షింపఁబడిరో వారికి మోక్షధర్మములు నీతియు నను రెండు విషయములు నాధిభౌతికజ్ఞానమునకు పరమందున్నవనియు, పూర్వకాలమున మన శాస్త్రకారు లీ విషయమై చేసిన సిద్ధాంతములకంటె వారల జ్ఞానముయొక్కగతి నేటికిని విశేషదూరముగ పోలే దనియు, నింతియగాక పాశ్చాత్యదేశమునందును నధ్యాత్మదృష్టిచే నీ విషయముల యూహాపోహలు నేఁటికిని చేయఁబడుచునేయుండినను నీ యాధ్యాత్మిక గ్రంథకారుల విచారము గీతాశాస్త్రమునందలి సిద్ధాంతముల కంటె విస్తారము వేఱుగ లేదనియు నీ సరిపోల్చి చూచుట వలన స్పష్ట మగును. గీతారహస్యమందలి వేర్వేఱగు ప్రకరణములయందున్న తులనాత్మకమగు వివేచనవలన నీ విషయము స్పష్ట మగును. కాని ఈ విషయము మిక్కిలి వ్యాపకమైనందున పాశ్చాత్యపండితుల మతమునందలి సారాంశ మా యా కడ ప్రాయుట గీతార్థమును ప్రతిపాదించుటయే నాయొక్క ముఖ్యోద్దేశమైనందున గీతయందలి సిద్ధాంతము

లను ప్రమాణములుగఁ గైకొని వానికిని పాశ్చాత్య నీతిశాస్త్రజ్ఞులయొక్క లేక వండితులయొక్క సిద్ధాంతములకు నెంతవఱకు కలయిక యుండునో చూపుటకొఱకే యనియు, నదియును సామాన్యులగు దేశభాషలను జదువు వారలకు (మహారాష్ట్రీము) వానియందలి సిద్ధాంతమును సుగమముగఁ దెలియునట్లుగనే, ప్రాసితి ననియు నిచ్చో ముఖ్యముగఁ జెప్పవలసి వచ్చెను. అనఁగా: రెండింటియందును గల భేదము స్వల్పమో యధికమో తెలిసికొనఁదలఁచువారును నీ సిద్ధాంతములయొక్క యుపపాదనమును పూర్ణముగను విరివిగను తెలిసికొనఁదలఁచువారును మూలభూతములగు పాశ్చాత్యగ్రంథములనే నిర్వివాదముగ చూడవలసియే యుండును. కర్మాకర్మవివేకము, లేక నీతిశాస్త్రముపై మొదటిమార్గప్రదర్శకమగు గ్రంథము 'అరిస్టోటల్' అను పేరుగల గ్రీకుతత్త్వజ్ఞునిచే వ్రాయఁబడినదని పాశ్చాత్య విద్వాంసులు చెప్పుచున్నారు. కాని 'అరిస్టోటల్' కంటెను పూర్వమునం దతని గ్రంథముకంటెను మిక్కిలి వ్యాపకమైన దనియు నీ విషయముల విచారము మిక్కిలి శాస్త్రీయకమగు దృష్టితో శ్రీ మహాభారతమునందును శ్రీమద్భగవద్గీతలయందును చేయఁబడిన దనియు, నధ్యాత్మదృష్టితో గీతలయందు ప్రతిపాదింపఁబడిన నీతి సిద్ధాంతములకంటె వేఱగు నీతితత్త్వము నేఁటికిని బయల్పడలేదనియు, మా యభిప్రాయము. సన్న్యాసులవలె నుండి తత్త్వజ్ఞానముయొక్క విచారమునందు, శాంతముగ నాయుష్య మంతయు గడపుట మంచిదా? లేక యనేక విధము లగు రాజకీయవ్యవహారములలో చిక్కులు పడుట యుక్తమా? యను విషయమై యరిస్టోటల్‌చేఁ జేయఁబడిన వ్యాఖ్యాన మంతయు గీతలయం దున్నది. మఱియు మనుజుఁడు చేయు పాప మంతయు నజ్ఞానముచేఁ జేయఁబడునది యను పోక్రటీసుయొక్క మతమును నాక విధముగ గీతలలో నంతర్భూతమయియే యున్నది. కారణ మేమన బ్రహ్మజ్ఞానముచే బుద్ధి నమ మయిన పిదప వా రొనర్చిన కార్యములకు పాపము పంపుటిల్లుట శక్యము కాదని గీతలలోని సిద్ధాంతము. పూర్ణావస్థనుఁ బొందిన పరమజ్ఞానియొక్క యాచరణమే నీతిదృష్టిచే నెల్లవారికిని పుస్తకమువలె ప్రమాణముగ నుండునని 'ఎపిక్యూరియన్' అనునట్టియు, 'స్టోయిక్' అనునట్టియు మార్గములయందలి గ్రీకు వండితులయొక్క మతములను గీతలలో చెప్పినట్లే యున్నవి. ఈ

మతములయందు వర్ణన వారిచేఁ జేయఁబడిన పరమజ్ఞానులయొక్క స్థితియు, గీతలయందు వర్ణింపఁబడిన స్థితప్రజ్ఞునియొక్క స్థితియును, నొక విధముగనే యున్నవి. అటులే "మానవజాతులలో నెల్ల వారికిని ప్రత్యేకము హితార్థమై ప్రవర్తించుట యనునదియే నీతియందలి పరమ సిద్ధాంతము, లేక నికషోపలము," అను మిల్లుయొక్కయు, స్పెన్సరు యొక్కయు, క్యాంటు మొదలగు నాధిభౌతికవాదుల యొక్కయు సిద్ధాంతములును గీతలయందు వర్ణింపఁబడిన స్థితప్రజ్ఞునియొక్క 'సర్వభూతహితే రతః' అను బాహ్యలక్షణములయందే సంగ్రహింపఁబడినవి. మఱియు కోంటుయొక్కయు, గ్రీన్‌యొక్కయు నీతిశాస్త్రముల యందలి యుపపత్తులును, ఇచ్ఛాస్వాతంత్ర్యము విషయమై యున్న సిద్ధాంతములును, ఉపనిషత్తుల యాధారమునుబట్టి గీతలలో వర్ణింపఁబడినవి. గీతలయం దింతకంటె విశేషమేమియు లేకున్నను గీత యందఱకును గౌరవింపఁదగియే యుండవచ్చును. కాని యింతమాత్రముతో దృష్టిసొందక మోక్షము, భక్తి, నీతిధర్మములు ననువాని విషయమై యాధిభౌతికగ్రంథకారులకు స్ఫురించుచున్న విరోధములును, లేక జ్ఞానము, కర్మము, ననువాని విషయమై సన్న్యాసమార్గావలంబుల మతానుసారముగ నుండు విరోధమును పత్యమైనది కాదనియు, బ్రహ్మ విద్యయొక్కయు, భక్తియొక్కయు, మూలసిద్ధాంతములే నీతికిని పత్కర్మములకును మూలాధారము అనియు నిరూపించి జ్ఞానము, సన్న్యాసము, కర్మము, భక్తియు ననువానికిఁ గల యోగ్యమగు వరస్పర సంబంధముచే మనుజుఁడిహలోకమునందు జీవితకాలము నెట్లు గడుప వలసినదియు గీతలయందు నిర్ణయింపఁబడినది. గీతాగ్రంథ మీ రీతిని ప్రధానముగ కర్మయోగవరమే యయినందుననే "బ్రహ్మవిద్యాంతర్గత (కర్మ-) యోగశాస్త్ర" మను పేరితో సమస్తవైదిక గ్రంథములలోను దానికి నగ్రస్థాన మీయఁబడినది "గీతా సుగీతా కర్తవ్యా కిమన్యైఃశాస్త్రవిస్తరైఃl" - ఒక గీతాగ్రంథమునే పూర్తిగ చదివెనేని చాలుమ. మిగిలిన శాస్త్రము లనెడు గ్రంథవిస్తారములతో నేమిప్రయోజనముఃl" అని చెప్పిన దీ మాత్రము సత్యమైనది కాదు. కావునసే హిందూధర్మము లకును నీతిశాస్త్రమునకుం గల మూలసిద్ధాంతములను తెలిసికొనవలయు నని తలంచువా రీ యపూర్వగ్రంథమునే మొదట చదువవలయునని

వినయపూర్వకముగ వట్టుదలతోడ చెప్పుచున్నాఁడను. కారణ మేమన సాంఖ్యము, న్యాయము, మీమాంస, ఉపనిషత్తులు, వేదాంతములు మున్నగు క్షరాక్షర సృష్టిని, క్షేత్రక్షేత్రజ్ఞ జ్ఞానమును బోధించు ప్రాచీన శాస్త్రములు శక్యమగునంత పూర్ణావస్థలోనికి వచ్చినవిదన వైదికధర్మము లకు జ్ఞానమూలకమగు భక్తి ప్రధానమైనదియు, కర్మయోగవరమై నదియు, చిట్టచివరకుఁగల్గినదగు స్వరూపమునందు ప్రకృతమున ప్రచార ములోనున్న వైదికధర్మముల మూలమును ననునవియే గీతలయందు ప్రతిపాదింపఁబడుటంబట్టి సంక్షేపముగను నిస్సందేహముగను వస్తుతమం దున్న హిందూధర్మముల సిద్ధాంతములను బోధించు గీతవంటి మఱియొక గ్రంథము సంస్కృతవాఙ్మయమున నెచ్చోటను లేదని చెప్పుట యతి శయోక్తి కానేరదు.

గీతారహస్యములో నున్న వివేచనయొక్క సామాన్యమగు స్వరూపము పైఁ జెప్పఁబడినదానింబట్టి చదువరులకు బోధపడఁగలదు. గీతలపై కర్మయోగవరమగు టీక మొదటినుండియు వచ్చునని గీతలపై శాంకరభాష్యముయొక్క మూఁడవ యధ్యాయారంభమున ప్రాచీన టీకాకారుల యభిప్రాయము వ్రాయఁబడుటంబట్టి స్పష్టముగఁ గాన్పించును. ఆ టీక లిప్పుడు దొరకవు; కాన గీతలకు కర్మయోగవరమును తుల నాత్మకమును నగు వివేచనమున కిదియే మొదటి గ్రంథ మని చెప్పుటకు నేమియు నభ్యంతరము లేదు. ఇందుఁ గొన్ని శ్లోకముల కిదివఱకున్న టీకా కారులు వ్రాసిన యర్థముకంటె వేఱగు నర్థము వ్రాయఁబడినది. మహారాష్ట్ర భాషయందు పూర్వము నెచ్చోటను సవిస్తరముగ వర్ణింపఁబడనివి, ఆ విషయములను వానికిఁగల యువపత్తియును, శక్యమయినంత సంక్షేప ముగను సుబోధకముగను వ్రాయుటకు నే యత్నించితిని. చెప్పినమాట మరల చెప్పవలసివచ్చినను లక్ష్యపెట్టక యే శబ్దముల యర్థము మహా రాష్ట్రములందు (ప్రాకృతభాషలో) నేటికిని సుప్రసిద్ధము కాలేదో యా శబ్దములకు పర్యాయశబ్దములను జేర్చియే యనేక స్థలములయందు ముఖ్యముగఁ బ్రతిపాదించితిని. ఇంతియకాక యీ విషయమునందలి ముఖ్యములగు సిద్ధాంతము లా యా స్థలములయందు సారాంశరూపముగ నుపపాదించి వేఱుగఁ జూపింపఁబడినవి. అయినను శాస్త్రీయములును, గూఢములు నగు విషయములచర్చ వాడుకలో నున్న శబ్దములతోఁ

జేయుట మిక్కిలి కష్టము. ఆ విషయములకు సంబంధించిన మహారాష్ట్రము లోని (ప్రాకృతభాషలోని) పారిభాషికశబ్దములు నేటికిని నిర్ణితములు కాలేదు. కాన భ్రమచేతను, దృష్టిదోషముచేతను, లేక కారణాంతరముల చేతను నాసంబంధమగు నీ క్రొత్తనివేదనయందు కాఠిన్యము, దుర్బోధత, (తెలిసికొనలేకపోవుట) అపూర్ణత మొదలగు దోషములు నుండియుండునని నేను పూర్ణముగఁ దెలిసికొనుచున్నాఁడను. అయినను భగవద్గీత చదువరు లకు నపరిచిత మయినది కాదు. గీత బహుజనులకు నిత్యమును పారాయణములో నుండును. దానిని శాస్త్రీయదృష్టితో నధ్యయనము చేసినవారును, చేయుచున్న వారును అనేకులు గలరు. అందునకై యా యధికారముగల పురుషులు తా మీ గ్రంథమును చదివినప్పుడు పూర్వో క్త ములగు దోషములు కనఁబడునేని, యుపకారపూర్వముగ వానిని నాకుఁ దెలువవలయునని, నీ గ్రంథమును మరల ముద్రింపించునప్పు డట్టి లోప ములను సవరింపవలయునేని సవరించెద ననియు ప్రార్థించుచున్నాఁడను. నే నేదో యొక సంప్రదాయములోని వాఁడ ననియు, దానిని సిద్ధింపఁ జేయుటకై యేదో నూతనార్థమును వ్రాయుచున్నా ననియు ననేకు లూహింపవచ్చును. ఇందుకు గీతారహస్య మను గ్రంథ మేదో యొక సంప్రదాయప్రవర్తకునిగాని, లేక సంప్రదాయమును గాని యుద్దేశించి వ్రాయలేదని నేను నొక్కి వక్కాణించుచున్నాఁడను. నా బుద్ధిని బట్టి గీత యందలి శ్లోకములకు నే యర్థము సరళమైనది యని తోఁచెనో యా యర్థమును వ్రాసితిని. ప్రస్తుతమునందు సంస్కృతము విశేషప్రచార ములో నుండుటచే నే చేయు నర్థము సరళముగ నున్నదియు, లేనిదియు ననేకులకు సహజముగనే తెలియవచ్చును. ఇట్లు సరళమగు నర్థమును జేసినను, దానియం దేదైన సంప్రదాయార్థమున్నచో నది గీతలోనిదే కాని నాదికాదు. "నాకు రెండు మూఁడు మార్గములను చెప్పి నన్ను భ్రమింపఁజేయక నాకు వానిలో శ్రేయస్కరమగు నొకమార్గమునే నిశ్చయముగఁ జెప్పుము" (గీ; 3.2; 5.1) అని యర్జునుఁడు భగవంతుని స్పష్టముగ నడిగినందున గీతలయం దేదైన నొక్కటియే నిర్ణితమైన మతము ప్రతిపాద్యముగ నుండవలయు ననుమాట స్పష్టమే (గీ. 3.31). మతియు నది యేదై యుండు వని గీతామూలమునే యర్థముఁ జేసికొని నిరాగ్రహబుద్ధితో మనము చూడవలయును; మొదట నేదోయొకమతము

నం దభిమానము నుంచుకొని దానికి సంబంధించని శ్లోకముల యర్థము లను తలక్రిందు చేయరాదు. గీతలలోని నిజమగు రహస్యమునందలి సారాంశ మే సంప్రదాయము నైనను, వంథనైనను సంబంధించి యున్నను దానిని గీతార్థకర్తలకుఁ దెలిపి భగవంతుఁడు తుట్టతుదకుఁ జెప్పిన ట్లీ జ్ఞానయజ్ఞమునుఁ జేయుటకు నేప్రవర్తించితిని; ఆ యజ్ఞమును పూర్తిఁజేయు నిమిత్తమై పైనఁ జెప్పఁబడిన జ్ఞానభిక్షను నాయొక్క దేశ బంధువులును ధర్మబంధువులును నాకు వరమసంతోషముతో నిడుదురని నమ్ముచున్నాఁడను.

ప్రాచీన టీకాకారులంచే ప్రతిపాదింపఁబడిన గీతాతాత్పర్యమునందును నే చెప్పిన గీతారహస్యమునందును నున్న భేదమునకుఁ కారణములు గీతా రహస్యమునందు సవిస్తరముగ నిరూపింపఁబడినవి; కాని గీతాతాత్పర్య మువం దిట్టి మతభేదము లున్నను గీతలపై వ్యాఖ్యానము చేసిన భాష్య కారులును, టీకాకారులును, పూర్వమునఁగాని, యిప్పుడుగాని ప్రాకృత భాషలలో వ్యాఖ్యానములఁజేసినవారును నే నీ గ్రంథమును వ్రాయు నప్పుడు నాకు సహాయు లయివందున వారల యందఱకును నేను కృతజ్ఞుఁడను (విధేయుఁడ) అని యిచ్చట ముఖ్యముగఁ జెప్పు చున్నాఁడను. అటులనే యే పాశ్చాత్యపండితుల గ్రంథములయందలి సిద్ధాంతముల నా యా కడ నుల్లేఖించితినో వారిచే పైతము నేను కృతోప కారుఁడనని యెన్నుచున్నాను. వేయేల? ఈ గ్రంథముల యన్నింటి యొక్కయు, సహాయము లేనిచో నీ గ్రంథమును వ్రాయఁగలుగుదువా? లేనా? యను విషయము సందిగ్ధమైయందున నీ ప్రస్తావనారంభమున "సంతాఁచీ ఉచ్ఛిష్టేఁ బోలతోఁ ఉత్తరే" – నేను చెప్పవాక్యములు పత్తురుములయొక్క యుచ్ఛిష్టములే యని తుకారాంబువాగారియొక్క వదమును నేను వ్రాపితిని. ఎల్లప్పుడు నాకరీతిగనే యుండువది యనఁగా త్రికాలాబాధితమగు జ్ఞానమును బోధించునట్టి గీతలవంటిగ్రంథము కాల భేదమువే మాతవమగు న్యూర్తిని కలిగించుచున్నదను విషయమం దాశ్చర్య మేమియు లేదు. కారణ మేమన నిట్టి వ్యావకమగు గ్రంథము నకు నిది సహజ మగు ధర్మమే యైయున్నది. కాని యంతమాత్రమువే ప్రాచీనపండితు లిట్టి గ్రంథముపైఁ జేసిన పరిశ్రమ వ్యర్థము కాదు. గీతకు

నింగ్లీషు, జర్మనీ మొదలగు భాషలలోఁ జేసిన భాషాంతరములును నిట్లే యుపయోగకరములై యున్నవి. ఈ భాషాంతరములును తఱుచుగ ప్రాచీనులగు టీకాకారుల ననుసరించియే చేయఁబడియుండును. అయినను కొందఱు పాశ్చాత్యపండితులు గీతలకు స్వతంత్రరీతిచే నర్థముచేయుటకును విశేషముగ ప్రయత్నము చేయ నారంభించిరి. అయినను సత్యముగ (కర్మ—) యోగముయొక్క తత్త్వము, లేక వైదికములైన ధార్మిక సంప్రదాయముల యితిహాసము బాగుగ గమనింపనందున, లేక బహిరంగ పరీక్షణమునందే వారి దృష్టిని విశేషముగ వ్యాపింపఁజేయుటచే, లేక యితరములగు నిట్టి కారణములచేతనే పాశ్చాత్యపండితు లీ వివేచనము ననేక స్థలములయం దపూర్ణముగను కొన్ని స్థలములయందు నిస్సంశయముగ భ్రాంతిఁగలుగఁ జేయునటులగను తప్పులుగనుఁ జేసిరి. గీతలపై పాశ్చాత్యపండితుల గ్రంథముల నిచ్చోవిస్తరముగ పరీక్షించుటకుఁగాని విచారించుటకుఁగాని యవసరము లేదు. వారు సిద్ధాంతించిన ముఖ్య విషయములనుగురించి నే చెప్పిన దంతయు నీ గ్రంథముయొక్క పరిశిష్టప్రకరణములో వ్రాసినాను. అయినను ప్రస్తుతమందు నేను జూచియున్న కొందఱువ్రాసిన గీతలపై కొన్ని ఇంగ్లీషు లేఖనముల నిచ్చోచెప్పుట యావశ్యకము. మొదటిది మి. బ్రుక్సు ది. మి. బ్రుక్సును థియాసఫిస్టు (దివ్యజ్ఞానసామాజికుఁడు). భగవద్గీత కర్మయోగపరముగనే యున్నదని తా రచియించిన గ్రంథమున నిరూపించెను. తన వ్యాఖ్యానమునందు నా మతమునే ప్రతిపాదించెను. రెండవది మద్రపురిలోని మి. యస్. రాధాకృష్ణ యనువారిది. అది చిన్ననిబంధనరూపముగ నమెరికాలోని సార్వరాష్ట్రీయ నీతిశాస్త్రముల బోధించు త్రైమాసికపత్రికలో ప్రచురింపఁబడినది (జూలై, 1911). దానియందు ఆత్మస్వాతంత్ర్యము, నీతిధర్మ మను రెండువిషయములలోను, గీత, క్యాంటుమతముతోఁ బోల్చి నిరూపింపఁబడినది. ఈ సామ్య మితర విషయములయందు సైతము వ్యాపక మైనదనియు, గ్రీస్‌యొక్క నైతికమగు నువపత్తి క్యాంటు కంటెను గీతలతో వధికముగ సంబంధించి యున్నదనియు నా మతము. కాని యీ రెండు విషయముల వ్యాఖ్యానమును నీ గ్రంథమునందుఁ జేయఁబడియుండుటచే దాని నిచ్చోట మరల చెప్పవవరము లేదు. అటులనే పండిత సీతానాథతత్త్వభూషణ యను వారియొక్క కృష్ణ:

మఱియు గీత; యను పేరుగల యీ గ్రంథము సైతము వ్రస్తుతము వ్రచురింపఁబడినది. దానిలో నీ పండితుఁడు గీతలపై వ్రాయఁబడిన (12) పండ్రెండు వ్యాఖ్యానముల ముద్రించినాఁడు. కాని యీ పండితునియొక్క గాని, మి. బ్రుక్సుయొక్కగాని వ్రతిపాదనమునకును గల భేదము లీ గ్రంథమును జదువు నప్పుడు చదువరులకు స్పష్టము లగును. అయినను పైన చెప్పిన లేఖనములకంటె గీతాసంబంధములో నాయొక్క విచార మపూర్వము కాదనియు, గీతలయందున్న కర్మయోగముపై పునకు లోకులు మిక్కిలి యధికముగ లక్ష్యము నుంచుచుండు చిహ్నము కన్పట్టుచున్నదనియు నీ యాధునికములగు లేఖనముల నన్నింటిని నే నభినందించు చున్నాఁడను.

ఈ గ్రంథము మాండలేలో నున్నప్పుడు వ్రాయఁబడినదనుట నిజమే. కాని పెన్సిలుతో వ్రాయఁబడిన దగుటచే దాని ననేక స్థలముల యందుఁ గొట్టివై చి పవరణసేసినాఁడను. కాన పిదప నా పుస్తకము దొర తనమువారు శోధించి మరల నా కంపఁగా ముద్రింపించుటకై తద్ద్వారా వ్రాయవలసివచ్చెను. మఱియు నీ కార్యమును నే నొక్కఁడనే చేసినదో వ్రచురించుటకు నింక నెంతకాల మగునో తెలియదు; కాని, వామనగోపాల జోసిగారును, నారాయణ కృష్ణగోగటెగారును, రామకృష్ణదక్తాత్రేయ పరాదకరుగారును, రామకృష్ణపదాశివ పింపుటికర్ గారును, అప్పాజీ విష్ణులకర్ణిగారును, మొదలగు గృహస్థు లీ కార్యమున మనఃపూర్వముగ సాహాయ్యము చేయుటచే శీఘ్రముగ పూర్తి యైనందున వారియందరి విషయమునను కృతజ్ఞుఁడను. అట్లే రా. రా. కృష్ణాజీఖదిల్కరుగారును మఱియు విశేషముగ వేదశాస్త్రపంపన్ను లగు దీక్షితకాశీనాథశాస్త్రిలే గారును నీ పనికై బొంబయినుండి యిచ్చోటికి (పునాకు) వచ్చి యీ వ్రాపినగ్రంథమును చదివి యనేకములగు నుపయోగకరములును, రహస్యవిషయములు వగువానిం దెలియఁజెప్పిరి. కావున నీ విషయమున వారు నాకు మహోపకారులు. అయినను నీ గ్రంథమునందున్న విషయము యొక్క బాధ్యతయంతయు నాయదియే. గ్రంథ మీ రీతిగ ముద్రింపించుటకు సిద్ధమైనది; కాని యుద్ధమువలన కాకితములు దొరకని సమయము తటస్థించినది. అయినను బొంబయిలోనున్న కాగల (కాకిత) యంత్రాధికారియగు మెసర్సు. దీ. పదమ్‌జీ వారు ఉచితకాలమున వా

యభిప్రాయానుసారముగ మంచి కాకితముల నిచ్చుటచే నా లోపము తీరినది. మఱియు గీతాగ్రంథము మంచి స్వదేశకాకితములపై నచ్చు వేయఁబడినది. అయినను గ్రంథమును ముద్రించు నవ్వాడు నా యూహ కంటె గ్రంథము వృద్ధినొందినందున మరల కాకితములకు లోపము వాటిల్లెను; మఱియు పునహా (పుణ్యపురి) లోనున్న రే. కాకితయంత్రా లయముయొక్క యధికారిచే నా లోపము తీర్పఁబడనిచో నింక కొన్ని నెలలవఱకును నీ గ్రంథము ప్రచురింపఁబడుటకు చదువరు లెదురుచూచు చునే యుండవలసినవారు. కాన పైనఁజెప్పిన కాకితయంత్రాధికారులకు నేను గాక చదువరులు సైతము కృతజ్ఞతను జూపవలయును. తుదకు శోధనీయపత్రములను శోధించెడుకార్యము మిగిలెను. దీనిని. రా. రా. రామకృష్ణసదాశివ పింపుటికరు గారును, రా. రా. హరిరఘునాథభాగ వతులుగారును స్వీకరించిరి. దానియందును నా యా కడ వ్రాయఁబడిన యితర గ్రంథము లసంఖ్యాదికము సరిగా నున్నదాఁ లేదాఁ యను దానిని శోధించుటయు పొరపాటున్నచో చూపించుటయు నను కార్యము రా. రా. హరిరఘునాథభాగవతు లొక్కరే చేసిరి. అనఁగా వీరెల్లర సహాయము లేనిచో నీ గ్రంథ మింత శీఘ్రముగ నాయొక్కనిచేతనే ప్రచురింపఁబడుట శక్యముగాకనే పోవును. కాన వీరెల్లరకును నేను మనఃపూర్వకముగ ధన్యవాదముల నిచ్చుచున్నాఁడను. ఇప్పుడు ముద్రించుటయే యవశిష్టమైనందున చిత్రశాలాముద్రణా యంత్రాధివతి యీ పుస్తకమును మనఃపూర్వకముగను, సావధానముగను, శీఘ్రముగను ముద్రించెదనని యంగీకరించి తదనుసారముగ నీ కార్యము నెరవేర్చి నందున వారికి నేను ధన్యవాదముల నర్పించుచున్నాఁడను. క్షేత్రము ఫలించినను ధాన్యమును వక్కముచేసి తినుటకు వీలగువఱకు ననేకుల సాహాయ్యము నపేక్షించునటులనే కొన్ని విషయములలో గ్రంథకారుని యొక్కస్థితి పరాధీనమైయుండును. ఎవరిది కాకున్నను నాయొక్క స్థితి యటువంటిదిగ నున్నదని చెప్పుటకు నా కాటంక మేమియు లేదు; కావున పైనచెప్పినయట్లు నాకు సహాయపడినవారలపేరు లిచ్చో వ్రాయఁబడినను లేకున్నను వారలకందఱకును తిరిగి యొకసారి ధన్యవాదముల నిచ్చి యీ ప్రస్తావనను, ముగించుచున్నాఁడను.

ప్రస్తావన ముగిసినది. ఏ విషయమును విచారించుచు నేటిపఱకు వనేక సంవత్సరములు కాలక్షేపమును జేసితినో, దీనియొక్క నితాంతగు పహవాసముచేతను, చింతన చేతను మనస్సునకు విశ్రాంతిగల్గి యానందముగల్గినదో ఈ విషయము నన్ను వదలి గ్రంథరూపముగ వెడల్చిపోవుట నా మనస్సునకు కష్టముగనున్నను నేఁజేసిన యీ విచారమును రాఁగల తరమువారు వాకంటె వధికముగఁగాని లేక యున్నది యున్నట్టుగఁ గాని చేయునట్లు చేసితినిగదా యని నేను సంతసించుచున్నాఁడను. కాన పై దికధర్ములయందున్న రాజగుహ్య మను నీ విషయమును"ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్య వరా న్నిబోధత" -లెండు; మేలుకొనుఁడు; (ముఱియు భగవంతునిచే నీయఁబడిన) ఈ వరములను తెలిసికొనుఁడు; - అను కఠోపనిషత్తునం దున్న మంత్రపూర్వకముగను ప్రేమ యను నుదకము తోడను (కఠ. 3.14) ముందు రాఁబోవుపాఠకులకు స్వాధీనము చేయుచున్నాఁడను. దీనియందే కర్మాకర్మల సంపూర్ణబీజ మున్నది. ముఱియు నీ ధర్ములయొక్క యాచరణ స్వల్పమైనను, మహాపంకటమునుండి యుద్ధరించునని స్వయముగ భగవంతుఁడే చెప్పెనని నిశ్చయపూర్వకముగఁ జెప్పచున్నాఁడను. ఇంతకంటె విశేష మేమి కావలయును: "చేసిననే కాని యేమియుఁ గానేరదు;" అను ప్రుష్టినియమమును మనస్సున నిడికొని నీవు మాత్రము నిష్కామబుద్ధితోఁ జేసినఁజాలును. కేవల స్వార్థపరాయణమగు బుద్ధితో సంసారముచేసి యలసి కాలమును వ్యర్థపఱుపుమనిగాని, సంసారమును వదలుటకు సిద్ధుఁడవు కమ్మని గాని గీతచెప్పదు. సంసారమునే మోక్షదృష్టితో నెట్లు చేయవలసినదియుఁ జెప్పుటను మనుష్యమాత్రులకు సంసారమునందు నిజమగు కర్తవ్యమేదియో శాస్త్రీకదృష్టితో నుపదేశించుటకును గీతాశాస్త్రము బయలు వెడలినది. కావున పూర్వవాసనవనే గృహస్థాశ్రమ సంబంధమైన, లేక సంసారమును గుఱించిన యీ ప్రాచీనమగు శాస్త్రమును శక్యమయినంత తొందరతో ప్రతి మనుజుఁడును తెలిసికొనకయుండఁగూడ దని మాత్రమే నాయొక్క కడపటి విన్నవము.

పుణే, అధిక వైశాఖము, బాలగంగాధరతిలక.
శకము. 1837.

అనువాదకుని విజ్ఞాపనము

అనువాదమును జేయువా రెల్లరును గ్రంథకారుని గుఱించియు నా గ్రంథములోని విషయమును గుఱించియు వ్రాయుట సంప్రదాయముగ నున్నది. కాని యీ గ్రంథకారులు లోకమాన్యులును లోకవిదితులు నగుటచే వారినిఁ బ్రకాశింపఁజేయ నేఁ జేయు యత్నములు సూర్యుని జూపుటకై సంపాదింపఁబడు దీపాది సాధనములవలె యనవసరము లగుటయే కాక వారి భూమికచే గ్రంథములోని విషయముసైతము వివరింపఁబడుటచే దానిఁగూర్చియు నా ప్రయత్నమునకుఁ గొంచెమైన నవకాశము గన్పింపదు. కావున ననువాదకుఁ డేమైనను గ్రంథమును గుఱించి వ్రాయవలయుననుసాంప్రదాయికోక్తిని నెఱవేర్చుటకై శ్రీ మచ్ఛంకరభగవత్పాదులకును, లోకమాన్యులకును గీతలవిషయమునఁ గల యభిప్రాయము లెంతవఱకు నేకీభవించునో యెంతవఱకు భేదించునో చూపుటకై నాశక్తికొలఁదిని నే నింతదనుక ఖండనమండనాదులవలనఁ దెలిసికొనినంతవఱకును చదువరులకు మనోరంజనముఁ గావింపఁ బూనెదను.

భగవత్పాదు లసామాన్యప్రజ్ఞ గలవా రనియును, ఇట్టి యలౌకిక ప్రజ్ఞగలవారు సంస్కృతవాఙ్మయముననేగాక మఱి యెక్కడను లే రనియు వారి యాధ్యాత్మికజ్ఞానము ననుసరించియే యధ్యాత్మప్రకరణమును వ్రాయుచున్నా ననియు నిరూపించుటఁబట్టి చూడ నీ గ్రంథకారులు తదనుయాయివర్గములోనివా రనియు వారికిని వీరికిని ముఖ్యాంశము లలో భేదము విశేషముగ లేదనియుఁ బెప్పుట కేమియు నభ్యంతరము లేదు. కాని లోకమాన్యులగ్రంథము వెలువడినపిదప కొన్నియంశములలో భగవత్పాదుల భాష్యమునకు విరుద్ధముగ నుండుటంబట్టి యీ గ్రంథము సిద్ధాంతవిరుద్ధ మనియు కావుననే భ్రమజనక మనియు నీ గ్రంథకారుని గుఱించియు నీ గ్రంథమువందలి సిద్ధాంతములను గుఱించియు మఱి

యొక యూహ కలుగవచ్చును. కాన శ్రీ మచ్ఛంకరభగవత్పాదులవారికిని ఈ గ్రంథకారులకును నిజముగ మతములో నేమైన భేద మున్నదా? ఉన్నచో వది యెంతమాత్రపు భేదము? మఱియు నా భేద మెచ్చోట? వీరిలో నెవరు నుడివినది యాదరింపఁదగినది? యని నిష్పక్షపాత బుద్ధితోఁ గొంతవఱకైన నిచ్చో నిరూపించుట యావశ్యకము. అయినను శ్రీ భగవత్పాదులవారి గ్రంథమును సంపూర్ణముగఁ దెలిసికొనునంతశక్తి నాకు లేనందున ఖండన మండనములలోఁ బ్రవేశింపక వారి మతము నీ గ్రంథకారు లెటుల గ్రహించియున్నారో చూపుటకై కొంచెము ప్రయత్నించెదను. అందు ప్రథమమున శ్రీ శంకరభగవత్పాదుల మతమును సంక్షేపముగఁ జెప్పెదను.

బంధ మన జనన మరణాదిరూపమగు సంసారము. మోక్షము, లేక ముక్తి యన జననమరణరూపమగు బంధమునుండి పూర్తిగ తప్పించు కొనుట. బంధము కర్మవలనఁ బ్రాప్తమగును; మోక్షము బ్రహ్మైక్యజ్ఞానముచే సిద్ధించును; ఈ జ్ఞానము శ్రౌతస్మార్తకర్మలను విష్కామ బుద్ధితో నాచరించుటచే లభ్యమగును; జ్ఞానము కలిగినపిదప, జ్ఞానము కలుగకమునుపు సంచితములైన (అనఁగా: ఏ కర్మఫలము లారంభింపఁ బడలేదో యిని) పుణ్యపాపకర్మ లన్నియు నశించును. కాని యే కర్మల ఫల మారంభింపఁబడినందున జ్ఞానికి దేహము లభించినదో యా కర్మలు మాత్రము జ్ఞానముచే నశింపవు. అవి యుపభోగముచేతనే వశించును. "భోగేన త్వితరే క్షపయిత్వా సంపద్యతే" (బ్ర.సూ. 4-1-19). అందు వలన జ్ఞాని బ్రహ్మతాదాత్మ్యము నొందుటకు దేహప్రాప్తి సాధనములగు కర్మలు క్షయ మగువఱకుమ వేచియుండవలసి వచ్చును. మఱియు "అనారబ్ధకార్య ఏవ తు పూర్వే తదవధేః" (బ్ర.సూ. 4.1.15) జ్ఞానము కలిగిన పిదప దేహపాతమువఱకు నుండు జ్ఞానియొక్క స్థితినే జీవన్ముక్తావస్థ యిని పేర్కొనుచున్నారు. ఈ యవస్థయందున్న జ్ఞానిచేఁ జేయఁబడు నే విధమగు పుణ్యపాపకర్మలయొక్కయు కర్తృత్వ మాతని కుండదు. జ్ఞానమువలన వానికి ఫలమును బుట్టించు శక్తి వశించును. అవి యున్నమ లేనివానితో సమానములే. మోక్షమునకుఁ బ్రతిబంధకములగు పూర్వోత్తర ములగు పుణ్యపాపకర్మలు జ్ఞానముచే నశించును గావున, అవి వాని

నంటనేరవు కావువను జ్ఞానికి దేహపాతానంతర మవశ్యము ముక్తి లభించును. "తదధిగ మో త్తర పూర్వాఘయో రశ్లేష వినాశౌ తద్వ్యప దేశాత్" (బ్ర.సూ. 4.1.13). "ఇతరస్యాప్యేవ మసంశ్లేషః" (బ్ర.సూ. 4.1.14) అనునది శ్రీ శంకరభగవత్పాదుల వారి మతసిద్ధాంతము.

శ్రీ భగవత్పాదులవారిచేఁ జేయఁబడిన యీ వేదాంతసిద్ధాంతము లోకమాన్యులకు సంపూర్ణముగ సమ్మతమైనదే. కాని జ్ఞానము కలిగిన పిదప దేహపాతము పర్యంతమును జ్ఞాని కాల మెటులఁ గడపవలయునను ప్రశ్నమున కుత్తరమును జెప్పుటలోమాత్ర మాచార్యులవారికిని లోక మాన్యులకును మతభేదము కలదు. ఆత్మజ్ఞాని అవాప్త సర్వకాముఁ డగుటచేఁ (సర్వకామములను పొందినవాఁడగుటచే) ప్రాప్తవ్య మేమియు (అనఁగా: పొందఁదగిన దేదియు) లేనే లేదు. కాన నాతండు సర్వ కర్మములను, కర్మసాధనములను యజ్ఞోపవీతము, శిఖ మొదలగు నన్నింటిని పరిత్యజించి యుదరనిర్వాహార్థమై భిక్షాటనమాత్రముఁ జేయవలయు ననియు, మిగిలిన కాలమునంతను నాత్మచింతనమునందే గడపవలయ ననియు, మఱియొక కార్యము నెంతమాత్రమునుఁ జేయఁ గూడదనియు భగవత్పాదుల యభిప్రాయము. ఆత్మజ్ఞాని తనకొఱకుఁ గాతపోయినను లోక సంగ్రహార్థమే యైనను (అనఁగా: లోకుల కుపకారముఁ జేయవలయునను నూహతోనై న) వెనుకటివలెనే సర్వకర్మలనుఁ జేయుచునుండుటయే మిక్కిలి ప్రశస్తమనియు, నలసునివలె కాలక్షేపమును మాత్రముఁ జూచుకొనఁగూడ దనియు, తిలకమహాశయుని యభిప్రాయము. భగవత్పాదులకును, లోకమాన్యులకును మతభేదము జ్ఞాని జ్ఞానము కలిగినపిదప నెటులఁ బ్రవర్తింపవలయు ననుఁ విషయమును గుఱించి వెలువడినది. వీనిలో శ్రీ భగవత్పాదులవారి మార్గము సన్యాస మార్గమనియు, నివృత్తిమార్గ మనియుఁ బేర్కొనఁబడును. లోకమాన్యుల మార్గము కర్మమార్గ మనియు, ప్రవృత్తిమార్గమనియుఁ బేర్కొనఁబడును. వ్యాకరణమహాభాష్యగతములును, శంకరభాష్యగతములును నగు కొన్ని వాక్యములను నవీన గ్రంథములలో నేకదేశిభాష్య మనియు, ప్రౌఢోక్తి యనియుఁ జెప్పుచు వాదము చేయుట గ్రంథకారులంతై లి కావున నంత మాత్రమునే నవీను లని నిందింపక మనము విచారముపైపునే దృష్టి మంచి యుక్తిప్రతియుక్తులను పరీక్షింపవలయును. ఇట్టి యుక్తులు

బుద్ధిమంతులకూ వానినిఁ జదివిన పిదపఁ దోఁచుట సైతము ప్రాచీన గ్రంథములయందలి మహత్త్వమునకు మఱింత తోడువడుటయే యగును. జ్ఞానము కలుగనిచో ముక్తి కలుగదనియు, నంతఃకరణశుద్ధిలేనిచో విచారముగుండా జ్ఞానము కలుగుటకు వీలులే దనియు వర్ణాశ్రమ విహిత ములనుఁ జేసినచే గాని చిత్తశుద్ధి గలుగదనియుఁ జెప్పు శ్రీభగవత్పాదుల వారి మతము లోకమాన్యులకును సమ్మతమే. సంశయ మేమియు లేదు. కాని సన్న్యాసాశ్రమమునుఁ స్వీకరించివానేగాని మోక్షము లభించుటకు వీలు లేదని శ్రీభగవత్పాదులు చెప్పుచున్నారు. జ్ఞానము కలిగినచో వర్ణా శ్రమవిహితమగు ననుష్ఠానముఁ జేయుట నుండినను మోక్షము లభించు నని లోకమాన్య తిలకమహాశయులు చెప్పుచున్నారు. జ్ఞానము కలిగిన పిదప సన్న్యాసాశ్రమమును స్వీకరించినచో మోక్షము లభించవదని మాత్రము చెప్పరు. కాని తిలకమహాశయుని మత మే శ్రుతిస్మృతి ప్రమాణములచే సిద్ధమగుచున్నదో నిరూపించుట వారికిని కష్టమైన విషయమే. కావున నీ విషయ మే ప్రమాణములచే సిద్ధమగునో నిరూ పించుట యావశ్యకము.

మొదట జ్ఞాని కర్మ చేయుటకు శక్య మగునా? కానిదా? యను విషయము విచారణను గావింపుదము. ఈ విషయమున నాచార్యశిష్యులగు శ్రీవిద్యారణ్యులవారు "విద్వాంశ్చే త్తాదృశాం మధ్యేతిష్ఠే త్తదనురోధతః, కాయేన, మనసా, వాచా కరోత్యేవాఖిలాః క్రియాః" అట్టివారిలో (అనఁగా: జ్ఞానులలో) నుండవలసినపుడు తత్త్వజ్ఞాని వారి ననుసరించియే తన కాయిక వాచిక మానసికములగు కర్మల నన్నింటినిఁ జేయుచున్నాఁడని చెప్పిరి (పంచదశీ. ప్ర. 7). శ్రీభగవత్పాదులును "కామప్రహీణే తు విద్వ మాన మపి కర్మ పుణ్యాపుణ్యోపచయ కరం న భవతి", "ఉచ్ఛిన్న కామస్య విద్యమానాన్యపి కర్మాణి బ్రహ్మవిదో వంధ్యప్రసవాని భవంతి" -కోరికలు నశించిన పిదప కర్మయున్నను పుణ్యపాపములను పంపాదింపవేరదు. కామములు నశించిన బ్రహ్మజ్ఞానియొక్క కర్మ లున్నను ఫలముము పంపా దించువని కావని బృహదారణ్యకభాష్యమునఁ జెప్పిరి. "విదుషా క్రియ మాణ మపి కర్మ పరమార్థతోఽ కర్మైవ" అని గీతాభాష్యమువను (4-20) విద్వాంసుఁడు కర్మఁజేసినను నిజముగ వది యకర్మయే యనియుఁ

తెప్పిరి. భగవత్పాదులు జ్ఞానికి కర్మఁజేయుటకు శక్య మగునని యొప్పు కొనుటయేగాక; "యస్య సర్వే సమారంభాః కామ సంకల్ప వర్జితాః జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం త మాహుః పండితం బుధాః" (గీ. 4.19) అను శ్లోకముయొక్క భాష్యములో జ్ఞానులను ప్రవృత్తు లనియు (ప్రవృత్తి మార్గావలంబు లనియు), నివృత్తు లనియు (నివృత్తిమార్గావలంబు లనియు) రెండు తెగలుగ విభజించి జ్ఞానులు జీవితమును గడపుటకు రెండు స్వతంత్రములగు మార్గములు గలవని చూపించి, కొంతమంది జ్ఞానులు తమ ఇచ్ఛానుసారముగ లోకసంగ్రహమును చేయుటకును, మఱికొందఱు తమ శరీరనిర్వాహమును చేసికొనుటకును కర్మల నన్నిం టినిఁ జేయుచునే యున్నారని స్పష్టముగఁ దెప్పిరి. అచ్చో భాష్యమున 'అస్య యథోక్తదర్శినః (కర్మణ్యకర్మ అకర్మణి చ కర్మ పశ్యతః) సర్వే యావంతః సమారంభాః కర్మాణి.... కామసంకల్పవర్జితాః కామైస్తక్కా రణైశ్చ సంకల్పై ర్వర్జితాఃముదైవ చేష్టామాత్రా అనుష్ఠీయంతే ప్రవృత్తేన చేల్లోకసంగ్రహార్థం నివృత్తేన చే జ్జీవన మాత్రార్థం తం జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం.... అహుః వరమార్థతః పండితం బుధాః."— కర్మయం దకర్మదృష్టియు నకర్మయందు కర్మదృష్టియుఁ గలిగిన యే పురుషుని కర్మ లన్నియుఁ గోరికలతోడను వానికి కారణభూతములగు సంకల్పముల తోడను శూన్యము లైనవో (అనఁగా: ప్రవృత్తిమార్గములోనుండు నేని లోకసంగ్రహముకొఱకును నివృత్తిమార్గములో నుండునేని జీవనము కొఱకును నెవని కర్మలన్నియు వ్యర్థచేష్టవలె ననుష్ఠింపఁబడినవో) వానిని నిజముగ జ్ఞానాగ్నిచే దహింపఁబడిన కర్మలు గలిగిన పండితుఁ డని బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారు అని యున్నది.

పై వివేచనవలన జ్ఞానము కలిగినపిదప జ్ఞాని జీవితకాలమును గడపుటకై ప్రవృత్తిమార్గము నివృత్తిమార్గము ననుసరించి రెండిలోఁ దన కిష్టమువచ్చిన దేదో యొక మార్గమును గ్రహింపవచ్చును గాన ప్రవృత్తి మార్గావలంబియగు నేని లోకసంగ్రహార్థమై యన్నికర్మలను, నివృత్తి మార్గావలంబియగు నేని దేహధారణోపయుక్తమాత్రమగు భిక్షావరణాది కర్మను చేయుచు జీవితశేషమును నాత్మచింతనముచేఁ గడపవలయునని శ్రీభగవత్పాదులు పైత మంగీకరించినటుల నిర్వివాదముగనే సిద్ధమగు

చున్నది. ఇంతియగాక జ్ఞాని క్షత్రియుఁడో, లేక వైశ్యుఁడో యగు నేని స్వార్థ మేమియు లేకపోయినను లోకులకై ప్రవృత్తి మార్గమునే యవలంబింపవలయును. నివృత్తి మార్గము నవలంబింపనే కూడదని సైత మాదార్యులు ముఖ్యముగఁ జెప్పుచున్నారు. "బ్రాహ్మణానామే వాధికారో వ్యుత్థానే" (బృ. భాష్యం) బ్రాహ్మణులకే సన్న్యాసాధికారముగాని క్షత్రియులకును వైశ్యులకును లేదు.

భగవత్పాదులమతము ననుసరించియే క్షత్రియులును, వైశ్యులును, జ్ఞానము గలిగిన పిదప లోకసంగ్రహార్థమై యనఁగా: కేవలము లోకోపకారముకొఱకై కడ పఱకును కర్మలనుఁ జేయుచునే యుండవలయును. వారికి రెండవమార్గము లేనే లేదు. "ఇతరవర్ణాపేక్షయా వాయావజ్జీవశ్రుతిః న హి క్షత్రియువైశ్యయోః పారివ్రాజ్యావశ్రుతి రస్తి" (బృ. భాష్యం). మఱియు బ్రాహ్మణులకుఁ బ్రవృత్తి నివృత్తి మార్గముల రెండింటియందును నధికారముండుటచే వారి కిష్టమైనమార్గ మవలంబింపవచ్చునని స్పష్టముగుచున్నది. ఈ విషయములో శ్రీ భగవత్పాదులకును లోకమాన్యులకును నేమియు విరోధము లేదని స్పష్టముగ నెల్లవారు నెఱుంగవలయును.

కాని, "తస్మాద్ధి తాభ్యాస్తే ఽషన్మాత్రేణాపి ప్రాకృతేన స్మార్తేన వా కర్మణా ఆత్మజ్ఞానస్య సముచ్చయో న కేన చిద్దర్శయితుం శక్యః" (గీతా భాష్యం.అ. 2 శ్లో. 10). మఱియు తస్మాద్ధితాభ్యాస్తే ఽ ఆత్మజ్ఞానవత స్సన్న్యాస ఏవాధికారో న కర్మణీతి తత్ర తత్ర ఉపదిష్టా దాత్మజ్ఞానప్రకరణే దర్శయిష్యామః" అనఁగా: "గీతలలో కొంచెమైన ప్రాకృతముగాని లేక స్మార్త ములుగాని యగు కర్మలతో జ్ఞానమునకు సముచ్చయముఁ జెప్పఁబడిన ట్లెవరును చెప్పుటకు వీలులేదు" "కావున గీతాశాస్త్రమునం దాత్మజ్ఞానికి సన్న్యాసమునందే యధికారముగాని కర్మలయం దధికారము లేవట్లు సిద్ధమగుచున్నదని జ్ఞానప్రకరణములయం దక్కడక్కడ నిరూపించెద" మని శ్రీభగవత్పాదులవా రనేకస్థలములయందుఁ జెప్పిన దాని కర్థమేమి యని శంకింపవచ్చును. అయినను శ్రీభగవత్పాదులవా రెక్కానకర్మసము చ్చయ మశక్యమని చెప్పిరో దానికర్థము తెలియనందున నీ శంక బయల్వడును. అది తెలిసికొనినచో నీ ప్రశ్నమున కవకాశమే యుండదు.

కాన శ్రీభగవత్పాదులవా రశక్యమని చెప్పిన జ్ఞానకర్మసముచ్చయమువ కర్త మేమో యిచ్చో వివరించుట యావశ్యకము.

మోక్షము జ్ఞానముచేతనే లభించు ననియు, మోక్షము లభించుట కై జ్ఞానమునకు కర్మాపేక్ష యేమియు నుండ దనియు, కర్మ యనునది జ్ఞానోత్పత్తి కి కారణ మనియు, ఆ జ్ఞానము కలిగినచో కర్మల యావశ్యకత యేమియు నుండదనియు, జ్ఞానము మోక్షమునకు స్వతంత్ర మయిన సాధన మనియు శ్రీభగవత్పాదులవారి సిద్ధాంతము. దీనికి విరుద్ధముగ జ్ఞానమాత్రముచే మోక్షప్రాప్తి కి వీలులే దనియు, జ్ఞానమునకు (ఆత్మ జ్ఞానమునకు) కర్మసంబంధ ముండిననే తప్ప మోక్షము సిద్ధించుటకు వీలులే దనియు, నాత్మజ్ఞానము స్వతంత్ర మైనది కాదనియు నది కర్మ కంగ మనియు (అనగా: నే జ్ఞానమునకును, ఆత్మజ్ఞానమునకును, కర్మతో సముచ్చయము గలదో యా కర్మ సముచ్చితమగు జ్ఞానమే– (ఆత్మ జ్ఞానమే) మోక్షము నిచ్చుటకు సమర్థ మైనదనియు,) కేవలాత్మజ్ఞానముచే మోక్షము దొరకుటకు వీలులే దనియు సముచ్చయవాదులు చెప్పుదురు. ఈ జ్ఞాన, కర్మ, సముచ్చయపక్షమును (అనగా: కర్మ సముచ్చితమగు జ్ఞానముచేతనే మోక్షము సిద్ధించును, జ్ఞానమాత్రముచే మోక్షము ప్రాప్తించదను పక్షమును) శ్రీభగవత్పాదులవారు తమ భాష్యములో నా యా కడ ఖండించిరి. మఱియు దీనికి విరుద్ధమగు పక్షము నాచార్యుల వారి భాష్యమును లెస్సగఁ జదివిన వారికిఁ దెలియఁగలదు. ఉదా హరణము: గీతాభాష్యమునందే "తస్మాద్గీతాసు కేవలాదేవ తత్త్వజ్ఞానా న్మోక్షప్రాప్తిః న కర్మ సముచ్చితాదితి నిశ్చితో ర్థః" –యథా "భగవతో వాసుదేవస్య క్షాత్రధర్మే చేష్టితం న జ్ఞానేన సముచ్చీయతే పురుషార్థ సిద్ధయే", "తస్మాత్కేవలాదేవ తత్త్వజ్ఞానాన్మోక్ష ఇత్యేషోఽర్థో నిశ్చితో గీతాసు సర్వోపనిషత్సు చ" ఇత్యాదికము గీతాభాష్యమునందే చెప్పఁ బడినది. ఈ స్థలములయన్నింటి యందును పురుషార్థసిద్ధికొఱకు (అనగా: మోక్షప్రాప్తి కొఱకు, నిశ్శ్రేయసము కొఱకు) ఆత్మజ్ఞానమునకు కర్మ యొక్క సహాయ మేమియు లేదని యున్నది.

"ఆశ్రమ కర్మాణి విద్యయా ఫలసిద్ధౌ నాపేక్ష్యంతే" (బ్ర.సూ.భా. 3.4-28) –కేవలము జ్ఞానముచేతనే మోక్షము కల్గును అని యాచార్యుల

వారు చెప్పినట్లు స్పష్టముగఁ గన్పట్టుచున్నది. ఎక్కడ 'పురుషార్థసిద్ధి కొఱకు,' 'మోక్షప్రాప్తి కొఱకు' మొదలగు శబ్దములనుఁ బ్రయోగింపఁబడలేదో జ్ఞానకర్మ సముచ్చయము నిషేధింపఁబడినదో యది పురుషార్థసాధన మను దృష్టితోడనే నిషేధింపఁబడిన దని యెఱుంగ వలయును. ఆచార్యుల వా రే జ్ఞానకర్మసముచ్చయపక్షమును ఖండించిరో అది గీతారహస్యకారుల మతము కాదని నిర్వివాదమే.లోకమాన్య లే జ్ఞానకర్మ సముచ్చయమును చెప్పుచున్నారో యది యాచార్యులవారు నిషేధించిన సముచ్చయ వాదము కాదు. కారణ మేమన, జ్ఞానము కల్గినపిదప లోకసంగ్రహార్థమై (మోక్షము కొఱకుఁగాదు) చేయఁబడిన కర్మ యాచార్యులవారి దృష్టినిఁ బట్టి కర్మయేకాదు. "గీతాశాస్త్రే.... కర్మణా జ్ఞానస్య సముచ్చయో న కేన చిత్ దర్శయితుం శక్యః" అని చెప్పి వెంటనే "యస్య తు అజ్ఞానా ద్రాగాదిదోషతో వా కర్మణి ప్రవృత్త్యా యజ్ఞేన దానేన తపసా వా విరుద్ధ సత్త్వస్యజ్ఞాన ముత్పన్నం పరమార్థతత్త్వవిషయ మేక మేవేదం సర్వం బ్రహ్మ అకర్తృ చేతి తస్య కర్మణి కర్మప్రయోజనే చ నివృత్తేః లోక సంగ్రహార్థం యత్ర పూర్వం యథాప్రవృత్త ప్రతీత ప్రవృత్తస్య కర్మణి యుత్పిృవృత్తిరూపం దృశ్యతే న తత్కర్మ యేన బుద్ధే స్సముచ్చయ స్స్యాత్" (గీ.భా.అ. 2 అవతరణము) అను భాష్యగ్రంథమును చూడుము. (అవఁగాఁ గీతాశాస్త్రమునందు జ్ఞానముతో కర్మకు సముచ్చయము కలదని యెవరును నిరూపించుటకు వీలు లేదు) కాని యజ్ఞము దానము తపస్సు ననువాని సంబంధముచే నంతఃకరణము శుద్ధమైనందున నీ పర్వమును బ్రహ్మమే యనియు నది కర్తృత్వ హీన మైన దనియు పారమార్థిక విషయమగు జ్ఞానముకలిగి, కర్మమునుండియు కర్మప్రయోజనము నుండియు నెవరు నివృత్తిఁ బొందినాకో వారు పూర్వమువలెనే యత్న పూర్వకముగ కర్మలలో వర్తించినట్లు కాన్పించినను వారు సేయువది కర్మయే కానేరదు. వారిజ్ఞానమునకు కర్మలతో సముచ్చయ మెటు లుండును:

అటులనే "విదుషా క్రియమాణం కర్మ పరమార్థతోఽకర్మైవ తస్య నిష్క్రియాత్మదర్శన పంపన్నత్వాత్", "కర్మణ్యభిప్రవృత్తోఽపి నిష్క్రియాత్మదర్శన పంపన్నత్వా న్నైవ కించిత్కరోతి" (గీ.భా. 4.20). "ఏవం

లోకసంగ్రహం చికీర్షుర్హాఽపి క్రియమాణం కర్మ పరమార్థతోఽకర్మ బ్రహ్మ బుద్ధ్యుపమృదితత్వాత్" "ఇదం తు బ్రహ్మబుద్ధ్యుపమృదితకార్పణాది మత్కర్మ అకర్మైవ తత్" (గీ.భా. 4.25) –మొదలగు ననేకవచనముల నాచార్యులవారి భాష్యమునఁ జూపవచ్చును. వానిలో "నేను నిష్క్రియ మగు బ్రహ్మను," అను జ్ఞానము కలవారు చేసినవి కర్మలే కావని యాచార్యులవారు నిశ్చయించి చెప్పినారు. దీని విషయమై పైనఁ జూపిన ప్రమాణములు చాలునని నాయభిప్రాయము. ఆచార్యులవారి సిద్ధాంతమువకును, లోకమాన్యుల సిద్ధాంతమునకును లేశమాత్రమైనను విరోధము లే దను విషయమఁ నిర్వివాదముగనే యున్నది.

విరోధము లేకపోయినను రుచిభేదము మాత్రము గలదు. జ్ఞానము గలిగిన పిదప జ్ఞానికి జీవితమును (దేహపాతము వఱకు నుండుకాలమును) గడపుటకు ప్రవృత్తిమార్గము నివృత్తిమార్గము ననుఁ నీ రెండింటి యందును సంపూర్ణముగ నధికార మున్నదని ఇరువురు నొప్పుకొన్నను జ్ఞాని కర్మసన్న్యాసమును గ్రహించి భిక్షావృత్తితో నుండుట యనునదియే శ్రేయస్కరమని యాచార్యులును, జ్ఞాని కర్మసన్న్యాసమునుఁ జేయక లోకోపకారార్థమై కర్మలను చేయుచునే యుండుట మిక్కిలి మంచి దనియు లోకమాన్యులు సెప్పుచున్నారు. "భిన్నరుచిర్హి లోకః" అను న్యాయమును బట్టి "న చ వేద సమ్యక్ ద్రష్టుం" అని యీ యిరువురిలో నెవరిని ననుటకు సాధ్యము కాదు.

ఇంతవఱకు శ్రీభగవత్పాదులవారికిని లోకమాన్యులకును గల యభి ప్రాయము కలసియే యుండెను. అయినను ముందుఁ జెప్పఁబోవు విషయముం బట్టి వీ రిరువురకు నవరిహార్యము నొకవిరోధము బయలు వెడలును. జ్ఞానము కలిగిన పిదప నివృత్తి మార్గమును స్వీకరించుట (అనఁగా: సర్వకర్మ సన్న్యాసముం జేయుట) మిక్కిలి శ్రేయస్కర మనియు, గీతల కీ మతమే సమ్మత మనియు శ్రీభగవత్పాదులవారు సెప్పు చున్నారు. ("తస్యాస్య గీతాశాస్త్రస్య సంక్షేపతః ప్రయోజనం పరం నిశ్శ్రేయసం..... తచ్చ సర్వకర్మసన్న్యాస పూర్వకాత్ ఆత్మజ్ఞాన నిష్ఠా రూపాత్ ధర్మా దృచ్ఛతి") జ్ఞానము కలిగిన పిదప ప్రవృత్తిమార్గమును స్వీకరించుట (అనఁగా: సర్వకర్మలను చేయుచుండుట) మిక్కిలి మంచి

దనియు, గీతల కీ మతమే సమ్మత మైన దనియు లోకమాన్యులు సెప్పు చున్నారు. ("కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే", "కర్మజ్యాయో హ్య కర్మణః").

ఈ రెండువక్షములలోని గీతలకు సమ్మతమైన దేది యని విచారింప వలసియున్నది. ఇప్పటికి సుమారు 1200 ల సంవత్సరములుగా శ్రీ భగవత్పాదులవారి భాష్యము నందఱును పఠించుచుండుటఁబట్టి వారి వక్షమునే గీత యంగీకరించు చున్నదని దృఢమైన నమ్మకము కలదు. అట్టి స్థితిలో లోకమాన్యులు తమ సిద్ధాంతమును నెరవేర్చుటకై చూపు చున్న ప్రమాణములను కొంచెము విచారింతము.

సన్న్యాసం కర్మణాం కృష్ణ పున ర్యోగం చ శంససి,
యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్.
(అ. 5.1)

– ఓ కృష్ణా! యొకవరి సన్న్యాసమును, యొకవరి కర్మయోగమును (అనఁగా: కర్మను చేయుచుండవలయు నను మార్గమును) నుత్తమ మని చెప్పుచున్నావు. ఈ రెంటిలో నేది మంచిదియో (మిక్కిలి ప్రశస్త మైనదో) దాని నొక్కదానినే నిశ్చయముగా నాకుఁ జెప్పుము అను ప్రశ్నమునకు నుత్తర మిచ్చునపుడు–

సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ,
తయోస్తు కర్మసన్న్యాసాత్ కర్మయోగో విశిష్యతే.
(అ. 5.2)

– కర్మసన్న్యాసమును కర్మయోగమును రెండును నిశ్శ్రేయసకరములే (అనఁగా: మోక్షమును గలుగఁ జేయునవియే), కాని (అనఁగా: మోక్షము పంపాదించుటకు సమానమైన యోగ్యతఁ గలవై నను) యీ రెంటిలో కర్మసన్న్యాసముకంటె కర్మయోగము విశేషమైన యోగ్యత గలిగి నది– అను ప్రశ్నోత్తరములు రెండును నిస్సందిగ్ధములై నవియు పృష్ఠ ములునై యున్నవి. మొదటి శ్లోకమునందున్న శ్రేయశ్శబ్దమునకు మిక్కిలి ప్రశస్యము (బహుమంచిది) అని వ్యాకరణశాస్త్రానుసారముగ నర్థమును

చెప్పవలయును. రెండుమార్గములలో మున్న తారతమ్యమును గుఱించిన యర్జునుని ప్రశ్నమునకే 'కర్మయోగో విశిష్యతే' కర్మయోగము మిక్కిలి గొప్పదని భగవంతుఁ డుత్తర మిచ్చినందున కర్మయోగపక్షమే మిక్కిలి గొప్పదని చెప్పుటకు ప్రమాణ మని లోకమాన్యులు చెప్పుచున్నారు. జ్ఞానముకలిగిన పిదప కర్మలు సేయనక్కఱలేదను విషయము భగవంతు నకు వమ్మత మైనచో "నీ రెంటిలో సన్న్యాసమే శ్రేష్ఠ"మని యర్జును నకు నేల యుత్తర మీయలేదుఁ అట్లుచెప్పక ''కర్మలను చేయుటయు, మఱియు కర్మలను వదలి పెట్టుటయు సమానముగనే మోక్షదాయకము" అని రెండవ శ్లోకముయొక్క మొదటిపాదమునఁ జెప్పి పిదప 'తు' అనఁగా 'కాని' అనుపదమును ప్రయోగించి 'తయోఃఁ' అనఁగా నీ రెండుమార్గములలోను కర్మలను వదలు మార్గమునకంటె కర్మలను జేయ వలయుననుమార్గమే మిక్కిలి ప్రశస్తము (శ్రేయము) అని భగవంతుఁడు నిస్సందిగ్ధముగా విధించినందున సాధనావస్థయందుజ్ఞానము లభించుటకై యే నిష్కామకర్మలను జేయవలయునో వానినే పిదప సిద్ధావస్థయందు సైతము లోకసంగ్రహార్థమై జ్ఞాని యామరణాంతమును కర్తవ్యము అని చేయుచునే యుండవలయు ననుమతము భగవంతున కిష్టమైన దని పూర్ణముగ సిద్ధమగుచున్నది.

ఇచ్చో ప్రశ్నవలె సమాధానము సైతము స్పష్టముగను సరళము గను నున్నది. ''కర్మమును వదలుట యుక్తమాఁ లేక చేయుట యుక్తమాఁ" అని యర్జునుఁడు ప్రశ్నచేయఁగా మోక్షదృష్టిలో నవి రెండును సమానములుగ నున్నను కర్మను త్యజించుటకంటె నాచరించు టయే యుక్త మని భగవంతుఁడు సమాధానము చెప్పెను.

శ్రీశంకరులు చెప్పు విషయము నిచ్చో గొంచెము గమనింప వలయును— అర్జునుని ప్రశ్నకు నిది యాశయము కానేరదు. భగవంతుని సమాధానమునకును నిది యాశయము కానేరదు. నాల్గవయధ్యాయమున "కర్మ ణ్యకర్మ యఃఁ పశ్యేత్", (4.18) మొదలు "యోగసన్న్యస్త కర్మాణం.....వ కర్మాణి నిబధ్నంతి ధనంజయ" (4.41) అనువఱకును భగవంతుఁడు సర్వకర్మసన్న్యాసమునుఁ జెప్పి, మరల "ఛిత్త్వైనం సంశయం· యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత" అను శ్లోకమువే నీవు కర్మ

యోగము నాచరింపుమని చెప్పెను. కాని కర్మయోగ కర్మసన్న్యాసములు స్థితి గతులవలె (కూర్చుండుట నడచుటవలె) పరస్పరవిరుద్ధములు గావున వీని రెంటిని యొకఁడే యొక సమయముననే యాచరించుట శక్యము కాదు. మంచిది; కాలభేదమునఁ జేయవలయు నని చెప్పదుమేని (అనఁగా: నాకదాని నాచరించిన పిదప మఱియొకదాని నాచరింపవలయునందు మేని) అట్లు భగవంతుఁడు చెప్పలేదు. కాన నేదో యొకదాననే యాచరింప వలయును. వానిలో నేదియు క్తమో దానిని చేయుద మను నభిప్రాయ ముమ మవస్సున నిడికొని యర్జునుఁ డడుగుచున్నాఁడు– "యచ్ఛ్రేయ ఏతయో రేకం తన్మే బ్రూహి సునిశ్చితం", "యోగసన్న్యస్త కర్మాణం" అను శ్లోకమున (మఱియు నింతకు పూర్వమున మఱికొన్ని శ్లోకములయందును ఆత్మవేత్తనుద్దేశించి కర్మసన్న్యాసము చెప్పఁబడినదనియు. "ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠ" యను శ్లోకమునం దనాత్మవేత్తను గుఱించి కర్మయోగము సెప్పఁబడిన దనియుఁ దోఁచి యీ ప్రశ్నమున చేసి నటుల భగవంతుఁడు సెప్పిన యుత్తరమును బట్టి కాన్పించుచున్నది. కారణ మేమన: "సన్న్యాసం కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరా వుభౌ"– సన్న్యాసము కర్మయోగమును రెండును మోక్షము నిచ్చునవే యని భగవంతుఁడు సమాధానమును జెప్పినాఁడు. కాని యీ రెండును నాత్మ వేత్తకు నిశ్శ్రేయసకరములా? ఆత్మవేత్తకు నిశ్శ్రేయసకరము లందు మేని యాత్మవేత్తకు నాత్మజ్ఞానముచేతనే నిశ్శ్రేయసము (మోక్షము) లభించునుగాన నతనికి (ముక్తునకు) సన్న్యాసము ముక్తి నిచ్చునదా? లేక కర్మయోగమా? యను ప్రశ్నమే సంభవగత మగును. కావున ననాత్మజ్ఞునకు (ఆత్మజ్ఞానము లేనివానికి) నవి మోక్షము నిచ్చునవి యని చెప్పవలసివచ్చును. అనఁగా: నాత్మవేత్తకే కర్మసన్న్యాసము కర్మయోగము వను నీ రెండును మోక్షము నిచ్చునవి యని భగవంతుఁ డుత్తర మిచ్చుటంబట్టి యర్జునుని ప్రశ్నమును ననాత్మవేత్తను గుఱించియే చేయఁబడినదని స్పష్టముగఁ గాన్పించుచున్నది.

1. "యోగసన్న్యస్త కర్మాణమ్" (4.41) మొదలగు శ్లోకములం దాత్మవేత్త సన్న్యాసమునే గ్రహింపవలయు నని చెప్పఁబడినది. 2. 'తస్మా దజ్ఞానసంభూతమ్' (44.2) మొదలగు శ్లోకములయం దనాత

వేత్త కర్మయోగము నాచరింపవలయు నని చెప్పఁబడినది. 3. కాని కర్మ త్యాగము కర్మయోగము నను నీ రెండును నవాత్మవేత్త నుద్దేశించియే చెప్పఁబడిన వని యర్జునుఁడు భ్రమఁజెంది నని "నిశ్శ్రేయస కరావుభౌ" అను భగవంతుని యుత్తరమువలనఁ గాన్పించుచున్నది. 4. తాను తెలిసికొనిన విషయమును బట్టి "యనాత్మవేత్తకు కర్మలను త్యజించుట మంచిదా?" యని యర్జునుఁ డడిగెను. 5. ఆ ప్రశ్నమున నవాత్మవేత్త కర్మములను సన్న్యసించుటకంటె కర్మములను చేయుటయే లగ్గని, (యుత్తమ మని) భగవంతుఁడు సెప్పిన భగవత్పాదుల భాష్యమునందలి సారాంశము.

కాని యాత్మవేత్త చేతను చేయఁబడు కర్మసన్న్యాసకర్మయోగము లలో నేది మిక్కిలి శ్రేయస్కర మని యర్జునుని ప్రశ్నమునియు నాత్మ వేత్త కర్మలను త్యజించుటకంటె కర్మయోగము నాచరించుటయే మిక్కిలి శ్రేష్ఠమని భగవంతుఁ డుత్తర మిచ్చెననియు లోకమాన్యులగు తిలక మహాశయులు చెప్పుచున్నారు.

ఈ రెండుమతములలో నేది యుక్తమో విచారింపవలయును. అందుకై తొలుత నాచార్యులమతమును విచారింతము. శ్రీభగవత్పాదులు భగవంతుని యుత్తరమునుబట్టి యర్జునుని ప్రశ్న కభిప్రాయమును తెలిసి కొనవలయునని నిశ్చయించినారు. కాని భగవంతునియొక్క యుత్తరములో నేమి చెప్పఁబడినది యను విషయమే ముఖ్యముగ విచారింపఁ దగినదై యున్నందున దానినిఁబట్టి ప్రశ్నమున కభిప్రాయమును నిర్ణయించుట శక్యము గాదని లోకమాన్యులు నుడివెదరు. అనఁగా నీ వచనముయొక్క యర్థమును నిర్ణయింపవలయునో యీ వచనము యొక్క నిర్ణయింపఁబడినయర్థమునుండియే యితర వచనముల కర్థమును నిర్ణయించుటకు వీలులేదని యభిప్రాయము. ఇందులకు శ్రీభగవ త్పాదులవా రే యితరసాధనములయొక్క సంబంధముచే నర్జునునిప్రశ్న కభిప్రాయమును నిశ్చయించిరో వానినే విచారించుట యావశ్యకము.

భగవంతుఁడు 'యోగసన్న్యస్తకర్మాణం' అను శ్లోకమునం దాత్మవేత్త కర్మసన్న్యాసమునుఁ జేయవలయునని చెప్పినాఁ డనియు

దానికి పిదవనున్న 'తస్మాదజ్ఞానసంభూతం' అను శ్లోకమున నాత్మవేత్త కర్మయోగము నాచరింపవలయునని చెప్పినాఁడనియు శ్రీభగవత్పాదులు సెప్పుచున్నారు. కాని వీరు సెప్పిన సంగతి యెంతవఱకు యుక్తమైనదో చూచుటకై నీ రెండు శ్లోకములను నర్థముతోఁగూడ | వ్రాయవలయును.

యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్,
ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ.
తస్మా దజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసి నాత్మనః,
ఛిత్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత.

(అ.అ. 41-42.)

– (41) ఓ యర్జునా! వరమార్థదర్శన రూపమగు యోగముచే నెవరు కర్మలను వదలిరో, మఱియు నేకత్వజ్ఞానముచే నెవరి సంశయము నశించినదో యా యాత్మవంతుని (అప్రమాదశీలుఁడగు పురుషుని) కర్మలు బంధింపవు. కావున జ్ఞానము కలిగిన పిదప కర్మలయొక్క లేపము తగులదు– (42)'తస్మాత్'– ఆ హేతువుచే (వస్తుస్థితి యిటు లుండుటచే నజ్ఞానమునుండి బయలు వెడలినదియు, నీ హృదయమునం దున్నదియు నగు సంశయమును జ్ఞానఖడ్గముచే ఛేదించి యోగమును (ఆత్మజ్ఞానో పాయమగు కర్మానుష్ఠానమును) ఆచరింపుము. ఓ యర్జునా! నీవు యుద్ధ మును జేయుటకై లెమ్ము– అని శ్రీ భగవత్పాదులవారు చేసిన యర్థము. కాని మొదటి శ్లోకములోని మొదటి చరణమునకు నింకను స్పష్టముగ నర్థమును చేయవలయును. భాష్యములో 'యోగసన్న్యస్తకర్మాణం' అనుదానికి 'పరమార్థరూపమగు యోగముచే కర్మలను వదలివేసినవారు' అని యర్థమును జేసినను నా పరమార్థదర్శనము పరోక్షజ్ఞానమా? అపరోక్ష జ్ఞానమా? యనియు కర్మలను వదలివేయుట యనఁగా కర్మలను స్వరూపతః (బొత్తుగా) త్యజించుటయా? లేక కర్మఫలత్యాగమా? యను రెండువిధములగు సందియములు బయలువెడలును. వానిలో నిట్టి శ్రీ భగవత్పాదు లే యర్థము నొప్పుకొనిరో మనకుఁ దెలియుటకు వీలు లేదు. ఆనందగిరి వ్యాఖ్యానమునుఁ జూచితిమేని "తచ్చ (పరమార్థదర్శనం) వై ధవన్న్యాయ వక్షీ పరోక్షం, ఫలనన్న్యాయపక్షే త్వపరోక్షమితి వివేకః"–

అనఁగా: "సన్న్యస్తకర్మాణ" మనుటకు, కర్మలను స్వరూపతః వదలిన వాఁ డని యర్థమున, పరమార్థ దర్శన మనఁగా: సరోక్షజ్ఞాన మనియు, ఫలతః కర్మలను వదలినవాఁ (కర్మఫలములను వదలినవాఁడు) డను నర్థమున, "పరమార్థదర్శన" మనఁగా: పరోక్షజ్ఞాన మనియు నర్థమును చేసికొనవలయునని చెప్పుటచే నీ రెండర్థములును యుక్తములైనవే యని యానందగిరిమత మేర్పడును. కాని దీనిచే నాచార్యులవారి కే యర్థము వివక్షితమో తెలిసికొనుట కానందగిరి తోడ్పడఁడు. కాని కర్మలను బొత్తుగ త్యజించుట యను నర్థము "యోగసన్న్యస్తకర్మాణం" అను దానికిఁ జేసినచో ను త్తరార్ధముతో సుసంగతము కానేరదు. కారణ మేమన: "కర్మలను బొత్తుగా వదలిన వారిని కర్మలు బంధింపవు" అని చెప్పుటలో కర్మములే లేనిచో కర్మలు బంధింపవని చెప్పుటవలనఁ బ్రయోజన మేమి యుండును: నిషేధము ప్రాప్తిపూర్వకమై యుండును గాన ప్రాప్తి యే లేనపుడు నిషేధ మెటులుండును: కర్మలు బంధింప వని చెప్పుటంబట్టియే కర్మలున్నట్లు తెలియు వచ్చుచున్నది. అనఁగా: "యోగసన్న్యస్త కర్మాణ" మను శబ్దమునకు యోగముచే కర్మములను వదలినవాని (అనఁగా: కర్మలను బొత్తుగా త్యజింపక కేవల కర్మఫలములను, కర్మ బంధనములను వదలిన వాని) నను నర్థమే యుక్త మగునట్లు కాన్పించు చున్నది.

యోగసన్న్యస్తకర్మాణం' అను వదమున యోగశబ్దమునకు శ్రీ భగవత్పాదులు ప్రతిష్ఠలమునందును 'జేయుచున్న సమత్వబుద్ధియుక్త మగు కర్మానుష్ఠానము (జ్ఞానోపాయభూతమగు కర్మానుష్ఠానము) అను నర్థమును వదలి ప్రస్తుతమున 'పరమాదర్శరూపమగు జ్ఞాన' మని యపూర్వముగ నర్థముఁ జేసిరి. అనఁగా: నీ చోట 'జ్ఞానముయొక్క యుపాయమునే జ్ఞాన' మనిరి. సాధనమునే సాధ్య మనిరి అని లోక మాన్యు లందురు. దీనింబట్టి యాచార్యులవారి యర్థముకంటె లోక మాన్యులు సేసిన 'సమత్వబుద్ధియుక్తమగు కర్మానుష్ఠానము' అను వర్థమే మంచిదని మన మొప్పుకొన్నను ఆచార్యులు సెప్పిన యర్థము విరుద్ధ ముగ మండదని తేలుచున్నది. కావున నీ శ్లోకార్థము విషయమై యే విధమగు వాదమును లేనందున యోగశబ్దమున కాచార్యులవారు చేసిన

'వరమార్థదర్శన' మను నర్థమునే గ్రహించి, 'యోగసన్న్యస్తకర్మాణం' అనుటకు 'జ్ఞానముయొక్క యోగముచే నెవరు కర్మలను త్యజించిరో' (అనఁగా: నెవరి కర్మసన్న్యాసము జ్ఞానఫలభూతమైనదో) యని యర్థము చేసికొని పిదవ నున్న 42-వ శ్లోకభాగము వైపునకు మఱలుదము.

తస్మా దజ్ఞానసంభూతం హృత్థ్సం జ్ఞానాసినాత్మనః,
ఛిత్త్వైనం సంశయం యోగ మాతిష్ఠోత్తిష్ఠ భారత.

ఈ శ్లోకమునకు భాష్యములో నుండునది ము, వరస్పరవిరుద్ధముగ నుండునట్లు తోఁచునదియు నగు భాగమును మాత్ర మిచ్చో వ్రాసెదము.

"తస్మా త్త్వాపిష్ఠ మజ్ఞానసంభూతం ..... హృత్స్థం జ్ఞానాసినా శోకమోహాదిహరం సమ్యగ్దర్శనం జ్ఞానం తదేవాసిః ఖడ్గః తేన జ్ఞానాసినా స్వస్య ఆత్మనః .. . ఛిత్వా ఏనం సంశయం స్వవినాశహేతుభూతం యోగం సమ్యగ్దర్శనోపాయం కర్మానుష్ఠానం ఆతిష్ఠ కురు ఇత్యర్థః."

ఈ భాష్యమునకు "నీవు జ్ఞానముచే నీ సంశయమును ఛేదించుకొని పిదవ జ్ఞానమును పంపాదించుకొనుటకై యుపాయము నవలంబింపుము అని సంక్షేపముగ నర్థము. ఈ యర్థము 'ముందుగ భార్యవలన పంతాన మును బొంది పిదవ వివాహమాడు'మని చెప్పినటులుండును. కావున నీ యనుపపత్తి ప్రస్తుతశ్లోకమున 'తస్మాత్' అను పదమును తీసివైచినఁ గాని వారింపఁబడదు. మఱియు దీనిని తీసివైచితిమేని 'జ్ఞానము కలిగిన పిదవ కర్మయోగము నాచరింపు'మని భగవంతుఁ డర్జునునకుఁ జెప్పినటు లర్థమగును. అటులగునేని లోకమాన్యుల యర్థము సిద్ధాంత మనియు నది గీతలకు సమ్మతమైనదనియు తేలును. అది యటు లుండుగాక.

ఈ (4.42) శ్లోకమున భగవంతుడు 'ఆత్మజ్ఞానమును పంపాదించు కొనిన పిదవ కర్మయోగము నాచరింపు'మని యర్జునునకుఁ జెప్పెనని సిద్ధమయిన పిదవ దీనికి ముందటి (4.41) శ్లోకమున నాచార్యులు చెప్పి నటులు భగవంతుఁడు జ్ఞానము కలిగిన పిదవ కర్మసన్న్యాసమును జెప్పి నటులును (యోగసన్న్యస్తకర్మాణ మిత్యంత్రై ర్వచనైః కర్మసన్న్యాస మేవోచ దృగవాన్) పంచమాధ్యాయారంభమున మొదటి శ్లోకములో

ననఁగ "సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి" అను శ్లోకమున నాత్మజ్ఞానము కలిగిన పిదపనే సన్న్యాసము యుక్తమాఁ కర్మ యోగము యుక్తమాఁ అని యర్జునుఁడు ప్రశ్నఁజేసెననియుఁ జెప్పుట, నే ప్రామాణికులై నను విరుద్ధమని చెప్పఁజాలదు. కాని భగవంతుని యుత్త రములంబట్టి 'జ్ఞానము కలుగక పూర్వము సన్న్యాసము మంచిదాఁ కర్మ యోగము మంచిదాఁ' యని యర్జునుని ప్రశ్నమునకు అభిప్రాయ మని శ్రీభగవత్పాదు లను చున్నారు.

భగవంతుని యుత్తరముంబట్టి పైత మర్జునుఁడు జ్ఞానము కలిగిన పిదపనే సన్న్యాసకర్మయోగములలో నేది మంచిదని యడిగె ననియు, జ్ఞానము కలిగిన పిదప కర్మయోగము మంచిదని భగవంతుఁ డుత్తర మును చెప్పెనని లోకమాన్యు లనుచున్నారు. కాని 'నిశ్శ్రేయసకరౌ అనుదానికి యర్థము చేయునపుడు శ్రీభగవత్పాదు లేమేమి కల్పింపవలసి వచ్చెనో కొంచెము విచారింతము. 1. (4.41) శ్లోకమునందలి యోగశబ్ద మునకు జ్ఞానమని యర్థముఁ జేయుట, 2. దానికి వరమందున్న (4.42) శ్లోకమునందలి యోగశబ్దమునకే జ్ఞానోపాయమని యర్థముఁజెప్పుట, 3. దానివలన వా శ్లోకార్థమునందు సమాధానము చెప్ప నర్థముగాని యనువపత్తిని స్వీకరించుట, 4. అర్జునునకు భగవంతుఁడు చెప్పినమాట తెలియలేదని చెప్పుట, 5. 'కర్మయోగో విశిష్యతే' యమనది యర్థవాద మని యంగీకరించుట, 6. అర్జునుఁడు కేవలసన్న్యాసము యోగము ననువిషయములఁ ప్రశ్నించినను అజ్ఞానికర్తృకములగు సన్న్యాసము యోగము ననురెండు విషయములకును భగవంతుఁ డుత్తరము చెప్పెనని కల్పించుట, 7. అయిదవ యధ్యాయమునందలి నాల్గవ శ్లోకమునందు సాంఖ్యము (అనఁగాఁ జ్ఞానోత్తరసన్న్యాసము) నిశ్శ్రేయసఫలవదమని ప్రతిపాదించి యే విరోధమును పరిహరింపనిమిత్తమై యింత శ్రమ పడిరో యా యాపత్తిని తిరిగి శ్రమ మీదికిఁ దెచ్చుకొనుట, 8. అయిదవ శ్లోకమున 'యోగైర్దుర్గమ్యతే' అను పదములకు మాత్రము "జ్ఞాన ప్రాప్త్యుపాయత్వేన ఈశ్వరే సమర్ప్య కర్మాణి ఆత్మనఃఫల మనభిసంధాయ అనుతిష్ఠద్భిఃపరమార్థజ్ఞాననన్న్యాస ప్రాప్తిద్వారేణ గమ్యతే" అను నింత పెద్దయర్థమును స్వీకరింపుట. 9. మొదటి రెండు శ్లోకములయం

దున్న పన్న్యాసశబ్దమునకు కేవలపన్న్యాసమని యర్థము చెప్పి, దానికి విరుద్ధముగ నాఱవశ్లోకమునందు 'పన్న్యాస' శబ్దమునకు పారమార్థిక పన్న్యాసమని యర్థముఁ జెప్పుట, 10. దానియందున్న బ్రహ్మశబ్దమునకు పన్న్యాస మనెడు విలక్షణార్థమును శ్రీభగవంతుఁడు స్వీకరించుచున్నా ఁడనునది మొదలు గాఁగల సంగతులఁ జెప్పిరి. ఇంతియ గాక యాచార్యులవా రీ శబ్దముల యర్థమును తలక్రిందుఁ జేయుటలోఁ జదువరులకు తిరిగి నివారింపరాని యావత్తి న్భ్రంచుచున్నది. ఆ యావత్తి నాలుగై దు శ్లోకములయొక్క యర్థమునకు సంబంధించియున్నది. అది యెటులన:

సాంఖ్యయోగౌ పృథగ్బాలాఃప్రవదంతి న పండితాఃl
ఏక మప్యాస్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్. 4

యత్సాంఖ్యైఃప్రాప్యతే స్థానం తద్యోగై రపి గమ్యతే.
ఏకం సాంఖ్యం చ యోగం చ యఃపశ్యతి స పశ్యతి. 5

ఇందులో రెండవశ్లోకముయొక్క యవతరణమునందు "ఏకస్యాపి సమ్యగనుష్ఠానాత్ కథం ఉభయోఃఫలం విందతే ఇత్యాహ." రెండింటిలో దేనినో యొకదాని నుత్తమముగ నాచరించుటచే రెండింటియొక్క ఫలము నెట్లు పొందుచున్నాఁడని శంకించి సమాధానములను చెప్పుచున్నాఁడని చెప్పి "యత్సాంఖ్యైఃజ్ఞాననిష్ఠైఃసన్యాసిభిఃప్రాప్యతే స్థానం మోక్షాఖ్యం తద్యోగై రపి.....పంమార్థజ్ఞాన సన్న్యాసప్రాప్తి ద్వారేణ గమ్యతే ఇత్యభిప్రాయఃl" అనఁగా: 'సాంఖ్యులకు (జ్ఞానయుక్త సన్న్యాసులకు) మోక్షసంజ్ఞికమగు నే స్థానము లభించునో యది యోగులకును (కర్మ-యోగులకును) జ్ఞానయుక్తమగు సన్న్యాసము వలన ప్రాప్తమగును' అని చెప్పఁబడివది. జ్ఞానయుక్తుఁడగు సన్న్యాసికి సాక్షాత్తుగ మోక్షము లభించు వనియు, (కర్మ-) యోగికి జ్ఞానయుక్తమగు సన్న్యాసమువలన మోక్షము దొరకువనియు దీనికి పృష్టార్థము. అనఁగా: (కర్మ-)యోగి జ్ఞానయుక్తుఁడైన సన్న్యాసియైననేగాని మోక్షము లభించదు. ఇంతియ గాక కర్మయోగము నాచరించినఁ గాని, జ్ఞానయుక్తమగు సన్న్యాసము లభించుట దుర్లభ మనియు శ్రీశంకరులు

చెప్పుచున్నారు. (గీ. 5-8) "యేషాం నన్న్యాసపూర్వికా జ్ఞాననిష్ఠా దృశ్యతే తేషాం తయైవ లింగేన ప్రాగ్జన్మను భగవదర్పితకర్మనిష్ఠా అను మీయతే, కారణమంతరేణ కార్యోత్పత్త్యయోగాత్." తదుక్తం శ్లో. యావ్యతోఽన్యాని జన్మాని తేమ నూనం కృతం భవేత్, సత్కృత్యం పురుషేణేహ నాన్యథాబ్రహ్మణి స్థితిః" అని మధుసూదనసరస్వతియుఁ జెప్పెను. బ్రహ్మజ్ఞానము గలిగినవారు ఈ జన్మమున కాకున్నను పూర్వ జన్మమునన్నైన నిష్కామ కర్మయోగానుష్ఠానము చేసియే యుండ వలయును. లేనిచో బ్రహ్మజ్ఞానము లభింప శక్యము కాదు.

కారణము లేనిదే కార్యము పుట్టుటకు శక్యము కాదు. దీనింబట్టి (కర్మ)- యోగము, మఱియు సాంఖ్యము (జ్ఞానయుక్తసన్న్యాసము) అనువాని పూర్వాపర్యక్రమమునకు వ్యభిచారములేదని నిర్వివాదముగ సిద్ధమగును. ఇట్టిస్థితిలో, "ఏక మప్యాస్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్" మొదలగునది చెప్పుట పొత్తుగ నసంగతమని యందఱకును సులభముగఁ దెలియఁగలదు. కారణ మేమన రెండు సాధనములును నొక ఫలమునే స్వతంత్రముగ నిచ్చునవి యయిననే కాని "ఏక మప్యాస్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్" అని చెప్పుట కెప్పుడును శక్యము కాదు. ఈ సిద్ధాంత మొకదృష్టాంతముచే స్పష్టముగ దృఢపఱుపవచ్చును.

వ్యాకరణాధ్యయనముచేఁ గలుగు ఫల మొక పతంజలియొక్క మహాభాష్యమును బాగుగ నధ్యయనముఁ జేసిన ప్రాప్త మగును. లేక యొక సిద్ధాన్తకౌముదిని బాగుగఁ జదివినను గలుగును. సిద్ధాంతకౌముదిని బాగుగఁ జదువుకొన్నవానికి వ్యాకరణాధ్యయనఫలము లభించుటకు వాఁడు మహాభాష్యము నధ్యయనముఁ జేసియే యుండవలయు ననునియమము లేదు. కావున మహాభాష్యమును సిద్ధాంతకౌముదియు ననువాని విషయములో ఫల మొకటియే; లేక "ఏకమప్యాస్థితస్సమ్యగుభయోర్విందతేఫలమ్" అని చెప్పవచ్చును. కాని యా సిద్ధాంతకౌముదియొక్క పూర్వార్ధమును నుత్తరార్ధమును వేఱుగఁ దీసికొందు మేని యా రెండిటిని ఫల మొకటియే యని గాని లేక "పృథక్పూర్వాపరౌభాగాః ప్రవదంతిన పండితాః, ఏకమప్యా స్థిత స్సమ్య గుభయో ర్విందతే ఫలమ్, యత్పూర్వేణా వ్యతేర్జ్ఞావం తత్పరేణావి గమ్యతే, ఏవం పూర్వం వరం

చార్థం యః పశ్యతి న పశ్యతి" అని చెప్పుటకు వీలుండునా? ఎప్పుడును సాధ్యముకాదు. ఏలయన రెండుభాగములును స్వతంత్రముగ వేఱువేఱు ఫలముల నిచ్చునవి కావు. ఫలము నిచ్చుటకు నొకదానియపేక్ష మఱి యొకదానికిఁ గలిగియే యున్నది. అటులనే కర్మయోగ మనునది మోక్ష రూపమగు ఫలము నిచ్చుటకు స్వతంత్ర మైనదికాదు. జ్ఞానయుక్తమగు సన్న్యాసము నవలంబించియే యున్నది. కాముదియొక్క రెండుభాగము లకును పూర్వాపర్యసంబంధ మున్నట్లు కర్మయోగమును సాంఖ్యమును నను (సాంఖ్య మన జ్ఞానయుక్తసన్న్యాసము) నీ రెంటికిని పూర్వాపర్య సంబంధము కలదు. కాన కౌముదియొక్క పూర్వోత్తరభాగముల విషయమై పృథగిత్యాదికమును చెప్పుటకు వీలులేనటుల, కర్మయోగ సాంఖ్యముల విషయమై గూడ "సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి" ఇత్యాదిక మునుఁ జెప్ప వీలులేదు.

ఎనిమిదిశ్లోకములలో శ్రీభగవత్పాదులు పది స్థలములయందు తిక మకఁ జేయవలసినట్లు తటస్థించును గాన రెండుస్థలములయందును ననుప పన్నమగు నర్థమును స్వీకరింపవలసి వచ్చునని సారాంశము.

కాని యింతక్లేశము 'నిశ్శ్రేయసకరౌ' అను నొకశబ్దముయొక్క యర్థము కొఱకుఁగదా? దాని కర్థముమాత్రము చేయుట యంతకష్టమైన వని కాదు. శ్రీ శంకరులే "సర్వకర్మ సన్న్యాసపూర్వక యాధాత్మజ్ఞాన నిష్ఠారూపాద్ధర్మాత్ వరం నిశ్శ్రేయసం భవతి" అనియు, "త్యాగఫలం (గీ. 18.8) జ్ఞానపూర్వక స్వర్వకర్మత్యాగస్య ఫలం మోక్షాఖ్యం" అనియు నీ మొదలగు స్థలములయందుఁ జెప్పియుండుటవలన భగవంతుఁడగు శ్రీకృష్ణుని సంభాషణముసకుఁగూడ నర్థము మార్చినఁ జాలుము. ఇటు లుండ శ్రీభగవత్పాదులు శ్రీకృష్ణుని యా మాట కింత విస్తృతమగు నర్థము నేల చేయవలయునో తెలియదు. "అర్కేచేన్మధువిందేత కిమర్థం పర్వతం వ్రజేత్" అను న్యాయముచే నొకచోట గౌణార్థమును స్వీక రించుటచే నంతయు సమన్వయ మైనచో, వది స్థలములయందు గౌణార్థ ముఁను ననుపపన్నార్థమును కల్పించు కష్ట మెందులకు? "నిశ్శ్రేయస కరౌ" అనఁగా: నిశ్శ్రేయస ప్రతిబంధకములు కావనిగాని, నిశ్శ్రేయస

ప్రతిబంధకనివారకము లనిగాని యర్థముఁ జేసినచో నన్నివిరోధములును పరిహృతము లగును.

జ్ఞానము కలిగినపిదప కర్మయోగము నాచరించుటకు వీలులేదని చెప్పుటకును సాధ్యముఁ గాదు. అట్లు చెప్పుట టీకాకారు లెల్లరకును సాధ్యముఁగాదు–

సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత,
కుర్యాద్విద్వాం స్తథాఽసక్తః చికీర్షు ర్లోకసంగ్రహమ్.
(గీ. ౩.25)

అని భగవంతుఁ డాజ్ఞ యిచ్చియున్నందున నీ విషయ మంగీకరింపక తప్పదు. ఇప్పుడు జ్ఞాని కర్మను చేయుటకు వీలున్నదా? లేదా? యని నిరూపింపఁబడినది.

ఇఁక లోకమాన్యులు సెప్పునర్థమునఁ గల యనుపపత్తులను విచారించుదము. 1. 'నిశ్శ్రేయస' శబ్దమునకు లాక్షణికార్థమును గ్రహించుట, 2. యోగశబ్దమునకు కర్మయోగమను లాక్షణికార్థమునుఁ జెప్పుట, 3. తమకు సమ్మతమగు నర్థమునకు "కర్మజ్యాయో హ్యకర్మణః","కర్మయోగో విశిష్యతే" అను గీతావచనములు ప్రమాణము లని చెప్పినను, స్మృతికి శ్రుతిమూలమున ప్రామాణ్యము గలదు గాని, స్వయముగఁ బ్రామాణ్యము లేనందుననే శ్రుతిమూలమున నీ స్మృతికి ప్రామాణ్యము వచ్చిన దనియు నిరూపింప వీలులేకపోవుట, 4. "పురుషార్థసిద్ధికొఱ" కని చెప్పకయే సముచ్చయవాదమును ఖండించినచోట్ల నెల్ల "పురుషార్థసిద్ధియే" యని యధ్యాహారముఁ జేసికొనుట, 5. లోకసంగ్రహార్థమై జ్ఞాని కర్మలను జేయుట యనునది లోకోపకారార్థమైనను నా లోకోపకారము సిద్ధించుటకు ప్రతిబంధకము వచ్చినచో దానిని నిరాకరించుటకొఱకు జ్ఞాని తన చిత్తమును బహిర్ముఖముగఁ జేయుక తప్పకపోవుటయు, 6. సాంఖ్యయోగమును మొదటఁ జెప్పి కర్మయోగమును పిదపఁ జెప్పినను ప్రశ్నమునసరించి సాంఖ్యయోగము మొదటఁ జెప్పఁబడినదిగాని కర్మయోగమే భగవంతుఁడు గీతలకు ముఖ్యశాస్త్రార్థమని యంగీకరించుచున్నాఁ డనుట

మొదలగు నమువత్తులు లోకమాన్యులమతము నందును గల వని విశద మగుచున్నది.

కాన విద్వాంసు లీ విషయమై తారతమ్యమును బాగుగ నాలో చించి విశేషములు చూపినచో నందఱకు నంగీకార్యమునుఁ బూజ్యముగ నుండుటకు సంశయ మేమియులేదు. మఱియు నెవరైన బాగుగ పరిశీలించి దీనిపైని పూర్వపక్షసిద్ధాంతముల రీతిని ఖండనమండనములఁ జూపుదురేని లోకమాన్యుల కా విషయములను దెలియపఱచి పునర్ముద్రణమునైన ముద్రించునటులఁ బ్రయత్నించెద. ఈ ఖండనమండనాదులయందు లోకమాన్యులను మిక్కిలి యుత్సాహము గలవారలే. మఱియు "యత్సారభూతం తదేవ గ్రాహ్యం" అను విషయమున వారే యుగ గణ్యులు గాన తమ మాటయే గెలువవలయునని యే నాఁడును ననను. నే నెఱింగినంత వఱకు శ్రీ భగవత్పాదులకును, శ్రీ లోకమాన్యులకును నుండు తారతమ్యమును దిఙ్మాత్రముగఁ జూపించినాఁడను. శ్రీ లోకమాన్యులు గీతలకు కర్మపరమగు భాష్యమును వ్రాసినారని చెప్పుటకు వీలులేదు. శ్రీశంకరభగవత్పాదులు వ్రాసిన జ్ఞానపరమగు భాష్యము ననుసరించి సిద్ధాంతభేదము లేకున్నను రుచిభేదము మాత్ర మున్నదని చెప్పుచు నీ తారతమ్యవిచారము నింతటితో విరమించెదను.

ఈ గ్రంథము నాంధ్రీకరించుటను గుఱించిన స్వవిషయమును కొంచెము వ్రాయుచున్నాఁడను. ప్రథమమున నాకు మిత్రులును తెనాలిలో న్యాయవాదులునై యుండిన బ్రహ్మశ్రీ పెద్దిభొట్ల లక్ష్మీనరసింహముగారిని కొనియాడవలసియున్నది. వారే యీ యాంధ్రీకరణమునకు మూలస్తంభమువంటివారు. వారిసంబంధము దీనికై తటస్థించిన విధము కొంచె మీ వ్రస్తావనయందు లేనిచో నేను ఏ మాత్రమును కృతజ్ఞతయే లేనివాఁడ నగుదును. ఈ లక్ష్మీవరసింహముగారికిని ధారువాడ నివాసులును న్యాయవాదులు నగు శ్రీయుత వి. బి. ఆలూరు, బి.ఏ., ఎల్.ఎల్.బి. గారికిని విశేషమైత్రి. ఒకప్పుడు ధారువాడకు శ్రీ లక్ష్మీవరసింహముగారు పోయియుండఁగా శ్రీయుత ఆలూరుగారు "గీతారహస్యము నాంధ్రీకరింపఁజేయుటకు శ్రీలోకమాన్యులు యత్నింపుచున్నారు. కావున నెవరినైన తగినవారిని మీరాలోచించి వ్రవర్తింపఁ

జేయుఁ"డని చెప్పి గీతారహస్యము గ్రంథముయొక్క మహారాష్ట్రీపతి నాకదానిని వారిచేతి కిచ్చిరి. వారి గ్రంథమునుఁ గైకొని తెనాలికివచ్చి నాకుఁ జూపిరి. నేను ఆ గ్రంథములోని కొన్ని విషయములను జదివి యచ్చో గొప్పవారగు కొందఱి కర్థముఁ జెప్పఁగా వారు దీని నాంధ్రీక రింపుఁడని నన్ను ప్రోత్సాహపఱచిరి. కాని, యా భాషను, శ్రీలోక మాన్యుల గొప్పశైలిని గమనించి యాంధ్రభాషకు వారి భావముల నన్నియును మోచికొని డించుటకు శక్తిలేనివాఁడను గనుక నంగీకరింపక యుంటిని. కాని శ్రీలక్ష్మీనరసింహముగా రీ కార్యనిర్వహణమునకు నన్ను మిక్కిలి ప్రోత్సాహపఱచుటయే గాక, తెనాలి యందుండు గొప్పవారం దఱును, మిక్కిలిగా మా సంస్కృతకళాశాల కార్యదర్శిగారైన శ్రీ పిల్లుట్ల ఆంజనేయశాస్త్రులుగారును నేనీ కార్యమును బూనుకొనువఱకు నన్ను వదలకపోయిరి. నేనీ కార్యమున కసమర్థుడ నయినను గొప్పవారగు నిందఱియాజ్ఞ యయినను నాకుమార్గ మీయకపోవునా యని ధైర్యముతో నొప్పుకొనినందున, లోకమాన్యులను, నేను కాశీపట్టణములో బహుకాలము నివసించుట మొదలగు పంగతులను కర్ణాకర్ణిగా విని, యాంధ్రీకరింపు మని యాజ్ఞ నొసంగిరి. కాని, గ్రంథ మతివిస్తృత మైనందుననను, సంస్కృతమును, నాంధ్రమును బాగుగఁ దెలిసి వ్రాయువారు లభ్య పడకపోవుటవల్లను కాలయాపన జరుగుచు కష్టపడుచుండిని. అంతట నాతో విద్యాసంబంధము గలిగిన బ్రహ్మశ్రీ బుఱ్ఱా పూర్ణయ్యశాస్త్రిల వారను హైస్కూలుపండితులు శ్రీభారతమును వ్రాయునపుడు వేద వ్యాసులకు గజాననుఁడు తోడ్పడినటుల నాకుఁ దోడ్పడి యీ గ్రంథమును పంపూర్ణముగ వ్రాసిరి. వారెంత బాగుగ వ్రాసినను శ్రీలోకమాన్యులైలి మహారాష్ట్రీభాషలో లోకోత్తర మగుటచేతను, గ్రంథ మతివిస్తృత మగుట చేతను నాలోచించి వ్రాసినచో నొక పుటయైనను పూర్తిఁజేయుట కశక్య ముగ నుండినందున 'మక్షికాస్థానే మక్షికా' న్యాయముగ వ్రాసితిమి. కాని, విశేషఁబ్రాయముగా నుండు నాంధ్రభాషలోని కువాక్యప్రాయ మగు మహారాష్ట్రీభాషను మార్చుట మహాప్రయాసమైనది. ఈ స్థితిలో బ్రహ్మశ్రీ వేదాంత శ్రీరామశాస్త్రిలవా రను హైస్కూలు పండితులు పూర్వమునం దెపుడో నాయొద్ద వ్యాకరణ మభ్యసించియుండి "ఏకాక్షర ప్రదాతార" మను న్యాయము ననుసరించి నాయెడ విశ్వాసము మంచి

యీ గ్రంథమును మొదటి యక్షరము మొదలుకొని యంత్యాక్షరము వఱకును నాతో సమానముగ వరిశ్రమఁజేసి సరిచూచి సంస్కరించి బాగుఁ జేసిరి. పైయిరువురును జీవనోపాయమైన నిర్బంధోద్యోగముల యందుండియు శ్రమను సహించి కార్యము నెఱవేఱునటుల నాకు దాసాను దాసు లయి నా కీకార్యనిర్వహణమున చక్రరక్షకులుగ నుండినందున నేను వారికి మిక్కిలి కృతజ్ఞుఁడను. ఈ గ్రంథ మిటుల వ్రాయఁబడినను, దీని భాషారచన యాంధ్రలోకమునకు మెచ్చు పుట్టించినట్లును, స్త్రీబాలురకును సుబోధక మగు సులభశైలి నేర్పఱచి చిత్తుప్రతులను సరిచేసి ముద్రణ మున కుపయుక్త మగునటుల పరిశ్రమచేసిన నెల్లూరుజిల్లా, పుదూరు గ్రామనివాసి యగు పునుగు సీతారామశాస్త్రిలవా రను నా మిత్రులు శ్రీవావిళ్ల రామస్వామిశాస్త్రిలవారి కొమారులు శ్రీవేంకటేశ్వరశాస్త్రిల వారి ప్రోత్సాహమునఁ జేసిన మితిలేని యుపకారమును వర్ణింపఁజాలను.

మఱియు నిందరినహాయమున ముద్రణాలయమునకు వ్రాత ప్రతులు ముద్రణకు సిద్ధమైపోయిన పిదప నీ గ్రంథమును ప్రారంభము మొదలు తుదవఱకును మూలమహారాష్ట్రప్రతికి సరియైన యాంధ్ర భాషాంతరము గలదై యున్నదా? లేదా? యని శోధించి పొరఁబడి వదలిన భాగములను నాకుఁ దెలిపి భాషాంతరమును దెప్పించియు తామే సవరింపఁజాలినవానిని ఓపికతో శ్రీవావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిలతోఁ గూడి సవరించియు గ్రాహ్యప్రతుల శోధించిన విద్వాంసులు శ్రీమాన్ ఉత్పల వేంకటనరసింహాచార్యులును నా కృతజ్ఞతకు పాత్రులు.

ఇఁక నీ గ్రంథము ప్రచురింపఁబడుటకును, శ్రీలోకమాన్యులకు భరతఖండములోని కీర్తి యీ గ్రంథముచే నాంధ్రలోకమున మఱింత విస్తరిల్లవలయునని యత్యుత్సాహముతో శ్రీ లోకమాన్యుల యాజ్ఞ ననువరించి ముద్రించి ప్రకటించిన వారును, నిందులకై యొకవర్యా యము కలకత్తాకును, నింకొక పర్యాయము బొంబాయికిని, మఱియొక వర్యాయము పునహాకును మార్గాయాసమున కోర్చిపోయి, ముద్రణ పరికరము లన్నియు ప్రస్తుతపు ఐరోపామహాసంగ్రామముచే వపారము లగు మూల్యములుగలవైనను, శ్రీలోకమాన్యులయందు తమకుఁగల యాంతరంగమును, బాహ్యమును నగు భక్తిచే వారియిష్టానుసారముగ

రమ్యముగ ముద్రింపించి ప్రకటించిన శ్రీయుత వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులవారి సహాయము లేనిచో నీ గ్రంథము ప్రకటింపఁబడుటకు వీలు లేకయే పోవును గాన వారిని నే నేమని శ్లాఘింపవలయునో తోఁచలేదు.

కాని, పూర్వము చెప్పిన కారణములను బట్టి విశేషకాల మాలస్య మైనందుకు క్షమింపవలసినదిగా నాంధ్రలోకమును ప్రార్థించుచున్నాఁడను. మఱియు నాకు మహారాష్ట్రభాషాజ్ఞానము చాలమిచేఁగాని, యక్షర యోజకుల దృష్టిదోషముచేఁగాని యితరములగు మఱికొన్ని కానరాని కారణములచేఁగాని యనేక స్థాలిత్యము లుండవచ్చును. కావున బుద్ధి మంతులగు చదువరులు బాగుగ పరిశీలించి నాకుఁ దెలిపినచో వానిని శిరసా వహించి పునర్ముద్రణమున బాగుచేయింతు నని విన్నవించు చున్నాఁడను.

ఈ గ్రంథము నాంధ్రీకరించు విషయమునను, నచ్చొత్తించుట యందును మొదటినుండియు నధికశ్రద్ధతోఁ బనిఁజేసియుఁ బ్రోత్సాహ పఱచియు నాంధ్రలోకమున కుపకారముఁ జేయఁబూనిన బ్రహ్మశ్రీ పెద్ది భొట్ల లక్ష్మీనరసింహముగారును, ముద్రణాలయమున నుండిన వండితు లును నీ గ్రంథముయొక్క సవరణలలో నివ్వటి స్థితికిఁ దోడ్పడినవారైన విద్వాన్ శ్రీ ఉత్పల వేంకటనరసింహాచార్యులను గ్రంథము సమాప్తి యగునప్పటికి వరలోకగతు లగుట యాంధ్రుల కందఱకును విచార కరముగ నున్నది.

ఇట్లు,

శ్రీ దండిభొట్ల విశ్వనాథశాస్త్రి భట్టాచార్యులవారి శిష్యుఁడును, గోదావరీతీర విరాజమాన రాజమహేంద్రవరపుర సమీపమునందున్న ముసికూడలిగ్రామ నివాసవంఱుగ నున్న–

నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి,
వ్యాకరణాచార్యుఁ.

* * *

గీతారహస్యమునందలి విషయములకు అయా ప్రకరణముల యందున్న యనుక్రమణిక

మొదటి ప్రకరణము

విషయప్రవేశము

శ్రీమద్భగవద్గీతయొక్క యోగ్యత .... గీతలయందున్న అధ్యాయ పరిసమాప్తి ని సూచించు సంకల్పము....గీతాశబ్దార్థము.... అనేకములగు ఇతర గీతలయొక్క వర్ణనమును, వానియొక్కయు యోగవాసిష్ఠాదులయొక్కయు గౌణత్వము .. గ్రంథమును పరీక్షించు ప్రకారము .... భగవద్గీతలయొక్క అర్వాచీనమగు (ఆధునిక మగు) బహిరంగ పరీక్ష .... మహాభారతకారునిచే బెప్పఁబడిన గీతాతాత్పర్యము....ప్రస్థానత్రయమును దానిపైన సాంప్రదాయిక భాష్యములును .... తదనుసారమగు గీతాతాత్పర్యములు .... శ్రీ శంకరాచార్యులవారు....మధుసూదనులు ...తత్త్వమసి ...పైశాచభాష్యము .... రామానుజాచార్యులు .. మధ్వాచార్యులు .... వల్లభాచార్యులు .. నింబార్కాచార్యులు .. శ్రీధరస్వామి....జ్ఞానేశ్వర .. వీరందఱియొక్కయు సాంప్రదాయికదృష్టి ... సాంప్రదాయికదృష్టిని వదలి గ్రంథతాత్పర్యమును నిర్ణయించు రీతి, సాంప్రదాయికదృష్టిచే దాని నుపేక్షించుట .... గీతలయొక్క యుపక్రమోపసంహారములు....పరస్పర విరుద్ధములగు నీతిధర్మములకుఁ గల విరోధమును దానివలనఁ గలుగు కర్తవ్యధర్మమోహమును .. తన్నివారణార్థమై గీతోపదేశము....1–6

రెండవ ప్రకరణము

కర్మజిజ్ఞాస

కర్తవ్యమూఢతకు రెండు ఇంగ్లీషునందలి యుదాహరణములు ....ఈ దృష్టినే కురుభారతమునకుఁ గల మహత్త్వము.... అహింసా ధర్మమును దానియొక్క యపవాదమును, క్షమ దానియొక్క యప వాదమును .... మన శాస్త్రకారులదృష్టియొక్క శ్రేష్ఠత్వమును మహా త్త్వమును ....ప్రతిజ్ఞను పాలించుటయు దాని మర్యాదయు .... అస్తే యమును తదపవాదమును ... 'చచ్చుటకంటె జీవించియుండుట శ్రేయస్కరము' అనుదాని కపవాదము....ఆత్మసంరక్షణము....మాతా పితరులును గురువును మొదలుగా గల పూజ్యుల విషయమై కర్తవ్య మును దాని కపవాదమును .... కామము, క్రోధము, లోభము నను వాని నిగ్రహమునందలి తారతమ్యము.... ధైర్యాదిగుణములయొక్క ప్రసంగమును, దేశకాలాది మర్యాదయు....ఆచారములయొక్క తార తమ్యము .... ధర్మాధర్మములయొక్క సూక్ష్మత్వమును గీతయొక్క యపూర్వతయు 51-90

మూడవ ప్రకరణము

కర్మయోగశాస్త్రము

కర్మజిజ్ఞాసయొక్క మహత్త్వము, గీతలలోని ప్రథమాధ్యాయ మును, కర్మయోగశాస్త్రముయొక్క యావశ్యకతయు .. కర్మశబ్దము యొక్క యర్థనిర్ణయము....మీమాంసకుల మతానుసారముగ కర్మ విభాగము ....యోగశబ్దముయొక్క యర్థనిర్ణయము .... గీతలయం దున్న యోగము=కర్మయోగము, మఱియు నదియే ప్రతిపాద్యము .... కర్మాకర్మలకు పర్యాయశబ్దములు .... శాస్త్రీయప్రతిపాదనమున కాదిభౌతిక మనియు, నాధిదైవిక మనియు, నాధ్యాత్మిక మనియు మార్గ ములు మూఁడు ... ఈ మార్గములయొక్క భేదమునకు కారణము....

కాంటుయొక్క మతము ...గీతలనుబట్టి యధ్యాత్మదృష్టిశ్రేష్ఠము .... ధర్మశబ్దమునకు రెండర్థములు, పారలౌకికమును వ్యాపారమును .... వానిసూచ్యాతిగర్మములు... జగత్తును ధరించునది గాన ధర్మము.... ధర్మాధర్మనిర్ణయార్థమై సామాన్యనియమము .... 'మహాజనో యేన గత స్సపంథాః' అను నదియును దానియం దున్న దోషమును .... 'అతి సర్వత్ర వర్జయేత్' అనునదియు దానియొక్క యపూర్ణతయు.... విరోధము లేకుండ ధర్మనిర్ణయము ... కర్మయోగశాస్త్రముయొక్క కార్యము 91–131

నాల్గవ ప్రకరణము

ఆధిభౌతికసుఖవాదము

స్వరూపప్రస్తావన .... ధర్మాధర్మములను నిర్ణయించు తత్త్వములు....చార్వాకులయొక్క కేవల స్వార్థము .... స్వార్థబుద్ధివలెనే పరోపకారబుద్ధియు నైసర్గికము .. యాజ్ఞవల్క్యులయొక్క యాత్మార్థము....స్వార్థపరార్థోభయవాదము లేక(ఉదాత్త లేక ఉచ్చ)స్వార్థము .... వాని యాక్షేపము .... పరార్థప్రధానపక్షము .... ఎక్కువమంది కెక్కువ సుఖము దానిపై నాక్షేపము .... ఎక్కువమంది కెక్కువ హిత మెవనిచే మఱియు నెట్లు నిర్ణయింపవలయును .... కర్మకంటె కర్తను సంబంధించిన బుద్ధియొక్క మహత్త్వము....పరోపకార మేల చేయవలయును . మనుష్యజాతియొక్క పూర్ణావస్థ .... శ్రేయమును, ప్రేయమును .... సుఖదుఃఖములయొక్క యనిత్యత్వమును .... నీతి ధర్మములయొక్క నిత్యత్వమును 132–167

అయిదవ ప్రకరణము

సుఖదుఃఖవివేకము

సుఖార్థమై ప్రతిజీవునియొక్క ప్రవృత్తియు....సుఖదుఃఖముల

యొక్క లక్షణమును వానియందలి భేదమును....సుఖము స్వతంత్ర మైనదా? దుఃఖాభావరూపమైనదా? ... సన్న్యాసమార్గావలంబుల యొక్క మతము....దాని ఖండనము....గీత[illegible] .... సుఖదుఃఖము లనునవి రెండును స్వతంత్రములైన భావపదార్థములు .... ఇహలోకమునందు ప్రాప్తమగు సుఖదుఃఖములయొక్క విపర్యయము....సంసారమందు సుఖ మధికమా? దుఃఖ మధికమా? .... పాశ్చాత్యులయొక్క సుఖాధిక్యవాదము....మనుజుఁ డాత్మహత్య చెసికొనకపోవుట మాత్రముచే సంసారము సుఖమయ మని సిద్ధము కానేరదు .... సుఖేచ్ఛయొక్క యపారమగు వృద్ధి ... సుఖోపభోగముచే సుఖేచ్ఛతృప్తి పొందుట కశక్యము కావున సంసారమున దుఃఖాధిక్యము .... తదనుకూలముగ మన శాస్త్రకారుల సిద్ధాంతము.... శోపెన్ హాయర్ యొక్క మతము ... అసంతోషముయొక్క యుపయోగము దానియొక్క దుష్పరిణామమును దప్పించుకొనుటకుపాయము....సుఖదుఃఖానుభవమునకు నాత్మవశమగుట, మఱి యు ఫలాశయొక్క లక్షణము....ఫలాశను త్యజించుటచేతనే దుఃఖనివారణమగును గాన కర్మత్యాగమును నిషేధించుట.... ఇంద్రియనిగ్రహము యొక్క పరిమితి .... కర్మయోగముయొక్క చతుస్సూత్రి.... శారీరకమగు సుఖము పశుధర్మమగుట .... ఆత్మప్రసాదజనుగు (ఆధ్యాత్మిక సుఖముయొక్క శ్రేష్ఠత్వమును నిత్యత్వమును - ఈ రెండు సుఖముల యొక్క మేళన మనునదియే కర్మయోగదృష్టిచే పరమసాధ్యము ... మగు) విషయోపభోగసుఖము అనిత్యమును పరమసాధ్యమగుట కయోగ్యమును....అధిభౌతికసుఖవాదముయొక్క అసంపూర్ణత 168–216

....

ఆణవోపకరణము

అధిదైవతపక్ష, క్షేత్రక్షేత్రజ్ఞ విచారము

పాశ్చాత్యుల సదసద్వివేక దేవతాపక్షము ... దానితో సమాన

మైన మనోదేవతా విషయమై మన గ్రంథములయం దున్న వచన ములు... అధిదైవతపక్షముపై నాధిభౌతికపక్షమువారి యాక్షేపణ .... అలవాటు చేతను (అభ్యాసముచేతను) కార్యాకార్యనిర్ణయము శీఘ్ర ముగ నగును ...నదనద్వివేక మనునది వేఱైన శక్తి కాదు....అధ్యాత్మ పక్షముయొక్క యాక్షేపణము, మనుష్యదేహరూపమగు గొప్ప కర్మా గారము....కర్మేంద్రియములయొక్క యు జ్ఞానేంద్రియములయొక్క యు వ్యాపారము....మనస్సుయొక్క యు బుద్ధియొక్క యు నేర్వేఱగు కార్య ములు ... వ్యవసాయాత్మకమును వానసాత్మకమును నగు బుద్ధుల యొక్క భేదమును సంబంధమును ...వ్యవసాయాత్మికమగు బుద్ధి యొకటియే సాత్త్వికాదిభేదములచే మూఁడు విధములు .... నదనద్వి వేకబుద్ధి దానియందే యంతర్గతమగును వేఱుకాదు .... క్షేత్రక్షేత్రజ్ఞ విచారముయొక్కయు, క్షరాక్షరవిచారముయొక్క యు స్వరూపమును, కర్మయోగముతో సంబంధమును .... క్షేత్రశబ్దార్థము .... క్షేత్రజ్ఞుని యొక్క యనఁగా నాత్మయొక్క యస్తిత్వము....క్షరాక్షరవిచారము యొక్క ప్రస్తావన 217–262

ఏడవ ప్రకరణము

కాపిలసాంఖ్యశాస్త్రము–క్షరాక్షరవిచారము

క్షరాక్షరములను విచారించు శాస్త్రములు....కాణాదుల పర మాణువాదము .... కాపిలసాంఖ్యము.... సాంఖ్యశబ్దార్థము .... కాపిల సాంఖ్య విషయకమయిన గ్రంథములు....సత్కార్యవాదము .... జగ త్తునకు మూలభూతమగు ద్రవ్యము లేక ప్రకృతి యొకటియే .. సత్త్వ రజస్తమో గుణము లనునవి దానియొక్క మూఁడు భాగములు....గుణ త్రయముయొక్క సామ్యావస్థ యు నన్యోన్యమేళనముచే నానాపదా ర్థములయొక్క యుత్పత్తి యు....ప్రకృతి, అవ్యక్తము, అఖండము ఏకము, అచేతనమును....అవ్యక్తమున నుండి వ్యక్తము.... ప్రకృతి

నుండియే మనస్సును బుద్ధియును .... హెకేలు అను వానియొక్క జడాద్వైతమును, ప్రకృతినుండి యాత్మయొక్క యుత్పత్తియును సాంఖ్యశాస్త్రమునకు సమ్మతము కాదు .... ప్రకృతి పురుషు లను నీ రెండును స్వతంత్రమగు తత్త్వములు....వీనిలో పురుషుఁ డకర్తయును, నిర్గుణుఁడు నుదాసీనుఁడు నై నందున కర్తృత్వమంతయు ప్రకృతికే చెందియున్నది....రెంటియొక్క సంయోగముచే సృష్టియొక్కవ్యాప్తి ....ప్రకృతి పురుషులయొక్క భేదమును తెలిసికొనుటచే కైవల్యము (మోక్షము) లభించును....మోక్ష మెవరికి? ప్రకృతికా? పురుషునికా? సాంఖ్యమతమున పురుష లసంఖ్యులును, వేదాంతుల మతమున పురుషుఁ డొకఁడును....త్రిగుణాతీతావస్థ ... సాంఖ్యముయొక్కయు తత్సదృశమైన గీతలయొక్కయు సిద్ధాంతములయందు భేదము ....

.... 263–279

ఎనిమిదవ ప్రకరణము

విశ్వముయొక్క సృష్టిసంహారములు

ప్రకృతియొక్క విస్తారము....జ్ఞానవిజ్ఞానముల లక్షణము ... సృష్ట్యుత్పత్తిని గుఱించి వేర్వేఱగు క్రమములును తుదకు వాని కేక వాక్యతయు....అధునికమగు నుత్క్రాంతివాదముయొక్క స్వరూపమును దానికి సాంఖ్యులయొక్క గుణోత్కర్షతత్త్వముతో సాదృశ్యమును.... గుణోత్కర్షవాదముయొక్క (లేక గుణపరిణామవాదము) నిరూపణము .... ప్రకృతినుండి మొదట వ్యవసాయాత్మకబుద్ధియు పిదప నహంకారముయొక్కయు నుత్పత్తి .... దానియొక్క త్రిభూతముచే ననంతభేదములు .... అహంకారమునుండి బయలుదేఱిన సేంద్రియ సృష్టియందు మనస్సుతోఁగూడ పదునొకండగు తత్త్వములయొక్కయు నింద్రియసృష్టియందు తన్మాత్రరూపము లయిన యైదు తత్త్వముల యొక్క యుత్పత్తి ...తన్మాత్ర లై దేల యుండవలయును? సూక్ష్మం

ాదియములు పదునొకం డేల కావలయును? అను దానికి కారణము ....సూక్ష్మసృష్టి యందుండి స్థూలమగు విశేషము .... ఇరువదియైదు తత్త్వములు గల బ్రహ్మాండవృక్షము...అనుగీతలయందున్న బ్రహ్మ వృక్షమును గీతలయందున్న యశ్వత్థవృక్షము .... ఇరువది యైదు తత్త్వములను వర్గీకరణముచేయు సాంఖ్యులయొక్కయు వేదాంతుల యొక్కయు వేర్వేఱగు రీతులు....వాని కోష్టకము ...స్థూలములగు పంచమహాభూతముల యొక్క యుత్పత్తి విషయమై వేదాంత గ్రంథ ములయందు వర్ణింపఁబడిన క్రమము.... మఱియు పిదప పంచీకరణ ముచే స్థూలపదార్థము లన్నియు .... ఉపనిషత్తుల యందున్న త్రివృ త్కరణముతో దానిని పోల్చుట....సజీవసృష్టియు లింగశరీరమును.... వేదాంతమునందలి లింగశరీరమునకును సాంఖ్యుల లింగశరీరము నకును భేదము... బుద్ధియొక్క భావమును వేదాంతములయం దున్న కర్మయు ప్రళయము.... ఉత్పత్తిప్రళయకాలములు.... కల్పయుగ మానములు .... బ్రహ్మదేవునియొక్క రేయింబవళ్లును మొత్తముపై నాతని యాయుర్దాయమును ... ఇతరములగు సృష్ట్యుత్పత్తిక్రమము లతో విరోధమును, ఏకవాక్యతయును 298-847

తొమ్మిదవ ప్రకరణము

అధ్యాత్మము

ప్రకృతియు పురుషుఁడు నను ద్వైతముపై నాక్షేపము .... ఈ రెండింటికంటె పరమందున్న వానిని విచారించు పద్ధతి....ఈ రెం డింటికంటెను పరమందున్నవాడు పరమాత్మ....అతఁ డొక్కఁడే లేక పరపురుషుఁ డొక్కడే .... ప్రకృతి (జగత్తు) పురుషుఁడు (జీవుఁడు) పరమేశ్వరుఁడను నీ మువ్వురు .... గీతలయందు వర్ణింపఁబడిన పర మేశ్వర స్వరూపము .... వ్యక్తము లేక నగుణమునగు రూపమును దానియొక్క గొఱత్వమును .... అవ్యక్తమైనను మాయచే వ్యక్త

మగును .... అవ్యక్తమునకే సగుణమనియు, నిర్గుణమనియు సగుణ నిర్గుణమనియు మూఁడు భేదములు.... ఉపనిషత్తులలోని తత్సిద్ధాంత మగు వర్ణనము....ఉపనిషత్తులయం దుపాసనార్థమై చెప్పఁబడిన విద్యలును ప్రతీకములును .... మూఁడు విధములకు నవ్యక్తరూపముల యందును నిర్గుణమే శ్రేష్ఠము....పై సిద్ధాంతమునకు శాస్త్రీయమగు నుపపత్తి....నిర్గుణమునకును సగుణమునకును గూఢమగు నర్థము ... అమృతత్వమునకు స్వభావసిద్ధమైన కల్పన .... సృష్టిజ్ఞాన మెట్లు గల్గును? మఱియు నెవరికిఁ గల్గును? .... జ్ఞానక్రియయొక్క వర్ణనమును, నామరూపములయొక్క వ్యాఖ్యయు .... నామరూపము లను దృశ్యమును వస్తుతత్త్వమును....నశ్వరమయొక్క వ్యాఖ్యానము .... నామరూపములు నశ్వరము లైనందున ననశ్వరమునైనవియు, వస్తుతత్త్వము నిత్యమైనందున సత్యమైనదియు ....వస్తుతత్త్వమునదియే యక్షరబ్రహ్మము మఱియు నామరూపము లనునది మాయ ...సత్యశబ్దమునకు మిథ్యాశబ్దమునకును వేదాంతమునందలి యర్థము .... అధిభౌతికశాస్త్రములు వేదాంతమునందలి యర్థము .... అధిభౌతిక శాస్త్రములు నామరూపాత్మకములు .... విజ్ఞానవాదము వేదాంతులకు గ్రాహ్యము కాదు....మాయావాదము ప్రాచీనమైనది....నామరూపములచే నాచ్ఛాదింపఁబడిన నిత్యబ్రహ్మాయొక్కయు శారీరమగు నాత్మయొక్కయు స్వరూప మొక్కటియే .... ఇరువురును చిద్రూపు లనియే చెప్పుదురు .... బ్రహ్మైక్యమనఁగా 'పిండమందున్నదే బ్రహ్మాండమందున్నది',....బ్రహ్మానందము....నేను అనుదానికి మరణము తురీయావస్థ లేక నిర్వికల్పసమాధి .... అమృతత్వముయొక్క హద్దు మఱియు మరణముయొక్క మరణము .... ద్వైతవాదముయొక్క యుత్పత్తి....గీతలును నుపనిషత్తులును నద్వైతవేదాంతమునే ప్రతిపాదించుచున్నవి .... సగుణమగు మాయ నిర్గుణమం దెట్లుత్పత్తి యగుచున్నది? .... వివర్తవాదమును గుణపరిణామవాదమును .... జగత్తు,

జీవుడు, పరమేశ్వరుఁడు అనువారి విషయమై యధ్యాత్మశాస్త్రము యొక్క సంక్షిప్తమగు సిద్ధాంతము....బ్రహ్మయొక్క సత్యతయు నసత్యతయు.... ఓం తత్సత్ మొదలుగాఁగల బ్రహ్మనిర్దేశము.... జీవుఁడు పరమేశ్వరునియొక్క 'అంశ' మెట్లగును?....పరమేశ్వరుఁడు దిక్కాలాదులచే నపరిచ్ఛిన్నుఁడు.... అధ్యాత్మశాస్త్రముయొక్క చరమ సిద్ధాంతము .... దేహాదియములయందు నిండియున్న సామ్యబుద్ధి .... మోక్షస్వరూపముయొక్కయు సిద్ధావస్థయొక్కయు వర్ణనము .... ఋగ్వేదమునందున్న నానదీయసూక్తము నర్థముతోవివరించుట.... పూర్వాపరప్రకరణముల సంగతి 348-466

గీతారహస్యము వందలి సంక్షిప్తములగు చిహ్నముల వ్యాఖ్యానము, సంక్షిప్తచిహ్నములచే చూపింపఁబడిన గ్రంథముల విషయమై పరిచయము

అథర్వ: అథర్వవేదము. కాండము, సూక్తము, ఋక్కులు, అను క్రమముచే సంఖ్య.

అష్టా: అష్టావక్రగీత. అధ్యాయము, శ్లోకమును. అష్టకర్, మఱియు సంఘమునొక్క గీతాసంగ్రహపుస్తకము.

ఈశ: ఈశావాస్యోపనిషత్తు. ఆనందాశ్రమములోఁ బ్రచురింపఁ బడినది.

ఋ: ఋగ్వేదము. మండలము, సూక్తము, ఋక్.

ఐ. లేక ఐ. ఉ: ఐతరేయోపనిషత్తు. అధ్యాయమును, ఖండమును, శ్లోకములును, ఆనందాశ్రమము, సంస్కరణము.

ఐ.బ్రా: ఐతరేయబ్రాహ్మణము. పంచికయు, ఖండమును. డా॥ హోదాయొక్క సంస్కరణము.

క. లేక కఠ: కఠోపనిషత్తు. వల్లియు, మంత్రమును, ఆనంద, సంస్క.

కేన: కేనోపనిషత్తు (= తలవకారోపనిషత్తు). ఖండమును, మంత్రమును. ఆనంద. సంస్క.

కై: కైవల్యోపనిషత్తు. ఖండమును, మంత్రమును. 28 ఉపనిషత్తులు నిర్ణయ, సాగరమున సంస్కరింపఁబడినది.

కౌ: కౌషీతక్యుపనిషత్తు, లేక కౌషీతకీబ్రాహ్మణోపనిషత్తు. అధ్యాయమును, ఖండమును. కొన్ని చోట్ల నీ యుపనిషత్తుయొక్క ప్రథమాధ్యాయమునే బ్రాహ్మణానుక్రమమున తృతీయాధ్యాయమని చెప్పుదురు. ఆనంద. సంస్క.

గా: తుకారాం బువాగారి గాథ. దామోదరసాంబళారామ సంస్కరణము. సన్. 1900.

గీ: భగవద్గీత. అధ్యాయము, శ్లోకమును.

గీ.శాం.భా: గీతాశాంకరభాష్యము.

గీ.రా.భా: గీతారామానుజభాష్యము.

గీతలకును శాంకరభాష్యమునకును ఆనందాశ్రమములో ముద్రింపఁబడిన పుస్తకము చివర అకారాదిక్రమముగ శబ్దములసూచి యుండినందున దానికర్తకు నేను చాల కృతజ్ఞుఁడను. రామానుజభాష్యము వేంకటేశ్వర సమాచార ముద్రాలయమున ముద్రింపఁబడినది; మాధ్వ భాష్యము కుంభకోణమునందున్న కృష్ణాచార్యులవారిచే ముద్రింపఁబడినది. ఆనందగిరియొక్క టీకయు పరమార్థ ప్రపయను వ్యాఖ్యానమును, జగద్ధితేచ్ఛు ముద్రణాలయమునందు ముద్రింపఁబడినవి. శ్రీధరీయము, వామని (మరాటీ వ్యాఖ్యానము) నిర్ణయసాగరమున ముద్రింపఁబడినవి. పైశాచ్యభాష్యము ఆనందాశ్రమములో ముద్రింపఁబడినది. వల్లభసంప్రదాయానుసారియగు తత్త్వదీపిక గుజరాతీ ప్రింటింగ్‌ప్రెస్సులో ముద్రింపఁబడినది. బొంబయిలో నున్న మహాభారతమునందు నీలకంఠీయమచ్చువడినది. బ్రహ్మానంది ముద్రపురిలో నచ్చువడినది. ఈ వ్యాఖ్యానము లన్నియుఁ జూడఁబడినవి. కాని వీనిలో పైశాచ

భాష్యమును బ్రహ్మానందియుఁ దక్క మిగిలిన వన్నియు నింబార్కనంప్రదాయముయొక్క టీకతోడను ఇంకను కొన్ని టీకలతోడను కలిపి 15 టీకలతో గుజరాతీప్రింటింగ్ ప్రెస్సునందు ప్రస్తుతమునందే ముద్రించి ప్రకటించి నందున యీ యొక గ్రంథముచేతనే యన్నిపుస్తకముల యుపయోగము గల్గును.

గీ.ర. లేక గీతా.ర: గీతారహస్యము. నా పుస్తకముయొక్క మొదటి భాగము.

ఛాం: ఛాందోగ్యోపనిషత్తు. అధ్యాయము, ఖండము, మంత్రము అనంద. సంస్క.

జై.సూ: జైమినియొక్క మీమాంసాసూత్రములు. అధ్యాయము, పాదములు, సూత్రములు. కలకత్తా సంస్కరణము.

జ్ఞా: జ్ఞానేశ్వరీ. అర్థసహితము. ఇందిరాముద్రాలయము. సంస్క.

తుకా.గా: తుకారాంబువాగారి గాథ. పైన. గా. చూడు.

తై. లేక తై. ఉ: తైత్తిరీయోపనిషత్తు. వల్లి, అనువాకము, మంత్రము. అనంద. సంస్క.

తై.బ్రా: తైత్తిరీయబ్రాహ్మణము. కాండము, ప్రపాఠకము, అనువాకము, మంత్రమును అనంద. సంస్క.

తై.సం: తైత్తిరీయసంహిత. కాండము, ప్రపాఠకము, అనువాకము, మంత్రమును.

దా. లేక దాస: శ్రీనమర్థులవారిచే చేయఁబడిన దాసబోధము. ధుల్యసక్తార్యోత్తేజక నభయొక్క సంస్కరణము. చిత్రశాల ముద్రాలయమునం దచ్చుపడినది కాండీయనువాద (?)

నా.పం: నారద పంచరాత్రములు. కలకత్తా సంస్కరణము.

నా.సూ: నారద సూత్రములు. బొంబయి సంస్కరణము.

నృసింహ.ఉ: నృసింహోత్తరతాపనీయోపనిషత్తు.

పాతంజల.సూ: పాతంజలయోగసూత్రములు. తుకారాంతాత్యా సంస్కరణములు.

పంచ: పంచదశీ. నటీకము. నిర్ణయసాగర సంస్కరణము.

ప్రశ్న: ప్రశ్నోపనిషత్తు. ప్రశ్నమును, మంత్రమును, ఆనం. సంస్కరణము.

బృ. లేక బృహ: బృహదారణ్యకోపనిషత్తు. అధ్యాయము, బ్రాహ్మణము. మంత్రము. ఆనం. సంస్క. సామాన్యముగ కాణ్వ పాఠము గ్రహింపఁబడినది. ఒకప్రదేశమునందు మాత్రము మాధ్యందినశాఖయొక్క పాఠము మాత్ర ముల్లేఖింపఁబడినది.

బ్ర. సూ: ముందున్న వేదాంతసూత్రము చూడు.

భాగ: శ్రీమద్భాగవతపురాణము. నిర్ణయసాగర సంస్కరణము.

భా. జ్యో: భారతీయ జ్యోతిశ్శాస్త్రము. కై. శంకరబాలకృష్ణ దీక్షిత కృతము.

మత్స్య: మత్స్యపురాణము. ఆనం. సంస్కరణము.

మను: మనుస్మృతి. అధ్యాయము, శ్లోకమును. డా. జాలియొక్క సంస్కరణము. కాని మండలీకునియొక్క, లేక యింక మఱి యెవరియొక్క సంస్కరణమునందు నీ శ్లోకములే తఱుచుగ నిచ్చోటనే కాన్పించును. మనుస్మృతిమీది టీక మండలీకుని సంస్కరణమునం దున్నది.

మ.భా: శ్రీమన్మహాభారతము పిమ్మట నున్న యక్షరములు వె వ్వేఱు పర్వములును అంకెలును అధ్యాయములకు శ్లోక ములను సూచించునవి. బాబు ప్రతాపచంద్రరాయనిచే కలకత్తాలో ముద్రింపింపఁబడిన సంస్కృతప్రతినే నే నన్ని చోట్ల నుపయోగించినాను. బొంబయిప్రతిలో నీ శ్లోక ములు చూడవలయునేని కొంచెము వెనుకముందుగ దొరకును.

మి.ప్ర: మిళిందప్రశ్నము. పాళీగ్రంథము. ఇంగ్లీషుభాషాంతరము S.B.E.

ముం: ముండకోపనిషత్తు. ముండకము, ఖండకము, మంత్ర మును. ఆనంద. సంస్క.

మైత్ర్యు: మైత్ర్యుపనిషత్తు, లేక మైత్రాయణ్యుపనిషత్తు. ప్రపాఠక మును, మంత్రమును. ఆనం. సంస్క.

యాజ్ఞ: యాజ్ఞవల్క్యస్మృతి. అధ్యాయమును, శ్లోకమును. బొంబయిప్రతి. దీనిపై అపరార్కుని టీకయు. (ఆనంద. సంస్కరణము) ఒకటి రెండు చోట్ల నుల్లేఖింపఁబడినది.

యో. లేక యోగ: యోగవాసిష్ఠము. ప్రకరణము, సర్గ, శ్లోకము. ఆఱవ ప్రకరణమునకు పూర్వార్ధమునకు (పూ.) అనియు ఉత్తరార్ధమునకు (ఉ) అనియు రెండు భాగము లున్నవి. సటీకముగ నిర్ణయసాగర ముద్రాలయములో సంస్కరింపఁబడినది.

రామ.పూ: రామపూర్వతాపిన్యుపనిషత్తు. ఆనంద. సంస్క.

వాజ.సం: వాజసనేయసంహిత. అధ్యాయము, మంత్రమును. వేబరనువాని సంస్కరణము.

వాల్మీకి.రా. లేక వా.రా: వాల్మీకిరామాయణము. కాండము, సర్గము, శ్లోకముల, బొంబయి సంస్కరణము.

విష్ణు: విష్ణుపురాణము. అంశము, అధ్యాయము, శ్లోకములు. బొంబయి సంస్కరణము.

వే. సూ: వేదాంతసూత్రములు లేక బ్రహ్మసూత్రములు. అధ్యాయము, పాదము, సూత్రము. వే.సూ.శాం.భా. వేదాంత సూత్రములు— శాంకరభాష్యము ఆనందాశ్రమములో ముద్రింపఁబడిన ప్రతియే యంతట నుపయోగింపఁబడినది.

శాం.సూ: శాండిల్యసూత్రములు బొంబయిలో సంస్కరింపఁబడినది.

శివ: శివగీత. అధ్యాయము, శ్లోకము. అష్టేకర్ సంఘము యొక్క గీతాసంగ్రహ సంస్కరణము.

శ్వే: శ్వేతాశ్వతరోపనిషత్తు. అధ్యాయము, మంత్రమును ఆనంద. సంస్కరణము
S. B. E. Sacred Books of the East Series.

సాం. కా: సాంఖ్యకారిక. తుకారాంతాత్యాగారిచే సంస్కరింపఁబడినది.

సూర్య.గీ: సూర్యగీతా. అధ్యాయము, శ్లోకములు. ముద్రపురిలో సంస్కరింపఁబడినది.

హరి: హరివంశము. పర్వము, అధ్యాయము, శ్లోకము. బొంబయిలో సంస్కరింపఁబడినది.

టిప్పణి: ఇదియేగాక యింక ననేకములగు, సంస్కృతగ్రంథములు, ఆంగ్లగ్రంథములు, పాళీగ్రంథములును ఒకడ నుల్లేఖింపఁబడినవి, కాని వాని పేర్లు తఱుచుగ నక్కడనే వ్రాయఁబడియుండుటచే, లేక తెలిసికొనుటకు వీలుగనుండుటచే నవి పై పట్టికలో నుదాహరింపఁ బడలేదు.

శ్రీమద్భగవద్

గీతారహస్యము

శ్రీ గణేశాయ నమః

ఓమ్ తత్సత్

శ్రీమద్భగవద్

గీతా రహస్యము

అను

కర్మయోగశాస్త్రము

ప్రథమ ప్రకరణము

విషయ ప్రవేశము

• నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్,
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

శ్రీమహాభారతము, ప్రథమశ్లోకము.

శ్రీ మద్భగవద్గీత యనునది మనకున్న ధర్మగ్రంథములలో నత్యంత తేజస్స్వంతమును నిర్మలమునగు నొక రత్నముగా నున్నది.

• నారాయణుని, నరులలో నుత్తముఁడగు నరుని, వేదవ్యాసుని, సరస్వతీ దేవిని నమస్కరించి తరువాత జయము (మహాభారతము)ను జదువవలయును. పూర్వము నరనారాయణు లను నిద్దరు మహర్షులుగ నవతరించిరని. తరువాత నా నరనారాయణులే శ్రీకృష్ణార్జునులుగ నవతరించి రని శ్రీ మహాభారతములో నున్నది (మ.భా.ఉ. 48.7-9, 20-22; వన. 12.44-48). ఈ నరనారాయణులే విస్తారమగు నారాయణీయము (భాగవతధర్మము)ను ప్రవర్తింపఁ జేసిరి. కావుననే భాగవతధర్మమున కోధించు నన్ని గ్రంథముల యారంభమున వీరినే నమస్కరింతురు. ఈ శ్లోకమున 'వ్యాసం' అనుచో 'వైవ' అను పాఠాంతరము కలదని కొంద ఱందురు; కాని మా కది మంచిదని తోఁపదు వేడు. ఏయన- భాగవతధర్మములను నారాయణమహర్షి ప్రవర్తింపఁ జేసినను, ఈ ధర్మములలోని ముఖ్యగ్రంథములగు భారతభగవద్గీతలను వ్రాసిన వ్యాసులవారిని నమస్కరించుట మంచిదని తోఁచుచున్నది. మహాభారతమున పూర్వులు జయ మని పేర్కొనియున్నారు (మ. భా. అ. 62.20).

పిండబ్రహ్మాండ జ్ఞానపూర్వకముగ గూఢమును పవిత్రమునగు నాత్మ విద్యాతత్త్వమును సంగ్రహముగనే కాక నిస్సంశయనుగ సైతము చెప్పుచు నా యాధారమున మనుష్యమాత్రులకుఁ దమ యాధ్యాత్మిక పూర్ణావస్థను (పరమపురుషార్థమును) దెల్పుచు దానితోఁ గూడ భక్తి కేనియు, జ్ఞానమున కేనియుఁ, దుద కీ రెంటికిని శాస్త్రములనఁ గలి గిన వ్యవహారమునకు యుక్తియుక్తమును మనోహరమునగు సంబం ధము నేర్పఱచి సంసారమున భ్రమించు జనుల మనములకు శాంతిని, విశేషముగ నిష్కామ కర్తవ్యాచరణము (ఫలమును గోరకయే శాస్త్ర విహితములగు కర్మలను చేయుట) నందుఁ బ్రవృత్తిని గలిగించు నిట్టి బాలబోధగ్రంథము సంస్కృతముననే కాక ప్రపంచములోని యే వాఙ్మయప్రపంచమునను దొరకుట కడు దుర్లభము. ఈ గ్రంథమును గేవల కావ్యదృష్టితోఁ బరిశీలించినను, నాత్మజ్ఞానమొయిక్క యనేక గూఢసిద్ధాన్తములను సులభశైలి నాబాలవృద్ధమునకు బోధపఱచుచు జ్ఞానముతోఁ గూడిన భక్తిరసమునే నిండారుచున్నది గాన నీ గ్రంథ ముత్తమ కావ్యములలో గణింపఁబడును. ఐనను నకల వైదికధర్మ సారము నే గ్రంథమున భగవద్వాక్యముచేఁ జెప్పఁబడియెనో యట్టి గ్రంథమొయిక్క యోగ్యత యింత యని చెప్ప నెవ్వరి తరము? భారతయుద్ధ మైన పిదప నొకనాఁడు శ్రీకృష్ణార్జునులు ప్రేమతోఁ బర స్పరము మాటలాడుకొనునపు డర్జునుఁడు భగవన్ముఖమునుండి గీతల మరల వినఁదలంచి శ్రీకృష్ణభగవానునితో- "యుద్ధారంభమున నీవు దేసిన యుపదేశము మఱచితి. మరలఁ గృపతో ననుగ్రహింపవలయు" నని యడుగ "ఆ యుపదేశ మప్పు డత్యంత యోగయుక్తమగు మనస్సుతోడం జేయఁబడినది గాన నా విషయ మా రీతిగనే మరలఁ జెప్పుట నాకును నశక్యమే" యని భగవంతుఁ డతనికి నుత్తరము చెప్పెవని యనుగీతారంభమునఁ జెప్పఁబడినది. (మ.భా. అశ్వమేధ అ. 16 శ్లో. 10-18).

నిజముగ నాలోచించిన భగవంతున కశక్య మేదియు లేదు. అయినను భగవంతుఁడు సైతము మరలఁ జెప్ప నశక్యమనుటఁ జూడ గీతామహత్త్వ మెంత గొప్పదియో నుస్పష్ట మగును.

వైదికధర్ములలో వేఱువేఱు సంప్రదాయములకు వేదము వలె నీగ్రంథము సుమారు 2500 సంవత్సరములనుండి యెల్లవారలకు నేకరీతిగ మాన్యమును ప్రమాణము నగుటకు భగవంతుఁ డిట్లు చెప్పుటయే కారణము. కావుననే-

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః,
పార్థో వత్సస్సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్.

- ఉపనిషత్తు లన్నియు గోవులు; శ్రీకృష్ణభగవానుఁడు పాలు పితుకువాఁడు; బుద్ధిశాలియగు నర్జునుఁడు (ఆ గోవులకుఁ జేరువ దీయునట్టి) భోక్తయగు వత్సము (లేఁగదూడ); (ఇట్టి యపూర్వ సామగ్రిఁ గూర్చి) పితుకఁబడిన క్షీరమే గీతామృతము-

అని స్మృతులకాలములో నేర్పడిన గ్రంథములోని గీతాధ్యాన శ్లోక మలంకారయుక్తమైనను యథార్థమునే చెప్పుచున్నది. హిందూస్థానములోని యన్ని ప్రాకృతభాషలలోను దీనికి వ్యాఖ్యానములును, భాషాన్తరీకరణములును, నిరూపణలును జేయఁబడి యున్న వనుటలో నేమియు నాశ్చర్యము లేదు. ఇంటియకాక పాశ్చాత్యులకు సంస్కృతమునఁ బ్రవేశము కలిగిన పిదప ఫ్రెంకు, లాటిన్, జర్మన్, ఫ్రెంచి, ఇంగ్లీషు లోనగు భాషలలోనికిని, ఆ భాషలలోనుండి సైత మితర భాషలలోనికిని దర్జుమా చేయఁబడుచు నీ యప్రతిమ గ్రంథరాజ మిప్పటి కన్ని దేశములయందును ప్రసిద్ధిఁ గాంచినది.

సర్వోపనిషత్సార మీ గ్రంథమం దంతర్భూతమగుటయే కాక యీ గ్రంథమునకు "శ్రీమద్భగవద్గీతా-ఉపనిషత్" అనునది సంపూర్ణ నామమైయున్నది. గీతలలోఁ బ్రత్యధ్యాయాంతమునందును

నధ్యాయసమాప్తి ని సూచించు సంకల్పములో "ఇతి శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే," ఇవి మొదలగు శబ్దములున్నవి. ఈ సంకల్పము మూలభారతములో లేకున్నను గీతాగ్రంథముయొక్క పుస్తకము లన్నింటిలో నియతముగ నుండుట వలన నియమపూర్వకమగు పారాయణమునకై భారతమునుండి గీత లను వేఱుపఱచినది మొదలు (గీతలపై నే వ్యాఖ్యానముం బుట్టక మునుపటినుండియు) నీ సంకల్పము ప్రచారములో నున్నదని యను మానప్రమాణముచే నిశ్చయింపఁబడినది. ఈ దృష్టిచే గీతాతాత్పర్య మును నిర్ణయించుటవలన ని సంకల్పమున నేమి మహత్త్వ మున్న దనియు ముందుఁ జెప్పఁబడును. మొట్టమొదట నీ సంకల్పములోని "భగవద్గీతాసు-ఉపనిషత్సు" అను నీ రెండుపదములను విచారింపవలసి యున్నది. 'ఉపనిషత్' అను ని శబ్దము మహారాష్ట్రాది భాషలలో నపుంసక మయినను సంస్కృతమున స్త్రీలింగమే; కావున "భగ వంతునిచే గానము చేయఁబడిన (చెప్పఁబడిన) యుపనిషత్తు" అను నీ యర్థమున 'భగవద్గీతా-ఉపనిషత్' అని విశేష్యవిశేషణభావము రెంటికిం గుదిరినది. గ్రంథ మొక్కటియైనను గౌరవార్థమున బహువచన ప్రయోగములువాడుకలో నుండుటవలన 'శ్రీమద్భగవద్గీతాసు-ఉప నిషత్సు' అని నిప్పటి బహువచనాంత ప్రయోగము చేయఁబడినది. ఈ కారణముననే యాచార్యులవారి భాష్యములోఁ గూడ 'ఇతి గీతాసు' అని బహువచనప్రయోగము చేయఁబడినది. ఐనను సంగ్ర హముగఁ జెప్పునప్పు డాదరార్థక బహువచనమును శ్రీ మదిత్యాదిపద మును జివరనున్న జాతివాచక సామాన్యశబ్దమగు నుపనిషచ్ఛబ్దమును దీసివైచి కేన, కఠ, ఛాందోగ్యాది సంక్షిప్తనామములవలె 'శ్రీమద్భగ వద్గీతా-ఉపనిషత్' అను ప్రథమైక వచనాంతద్వయమును, మొదట 'భగవద్గీతా' అనియు రాను రాను 'గీతా' అనియు నతిసంగ్రహముగ వాడఁబడినది. ఉపనిషచ్ఛబ్దము మొదటినామములో లేనియెడల,

భారతం, భాగవతం, గోపీగీతం, ఇత్యాది శబ్దములవలె నీ గ్రంథ నామము భగవద్గీతమని యేనియు గీత మని యేనియు నపుంసక లింగముగనే ప్రయోగింపఁ బడియుండును. అట్లు గాక భగవద్గీత యనియు, గీతయనియు స్త్రీలింగరూపప్రయోగమే యంతటఁ గానఁ బడుచుండుట వలన నుపనిషచ్ఛబ్ద మెల్లపు డధ్యాహార్యమని తెలియ నగును. అర్జునమిశ్రవిరచితమగు ననుగీతావ్యాఖ్యానమునకును, గీతా శబ్దమునకు నిట్లే యర్థము చెప్పఁబడినది.

ఐనను గీతాశబ్ద మేడువందలశ్లోకముల భగవద్గీతను మాత్రమే చెప్పక రూఢ్యర్థమువలన నితరములగు ననేక జ్ఞానబోధక గ్రంథముల సైతము చెప్పుచున్నది. మహాభారతమున శాంతిపర్వాంతర్గతమోక్ష ధర్మపర్వములోని కొన్ని చిన్న ప్రకరణములకు, పింగళగీత, శంపాకగీత, మంకిగీత, బోధ్యగీత, విచఖ్యుగీత, హారీతగీత, వృత్ర గీత, పరాశరగీత, హంసగీత, లోనగునామము లుండుటయు, నశ్వ మేధపర్వములోని యనుగీతలో నొక భాగమునకు బ్రహ్మగీత యని వేఱుగ నొకనామ ముండుటయు, నిందుకుఁ దార్కాణము. ఇంతియ కాక, అవధూతగీత, అష్టావక్రగీత, ఈశ్వరగీత, ఉత్తరగీత, కపిలగీత, గణేశగీత, దేవీగీత, పాండవగీత, బ్రహ్మగీత, భిక్షుగీత, యతిగీత, రామగీత, వ్యాసగీత, శివగీత, సూతగీత, సూర్యగీత మున్నగు ననేక గీతలు సుప్రసిద్ధములుగ నున్నవి. వీనిలోఁ గొన్ని స్వతంత్రరీతిగ నిరూపింపఁబడినవియు, మఱికొన్ని వేర్వేఱు పురాణములలోనివియు నైయున్నవి. ఎట్లన- గణేశగీత గణేశపురాణము చివరఁ గ్రీడాఖండము 138, 148 యధ్యాయములలో నున్నది. అది కొంచెము శబ్దభేదమున భగవద్గీతకు సరియగు ప్రతిబింబ (ద్వితీయరూప) మనుట యేమియు బాధకము గాదు. ఈశ్వరగీత కూర్మపురాణోత్తరభాగమున మొదటి పదునొకం డధ్యాయములలో నున్నది. తర్వాతి యధ్యాయములలో వ్యాసగీత యారబ్ధ మైనది. మఱియు స్కాందపురాణాంతర్గత

సూతసంహితఁ జతుర్థప్రకరణమగు యజ్ఞవైభవఖండములో నుపరి భాగమునఁ బ్రథమాధ్యాయము మొదలు పండ్రెండవయధ్యాయము వఱకు బ్రహ్మగీతయు, తరువాతి యెనిమిది యధ్యాయములలో సూతగీతయు నున్నవి. స్కాందపురాణములోని యీ బ్రహ్మగీతకన్న వేఱగు మఱియొక బ్రహ్మగీత యోగవాసిష్ఠమున నిర్వాణప్రకరణమున నుత్తరార్ధములో 17వ సర్గ మొదలు 181 వ సర్గ వఱకు నున్నది. యమగీత మూఁడు విధములఁ గనున్నది. అందు మొదటిది విష్ణు పురాణము తృతీయాంశమున నేడవ యధ్యాయమునను, రెండవది యగ్నిపురాణమునఁ దృతీయఖండములో 381 వ యధ్యాయము నను, మూఁడవది నృసింహపురాణమున నెనిమిదవ యధ్యాయమున నున్నది. రామగీతసంగతియు నిట్లేయున్నది. మైపునఁ బ్రచారము లోనున్న రామగీత యధ్యాత్మ రామాయణమున నుత్తరకాండములో నయిదవసర్గలో నున్నది. ఈ యధ్యాత్మరామాయణము బ్రహ్మపురా ణములో నొక భాగముగ సంగీకరింపఁ బడుచున్నది. ఇంతియకాక రెండవరామగీత చెన్నపురి ప్రాంతమున ప్రసిద్ధమగు 'గురుజ్ఞాన వాసిష్ఠ-తత్త్వసాహాయణ' నామకగ్రంథమునం దున్నది. ఈ గ్రంథము వేదాంతసంబద్ధమై జ్ఞాన, ఉపాసన, కర్మ లను మూఁడు కాండములలోఁ గూడి యున్నది. పై గ్రంథములో నుపాసనాకాండ ద్వితీయ పాదములోని మొదటి పదునెనిమిది యధ్యాయములలో రామగీత యున్నది. మఱియు మూఁడవదియగు కర్మకాండయొక్క తృతీయ పాదములోని మొదటి యైదధ్యాయములలో సూర్యగీత యున్నది. శివగీత పద్మపురాణములోఁ బాతాళఖండములో నున్నదని చెప్పుదురు; కాని పునహా లో నానందాశ్రమ ముద్రాశాలాముద్రితమగు పద్మపురాణములో శివగీత కానరాదు. పండిత జ్వాలాప్రసాదుగారు తమ యష్టాదశపురాణదర్శన మను గ్రంథమున గౌడీయపద్మోత్తర పురాణమున శివగీత యున్నదని చెప్పిరి. నారదపురాణములో నితర

పురాణములకువలెఁ బద్మపురాణమునకుఁ జెప్పబడిన విషయాను క్రమణికలో శివగీత పేర్కొనఁ బడియున్నది. ఇంతియగాక శ్రీమద్భాగవత పురాణములో నేకాదశస్కంధమునఁ బదుమూఁడవ యధ్యాయమున హంసగీతయు నిరువదిమూఁడవ యధ్యాయమున భిక్షుగీతయు నున్నవి. మూఁడవస్కంధములోని కాపిలేయోపాఖ్యాన మును (28-33) 'కపిలగీత' యని యనేకులు వ్యవహరించు చున్నారు; కాని 'కపిలగీత' యని ప్రత్యేకముగ ముద్రితమైన స్వతంత్రగ్రంథము మాయొద్ద నున్నది. ఈ కపిలగీత హఠయోగ ప్రధానమైనది. ఇది పద్మపురాణాంతర్గత మని దానియందే వ్రాయఁ బడి యున్నది. ఐన నిది పద్మపురాణమున దొరకమియ కాక యిందొకచో (4-7) జైన, జంగమ (లింగాయత), సూఫీల (మునల్మానుసాధువుల) యుల్లేఖ ముండుటచేఁ దురుష్క సామ్రాజ్యా నంతర మీ గీత వ్రాయఁబడియుండునని చెప్పవలసియున్నది. భాగవతపురాణమునంబోలె దేవీభాగవతమునను నేడవస్కంధమున 31వ యధ్యాయము మొదలు 40వ యధ్యాయమువఱకు నొక గీత యున్నది. దీనిని దేవి చెప్పుటచే 'దేవీగీత' యని యందురు. ఇంతియగాక భగవద్గీతాసారమే యగ్నిపురాణ తృతీయ ఖండమున 380వ యధ్యాయమునను, గరుడపురాణపూర్వఖండమున 242వ యధ్యాయమునను గలదు. అటులే యోగవాసిష్ఠ మను గ్రంథము రామావతారమున వసిష్ఠునిచే రామున కుపదేశింపఁబడిన దని చెప్పఁ బడినను, ఈ పురాణముననే యర్జునోపాఖ్యాన మనుపేరఁ గృష్ణా వతారమున భగవంతునిచే నర్జునునకుఁ జెప్పబడిన భగవద్గీతాసారము భగవంతుఁ డర్జునున కుపదేశించిన యనేక శ్లోకముల యానుపూర్వితోఁ గూడ నిర్వాణప్రకరణమున నువిపులముగ నున్నది. (యోగ. 6. పూ. సర్గ. 32-38) శైవపురాణములో నచ్చుపడిన పద్మపురాణములో శివగీత లే దని యిదవఱకే చెప్పియున్నాము; కాని శివగీత లేకపోయినను, ఈ ప్రతియొక్క యుత్తరఖండములో అ. 171 మొదలు 188 వఱకు

భగవద్గీతామాహాత్మ్యము వర్ణింపఁబడియుండుటయే కాక భగవద్గీతల లోని యొక్కొక యధ్యాయములోని మాహాత్మ్యమును గుఱించి యొక్కొక యధ్యాయము రచింపఁబడియున్నది. దానిలో నీ సంబంధమైన కథ సూచింపఁబడి యున్నది. ఇదియునుం గాక వరాహపురాణములో నొక గీతామాహాత్మ్యము గలదు. శైవపురాణమునలో వాయుపురాణమునలో మూఁడవ విధమగు మఱియొక గీతామాహాత్మ్యము గలదని చెప్పుదురు; గాని కలకత్తాలో ముద్రితమైన వాయుపురాణములో నది కానరాదు. గీతాధ్యాన మను నొక నవశ్లోకీ ప్రకరణము భగవద్గీతయొక్క ముద్రితపుస్తకముల యారంభమునలే యున్నది. ఈ నవశ్లోకి యెచ్చటనుండి గ్రహింపఁబడినదో తెలియదు; కాని యీశ్లోకములలో "భీష్మద్రోణతటా జయద్రథజలా" అను శ్లోక మించుక శబ్ద భేదమున నర్వాచీనకాలమునఁ బ్రబిద్ధుఁడగు భానకవిచే విరచితమైన 'ఊరుభంగ' నామనాటకారంభమున వ్రాయఁబడినది. కావుననే యీ ధ్యానశ్లోకమునకుఁ దఱుచుగా భానకవికాలానంతరమునఁ బ్రచారము గలిగినటులున్నది. కారణ మేమన; ప్రసిద్ధకవీశ్వరుఁడగు భాసుఁ డీ శ్లోకమును గీతాధ్యానములోనుండి గ్రహించియుండు ననుటకన్న గీతాధ్యానమే వేర్వేఱు గ్రంథములలోని శ్లోకములఁ దీసి కొంచెము మార్చి నవీనముగ వ్రాయఁబడినదనుట యుక్తియుక్తముగ నుండును. భానకవి కాళిదాసునికన్నఁ బూర్వకాలికుఁడగుటచే నెంతయగ్గించినను శకాబ్దములు మున్నూఱుకంటె నధికముగా నవీనుఁడని చెప్పుటకు వలనుపడదు *.

పైఁ జెప్పఁబడిన సంగతులఁ బట్టి భగవద్గీతల కే వేవియో యెన్నెన్నియో వ్యాఖ్యానములును, భాషాంతరీకరణములును,

---

* పైనఁ జెప్పిన గీతలలోఁ వదికభాగమును వింక ననేకగీతలను (భగవద్గీత లోఁగూడి) రా. రా. హరిరఘునాథభాగవతు లనువా రిప్పుడు ముద్రింపించి ప్రచురింపుచున్నారు.

కొంత మాత్రుగల యితర గ్రంథములును, దాత్పర్యములును, మాహాత్మ్యములను, పురాణములలోనుండి వెలువడినట్లు స్పష్టమగు చున్నది. అవధూతగీత, యష్టావక్రగీత మొదలగు కొన్ని గీత లే పురాణమున నున్నవో తెలియకున్నను, పురాణమున లేకయే యున్నను నట్టి స్వతంత్రగ్రంథము లే కాలమున నెవరు రచించి రనునదియుఁ దెలియఁబడుట లేదు. అయినను నీ సమస్తగీతల రచనా ప్రకారమును, వానిలోని విషయవిభాగప్రకారమును జూడ నీ గ్రంథ ములు భగవద్గీత సుప్రసిద్ధమైన తర్వాతను, దాని లోకపూజ్యతం గను గొనిన తర్వాతను రచింపఁబడినట్లు కన్పట్టుచున్నది. వే యేల? భగవద్గీతంబోలు నొక గీత తమ తమ మార్గమునను బురాణములను లేనిచో నా మార్గమునకుఁ బూర్ణత్వము రా నేరదని తలఁచియే యీ భిన్న భిన్న గీతలు రచించియుండురని చెప్పినను బాగుగ నుండును. భగవద్గీతలలో భగవంతుఁ డర్జునున కే రీతి విశ్వరూపముఁ జూపి జ్ఞానమును బోధించెనో యా విధముననే శివగీత, దేవీగీత, గణేశగీత లలోను వర్ణన మున్నది. మఱియు శివగీత, యీశ్వరగీత మొదలగు కొన్నిగీతలలో భగవద్గీతలలోని కొన్ని శ్లోకము లేమియు మార్చకయే ప్రాయఁబడియున్నవి. జ్ఞానదృష్టిచేఁ జూచినను భగవద్గీతలలోకన్న నీ గీతలలో నేమియు విశేషము లేమియే కాక యధ్యాత్మజ్ఞానముఁ గర్మయు ననునీ రెంటినసంబంధములను జెప్పుటలోఁ గూడ భగవద్గీత యపూర్వశైలి పినిలో నే గీతలోను స్వచ్ఛముగఁ గనఁబడదు. భగవద్గీతలలో పాతంజలయోగ మేనియు, హఠయోగ మేనియుఁ, గర్మత్యాగరూప నన్యాస మేనియుఁ గావలసినంత విరివిగ వర్ణింపఁబడ లేదని కొంతమంది కైనను తోఁచి యునికిం జేసి కృష్ణార్జునసంవాద రూపమగు భగవద్గీతకుఁ బూరణ మనుపేర నుత్తరగీత వెనుక రచింపఁ బడినది. మఱియు నవధూతగీత, యష్టావక్రగీత మొదలగు కొన్ని గీతలు కేవల మేకదేశమునే (అనగా సన్యాసమార్గమునే) ప్రతిపా

దించు చున్నవి. యమగీత, పాండవగీత, మొదలగు కొన్ని రెండవ తరగతి గీతలు స్తోత్రములవలె మిక్కిలి సంక్షిప్తములుగను, భక్తి పరములుగను నున్నవి. శివగీత, గణేశగీత, సూర్యగీత లట్లుగాక నయుక్తికముగ జ్ఞానకర్మల సమర్థించిన వనుట నిజమే. అయినను వానిలోని ప్రతిపాదన ప్రకారము తఱుచుగ భగవద్గీతనుండియే గ్రహింపఁబడుటవలన వానిలోఁ గ్రొత్తవిషయ మేమియుఁ గనఁబడదు. కావుననే ప్రగల్భమును వ్యాపకము నగు భగవద్గీతాతేజము ముందఱ దర్వాత ప్రాయఁబడిన పౌరాణికఖులగు చిన్న చిన్న గీతలవ్యాప్తి లేకపోవుటే కాక యీ ప్రతిబింబములుగా నున్న గీతలు చిట్టచివరకు విపరీతముగ భగవద్గీతామహత్త్వమునే యధికముగను స్పష్టముగను స్థాపించుచున్నవి. మఱియు 'గీత' అను నీ శబ్దమునకు 'భగవద్గీత' యను నర్థమే ప్రధానముగ రూఢమైనది. అధ్యాత్మరామాయణమును యోగవాసిష్ఠమును విస్తృతములైనను భగవద్గీతకన్న నవీనము లను నంగతి వాని రచనవలననే స్పష్ట మగుచున్నది. చెన్నపురిప్రాంతమున ముద్రితమైన గురుజ్ఞానవాసిష్ఠ (తత్త్వసారాయణ గ్రంథ) మతి ప్రాచీన మని యనేకులు చెప్పుదురు; కాని మాకు మాత్ర మట్లు తోపలేదు. ఏలయన- ఆ గ్రంథములో నష్టోత్తర శతోపనిషత్తులుఁ బేర్కొనఁబడి యుండుటచే నివి యన్నియుఁ ప్రాచీనములే యని యొప్పుకొనుటకు సాధ్యము కాదు. మఱియు సూర్యగీతఁ జూచినచో నందు విశిష్టాద్వైతవర్ణనము కనఁబడుచున్నది (3-30). కొన్ని కొన్నిస్థలముల భగవద్గీతనుండియే కోటీక్రమము (పూర్వపక్ష సిద్ధాంతముల రీతి) గ్రహింపఁబడినట్లు కనఁబడుచున్నది (1-68). కావుననే యీ గ్రంథము కూడ, పిమ్మట, వేయేల? శ్రీశంకరాచార్యులవారి యనంతరము ప్రాయఁ బడియుండు ననుట యుక్త మని తోఁచుచున్నది.

అనేక గీత లున్నను భగవద్గీత శ్రేష్ఠత్వము పైనఁ జెప్పఁబడిన కారణమువలన నిర్వివాద మగుటం జేసి యితర గీతల లక్ష్యము

సేయక భగవద్గీతను బరిశీలించుము దాని తాత్పర్యమును తమ ధర్మ బంధువులకుఁ జెప్పిననే తమ జన్మకు సాఫల్యము సంభవించు నని యర్వాచీనులు, వైదికధర్మబోధకులు నగు పండితులు తలంచుచు వచ్చిరి.

గ్రంథవిమర్శనము రెండు విధములుగ నుండును. అవి, 1. అంతరంగ పరీక్ష, 2. బహిరంగపరీక్ష యనునవి; గ్రంథమును నమ గ్రముగఁ బరిశీలించి యందలి మర్మమును, రహస్యమును, మితార్థ మును, లేక, ప్రమేయమును దెల్లముగ వెల్లడించుటకే యంతరంగ పరీక్ష యని పేరు. ఎవ్వఁ డే కాలమున నెచ్చో గ్రంథమును రచించె ననియు, నా గ్రంథరచనాశైలి (భాష) యెట్లున్నది యనియుఁ, గావ్యదృష్టిచే నందు మాధుర్యమైనను బ్రసాదమైన నెంత యున్న దనియు, గ్రంథములోని శబ్దరచన వ్యాకరణసమ్మతముగ నున్నదియు, లేనిదియు, దానిలో నే వేని ప్రాచీన ప్రయోగము (అర్షము) లున్నవియు, లేనిదియు, నే యే మతములయొక్క గాని, వ్యక్తుల యొక్క గాని నిరూపణలు కలవో లేవో యనియు, అందుండి గ్రంథ కాలనిర్ణయమును జేయుటను గుఱించియైనను, ఆ కాలమందలి సమాజస్థితిని గుఱించియైనను తెలిసికొన సాధనము లున్నవియు, లేనిదియు, గ్రంథములోని విచారము స్వతంత్ర మైనదియుఁ, గానిదియు, నితరగ్రంథములనుండి తీసి వ్రాయఁబడెనేని ఎచ్చట నుండి యే విషయ మనునవి మొదలగు బాహ్యాంగముల వివేచనకు బహిరంగ పరీక్షయని పేరు. గీతలమీఁద భాష్యములను గాని వ్యాఖ్యానములను గాని చేసిన ప్రాచీన పండితు లీ బహిరంగపరీక్షపై నేమియు దృష్టి వేయలేదు; ఏలయన- భగవద్గీత యను నలౌకిక గ్రంథమును బరీక్షించుము బాహ్యాంగ పరీక్షఁజేయుట వారి యభి ప్రాయమునుబట్టి చూడ నేదే నొక యుత్తమపుష్పము కనఁబడినపు డా పుష్పపు సువాసనయు, వన్నెయు, సౌందర్యము నను విషయముల యం దుత్సాహము వదలి దాని వెడల్పును బొడవును గొలుచుట

వలెను, తేనెతో నిండిన తేనెతెట్టె దొరకినపుడు దాని రంధ్రముల పరీక్షకుఁ గాల మంతయుఁ గడపునట్లును వ్యర్థమని తోఁచియే యని తోఁచుచున్నది; కాని పాశ్చాత్యపండితులవలె నిటీవలి పండితులు గీతయొక్క బాహ్యాంగములం గూడ విశేషముగనే పరీక్షించు చున్నారు. ఒక పండితుఁడు గీతలలోని యార్షప్రయోగముల నన్నింటి లెక్కించి చూచి యీగ్రంథము ఏనుక్రీస్తుజన్మకంకెఁ గొన్నిశతాబ్దము లేనియుఁ పూర్వము వ్రాయఁబడి యుండునని నిర్ణయించెను. దీని వలన గీతలలోని భక్తిమార్గము తదుత్తరకాలమున వ్రాయఁబడి ప్రచారములోనున్న క్రైస్తవధర్మమునుండి గ్రహింపఁబడియుండు ననువారి యూహ నిష్ప్రమాణమని తేలుచున్నది. మఱియొక పండితుఁడు పదునాఱవ యధ్యాయమున నిరూపింపఁబడిన నాస్తిక ధర్మప్రకరణమును జూచి యీ ధర్మములు తఱుచుగ బౌద్ధమత సంబద్ధములు గాన బుద్ధుని యనంతరము బౌద్ధమతము నుండి గ్రహించి వ్రాయఁబడి యుండునని యూహించెను. మఱియొక పండితుఁడు పదుమూఁడవ యధ్యాయములోని "బ్రహ్మసూత్ర పదైశ్చైవ" యను శ్లోకములో బ్రహ్మసూత్రములనిరూపణ యుండుటచే బ్రహ్మసూత్రానంతరము గీత వ్రాయఁబడియుండు ననియెను; కాని యీ యంశమునకు విరుద్ధముగఁ బ్రహ్మసూత్రములలోఁ గొన్ని కొన్నిచోట్ల గీతనే యాధారముగఁ జేసికొనిన విషయము నిర్ణయింపఁబడుటచే నీ గీతలు బ్రహ్మసూత్రముల తర్వాత వ్రాయఁబడిన వని చెప్పుటకు సాధ్యము కాదని యనేకు లనుచున్నారు. మఱి కొందఱు యుద్ధభూమిలో శస్త్రసంపాతసమయమున నేడు వందల శ్లోకములుగల గీతఁ జెప్పు నవకాశ ముండదనియు, నీ సమయమం దతిత్వరఁగాఁ బాతికయో పరకయో ముఖ్యములైన శ్లోకము లర్జునున కువదేశింపఁబడి యుండు ననియు, వానినే విస్తరించికొనుచు సంజయుఁడు ధృతరాష్ట్రునకును, వ్యాసుఁడు శుకునకును, వైశంపా యనుఁడు జనమేజయునకు, ననంతరము సూతుఁడు శౌనకునకును జెప్పుచు రాఁగాఁ జివరకు మూలభారతమును రచించినవారిచేత యీ

గీత లింత విస్తృతముగ వ్రాయఁబడి యుండుననియుఁ జెప్పుదురు. గీతల రచనావిషయమై యిట్టి నిశ్చయము లోకులకు బాగుగఁ గలిగిన పిదప గీతాసాగరమున మునిఁగి యీఁతలు కొట్టి కొందఱు గీత సప్తశ్లోకీ* యనియు, కొంద ఱష్టావింశశ్లోకి యనియు, షట్త్రింశశ్లోకి యనియు, మఱికొందఱు శతశ్లోకి యనియు నిట్లు గీతల మూలభూత శ్లోకముల వెదకి వెదకి తీసిరి. చిట్టచివర కనేకులు రణభూమియందు గీతలలోని బ్రహ్మజ్ఞాన మర్జునున కుపదేశించుట కేమియు ఫలము లేనందున వేదాంతార్థప్రతిపాదకం బగు నీ యుత్తమ గ్రంథమును తర్వాత నెవరో భారతములో నిఱికించినారని తలంచిరి. బహిరంగ పరీక్షాసంబంధములగు నీ ప్రశ్నలు బొత్తిగా నిరర్థకములు గావు. ఉదాహరణమునకు వెనుకఁ జెప్పఁబడిన (1) పుష్పములేకుల గొలుచుటయు (2) తేనెతెట్టె రంధ్రముల లెక్కించుటయు గ్రహింపుము. వృక్షముల ప్రభేదములఁ బరీక్షించునపుడు పుష్పపరిమాణాదులు కూడ వర్గీకరణములోఁ జాల నుపయోగకరములు.† కావున నిట్టి యుప

---

*ఇప్పుడు పప్తశ్లోకీగీతను ప్రచురించి యున్నారు. దానిలో 1. "ఓ మి త్యేకాక్షరం బ్రహ్మ" (గీ. 8-13); 2. "స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా (గీ.11-36); 3. "పర్వతః పాణిపాదం తత్" (గీ. 13-14); 4. కవిం పురాణ మనుశాసితారం" (గీ. 8-9); 5. "ఊర్ధ్వమూల మధశ్శాఖం" (గీ.15-1); 6. "పర్వస్య చాహం హృది పన్నివిష్టః" (గీ.15-15); 7. "మన్మనా భవ మద్భక్తః" (గీ. 18-65); అను శ్లోకములు మాత్ర మున్నవి. ఇట్లు భగవద్గీత కనేకము లగు సంగ్రహ గ్రంథములు వ్రాయఁబడినవి.

తేనెతెట్టెయందు తేనెవరిమాణము తక్కువ గాకుండువట్లును, తేనెకు వెలువల నావరణముగానుండు సైవము మిక్కిలి తక్కువగా నుండువట్లును తేనె టీఁగలు రంధ్రములఁ జేయును. (అవఁగా సైవముయొక్క మూలికయు వది యుండు ప్రదేశముయొక్క కొలఁతయు పృష్ఠవలప్రమాణముగ నుండువట్లు చేయును. (8-8, ఘనవలము $8 \times 8 \times 8 = 512$. అదే 8-8 పృష్ఠవలము 2). కావున గణితముచే నా రంధ్రములఁ బరీక్షించుటవలన సైతము తేనెటీఁగలకు పుట్టుకతోనే యీ గణితతాత్పర్యమును తెలిసికొనుట కుపయోగించును.

యోగమున దృష్టి యుంచి నే నీ గ్రంథరాజముయొక్క బహిరంగ పరీక్షాంతర్గతమగు మహత్త్వమును బ్రతిపాదించుటకై యీ గ్రంథ పరిశిష్టప్రకరణమునఁ గొంత విచారఁ జేసి యున్నాను; కాని గ్రంథ రహస్యము సంపూర్ణముగఁ దెలిసికొనఁ దలఁచినవారికి మాత్ర మీ బాహ్యాంగపరీక్షలో విశేష ముపయోగకర మగు సంగతి యేమియు లేదు. వాగ్దేవీరహస్యము దెలిసికొన్నవారికిని నామె బాహ్యసేవ చేయు వారికిని నుండు భేదముం జూప, మురారి నాటకకవీశ్వరుఁ డొక సరసమైన దృష్టాంతము వచించియున్నాఁడు. అదేమన -

అబ్ధి ర్లంఘిత ఏవ వానరభటైః కిం త్వస్య గంభీరతా,
మాపాతాళనిమగ్నపీవరతనుర్జానాతి మంథాచలః.

– అగాధమగు సముద్రప్రదేశ మెక్కడ నున్నదియు నెంత లోఁతున్నదియు విచారింపవలసిన నెవరి విచారింపవలయును? రామరావణ యుద్ధప్రసంగమున గొప్ప గొప్పవారుగ నెన్నఁబడి గబగబ తరంగ ముల దాఁటి లంకలోనికి వెళ్ళిన చపల వానరవీరులనా? అగాధమగు సముద్రప్రదేశము వారి కెట్లు తెలియును? సముద్రమథన సమయ మునఁ గవ్వముగఁ జేసి దేవత లే పర్వతమును సముద్రముయొక్క యట్టడుగువఱకును వదలిరో యా పర్వతమునకే గదా శరీర మంతయు మునుఁగుటం జేసి నిజమైన లోఁతు తెలియును – అని మురారికవిచేఁ జెప్పఁబడిన యీ న్యాయము ననుసరించి గీతారహ స్యమును దెలిసికొన ననేకులగు పండితులచేతను నాచార్యులచేతను మథింపఁబడిన యీ గ్రంథముపై మనము సంపూర్ణదృష్టి నుంచవల యును. ఈ పండితులలో మహాభారతకారుఁడే యగ్రగణ్యుడు. వేయేల? ప్రస్తుత గీతల కాయన యొక విధమగు కర్త యనినను దప్పలేదు. కావున మహాభారతకారుని మతానుసారముగ గీతల తాత్పర్యమును ముందు సంక్షేపముగఁ జెప్పెదను.

"భగవద్గీత" లేక "భగవంతునిచే గానము చేయఁబడిన యుపనిషత్తు" అను నీ పేరును బట్టియే గీతలలో నర్జును నుద్దేశించి చేయఁబడిన యుపదేశము ప్రధానముగ భాగవత (అనఁగా భగవంతునిచేఁ బ్రవర్తింపఁజేయఁబడిన ధర్మ)మని కనఁబడుచున్నది. ఏలయన శ్రీకృష్ణునకు "భగవాన్" అను పేరు సాధారణముగ భాగవత ధర్మములలోఁ బ్రచారము గలిగియున్నది. ఈ యుపదేశము క్రొత్తది కాదు. భగవంతుఁడు పూర్వ మీ యుపదేశమునే వివస్వంతునకును, వివస్వంతుఁడు మనువునకును, మను విక్ష్వాకునకును జేసినట్లు గీతలలోఁ జతుర్థాధ్యాయారంభమున నున్నది (4.1-3). మహాభారతములో శాంతిపర్వము చివర "నారాయణీయ ధర్మములయొక్క లేక భాగవత ధర్మములయొక్క సవిస్తర నిరూపణములో బ్రహ్మదేవుని వేర్వేఱు జన్మములలో (కల్పాంతరములయందు) భాగవతధర్మముల పరంపర యెట్లున్నదియు వర్ణింపఁబడినది. తుదకు బ్రహ్మదేవుని ప్రస్తుత జన్మములలో (త్రేతాయుగమునందు)-

త్రేతాయుగాదౌ చ తతో వివస్వా న్మనవే దదౌ,
మనుశ్చ లోకభృత్యర్థం సుతా యేక్ష్వాకవే దదౌ,
ఇక్ష్వాకుణా చ కథితో వ్యాప్య లోకా నవస్థితః.

అని యీ భాగవతధర్మము వివస్వంతుఁడు, మనువు, ఇక్ష్వాకువు, నను వారలకుఁ బారంపర్యముగఁ బ్రబలఁచిన దని యున్నది (చూ. మ.భా.శాం. 348. 51-52). ఈ రెండు పరంపరలు పరస్పరము సంబంధించియున్నవి (గీత. 4. 1 మీఁద నా వ్యాఖ్యానము చూడుము). మఱియు వేర్వేఱైన యీ రెండు ధర్మముల పరంపరయు నొకటియే యైనందున గీతార్థమును నీ భాగవతధర్మమును నొకటియై యుండవలయుననియు నీ పరంపరైక్యమును బట్టి యూహింపఁదగు; కాని యీ విషయము కేవలము అనుమితిచేతనే (ఊహచే) లభ్యము కాదు. కారణ మేమన- నారాయణీయ ధర్మములయొక్క లేక భాగవత ధర్మములయొక్క నిరూపణముగల భారతముననే -

ఏవ మేష మహాన్ ధర్మ స్త వ పూర్వం నృపోత్తమ,
కథితో హరిగీతాను సమాసవిధికల్పితః.

(మ. భా. శాం. 348.10)

"రాజోత్తమా! జనమేజయా! ఇదియే గొప్ప భాగవతధర్మము; ఇది విధిసహితముగను సంక్షేపముగను హరిగీతలయందు (భగవద్గీతల యందు) పూర్వము నీకుఁ జెప్పఁబడినది." అని వైశంపాయనులు జనమేజయునకు గీతాతాత్పర్యమును వర్ణించిరి. ఇంతియకాక యందే యొక యధ్యాయము వదలఁగఁ దదనంతరాధ్యాయనమున—

సముపోఢే ష్వనీకేషు కురుపాండవయో ర్మృధే,
అర్జునే విమనస్కే చ గీతా భగవతా స్వయమ్.

(మ. భా. శాం. 348.8)

"కౌరవపాండవుల యుద్ధమం దుభయసేనలును యుద్ధమునకు సిద్ధమైయుండఁగా నర్జునుఁడు విమనస్కుఁడు కాగాఁ (దిగులుపడఁగా) నతనికి భగవానుఁడు గీతను స్వయముగాఁ జెప్పె"నని నారాయణీయ ధర్మమున స్పష్టముగనే యున్నది. దీనినిఁ బట్టి మూడ హరిగీతాశబ్ద ముచే, భగవద్గీతయే యిచ్చట వివక్షిత మను విషయమున సంశయ మేమియు లేదు. గురుపరంపర యొక్కటియై యుండుటయ కాక, గీతాప్రతిపాదితమని స్పష్టముగ రెండు పర్యాయములు వర్ణింపఁబడిన "నారాయణీయ ధర్మము"లకు, లేక "భాగవత ధర్మము"లకే, "సాత్వతధర్మములు", లేక "ఏకాంతికధర్మము" లని రెండవ పేరు గలదు. మఱియు నా ధర్మమును నిరూపించుచు శాంతిపర్వమునందలి—

నారాయణపరో ధర్మః పునరావృత్తి దుర్లభః,
ప్రవృత్తి లక్షణ శ్చైవ ధర్మో నారాయణాత్మకః.

(మ. భా. శాం. 347. 80-81)

"ఈ నారాయణీయధర్మము పునర్జన్మము నివారించునది (అనగా పూర్ణమోక్షప్రదమగుచుఁ బ్రవృత్తిపరముగ నున్నది)" అను శ్లోకము

దాని ద్వివిధలక్షణములను నిర్వహించుచున్నది. అనంతర మీ ధర్మము ప్రవృత్తిపర మెట్లో యా నంగతి పూర్ణముగ నస్పష్టీకరింపఁబడినది. ప్రవృత్తి యనఁగా సన్యాసము పుచ్చుకొనక మరణపర్యంతమును చాతుర్వర్ణ్యవిహిత నిష్కామకర్మఁ జేయుటయే యను నర్థము ప్రసిద్ధ ముగనే యున్నది. కావున గీతలలో నర్జునునకుఁ జేసిన యుపదేశము భాగవత ధర్మసంబద్ధ మగుటచేతను, నా ధర్మము ప్రవృత్తిపరముగా నుండుటచేతను, నా యుపదేశము ప్రవృత్తిపర మని మహాభారత కారుఁడు తలఁచెనని సుస్పష్టమగుచున్నది. అయినను గీత కేవలము ప్రవృత్తిపరమగు భాగవతధర్మములే ప్రతిపాదింపలేదు. ఇఁక నేమన ఈ భాగవతధర్మమును

> యతీనాం చాపి యో ధర్మ స్స త్వే పూర్వం నృపోత్తమ,
> కథితో హరిగీతాసు సమాసవిధికల్పితః.
>
> (మ. భా. కాం. 348.58)

"దానితోపాటు (చాపి) యతులయొక్క (సన్యాసులయొక్క) నివృత్తి పరధర్మమును, ఓ రాజా! నీకు పూర్వము భగవద్గీతలలో విధి సహితముగను, సంక్షేపముగను జెప్పఁబడినది"—అని జనమేజయునకు వైశంపాయనుఁడు మరలఁ జెప్పెను; కాని ప్రవృత్తిధర్మముతోనే యతుల నివృత్తిపర ధర్మముఁ జెప్పఁబడినను మను విక్ష్వాకువు మొద లగువారి గీతాధర్మపరంపర యతిధర్మములకు బొత్తిగా సంబంధిం పదు. భాగవతధర్మముతో మాత్ర మీ పరంపర సంబంధించును. కావుననే గీతలలో నర్జునునకుఁ జేయఁబడిన యుపదేశము ముఖ్య ముగ మనువు, ఇక్ష్వాకువు లోనగువారి పరంపరగ వచ్చిన ప్రవృత్తి పర భాగవతధర్మ సంబద్ధమగుచు నా పరంపరా సంబంధమున (అనఁగా అప్రధానముగా) నివృత్తిపర యతిధర్మమును నిరూపించునదియై యున్నది. ఇది మహాభారతకారుని యభిప్రాయ మను సంగతి పూర్వోక్తవచనముల యేకవాక్యతవలనఁ దేలును. మహాభారతము

లోని యీ ప్రవృత్తిపర మగు నారాయణీయధర్మమును, భాగవతము లోని భాగవతధర్మమును మొదట నొకటిగనె యుండె నని, పృథువు, ప్రియవ్రతుఁడు, ప్రహ్లాదుఁడు మొదలగు భగవద్భక్తుల కథలవలనఁ గాని, భాగవతములో మరియొకచోటనున్న నిష్కామకర్మ వర్ణనవలనఁ గాని స్పష్ట మగుచున్నది (భాగవత. 4.22 31-52; 7.10-23; 11.4-6 చూడుము). ఐనను భాగవతధర్మములలోఁ గర్మపరమగు ప్రవృత్తి తత్త్వమును సమర్థించుట భాగవతపురాణ ముఖ్యోద్దేశము కాదు. ఈ సమర్థనము మహాభారతమునసే, విశేషముగ గీతలలోనే చేయఁబడి నది; కాని యీ సమర్థనముతోపాటు భాగవత ధర్మమందున్న భక్తి రహస్యమును దగు రీతి నా భారతమున వ్యక్తపఱుచుట వ్యాసులవా రప్పుడు మఱచిరి. భక్తి లేని కేవల నిష్కామకర్మ వ్యర్థ మని భాగవత మున నున్నది (భాగ. 1.5-12 చూ.). ఈ సంగతి తోఁచియే వ్యాసులు భారతములోని యీ లోపమును బూర్తిచేయుటకు భాగవతపురాణ మును దర్వాతఁ బ్రత్యేకముగఁ జెప్పవలసి వచ్చెనని భాగవతారంభ మున వర్ణింపఁబడియున్నది. భాగవతపురాణమును జెప్పుటకు ముఖ్య హేతు విదియే యని పైగ్రంథమువలన స్పష్ట మగుచున్నది. మఱియు నీ భాగవతరూపముగ ననేక విధములగు హరికథలు చెప్పఁబడు చున్నవి; కాని భాగవతధర్మములలోని భగవద్భక్తి మాహాత్మ్యము భాగవతములో వర్ణింపఁబడినట్లు భాగవతధర్మములోని కర్మపరమైన యంగముల వివేచన యచ్చో నంతగ వర్ణింపఁబడలేదు. వే యేల? సమస్త కర్మయోగమును భక్తి లేమి వ్యర్థ మని భాగవతకారుని మతము (భాగ. 1.5-34). కావున గీతాతాత్పర్యము నిశ్చయింపవలసి వచ్చి నప్పుడు, గీత యే భారతములోఁ జెప్పఁబడెనో, దానిలోనే యున్న నారాయణీయోపాఖ్యానమున కనుకూలముగ నిర్ణయించి తీరవల యును; కాని భాగవతపురాణము భాగవతధర్మ సంబంధముగ నున్నను కేవలము భక్తిప్రధాన మగుటవలన నారాయణీయోపా

జ్ఞాన సంబంధమైన దనుటకు వీలులేదు; ఒకవేళ నట్లున్నను భారత భాగవతముల యుద్దేశములును కాలములును వేర్వేఱని యెఱిఁగియే చెప్పవలయు.

నివృత్తిపర యతిధర్మములయు, ప్రవృత్తిపర భాగవతధర్మములయు, మూలస్వరూపము లేవి? ఇవి వేర్వేఱగుటకుఁ గారణ మేమైయుండును? మూల భాగవతధర్మములు ప్రకృత మే రూపాంతరములఁ బొందియున్నవి? ఆను నిట్టి ప్రశ్నల విచారము ముందు గ్రంథములో స్పష్టముగ నిరూపణ చేయఁబడును.

ఇంతదనుక మహాభారతకారుని మతానుసారముగ గీతా తాత్పర్యము వర్ణింపఁబడినది. ఇఁక గీతమీఁద భాష్యకారులచేతను, టీకాకారులచేతను, నేమి నిశ్చయింపఁబడినదో విచారింతము.

ఈ భాష్యములలోను, టీకలలోను శ్రీశంకరాచార్యులవారి గీతాభాష్యమే యతి ప్రాచీనమని ప్రకృతకాలమునఁ దలఁపఁబడుచున్నది. ఆ భాష్యముకన్నఁ బూర్వము గీతలమీఁద మంచి మంచి భాష్యములును టీకలును వ్రాయఁబడియుండెననుట కేమియు సంశయము లేదు; కాని యా టీకలు ప్రకృతము కనుపింపనందున మహాభారతానంతరము శ్రీశంకరాచార్యులవారి యవతారముకంటెఁ బూర్వము గీతల యర్థ మే విధముగ యోజన చేయఁబడినదో తెలిసికొనుట కిప్పుడు సాధనము లేవియు లేవు. అయినను శాంకరభాష్యమందే యున్న ప్రాచీన టీకాకారుల మతస్వరూప నిరూపణవలననే యాచార్యుల వారికన్నఁ బూర్వులగు టీకాకారులచే గీతల యర్థము మహాభారతకా రనుమతముగనే, జ్ఞానకర్మ సముచ్చయాత్మకముగ (అనఁగా జ్ఞానముతోఁ గూడనే జ్ఞానియగువాఁడు మరణపర్యంతము స్వధర్మోక్త కర్మఁ జేయవలయునని) ప్రవృత్తిపరముగ యోజనచేయఁబడినదని స్పష్టమగుచున్నది. (గీ.శాం.భాష్య 2; లేక 3; పీని యుపోద్ఘాతము చూ.) కాని వైదిక కర్మయోగము బోధించు నీ సిద్ధాన్తము

శ్రీ శంకరాచార్యులవారి కంగీకర్తవ్యము కాకపోవుటవలననే యీ భగవద్గీతలోని కర్మయోగగ్రంథమున కతిప్రయాసతోను బట్టుదల తోను భాష్యము వ్రాసినా రని యా శంకరభాష్యోద్ఘాతములోనే స్పష్టముగ నున్నది. వేయేల? భాష్యశబ్దార్థనిర్వచనమును గనుఁడు. భాష్యటీకాశబ్దములు రెండును సమానార్థకములనుట కనేక ప్రామాణిక ప్రయోగములు గలవు; కాని టీక యను దానిలో మూలగ్రంథము నకు సులభముగు నన్వయమును, దానిలోని శబ్దములకు సుగమమైన యర్థము నుండును. భాష్యకర్త లంతమాత్రముతోఁ దృప్తిఁ జెందక, సంపూర్ణగ్రంథమును న్యాయరీతిగఁ బర్యాలోచించుచు స్వమతా నుసారముగ నా గ్రంథములోని తాత్పర్యమును దదనుసారముగ గ్రంథార్థమును యోజించురీతిని కూడఁ జెప్పుదురు. గీతలమీఁది శాంకరభాష్య మీ రీతిగనే యున్నది; కాని గీతాతాత్పర్య నిరూపణ ములో నాచార్యులవారు భారతకారుని మతముకంటె వేఱుగాఁ జెప్పు టకుఁ గారణము నెఱింగింప ముందుగా నొక విషయ మిచ్చటఁ జెప్పవలసియున్నది. అదేమన –

వైదికధర్మము కేవలతాంత్రికము కాకుండుటచే నీ ధర్మము యొక్క గూఢతత్త్వమేమియో దెలిసికొనుటకుఁ బూర్వమే యుపని షత్తులలో నూక్ష్మవిచారణ చేయఁబడినది; కాని యీ యుపనిషత్తులు వేర్వేఱు మునులచే వేర్వేఱు కాలములందు నిరూపింపఁ బడుటంజేసి వానిలో ననేకవిధములగు విచారణలు గలవు. మఱియు వానిలోఁ జూపులకుఁ గొంచెము పరస్పరవిరుద్ధములుగ నుండు నంశములుఁ గలవు. అయినను వైదికధర్మములలోని తత్త్వజ్ఞానవిచార మింత మాత్రముచే పూర్తి కానేరదు. ఏల యన– ఉపనిషత్తులలోఁ బ్రతి పాదితమైన జ్ఞానము తఱుచుగ వైరాగ్యపరమై (అనఁగా: నివృత్తి పరమై) యుండును. వేదాంతసూత్రము లుపనిషత్తుల కేకవాక్యతఁ జేయుటకే రచింపఁబడిన వగుటచే వానిలో వైదికప్రవృత్తి మార్గ

సంబంధమైన తత్త్వమెక్కడను సవిస్తరముగఁ బ్రతిపాదింపఁబడలేదు. కావుననే వెనుకఁ జెప్పఁబడినరీతిగఁ బ్రవృత్తిమార్గప్రతిపాదకమైన భగవద్గీతనే నా యుభయమందలి లోపమును బూర్తి చేయఁబడినది. ఈ ధార్మికతత్త్వజ్ఞానమును బూర్తిచేయునది యీ భగవద్గీతయే కాన నీ గ్రంథము సర్వాంగీకర్తవ్యమును, బ్రమాణమును నైయున్నది. తుదకు, 1. ఉపనిషత్తులు, 2. వేదాన్తసూత్రములు, 3. భగవద్గీతయు నను నీ మూఁడుగ్రంథములకును బ్రస్థానత్రయ మనుపేరు వచ్చినది. బ్రస్థానత్రయ మనఁగా: ప్రవృత్తి నివృత్తిమార్గములకు రెంటికిని మార్గప్రదర్శకములును, తాత్త్వికవివేచన చేయునవియును, వైదిక ధర్మసంబద్ధములు నగు మూఁడు ముఖ్యాధార గ్రంథములు; లేక, ఆ వైదికధర్మ మహోభవనమునకు మూఁడు ముఖ్యాధార స్తంభములై యున్నవి. భగవద్గీత కీ విధముగఁ బ్రస్థానత్రయమున సమావేశము కలిగినది. ఇట్లీ ప్రస్థానత్రయ సామ్రాజ్య మేకకాలమందు స్థాపితమైన పిదప, నే మతధర్మము లీ మూఁడు గ్రంథములకు సంబంధించి యుండవో, లేక యీ మూటిలో నే మతమునకు సమావేశము కానేరదో, యా మతములు నా సంప్రదాయములును వైదికధర్మ ములలో గౌణము లనియు నగ్రాహ్యము లనియు లోకు లెన్నుచు వచ్చిరి. తుద కీ విషయ మెట్లు పరిణమించె ననఁగా:- అద్వైతము, విశిష్టాద్వైతము, ద్వైతము, శుద్ధాద్వైతము నను మతములును (ఆ మతసంబంధమైన సన్యాసము భక్తి మొదలగు వైదికధర్మముల యొక్క యే యే సంప్రదాయములు బౌద్ధధర్మము క్షీణించిన పిమ్మట హిందూస్థానములోఁ బ్రచారమునకు వచ్చినవో యవియును) బయలుదేరుటచే వానిలోఁ బ్రతి సంప్రదాయ ప్రవర్తకుఁడైన యాచార్యుఁడును ప్రస్థానత్రయములోని మూఁడు గ్రంథములకును; (అనఁగా: భగవద్గీతకుఁ గూడ) భాష్యములు వ్రాసి యీ సర్వసంప్ర దాయములు బయలుదేరుటకుఁ బూర్వమే ధర్మగ్రంథము లని చెప్పఁ

బడి ప్రమాణభూతములగు నీ మూఁడు గ్రంథములయందును దమ సంప్రదాయమే సత్యముగా నిలుచుననియు నితర సంప్రదాయము లీ ధర్మగ్రంథసమ్మతములు కావనియు సిద్ధముచేసి చూపుట ప్రాప్తమైనది.

కారణమేమన– తమ సంప్రదాయమే కాక యితర మార్గములు గూడ, ప్రమాణభూతములగు నీ ధర్మ గ్రంథముల మూలమున గ్రాహ్యములుగా నున్నవని యొప్పుకొనిన యెడలఁ దమ సంప్రదాయము యొక్క మహత్త్వమునకు లోపము కలుగును. ఇట్లు లోపము కలుగుటయే సంప్రదాయమునకు నిష్టము కానేరదు; సంప్రదాయమునను సరించి ప్రస్థానత్రయముమీఁదను భాష్యములు వ్రాయుటయను మార్గ మారంభమైన తర్వాత వేర్వేఱు పండితులు తమ సంప్రదాయములో నుండు భాష్యములయొక్క యాధారములనే తమచే రచింపఁబడిన టీకలమూలమున గీతార్థముఁ బ్రతిపాదించుచు వచ్చిరి. మఱియు నా యా సంప్రదాయములలో నా యా టీకల కధిక గౌరవము వచ్చుటముఁదెను. గీతలమీఁదఁ బ్రస్తుత మెట్టి భాష్యములును టీకలును కనఁబడుచున్నవో యా సర్వగ్రంథములు నట్టి వేర్వేఱు సంప్రదాయములకు సంబంధించిన యాచార్యులవిగాని పండితులవిగానియైయున్నవి. ఈ సర్వసంప్రదాయములలోను మొదటిది, అనఁగా ప్రాచీన సంప్రదాయము, శ్రీశంకరాచార్యులదై యున్నది. తత్త్వజ్ఞానమునను సరించిన యా సంప్రదాయమే హిందూస్థానములో బహుమాన్యముగా నున్నది. శ్రీమదాద్యశంకరాచార్యులవారు శాలివాహనశకము 710 వ సంవత్సరమున జన్మించి ముప్పదిరెండవ సంవత్సరమున గుహాప్రవేశము చేసిరని ప్రస్తుతము కొందఱు నిశ్చయించియున్నారు. (శాలి. శక. 710-742)* ఆచార్యులవారు గొప్ప

* శ్రీమదాద్యశంకరాచార్యుల కాల మింకను నూహేండ్లు పూర్వమని మా మతము. పరిశిష్టప్రకరణమున దాని యాధారము లివ్వఁబడినవి. కావ వీటిని చూచుకొనవలయును.

యలౌకికజ్ఞానులై తమ సామర్థ్యముచే నా సమయమున సర్వదేశముల యందును వ్యాపించియుండిన జైన బౌద్ధమతములను ఖండించి తమ యద్వైతమతమును స్థాపించిరి. మఱియు శ్రౌత స్మార్త వైదిక ధర్మసంరక్షణార్థమై భరతఖండములో నాల్గుదిక్కులను నాలుగు మఠములను స్థాపించి, నివృత్తిపరమును, వైదికమునగు సన్యాస ధర్మమును, లేక, సంప్రదాయమును, కలియుగమున మరల స్థాపించిరి. ఈ కథ యందఱకును దెలిసినదియే. ప్రతి ధార్మికసంప్ర దాయమునకును స్వాభావికముగా రెండుభాగము లుండును. మొదటిది తత్త్వజ్ఞానసంబంధ మైనది. రెండవది యాచరణసంబంధ మైనది. మొదటిదానిలో పిండబ్రహ్మాండవిచారణచే పరమేశ్వరస్వరూప మేది యని తెలునో యా సంగతిఁ జెప్పి మోక్ష మనఁగా నేమి యను నది యోగశాస్త్రదృష్టిచే నిర్ణయింపఁబడును. రెండవభాగమున మోక్షము సిద్ధించుటకు సాధనములు, లేక, యుపాయము లను పేరుతో నీ ప్రపంచమున మనుష్యుఁ డెట్లు ప్రవర్తింపవలసినదియు నిర్ణయింపఁబడును. కావున శాంకరమతమునందలి మొదటిభాగమున నైతము శంకరులు తత్త్వదృష్టిచే నిట్లు చెప్పుదురు.

1. నేను, నీవు లేక, మనుష్యులకుఁ గంటి కగపడు ప్రపంచ మంతయు అనఁగా సృష్టిలోనుండు పదార్థములకున్న నానాత్వము, సత్యము కాదు. ఈ సమస్తమందు నొకటియు శుద్ధమును నిత్యము నైన పరబ్రహ్మము నిండియున్నది. మఱియు నట్టి పరబ్రహ్మ యొక్క మాయచేత మనుష్యుల యింద్రియములకు నానాత్వము భాసమాన మగుచున్నది, 2. అట్లే మనుష్యుని యాత్మయు మొదట పరబ్రహ్మరూపముగనే యున్నది. 3. జీవాత్మ పరమాత్మల యేకత్వము యొక్క పూర్ణజ్ఞానము, అనఁగా అనుభవాత్మక నిశ్చయము, కలిగిననే కాని యెవరికిని మోక్షము సిద్ధించుట దుర్లభము. దీనినే యద్వైత వాదమని చెప్పుదురు. కారణ మేమనగా- ఏకమును నిత్యశుద్ధబుద్ధ

ముక్తస్వభావమును నగు పరబ్రహ్మకంటె వేఱుగా స్వతంత్రమును నత్యమునైన రెండవ వస్తువేదియు లేదు. నేత్రములకు గోచరించు నానాత్వము మానవదృష్టియొక్క భ్రమగాని, మాయయొక్క యుపాధి మూలమున నగుచున్న యాభాసముగాని యైయున్నది. మాయ రెండవ స్వతంత్రవస్తువు కాదు. మిథ్యగా నున్నదని యీ సిద్ధాన్త తాత్పర్యమై యున్నది. మఱియుఁ గేవల తత్త్వజ్ఞానవిచారమే కర్తవ్య మైనప్పుడు శాంకరమతచర్చ యింతకంటె నధికముగాఁ జేయుట కావశ్యకత యుండదు. ఐనను శాంకరసంప్రదాయ మింత మాత్రముతోనే పూర్ణము కానేరదు. అద్వైతతత్త్వజ్ఞానమునకు సంబంధించినదియు, శాంకరసంప్రదాయములోని తత్త్వజ్ఞానమహత్త్వము గలదియు, నాచరణదృష్టిలో నున్నదియు నగు రెండవసిద్ధాన్త మేది యనఁగా-

చిత్తము శుద్ధమై బ్రహ్మైక్యజ్ఞానము పొందు యోగ్యత తనకు వచ్చుటకు నత్యుత్కృష్టములైన గృహస్థాశ్రమ కర్మలు చేయవలసి యున్నను నీ కర్మలు నర్వదా చేయనక్కఱలేదు. తుదకు నర్వకర్మ త్యాగముదేసి నన్యాసాశ్రమమునఁ బ్రవేశించిననే తప్ప మోక్షప్రాప్తి దుర్లభము. ఏలయన- కర్మ జ్ఞానములు రెండును చీఁకటియు వెలుతురునువలె పరస్పర విరుద్ధము లగుటచే నర్వవాసనలను కర్మలను వదలిపోయినఁ గాని బ్రహ్మజ్ఞానమయొక్క పూర్ణత్వము సిద్ధింపదు. ఈ రెండవసిద్ధాన్తము నివృత్తిమార్గమని కాని, తుదకు నర్వకర్మ నన్యాసముఁ జేసి జ్ఞానముననే మగ్నుఁడై యుండును గాన నన్యాసనిష్ఠ యని కాని చెప్పదురు.

ఉపనిషత్తులలోను, బ్రహ్మసూత్రములలోను కేవలాద్వైతజ్ఞానోపదేశమే కాక శాంకరసంప్రదాయమగు నన్యాసమార్గముయొక్కయు నుపదేశమును కలదు. ఈ తీరున నీ రెండు గ్రంథముల శాంకరభాష్యములలోను ప్రతిపాదనము చేయఁబడినది. భగవద్గీతలకు

సైత మిదే తాత్పర్యమని గీతల శాంకరభాష్యములో నిర్ణయింపఁబడినది (గీతా. శాం. భా. ఉపోద్ఘాతము, బ్రహ్మసూ. శాం. భా. 2-1-14 చూడుము). మఱియు దీనికి ప్రమాణము- "జ్ఞానాగ్ని స్సర్వకర్మాణి భస్మసా త్కురుతేఽర్జున!" (గీ. 4-37) జ్ఞానరూపాగ్నిహోత్రము సర్వకర్మలను దగ్ధముఁ జేసి బూడిద చేయుచున్నది అనియు, "సర్వం కర్మాఖిలం పార్థ! జ్ఞానే పరిసమాప్యతే" (గీ. 4-33)- సర్వకర్మల సమాప్తి యు జ్ఞానమందే యగుచున్నది అనియు నిట్టి గీతావాక్యములు చూపింపఁబడినవి. సారాంశ మేమన- బౌద్ధధర్మ సమాప్త్యనంతరము ఈ విశిష్టమార్గ మొక్కటియే శ్రేష్ఠమని నిశ్చయించి శ్రీశంకరాచార్యుల వారు దీనిని స్థాపించిరి. తదనుకూలముగనే గీతార్థ మున్నది. పూర్వ టీకాకారులు చెప్పినట్లు జ్ఞానకర్మల సముచ్చయము గీతలలోఁ బ్రతిపాద్యము కాదు; కాని జ్ఞానప్రాప్తికి సాధనము అనఁగా; గౌణసాధనము. తుదకు సర్వకర్మసన్యాసపూర్వకమగు జ్ఞానముచేతనే మోక్షము సిద్ధించునని యీ శాంకరసంప్రదాయ సిద్ధాన్తమునే భగవద్గీతలలో శ్రీకృష్ణభగవానుఁ డగ్గునున కుపదేశించెను. ఈ విషయము నిరూపించుటకే శాంకరభాష్యము వ్రాయఁబడినది. శంకరాచార్యులకంటె పూర్వమునం దీ గీతలకు సన్యాసపరముగ నేదో యొక టీక యుండియుండును. అది యిప్పు డలభ్యము. కావుననే గీతలయొక్క ప్రవృత్తిపరమైన టీకను తీసివైచి, దానికి నివృత్తిపరమైన సాంప్రదాయిక రూపమును కలుగఁ జేయుటకు శాంకరభాష్యమే మొట్టమొదట నారంభించినదని చెప్పవలయును. శంకరాచార్యుల తర్వాతనుండి వారి సంప్రదాయమున కనుయాయులైన మధుసూదనసరస్వతి మొదలగు ననేక టీకాకారు లీ విషయమున ముఖ్యముగ నాచార్యులవారినే యనుకరించిరి. ఐనను మరియొక చమత్కారకారకమగు కల్పన వెలువడెను. అది యేమన- అద్వైతమతమునకు మూలభూతములగు మహావాక్యములలో "తత్త్వమసి"-అది (ఆ పరబ్రహ్మము) నీవు (శ్వేత

కేతువు) అయితివి" అను ఛాందోగ్యోపనిషత్తులోని ముఖ్యమగు నీ మహావాక్యము యొక్క వివరణమే గీతలలో పదునెనిమిది యధ్యాయములలో నున్నది. కాని మహావాక్యములో నున్న పదముల క్రమమును మార్చి మొదట "త్వమ్" అనియు, పిదప "తత్" అనియు నటుపిమ్మట "అసి" యనియు నీ పదములఁ జేకొని యీ నూతన క్రమానుసారముగ నారంభము మొదలొక్కొక్క యాఅధ్యాయము లను భగవంతుఁడు నిష్పక్షపాతబుద్ధితో వరుసగా నరిగా పంచిపెట్టి నాఁడు. గీతలమీఁదఁ బైశాచభాష్య మనున దే సంప్రదాయానుసార మునను గాక స్వతంత్రముగా నున్నదనియు, నా భాష్యమును హను మంతుఁడు (మారుతి) రచించె ననియు ననేకులు తలఁచుచున్నారు. కాని యిది సత్యముకాదు. భాగవతవ్యాఖ్యాన మొనర్చిన హనుమ త్పండితునిచేతనే యీ భాష్యము రచింపఁబడి సన్యాసమార్గసంబంధిగ నున్నది. మఱియు నా భాష్యములో కొన్ని చోట్ల శాంకరభాష్యములో నున్న యర్థమే యా శబ్దములతోనే వచింపఁబడినది. ఇటులే పూర్వ మందైనను పిదపనైనను రచింపఁబడిన గీతల మహారాష్ట్ర భాషాంత రీకరణములలో నైనను, ఆ భాషలోని నిరూపణలలో నైనను తఱుచుగ శాంకరభాష్యానుసారముగనే యర్థ మున్నది. ప్రొఫెసర్. మాక్సు మూలరుచే నచ్చొత్తింపఁ బడిన ప్రాచ్యధర్మపుస్తకమాలలోను, కై. కాశీనాథపంత్ తేలంగ్ గారిచే నొనర్పఁబడిన యాంగ్ల భాషాంత రీకరణమునను, శ్రీ శంకరాచార్యులను గాని, శాంకరసంప్రదాయకు లైన టీకాకారులనుగాని యనుసరించియే యర్థము వ్రాయఁబడినది. ఇటులే భాషాంతరీకరణ గ్రంథప్రస్తావనలో చివర వ్రాయఁబడినది.

గీతలమీఁద నైనను ప్రస్థానత్రయములోని గ్రంథములమీద నైనను, సాంప్రదాయిక భాష్యగ్రంథములు వ్రాయ నాచార మిటుల నొకతీరునఁ బ్రారంభమైన పిదప నితర సంప్రదాయములయందును దానికే (శాంకర మతమునకే) యనుకరణము చేయఁబడినది.

మాయావాదమును, అద్వైతమును, సన్యాసమును ప్రతిపాదించు శాంకర సంప్రదాయానంతరము దాదాపు 250 సంవత్సరములకు శ్రీరామానుజాచార్యుల [జన్మశకము 938] వారిచే విశిష్టాద్వైత సంప్రదాయము ప్రవర్తింపఁ జేయఁబడినది. మఱియు నా సంప్రదాయమును స్థిరపఱచుటకు శ్రీ శంకరాచార్యులవలెనే రామానుజాచార్యులును ప్రస్థానత్రయము మీఁదను (అనగా: గీతలమీఁదఁ గూడ) స్వతంత్రమైన భాష్యమును రచించినారు. శ్రీ శంకరాచార్యుల వారి మాయా మిథ్యాత్వవాదము, నద్వైతసిద్ధాంతమును సత్యములు కావనియు, జీవుఁడు, జగత్తు, ఈశ్వరుఁ డను నీ మూఁడుతత్త్వములును భిన్నములైనను, జీవుఁడు (చిత్) జగత్తు (అచిత్) అను నీ రెండు నొక ఈశ్వరుని శరీరముగ నుండుటచేఁ జిదచిద్విశిష్టుఁడగు నీశ్వరుఁ డొక్కఁడే యనియు, ఈశ్వరశరీరములో నున్న యీ సూక్ష్మ చిదచిద్వస్తువు లందుండియే యనంతరము స్థూలచిదచిద్వస్తువులు (అనఁగా: అనేకజీవములు, జగత్తులు) నిర్మింపఁబడుచున్న వనియు రామానుజులవారి సంప్రదాయము. మఱియు నీ మతమే యుపనిషత్తులలో బ్రహ్మసూత్రములలో గీతలోఁ బ్రతిపాదితమని రామానుజాచార్యులవారు తత్త్వజ్ఞానదృష్టిచే నుడివిరి. (గీ.రా.భా.2-12; 13-2) వేయేల? భాగవత ధర్మములు విశిష్టాద్వైత ధర్మము నాక్రమించు కొనుటకు పిరి గ్రంథమే కారణమైన దని వక్కాఁడింప వచ్చును. కారణ మేమన:- తత్పూర్వమందు మహాభారతములోను గీతలలో నున్న భాగవతధర్మ నిరూపణ మద్వైత మతమును స్వీకరించి రచియింపఁబడినట్లు కానఁబడుటయే. రామానుజాచార్యులవారు భాగవతధర్మమున నుండినవా రగుటచే గీతలోఁ బ్రవృత్తిపరమగు కర్మయోగము ప్రతిపాద్య మను విషయమును యథార్థముగ నూహింపవలసిన వారే; కాని రామానుజాచార్యులవారి కాలమున మూల భూతము లగు భాగవత ధర్మములలోఁ కర్మయోగము విశేష

భాగము లుప్తప్రాయమై దానికి తత్త్వజ్ఞానము ననుసరించి విశిష్టా
ద్వైతపరమైనదియు, నాచారము ననుసరించి ప్రధానముగ, భక్తిపర
మైనదియు నగు స్వరూపము ప్రాప్త మగుటచే, గీతలలో జ్ఞానము,
కర్మ, భక్తియునను నీ మూఁడును వర్ణింపఁబడినను, తత్త్వజ్ఞాన
దృష్టిచే విశిష్టాద్వైతము, నాచారదృష్టిచే వానుదేవ భక్తియు నను
నీ రెండే గీతలకు సారభూతములు. కర్మనిష్ఠయే జ్ఞాననిష్ఠానంపాద
కము. స్వతంత్రము కాదు, అని రామానుజాచార్యులవారిచే
నిర్ణయింపఁబడినది. (గీ.రా.భా. 18-1; మఱియు 3-1; చూడుము)
కాని యద్వైతజ్ఞానస్థానమున విశిష్టాద్వైతమును, సన్యాసమునకు
మాఱుగ భక్తియును శాంకర సంప్రదాయముకంటె రామానుజ
సంప్రదాయమున వేఱై యున్నను తుద కాచరణ కాలమున భక్తియే
కర్తవ్యముగఁ జెప్పఁబడును. మఱియుఁ జాతుర్వర్ణ్యమునకును
స్వధర్మోక్త సాంసారికకర్మ లామరణాంతము చేయవలసినవియే
యను పక్షము గౌణముగ నున్నది. ఆ కారణమున గీతలకు రామాను
జులవారి తాత్పర్యము సైత మొకవిధమైన కర్మసన్యాసయోగముగనే
యున్నదని నుడువవలయును. కారణ మేమన- కర్మలచేఁ జిత్తము
శుద్ధమై, జ్ఞానోత్పత్తియైన పిదపఁ జతుర్థాశ్రమమునఁ బ్రవేశించి,
బ్రహ్మచింతనలో మునిఁగి యుండిన నేమి? ప్రేమచే నిరతిశయ
వానుదేవ భక్తిప్రవాహమున నీఁదులాడిన నేమి? రెండుమార్గములును
కర్మయోగదృష్టిచే నొక్కటియే, అనఁగా- నివృత్తిపరములే.
మఱియు నీ యాక్షేపణయే రామానుజాచార్యులవారి యనంతరము
వెలువడిన సంప్రదాయములను సంబంధించు చున్నది.

"మాయామిథ్యాత్వవాదము సత్యము కాదు. కావున వాసు
దేవ భక్తిచేతనే తుదకు మోక్షము లభించుమన్నది. పరబ్రహ్మకును
జీవునకును కొన్నియంశములచే నేకత్వ మున్నను నంశాంతరములచే
భేద మెప్పుకొనుటు పరస్పరవిరుద్ధమై యసంబద్ధ మగును. కాన,

నీ రెండును సర్వదా భిన్నములే యని యెఱుంగవలయు. పూర్ణత్వము గాని, యంశముగుండ నా రెంటికి నైక్యమగుట గాని, సంభవము కాదు," అని శ్రీరామానుజాచార్యులవారి యనంతరము వెలువడిన మూడవ సంప్రదాయముయొక్క యభిప్రాయముగ నున్నది. ఈ కారణముచేతనే దీనిని ద్వైతసంప్రదాయ మని చెప్పుదురు. ఈ సంప్రదాయప్రవర్తకు లగు శ్రీ మదానందతీర్థు లను రెండవ పేరుగల శ్రీమధ్వాచార్యులవారు 1120-వ శకవత్సరమున సమాధిస్థులైరి. వా రా సమయమున 79 సంవత్సరముల వయస్సు గలవా రై యుండి రని మాధ్వసంప్రదాయకులు వచించెదరు; కాని డాక్టర్ భాండార కరునిచేఁ బ్రకటింపఁబడిన "శైవ, వైష్ణవ, అన్యుల పంథ" యను నాంగ్లగ్రంథము 59-వ పేజీలో మధ్వాచార్యులవారి కాలము 1119-వ శకవత్సరము మొదలు 1198-వ వత్సరపర్యంతమై యున్నదని శిలాలేఖాదికములగు ప్రమాణాంతరములచే నిశ్చయింపఁబడినది. శ్రీమధ్వాచార్యులు ప్రస్థానత్రయముమీఁద (అనఁగా- గీతలమీఁద సైతము) రచించిన భాష్యమునుండి యీ సర్వగ్రంథములును ద్వైతసంప్రదాయ సంబంధములే యని తేలుచున్నది. "నిష్కామ కర్మయొక్క మహత్త్వము గీతలలో వర్ణింపఁబడినను, నిష్కామకర్మ సాధన మగును కాని, భక్తియే పరమము (ముఖ్యసాధనము)" అని తమ గీతాభాష్యములో శ్రీమధ్వాచార్యులవారు వక్కాణించు చున్నారు. "భక్తి సిద్ధమైన పిదపఁ గర్మ చేసినను జేయకపోయినను విశేష మేమియు లేదు. "ధ్యానాత్కర్మఫలత్యాగః," "పరమేశ్వర ధ్యానముకంటె (అనఁగా- భక్తికంటె) కర్మఫలత్యాగము, లేక, నిష్కామకర్మ, శ్రేష్ఠము"-ఇత్యాదికములగు కొన్ని గీతావచనములే యీ సిద్ధాంతమునకు విరుద్ధములుగ నున్నవి. ఈ వచనములు పర మార్థముగా (అక్షరశః) సత్యములు గావు. అర్థవాదాత్మకములని యెఱుంగ వలయును" అని భగవద్గీతల మాధ్వభాష్యములో నున్నది. (గీ.మా.భా. 12-13).

నాళ్వార సంప్రదాయము శ్రీవల్లభాచార్యులవారిది (జన్మశకము 1401); శ్రీరామానుజాచార్య మధ్వాచార్యుల సంప్రదాయముల వలెనే యీ సంప్రదాయమును వైష్ణవమార్గములోనిదే; కాని విశిష్టాద్వైత ద్వైతమతములకంటె జీవేశ్వర జగత్తుల సంబంధ విషయమున నీ సాంప్రదాయికమతము వేఱైనది. "మాయావిరహితమును (అనఁగా- శుద్ధజీవము) పరబ్రహ్మయు నొక్కటియే; రెండు కా" వని వచించుట యీ సంప్రదాయోద్దేశము. కావుననే వీరిని శుద్ధాద్వైతులని చెప్పుచున్నారు. అయినను శ్రీశంకరాచార్య మతానుసారముగ జీవబ్రహ్మల కైక్య మంగీకరింపక 'అగ్నివిస్ఫులింగ' న్యాయరీతిగ "జీవుఁ డీశ్వరాంశముగ నున్నాఁడు; మాయాత్మక జగత్తు మిథ్య కాదు. ఎందుచే నన- మాయయే పరమేశ్వరేచ్ఛచే నీశ్వరునుండి విభక్తమైన యొక శక్తిగ నున్నది. మాయాపరతంత్రుఁడగు జీవునకు మోక్షప్రాప్తిజనకమగు జ్ఞాన మీశ్వరానుగ్రహము లేక లభించుట యసంభవము గాన భగవద్భక్తియే మోక్షమునకు ముఖ్య సాధన" మని యీ సంప్రదాయమందలి రెండవ సిద్ధాన్తమగుటచే శాంకరసంప్రదాయముకంటె నిది వేఱుగ నున్నది. ఈ పరమేశ్వరానుగ్రహమునకే పుష్టి యనియు, పోషణ యనియు, నామాంతరము లుండుటచే నీ సంప్రదాయమును పుష్టిమార్గమనియుఁ జెప్పు వాడుక గలదు. ఈ సంప్రదాయము ననుసరించి గీతలమీఁద వ్రాయఁబడిన "తత్త్వదీపి" కాది గ్రంథములలోఁ బ్రతిపాదింపఁబడి నిశ్చయింపఁబడిన విషయ మేమన-"సాంఖ్యజ్ఞానమును, కర్మయోగమును నర్జునునకుపదేశించి తుద కతనిచే భక్త్యమృతపానముఁ జేయించి భగవంతుఁడతనిఁ గృతకృత్యునిఁ జేసిన కారణమున గృహదారాదుల వదలి వేయఁ దగినట్టి కేవల నివృత్తిపరమగు పుష్టిమార్గీయభక్తి యనునదే సర్వగీతా తాత్పర్యము. మఱియు నీ హేతువుచే భగవంతుడు- "సర్వధర్మా న్పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ"(గీ.18-66) "సర్వ ధర్మములువదలి నన్నొక్కనినే శరణుచెందుము" అని తుద కుపదేశించెను."

ఇదియకాక నింబార్కాచార్యులవారి మతము రాధాకృష్ణ పరమై భక్తిప్రధానమగు నొక వైష్ణవ సంప్రదాయముగ నున్నది; ఈ యాచార్యులవారు శ్రీరామానుజాచార్యులవారి యనంతరము నను శ్రీమధ్వాచార్యులవారికిఁ బూర్వమునను (శక. 1084) నుండిరని డాక్టరు భాండారకరు గారిచే నిశ్చయింపఁబడినది. జీవేశ్వర జగత్తులు మూఁడును వేర్వేఱైనను జీవ జగత్తుల యస్తిత్వ వ్యాపారములు స్వతంత్రములు గావనియు, నీశ్వరేచ్ఛ ననలంబించియున్న వనియు, మూలభూతుఁడగు పరమేశ్వరునియందే జీవజగత్తుల సూక్ష్మతత్త్వము లంతర్భూతము లగుచున్నవనియు నింబార్కాచార్యులవారి మతము. ఈ మతసిద్ధాంతము కొఱకు నింబార్కాచార్యుల వేదాంత సూత్రములకు స్వతంత్రమగు నొక భాష్యమును వ్రాసిరి. ఈ సంప్రదాయము ననుసరించి కేశవకాశ్మీరభట్టాచార్యులవారు భగవద్గీతలకుఁ 'దత్త్వ ప్రకాశిక' యను నొక వ్యాఖ్య వ్రాసి యా గ్రంథమున గీతార్థ మీ సంప్రదాయమున కనుకూలించి యున్నదని నిరూపించిరి. శ్రీరామానుజాచార్యుల వారి సంప్రదాయమునకు నీ సంప్రదాయమునకు భేదము చూపుటకు దీనిని ద్వైతాద్వైతసంప్రదాయ మని చెప్పుట యుక్తముగ నున్నది. నేత్రములకుఁ బ్రత్యక్షగోచరములగు వస్తువులు సత్యములని యంగీకరింపక పోవుటచే వ్యక్తముయొక్క యుపాసనము (అనఁగాఁ భక్తి) నిరాధారమగును. కొన్ని కొన్ని యంశములలో నసత్య మగునను తలంపుచే శాంకరసంప్రదాయము నందలి మాయావాదమును స్వీకరింపక ద్వైతవిశిష్టాద్వైతుల వేర్వేఱగు భక్తిపర సంప్రదాయములు ప్రవృత్తిపరములైన వను సంగతి స్పష్టమగుచున్నది. భక్తియొక్క యుపపత్తి నంబంధించుటకొరకే యద్వైతమును మాయావాదమును వదలవలయునని వచించుట కశక్యము. మాయావాదమును నద్వైతమును స్వీకరించియే మహారాష్ట్రసాధుపుంగవులు భక్తిని సమర్థించియున్నందున నీ మార్గము శ్రీశంకరాచార్యులకుఁ బూర్వమునం దుండియే వచ్చుచున్నదని యూహ

తోఁచుచున్నది. అద్వైతము, మాయామిథ్యాత్వము, కర్మత్యాగావశ్యకత యను శాంకరసంప్రదాయములగు మూఁడు సిద్ధాన్తములు నీ మార్గమున గ్రాహ్యములుగనే యున్నవి. "తుజేహ్వావా ఆహే దేవ తరి హా సులభ ఉపావ" - స్వామీ! సంసారమును దరించుటకు నీ వాఁడగుట సులభమగు నుపాయము (తుకా. గా. 3002. 2) అని తుకారాంబావాగారి వచన ప్రమాణమున- "బ్రహ్మాత్మైక్య రూపమగు మోక్షము నొందుట కున్న యనేక సాధనములలో భక్తిమార్గము మిక్కిలి సులభమైనది" అని యీ సంప్రదాయములోని సమస్త జనుల కుపదేశింపఁబడినది గాన భగవద్గీతలలోనే- "క్లేశోఽధికతరస్తేషా మవ్యక్తాసక్తచేతసామ్"- అవ్యక్త బ్రహ్మయందుఁ బిత్తము దగులుట యధికమైన క్లేశము (గీ. 12. 5) అని ముందుగఁ గారణమును జూపుచు వెంటనే "భక్తాస్తేఽతీవ మే ప్రియాఃఁ"- నా భక్తులే నాకు మిక్కిలి ప్రీతిపాత్రు లగుచున్నారు (గీ.12.20) అని భగవంతుఁడర్జునున కుపదేశించిన కారణముననే యద్వైతపర్యవసాయియగు భక్తిమార్గమే గీతలలో ముఖ్యప్రతిపాద్య విషయ మగును అనియు వారు యుక్తిఁ జెప్పుదురు. శ్రీధరస్వాములవారు గీతకుఁ దమ టీకలో (గీ. 18.78) నీ తాత్పర్యమునే వ్రాసిరి. ఐనను గీతల కీ సంప్రదాయసంబంధమగు జ్ఞానేశ్వరి యను గ్రంథము మహారాష్ట్ర భాషలో వ్రాయఁబడినను నుత్తమ మగునదిగనే యున్నది. ఇందు గీతాష్టాదశాధ్యాయములలోను తొలి నాలుగధ్యాయములలోఁ గర్మము, పిమ్మట నేడధ్యాయములలో నుపాసనయుఁ, దదనంతరాధ్యాయములలో జ్ఞానమును బ్రతిపాద్యము లని యున్నవి. మఱియుఁ దమ టీక శాంకరభాష్యప్రవేశమునకు మార్గదర్శక మగునట్లు రచింపఁబడిన దని జ్ఞానేశ్వర్ గారు తమ గ్రంథాంతమున స్వయముగఁ జెప్పియున్నారు. మఱియు గీతార్థము ననేక సరనదృష్టాంతములచే విస్తరింపఁజేసి వర్ణించు జ్ఞానేశ్వరమహారాజుగారి శైలి యలౌకికమగుటయ కాక శ్రీశంకరాచార్యుల వారికంటెను విశేషము భక్తిమార్గమును నిష్కామ

కర్మమును సమర్థించియుండుటం జేసి జ్ఞానేశ్వరి యను గ్రంథము గీతలమీద నొక స్వతంత్రభాష్యగ్రంథముగ నంగీకరింపఁబడఁ దగినది. జ్ఞానేశ్వరమహారాజు తాను యోగి కాన గీతాషట్టాధ్యాయమున బాతంజలయోగాభ్యాస విషయము గల శ్లోకములకు టీక విస్తరించి రచించెను. ఆఱవయధ్యాయము సమాప్తియందు "తస్మాద్యోగీ భవార్జున"- కావున నో యర్జునా! యోగివి కమ్ము, (అనఁగా యోగాభ్యాసములోఁ బ్రవీణుఁడవు కమ్ము) (గీ. 6. 46) అని భగవంతుఁడర్జునున కుపదేశము చేయుచు సర్వమోక్షమార్గములలోఁ బాతంజల యోగము సర్వోత్తమమని స్థాపించె నని జ్ఞానేశ్వరులు స్పష్టీకరించిరి.

సారాంశమేమన- గీతలలో నుపదేశింపఁబడిన ప్రవృత్తిపర కర్మమార్గమున గౌణము (అనఁగా జ్ఞానమునకుఁ గేవల సాధనము) అని నిర్ణయించి, తమ తమ సంప్రదాయములలో వర్ణింపఁబడిన తత్త్వజ్ఞానమును, దానితోపాటు మోక్షదృష్టిచేఁ దుదకు గర్తవ్యము లని వర్ణింపఁబడిన యాచారములే అనఁగా మాయావాదాత్మకమగు నద్వైతము కర్మనన్యాసము, మాయానత్యత్వప్రతిపాదక విశిష్టాద్వైతము వానుదేవభక్తి, ద్వైతము విష్ణుభక్తి యును, శుద్ధాద్వైతము భక్తి యును, శాంకరాద్వైతము భక్తి యును, లేక, పాతంజలయోగము భక్తి యును, లేక కేవల భక్తి యును, కేవల యోగమును, కేవల బ్రహ్మజ్ఞానమునను ననేక విధములగు కేవల నివృత్తిపరములైన మోక్షధర్మములు, గీతలలో ప్రతిపాద్యములుగా నున్నవని వేర్వేఱు భాష్యకర్తలును, టీకాకారులును తమ తమ గీతార్థములను నిశ్చయించియున్నారు.*

* వేర్వేఱు సంప్రదాయములను ప్రవర్తింపఁ జేయువట్టి యాచార్యుల గీతాభాష్యములును, ఆయా సంప్రదాయముల నమువరించి భాష్యములమీఁద వ్రాసిన టీకలును, మొత్తమున పది పదునైదు టీకలు బొంబాయిలో మన్న గుజరాతి ప్రింటింగ్‌ప్రెస్ అధికారిచేఁ బ్రచురింపఁబడినవి. వేర్వేఱు టీకాకారుల యభిప్రాయములు వాక్యసారిగఁ జూపుట కీ గ్రంథము మిక్కిలి యుపయోగించును.

భగవద్గీతలలోఁ గర్మయోగము ప్రధానముగఁ బ్రతిపాద్య మని యెవ్వరును చెప్పరని నే ననుటయే కాక ప్రసిద్ధులును మహారాష్ట్ర కవులు నగు వామనపండితులును నీ సంగతినే చెప్పుచు గీతలకుఁ దమచే విస్తృతముగ రచియింపఁబడిన 'యథార్థదీపిక' యను మహారాష్ట్ర భాషాటీకయొక్క యుపోద్ఘాతమున మొదట-"పరి అజీ భగవంతజీ, యాకలియుగామాజీ, జోతో గీతార్థ యోజీ, మతానురూప" -స్వామీ! యీ కలియుగమున ననేకులు తమతమ మతముల కనుకూలముగ గీతార్థమును వ్రాసియున్నారు అని చెప్పి యనంతరమున "కోణ్యామిసేతరీకోజీ గీతార్థ అన్యథావా భాజీ, మజనావఢేతోథోరా చీహీకరణీకాయకరూజీ భగవంతా"-ఓ పరాత్పరా! ఏదో యొక కారణమున నందఱును గీతలకు తోఁచినటులెల్ల నర్థము వ్రాసిరి. కాని వీరు వ్రాసిన యర్థము నా కిష్టములేదు. భగవంతుఁడా నే నేమి చేయుదును? అని భగవంతుని సమీపమున నిందారూపముగ గానమొనర్చిరి. అనేక సంప్రదాయములవా రగు గీతాటీకాకారుల వేర్వేఱు మతముల యీ కోలాహలమును జూచి కొందఱు "ఈ సంప్రదాయములును పరస్పర విరుద్ధములు గాన వానిలో నొక్కటియే గీతా ప్రతిపాద్య మని నిశ్చయించి చెప్పుట సాధ్యము కాదు. అందుచేఁ బైనుదాహరింపఁబడిన సర్వమోక్షసాధనములును, వానిలో సైతము ముఖ్యముగ కర్మ భక్తి జ్ఞానము లను నీ మూఁటిని స్వతంత్రముగను, వేర్వేఱుగను, సంక్షేపముగను, సారవత్తరముగను వర్ణించి, భగవంతుడు రణభూమియందు యుద్ధారంభమున ననేక మోక్షోపాయముల కలవరములో నున్న యర్జునుని గీతలవలన సమాధానపఱచుటచే సంగీకరించుట ప్రాప్తమైనది" అని యందురు. అనేకవిధ మోక్షోపాయముల యీ వర్ణనలు పరస్పర మనంబద్ధములు గాకుండ నేకవాక్యతఁ జేసి గీతలలో నిరూపింపఁబడిన దని సైత మనేకులు నుడువుదురు. మఱియుఁ దుదకు గీతలలోనున్న బ్రహ్మవిద్య పై కత్యంత సులభమై

కనఁబడినను, వానిలో నున్న సత్యమైన మర్మము మిక్కిలి గూఢము. అందుచే గురుముఖము నందుండి వినక యెవ్వరికిని స్పష్టపడ దని యనేకులు చెప్పుదురు (గీ. 4. 34). గీతలపై ననేక వ్యాఖ్యానము లున్నను వాని యర్థము తెలిసికొనుటకు గురుముఖముకన్న వేఱు త్రోవలేదు.

ఈ ప్రకారము, 1. మహాభారతకారులచే స్వయముగఁ బ్రతిపాదింపఁబడిన భాగవత ధర్మముల ననుసరించినదియు, అనఁగా ప్రవృత్తిపరమగు నదియు, 2. వారి పిదపఁ బ్రబలిన విద్వాంసులగు ననేకాచార్యులచే, యోగులచే, భగవద్భక్తులచేఁ దమ తమ సంప్రదాయముల కనురూపముగఁ బ్రతిపాదింపఁబడినదియు, 3. శుద్ధనివృత్తి పరములైన యనేకవిధ తాత్పర్యములఁ జూచి యేమియుఁ దోఁపక యెవ్వఁడైన "నీ పరస్పర విరుద్ధములగు ననేక తాత్పర్యము లొక గ్రంథముననుండి వెలువడుట శక్య మగునా?" యని సహజముగఁ బ్రశ్న సేయును.

శక్యమా యనుమాట దూరముగ నుండనిమ్ము. ఇష్టమా? ఇష్ట మగునేని యట్లుండుటకుఁ గారణ మేమి? వేర్వేఱు భాష్యకర్తలగు నాచార్యులు సైతము విద్వాంసులు ధార్మికులు నత్యంతసత్యశీలురు అను విషయమున నేవారికిని సంశయము లేదు. వేయేల? శ్రీ శంకరాచార్యులవారివంటి మహాతత్త్వజ్ఞాని ఇంతపర్యంతమును జగమున పుట్టనే లేదన్న నతిశయోక్తి కానేరదు. కాని వారికిని వారివెంబడి ప్రబలిన యాచార్యులకు నింత మతభేదమేమి? గీతలలోనుండి యెల్ల వారును దమ తమ యిష్టానుసారమగు నర్థము వెలువరించుట కది యొక యింద్రజాలమా? పూర్వోక్తసంప్రదాయములు సైతము వెలువడుటకుఁ బూర్వమునసే రచియింపఁబడిన గీత యర్జునుని భ్రమ నశించుటకు శ్రీకృష్ణభగవానునిచే నుపదేశింపఁబడినదే కాని యిటుల భ్రమ వృద్ధిఁ బొందుటకుఁ గాదు. మఱియు నీ గీతలలో నిశ్చితార్థ

మొక్కటియే యర్జునున కుపదేశింపఁబడుటచే (గీ. 5. 1-2) నతని కా యుపదేశ మటుల పరిణమించినది.

అటులైనను నీ గీతల తాత్పర్యవిషయమున నిన్ని భేదములేల? సత్యమే! ప్రశ్న కఠినముగనే యున్నది; కాని దానికి సమాధానము విచారించిన తర్వాతఁ దొలుత ననుకొన్నంత కఠినమైనదిగ నుండదు. అందులకు నొక దృష్టాంతము: మధురమైన, రసయుక్తమైన యొక పక్వాన్నమును(మిఠాయి) జూచి యొకఁ డిది గోధూమధాన్యసంబంధి యనియు, మఱియొకఁడు ఘృత సంబంధి యనియు, నింకొకఁడు శర్కరాసంబంధి యనియుఁ దమ తమ యభిరుచి ననుసరించి చెప్పినచో, దానిలో నేది యసత్య మని యందుము? ముగ్గురును దమ తమ మతముల ననుసరించి యథార్థమునే చెప్పుచున్నారు. మఱియు నింతయైన నా పక్వాన్నమేది? యనుప్రశ్న కావంతయైన సమాధానము తెలియక ప్రశ్న పూర్వముపలెనే యున్నది. ఏలన-గోధుమలు, నేయి, పంచదారయు-నీ మూఁడు పదార్థముల నేకముగఁ జేసి, అందుండి లాడు, జిలేబి, మోతిచూర్ మొదలగు ననేక పక్వాన్నములు (మిఠాయిలు) చేయుటకు వీలుండుటచే, వానిలో ప్రస్తుత పక్వాన్నమేది? యను దాని నిర్ణయము గోధూమప్రధానమని యైనను ఘృతప్రధానమని యైనను, శర్కరాప్రధానమని యైనను చెప్పినంత మాత్రముననే చేయుట శక్యము కాదు. మఱియు రెండవ దృష్టాంతము- సముద్రమథన సమయమం దెటు లొకరి కమృతము, నింకొకరికి విషము, మఱియు ననేకులకు ప్రాప్త్యనుసారముగ లక్ష్మి, కౌస్తుభము, నైరావతము, పారిజాతము మొదలగు వేర్వేఱు వస్తువులు లభించినంత మాత్రమున, సముద్రము యొక్క యథార్థస్వరూప నిర్ణయమెటుల గోచరమగుట లేదో, యటులే సంప్రదాయరీతి ననుసరించి గీతాసముద్రమథన మొనర్చు టీకాకారుల భిన్నభిన్న తాత్పర్య నిరూపణ మాత్రముచే గీతాతాత్పర్య యాథార్థ్యనిర్ణయము గోచరము కాదు. మఱియుఁ గంసవధ సమయమున సభామండపములోనికి

నిశ్శంకముగాఁ బోయిన శ్రీకృష్ణభగవానుఁ డొక్కఁ డే యెటుల వేర్వేఱు మనుష్యులకు వేర్వేఱుగ (అనఁగా మల్లురకు వజ్రమువలెను, కామినులకు మదనునివలెను, మాతాపితలకుఁ బుత్రునివలెను) భాసించెనో (భాగ. 10. పూ. 43. 17.) యటులే, భగవద్గీత యొక్కటియె వేర్వేఱు సాంప్రదాయికులకు వేర్వేఱుగఁ గానిపించు చున్నదని చెప్పుట తప్పకాదు. ఏ ధర్మసంప్రదాయ మైనను సాధారణముగఁ ప్రమాణభూతములగు ధర్మగ్రంథముల ననుసరించి యుండవలయు ననుట స్పష్టమే! కారణమేమన- ధర్మగంథముల ననుసరించి యుండనిచో నా సంప్రదాయ మంతయు నప్రమాణమై లోకుల కనంగీకార్యమగును. కాన, వైదికధర్మముల సంప్రదాయము లెన్ని యున్నను, ఈశ్వరుఁడు, జీవుఁడు జగత్తు - వీని పరస్పరసంబంధము మొదలగు విశేషవిషయములలోఁ దక్క సాధారణమగు నితరవిషయములు సర్వసంప్రదాయములలో నొక విధముగనే యుండును. మఱియు నా కారణముననే మన ధర్మగంథములలోని ప్రమాణభూతగ్రంథములపై నున్న సాంప్రదాయిక భాష్యములలోఁ గాని, టీకలలోఁ గాని నూటికి తొంబదియో, లెక్క యింకను నధిక సంఖ్యగల శ్లోకముల యభిప్రాయమో యొక్క విధముగనే యోజింపఁ బడియున్నది. ఉన్న భేదమంతయు మిగిలిన వచనముల సంబంధముచే నై యున్నది. ఆ శ్లోకములకు సరళమైన యర్థమే చేసిన సర్వసంప్రదాయముల కొక రీతిగనే యనుకూలత సంభవింపదు. ఈ కారణముచే వీనిలోఁ దమ సంప్రదాయముల కనుకూలముగ నుండు శ్లోకములు మాత్రమే ప్రధానవచనము లనియు, నితరములు గౌణము లనియుఁ, ప్రతికూల వచనము లుండినచో వాని కర్థమును యుక్తిగ మార్చుచు, మఱియు సాధ్యమైనచోట సుగమములును సరళములు నైన వచనములలోఁ దమ కనుకూలముగ శ్లేషార్థము ననుమానమును దీయుచుఁ, దమ సంప్రదాయమే యా గ్రంథమునుండి సిద్ధ మగుచున్నదని వేర్వేఱు సాంప్రదాయిక టీకాకారులు ప్రతిపాదనఁ జేయుచున్నారు. (గీత.

2-12-16; 3-19; 6-8; 18-2. శ్లోకములపై నా వ్యాఖ్యానము చూడుము.) కాని యీ తీరున నొక గ్రంథతాత్పర్యము నిర్ణయించుటయు, తమ సంప్రదాయమే గీతలలోఁ బ్రతిపాద్యమై యుండవలయునని యైనను మఱి యే యభిమానము నైన నుంపక సమగ్ర గ్రంథపరీక్షణము స్వతంత్రరీతితోఁ జేసి కేవలము దాని నుండియే నందులోని మథితార్థము వెలువరించుటయు, నను నీ రెండుసంగతులు స్వభావము చేతనే యత్యంత భిన్నములుగా నున్న వనునది యెవరి కైనను సహజముగఁ దోఁపవచ్చును. గ్రంథతాత్పర్య నిర్ణయ మను విషయమున సాంప్రదాయికదృష్టి, దోషయుక్తమని వదలినయెడల గీతాతాత్పర్యము లేవో చెప్పఁబడవలయును. గ్రంథమున కైనను, వాక్యములకైనను, నర్థనిర్ణయములో నత్యంతకుశలులగు మీమాంసకుల కందఱకు మాన్యమగు-

ఉపక్రమోపసంహారా వభ్యాసోఽపూర్వతా ఫలమ్,
అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్యనిర్ణయే.

అను నొక ప్రాచీనశ్లోకము కలదు. ఏ వ్రాఁతకైనను బ్రకరణమున కైనను గ్రంథమునకైనను తాత్పర్యము నిర్ణయింపవలసినచోఁ బై శ్లోకమునఁ జెప్పఁబడిన యేడు సంగతులు సాధనభూతములగుటచే వాని నవశ్యము విచారణ చేయవలయునని మీమాంసకులందురు. వీనిలో "ఉపక్రమోపసంహారౌ", అనఁగా: గ్రంథాద్యంతములు, మొదటి రెండు విషయములై యున్నవి. ఎవరైన మనస్సున నేదో యొక నూతనోద్దేశము నుంచుకొని గ్రంథరచన కారంభింతురు. మఱియుఁ బ్రకృతమగు తన నూతనోద్దేశము సిద్ధమైన పిదప గ్రంథసమాప్తిఁ జేయుదురు. కావుననే గ్రంథోపక్రమోపసంహారములను గ్రంథతాత్పర్యనిర్ణయ విషయమున మున్ముందుగ విచారింపవలయును. సరళరేఖ యన నేమియో వివరించునపుడు భూమితి శాస్త్రమున (అనఁగా: రేఖాగణితశాస్త్రమున) "ప్రారంభమందున్న బిందువునుండి కుడివైపున కైనను, నెడమవైపునకైనను, క్రిందికిఁగాని

పైకిఁగాని వంపులేక నే రేఖ నరిగా వెళ్ళునో యది నరళ రేఖ" యని చెప్పవలయునని నిర్ణయింపఁ బడినది. గ్రంథ తాత్పర్యమునకు నీ న్యాయమే సంబంధించియున్నది. ఏ తాత్పర్యము గ్రంథాద్యంతము లను వదలిపెట్టక యీ రెండుగుర్తులకుమధ్య నరిగా నిమిడియుండునో యది యాగ్రంథమునకు నరళమగు తాత్పర్యమగును. ప్రారంభము మొదలు నమాప్తిపర్యంతము నడచుట కితరములగు మార్గములున్నను నవి యన్నియు వంకరతోవలే యని యెఱుంగవలయు. ఆద్యంత ములు చూచి ఇటుల గ్రంథతాత్పర్యమార్గము ముందుగ నిశ్చయించి, పిమ్మట నా గ్రంథములో 'నభ్యాసము' (పునరుక్తి, లేక, మాటిమాటికి చెప్పిన సంగతి) చూడవలయును. అందులకు కారణము; గ్రంథకారుని మనస్సులో నే సంగతి స్థిరపఱుపవలయునని యుండునో అద్దానిని సమర్థించుటకై పలుమా ఱనేక కారణములచేఁ బ్రతిపాదయమునను "కావుననే యీ సంగతి సిద్ధమైన" దని యైనను, లేక, "యీ సంగతి యిట్లొనర్పవలయు" నని యైనను మాటిమాటి కొక నిశ్చితమైన సిద్ధాన్తమునే చెప్పును. గ్రంథతాత్పర్యమును నిశ్చయించుటలో నాలవ యేనవ సాధనముల 'యపూర్వతయు, ఫలము' నై యున్నవి. అపూ ర్వతయన నవీనత్వము; ఏ గ్రంథకారుఁడైనను తానొక క్రొత్తసంగతిని చెప్పక యెన్నఁడును నవీనగ్రంథరచనలోఁ బ్రవర్తింపఁడు. పూర్వము ముద్రణ యంత్రములు లేనపుడు సైత మటుల ప్రవర్తింప లేదు. కావున నేదైన నొకగ్రంథ తాత్పర్యము నిర్ణయించుటకంటె మునుపా గ్రంథములో నపూర్వత్వము, లేక, నవీనత్వ మేమికలదో చూడవలసి వచ్చును. అటులే యా వ్రాఁతకైనను, గ్రంథమునకైనను, అనఁగా- వానినుండి లబ్ధమైన పరిణామ మేమియో, విచారింపవలయును. ఏలన- ఈ ఫలము సిద్ధింపవలయు ననియు, లేక, నిష్పన్నము కావలయునని తలంపు కలిగి గ్రంథము రచింపఁ బడుటచే సిద్ధించిన పరిణామము ననుసరించియే గ్రంథకర్తయొక్క యాశయ మవశ్యము నిరయింపఁ బడవలసి యుండును.

అంటే యీడవ సాధనము లర్థవాదము, నుపపత్తియు; 'అర్థ వాద' మనునది మీమాంసకుల పారిభాషికశబ్దము (జై. సూ. 1-2; 1-18). మనకు నే సంగతినైనె ముఖ్యముగ విధించుటకు నైన, సిద్ధింపఁ జేయుటకునైన, నది సిద్ధమైన పిదప నుపపాదనారీతుల సంఘములోఁ జేరుటకైనను, పోలికగుండ నేకవాక్యతఁ జేయుటకైనను, సామ్యము నైనను, భేదమునైనను నిరూపించుటకైనను, ఇతర పక్షములలో దోష ములఁ జెప్పి స్వపక్షమున గుణమును నిరూపించుట కైనను, నలంకా రార్థము గాని, యతిశయోక్తి కిఁ గాని, యుక్తివాదమునకుఁ బోషక మను ప్రశ్నయొక్క పూర్వేతిహాస సంబంధముచే నైనను, నితర కారణములచే నైనను నొకప్పు డేమియు నూతనోద్దేశము లేకపోయి నను, ఇతరములగు ననేక విషయప్రసంగములం బట్టి గ్రంథకారుఁ డీ యర్థవాదము నుపయోగించు చుండును. ఇట్టి సమయములయందు గ్రంథకారునిచే వర్ణింపఁబడు విషయము కేవల మసంబద్ధముగా నుండకపోయినను గౌరవార్థమును, స్పష్టీకరణార్థమును, పూర్త్యర్థము నైనను జెప్పఁబడియుండుటచే నా యర్థవాదములు పరమార్థముగ సత్యములై యుండునను నియమము లేదు. వేయేల? ఇట్టి విధాన ముల సంబంధములో నర్థవాదములు ప్రత్యక్షరముగ సత్యములగునా? కావా యని విచారించుటయందును గ్రంథకారులు ప్రయత్నము చేయరని సైతము చెప్పవచ్చును. * కావుననే యీ విధానములు ప్రమాణభూతములు (అనఁగా: వానిలోనున్న వేఱువేఱు విషయముల సంబంధముచే గ్రంథకారుని సిద్ధాన్తమును దెలియఁజేయునవి) అని యంగీకరింపక, యవి కేవలము ప్రశంసాపరము (వ్యర్థములు)లో, యాగంతుకములో, స్తుత్యర్థములో యని తెలిసికొని మీమాంసకులు

* 1. గుణవాదము, 2. అనువాదము, 3. భూతార్థవాద మని యర్థవాదము మూఁడు విధములు. 1. ఇతర ప్రమాణములవలన విరుద్ధమగునది గుణవాదము. 2. ఇతర ప్రమాణముల వలన సిద్ధమగునది యనువాదము. 3. ఇతర ప్రమాణములకు విరుద్ధము గాని, ఇతర ప్రమాణములకు సిద్ధమగునది గాని గాకుండునది భూతార్థవాదము.

వాని కర్థవాదములని నామం బిడిరి. మఱియు నర్థవాదాత్మక విధానములను వదలియే గ్రంథతాత్పర్యమును నిశ్చయించుచున్నారు. ఇంత విచారించినను తుద కుపపత్తిని సైతము చూచియే తీరవలయును. ఒకానొక నూతనవిషయనిరూపణకు బాధకప్రమాణములను విమర్శించి కుదరక సాధకప్రమాణములను తర్కశాస్త్రానుసారముగ నిరూపించుటయే యుపపత్తియని యైన నుపపాదన మని యైనఁ జెప్పదురు. ఉపక్రమోపసంహారరూపము లగు రెండు హద్దులను మొదట స్థిరమైన పిమ్మట మధ్యమార్గ మర్థవాదోపపత్తుల సంబంధముచే నిశ్చయించుటకు పిలగును. ఏ విషయ మప్రస్తుతముగాఁ గాని యానుషంగికముగాఁ గాని యున్నదో యా సంగతి యర్థవాదమునుండియే తెలిసికొనఁబడుటచే నొక పర్యాయ మర్థవాదము యొక్క నిర్ణయమైన పక్షమున గ్రంథతాత్పర్యమును నిశ్చయించి చూచు మనుష్యుఁడు పెడత్రోవల నన్నింటిని వదలివేయును. కుమార్గమును వదలి సుమార్గమున వచ్చినతర్వాత నుపపత్తిసరణి, సముద్రముయొక్క తరంగముల వలె, వాచకులనైనను, గ్రంథపరీక్షకుల నైనను గ్రమముగ దొర్లించుచుఁ దుదకుఁ తాత్పర్యపర్యంతము సరళముగఁ దీసికొనిపోయి వదలును. మన ప్రాచీనమీమాంసకులచే నిశ్చయింపఁబడి వదలివేయఁబడిన యీ గ్రంథనిర్ణయ నియమము సమస్త దేశములలో నున్న విద్వాంసులకు నొక తీరుననే సమ్మత మగుటచే వాని యుపయోగ విషయమునఁ గాని, యావశ్యకతా విషయమునఁ గాని యిక్కడ విశేషముగ వివేచన చేయనక్కఱలేదు.*

---

* గ్రంథతాత్పర్యముల నిర్ణయించు నీ విషయములు ఇంగ్లీషువారి వ్యవహారములలో సైతము కనబట్టుచున్నవి. ఉదాహరణము- ఏదైన నొక తీర్పు నందుఁ గావలసిన విషయము తేలనియెడల హంకునామాను (డిక్రి) చూచుకొని తీర్పుయొక్క యర్థమును గాని ఫలితార్థమును గాని నిర్ణయించుకొనవలసి వచ్చును. ఆ తీర్పునందలి ముఖ్యాంశమును నిర్ణయించుట కుపయోగింపని సంగతులున్నయెడల నవి మఱియొక వ్యవహారమునందుఁ బ్రమాణములుగ నొప్పుకొనఁబడవు. ఇట్టి విషయము నింగ్లీషులో ఆబిటర్ డిక్టా (Obiter Dicta) అనఁగా ప్రకృతమునకు సంబంధింపని విషయము లందురు. బాగుగ విచారింతు మేని యదియు నర్థవాదములో నొక భేదము కావచ్చును.

ఇంత విమర్శయైన పిమ్మట సైత మెవరైన "ఈ మీమాంసకుల నియమము సంప్రదాయ ప్రవర్తకులగు నాచార్యులకుఁ దెలియదా? వారి గ్రంథములనుండియే యవి మీచే గ్రహింపఁబడిన యెడల వారిచే నిర్ణయింపఁబడిన గీతాతాత్పర్య మేకదేశీయముగ నున్న దనుటకుఁ గారణమేమి?" యని శంకింతురు. ఈ ప్రశ్నలకు సమాధానమును వచించెద- దృష్టి యొక పర్యాయము సాంప్రదాయికమైన పక్షమునఁ బ్రమాణభూతము లగు గ్రంథములలోఁ దమ సంప్రదాయమే వర్ణితమైనదని నిరూపించుటకు వీలైన విధమునే సాంప్రదాయిక టీకాకారులు స్వీకరింతురు. ఏలన- తమ సంప్రదాయమే కాక, పై గ్రంథమునకున్నెడవ యర్థ మే మైన నున్న నది సత్యము కాదనియు నట్లుండుటకు నేదో హేతువు వేఱెయున్నదనియు సాంప్రదాయిక టీకాకారులు గ్రంథతాత్పర్య సందర్భమున ముందే నిశ్చయించుకొని యుందురు. మఱియుఁ దమ తమ మతానుసారముగ మొదటనే సత్యమని నిశ్చయించుకొన్న యర్థమే యంతటను బ్రతిపాద్యముగ నున్నదని నిరూపించుచున్న యీ టీకాకారులకు మీమాంసాశాస్త్రముయొక్క కొన్ని నియమములకు బాధ కలిగినను బూర్వోక్తమగు దృఢనిశ్చయముచే మీమాంసా నియమముల మహత్త్వ మెంతమాత్ర మిష్టము కాదు.

హిందూధర్మశాస్త్రములలో 'మితాక్షర, దాయభాగము' మొదలగు గ్రంథములలో నున్న స్మృతివచనములయొక్క వ్యవస్థ యేకవాక్యతను సైత మీ తత్త్వము ననుసరించియే (సాంప్రదాయిక దృఢనిశ్చయముతోనే) చేయవలసి వచ్చుచున్నది; కాని కేవల హిందూధర్మగ్రంథములలోనే యీ పద్ధతి గ్రహింపఁబడలేదు. క్రైస్తవుల యొక్కయు మహమ్మదీయులయొక్కయు ధర్మముల కాదిగ్రంథములగు 'బైబిలు, ఖురాను' లలోఁ గూడ ననంతరము వెలువడిన యనేకులగు నాయా సాంప్రదాయిక గ్రంథకారులచేతను, నిటులే యరాం

తరములు రచింపఁబడినవి. మఱియు బైబిలుయొక్క ప్రాచీననిర్ణ
యములలో నున్న కొన్ని కొన్ని వాక్యములకు నర్థ మీ న్యాయము
ననుసరించియే యుహూదీయుల (Jews) యర్థములనుండి, క్రైస్తవ
భక్తులచేఁ దమ కనుకూలమగు నర్థము వేర్వేఱై కల్పింపఁబడియున్నది.
వేయేల? ఏదైన నొకవిషయముపై నుండు ప్రమాణభూతగ్రంథములు
గాని, లేఖములు గాని యెచ్చఁ బెచ్చటు మునుపే నిర్ణయింపఁబడియుం
డునో, మఱియు నెచ్చఁ బెచ్చటు ప్రమాణభూతములగు నీ నియమిత
గ్రంథముల యాధారముచేతనే ముందు సర్వమును నిర్ణయింపఁబడ
వలయునో, అచ్చ టుచ్చట నిట్టి గ్రంథార్థ నిర్ణయపద్ధతియే స్వీక
రింపఁబడి యుండునట్లు స్పష్ట మగుచున్నది. ఆధునికులగు గొప్పధర్మ
శాస్త్రపండితులును, వకీళ్ళును, న్యాయాధీశులును ప్రాచీన ప్రమాణ
భూతధర్మములయొక్కయు, నిర్ణయములయొక్కయు విషయమును
దమ తమ మతానుసారముగనే క్రిందుమీఁదు చేయుట కిదియే కార
ణము. శుద్ధలౌకికవిషయముననే యిట్టి స్థితి సంభవించు నెడల నుపని
షత్తులును-వేదాన్త సూత్రములునువలె ప్రస్థానత్రయములోని గ్రంథ
మగు భగవద్గీతపైనను సంప్రదాయము ననుసరించి వేర్వేఱు భాష్య
ములు బయలుదేరుట యాశ్చర్యమగుటకు నేమియుఁ గారణములేదు;
కాని యీ సాంప్రదాయిక మార్గమునువదలి పూర్వోక్త రీతిగ భగవద్గీత
యొక్క యుపక్రమోప సంహారాదికముపై దృష్టియుంచినచో, భార
తీయ యుద్ధారంభమునకంటెఁ బూర్వముననే కురుక్షేత్రమున
నుభయ సైన్యములు యుద్ధనన్నద్ధములై పరస్పరముఁ బ్రత్యక్షముగ
శస్త్రసంపాతనోద్యమమున నుండు నంతలో, హఠాత్తుగ బ్రహ్మజ్ఞానపు
సంగతులు చెప్పుచు విమనస్కుఁడును, సన్యసించుటకు సిద్ధుఁడునైన
యర్జునుని దన క్షాత్రకర్మయందుఁ బ్రవర్తింపఁజేయుటకు భగవంతు
నిచే గీత యుపదేశింపఁబడినదని తేలును. దుష్టుఁడగు దుర్యోధను
నకు సహాయభూతులై తమతో యుద్ధోపక్రమమునకై యెవ రెవరు

వచ్చి యున్నారో వారి నందఱను జూచుచుండ, నర్జునునకు వృద్ధుఁడగు భీష్మపితామహుఁడును, గురుఁడగు ద్రోణాచార్యుఁడును, గురుపుత్రుఁడగు నశ్వత్థామయుఁ బ్రతిపక్షులైనను బాంధవులే యగు కౌరవులును, నితరులగు స్నేహితులును, నాప్తులును, సంబంధులును, మిత్రులును, మామలును, పినతండ్రులును, బావమఱఁదులును, రాజులును, రాజపుత్రులు మొదలగువారును గనఁబడిరి. మఱియు "కేవల హస్తినాపురరాజ్య సంపాదనకొఱకే వీరిని జంపి కులక్షయాది మహాపాపములను మనము చేయుట కుద్యుక్తుల మైతిమే" యను విచార మర్జునునకు మనంబున నుద్భవిల్లుటచేఁ జిత్తము మిక్కిలి క్షోభముఁ జెందెను. ఒకవైపున యుద్ధము చేయు మని క్షత్రధర్మము చెప్పుచుండెను. పితృభక్తియు, గురుభక్తియు, బంధుప్రేమయు, సుహృత్ప్రీతియు మొదలగు ధర్మములు వెనుకకు లాగుచుండెను. యుద్ధము కర్తవ్య మైనను స్వీయులతోనే యగుటచేఁ బితామహగుర్వాప్తాదుల హింసచే ఘోరపాతకము సంభవించును, చేయనియెడల క్షాత్రధర్మమే యంతరించును. ఇటు లొకవైపున గోయియు, నొకవైపున నూయియు నుండుటచే రెండు గొఱ్ఱెపోతుల దెబ్బల మధ్యమునఁ బడిన యొక దుర్బలప్రాణి యవస్థవలె నర్జునుని గతి యాయెను. అర్జునుఁడు మహాయోధుఁడను మాట సత్యమే; ధర్మాధర్మసంబంధనీతి యను బోనులో హతాత్తుగఁ జిక్కుటచే నిజముగ నతని ముఖ మెండిపోయెను. దేహము గగుర్పొడిచెను. చేతివిల్లు జాఱిపోయెను. "నేను యుద్ధము చేయ"నని యేడ్చుచు రథముపై దిగులుచేఁ జతికిలఁ బడెను. మఱియుఁ దుదకు జిరకాలమునుండి పరంపరగ వచ్చుచున్న క్షాత్రధర్మమునకంటె నధిక మని స్వభావముగనే మిక్కిలి ప్రియమై తోఁచుచున్న మమత్వము యొక్క (అనఁగా: సమీప మందున్న బంధువులపైని స్నేహము యొక్క) మహత్త్వమును స్థిరపఱుచుకొని మోహముచే "పితృవధ, గురువధ, బంధువధ, సుహృద్వధ, కులక్షయము మొదలగు ఘోర పాపములుఁ జేసి రాజ్యసంపాదన చేయుటకంటె నుదరంభరిత్వము

కొఱకు బిచ్చమెత్తుట తప్పిదమా!" యనుకొని యర్జునుఁ డిట్లు చెప్ప నారంభించెను. "ఈ సమయమున శత్రుమును వదలిన నన్నుఁ జూచి శత్రువులు నా తలఁ దటిగినను మేలే. యుద్ధమున స్వకీయులను వధించి వారి నెత్తుటిచే నపరిశుద్ధములు నభిశప్తము (అనఁగా: శాపము నొందినవి)లగు భోగముల నుపభోగించుట కే నిష్టపడను. క్షాత్రధర్మ మెట్టిదైన నేమి? అందుచే పితృవధ, బంధువధ, గురువధ మొదలగు భయంకరము లగు పాతకములఁ జేయవలసి వచ్చెనేని నా క్షాత్ర ధర్మము దగ్గమగుఁ గాక! ఆ క్షాత్ర నీతికి నిప్పంటుకొనుఁ గాక! ఈ సంగతిఁ దెలియనివారై ప్రతిపక్షులు దుష్టవర్తనులైనను నేను సైత మటులే ప్రవర్తించుట యుక్తము కాదు. నా యాత్మకు నిజమగు కళ్యాణ మెటు లగునో యా సంగతి నేను జూచుకొనవలయును. మఱియు "నటువంటి ఘోరపాతకముఁ జేయుట శ్రేయస్కర మని నాకుఁ దోఁపనియెడల క్షత్రధర్మ మెంత శాస్త్రోక్త మైనను నిట్టి ప్రపం చమున నాకు దానితోఁ బనియేమి?" యని యాతనిమనంబే యాత నికి నిరుత్సాహంబుఁ గల్పింపఁగ ధర్మసమ్మూఢుఁడై (కర్తవ్య మేదియో తోఁపనివాఁడై) శ్రీకృష్ణుని శరణుఁ జొచ్చిన పిమ్మట భగవంతుఁ డర్జునునకు గీతల నుపదేశించి మార్గములోనికిఁ దెచ్చెను. మఱియు నాతనికి యుద్ధము కర్తవ్య మైనను ఆ సమయమున భీష్మాదులను వధింపవలయు ననుభీతి యాతనికిఁ గలుగుటచే యుద్ధము చేయ నొల్లని యర్జునునకు నా యుద్ధమే స్వేచ్ఛచేఁ జేయవలసివచ్చెను. గీతలలో నున్న రహస్యమును బయలుపఱుప వలసియున్న ది యీ యుపక్రమోపసంహారము లను ఫలము ననుసరించియే యుండవల యును. "భక్తిచే మోక్ష మెట్లు సిద్ధించును? బ్రహ్మజ్ఞానముచే నైనను బాతంజలయోగముచే నైన నది యెట్లు సిద్ధించును?" ఇత్యాది కేవల నివృత్తిపరమార్గము, లేక కేవల కర్మత్యాగరూప మగు సన్యాస ధర్మమును, చెప్పుటవలన నిక్కడ నేమియుఁ బ్రయోజనము లేదు.

శ్రీకృష్ణుని మనంబున, నర్జునుఁడు సన్యసించి విరాగియై బిచ్చ మెత్తుచు వనములకుఁ బోవలయునను మూఢగాని; కౌపీనధారియై వేపాకుఁ దినుచు మరణాంతము యోగాభ్యాసము చేయుటకొఱకు హిమవత్ప్రాంతములకుఁ బోవలయు ననుతలంపుగాని; ధనుర్బాణము లకు బదులు, తాళము మద్దెల వీణయు నర్జునుని చేతికిచ్చి వాని నాదములోనే భక్తిచే భగవన్మాయమోహోషణముఁ జేయుచుఁ బ్రేమరూపా నంద భరితుండై కురుక్షేత్ర మను ధర్మభూమియందు భారతవర్షము లోని సకల క్షాత్రసమాజము నెదుట బృహన్నలచే వలె నర్జుననిచే మరల నాట్యము చేయింపవలయు నని కాని యభిప్రాయము లేదు. అజ్ఞాతవాసానంతరమునఁ గురుక్షేత్రమునఁ బ్రవేశించి చేయవలసిన నాట్యము బృహన్నల నాట్యముకంఱె గఱినమైనదియు భిన్నమైనది యునై యున్నది. గీతలు నుపదేశించుచు ననేక స్థలములయం దనేక విధములగు కారణముల నిరూపించుచుఁ జివరకు 'తస్మాత్' అనఁగా: 'కావున', లేక 'ఆహేతువులన' అను నర్థముగల పదము (అనఁగా: అనుమానదర్శక మహత్త్వబోధక పదమును) ప్రయోగించి "తస్మా ద్యుధ్యస్వ భారత"- కావున నో యర్జునా! యుద్ధము సేయుము; (గీ.2-10) "తస్మా దుత్తిష్ఠ కౌన్తేయ యుద్ధాయ కృతనిశ్చయః"- కావున నో కౌన్తేయా! యుద్ధమునకుఁ గృతనిశ్చయుఁడవు, కమ్ము లెమ్ము (గీ. 2-37). "తస్మా దసక్త స్సతతం కార్యం కర్మ సమాచర"- కావున నాసక్తి వదలి నీవు చేయవలసిన కార్యమును చేయుము (గీ.3-19)"కురు కర్మైవ తస్మా త్త్వం"-కావున నీవు కర్మనే చేయుము (గీ.4-15), "మా మనుస్మర యుధ్య చ"-కావున నన్ను స్మరించుచు యుద్ధము చేయుము (గీ.8-7), సర్వకర్తయును సర్వకారయితయును నేనే యగుటచే నీవు నిమిత్తమాత్రుఁడవై యుండి యుద్ధ మొనర్పుము; శత్రువుల జయింపుము (గీ. 11-33) శాస్త్రప్రామాణ్యముచేఁ బ్రాప్త మైన కర్తవ్యము నొనర్చుటయే నీ కుచితముగ నున్నది (గీ. 16-24) అని యిటుల నిశ్చితార్థమును గర్మపరము నైన యుపదేశమును నర్జు

నునకుఁ జేసి పదునెనిమిదవ యధ్యాయమున నుపసంహారాన్తమున మరల ఈ సమస్త కర్మల నొనర్చి యే తీరవలయును (గీ. 18-6) అని నిశ్చితమును నుత్తమమునైన స్వమతమును భగవంతుఁ డుపదేశించెను. మఱియుఁ దుదకు అర్జునా! నీ కజ్ఞానమోహ మిప్పటి కైనను నశించినదా? లేదా? (గీ. 18-72) యని ప్రశ్నచేసి యతని వలన-

నష్టో మోహ స్స్మృతిర్లబ్ధా త్వత్ప్రసాదా న్మయాఽచ్యుత,
స్థితోఽస్మి గతసందేహః కరిష్యే వచనం తవ.

(గీ. 18-73)

— స్వామీ! నా యజ్ఞానమును, సంశయమును నశించినవి; ఇంకఁ దమ యిష్టము ననుసరించిన కార్యమును జేయుదును, అని ప్రత్యుత్తరమును రాఁబట్టుకొనెను. ఇటుల వాగ్రూపముగనే యర్జునుఁడు ప్రత్యుత్తర మీయలేదు; తా నాడినమాట సత్య మగు నటులఁ జేసి ప్రసంగోపాత్తమైన యా యుద్ధమున భీష్మ కర్ణ జయద్రథాదులను వధించెను. ఇందువలన ననేకు లర్జునునకు భగవంతునిచేఁ జేయఁబడిన యుపదేశము నివృత్తిపర మగు జ్ఞానమునకును యోగమునకును భక్తి కిని సంబంధించిన దగుటచే, నదియే ముఖ్యప్రతిపాద్య మను చున్నారు, కాని యుద్ధారంభమైనది కాబట్టి నడుమ నడుమఁ గర్మను గొంత కొంత ప్రశంసించుచు భగవంతుఁ డర్జునునిచే నా యుద్ధమును సమాప్తి నొందించెను. ఇచ్చట యుద్ధము నెరవేర్చుట యనువిషయము ముఖ్యము కాదు. దీనిని అనుషంగిక మని కాని, యర్థవాదాత్మక మని కాని చెప్పుచున్నారు; కాని వారిటుల కోటీక్రమమును దబ్బిబ్బులుగ నెటులో నిర్వహించినను గీతయొక్క యుపక్రమోపసంహారములకుఁ గాని ఫలమునకుఁ గాని యుపపత్తి కుదరదు. ఏలయన- స్వధర్మాను సారముగఁ బ్రాప్తమైన కర్తవ్య మెట్టిదైనను మరణాంతము నొనర్చు చునే యుండవలసిన దానియొక్క మహత్త్వమును నావశ్యకతయు నీ సమయమున భగవంతుం డగు శ్రీకృష్ణునిచే నిరూపింపఁ బడఁదగి

యున్నది. మఱియు నా విషయమును సిద్ధింపఁజేయుటకు వెనుకఁ జెప్పినటుల గీతలలో నెక్కడను సూచింపఁబడి యుండలేదు. ఒకవేళ నట్లు సూచింపఁబడి యుండినను, బుద్ధిమంతుఁడును వివేకియు నైన యర్జునున కా యసంబద్ధము లగు సిద్ధాన్తములు మనస్కరింపక యైన నుండవలయును.

భయంకరమైన కులక్షయమగు నను సంగతి కంటి కెదుటఁ గనఁబడుచుండఁగనే, "యుద్ధము కర్తవ్యమా? కాదా? కర్తవ్య మను పక్షమును స్వీకరించినచో, పాపము లేకుండ నెట్లు చేయ వలయును?" అనియే యర్జునుని ముఖ్యప్రశ్నయై యున్నది. మఱియు నెంతకలవరము కలిగించినను, నిష్కామబుద్ధితో యుద్ధము చేయుమని యైనను, కర్మచేయుమని యైనను జెప్పిన యీ సమాధానము (అనఁగా- ముఖ్యప్రశ్నకు సమాధానము) అర్థవాదమని చెప్పి తప్పించుకొనఁబూనుటకు సాధ్యముకాదు. యజమాను నింట యజమానినే యతిథిగ భావించుటవంటి దగును. వేదాన్తము, భక్తి, పాతంజల యోగము ననునవి గీతలలో బొత్తిగ నుపదేశింపఁబడలేదని మే మనము. మఱియేమన- గీతలలో నీ మూఁడు విషయములకుఁ గలసంబంధము, పరస్పరవిరుద్ధ ధర్మములయొక్క భయంకరమైన యల్లరిలోఁ బడుటచే "ఈ పని చేయుదునా? యా పనిచేయుదునా?" యని సందేహపడి, కర్తవ్యమూఢుఁడైన యర్జును నకుఁగర్తవ్యమైన నిష్పాపమార్గమును బోధించి క్షాత్రధర్మానుసారముగ స్వీయశాస్త్రోక్తకర్మ నొనర్చుటకుఁ బ్రవృత్తుఁడగునట్లు చేయునదిగనే యుండవలయు నని యందుము. ఈ సందర్భమునఁ బ్రవృత్తిపర ధర్మజ్ఞానమే ప్రస్తుతము ముఖ్య మగుటచే నితర విషయములు తత్సిద్ధ్యర్థములగును, (అనఁగా- అనుషంగికములగును). కాన, గీతా ధర్మరహస్యము ప్రవృత్తిపరమే (కర్మపరమే) యయి యుండవలయు నను విషయము స్పష్టమగుచునే యున్నది; కాని, "యీ ప్రవృత్తిపర

రహస్య మెద్ది? అది వేదాన్త శాస్త్రమునుండియే యెటుల నిష్పన్న మగును?" అను నీ విషయమై యే టీకాకారునిచే నైనను నరియగు నిరూపణ చేయఁబడ లేదు. ఏ టీకాకారులును గీతోపక్రమ గీతోప సంహారములను ఫలమును జూడకయే, గీతలలో బ్రహ్మజ్ఞానము గాని, భక్తిగాని తమ తమ సంప్రదాయముల కనుకూల మగునటుల నివృత్తిపరదృష్టితో సిద్ధాన్తముచేయ నానక్తులై యున్నారు. భక్తికిఁ గాని జ్ఞానమునకుఁ గాని కర్మతో నదా సంబంధము గల్పించుటయే యొక మహాపాతకము. ఈ శంకనే యొకరు* చేసికొని శ్రీకృష్ణుని స్వీయచరిత్రను కంటియెదుట నుంచుకొని భగవద్గీతార్థము నిర్ణ యింపఁ బడవలయునని ప్రాసి యున్నారు. మఱియు శ్రీకాశీ క్షేత్రమందు సమాధిస్థులును బ్రసిద్ధులు నద్వైతులునగు పరమహంస శ్రీకృష్ణానందస్వాములవారు †'గీతార్థపరామర్శ' మను పేరు గల చిన్న సంస్కృత నిబంధమును ప్రాసియున్నారు. దానిలో "తస్మాద్గీతా నామ బ్రహ్మవిద్యామూలం నీతిశాస్త్రమ్"— కావున గీత యన బ్రహ్మ విద్యనుండి సిద్ధమగు నీతిశాస్త్ర (కర్తవ్యధర్మశాస్త్ర) మని సిద్ధాన్త పఱచినారు. జర్మను పండితుఁడు (ప్రొ. డాయసన్) తన యుప నిషత్తులలో నున్న 'తత్త్వజ్ఞాన' మను గ్రంథములో నొకచోట భగవద్గీతా సందర్భమున నీ రీతిగనే ప్రాసియుండుటచే నితరులును ననేకులగు పాశ్చాత్యులును, పౌరస్త్యులు (Oriental) నగు గీతా పరీక్షకులచే నీ మతమే నిరూపింపఁబడినది. అయినను వీరిలో నెవరును

---

*ఈ వ్యాఖ్యానకారుని పేరును, ఈ వ్యాఖ్యానములోని కొంతవిషయమును, చిరకాలముక్రింద నొకగ్రహస్థుఁ డుత్తరముగుండ నాకుఁ దెలిపెను; కాని నా తున్న వ్యవహారపుఁ దొందరలో నా యుత్తర మెచ్చటనో పడిపోయినది. ఇంకను గనుపడలేదు.

†శ్రీకృష్ణానందస్వామి రచించిన గీతారహస్యము, గీతాధర్మప్రకాశము గీతార్థవరామర్శము, గీతాపారోద్ధారము, వగు నాఱ్ఱగ్రంథముఁ జేర్చి యొక సంపుటముగనే రాజకోట యమఘట్టణమున ముద్రితమైనది.

సమగ్ర గీతా గ్రంథమును బరీక్షించి కర్మపర దృష్టితో వానిలో నున్న సర్వప్రతిపాదనలయొక్క గాని యధ్యాయములయొక్కగాని సందర్భము లెట్లు కూడునో యా విషయమును స్పష్టముగ నిరూపించుటకుఁ బ్రయత్నము చేసినవారు కారు. అట్లు ప్రయత్నము చేయకపోవుటయే కాక, విపరీతముగా "ఈ సీ ప్రతిపాదన కష్టసాధ్య" మని సైతము 'డాయస్' * అను పండితుడు వ్రాసియున్నాఁడు. కావున సీ గీతలఁబరీక్షించి వానిలో నుండు విషయమును నిరూపించుటయే యీ గీతారహస్యమను గ్రంథముయొక్క ముఖ్యోద్దేశము. కాని యిట్లు చేయుటకుఁ బూర్వము గీతాప్రారంభమునఁ బరస్పర విరుద్ధములగు నీతి ధర్మముల నడుమఁ జిక్కిన యర్జునుని సంకట స్వరూపము స్పష్టపఱుచుట యావశ్యకము. ఇంత మాత్రముననే గీతలయందుండు విషయమర్మము వాచకులకుఁ బూర్తిగ గోచరముగానేరదు. కావునఁ గర్మాకర్మల వివేచనయందలి సంకట మెటులుండునో యదియు, "ఈ కార్య మొనర్తునా? యా కార్య మొనర్తునా?" యని సందేహపడి యనేక ప్రసంగములలోఁ జీకాకు పడిన మనుష్యుఁ డెట్లు కర్తవ్యమూఢుఁ డగునో (అనఁగా దిక్కుఁ దోఁపక యుండునో) యదియు, నను నీ విషయములు బాగుగఁ దెలియుటకై శాస్త్రములలోను నంతకంటె యధికముగ మహాభారతములోను నున్న యిట్టి ప్రసంగములలోని యనేకములగు నుదాహరణములచే నిప్పుడు ముందుగ విచారింతము.

ఇది విషయప్రవేశ మను ప్రథమప్రకరణము.

---

* Prof. Deussen's Philosophy of the Upanishads p. 362- (English Translation, 1906.)

ద్వితీయ ప్రకరణము

కర్మ జిజ్ఞాస

కిం కర్మ కి మకర్మేతి కవయోఽప్యత్ర మోహితాః.*

(గీ. 4-16)

భగవద్గీతాప్రారంభమునఁ బరస్పర విరుద్ధములగు రెండు ధర్మములోఁ జిక్కుపడుటచే కర్తవ్యమూఢుఁడగు నర్జునునకు సంభవించిన ప్రసంగ మెంతయు నూతనము కానేరదు. సన్యసించి జగద్దోషి వదలి మఠములలో నుండువానియొక్కయు, లేక, అశక్తిచే జగత్తులోని యనేకములగు నన్యాయములఁ గేవల మూకభావమున సహించునట్టి యుదరంభరులయొక్కయు సంగతియు వేఱుకాని, ప్రపంచగోష్ఠిలో గొప్పవాఁడును నిర్వాహకుఁడునై సంసారమందలి స్వకర్తవ్యమును ధర్మానుసారముగను నీత్యనుసారముగను జేయవలసినవాని కిట్టి సందర్భము (స్థితు) లనేక సమయముల సంభవించుచునే యుండును. అర్జునునకుఁ గర్తవ్యజిజ్ఞాసయు మోహమును యుద్ధారంభమునఁ గలిగెను. ఆ మోహమే తుదకు యుద్ధమున మృతులగు బంధువులకు శ్రాద్ధములు చేయవలసి వచ్చినప్పుడు ధర్మరాజునకు సైతము కలిగెను. అట్టివాని మోహమును శాంతింపఁ జేయుటకు శాంతిపర్వము చెప్పఁబడియె. కర్మాకర్మసంశయం[illegible]

---

*"కర్మయనవేమి? అకర్మ యనవేమి? యను విషయమువఁ బండితులు సైతము మోహపడుదురు" అని శ్లోకార్థము. ఇచట అకర్మ శబ్దమువకు కర్మాభావము, లేక, తప్పవని యని యర్థము చేసికొనవలయును. ఈ శ్లోక వ్యాఖ్యాన ముఁజూడుఁడు.

వేయేల? యిట్టి ప్రసంగము లెచ్చో నున్నవో వెదకి కాని కల్పించి కాని యీ విషయములపై గొప్పగొప్ప కవీశ్వరులచే సరసకావ్యములు నుత్తమనాటకములును రచింపఁబడినవి. ఉదాహరణార్థమై ప్రసిద్ధుఁడు నాంగ్లేయభాషలో ననేక నాటకకారుఁడగు "షేక్స్‌పియరు" యొక్క "హామ్లెట్" అను నాటకమును గ్రహింతము. డెన్మార్కు దేశమున, పూర్వకాలమున 'హామ్లెట్టు'ను రాజపుత్రుఁ డొకఁ డుండెను. వాని పినతండ్రి, రాజును దనయన్నయు నైన 'హామ్లెట్' తండ్రిని జంపి 'హామ్లెట్' తల్లితో మైత్రి సంపాదించుకొని సింహాసనము పైతము నాక్రమించుకొనెను. పాపియగు పినతండ్రిం జంపి, పుత్రధర్మాను సారముగఁ బితృఋణమునుండి ముక్తుఁడు గావలసినవాఁడా? లేక, కేవలము పినతండ్రియుఁ, దండ్రికిఁ బిమ్మట నతనితో సమానముగఁ బూజనీయుఁడును, సింహాసనారూఢుఁడు నను కారణముచే 'హామ్లెట్టు' ఊరకుండవలసిన వాఁడా? ఇట్టి మోహములోఁ బడి, కలతఁ జెందిన మనంబు గల్గినవాఁడును దరుణవయస్కుఁడునగు 'హామ్లెట్టు'న కెట్టి యవస్థ సంప్రాప్త మైనదో కనుఁడు. ఆ తరుణమున శ్రీకృష్ణునివంటి యోగ్యుఁడును మార్గదర్శకుఁడు నంగరక్షకుఁడు నగు పురుషుఁ డాలోచన చెప్పుటకు లేకపోవుటచే, 'హామ్లెట్' వెఱ్ఱియెత్తి ప్రబుకవలసిన వాఁడా? చావవలసిన వాఁడా? ఈ యవస్థలోఁ గర్తవ్యతా విచారముతో, పాపము హామ్లెట్టున కెటుల తుదకు మరణము సంభవించెనో యీ చిత్ర మీ నాటకమున నధికముగఁ జమత్కరింపఁబడినది. మఱియు 'కోరియలానెస్' అను మఱియొక నాటకములో నైత మిటులే 'షేక్స్‌పియరు' మఱియొక ప్రసంగము వర్ణించియున్నాఁడు. శూరుఁడును రోమ దేశపువాఁడు నగు 'కోరియలానెస్' అనువాఁడు తన్ను రోమ పురవాసు లా యూరి నుండి వెడలఁగొట్టుటచే నతఁడు రోమ దేశపు శత్రుపులపక్షపు వాఁడైనదియే కాక వారి గుట్టును రోమ పురవాసుల కెన్నటికిని జెప్పనని వారి సమ్ముకమునకై ప్రతిజ్ఞఁ జేసెను. పిమ్మటఁ గొంత

కాలమున కీ శత్రునహాయముచే రోమా జనులపై దండెత్తి దేశముల జయించుచు రోమన్ పట్టణ సింహద్వారమునందే రోమనుల శత్రు సైన్యముల నిలిపెను. అప్పుడు రోమన్ పురమునన్నున్న స్త్రీ లందఱను 'కోరియలానెస్' భార్యను, తల్లిని ముందుంచుకొనివచ్చి మాతృ భూమివిషయమున నతనికిఁ గర్తవ్యము నుపదేశించిరి. పిమ్మట రోమా పురజనుల శత్రువుల కిచ్చిన యభయవచనము నా 'కోరి యలానెస్' తానే యతిక్రమించి ప్రవర్తింపవలసి వచ్చెను. కర్తవ్యా కర్తవ్యమోహములఁ బడుట కిట్టి యితరోదాహరణము లెన్నియో ప్రాచీనములైనవి జగత్తున నితిహాస గ్రంథములలో నున్నవి; కాని యింతదూరము మనము పరుగిడ నవసరము లేదు. మన మహాభారత మను గ్రంథ మిట్టినందర్భముల కొక గని యనునది యతిశయో క్తి కానేరదు. గ్రంథారంభమున (అ. 2) భారతమును వర్ణించుచు వ్యాసులవారు "నూక్తార్థం న్యాయయుక్తం", "అనేక సమయాన్వి తమ్" అని మహాభారతమునకు విశేషణములఁ జెప్పి, యీ గ్రంథ ములో సర్వధర్మశాస్త్రములు, నర్థశాస్త్రములు మోక్షశాస్త్రములు సైతము వర్ణితములై యున్నవని చెప్పుటయే కాక, యీ విషయమున "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్క్వచిత్" (అ. 62-53) —ఇందులో నున్నవిషయములె ఇతర గ్రంథములలో వర్ణితములైనవి. మఱియు నిచ్చో లేని విషయము లెచ్చోటను వర్ణితములు కావు అని యా భారతమహత్త్వమును కొనియాడెను. వే యేల? నంసార మందలి యనేకాపత్ప్రసంగములలోఁ బ్రాచీనులగు మహాపురుష లే యే విధముగఁ బ్రవర్తించిరో యా విషయముల నీ యాఖ్యానము సులభముగ సామాన్యజనులకు బోధించున దగుటచే, భారతము మహాభారత మయ్యెను. కేవలము 'భారతయుద్ధ' మని యైనను, 'పాండవవిజయ' మని యైనను బేరుగల యితిహాసమును వర్ణించుటయే యైన నష్టాదశపర్వములు చెప్పునంత యావశ్యకత యుండకయే పోవును.

"శ్రీకృష్ణార్జునుల సందర్భమును వదలినచో మన కీమహాచర్చ వలన లాభ మేమి? మన్వాదిస్మృతికర్తలు తమ తమ స్మృతులలో మానవు లెటుల సంసారమునఁ బ్రవర్తింపవలసినదియు, ఆ సందర్భమున స్పష్ట మగు నియమములను వ్రాయ లేదా? "హింసను వధను జేయకుఁడు. నీతితోఁ బ్రవర్తింపుఁడు. సత్య మాడుఁడు. వృద్ధులకు గురువులకు సమ్మాన మొనర్పుఁడు. చౌర్యవ్యభిచారములు చేయకుఁడు" ఇత్యాదులగు సర్వసామాన్య నియమములు. సర్వధర్మములలోను విధింపఁబడిన వానిని జూచినయెడల మరల నీ యల్లరిలోఁ బడుట కేమి కారణ!"మని కొంద ఱడుగుదురు; కాని విపరీతముగ నిటుల సైతము విచారింపఁబడినది. ఆ యంశ మేమన: జగత్తున సర్వజనులు నెంత పర్యంత మీ నియమము ననుసరించి ప్రవర్తింపరో, యంత పర్యంత మీ పామరజనుల వలలోఁ బడి సజ్జనుఁడు తన సద్వర్తన మును వదలక యుండవలయునా? లేక, వారి ప్రతిక్రియల నిమిత్తమై యెట్టి వానియొద్ద నట్లు ప్రవర్తించి తన్ను రక్షించుకొనవలయునా? ఇంతియ కాక, యీ సామాన్య నియమములు నిత్యములుఁ బ్రమాణము లని యంగీకరించినను, కర్తయగు పురుషున కనేక పర్యాయము లీ సామాన్య నియమములలో రెండు మూఁడు నియమము లొక సమయముననే ప్రాప్తము లగుచున్నవి. మఱియుఁ గర్తయగు పురుషుఁడు "ఇది చేయుదునా? అది చేయుదునా?" యను వివేచనలోఁ బడి పిచ్చివాఁ డగుచున్నాఁడు. అర్జునునకు సంభవించిన ప్రసంగము వీనిలోనిదే; కాని యర్జునునకే కాక యితరులగు గొప్పవారికి నిట్టి సందిగ్ధావస్థ యేల వచ్చునో యా సందర్భము మహాభారతములో ననేక స్థలములలో నమూలముగ విమర్శితమై యున్నది. ఉదాహరణ మేమన,- మనువుచే సర్వవర్ణములకు సామాన్యమని చెప్పఁబడిన "అహింసా సత్య మస్తేయం శౌచ మింద్రియనిగ్రహః" (మను. 10-63) అహింస, సత్యము, అస్తేయము, మనోవాక్కాయముల శుద్ధతయు, నింద్రియ నిగ్రహము నను నీ యైదు సనాతన ధర్మములలో నహింస

యొక్క విషయమే మనము గ్రహింతము. "అహింసా పరమో ధర్మః" (మ.భా.అ.11-13). ఈ తత్త్వము మన వైదిక ధర్మములలోనే కాక యితరుల సర్వధర్మములలోను ముఖ్యముగఁ బరిగణింపఁబడి యున్నది. బుద్ధకిస్తుధర్మగ్రంథములలో నున్న యాజ్ఞలలో "హింస చేయకుము" అను నీ యాజ్ఞ మనుస్మృతి యందువలెనే యగ్రగణ్య మైనది. హింస యనఁగా- కేవలము జీవమును దీయుటయే కానేరదు. ఇతరప్రాణియొక్క మననునకైనను శరీరమునకైనను నుపద్రవముఁ జేయుట సైతము హింసయే! హింస యన- నచేతనమగు ప్రాణికి నే విధమగు పీడ కలిగింపక పోవుటయే; పితృవధ, మాతృవధ, మనుష్యవధ మొదలగునవి హింసలలో ఘోరములై యున్నవి. కావున జగత్తులోని సర్వమత సంప్రదాయములలో నీ యహింసాధర్మము సర్వధర్మములలోను శ్రేష్ఠమైనదని యంగీకరింపఁబడినది. ఐనను బ్రకృతము తెలిసికొనవలసిన విషయ మేమన,- మన ప్రాణము దీయుటకైనను భార్య, కొమార్తె వీరిని బలాత్కార పఱచుటకైనను, మన యింటికి నిప్పంటించుట కైనను, మన స్థిరచరాత్మక సర్వధన హరణమున కైనను, నెవఁడైన దుష్టుఁడు కత్తిచేఁబూని సన్నద్ధుడు కాఁగా, సమీపమున రెండవవాఁడు లేనప్పు డిట్టి యాతతాయిని "అహింసా పరమో ధర్మః" అని చెప్పి కన్నులు మూసికొని యుపేక్షింపవలయునా? లేక యా దుష్టుని సామోపాయముల చేతను, లేక, వినని యెడల దండోపాయముల చేతను యథాశక్తి గ శాసింప వలయునా?

> గురుం వా బాలవృద్ధౌ వా బ్రాహ్మణం వా బహుశ్రుతమ్,
> ఆతతాయిన మాయాంతం హన్యా దే వావిచారయన్.
>
> (మను 8-350).

- ఇటువంటి యాతతాయి (దుష్టుఁడు) గురువు గాని, వృద్ధుఁడు గాని, బాలుఁడు గాని విద్వాంసుఁడగు బ్రాహ్మణుఁడు గాని యైనను

నీ విషయముల విచారింపకయే నిశ్శంకముగ వానిఁ జంపి తీర వలయును; కారణ మేమన- ఇట్టి సమయములలో హింసానుబంధ మగుపాపము, హింసకునికిఁ దగులదు. అతతాయి తన యధర్మము చేతనే చంపఁబడుచున్నాఁడు అని మనుస్మృతికర్త చెప్పుచున్నాఁడు. మనువుచేతనే కాక యితరులగు నవీనదండశాస్త్రకర్తల నీతి ననునరించి సైత మాత్మ సంరక్షణ మను హక్కునకు గొప్ప గౌరవ మంగీకరింపఁ బడినది. ఇట్టి సందర్భములలో నహింసకంటె నాత్మసంరక్షణ యోగ్యతయే యధికముగ నంగీకరింపఁబడినది. భ్రూణహత్య (గర్భస్థశిశుహత్య) యందఱచే నతిగర్హ్యముగ నెన్నఁబడినది; కాని తల్లికి హానిగలుగునెడ నా గర్భస్థశిశువును మాత్రము నటికి పాఱవేయ నక్కఱలేదా? యజ్ఞములో నున్న పశువధ వేదముచేతనే ప్రశస్త మని యంగీకరింపఁబడినది (మను. 5-31). అయినను పిష్టపశువును జేసి యదియు నొకానొక సమయమున నెఱవేర్చుటకు సాధ్యమగును. (మ.భా.శాం. 337; అను. 115-56.) కాని వాయువులో, ఫలములలో, జలము మొదలగు వస్తువులలో నిండి యత్యల్పము లగు ననేక జీవములను జంపకుండ మనుష్యుఁ డెట్లు ప్రవర్తింపఁ గలఁడు? మహాభారతములో-

సూక్ష్మయోనీని భూతాని తర్కగమ్యాని కానిచిత్,
పక్ష్మణోఽపి నిపాతేన యేషాం స్యాత్ స్కంధపర్యయః.
(మ.భా.శాం. 15-28)

– కన్నులకుఁ గనఁబడక పోయినను, వేని (ఏ జంతువుల) యస్తిత్వము తర్కముచేఁ దెలిసికొనఁబడునో యట్టి సూక్ష్మజంతువు లీ జగమున నిండియున్నవి. అనఁగా- మనము మన కంటిరెప్పలను గదల్చిన మాత్రమువలనే యీ జీవములహస్తపాదాదులు విఱిగి క్రిందఁ బడును." "ఇటులుండ హింసఁ జేయకు, హింసఁ జేయకుమని నోటనన్న మాత్రమున నేమి ప్రయోజనము?" అని యర్జునుఁడు

చెప్పుచున్నాఁడు. ఈ సారాసారమునే విచారణఁ జేసి యనుశాసన పర్వములో (అను. 116) మృగయావిషయమును సమర్థించినారు. అరణ్యపర్వములోనున్న కథ యేమనఁగా-కోపమున నొక పతివ్రతను భస్మము చేయుట కుద్యుక్తుఁడైన బ్రాహ్మణుని ప్రయత్నము నిష్ఫలము కాఁగా, నా బ్రాహ్మణుఁ డా పతివ్రతను శరణు వేఁడెను. పిమ్మట సత్యమగు ధర్మరహస్యమును తెలిసికొనుటకు నా బ్రాహ్మణు నొకానొక వ్యాధునివద్దకా పతివ్రత పంపెను. ఆ వ్యాధుఁడు మాంస విక్రేతయయ్యు నత్యధికమగు మాతృపితృభక్తిగలవాఁడై యుండెను. ఈ వ్యాధుని వ్యాపారమును జూచిన యీ బ్రాహ్మణున కత్యంత విస్మయమును, ఖేదమును గల్గెను. అప్పు డా వ్యాధుఁడు బ్రాహ్మణునకు నిజమగు తత్త్వమును జెప్పి నమ్మకము కల్గునటుల చేసెను. జగత్తున నెవ రెవరిని దినుటలేదు! "జీవో జీవస్య జీవనం" (భాగ. 1-13-46) ఈ వ్యవహార మెల్లప్పుడును జరుగుచునే యున్నది. కావున నా పత్కాలమం దైన "ప్రాణస్యాన్న మిదం సర్వం" (మను. 5-28; మహా భా. శాం. 15-21) అని స్మృతికారుల చేతనే కాక యుపనిషత్తులలో సైతము స్పష్టముగఁ జెప్పఁబడినది. (వే. సూ. 3. 4-28; ఛాం. 5-2-1; బృ. 6-1-14). అందఱిచేతను హింస వదలి వేయఁబడినయెడల క్షాత్రధర్మముమాత్ర మెటుల నిలుచును? క్షాత్రధర్మము నశించినయెడఁ బ్రజలకు రక్షకుఁ డెవఁడు? ప్రతిమనుజుఁడు తనకంటె బలహీనుఁడగువాని నెల్లఁ బట్టి హింసించుట సంభవించును. సారాంశ మేమన- నీతియొక్క సామాన్యనియమముల వలనఁ గొన్ని సమయములలో తప్పక కార్యనిర్వాహము గాకపోవుచున్నది. కావున నీతిశాస్త్రములో ముఖ్యమని చెప్పఁబడిన యహింసయొక్క నియమ ములయందు సైతము కర్తవ్యాకర్తవ్యముల తారతమ్యవిచారము లేకపోలేదు.

అహింసాధర్మము ననునరించియే, క్షమ, శాంతి, దయ యను నీ గుణములు శాస్త్రములోఁ జెప్పఁబడినవి; కాని యీ శాంతి యన్ని సందర్భముల నెటుల నడచును? శాంతముగనుండు వాని భార్యాపుత్రాదుల సైతము నితరులు వాని యెట్టియెదుటనే యపహరించుకొని పోకుండ నుండరను నీ కారణమును ముందు నిరూపించి పిమ్మట ప్రహ్లాదుఁడు తన మునిమనుమఁడగు బలికి మహాభారతమున-

న శ్రేయ స్సతతం తేజో న నిత్యం శ్రేయసి క్షమా,

....

తస్మా న్నిత్యం క్షమా కార్యా: పండితై రపవాదితా.

(వన. 28. 6-8)

– "సర్వదా క్షమయు, సర్వదా తైక్ష్ణ్యమునుశ్రేయస్కరము గానేరవు. నాయనా! యీ కారణముననే పండితులు క్షమ కపవాదమును జెప్పియున్నారు అని చెప్పెను. పిమ్మట క్షమయే యోగ్యమను ప్రసంగములలోఁ గొన్ని ప్రసంగములు ప్రహ్లాదునిచే వర్ణితములైనవి. అయిన నీ ప్రసంగముల నెట్లు తెలిసికొనవలయునో యా తత్త్వమును బ్రహ్లాదుఁడు చెప్పలేదు. కాని ప్రసంగమును దెలిసికొనక యీ యపవాదము నెవఁడైన నుపయోగించిన, వాఁడే దుర్వర్తన గల వాఁడుగ నుండును. కావుననే యీ ప్రసంగము నెటుల యెఱుంగ వలయునో యా తత్త్వము నెఱుంగుటయే యత్యంత మహత్త్వ కారణముగ నున్నది.

జగత్తున సర్వదేశములలో సర్వధర్మములలో నాబాలవృద్ధముగ స్త్రీపురుషుల కన్నిటికంటె మాన్యముఁ బ్రమాణము నగు రెండవ తత్త్వము 'సత్యము'. దాని మహత్త్వ మెంతని వర్ణింతుము? సృష్టిలోఁ బ్రప్రథమమున 'ఋతము', 'సత్యము' నుత్పన్నము లైన వనియు, నా సత్యముచేతనే యాకాశము, పృథ్వి, వాయువు మొదలగు

పంచభూతములును వ్యాపించి ధరింపఁబడిన వనియు వేదములలోనే సత్యముయొక్క మహత్త్వము స్తుతింపఁ బడినది.-"ఋతం చ సత్యం చాభీద్ధా త్తపసో2ధ్యజాయత" (ఋ. 10.190.1) "సత్యే నోత్తభితా భూమిః" (ఋ. 10. 85. 1) ఇత్యాది మంత్రములం జూడుము. 'ఉండునది' అనఁగా సదా నాస్తిత్వమును పొందునది కాదు, లేక త్రికాలములయందు నబాధితముగ నుండునది అని సత్యశబ్దము యొక్క ధాత్వర్థము. కావుననే "సత్యా పరతా నాహి ధర్మ, సత్య తేచీ పరబ్రహ్మ"- సత్యముకన్న వేఱగు ధర్మము లేదు. సత్యమే పర బ్రహ్మ స్వరూపము అని సత్యముయొక్క యథార్థమహత్త్వము వర్ణితము. "నాస్తి సత్యా త్పరో ధర్మః" (శాం. 162. 24). ఈ వచనము మహాభారతములో ననేక స్థలముల వచ్చియున్నది. ఇంతియకాక--

అశ్వమేధసహస్రం చ సత్యం చ తులయా ధృతమ్,
అశ్వమేధసహస్రాద్ధి సత్య మేవ విశిష్యతే.

(అ. 74. 102)

-- వేయి యశ్వమేధములను సత్యమును త్రాసున నుంచి తూచఁగ సత్యమే యెక్కువ బరువగును అనియు, సామాన్య సత్యసంబంధమున మనువు--

వాచ్యర్థా నియతా స్సర్వే వాఙ్మూలా వాగ్వినిస్సృతాః,
తాం తు యస్తేన్యనయే ద్వాచం స సర్వస్తేయకృన్నరః.

(మను. 5. 268)

-- మనుష్యమాత్రుని సర్వవ్యవహారములు వాక్కుచే నడచుచున్నవి. ఒకని యూహ మఱి యొకని కెఱుకపఱుచుటకు శబ్దమువంటి ముఖ్య సాధన మింకొకటి కానేరదు. సర్వవ్యవహారములకు నాశ్రయభూతములగు నీ వాగ్రూపమూలము నెవఁడు కొంచె మతిక్రమించునో (వాక్కును ప్రతారణ చేయువాఁ డగునో), వాడు సమస్త విషయముల నొక్క పర్యాయమే మ్రుచ్చిలినవాఁడును అని సవిశేషముగఁ జెప్పు

చున్నాడు. కావుననే మనువు– "సత్యపూతాం వదేద్వాచమ్"(మను. 6.46)–ఏ విషయము మాటలాడవలయునో దానిని సత్యముచే పవిత్ర మొనర్చి మాటలాడుము అని చెప్పెను. ఉపనిషత్తులలో సైతము– "సత్యం వద, ధర్మం చర" (తై. 1. 111) అని యితర ధర్మముల కంటె సత్యమునకే యగ్రస్థాన మియ్యఁబడుటచే, శరపంజరము మీఁదఁ బడియున్న భీష్మాచార్యుల వారిచే, శాంత్యనుశాసనిక పర్వ ములలో సైతము యుధిష్ఠిరునకు సర్వధర్మముల నుపదేశించినపిమ్మట వారు తమ ప్రాణములను వదలుటకు పూర్వము– "సత్యేమ యతి తవ్యం వ స్సత్యం హి పరమం బలమ్" (మ. భా. అను. 167. 50) అని, సర్వధర్మముల సారమని సర్వోపదేశముల తుద నొక సత్యమే పరిపాలింపఁ బడవలయునని చెప్పఁబడినది. బౌద్ధధర్మములలోను, క్రైస్తవధర్మములలోను నీ నియమానువాదమే చేయఁబడినటుల స్పష్ట మగుచున్నది.

ఇటు లన్ని మతసిద్ధాన్తముల నుండి సిద్ధమైనదియు, స్థిరకాల స్థాయియు నగు సత్యమున కెట్టి యపవాదముండు నని యేరికైన స్వప్ననైనఁ దోఁచియుండునా? కాని, దుష్టులచే నిండియున్న యీ ప్రపంచమునఁ జరించుట మిక్కిలి కష్టముగ నున్నది. కావున తెలియవలసిన విషయము ప్రకృతమున నే మనఁగా– ఎవరైనను ఘాతుకుని చేతులలో నుండి తప్పించుకొని దాగికొనుటకు పాఱి పోవుచు మనకు కనఁబడిన వెంటనే వెనుకనుండి వానిఁ జంపుటకుఁ జేతికరవాలముతో వెంబడించి వచ్చు నా ఘాతుకుఁడు "ఇప్పు డిటు పరువెత్తుకొని వచ్చిన మనుజుఁ డే వైపున పోయెను?" అని మనల విచారించిన, మన మేమి సమాధానముఁ జెప్పవలయును? సత్యము చెప్పుదమా? పాప మా నిరపరాధిప్రాణముల ననత్యమాడి తప్పింతమా? ఇటు లేల యడుగవలయు ననిన, నిరపరాధి యగు ప్రాణియొక్క హింసను తప్పించుటయు సత్య మంత మహత్త్వము గలిగిన ధర్మమే.

"నాపృష్టః కస్యచి బ్రూయా న్న చాన్యాయేన పృచ్ఛతః"- అడుగ నిదే యెవరితోను మాటలాడఁ గూడదు. మఱియు నన్యాయముగ ప్రశ్నఁ జేసి విచారించినను సమాధాన మియ్యరాదు (మను. 2.110; మ.భా.శాం. 287. 34) "జానన్నపి హి మేధావీ జడవల్లోక ఆచరేత్" - ఆ విషయము తెలిసినను పిచ్చివానివలె హూఁహూ యనుచుఁ గాలక్షేపముఁ జేయవలయును అని మనువు చెప్పుచున్నాఁడు. సరియే; బాగుగనే యున్నది! హూఁహూ యని ధ్వనిచేయుట మాత్ర మనత్య ముకాదా! "న వ్యాజేన చరే ద్ధర్మం"(మ. భా. ఆది. 215.34)- మోస ముఁ జేసి నీ తెలివి తేటలను ధర్మమున నుపయోగింపకుము. ధర్మ మును వంచన చేయరాదు. కాన నీవే వంచింపఁబడుదువు" అని భారతములోనే యనేక ప్రదేశములలోఁ జెప్పఁబడియున్నది; కాని హూఁహూఁ యని కాలక్షేపముఁ జేయుటకు సైతము వీలులేని యెడల నేమి చేయవలయును? చోరుఁడు శస్త్రపాణియై తొమ్మిపై నెక్కి 'నీ ద్రవ్య మెక్కడ నున్న'దని యడుగ, సమాధానముఁ జెప్పని యెడల ప్రాణహాని యగునపు డేమి చెప్పవలయును? సకలధర్మరహ స్యముల నెఱింగిన శ్రీకృష్ణభగవానుఁడు పూర్వోక్తమైన ఘాతుకుని విషయోదాహరణ మిచ్చి కర్ణపర్వములో నర్జునునకును (కర్ణ.69.61) భీష్ములవారు శాంతిపర్వములోని సత్యానృతాధ్యాయమున యుధిష్ఠి రునకును -

అకూజనేవ చేన్మోక్షో వావకూజే త్కథంచన,
అవశ్యం కూజితవ్యే వా శంకేరన్వాఽ వ్యకూజనాత్,
శ్రేయస్తత్రానృతం వక్తుం సత్యాదితి విచారితమ్.
(మ. భా. శాం. 109.15-16)

- మాటలాడకుండఁగనే వదలించుకొనుట శక్యమైన పక్షమున నే మైనను వరే! మాట లాడకూడదు; మాటలాడ వలసినదియే యీవ శ్యకమైన పక్షమునను, మాటలాడకపోయిన నితరులకు నందేహము

కలుగుట సంభవించు పక్షమునను, అప్పుడు సత్యమాడుటకంటె నసత్యమాడుటయే మేలైనది అని చెప్పి విచారణచేసి నిశ్చయించిరి. కారణమేమన- సత్యధర్మము కేవల శబ్దోచ్చారణ మాత్రముతో సమాప్తము కానేరదు. కావున, ఏ వాగ్వ్యవహారముచే సమస్తజనులకుఁ గల్యాణమగునో, యా వాగ్వ్యవహారము కేవల శబ్దోచ్చారణముచేత నసర్థమైనంతమాత్రమున నింద్య మనుటకు సాధ్యము కాదు. దేనిచే సమస్తజనులకు హాని కలుగునో యది సత్యము గాని, యహింస గాని కానేరదు.

సత్యస్య వచనం శ్రేయ స్సత్యా దపి హితం వదేత్,
య ద్భూతహిత మత్యంత మేత త్సత్యం మతం మమ.
(మ. భా. శాం. 329.13; 287.19)

-నిజ మాడుటప్రశస్తము. సత్యముకంటె సర్వభూతహితమైన మాటలు మాటలాడుట ప్రశస్తమైనది. ఏలయన- దేనివలన సర్వ భూతములకు నత్యంత హితమగునో యదియే సత్య మని నా యభిప్రాయము అని శాంతిపర్వమునఁ, దనకు సనత్కుమారులవారు చెప్పినటుల, నారదులు శ్రీ శుకునకుఁ జెప్పినారు. "యద్భూతహితం" అను పదమును జూడఁగ, నాధునికు లగు నాంగ్లేయోపయుక్తవాదుల స్మరణ కలుగుటచే నీ వచన మెవనిచేతనో ప్రక్షిప్తముగ వ్రాయఁబడిన దేమో యనుకొన నక్కఱలేదు. ఈ వచనము మహాభారతమున నరణ్య పర్వాంతర్గత బ్రాహ్మణవ్యాధసంవాదమున సైతము రెండుమూఁడు పర్యాయములు వచ్చినది. అందొకచో- "అహింసో సత్యవచనం సర్వభూతహితం పరం' (వన. 206.78) అనియు, మఱియొకచోట 'య ద్భూతహిత మత్యంతం త త్సత్య మితి ధారణా' (వన. 208.8) అనియుఁ గొంత పాఠభేదమున నున్నది. సత్యప్రతిజ్ఞుఁడగు యుధిష్ఠిరుఁడు ద్రోణునకు 'నరో వా కుంజరో వా' యని యుత్తర మిచ్చి వ్యామోహమును గలిగించుట కింతకంటె వేఱు కారణ మేదియులేదు.

కావున నిట్టి యితర విషయముల సైత మీ న్యాయమే సంబంధించి యుండును. హత్యఁ జేసిన మనుష్యుని జీవము ననత్యమాడి రక్షింప వలయు నని మన శాస్త్రములు వచింపవు. కారణ మేమన- శాస్త్రము లలో హత్యఁ జేసిన మనుష్యునకు దేహాంతప్రాయశ్చిత్త మైనను, వధ యైనను జెప్పఁబడియుండుటచే నట్టివాఁడు శిక్షణీయుఁడుగను వధ్యుఁ డుగను నగును. ఈ విషయమున నైనను, నింక నిట్టి యితర ప్రసం గములలో నైనను, నబద్ధపు సాక్ష్య మిచ్చు మానవునికిఁ బూర్వ మేడు తరముల పితరులును, ఇంక నంతకన్నఁ బూర్వులును, అతఁడును తప్పక నరకమును బొందుదు రని శాస్త్రకారులను వచించియున్నారు (మను. 89-99; మ. భా. ఆ. 7.3). కాని పైఁ జెప్పఁబడిన కర్ణపర్వము లోని ఘాతుకుని ప్రశ్నయందువలె మనము సత్యము వచించినచో, నిరపరాధి యగు మానవుని ప్రాణము నిష్కారణముగఁ బోవునంత సమయము వచ్చె నేని యేమి చేయుదువు? 'గ్రీ' నను పేరుగల యొక యింగ్లీషు గ్రంథకర్త "నీతిశాస్త్రోపోద్ఘాత" మను తన గ్రంథ మున నిట్టి ప్రసంగములలో నీతిశాస్త్రము నోరుమూసుకొని కూర్చుం డునని వ్రాసినాఁడు; మనువు, యాజ్ఞవల్క్యులు నిట్టి ప్రసంగములను సత్యాపవాదములలోఁ బరిగణింతు రనుట సత్యమే. అయిన నట్లు చేయుట సైతము వారి మతమున సామాన్యముగ గౌణమై యుండు టచే, "తత్సావనాయ నిర్వాప్య శ్చరు స్సారస్వతో ద్విజైఃఁ" (యాజ్ఞ. 2. 88; మను. 8. 104-106) అని తుద కాతనికిఁ బ్రాయశ్చిత్తము విధింపఁబడినది. అహింసాపవాదమును గుఱించి యాశ్చర్యపడక పోయినను కొంతమంది గొప్పయాంగ్లేయులు సత్యవిషయమున మన ధర్మశాస్త్రకారులకుఁ బేర్లు పెట్టుటకు, (నాక్షేపించుటకు) ప్రయత్నిం చినారు. కావుననే ప్రమాణ భూతులగు క్రైస్తవధర్మోపదేశకులును, నీతి శాస్త్రగ్రంథకర్తలగు నాంగ్లేయులును నీ విషయమున వచించుదాని నిచ్చోఁ జెప్పుచున్నాను. "నా యసత్యనంభాషణదేఁ బ్రభువు సత్య

మహిమ యధికమై వృద్ధిఁ బొందెనేని (అనఁగా: క్రైస్తవధర్మమున కధిక ప్రచారము కలిగెనేని) దానివలన నే నెటుల పాపి నగుదును?" (రోమ. శి. 7) అని క్రీస్తుశిష్యుఁడగు 'పాల్' అనువాని నోటినుండి వచ్చిన సంభాషణ బైబిలు తొమ్మిదవయాజ్ఞలో (కరారులో) కనఁ బడుచున్నది. ప్రాచీన క్రైస్తవధర్మోపదేశకు లెన్ని పర్యాయము లిటు లాచరించుచు వచ్చిరో యా సంగతి క్రైస్తవధర్మేతిహాసకారుఁడగు 'మిల్లు' అను వానిచేఁ జెప్పఁబడినది. ఎవరినైనఁ బీడించియైనను, నిర్బంధించియైనను ప్రబవర్తించుట న్యాయ్య మని తలఁచువారు వర్తమానకాలికు లగు పాశ్చాత్య నీతిశాస్త్రజ్ఞులలో సామాన్యముగ లే రని చెప్పవచ్చును. అయినను సత్యధర్మము నిరపవాదమని వారును జెప్పరు. ఉదాహరణార్థము, 'సిజ్విక్'* అను పండితుని నీతిశాస్త్ర గ్రంథము ప్రస్తుత పాఠశాలలలోఁ జదివింపఁబడుచున్నది గావున దానినే తీసికొందము. సిజ్విక్కు, కర్మాకర్మముల సంశయస్థలమున "నెక్కువ జనుల కెక్కువ సుఖ" మును నీ తత్త్వముయొక్క యాధారముచే నీతినిర్ణయముఁ జేయుచు నీ మార్గము ననుసరించి తుదకు నిట్టి ప్రసంగములలోఁ బసిబాలురకును బిచ్చివారికిని నశక్తులకును(సత్యమాడినఁ బ్రకృతి కపాయము గల్గువారికి) దమ శత్రువులకును (మాటలాడక పోయిన నిలువఁజాలని వారికి) తన్నుద్దేశించి యన్యాయముగఁ బ్రశ్న చేయువారికిని నుత్తరము చెప్పనప్పుడును, న్యాయవాదులు తమ కర్తవ్యమునకును ననత్యసంభాషణ చేయుట తప్పు కా"దని నిశ్చయించెను. మిల్లు† తన నీతిశాస్త్రగ్రంథమున పీని నపవాదములలోఁ జేర్చెను. ఈ యపవాదములే కాక సిజ్విక్కు♦, తన గ్రంథ

---

* Sidgwick's Methods of Ethics, Book III. Chap. XI § 6 p. 355 (7th Ed.) Also see pp. 315–317 (same Ed.).

† Mill's Utilitarianism, Chap. II. pp. 33-34 (15th Ed. Longmans 1907).

♦ Sidgwick's Methods of Ethics, Book IV. Chap. III § 7 p. 454 (7th Ed.); and Book II. Chap. V. § 3 p. 169.

ములో "అందఱును సత్యముగనే నడచుకొనవలయు"నని చెప్పినను "ఏ రాజకీయ పురుషునకుఁ దన కార్యస్థానము గుప్తముగ నుంచు కొనవలయునో యాతఁ డితరులకును, వ్యాపారులకును, రాజకీయ విషయములలో నియతముగ సత్యమే చెప్పవలెనని నేను చెప్పుటలే" దని సైతము వ్రాసినాఁడు. (మూఁడవస్థలములో నిట్టి సంగతియేఁ పాదిరీభటులకును, సిపాయీలకును, జెందియున్నదని సిడ్విక్కుఁ జెప్పి యున్నాఁడు). అధిభౌతికదృష్టిచే నీతిశాస్త్రముయొక్క యూహా పోహలను జేసిన "లెస్‌లీ స్టిఫన్" అను నింగ్లీషుగ్రంథకర్త యిట్టి మఱి యొక యుదాహరణ మిచ్చి తుదకు "నా మతమునుబట్టి యే కార్య పరిణామమునైనను పూర్తిగ విచారించియే దాని నీతిమత్త నిశ్చ యింపఁబడవలసినది. అసత్యసంభాషణచే నందఱికును గళ్యాణమగు నని నాకు నిశ్చయము కలిగిన పక్షమున నసత్యసంభాషణకు నేను భయపడువాఁడను గాను. మఱియు నీ నిశ్చయ మిటులే యుండు టకు శక్య మగు నేని యా సమయమునం దసత్యసంభాషణమే కర్తవ్య మని నే ననుకొందు" నని వ్రాసినాఁడు*. నీతిశాస్త్రము నధ్యాత్మ దృష్టిచే విచారణచేయు "గ్రీన్" దొరగా రిటులే యుపన్యసించి "యీ సందర్భములలో నీతిశాస్త్రము మానవుల నందేహనివృత్తిఁ జేయనేర" దని స్పష్టముగఁ జెప్పుచున్నారు. మఱియు సామాన్యవిధి యెద్దియై నను విధియే కావున, సదా యా విధిని బరిపాలించుటలో నే మాత్ర మైనను మహత్త్వ మున్నదని చెప్పక, సామాన్యముగ దానిని బరిపా లించుటలో మనకు శ్రేయస్సు కలదని మాత్రమే నీతిశాస్త్రము చెప్పు నని తుదకు సిద్ధాన్త పఱచెను. కారణ మేమన- ఇట్టి సమయములలో మనము, కేవలము నీతికొఱకే. లోభమూలకములును క్షుద్రములు

* Leslie Stephen's Science of Ethics, Chap. IX § 29 p.369 (2nd Ed.) "And the certainty might be such a kind as to make me think it a duty to lie."

నైన మన మనోవృత్తులను త్యజించుట కభ్యసించు చుందుము. *నీతి శాస్త్రమును గుఱించి గ్రంథములు వ్రాసిన "బెయను, వెవెల్", మొదలగు నితరాంగ్లేయ పండితుల మతము నైత మిట్టిదే.

పైఁజెప్పఁబడిన యింగ్లీషు గ్రంథకర్తలయొక్క మతమును, మన ధర్మశాస్త్రకారులచే విధింపఁబడిన నియమములను జూచిన యెడల "సత్య" విషయమున నధికమగు పట్టుదల కలవారెవ్వరై నదియు సహజముగ గోచరించును.

న నర్మయుక్తం వచనం హినస్తి
న స్త్రీషు రాజన్ న వివాహకాలే,
ప్రాణాత్యయే సర్వధనాపహారే
పంచానృతాన్యాహు రపాతకాని.

(మ.భా.ఆ. 82-18)

"హాస్యమునందును, స్త్రీల విషయమునందును, వివాహ కాలమందును, ప్రాణాపాయము సంభవించునపుడును, తన సర్వధన మపహృత మగునపుడును- మొత్తముమీఁద నీ యైదు విషయముల యందును నసత్యసంభాషణము పాతకము కాదు." ఈ విషయము శాంతి పర్వమునను (శాం. 109) మనుస్మృతి (మను. 8-110) యందును కలదు. ఈ తీరున మనశాస్త్రములలోఁ జెప్పఁబడియుండుట సత్యమే; కాని దీని యర్థము, స్త్రీలయొద్ద దప్పక యసత్యమాడ వలయునని కానేరదు. సిడ్విక్ దొరగా రీ యూహను మనంబున నిడుకొని బాలోన్మత్తరోగుల విషయముల నపవాదమును జెప్పిరో, యా యూహయే మహాభారతములో నభిప్రేత మైనది. ఐనను పార

* Green's Prolegomena to Ethics, § 315. p. 379 (5th Cheaper Edition.).

• Bain's Mental and Moral Science, p. 445. (Ed. 1875); and Whewell's Elements of Morality, Book II. Chaps. XIII and XIV. (4th Edition, 1864).

లౌకికము నాధ్యాత్మికము నైన దృష్టి కలవరింపఁజేయు నింగ్లీషు గ్రంథకర్తలింకను దూరముగఁబోయి యాలోచించి వ్యాపారులు సైతము స్వలాభార్థ మనత్య మూడినను తప్పులే దనిరి. కాని 'మత్తయి' చేఁ జెప్పఁబడిన నీతిమాత్రము మన శాస్త్రకర్తలచే నెప్పుడు నంగీకరింపఁ బడలేదు. నత్యశబ్దోచ్చారణము కేవల వాచికశబ్ద మనియు, సర్వభూతహిత మన వాస్తవిక నత్య మనియుఁ జెప్పి, యీ రెంటికి విరోధము సంభవించిన యెడల, వ్యవహారదృష్టిచే నపరిహార్యమని యసత్య మాడి నిర్వహించుకొనుట కొన్నిస్థలములందు మనవారిచే నంగీకరింపఁబడినమాట సత్యమే. అయినను నత్యాది నీతిధర్మములు మనవారి మతములో నిత్యము (అనఁగా- సర్వకాలములయందు నేకరీతిగనే యబాధితము) లై యుండుటచే పారలౌకిక దృష్టి ననుసరించిన నిది కొంచె మైనను సామాన్యముగఁ బాపముగనే యున్నదని నిశ్చయించి యందుకొఱకుఁ బ్రాయశ్చిత్తమును సైతము విధించిరి. ఈ ప్రాయశ్చిత్తములు నిరర్థకములని శుద్ధాధిభౌతికశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఈ ప్రాయశ్చిత్తములు విధించిన వారియొక్కయు, వీ కారణమున నితరులచే నవి వ్యర్థము లని చెప్పఁబడుచున్నవో వారి యొక్కయు, దృష్టి యేకరీతిగ నుండకపోవుటచేఁ బూర్వోక్తములగు నీ రెండు సత్యాపవాదములను గౌణముగనే యంగీకరింపఁ బడవలయునని సిద్ధాన్తము చేయవలసి వచ్చుచున్నది. మఱియు నీ యర్థమే యీ సంబంధములో నున్న కథానకములలోఁ బ్రతిపాదింపఁబడినది. ఉదాహరణము- యుధిష్ఠిరుఁడు "నరో వా కుంజరో వా" యని తన పని కంతరాయజనక మగు ప్రసంగమున నొక్క పర్యాయమే యటులో చెప్పెను. ఈ హేతుపరిచేతనే యంతకుఁ బూర్వము నేల వదలి నాలు గంగుళముల యెత్తున నంతరిక్షమున నడచెడి యతని రథము పిదప నితరుల రథముల వలెనే నేలమీఁదనే నడచుచుండెను. తుద కా కారణముననే గడియయైన నరకములో వాసముచేయవలసి వచ్చినదని మహాభారతములోఁ జెప్పఁబడినది.

(ద్రో. 191. 57-58; స్వర్గ. 3-15.). ఇటులే భీష్మవధయు క్షాత్రధర్మ ప్రమాణముగనే చేయఁబడినది. అయిన శిఖండిని ముందుంచుకొని యటుల చేయుటచే నర్జునునకుఁ దన కుమారుఁడగు బభ్రువాహనునిచే ననంతరమునఁ గలిగిన పరిభవమును సహించుట ప్రాప్తమైనది (మ. భా. అశ్వ. 81-10). ఈ యుదాహరణముల వలన ప్రసంగ విశేషములందుఁ జెప్పఁబడిన పూర్వోక్తాపవాదములు ముఖ్యములగు ప్రమాణములు కాకపోవుటచే మహాదేవుఁడు పార్వతికి చెప్పినటుల-

ఆత్మహేతోః పరార్థే వా నర్మహాస్యాశ్రయా త్తథా,
యే మృషా న వదన్తీహ తే నరా స్స్వర్గగామినః.

(శా.అను. 144-19)

– స్వార్థమున కైనను, పరహితమున కైనను, హాస్యమునకైన, నెక్కడనైన నే పురుషుఁ డసత్యమాడఁడో యాతనికే స్వర్గప్రాప్తి యగునని మన శాస్త్రకారుల నిశ్చయసిద్ధమగు తాత్త్విక సిద్ధాన్తమని చెప్పవలసియున్నది. తన మాట నైనను ప్రతిజ్ఞనైనను పరిపాలించుట యనునది సత్యములో నంతర్భూత మగును. "హిమాలయ మైనఁ గదలిక నొందును. అగ్నియైనఁ జల్లఁదనము నొందును. కాని నా వాక్య మన్యథా కానేరదు" అని శ్రీకృష్ణునిచేతను, భీష్మునిచేతను చెప్పఁబడినది. (మ.భా.ఆ. 108; ఉ. 81-48) భర్తృహరి సైతము-

తేజస్వినో సుఖ మసూనపి సంత్యజన్తి,
సత్యవ్రతవ్యసనినో న పునః ప్రతిజ్ఞామ్.

– తేజోవంతుఁడు సంతోషముగఁ బ్రాణములనైన వదలును. కాని తన ప్రతిజ్ఞను మాత్రము విడువఁడు. (భర్తృహరి. నీ. శ. 110) అని సత్పురుషులను వర్ణించియున్నాఁడు. అటులే "ద్వి శ్శరం నాభిసంధత్తే రామో ద్వి ర్నాభిభాషతే" అని దశరథరామచంద్రుని యొక్క యేకపత్నీవ్రతముతో సమానముగ నేక బాణవ్రతమును

నేకవచన వ్రతమును సైతము ప్రసిద్ధములై యున్నవి. మఱియు స్వప్నమునఁ జేయఁబడిన ప్రతిజ్ఞను సత్యముగఁ జేయుటకై హరిశ్చంద్రుఁడు చండాలుర యింట నీళ్ళు మోసినటుల పురాణములలో కథ యున్నది. కాని యిందులకు వ్యతిరేకముగ నింద్రాదిదేవతలు వృత్రాసురాదులతోఁ ప్రతిజ్ఞలఁ జేసి వాని నుల్లంఘించి, లేక, యందులకై వానిలో నేవో కొన్ని కారణముల నాలోచించి యైన నా వృత్రాసురాదుల వధించిరని వేదములలో వర్ణితములై యున్నవి. తదనుసారముగనే హిరణ్యకశిపుని వధవిషయకమగు సంగతి పురాణ ప్రసిద్ధము. ఇంతియకాక వ్యవహారములలో సైతము కొన్ని ప్రతిజ్ఞలు న్యాయస్థానములలో న్యాయ బహిర్భూతములని కాని, పరిపాలించుట కయోగ్యములని కాని యంగీకరింపఁబడుచున్నవి. అర్జునవిషయమై యిటులే యొక కథ మహాభారతములో వర్ణితమైయున్నది. "నీచే నున్న గాండీవము నితరుని కిమ్మని న న్నడుగువానిని నిస్సంశయముగ నటికి చంపుదు" నని యర్జునుఁడు ప్రతిజ్ఞ జేసెను. పిమ్మట యుద్ధములో కర్ణునిచేఁ బరాజితుఁడైన యుధిష్ఠిరుని నోట "నీ గాండీవముతో నేమి యుపయోగము? ఆ ధనుస్సును నీ చేతినుండి పాఱవేయుము" అని యర్జును నుద్దేశించి నిరాశచే సాహసికమగు వార్త వెలువడఁగనే యర్జునుఁడు ఖడ్గపాణియై యుధిష్ఠిరుని జంపుటకు సంసిద్ధుఁడయ్యెను. శ్రీకృష్ణుఁ డా సమయమున సమాపవర్తి యగుటచే, సత్యధర్మ మనఁగా నేమియో, తత్త్వజ్ఞానదృష్టి ననుసరించి సమర్మకముగ విమర్శఁ జేసి "నీవు మూఢుఁడవుగ నున్నావు; ఇప్పటికిని నీకు ధర్మసూక్ష్మము తెలియదయ్యెఁ. ఆది వృద్ధులచే లెస్సగ నుపదేశింపఁ బడవలయును." "న వృద్ధా స్సేవితా స్త్వయా" — నీవు వృద్ధులసేవఁ జేయలేదు. నీ ప్రతిజ్ఞ నీకు పరిపాలింపఁ దగినది యైన పక్షమున యుధిష్ఠిరుని నిందింపుము; ఏలయన— గౌరవార్హులగువారికి నిర్భర్త్సనమే (నిందించుటయే) వధగ నుండును

అని యర్జునున కుపదేశించెను. మఱియు నవిచారణఁగఁ దనచేతనే తాఁదెచ్చుకొనఁబోవు జ్యేష్ఠభ్రాతృవధజన్య పాతకమునుండి, యర్జునుని నివర్తింపఁ జేసెనని కర్ణుఁడు దెప్పెను. (మ.భా.కర్ణ. 69) శ్రీకృష్ణునిచే నా సమయమునఁ జెప్పఁబడిన సత్యానృత వివేకమే యనంతరము శాంతిపర్వమున సత్యానృతాధ్యాయములో భీష్మునిచే యుధిష్ఠిరున కుపదేశింపఁబడినది (మ. భా. శాం. 109). మఱియు వ్యవహారములో నెల్లవారిచే నా విషయము గమనింపఁబడవలసినది. అయిన నీ ధర్మసూక్ష్మ మెటు లెఱుంగ వలయునో వచింపుట యసాధ్యము. కారణ మేమన- భ్రాతృధర్మము సత్యముకంటెఁ బ్రకృతో దాహరణమున శ్రేష్ఠమైనది యైనను, గీతలలో నిందుకు వ్యతిరేకముగ బంధుప్రీతికంటె క్షాత్రధర్మమే బలవత్తర మని నిర్ణయింపఁబడినదని చదువరులు సహజముగ నూహింతురు.

అహింసయు, సత్యము నను వానిలో నింత వాద ముండ నస్తేయ మను మూఁడవ సామాన్యధర్మమున సైత మెంత వాద ముండిన నేమి యాశ్చర్యము? ఒకఁడు యథాన్యాయముగ సంపాదించిన ధనమును, నిరాటంకమగు చౌర్యముచే నైనను, బందిపోటుచే నైనఁ గోలుపోవుట సంభవించినటులైన, ద్రవ్యనంచయము చేయుటయే యసంభవ మగుటచే నెల్లవారికి నష్ట మగును. మఱియు జనుల కట్టుఁబాటు చెడి యెల్లెడలను నే నియమమును లేకయే పోవునను నంశము నిర్వివాదమే. కాని యీ నియమముల కపవాద మున్నది. ఎటులన- నలుదిక్కుల దుర్భిక్షము సంభవించుటచే, క్రయమున నైనను, గూలి యొనర్చి సంపాదించుట నైనను, లేక, ధర్మార్థముగ నైనను నాహారము లభింపక పోవుట యను నాపద సంభవింపఁగఁ జౌర్యముచే నాత్మసంరక్షణ చేసికొనఁదలఁచు వారిని పాపులని తలఁతుమా? ద్వాదశవర్ష క్షామము సంభవింపఁగా విశ్వామిత్రుని కిట్టి దురవస్థ ప్రాప్తించి యా ముని శ్వపాకుని (కుక్కను తినువాని)

యింటనున్న కుక్కమాంసముగల పాత్ర నెత్తికొనిపోయి భుభక్ష్య మగు నాయన్నముచే నాత్మసంరక్షణఁ జేసికొనెనని మహాభారతములో నున్నది (శాం. 141). శ్వపచునిచే విశ్వామిత్రునకు "పంచ పంచనఖా భక్ష్యాః" (మను. 5-18) * మొదలగు శాస్త్రప్రమాణములవలన నభక్ష్య భక్షణము కూడదనియు, నదియుఁ జౌర్యముచే బొత్తుగఁ దగదనియు శాస్త్రానుసారముగ ననేకోపదేశములు చేయఁబడెను. కాని-

పిబం త్యేవోదకం గావో మండూకేషు రుద త్స్వపి,
న తేఽధికారో ధర్మేఽస్తి మా భూ రాత్మప్రశంసకః.

— ఓరీ! కప్ప లేడ్చుచున్నను గోవులు నీరు ద్రావక మానవు; నో రెత్తకుము; నాకు ధర్మోపదేశ మొనర్చుటకు నీ కధికారము లేదు. వ్యర్థముగ నీ ప్రగల్భతఁ జూపకుము అని చెప్పి విశ్వామిత్రుఁ డా శ్వపచుని నవమానించెను. "జీవితం మరణా ద్భేయో జీవన్ ధర్మ మవాప్నుయాత్"— బ్రతికియుఁడిన ధర్మ మొనర్ప నగును. కావుననే ధర్మదృష్టి ననుసరించి చూచినను మరణముకంటె జీవితము శ్రేయ

---

* కుక్క, కోతి, మొదలగు నైదుగోళ్ళ జంతువులలో నేదుపంది, అడవి పంది, ఖడ్గమృగము, తాబేలు అను నైదుజంతువుల మాంసమే భక్షింపఁ దగినది (మను. 5. 18). ఈ యయిదు జంతువుల మాంసమే కాక ఖడ్గమృగపు మాంసము సైతము భక్షింపఁ దగునని మనువు ఒప్పుకొనెను. ఈ విషయము వికల్ప మని వ్యాఖ్యాతల యభిప్రాయము. ఈ వికల్పమును వదలినయెడల మిగిలిన యైదుజంతువుల మాంసమే భక్షింపఁదగినది. "పంచ పంచనఖా భక్ష్యాః" అను మనువచనమున కిదియే యర్థము; కాని, ఎవరు మాంసము తినవచ్చు నని విధికలదో వారి యైదు గోళ్ళుగల జంతువు మాంసమున దప్ప వేఱుగు జంతువు మాంసమును దినకూడదు. ఈ జంతువుల మాంసముల నెల్లవారును తినవలయు నను సర్వమకాదని యీ వ్యవస్థకు భావార్థమని మీమాంసకులు చెప్పుచున్నారు. ఈ పారిభాషికార్థమున వారు పరివంక్య యందురు. పరివంక్యకు "పంచనఖా భక్ష్యాః" అమునదిమే ముఖ్యోదాహరణము. మాంసభక్షణము విధింపఁబడినది మొదలి యైదు జంతువుల మాంసము సైతము నిషిద్ధమే యని యెఱుంగునది.

న్కరము అని యా సమయమున విశ్వామిత్రుఁడు సమాధానము చెప్పెను. మఱియు విశ్వామిత్రుఁడే కాక యిట్టి ప్రసంగములలో 'నజీగర్తుఁడు, వామదేవుఁడు' మొదలగు ననేక మహర్షులుసైత మిటులే యొనర్చి రని యాచరణకర్త ల యుదాహరణము మనువుచే నియ్యఁ బడినది (మను. 10.105-108). 'హాబ్స'ను* పేరుగల యాంగ్లేయ గ్రంథకర్త తన గ్రంథమున "ఒకానొక కఠినమగు దుష్కాలమున కొనుటకుఁగాని, ధర్మార్థముగఁ గాని యన్నము లభింపనప్పు డుదర పోషణార్థమై చౌర్యమునైనను సాహసమునైనను జేసిన పక్షమున వాని యా యపరాధము మన్నింపఁబడవలసినదే" యని చెప్పెను. మఱియు 'మిల్ల'నుపండితుఁ డిట్టి సమయమున చౌర్యము నైనం జేసి తన ప్రాణమును కాపాడుకొనుటయే మనుష్యునకుఁ గర్తవ్య మని వ్రాసెను. "మరణముకంటె జీవితము శ్రేయస్కర" మను నీ విశ్వా మిత్రుని సిద్ధాన్తముమాత్ర మన్ని విధముల నిరపవాద మై యున్నదా? జగమున బ్రతుకుటయే పురుషార్థము కానేరదు. కాకులును బలుల దిని యనేక వత్సరంబులు జీవించును. పీరపత్ని యగు 'విదుల' యనుస్త్రీ, తనపుత్రులతోఁ బ్రక్కపైఁ బడి యవ్యక్తధ్వనులతో నఱచుచు నూఱో డ్లింట వ్యర్థకాలక్షేపముఁ జేయుటకంటె నొక గంటయైనను బరాక్రమజ్యోతిని జూపి మరణించుటయే గొప్ప యని చెప్పెను. "ముహూర్తం శ్రేయో న చ ధూమాయితం చిరం" (మ.భా.ఉ.132 15) -నేడైనను, రేపైనను, దుదకు నూఱేండ్లకైనను, మృత్యువు తప్పనిదే యని భాగవతమున నున్నది (భాగ.10.1.38; గీత.2.28). అటులైన నీ మరణవిషయమున, భయ మైనను, రోదన మైనను, భీతి యైనను, నాక్రోశ మైనను బొంద నేల? అధ్యాత్మశాస్త్ర ప్రమాణముగ పరీక్షించిన

* Hobbe's "Leviathan", Part II. chap. XXVII. p. 139 (Morley's Universal Library Edition). Mill's "Utilitarianism", Chap.V. p. 95. (15th Edn.)— "Thus to save a life, it may not only be allowable but a duty to steal etc."

నాత్మ నిత్య మగుటచే దానికెల్లప్పుడు మరణము రానేరదు. కావుననే మరణవిచారము చేయు సమయముననే ప్రారబ్ధ కర్మానుసారముగఁ బ్రాప్తమైన శరీరవిచారణము ముఖ్యముగఁ జేయవలసియున్నది. ఈ శరీరము, నడచుచు మాటలాడుచున్నను నాశము గలదియే. కాని, యాత్మయొక్క శ్రేయస్సునకై యీ జగత్తునఁ జేయవలసిన కార్యముల కన్నిటికిని నశ్వరమైన యీ మానుషదేహమే ముఖ్యసాధనమగుటచేతనే "ఆత్మానం సతతం రక్షేత్ దారై రపి ధనై రపి"-భార్యచేతను, ధనముచేతనుఁ గూడఁ దన్నెపుడును రక్షించుకొనవలయునని మనువు చెప్పెను (మను. 7.213). అయినను దుర్లభము నశ్వరమునైన యీ మానవదేహమును వ్యయపఱచి యింతకంటె నధికము శాశ్వతమునగు నొక వస్తువును సంపాదించుకొనవలసి యుండుటచే, దేశము కొఱకును, సత్యము కొఱకును, ధర్మము కొఱకును, తన ప్రాణమునైనను, వ్రతమునైనను, సంరక్షించు కొనుటకును, మర్యాద కొఱకును, గీర్తి కొఱకును, సర్వభూతముల హితము కొఱకును ననేకులగు మహాత్ములచే ననేక సమయములలో నీ తీవ్ర కర్తవ్యాగ్నిహోత్రమందు నానందముగఁ దమ ప్రాణములు సైతమాహుతిగ వేల్వఁబడినవి. 1. వసిష్ఠమహాముని యావును సింహమునుండి తప్పించుటకై తన దేహమును సింహమునకు బలియిచ్చుటకుద్యుక్తుఁ డైన దిలీపుఁడు "మా బోంటి వారికిఁ బాంచభౌతిక శరీరములపై నాసక్తి యుండదు. కావున జడమగు నా శరీరముపైఁ గరుణ చూపుటకంటె నా యశశ్శరీర విషయమున నెక్కువ దయయుంచుట శ్రేయస్కరము. కావున నటు లొనర్పుము" అని సింహమును బ్రార్థించి నటుల రఘువంశ గ్రంథమునందుఁ జెప్పఁబడినది (రఘు. 2. 57). 2. మఱియు సర్వప్రాణ సంరక్షణార్థమై గరుడునకు స్వదేహమును జీమూతవాహనుఁ డర్పించుకొని నటుల కథాసరిత్సాగరమునను, నాగానందమునను వర్ణితమైనది. 3. మృచ్ఛకటిక యను నాటకమున

న భీతో మరణా దస్మి కేవలం దూషితం యశః,
విశుద్ధ స్య హి మే మృత్యుః పు త్తర్జన్మ సమః కిల.
(మృచ్ఛ. 10-27)

_ నేను మరణమువలన భయపడను. కీర్తికిఁ గళంకము వచ్చిన దనియే నాకు దుఃఖముగ నున్నది. కీర్తి శుద్ధముగా నుండి చావు వచ్చినను నాకు సత్యముగఁ బుత్రోత్సాహముతో సమానమగు నదియే యని చారుదత్తుఁడు చెప్పెను. 4. మఱియు నేతన్న్యాయానుసరణ ముగనే, శిబిచక్రవర్తి తన్ను శరణుఁజొచ్చిన కపోతమును రక్షించు టకై శ్యేనరూపముతో నీ కపోతము వెంటనంటి వచ్చిన ధర్మదేవతకుఁ దన దేహమునందలి మాంసమును గోసి యిచ్చెను. 5. మఱియు దివశత్రువగు వృత్రాసురునివధకై దధీచిమహర్షి యెముక కావలసి రాఁగా, సర్వదేవతలు నీ ఋషీశ్వరుని సమీపించి "శరీరత్యాగం లోకహితార్థం భవాన్ కర్తు మర్హతి"- మహానుభావా! సమస్త లోక ముల శుభమునకై తాము దేహత్యాగముఁ జేయఁబలయును అని విన్న వింప నా దధీచియు మహానందముతోఁ బ్రాణములు వదలి తన దేహమునందలి యెముకను (వజ్రమును) దేవతల కిచ్చెను. ఈ కథ యంతయు భారతమున వనపర్వములో నున్నది (వన. 100; 131; శాం. 342). 6. కర్ణునకు శరీరముతోనే పుట్టిన కవచకుండలములు హరించుటకై బ్రాహ్మణరూపధారి యై యింద్రుఁడు దానశూరుఁ డగు కర్ణుని యాచింపవచ్చునని యెఱింగి, సూర్యుఁడు మునుపే యా కవచకుండలముల నేరి కొనంగవల దని సూచనగఁ గర్ణునకుఁ జెప్పెను. ఇంతియకాక "నీకు దానశూరుఁడని కీర్తియున్నను గవచ కుండలముల నిచ్చుటచే నీ జీవితమున కపాయము రానున్నది. కాన వానిని మాత్ర మేరికి నియ్యకుము. ఏలన- "మృతస్య కీర్త్యా కిం కార్యం"-మరణానంతరము కీర్తివలన నుపయోగ మేమి? అని సైతము తండ్రి యగు సూర్యుఁడు కర్ణునకు నొక్కి చెప్పి, సూర్య వచనములు

విని "జీవితే నాపి మే రక్ష్యా కీర్తిస్తు ద్విద్ధి మే వ్రతమ్"-నాప్రాణముల నిచ్చి యైనను నా కీర్తిని రక్షించుకొనుటయే నా వ్రతము (మ. భా. వన. 299.38) అని కర్ణుడు సూర్యునకు స్పష్టముగ సమాధానము నుడివెను. వేయేల? చచ్చెద వేని స్వర్గమును బొందుదువు, జయించెద వేని రాజ్యభోగముల సుఖింతువు (గీ. 2.37), ఇత్యాది క్షాత్ర ధర్మము గాని, "స్వధర్మే నిధనం శ్రేయః" (గీ. 3.35) అను సిద్ధాన్తము గాని యీ న్యాయము నవలంబించియే యున్నది. మఱియు దాని ననుసరించియే, "కీర్తి ప్రాహుఃర్ జాతా? సుఖ నాహీఁ, సుఖ ప్రాహ తాఁ కీర్తి నాహీఁ"-కీర్తి కావలయు ననుకొనిన సుఖముండదు. సుఖము కావలయుననినఁ గీర్తి యుండదు (దాస. 12. 10-19; 19. 10-25) కావుననే "దేహత్యాగితాఁ కీర్తి మాగేఁ ఉరావీ, మనా సజ్జనా హేంచి క్రీయా కరావీ"-ఓ మానస సజ్జనుఁడా! మరణానంతరమున సైతము కీర్తి వృద్ధినొందు పని నలుపుమా అని శ్రీసమర్థ రామదాసస్వామి వారుపదేశించిరి. పరోపకారముచేఁ గీర్తి వచ్చు ననునది సత్యమైనను, ఇచ్చిన పిదప నా కీర్తియొక్క యుపయోగ మేమి? మఱియు సంభావిత పురుషునకు దుష్కీర్తికంటె మరణ మైనను (గీ. 2.34), జీవితము కంటె పరోపకార మైనను నధిక ప్రియమని యేల తోఁచును? అను నీ ప్రశ్నలకు సమాధానము వచించుట కాత్మానాత్మ విచారమునఁ బ్రవేశించుటకన్న వేఱుమార్గ మేదియుఁ గానరాదు. మఱియు సమాధానము వచించినను నే సమయమున జీవుఁడుదారుఁ డగుట మంచిదియో, యే సమయమునఁ గాదో, యెఱుంగుటకై కర్మాకర్మ శాస్త్రము సైతము విచారింప నగును. లేనియెడల నుదారుఁడై యనంతకీర్తిని సంపాదించుకొనుట యటులుండ, మౌర్ఖ్యముచే నాత్మ హత్య నొనర్చుకొనిన పాపము మాత్రము సైఁ బడక తప్పదు.

మాతాపితలును గురువును మొద లగు వంద్యులఁ బూజ్యులు నగు వారిని దేవతలవలెఁ బూజించుటయు. శుశ్రూషఁ జేయుటయు

నను నివియే సామాన్యమును సర్వమాన్యములును నగు ధర్మములలోఁ బ్రధానములుగ నెన్నఁబడుచున్నవి. కారణ మేమన-అఖిల మానిచో, కుటుంబముయొక్క గాని, గురుకులముయొక్క గాని, లేక, మొత్తమున సమాజముయొక్క గాని సరియగు వ్యవస్థ యేనాఁడు నుండకయే పోవును. కావుననే స్మృతులలోనే కాక యుపనిషత్తులలో సైతము "సత్యం వద, ధర్మం చర!" యని తొలుత బోధించి, యనంతరమందు "మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ" అని యధ్యయనమును బూర్తి చేసికొని పోవుచున్న ప్రతి శిష్యునకును గురువుపదేశింపవలయునని చెప్పఁబడినది (తై. 1. 10. 12). మహాభారతమునందలి బ్రాహ్మణవ్యాధోపాఖ్యానముయొక్క తాత్పర్యము సైత మిదియ (వన. అ. 213); కాని యీ ధర్మముల నాచరించునపుడు సైత మనేక విధములగు నకల్పితప్రతిబంధములు సంభవించుచున్నవి.

ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణాం శతం పితా,
సహస్రం తు పితౄన్ మాతా గౌరవే తాతిరిచ్యతే.

(మను. 2.145)

— పదిమంది యుపాధ్యాయులకంటె నాచార్యుఁడును, నూర్గు రాచార్యులకంటెఁ దండ్రియు, వేయిమంది తండ్రులకంటెఁ దల్లియు గౌరవవిషయమున నధికులు అని మనువు చెప్పుచున్నాఁడు. అయినను దల్లి మహాపరాధ మొనర్చె నని పితృాజ్ఞచేఁ బరశురాముఁడు తన తల్లి కుత్తుక తెగ నఱకెను. ఈ కథ ప్రశస్తమైనదే (వన. 116. 14). మఱియు శాంతిపర్వమునఁ జిరకార్యుపాఖ్యానమున (శాం.265) నిట్టి మఱియొక సందర్భమున, పితృాజ్ఞానుసారముగఁ దల్లిని జంపుట శ్రేయస్కరమా? లేక, పితృాజ్ఞాభంగము శ్రేయస్కరమా? యను సంశమున నీ ధర్మముల రెంటియొక్క తారతమ్య నిర్ణయమునకై యనేక సాధకబాధక ప్రమాణములు నిరూపితము లైనవి. మఱియు వేఱొక యధ్యాయములో వేఱొక విచారణ సవిస్తరముగఁ జేయఁ

బడినది. దీనివలన నిటువంటి సూక్ష్మధర్మ ప్రసంగమున, నితిశాస్త్ర దృష్టి ననుసరించి యూహాపోహలు చేయుట యను నాచారము మహాభారత రచనాకాలమందుఁ బూర్ణమైన ప్రచారమున నుండిన దని స్పష్టమగుచున్నది. తండ్రియొక్క ప్రతిజ్ఞను సత్య మొనర్చుటకై శ్రీరామచంద్రుఁడు పదునాలుగు వత్సరంబులు వనవాస మొనర్చుట యాబాలవృద్ధ మెఱిఁగినదే కదా! కాని పూర్వమందు మాతృ సంబంధమునఁ జెప్పఁబడిన న్యాయమే తండ్రికి సైతము సంబంధింపఁ జేయు నమయ మప్పు డప్పుడు రావచ్చును. ఉదాహరణము- కుమారుఁడు స్వపరాక్రమముచే రాజయిన పిదపఁ దండ్రి యొనర్చిననేరము సుతుని యొద్దకు విచారణకు వచ్చిన, రాజగు సుతుఁడు తన యధికారముతీరునఁ దండ్రిని శిక్షింప వలయునా? లేక కన్నవాఁడని వదల వలయునా?

పితాఽఽచార్య స్సుహృన్మాతా భార్యాపుత్రః పురోహితః,
నాదండ్యో నామ రాజ్ఞోఽస్తి య స్స్వధర్మే న తిష్ఠతి.
(మను. 8. 335)

– తండ్రియు, నాచార్యుఁడును, మిత్రుఁడును, తల్లియు, భార్యయు, పుత్రుఁడును, పురోహితుఁడును, నింతకంటె నెక్కువవారైనను స్వధర్మ ప్రమాణముగ నడువనియెడల రాజుచే దండింపఁబడఁ దగినవారలే యని మనువు వక్కాణించియున్నాడు (మ.భా.శా.121.60). కారణ మేమన- ఈ విషయమునఁ బుత్రధర్మమునకంటె రాజధర్మ మధిక యోగ్యత గలదై యున్నది. ఈ ధర్మము ననుసరించియే మహాపరాక్రమశాలియు, సూర్యవంశజుఁడు నగు నగరచక్రవర్తి తన పుత్రుఁడగు ననమంజుఁడు దుర్వృత్తి నవలంబించి ప్రజలను దుఃఖపెట్టుచున్నాఁడని స్పష్టముగ నెఱిఁగినప్పుడు తన రాజ్యమునుండి యతని వెడలఁ గొట్టెను. ఇటుల మహాభారతమునను శ్రీ మద్రామాయణమునను వర్ణితమై యున్నది. (మ.భా.వ. 107; రామా. 1-38). మనున్మృతి యందు సైత మిట్టిదే యొక విషయ మున్నది. ఏమన– అంగిరసుఁ

డను పేరు గల యొక బుషికి నల్పవయస్సుననే యుత్తమజ్ఞానము సిద్ధించుటచే నాతని పినతండ్రులు మేనమామలు మొదలగు పెద్ద లతని యొద్ద నధ్యయనము సలుపుచుండిరి. అప్పు డొకనాఁడు పాఠము జరుగుచుండఁగ, శిష్యులను గురు వెప్పుడును బిలుచునటు లొక నందర్భమున నంగిరస్సు నోటనుండి, పినతండ్రి మొదలగువారి నుద్దేశించి "బిడ్డలారా" యను శబ్దము స్వభావముగ వచ్చెను. "పుత్రకా ఇతి హోవాచ జ్ఞానేన పరిగృహ్య తాన్"-అప్పుడేమి చెప్పుదు? ఆ శిష్యు లగు వృద్ధుల కందఱకుఁ గోపాగ్ని తలకెక్కుటచే "ఈ పిల్ల వాఁడు సొగరుఁబోతు" అని నిశ్చయించి యతనికిఁ దగిన శిక్ష విధింపఁ బడవలయు నని దేవతలయొద్ద నభియోగము (వ్యాజ్యెము) దెచ్చిరి. ఉభయపక్షముల యుక్తులను, వాదములను నాకర్ణించిన పిదప, దేవతలు తుదకు "అంగిరస్సు చెప్పినదే న్యాయ్య" మని తీర్పుఁ జెప్పిరి. కారణ మేమన-

> న తేన వృద్ధో భవతి యే నాస్య పలితం శిరః,
> యో వై యువాఽధీయాన స్తం దేవా స్థవిరం విదుః
> (మను. 2-156)

– తల నరసినమాత్రముననే మనుజుఁడు పెద్దవాఁడు కానేరఁడు. తరుణ వయస్కుఁడైనను జ్ఞానవంతుఁడైనవాఁడే వృద్ధుఁడని దేవతలు తలఁచుచున్నారు. (మ.భా.వన. 188-11; శల్య. 51-47). మనువు నకును, వ్యాసునకే కాక యీ ధర్మము బుద్ధునకును మాన్యమే. ఎటులన- మనుస్మృతిలో నున్న పైశ్లోక ప్రథమ పాదము *'ధమ్మ

---

* 'ధమ్మపద' గ్రంథమునకు ప్రాచ్యధర్మ పుస్తక మాలయందు (Sacred Books of the East, Volume X) తర్జుమాయై యున్నది. చుల్ల వగ్గ యనుదానికి నా గ్రంథమాలలోనే (Volume X VII,XX) తర్జుమాయై యున్నది. 'ధమ్మపద' గ్రంథముయొక్క పాళీభాషలోని శ్లోకము- "న తేన థేరో హోతి యేనస్స పలితం సిరో, పరిపక్కా వయో తస్స మోఘ జిణ్ణోతి పుచ్చతి." 'థేర' శబ్దమునకు బౌద్ధయతులని యర్థము. ఇది సంస్కృత భాషయందలి 'స్థవిర' శబ్దముయొక్క అపభ్రంశరూపము.

పద' యను పేరుగల పాళీభాషలోఁ బ్రసిద్ధమైన నీతిపరమగు బౌద్ధ గ్రంథములోఁ బ్రత్యక్షర ముండుటచే (ధమ్మపద. 280) "కేవల వయస్సు చేతనే పరిపక్వమైన వాని జీవనము వ్యర్థము. సత్యముగ వృద్ధుఁడును ధార్మికుఁడు నగుటకు సత్యము నహింసయు మొదలగు సద్గుణము లుండి తీరవలయును" అని చెప్పుటచేతను, 'చుల్లవగ్గ' యను పేరిటి మఱియొక బౌద్ధధర్మ గ్రంథమున, "ధర్మమును నిరూపించు భిక్షువు నవీనుఁ డైనను స్వయముగ నున్నతాసనోప విష్టులగు ప్రాచీనులకు సైతము (నవీనునికంటె పూర్వమే దీక్ష వహించిన వారికి; అనఁగా- వయోవృద్ధులగు భిక్షువులకు సైతము) ఈ నవీనుసిచే ధర్మ ముపదేశింపఁ బడవలసినదే" యని బుద్ధునిచే నాజ్ఞాపింపఁ బడిన దగుటచే గూడ స్పష్టమగుచున్నది (చుల్లవగ్గ. 6. 13-1.). ప్రహ్లాదుఁడు తండ్రి యగు హిరణ్యకశిపుఁ దిరస్కరించి భగవంతుఁ ప్రత్యక్షము చేసికొనినట్లు పౌరాణికకథ నందఱు వినియే యున్నారు. మఱియు నా గ్రంథమునఁ బిన్న పెద్దలదే కాక పితా పుత్రుల సర్వసామాన్య సంబంధములలో సైత మొకానొకప్పుడు చిన్న వానికే పూజ్యపదవి సంభవించిన యెడల నా కార్యము ముగియునంత దనుక నొండొక యుపాయము లేమిచే క్షణమాత్ర మా జన్యజనక భావము మఱువ వలసి వచ్చునని తాత్పర్య మగుచున్నది. కాని యిట్టి సమయము లభింపకున్నను, నీ న్యాయమును వలసినపుడెల్ల నుప యోగించుచు నెవ్వఁడేని దుష్టబాలుడు దండ్రినిఁ దిరస్కరించిన వానిని మనము పశువులలో గణింపకుందుమా? "గురుర్గరీయా న్పితృతో మాతృత శ్చేతి మే మతిః" _ తలిదండ్రులకన్నను గురువు శ్రేష్ఠుడు. (శాంతి. 108.17) అని భీష్ముఁడు ధర్మరాజునకుఁ జెప్పెను. ఐనను మరుత్తుఁడను రాజు గురువు లోభమున నతని స్వయముగ వదలినపిదప నా రాజు_

గురో రవ్యవలిప్తస్య కార్యాకార్య మజానతః,
ఉత్పథం ప్రతిపన్నస్య న్యాయ్యం భవతి శాసనమ్.

— కర్తవ్యాకర్తవ్యములను నెఱుఁగక గర్వమున నపమార్గమున సంచరించు గురువును సైతము శిక్షింపఁ దగును అని చెప్పెనని మహాభారతమునఁ గలదు. ఆ మహాభారతమున నీ శ్లోకము నాలుగు చోట్లఁగలదు (మ.భా.ఆ. 142-52-53; ఉ. 179-24; కాం. 57-7; 140-48). వీనిలో మొదటిపాఠము ముందుఁ జెప్పఁ బడిన రీతిగ నున్నది. ఇతర స్థలములయందుఁ జతుర్థపాదస్థానమున "దండో భవతి శాశ్వతః" అనియు, "పరిత్యాగో విధీయతే" అనియుఁ బాఠాన్తరము లున్నవి. కాని వాల్మీకి రామాయణమునం (రామా. 2-21-13) దీ శ్లోకము చెప్పునపుడెల్ల మొదటి పాఠమే కనఁబడు చున్నందున నే నా పాఠమునే యిచట గ్రహించితిని. భీష్ముఁడు పరశు రామునితోడను, నర్జునుఁడు ద్రోణాచార్యునితోడను జేసిన యుద్ధమున కీ న్యాయమే మూలము; హిరణ్యకశిపునిచే నియమింపఁబడిన ప్రహ్లా దుని గురువు భగవత్ప్రాప్తికి విరుద్ధమగు నుపదేశము నతనికిఁ జేయు నపు డీ న్యాయము ననుసరించియే ప్రహ్లాదుఁ డా యుపదేశమును నిరాకరించెను. శాంతిపర్వమునందు భీష్ముఁడు స్వయముగ శ్రీ కృష్ణునితో "గురువు పూజ్యుఁ డగుట సత్యమే కాని యతఁడును నీతికి బద్ధుఁడు గావలయును; కాదేని—

సమయత్యాగినో లుబ్ధా న్గురూ నపి చ కేశవ!,
నిహన్తి సమరే పాపాన్ క్షత్రియ స్స హి ధర్మవిత్.
(శాంతి. 55-18)

— కేశవా! మర్యాదను, నీతిని, శిష్టాచారమును బరిపాలింపక లోభియు నగు వాఁడు గురు వయ్యును వానిని యుద్ధమునం జంపిన క్షత్రియుఁడే ధర్మజ్ఞుఁడు అని చెప్పెను. ఇట్లే తైత్తిరీయోపనిషత్తు నందును "ఆచార్యదేవో భవ" అని మొదటఁ జెప్పి, వెంటనే "యా న్యస్మాకగ్ం సుచరితాని, తాని త్వయోపాస్యాని, నో ఇతరాణి"— మా సత్కర్మల మాత్ర మనుకరింప వలయును. ఇతరముల వదలవల

యును(తై. 1.11.2) అని చెప్పఁబడియున్నది. దీనివలన నీవు పితృ దేవుఁడ (తండ్రిని దైవముగ దలఁచువాఁడ) వైనను, నాచార్యదేవుఁడ వాఁడ) వైనను దండ్రియేనియు గురువేనియు సురాపానముఁ జేయు (గురువును దైవముగఁ దలఁచుచున్నారని సురాపానము సేయకుము. కారణ మేమన- తల్లి దండ్రి గురువు మున్నగు నందఱి యధికారము కన్న నీతిమర్యాదయొక్కయు ధర్మముయొక్కయున్నధికారము మిక్కిలి బలవత్తర మైనదని యుపనిషత్తులయందు స్పష్టముగ సిద్ధాంతీకరింపఁ బడియున్నది. "ధర్మమును గాపాడుము; ధర్మమును నెవ్వఁడేని యతిక్రమించిన నది యతని నశింపఁజేయక మానదు (8.14.16) అని మనువు విధించుట కిదియే బీజము. "రాజు గురువుకన్న శ్రేష్ఠుడగు నొక దేవతయే" (మను. 7.8; మ.భా.శాం. 68.40). కాని యతఁడు గూడ నీ ధర్మము నుల్లంఘింపఁ గూడదు. ధర్మము నతిక్రమించిన నతఁడును నశించునని మనుస్మృతిలోఁ జెప్పఁబడుటచే మహాభారత మునందు నీ విషయమే వేనుఁడు ఖనీనేత్రుఁడు నను రాజుల కథా నకమువలన స్పష్టపఱుపఁ బడినది (మను. 7.41; 8.128; మ. భా. శాం. 58.92-100; అశ్వ. 4).

అహింసయు, సత్యము, నస్తేయము నను వానివలె నింద్రియ నిగ్రహము గూడ సామాన్య ధర్మములలోఁ బరిగణింపఁ బడుచున్నది (మను. 10.63). కామము, క్రోధము, లోభము ననునవి మనుష్యులకు శత్రువులై యుండుట వలనఁ బ్రతిమనుష్యుఁడును వానిఁ బూర్ణముగ జయించినఁ గాని యతనికి నా సమాజమునకును శ్రేయము గలుగ దను నుపదేశము సర్వశాస్త్రము లందును జేయఁబడి యున్నది. కాఁబట్టియే విదురనీతియందును, భగవద్గీతయందును-

త్రివిధం నరక స్యేదం ద్వారం నాశన మాత్మనః,
కామః క్రోధ స్తథా లోభ స్తస్మా దేత త్త్రయం త్యజేత్.
(గీత. 16.21; మ. భా. ఉ. 32.70)

— కామము, క్రోధము, లోభము నను మూఁడును నరకమునకు ద్వారములై యాత్మ నాశనముఁ జేయునవి. కావున వానిం ద్యజింప వలయును అని చెప్పఁబడినది. కాని గీతలలోనే భగవంతుఁడు "ధర్మా విరుద్ధో భూతేషు కామోఽస్మి భరతర్షభ"— ఓ యర్జునా! ప్రాణి మాత్రమునందు ధర్మము ననునరించి యే కామ ముండునో యది నేనే (గీత. 7-11) యని తన స్వరూపమును వర్ణించియున్నాఁడు. ఈ పై గ్రంథము ధర్మవిరుద్ధ మగు కామమే నరకమునకు ముఖ్యద్వార మనియు, నట్టిది కాక మఱియొక విధమగు కామము భగవంతునకు మాన్యముగ నున్నదనియు స్పష్ట మగుచున్నది. మఱియు "పరిత్యజే దర్థకామౌ యౌ స్యాతాం ధర్మవర్జితౌ"— ధర్మమునకు విరుద్ధములగు కామముల మాత్రము వదలవలయును (మను. 4-176) అని మను వుచేఁ జెప్పఁబడినది. సర్వప్రాణులును రేపే కామమహారాజున కధీనులుగ నుండకుండునట్లు శపథముఁ జేసికొని మరణపర్యంతము బ్రహ్మచర్యవ్రతమును బూనునట్లుద్దేశించినచో నేఁబదియేండ్లలోఁగాని యెక్కువగఁ గడచిన నూఱేండ్లలోఁ గాని సమస్త జీవకోటిసృష్టియు లయించి యెచ్చటి దచ్చటనే శూన్య మగును. ఇంతియకాక యే సృష్టి నశింపఁ గూడ దని యా యా సమయముల భగవంతుఁ డవతరించుటయుఁ గలదో యది యంతయుఁ గొలఁది కాలముననే నశించి పోవును. కామక్రోధములు శత్రువులనుమాట సత్యమే; కాని, యెప్పుడు? నిరోధింపఁబడకున్నంత కాలమే. సృష్టి ప్రారంభమాదిగ సృష్టిక్రమము జరుగకుండుటకుఁ దగినంత నియమముతో వాని (కామక్రోధాదుల యొక్క) యత్యంతావశ్యకత ప్రళయపర్యంత ముండియే యున్నది. ఈ విషయము మన్వాది శాస్త్రకారులకును సమ్మతమే (మను. 5.56). సర్వమును నరిగ నుంచుట యనఁగ నీ కామక్రోధములను యోగ్యవిషయమున నుపయోగించుటయే కాని వానిని సమూలముగ నశింపఁజేయుట కాదు.

లోకేవ్యవాయామిషమద్యసేవానిత్యాస్తుజన్తోర్నహితత్రచోదనా,
వ్యవస్థితి స్తేషు వివాహయజ్ఞసురాగ్రహై రాసు నివృత్తి రిష్టా.
(భాగ. 11.5.11)

— ఈ లోకములో మైథునము, మద్య మాంసముల సేవయుఁ జేయ మని యెవనికిఁ జెప్ప నక్కఱలేదు. పినిని నరులు స్వభావముగనే యపేక్షించుచుందురు. ఈ మూఁడింటికి నేదేని వ్యవస్థ చేయవలయు ననిన నొక కట్టుఁబాటు చేసి సమయము నేర్పఱుపవలయు. కావుననే వివాహము, సోమయాగము, సౌత్రామణియజ్ఞము ననునవి యను క్రమముగ శాస్త్రకారులచే యోజన చేయఁబడినవి. కాని వానియం దును నివృత్తి (నిష్కామాచరణమే) యిష్టమైన దని భాగవతమునఁ జెప్పఁబడినది. ఈనివృత్తిశబ్దమునకుఁ బంచమ్యంతపదముతో సంబంధ ముండుటచే, 'ఈ విషయమునుండి నివృత్తి' యనఁగా నీ కర్మను బూర్ణముగ వదలుట యనియే యర్థ మగుచున్నది. ఐనను గర్మ యోగమునందు నివృత్తి యను విశేషణము కర్మకే సంబంధించి యుండుటచే నివృత్తి కర్మయన నిష్కామబుద్ధితోఁ జేయఁబడు కర్మ యని యర్థమని యీ కర్మయోగ ప్రకరణమున మఱువకుండ వలయును ఈ యర్థమే మనుస్మృతియందును భాగవతమునందును స్పష్టముగనున్నది (మను. 12-89; భాగ. 11-10-1; 7-15-47).

కిరాతార్జునీయ మను కావ్యమున నీ కోప మావశ్యక మను విషయముగుఱించి—

అమర్షశూన్యేన జనస్య జన్తునా
న జాతహార్దేన చ విద్విషాదరః.

— తన కవమానమైనను నెవనికి రోషముగాని చీదరకాని కలుగదో యట్టి వానితో స్నేహ మున్నను ద్వేష మున్నను ప్రయోజనము సమమే యని భారవి చెప్పినాఁడు. క్షాత్రధర్మ ప్రమాణముగఁ జూచిన యెడల—

ఏతావా నేవ పురుషో య దమర్షీ య దక్షమః,
క్షమావా న్నిరమర్షశ్చ నైవ స్త్రీ న పునఃపుమాన్.

— ఎవని కితరుఁ డవమానము సేసెనని కోపము గలుగునో, యెవఁ డవమానమును సహింపఁడో వాఁడే పురుషుఁడని చెప్పవలయును. అట్టిసమయమున నెవనికి రోషముగాని చీఁదరగాని కలుగదో వాఁడును నపుంసకుఁడును సమానుఁ డని పెద్దలు వక్కాణించియున్నారు. లోకవ్యవహారము జరుగుటకు నియతముగ క్రోధము గాని పరాక్రమముగాని యుపయోగించునవి కావు. క్షమయు నియతముగఁ గార్యసాధకము గా దను నంగతి పైనఁ జెప్పఁబడినది. లోభమునకుఁ గూడ నీ న్యాయము నంబంధించి యున్నది. ఏలయన— సన్యాసి యయ్యును మోక్షమునే కోరవలసియున్నది గదా!

శౌర్యము, ధైర్యము, దయ, శీలము, మైత్రి, సమత మున్నగు సకల సద్గుణములకుఁ బరస్పర విరోధము లేకుండ దేశకాలాదుల మర్యాదయు సంబంధించియే యున్నదని వ్యాసుఁడు మహాభారత మున ననేక స్థలముల నా యా కథానకములలోఁ బ్రతిపాదించి యున్నాఁడు. ఏ సద్గుణమైనను సర్వకాల సర్వావస్థలయందును నుప యోగించునట్లు లేదు.

వివది ధైర్య మథాభ్యుదయే క్షమా
సదసి వాక్పటుతా యుధి విక్రమః.

— కష్టకాలమునందు ధైర్యము, ఉత్కర్షకాలమునందు (శిక్షించు సామర్థ్యము శరీరమున నుండఁగా) క్షమయు, సభయందు వక్తృత్వము, యుద్ధమునందు శౌర్యము నుండవలయు నని భర్తృహరి సుగుణములఁ బ్రకాశింపఁ జేయఁదగిన కాలములఁ జెప్పియున్నాఁడు. శాంతసమయములయం దుత్తరునివలెఁ బ్రగల్భవాక్యములఁ బల్కువారివలన నుపయోగమేమి? మఱియు నింకు నుండి

భార్య ముక్కునత్తులోగుండ గుఱిగ బాణము వేయఁగల మహావీరులనేకు లున్నను యుద్ధరంగమున ధనుర్ధరుఁడని ప్రసిద్ధికెక్కినవాఁడెవఁడో యొక్కఁడే యగును. ధైర్యాదిగుణములు పూర్వోక్త సమయములయందే శోభించును. ఇంతియకాక యిట్టి సందర్భములు లేకున్నచో నా గుణముల సత్యమగు పరీక్ష కానేరదు. సుఖసమయమునందు మిత్రులు సహాయులుగ నుందురు గాని "నికషగ్రావా తు తేషాం విపత్" – ఆపత్కాలమే వారికి నిజమైన నికషోపలము (బంగారమువన్నెఁ దెలిసికొను నొరపిడిరాయి)గ నున్నది. ప్రసంగ శబ్దమునందే దేశకాలములే కాక పాత్రాపాత్ర విషయము గూడ నిమిడియున్నది. సమత్వము దక్క మఱి యే గుణమును శ్రేష్ఠము గాదు. "సమ స్సర్వేషు భూతేషు" అనునది సిద్ధపురుషుల లక్షణ మని భగవద్గీతలో స్పష్టముగ నున్నది; కాని సమత యనఁగ నేమి? యోగ్యతఁ గనిపట్టకయే యొక దండఱికి సమముగ దానముఁజేసిన నతని బుద్ధిమంతుఁ డందుమా? వెఱ్ఱివాఁ డందుమా? భగవద్గీతల యందే "దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం విదుః" – దేశకాలపాత్రముల విచారించి యిచ్చిన దానమే సాత్త్వికదానము (గీ. 17-20) అని యీ విషయము నిర్ణయింపఁబడినది. కాలమర్యాద యనఁ గేవలము వర్తమాన కాలము పూర్ణముగవఱుకే యని కాదు. కాల మే యేవిధముల మాఱునో యా యా విధముల నెల్ల వ్యావహారిక ధర్మములందును మార్పు గలుగుచున్నది. కావుననే పూర్వ కాలములోని యొకానొక విషయమునందలి యోగ్యతాయోగ్యతల నిర్ణయింప వలసినచో నా పూర్వకాలములోని ధర్మాధర్మముల విజ్ఞానమును సైతము విచారింప వలసియుండును.

అన్యే కృతయుగే ధర్మా స్త్రేతాయాం ద్వాపరే పరే,
అన్యే కలియుగే నృణాం యుగరూపానురూపతః.

(మను. 1-85)

— యుగముల మానము ననుసరించి కృతత్రేతాద్వాపర కలియుగ ములలోని ధర్మములను భిన్నభిన్నములుగ నున్నవి అని మనువును వ్యాసులును (మహాభా.శాం. 259-8) జెప్పుచున్నారు. మఱియుఁ బూర్వకాలమున స్త్రీలకు వివాహ మర్యాదయే లేదు. వా రీ విషయ మునందు స్వతంత్రులు ననావృతులు నై యుండిరి. కాని తరువాత నీ యాచారమున దుష్పరిపాకము గనఁబడఁగనే శ్వేతకేతు వీ వివాహ మర్యాద నేర్పఁజెను (మ.భా.ఆ. 112). ఇట్లే సురాపానవిషయమున నిషేధము లొలుదొలుత శుక్రాచార్యుఁడు ప్రవర్తింపఁజేసెను. ఈ కథ మహాభారతమున నున్నది (మ. భా. ఆ. 76). కావున నీ నిర్బంధ మాచారములో లేని కాలపు ధర్మముల నిర్ణయమును, దరువాతి కాలమునందలి ధర్మాధర్మముల నిర్ణయమును భిన్నరీతిగనే చేయఁ బడవలయునని తేలును. మఱియు నా రీతిగనే వర్తమాన కాలధర్మ ముత్తరకాలమున మాఱినయెడలఁ దొల్లిటివలెనే భవిష్యత్కాలికము లగు ధర్మాధర్మముల వివేచనయు భిన్నముగనే చేయఁబడవలయును. కాలమానానుసారముగ దేశాచారములును, గులాచారములును, జాతిధర్మములు నిట్లే మార్పుఁ జెందవలసి వచ్చును. కారణ మేమనఁగా— ఆచారమే సర్వధర్మములకు మూలము. అయిన నొక యాచారమునకు మఱియొక యాచారముతో సమావేశము లేమిచే.

న హి సర్వహితః కశ్చి దాచార స్సంప్రవర్తతె,
తేనైవాన్యః ప్రభవతి సోఽవరం బాధతే పునః.

(మ.భా.శాం. 259. 17-18)

అందఱకు నెప్పుడు నొక్క తీరుననే నదా హితకర మగు నాచారము లభింపదు. ఒక యాచారమును గ్రహించినచో రెండవది దానిని మించి యుండును. మఱియు నీ రెండవ యాచారమునకు మార్గ మిచ్చినది మూఁడవదానికి మరల విరుద్ధ మగును అని యాచార భేదమును వర్ణించి యొక్కొక యాచారమునకు నున్న తారతమ్య

మును సైతము చూడవలసివచ్చునని భీష్మునిచేఁ జెప్పఁబడినది అది యటుండ నిమ్ము. కర్మాకర్మలయొక్కఁగాని, ధర్మాధర్మములయొక్కఁగాని సంశయమునకు సంబంధించిన పూర్వపక్ష సిద్ధాన్తముల నన్నిటి నీ రీతిగ మాటలాడ నారంభించిన రెండవ మహాభారతమే వాయ వలసివచ్చును. గీతారంభమున క్షాత్రధర్మము-బంధుప్రేమ యను వాని మధ్యమునఁ జిక్కుకొనిన యర్జునునిపై వచ్చిన సందర్భము లోకవిలక్షణము కాదనియు, నట్టి సందర్భములు సంసారమునఁ గర్తయు గొప్పవాఁడు నగువానికిఁ బలుమాఱులు గలుగుచునే యుండు ననియు, నింతయకాక యొకప్పు డహింసయు నాత్మ రక్షణయు, మఱియొకప్పుడు సత్యము సర్వభూతహితమును, నింకొ కప్పుడు దేహసంరక్షణయు యశస్సును, వేఱువేఱు కారణములచే నుపస్థితము లగు కర్తవ్యము లైనను వీనిలోనే తిరుగుడువడుచు శాస్త్రోక్తములను సామాన్యములును సర్వసామాన్యములు నగు నీతి శాస్త్రనియమముల ననుసరించి యే కర్తవ్యమును వదలని వానికి సైత మా నియమము నుల్లంఘింప వలసినంత స్థితి యితుల వచ్చు ననియు, సాధారణమనుష్యులకే కాక గొప్పగొప్ప పండితులకు నిట్టి సమయములఁ గార్యాకార్యవ్యవస్థితిఁ (కర్తవ్యాకర్తవ్య ధర్మముల నిర్ణయమును) జేయుట కే దేని నిశ్చిత మార్గముగాని యుక్తిగాని యున్నదో లేదో తెలిసికొన నిచ్ఛ స్వాభావికముగ నితుల కలుగు ననియుఁ బెద్దలకుఁ దెల్లమగుటకె పై వివేచన చేయఁబడినది.

కఱువుపంటి సంకటసమయమున నాపద్ధర్ములని శాస్త్రములఁ గొన్ని యపవాదములు చెప్పబడియుండుట సత్యమే; ఉదాహరణము ఆపత్కాలమున బ్రాహ్మణుఁ డెక్కడ నన్నము గ్రహించినను దోషము లేదని స్మృతికారులు చెప్పియున్నారు. మఱియు ఛాందోగ్య పనిషత్తులో "ఉషస్తి చాక్రాయణుని"చే నీ ప్రకారముగ నాచరింపఁ బడినటుల కథ యున్నది (యాజ్ఞ. 8-41; ఛాం. 1-10). దానిలోను

బైనఁ జెప్పఁబడిన నందర్భమున శాస్త్రధర్మమునకును, నాఁకలి దప్పి మొదలగు నింద్రియవృత్తులకును విరోధము కలిగి యింద్రియము లొకవైపునకును, శాస్త్రధర్మము రెండవవైపునకును లాగుచునుండును. పైఁ జెప్పఁబడిన ప్రసంగములో నింద్రియవృత్తులకును శాస్త్రధర్మము లకును గాక, శాస్త్రముననే రెండు ధర్మములకుఁ బరస్పర విరోధము గలుగుటచేఁ గర్తవ్య మిదియా? యదియా? యను సూక్ష్మవిచారణ చేయుట యావశ్యకముగఁ గన్పట్టును. మఱియు పీనిలోఁ గొన్ని విషయముల నిర్ణయము ప్రాచీననత్పురుషు లిట్టి సమయమున నాచరించిన యాచరణమును బట్టియే సామాన్యులకు సైతము నిశ్చ యింప శక్యమైయున్నను, మఱికొన్ని సందర్భములలో బుద్ధిమంతుల మనస్సు సైతము భ్రమపడుచున్నది. కారణ మేమన- ఎంత విచార మధికముగఁ జేయుకొలఁదిఁ బూర్వపక్షసిద్ధాన్తములు నంత యధిక ముగ నిప్పన్నము లగుటచేఁ దుదకు నిర్ణయించుట దుర్ఘటముగ నున్నది. మఱియు యుక్తాయుక్త నిర్ణయము కానిచో మనచేతి మీఁదుగ నధర్మముగాని యపరాధముగాని చేయుట సంభవింప వచ్చును. ఇట్టి దృష్టితోఁజూచిన, ధర్మాధర్మములయొక్క గాని కర్మా కర్మలయొక్క గాని వివేచనయే యొక స్వతంత్రశాస్త్రమై తర్క వ్యాకరణములకన్న గూఢముగ నుండును. నీతిశాస్త్ర మను శబ్దము నవీనసంస్కృత గ్రంథములందుఁ దఱుచుగ రాజనీతి శాస్త్రపరముగ వాడఁబడియున్నది. అందుచేఁ గర్తవ్యాకర్తవ్యశాస్త్రమును ధర్మశాస్త్ర మని చెప్పుట ప్రాచీనపద్ధతిగనే యున్నది; కాని నీతిశబ్దములోనే కర్తవ్యమును సద్వర్తనమును నిమిడి యుండుటచే నే నీ నవీనపద్ధతి ననుసరించియే ధర్మాధర్మముల యొక్కగాని కర్మాకర్మములయొక్క గాని వివేచనను నీతిశాస్త్రమనియే యీ గ్రంథమునఁ జెప్పినాఁడను. నీతియొక్క (కర్మాకర్మల యొక్క) గాని, ధర్మాధర్మములయొక్క గాని వివేచన యను శాస్త్రము గహనముగ నున్నది. ఈ సంగతిఁ దెలుపుటకే "సూక్ష్మా గతిర్హి ధర్మస్య"- ధర్మ (వ్యావహారిక మగు

నీతిధర్మ) స్వరూపము సూక్ష్మముగ నున్నది అను వచనము మహా భారతమున ననేక స్థలముల వచ్చియున్నది. "పంచపాండవులచే నొక ద్రౌపది యెటుల వివాహ మాడఁబడినది? ద్రౌపదీవస్త్రాపహరణ సమయమున భీష్మద్రోణాదులు శూన్యహృదయులై యేల మౌనము దాల్చి యుండిరి? మఱియు దుష్టుఁడగు దుర్యోధనుని పక్షమున యుద్ధముఁ జేయుచు భీష్మద్రోణులచేఁ దమపక్షము సమర్థింప "అర్థస్య పురుషో దాసో దాస స్త్వర్థో న కస్యచిత్" – పురుషుఁ డర్థమునకు దాసుఁడు. అర్థ మెవరికిని దాసుఁడు గాదు" (మ.భా.భీ. 43-35) అని చెప్పఁబడినది. ఈ న్యాయము సరిగ నున్నదా? లేక, తప్పగ నున్నదా? ఎప్పుడైనను "సేవా శ్వవృత్తి రాఖ్యాతా" (మను. 406) అని సేవాధర్మము కుక్కవృత్తివలె నింద్యముగ గ్రహింపఁ బడినచో, ధనమునకు దాసుఁడగుటకు బదులుగ, భీష్మాదులు దుర్యోధనుని సేవ నేల వదలలేదు? ఇవి మొదలగు ప్రశ్నలకు సదుత్తరములు చెప్పుట మిక్కిలి కష్టముగ నుండును. ఇట్టి స్థలములలో నొక్కొక్కరు ప్రసంగానుసారముగ నొక్కొక్క నిర్ణయముఁ జేయుదురు: "సూక్ష్మా గతిర్హి ధర్మస్య" – ధర్మతత్త్వము సూక్ష్మమైనది. (మ.భా.అను. 10-70) అనియుఁ, దర్వాత "బహుశాఖా హ్యనంతకా" (మ.భా. వన. 208-2) – దాని కనేకములగు కొమ్మ లుండుటచే వానివలనఁ గలుగఁ బోవు ననుమానములును ననేకములుగ నుండు ననియు మహాభారతముననే చెప్పఁబడి యున్నది. తులాధారుఁడే ధర్మము విషయమై వివేచన చేయుచు "సూక్ష్మత్వాన్న న విజ్ఞాతుం శక్యతే బహునిహ్నవః" – ధర్మము, సూక్ష్మము ననేకాపవాదములు గలదియునగుటచే ననేకనమయములఁ దెలియఁబడదు (మ. భా. శాంతి. 26-1-37) అని వ్రాసినాఁడు. మహాభారతకారున కీ సూక్ష్మ ప్రసంగము పూర్ణముగఁ దెలియుటచే నిట్టి విషయములలోఁ బ్రాచీన మహాపురుషులచే నాచరింపఁబడినదానిఁ జెప్పుటకే భారతమున ననేక కథానకముల సంగ్రహించెను. కాని సర్వవిషయములు శాస్త్రీయరీతిగ

వివేచనఁ జేసి వానిలోని సామాన్యమర్మమును భారతమువంటి ధర్మ గ్రంథములలో నెక్కడనైనఁ జెప్పుట యావశ్యకమే. పూర్వ మర్జును నకు శ్రీకృష్ణుఁడు కర్తవ్యమోహమును నివారించుట కుపదేశించిన యుపదేశము నాధారముగఁ జేసికొని వ్యాసుఁడు భగవద్గీతలో నీ మర్మమును బ్రతిపాదించెను. మఱియు నా హేతువున గీత యనునది మహాభారతమునకు రహస్యోపనిషత్తును శిరోభూషణమును నై యున్నది. ఇంతియకాక మహాభారతమే గీతలలోఁ బ్రతిపాదింపఁ బడిన మూలభూత కర్మతత్త్వమునకు సోదాహరణమగు విస్తృత వ్యాఖ్యానమునై యున్నది. గీతాగ్రంథము మహాభారతములో నిటీవలఁ జేర్పఁబడినదని యనుకొనువారి విషయమును ముఖ్యముగా గమనింపవలయునని సూచించుచున్నాను. వేయేల? గీతాగ్రంథమున కేదేని గౌరవ ముండినయెడల నా గౌరవము దీనివలనఁ గలిగినదే యని చెప్పనగును. ఏల యన_ కేవల మోక్షశాస్త్రమును (వేదాన్త మును బ్రతిపాదించు నుపనిషదాదికమును), అహింసాది నదాచరణ ముల నియమమాత్రమును జెప్పు స్మృత్యాది గ్రంథములును ననేకము లున్నను వేదాన్తములో దురవగాహమగు తత్త్వజ్ఞానముయొక్క యాధారమున, కార్యాకార్యవ్యవస్థితిని సమన్వయింపఁ జేయు గీతను బోలు ప్రాచీనగ్రంథ మిప్పటికిని సంస్కృతవాఙ్మయమున స్పష్టముగఁ గన్పట్టదు. 'కార్యాకార్యవ్యవస్థితి' యను నీ శబ్దము స్వకపోలకల్పి తము గాదు. గీతలలోనే యున్నది (గీత. 16-24). ఈ విషయము గీతా భక్తులకుఁ జెప్పనవసరము లేదు. భగవద్గీతానుసారముగనే యోగవాసిష్ఠమందును జ్ఞానమూలకమగు ప్రవృత్తిమార్గమే వసిష్ఠుఁడు రామున కుపదేశించెను. కాన గీతతరువాత వెలువడి, గీతలనే యనుకరించు గ్రంథములచేఁ బైఁ జెప్పఁబడిన గీతల యపూర్వత కేమియు బాధ రానేరదు.

ఇది కర్మజిజ్ఞాస యను ద్వితీయ ప్రకరణము.

తృతీయ ప్రకరణము

కర్మయోగశాస్త్రము

తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్.*
(గీత. 2-50)

ఎవరికైన నే శాస్త్రమందేనియుఁ బ్రవేశము కలుగఁజేసికొన నిచ్ఛ మొట్టమొదట లేనిచో వా రా శాస్త్రముల నభ్యసించుట కనధికారులు. మఱియు నట్టి యనధికారులగు వారి కా శాస్త్రములను జెప్పుట బోరగించిన ఘటముపై నీటిని బోయునటు లుండును. దాని వలన శిష్యున కేమియు లాభము లేకపోవుటయే కాక గురువునకు నిష్ఫలశ్రమ మగుటచే నీ యిద్దఱి కాలము వ్యర్థముగఁ గడచిపోవును. జైమిని బాదరాయణులచే, పూర్వోత్తరమీమాంసల యారంభమున 'అథాతో ధర్మజిజ్ఞాసా" అనియు, "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" అనియు సూత్రము లిందులకే వ్రాయఁబడినవి. ఎటుల ధర్మోప దేశము ధర్మేచ్ఛులకును, బ్రహ్మోపదేశము ముముక్షువులకును జేయఁదగినదో యటులే కర్మశాస్త్రోపదేశము సంసారమునందుఁ గర్మల నెటుల చేయవలయునో తెలిసికొన నిచ్ఛ గలవారికే చేయఁ దగినది. కావుననే యీ గ్రంథమునఁ బ్రథమప్రకరణమున విషయ ప్రవేశమును, రెండవప్రకరణమునఁ గర్మజిజ్ఞాసాస్వరూపమునుఁ గర్మ యోగశాస్త్ర మహత్త్వమును దిగ్దర్శనముగఁ బ్రతిపాదింపఁబడినవి.

---

* "కావున యోగము నాశ్రయింపుము. యోగ మనఁ: కర్మల నాచరిం చుట యంతరి చాతుర్యము, లేక, నేర్పు" అని యోగమునకు లక్షణము. ఈ విషయమువఁ జాల విచారణ మీ ప్రకరణమువనే చేయఁబడినది.

ఈ స్థలమునఁ బూర్వపక్షము గలదని ముందుగఁ దెలిసికొనకున్నచో సిద్ధాన్తమహత్త్వము పూర్ణముగఁ దెలియదు. మఱియు మహత్త్వము దెలియక పోవుటచే కేవలము పతనమూలమున వచ్చిన శాస్త్రమును ధారణ చేయుట (జ్ఞప్తినుంచుకొనుట) కష్టము. ఈ కారణముననే మంచిగురువు, శిష్యునకు జిజ్ఞాస యున్నదా? లేదా? యని మొదటనే విచారించి యది లేనియెడల దాని యుత్తేజనముఁ జేయుటకు సైతము ప్రయత్నించును. గీతలోఁ గర్మయోగశాస్త్ర వివేచన యీ తీరుననే చేయఁబడినది. ఏ యుద్ధమునఁ దన చేతి మీఁదుగఁ బితృవధయు, గురువధయు, సమస్తరాజవధయు, బంధు వధయు నగునో యట్టి ఘోరయుద్ధమును జేయుట న్యాయ్యమా? యన్యాయ్యమా? యను శంక మనస్సునఁ దగిలి యర్జునుఁడు యుద్ధేచ్ఛ వదలి నన్యసించుటకు సిద్ధుఁడు కాఁగాఁ ప్రాప్త మగ కర్మను వదలివేయుట వెట్టితనమునకును, దుర్బలత్వమునకును లక్షణ మగుననియు, నటుల వదలుటచే స్వర్గదూరుఁడ వగుటయే కాక యపకీర్తికి సైతము పాల్పడుదు వనియు, సామాన్యయుక్తివాదమును జేసి యప్పటికిని వినక పోఁగా "అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞా వాదాం శ్చ భాషసే"— నీవు శోకింపఁదగని వారిని గుఱించి శోకించు చున్నావు. ఇంతియకాక బ్రహ్మజ్ఞానుల పెద్దపెద్ద మాటలను చెప్పు చున్నావు (గీ. 2-11) అని కొంచెము పరిహాసముఁ జేసి శ్రీకృష్ణుఁడు కర్మజ్ఞానము నతని కుపదేశించెను. అర్జునుని శంక నిరాధారము కాదు. గొప్పవిద్వాంసులకు సైత మొక్కొక సందర్భమున "ఏమి చేయఁదగును? ఏమి చేయఁదగదు?" అను విషయమున వ్యామోహ మెటుల గలుగునో పూర్వప్రకరణమున నిరూపించితిని. కాని కర్మా కర్మల వివేచనలో ననేక ప్రతిబంధకములు బయలుదేఱు నని కర్మను వదలుట యుక్తము గాదు. కాన, నే యుక్తిచే జగత్తులోఁ గర్మకు లోపము లేకుండునో, యే యుక్తిచేఁ గర్మలబంధము గాని పాపము

గాని యెంతమాత్రమును మనకుఁ దగులదో, యట్టి 'యోగము' (యుక్తి) నేర్పఱిచియె స్వీకరింపవలయును. "తస్మా ద్యోగాయ యుజ్యస్వ" - కావున నీవును దానినే స్వీకరింపుము అని శ్రీకృష్ణుఁడు మొదట నర్జునునకుఁ జెప్పెను. ఈ యోగ మనఁగా కర్మయోగ శాస్త్రము. మఱియు నర్జునునకు సంభవించిన సందర్భము లోకవిల క్షణము గాదు. సంసారములోఁ జిన్నవియుఁ బెద్దవియునగు నిట్టి సంకటము లందఱికును సంభవించుచునే యుండును. కావున భగవద్గీతలలోఁ జేయఁబడిన కర్మయోగశాస్త్ర వివేచనను మన మందఱము నభ్యసించుట యావశ్యకము. కాని యీ శాస్త్రమున నైనను ప్రతిపాదనలో రాఁబోవు ముఖ్యశబ్దముల యర్థము బాగుగఁ దెలియుటకై యా శబ్దములకు మంచి వ్యాఖ్యానమును, నా శాస్త్రమున నుపపాదింపఁబడు మూలభూతమగు సరణియు, మొదట సంక్షేపముగ నుండవలయును. కాదేని ఉత్తరగ్రంథమున ననేక విధములగు నన్యథాజ్ఞానములు ననుపపత్తులును గలుగును. ఈ కారణముననే యీ సామాన్యపద్ధతి ననుసరించి ముందుగ నీ శాస్త్రమున రాఁబోవు కొన్నిముఖ్యశబ్దముల యర్థమును బరీక్షించు చున్నాను. వానిలో మొదటిది కర్మశబ్దము.

ఈ కర్మశబ్దము 'కృ' ధాతువువలన నిష్పన్నమైనది. కావున దానికి 'చేయుట'యని కాని, 'నడవడి' యని కాని, 'వ్యాపార'మని కాని యర్థము. మఱియు నా సామాన్యార్థమే భగవద్గీతయందును వివక్షితముగ నున్నది. ఈ శబ్దమునకు మీమాంసాశాస్త్రమునఁ గాని యన్యస్థలములలోఁ గాని యున్న సంకుచితార్థము లన్నియు గోచరములై పాఠకులు పొరపడకుండునటుల చేయుటకై యిటుల చెప్పుచున్నాను. ఏ మతధర్మమును విచారించినను దానిలో 'నీశ్వర ప్రాప్తి కేదేని యొక కర్మను జేయవలయు' నని చెప్పఁబడియే యుండును. ప్రాచీనవైదికధర్మానుసారముగ యజ్ఞయాగాదికములే

కర్మలు. మఱియు నీ యజ్ఞయాగాదు లెటుల చేయవలయునో యా విధులఁ జెప్పు వైదిక గ్రంథములలో ననేక స్థలములయం దనేక విధములుగను, ఒకానొకచోఁ బైకి విరుద్ధములుగను, గన్పట్టుచున్న యనేక వచనములకు సంగతమైన యేకవాక్యత యెటుల గలుగునో, నిరూపించుటకే జైమినియొక్క పూర్వమీమాంసాశాస్త్రము ప్రవర్తించినది. జైమినిమతమున నీ వైదికములు, లేక, శ్రౌతములునగు యజ్ఞయాగాదులఁ జేయుటయే ముఖ్యమును బ్రాచీనమునగు ధర్మముగనున్నది. మనుష్యఁ డేమి చేసినను యజ్ఞార్థముగనే చేయవలయును. అతఁడు ధన మార్జించినను యజ్ఞార్థమే; ధాన్యసంగ్రహము చేసినను యజ్ఞార్థమే యని తెలిసికొనవలయునని మహాభారతమున నున్నది (మ. భా. శాం. 26-25). యజ్ఞమును జేయవలయునని వేదమే విధించెను గాన యజ్ఞార్థమై చేయఁబడిన యే కర్మయైనను మనుష్యునకు స్వయముగ బంధహేతువు కాదు. యజ్ఞమునకు సాధనమే యగును. స్వతంత్రమైన సాధ్యము కానేరదు. కావున యజ్ఞమువలన వచ్చు ఫలములోనే యా సాధనముల ఫలము లంతర్భూతము లగును. సాధనములకు వేఱుగా ఫలము లేదు. కాని యజ్ఞార్థమై చేయఁబడిన కర్మలు స్వతంత్రములుగా ఫలదాయకములుగా నున్నను యజ్ఞము చేతనే స్వర్గప్రాప్తి (అనఁగా- మీమాంసక మతానుసారముగ నొక విధమగు సుఖప్రాప్తి) యగును. కాన నా స్వర్గప్రాప్తికొఱకే యజ్ఞకర్తయగు పురుషుఁ డిచ్ఛాపూర్వకముగ (అనఁగా- కావలయునని) యజ్ఞమును జేయుచున్నాఁడు. కావునచే యజ్ఞ మను కర్మ ప్రత్యేకముగఁ బురుషార్థములలో నొకటిగఁ బరిగణింపఁబడుచున్నది. మనుష్యున కిష్టమైనవస్తువును పొందవలయునను నిచ్ఛయే పురుషార్థమని చెప్పుదురు. (జై.సూ. 4-1-1; 8) యజ్ఞమునకె 'క్రతు' వని పర్యాయపదము. కనుక 'యజ్ఞార్థ' శబ్దమునకు మాఱుగ 'క్రత్వర్థ' శబ్దమును మార్చుట యుక్తము. మఱియు యజ్ఞార్థములు (క్రత్వర్థములు) స్వతంత్రముగ ఫలమునీయనివి కావుననే బంధకములు కావు.

మఱియు 'పురుషార్థములు' పురుషునకు లాభదాయకములు, కావు ననే బంధకములు, అని కర్మ లన్నియు రెండు విధములు. సంహిత లోను బ్రాహ్మణగ్రంథములోను నుండు విషయ మంతయు యజ్ఞయాగా దికముల గుఱించినదియే. ఋగ్వేదసంహితలో నింద్రాది దేవతాస్తుతి పరములగు సూక్తము లుండును సత్యమే? కాని, వాని వినియోగము యజ్ఞసమయముననే కర్తవ్య మగుటచే, సర్వశ్రుతి గ్రంథములును యజ్ఞాదికర్మ ప్రతిపాదకములే యని మీమాంసకులు చెప్పుదురు. ఏమియుఁ దెలిసికొనకయే చేసినను, బ్రహ్మజ్ఞానపూర్వకముగఁ జేసినను, వేదోక్తములగు యజ్ఞయాగాదికములఁ జేసిననే స్వర్గము సిద్ధించును గాని యూరక యేమి చేసినను సిద్ధింపదని కర్మఠులు, లేక, యాజ్ఞికులు, లేక, కేవల కర్మవాదులు చెప్పుదురు. ఉపని షత్తులలో నీ యజ్ఞములు గ్రాహ్యములుగ నంగీకరింపఁబడినను వాని యోగ్యత బ్రహ్మజ్ఞానమునకుఁ గ్రింది మెట్టని నిశ్చయింపఁబడుటచే స్వర్గప్రాప్తి కలిగినను నిత్యమగు మోక్షసంపాదనకు బ్రహ్మజ్ఞానమే యావశ్యక మని చెప్పఁబడినది. "వేదవాదరతాఃపార్థ నాన్యదస్తీతి వాదినః" (గీ. 2-42)-అని భగవద్గీతయందలి రెండవ యధ్యాయమునఁ జెప్పినట్లు యజ్ఞయాగాది కర్మలను బ్రహ్మజ్ఞానము లేకుండఁ జేసినఁ బైనఁ జెప్పినటుల మోక్షము నీయనివే యగును. అటులే గీతల లోని- "యజ్ఞార్థా త్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః" - యజ్ఞార్థము చేయఁబడిన కర్మలఁ తక్క మిగిలిన కర్మ లన్నియు బంధహేతువులు (గీ.3-9) అను నిదియు మీమాంసకమతము యొక్క యనువాదమే. ఈ యజ్ఞాది వైదికకర్మలు (అనఁగా- శ్రౌతకర్మలు) గాక వేఱువిధ మైనవియు, ధార్మికదృష్టిచే నావశ్యకములు నైన కర్మలు చాతుర్వర్ణ్యభేదముచే, క్షత్రియులకు యుద్ధము, వైశ్యులకు వాణిజ్యము మొదలగునవి మనుస్మృత్యాది ధర్మగ్రంథములలోఁ జెప్పఁబడినవి. మఱియు నిది ముందుగా స్మృతులలోనే వ్యవస్థాను సారముగఁ జెప్పఁబడుటచే వీనిని స్మార్తకర్మ లని కాని స్మార్తయజ్ఞము

లని కాని యందురు. ఈ శ్రౌతస్మార్తకర్మలు గాక కొన్ని ధార్మిక కర్మలు (వ్రతోపవాసాదికములు) పురాణములలో మొదట విస్తార ముగఁ బ్రతిపాదింపఁ బడుటచే వానికిఁ బౌరాణిక కర్మ లని పేరిడిరి. ఈ కర్మలన్నియు, నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు నని మూఁడు విధములుగ విభజింపఁబడినవి. నియమముగఁ జేయఁబడు స్నానసంధ్యాదికములు నిత్యములు. వీని నాచరించుటచే నేమియు ఫలసిద్ధి కాని యర్థసిద్ధి కాని లేదు; కాని యాచరింపనియెడల దోషము వచ్చును. నైమిత్తికములన నేదైన నొక కారణము మొదటుఁ బ్రకట మగుటచేఁ జేయవలసివచ్చు కర్మలు. అవి అనిష్టగ్రహశాంతి ప్రాయశ్చిత్తము మొదలగునవి. దీనికొఱకు మనము శాంతినిగాని ప్రాయశ్చిత్తమును గాని చేసికొనుచున్నామో యా నిమిత్తము పూర్వమందు సిద్ధముగాని యెడల నీ కర్మలయొక్క కర్తవ్యత యావశ్యకము గాదు. మన కేదేని ఒక క్రొత్తవిషయమం దిచ్ఛగలిగి దానిం బొందుట కనేక పర్యాయములు శాస్త్రానుసారముగ నే కర్మ లొనర్చెదమో యవి కామ్యకర్మలు. వర్షములు కురియుటకుఁ గాని, పుత్రప్రాప్త్యర్థము గాని యజ్ఞములు చేయుట కామ్యకర్మలలోనిది. నిత్యనైమిత్తిక కామ్యములు గాక సురాపానము మొదలగు కొన్ని నిషిద్ధకర్మములు గలవు అని యెల్లప్పుడు త్యాజ్యము లని శాస్త్రములు విధించుటచే, నిషిద్ధకర్మ లనఁబడును. నిత్యకర్మ లెవ్వియో, నైమిత్తికము లెవ్వియా, కామ్యములును, నిషిద్ధములు నెవ్వియో, వానిని ధర్మశాస్త్రములు సిద్ధాన్తీకరించియున్నవి. మఱియు 'వీనిచేఁ జేయఁబడిన యీ కర్మ పాపకరమా? పుణ్యప్రదమా?' యని యెవరేని ధర్మశాస్త్రజ్ఞు నడిగిన నతఁడు ధర్మశాస్త్రవిధి ననుసరించి 'యీ కర్మ యజ్ఞార్థమా? లేక, పురుషార్థమా?' యనియు, 'నిత్యమా? నైమిత్తికమా?' యనియు, 'కామ్యమా? నిషిద్ధమా?' యనియు విచారించి తర్వాత నిర్ణయమును చేయును. భగవద్గీతదృష్టి యీ పండితదృష్టికన్న మిగుల వ్యాపకము. వేయేల? ధర్మశాస్త్రదృష్టి

కంటె కూడ దూరదృష్టి యని చెప్పవచ్చును. శాస్త్రముచే నొకానొక కర్మనిషిద్ధమని చెప్పఁబడక యుండును. ఇంతయేల? అది విహితము గనే (అనఁగా- మనకుఁ గర్తవ్యములుగాఁ జెప్పఁబడిన కర్మలలో నొకటిగనే) యుండును. ప్రకృతప్రసంగమున శ్రాద్ధధర్మమునే యుదాహరణముగ నెన్నుకొందము. ఇది యర్జునునకు విహితమే; కాని యంతమాత్రముచే నా కర్మ నతఁడు నియమముగఁ జేయ వలసినది లేదు. ఒకవేళ చేసినను నది నియమముగ శ్రేయస్కరమే యని నమ్మకమును లేదు. మఱియు శాస్త్రవిధులలోనే యనేక సందర్భములు పరస్పరవిరుద్ధములుగ నుండునని పూర్వప్రకరణమునఁ జెప్పఁబడియే యున్నది. అట్టిసమయమున, మనుష్యుఁడేమి చేయ వలయునో నిర్ణయించుట కేదీని యుక్తి కలదా? ఉండిన నది యేది? యను విషయమే గీతలచేఁ బ్రతిపాదింపఁ బడును. ఆ ప్రతిపాదనఁ జేయుటకై పైఁ జెప్పఁబడిన కర్మభేదము విశేషముగఁ బరిశీలింప నవసరము లేదు. యజ్ఞాది వైదికకర్మల విషయమునఁ గాని, లేక, నాలుగు వర్ణముల యితర కర్మల విషయమునఁ గాని మీమాంసకు లొనర్చిన సిద్ధాన్తము గీతలలోఁ బ్రతిపాదింపఁబడిన కర్మయోగమున కెంతవఱకు సంబంధించి యుండునో నిరూపించుటకై మీమాంస కుల సిద్ధాన్తము సైతము గీతలలోఁ బ్రసంగానుసారముగ విచారింపఁ బడినది. చిట్టచివరి యధ్యాయములో యజ్ఞయాగాది కర్మలు జ్ఞాని చేయఁదగినవా? కావా? యను ప్రశ్నకు సంక్షేపముగ నుత్తరము చెప్పఁబడినది (గీ. 18.6). కాని గీతలలో ముఖ్యముగఁ జెప్పు విషయ మింతకన్న వ్యాపక మగుటచే గీతాప్రతిపాదనమునఁ గర్మశబ్దార్థము కేవల శ్రౌతకర్మయే యని కాని శ్రౌతస్మార్త కర్మలే యని కాని సంకోచము చేసికొనక యా శ్రౌతస్మార్తకర్మలకన్న విశేషవ్యాపక మైనది గ్రహింపఁ బడవలయును. సారాంశ మేమన-తినుట, త్రాగుట, ఆడుట, కూర్చుండుట, లేచుట, ఉండుట, ఉచ్ఛ్వాస నిశ్వాసముల విడుచుట, నవ్వుట, ఏడ్చుట, వాననచూచుట, చూచుట, మాట

లాడుట, వినుట, నడచుట, ఇచ్చుట, పుచ్చుకొనుట, నిద్రించుట, మేలుకొనుట, చంపుట, యుద్ధము చేయుట, మననధ్యానములఁ జేయుట, విధిని గాని, నిషేధమును గాని చేయుట,దానముచేయుట, యజ్ఞయాగాదులు చేయుట, వ్యవసాయమునుగాని వ్యాపారముగాని చేయుట, ఇచ్ఛయించుట, నిశ్చయించుట, నోరుమూసికొని యూరకుండుట, మొదలగునవి యన్నియు భగవద్గీతలోని కర్మశబ్దముచే వాచ్యములే; ఆ కర్మలు కాయికము లైనను, వాచికము లైనను, మానసికము లైన నిష్టమే (గీ. 5.8.9). వేయేల? దేహము జీవముతో నునికియు, మరణము సైతము కర్మలే. మఱియుఁ బ్రపంచమానసారముగ, జీవించుటయు, మృతియు నను నీ రెంటిలో నేది గొప్పదో యను సంగతి విచారించుట యావశ్యకముగ నున్నది. ఈ విచారమే ప్రసక్తమైన యెడలఁ గర్మశబ్దమునకే కర్తవ్యకర్మ యని యైన, విహిత కర్మ యని యైన, నర్థ మగుచున్నది (గీ. 4. 16). మనుష్యుల కర్మ విషయ మగు విచారణ యైనది. ఇఁక నింతకంటెను మొదటకిఁబోయి సర్వచరాచర(చేతనాచేతన) వస్తువుల వ్యాపారములకు సైతము కర్మ శబ్దమే సంబంధించియున్న దని నిరూపణ చేయవలయును. కాని దాని విచారణము ఉత్తరగ్రంథమునఁ గర్మవిపాక ప్రక్రియలోఁ జేయఁబడును.

కర్మశబ్దమునన్న నెక్కుడు వివాదాస్పద మైనది 'యోగశబ్దము' ఈ శబ్దమునకుఁ బ్రస్తుత ముండు రూఢార్థము "ప్రాణాయామాది సాధనములచేఁ జిత్తవృత్తి నైన నింద్రియముల నైన నిరోధించుట", లేక "పాతంజలసూత్రోక్త మగు సమాధి", లేక "ధ్యానయోగము." కావున నీ యర్థమందు నుపనిషత్తులలో సైత మీ శబ్దము ప్రయోగింప బడినది (కఠ. 6. 11); కాని యీ సంకుచితార్థము భగవద్గీతలో సామాన్యముగ వివక్షితము కానేర దను విషయము తొలుత గమనింప వలయును. 'యోగ' శబ్దము 'యుజ' యను ధాతువునుండి నిష్పన్న

మగుటచే దాని ధాత్వర్థము 'కలయుట', 'సంపాదించుట', 'సంగతి', 'ఒకచోట నుండుట' యను వానిలో వేదేని యగును. మఱియు నుత్తరగ్రంథమున నట్టి స్థితి గలుగుటకు 'ఉపాయము', 'సాధనము', 'యుక్తి' లేక 'నివర్తనోపాయ' మనియు నర్థము. "యోగస్సన్నహనోపాయధ్యాననంగతియుక్తిషు" (అమరము శ. శ. 22) అని అమరకోశములోఁ గూడ నీ యర్థము లన్నియుఁ జెప్పఁబడియున్నవి. ఫలజ్యోతిషములలో నే వేని కొన్ని గ్రహము లిష్టముగఁ గాని, యనిష్టముగఁ గాని యునికిం జేసి యా గ్రహముల యోగము నిష్ట మని కాని యనిష్ట మని కాని మనము చెప్పుదుము. "యోగక్షేమము" లనెడి సమానపదమున నున్న 'యోగ' పదమునకు "లభింపని వస్తువును సంపాదించుకొనుట" యని యర్థము (గీ. 9. 22). భారతయుద్ధమున ద్రోణాచార్యుల జయింప నశక్య మని తెలిసికొని యాయనను జయించుట కొక్కయోగమే 'సాధనమే', లేక 'యుక్తియే' యున్నదని_"ఏకో హి యోగోఽస్య భవే ద్వధాయ" (మ. భా.181.31) యని శ్రీకృష్ణునిచేఁ జెప్పఁబడినది. మఱియు నుత్తరగ్రంథమున జరాసంధాదిరాజులు పూర్వము ధర్మసంరక్షణార్థమై యోగముచేతనే యెటుల చంపబడిరో! యని సైత మున్నది. భీష్ములవా రంబాంబికాంబాలికల నపహరించిన పిదప నితర రాజులు "యోగముయోగ" మని చెప్పుచు నతని వెంబడించిరని యుద్యోగపర్వమునఁ జెప్పఁబడియున్నది (మ.భా.ఉ.అ. 172). మఱియు భారతమున నితర స్థలములయందు నీ యర్థముననే యోగశబ్దము ప్రయోగింపఁబడినది. గీతలలో 'యోగ', 'యోగి' శబ్దముల నుండి యేర్పడిన సామాసిక శబ్దములు దాదాపుగ నెనుబది గలవు; కాని యే నాలుగైదు స్థలములనో తక్క (గీ. 6.12,23) పాతంజలయోగ మను నర్థము విశేషముగ నెక్కడను నిష్టము కానేరదు. యుక్తి, కౌశల్యము, సాధనము, ఉపాయము, కలియుట యను నీ యర్థములే కొంచెము మార్పుతో నంతటను సున్నష్టముగఁ బ్రయోగింపఁబడి యుండుటచే గీతాశాస్త్రములోని

వ్యాపకశబ్దములలో నిది యొకటి యని చెప్పుట కేమియు నందియము లేదు. అయినను 'యోగ' మనఁగా: సాధనము, కౌశలము, లేక, యుక్తి యని సామాన్యముగఁ జెప్పినను నంతయు సమకూడనేరదు. కారణ మేమనగా- వక్తయొక్క యిచ్ఛ ననుసరించి యీ సాధనము సన్యాసమునకుఁ గాని, కర్మకుఁ గాని, చిత్తనిరోధమునకుఁ గాని, మోక్షమునకుఁ గాని, మరియొక దానికిఁ గాని, తుదకు దేని కైనను సాధనము కావచ్చును. ఉదాహరణము: గీతలలో రెండు మూఁడు చోటులలో భగవంతుని నానావిధమగు వ్యక్తసృష్టిని నిర్మించు కౌశల మునకుఁ గాని, యద్భుత సామర్థ్యమునకుఁ గాని,'యోగ' మనుశబ్దము ప్రయోగింపఁబడినది (గీ. 7.25; 9.5; 10.7; 11.8). ఈ యర్థమును బట్టియే భగవంతుఁడు యోగేశ్వరుఁ డని చెప్పఁబడినాఁడు (గీ.18.75). కాని గీతలలోని 'యోగ'శబ్దమున కివి యేవియును ముఖ్యార్థములు కావు. కావున 'యోగ' శబ్దముచే నే విలక్షణ మగు కౌశల్యము, సాధనము, యుక్తి, లేక, యుపాయము, గీతలలో ముఖ్యముగ వివక్షిత ముగనున్న దో దానినిజెప్పు 'యోగఃకర్మసు కౌశలమ్'-యోగ మనఁగా కర్మలఁ జేయుట యందలి నేర్పరితనము, యుక్తి-చాతుర్యము, లేక, శైలి (గీ. 2.50) యను దానిచే నీ శబ్దవ్యాఖ్యానము గీతలలో స్పష్ట పఱుపఁబడినది. మఱియు నటుపిమ్మట శాంకరభాష్యములో సైతము "యోగఃకర్మసు కౌశలమ్" అను పదములకుఁ గర్మవిషయమున స్వభావముగ నున్న బంధకత్వమును లేకుండఁ జేయు యుక్తియే యోగ మని యర్థము చేయఁబడినది. సామాన్యముగఁ జూచిన యెడల నొక కర్మనే చేయుట కనేక యోగములు, లేక యుపాయము లుండును. వానిలో నుత్తమ మగు సాధనమునకు యోగ మను శబ్దము విశేషముగ వాడఁబడుచున్నది. ఉదాహరణము: ద్రవ్యనంపా దన చేయవలసినచో నది, చౌర్యము, ఉద్బంధము, భిక్ష, సేవ, ఋణము, శరీరపరిశ్రమము మున్నగు ననేక సాధనములచే నంపా

దింపఁ దగియున్నది. వానిలో ప్రతిసాధనమునకు 'యోగ' శబ్దము ధాత్వర్థానుసారముగఁ బ్రయోగించుటకు వీలుండినను, దన స్వాతం త్ర్యమును బోఁగొట్టుకొనకుండ శ్రమచేసి ద్రవ్యమును సంపాదించు టయే ముఖ్యార్థము. ఈ యుపాయమునే ముఖ్యముగ 'ద్రవ్యప్రాప్తి యోగ' మని చెప్పుటయుఁ గలదు.

"యోగఃకర్మసు కౌశలమ్"-కర్మను జేయుటలో నొక విధ మగు విశేషయుక్తియే యోగమని స్వయముగ భగవంతుఁడే వ్యాఖ్యా నము చేయుటచే వాస్తవముగ విచారింప గీతలలో నీ శబ్దమునకు ముఖ్యార్థ మేమియగు ననుఁ విషయమున శంక యనవసరము. కాని భగవంతునిచేఁ జేయఁబడిన యీ వ్యాఖ్యానమున దృష్టియుంచక గీత లకు గొప్ప గొప్ప వ్యాఖ్యానముల నొనర్చిన వా రీ శబ్దముఁ గ్రిందు మీఁదు చేసి యనేక విధముల గీతల మథితార్థముఁ దీయుటచే వారు చేసిన యీ యోగశబ్దార్థములోని లోపమును నిరూపించుటకై యోగ శబ్దార్థవిచారణ యిచ్చో నావశ్యక మై యున్నది. యోగశబ్దము గీత రెండవయధ్యాయము మొట్టమొదట వచ్చి యుండుటచే నచటనే దాని యర్థము స్పష్టముగఁ జెప్పఁబడియున్నది. "యుద్ధ మేల చేయ వలయునో, సాంఖ్యమత ప్రమాణముగ నుపపత్తిని జెప్పిన పిదప నిప్పుడు నీకు యోగమార్గానుసారముగ నుపపత్తిని జెప్పుచున్నాను (గీ. 2, 39) అని భగవంతుఁ డారంభించుటచేఁ బ్రథమమున యజ్ఞ యాగాది కామ్యకర్మలలోనే యెల్లప్పుడు మునిఁగియున్న లోకులబుద్ధి ఫలాశామూలమున నెటుల వ్యగ్ర మగునో వర్ణితమైనది (గీ 2.41-46). పిదప నిటుల బుద్ధిని వ్యగ్రపడనీయక "ఆసక్తిని వదలుము. బొత్తిగ కర్మలనే వదలివేయ వలయునను నభినివేశమునఁ బడకుము" అని వచించి "యోగస్థుఁడవై కర్మలను జేయుము" (గీ. 2. 48) అని యుపదేశింపఁ బడినది. మఱియు నచ్చో 'యోగ' మనఁగా సిద్ధి విషయకము గాని యసిద్ధివిషయకము గాని యగు సమత్వబుద్ధి యని

యోగశబ్దార్థము ముందు స్పష్టముగఁ జెప్పఁబడినది. పిదప "ఫలాశచేఁ గర్మ చేయుటకంటె సమత్వ బుద్ధిరూపమగు నీ యోగమే శ్రేష్ఠమైనది (గీ. 2-49). బుద్ధి సమత్వయుక్త యగు నెడలఁ గర్మసంబంధ మగు పాపపుణ్యముల బాధ కర్తకుఁ దగులదు. కాన నీ వీయోగమును సంపాదింపుము" అని చెప్పి వెంటనే "యోగఃకర్మసు కౌశలమ్" (గీ. 2-50) అని యోగలక్షణము మరలఁ జెప్పఁబడినది. దీనినిఁ బట్టి చూడఁగఁ గర్మపాపము సంబంధింపకుండఁ గర్మఁ జేయుట యను సమత్వబుద్ధిరూపమగు నే విశేషయుక్తి ప్రథమమునఁ జెప్పఁబడినదో యా శక్తికే కౌశల మని నామము గావున నీ యుక్తిచేఁ గర్మను జేయుటయే యోగ మని గీతలలో జెప్పఁబడినటుల కనఁబడుచున్నది. మఱియు నీ యర్థమే యుత్తరగ్రంథమున- "యోఽయం యోగ స్త్వయా ప్రోక్త స్సామ్యేన మధుసూదన"- సమత్వ బుద్ధిస్వరూపమగు యోగము నీచే నాకుఁ జెప్పఁబడినది (గీ. 6.33) యని యీ శ్లోకమున నర్జునునిచే మరల స్పష్టపఱుపఁ బడినది. జ్ఞానియగు వానిచే నీ జగత్తున నెటుల వ్యవహరింపఁ బడవలయునో యా విషయమున శ్రీ శంకరా చార్యుల వారికంటెను సైతము పూర్వమునుండి వచ్చుచున్న వైదిక ధర్మముల ననుసరించియే రెండు మార్గము లున్నవి. వానిలో, జ్ఞానో త్పత్తియైన పిదప సర్వకర్మములను బొత్తిగ వదలుట యొకమార్గము; జ్ఞానోత్పత్తియైనను కర్మలను వదలక వాని పుణ్యపాపములబాధ తగుల నీయకయే, యుక్తిచే వానినే యా మరణాంతమును జేయుచుండుట రెండవమార్గము. ఈ రెండు మార్గముల నుద్దేశించియే గీతలలో ముందు (గీ. 5-2) సన్యాస మనియు, కర్మయోగ మనియు వాడఁ బడినది. సన్యాస మనఁగా వదలిపెట్టుట; యోగ మనఁగా సంబంధము. పర్యవసానమునకుఁ గర్మల త్యాగము, సంబంధము నను రెండును భిన్నమార్గములుగ నున్నవి. సాంఖ్యము, యోగము 'సాంఖ్యయోగౌ' అనియు సంక్షిప్తము లగు వేఱు నామములు సైత ముత్తరగ్రంథమున (గీ. 5. 4) నీ రెండు మార్గముల ననుసరించియే

వాడఁబడినవి. బుద్ధిని స్థిరముఁ జేయుటకుఁ బాతంజల యోగములో నున్న యాసనాదుల వర్ణన యీఅవయధ్యాయమున నున్నమాట నిజమే! కాని, యది యెవరికొఱకు? తపస్వికొఱకా? కానేరదు; కర్మ యోగికొఱకు; (యుక్తి చేఁ గర్మలఁ జేయువానికొఱకు). అతఁడు సమత యను యుక్తిని సాధించుకొనుటకై చెప్పఁబడినది. కానిచో "తపస్విభ్యోఽధికో యోగీ" యను వాక్యమే యనన్విత మగును. ఇటులే- "తస్మా ద్యోగీ భవార్జున" (గీ. 6. 46) అని యీ యధ్యాయాన్తమున నర్జునునకుఁ జేయఁబడిన యుపదేశముయొక్క యర్థము కూడ- "యోగస్థః కురు కర్మాణి" (గీ. 2. 48) "తస్మా ద్యోగాయ యుజ్యస్వ యోగఃకర్మసు కౌశలమ్" (గీ. 2.50) "యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత" (గీ. 4-42) యనుచోటుల నుండు నర్థముతో సమాన మైనది. యుక్తిచే గర్మను జేయు యోగి (అనఁగా కర్మయోగి)వగు మని యర్థము గ్రహించుటయే యావశ్యకముగ నున్నది. కారణ మేమన- పాతంజలయోగము నాశ్రయించి యుద్ధమునకు లెమ్మని చెప్పుటయు నసంగతమే; యటు లొనర్చుటయు నశక్యమే. "కర్మయోగేన యోగినామ్"- యోగులగువారు కర్మలను జేయుటనే యిందురు (గీ. 3-3) అని పూర్వమే స్పష్టముగఁ జెప్పఁబడియుండుటచే మహాభారతమున నారాయణీయ ధర్మములయొక్క, లేక, భాగవత ధర్మములయొక్క వివేచనలోనే యీ ధర్మావరణ నొనర్చువారు తమ తమ కర్మల వదలక వానినే యుక్తిచే జేయుచు- "సుప్రయుక్తేన కర్మణా" (మ. భా. శాం. 348. 56) పరమేశ్వరప్రాప్తిని చేసుకొనుచున్నారని చెప్పఁబడినది. పైనఁ జెప్పఁబడినటుల, 'యోగి' 'కర్మయోగి' యను నీ రెండు శబ్దములును గీతలలో సమానార్థకములగుటచే వాని యర్థము యుక్తిచేఁ గర్మఁ జేయువాఁడని స్పష్టమగుచునే యున్నది. 'కర్మయోగ' మను నీ పెద్దపదమునకు మాఱుగ 'యోగ' మను చిన్నపదమే గీతలలోను, మహాభారత మంతటను నధికముగ

వాడఁబడియున్నది. "నాచే నీకుఁ జెప్పఁబడిన యోగమే పూర్వము వివస్వంతునకుఁ జెప్పఁబడినది. కాని యా యోగము తర్వాత నష్ట మగుటచే నిప్పుడు నీకుఁ గ్రొత్తగ నా యోగమే చెప్పవలసివచ్చిన" దని భగవంతుఁడు యోగశబ్దమును మూఁడు పర్యాయములు ప్రయో గించుటచేఁ బాతంజలయోగము వివక్షితము కానేరదు. కర్మ యొన ర్చుటలో నొక విలక్షణయుక్తి యని కాని, సాధన మని కాని, లేక, విలక్షణమార్గ మని కాని యర్థము గ్రహింపవలసివచ్చును. అటులే గీతలలో శ్రీకృష్ణార్జునసంవాదమును సంజయుఁడు యోగమని చెప్పి నప్పుడును (గీ. 18.75) నీ యర్థమే సమ్మతమై యున్నది. శ్రీశంక రాచార్యులవారు తాము సన్యాసమార్గప్రవర్తకు లయ్యును తమ గీతా భాష్యారంభముననే వైదికధర్మమునకు నివృత్తి యనియు, ప్రవృత్తి యనియు రెండు భేదములఁ జెప్పిరి. మఱియు యోగశబ్దార్థమును, భగవంతునిచేఁ జేయఁబడిన వ్యాఖ్యానము ననునరించి "సమ్యగ్దర్శనో పాయకర్మానుష్ఠానం" (గీ. 4. 42) అనియు, మఱియొకచో "యోగః యుక్తిః" (గీ. 10. 7) అనియును జెప్పఁబడినది. అటులే మహాభారతమున సైతము "ప్రవృత్తిలక్షణో యోగః జ్ఞానం సన్యాస లక్షణమ్" (మ. భా. అశ్వ. 49. 25). "యోగ మనఁగా ప్రవృత్తి మార్గము; జ్ఞాన మనఁగా సన్యాసము, లేక, నివృత్తిమార్గము" అని యీ రెండు శబ్దముల యర్థము గీతలలో స్పష్టపఱుపఁ బడినది. మఱియు శాంతిపర్వము తుద, నారాయణీయోపాఖ్యానమున మాత్రము సాంఖ్యయోగశబ్దము లీ యర్థమందే యనేక పర్యాయ ములు వచ్చియుండుటచే నీ రెండు మార్గములును సృష్ట్యారంభము ననే భగవంతునిచే నెందులకై యే విధమున నిర్మింపఁబడినదియుఁ జెప్పఁబడినవి (మ.భా.శాం. 240; 348). భగవద్గీతలలో నీ నారాయ ణీయ ధర్మము గాని, భాగవతధర్మము గాని, ప్రతిపాద్య మను విష యము మొదటి ప్రకరణమున నుదాహరింపఁబడిన మహాభారత వచ నముల వలన స్పష్ట మగును. కావుననే సాంఖ్య మనఁగా నివృత్తి

మార్గము, యోగ మనఁగా ప్రవృత్తిమార్గము నని యీ శబ్దములకు నారాయణీయ ధర్మములోనిదియుఁ, ప్రాచీనమును, పారిభాషికము నగు నర్థమే గీతలలో వివక్షితముగ నున్న దని చెప్పవలసివచ్చినది. మఱియు నీ విషయమై యే దేని సంశయ మున్నయెడల "సమత్వం యోగ ఉచ్యతే", "యోగః కర్మసు కౌశలమ్" అని గీతలలోని యీ శ్లోకముల వ్యాఖ్యానము చేతను, "కర్మయోగేన యోగినాం" మొద లగు పైఁ జెప్పఁబడిన గీతావచనములచే నైత మది నిరసింపఁబడుటచే గీతలలోని యోగశబ్దము ప్రవృత్తిమార్గ (కర్మయోగ) మును నర్థమందే ప్రయోగింపఁబడిన దను విషయము నిర్వివాదముగ సిద్ధ మగుచున్నది. వైదికధర్మగ్రంథములలోనే కాక, పాళీ, సంస్కృత, బౌద్ధధర్మగ్రంథ ములలోనైతము యోగశబ్దము నీ యర్థమందే ప్రయోగింపఁబడినటుల స్పష్ట మగుచున్నది. ఉదాహరణము-శకము 200 ప్రాంతమున వ్రాయ బడిన 'మిలిందప్రశ్న' యను పాళీభాషాగ్రంథమున 'పుబ్బయోగో' (పూర్వయోగ) యను శబ్ద ముండుటచే దాని యర్థము 'పుబ్బకమ్మ' (పూర్వకర్మ) యని యచ్చో వ్రాయఁబడినది (మి. ప్ర. 1. 4). మఱియు శాలివాహనశకారంభమున నుండిన యశ్వఘోషుఁడను కవి యొక్క "బుద్ధచరిత" యను సంస్కృతకావ్యము యొక్క ప్రథమ సర్గములో 59వ శ్లోకమున- "ఆచార్యకం యోగవిధౌ ద్విజానా మప్రాప్తమన్యై ర్ధనకో జగామ"-బ్రాహ్మణులచే యోగవిధి నభ్యసింప జేయు పనిలో జనకమహారాజు ఆచార్యుఁ డాయెను. జనకునికంటెఁ బూర్వ ముం దిట్టి యాచార్యత్వ మేరికిని సంభవింప లే దని చెప్పఁబడి నది. ఇచ్చో 'యోగవిధి' యన, 'నిష్కామకర్మయోగవిధి' యనియే యర్థము చేయవలసి యున్నది. కారణ మేమన- జనకుని నడవడి యందలి రహస్య మిదియే యని గీతాది గ్రంథములు ఘోషించుటచే, నశ్వఘోషునిచే 'బుద్ధచరిత్ర'మున (9.19-20) గృహస్థాశ్రమమున నుండియే మోక్ష మెటుల సంపాదింపఁ బడవలయునో నిరూపించుటకు జనకుని యుదాహరణమే యియ్యఁబడినది. జనకునిచేఁ బ్రవర్తింపఁ

జేయఁబడిన మార్గమునకు యోగ మనియే పేరు. ఈ విషయ మంతయు నీ బౌద్ధగ్రంథములనుండి సైతము సిద్ధ మగుటచే గీతలలోని యోగ శబ్దమునకును నీ యర్థమే గ్రహింపవలసివచ్చును. కారణ మేమన- జనకుని మార్గమే గీతలలోఁ బ్రతిపాద్యముగ నున్నదని గీతయే చెప్పు చున్నది (గీ. 3.20). సాంఖ్యము, యోగము ననుసీ రెండు మార్గ ముల విషయమై యధికవిచారము ముందు చేయఁబడును. 'యోగ' శబ్దప్రయోగము గీతలలో నేయర్థమునఁ జేయఁబడిన దను విషయము మాత్రమే ప్రస్తుత ప్రశ్న యై యున్నది.

'యోగ' మనఁగఁ 'గర్మయోగ' మనియు, 'యోగి' యనఁ 'గర్మయోగి' యనియు గీతలలో నున్న శబ్దములకు ముఖ్యార్థమని యొక పర్యాయము నిర్ణీతమైన పిదప భగవద్గీతలలోఁ బ్రతిపాద్య మగు విషయ మేది యని వేఱుగఁ జెప్పనక్కఱలేదు. భగవంతుఁడు తన యుపదేశమునకు యోగ మని పేరు పెట్టి యున్నాఁడు (గీ. 4.1-3). మఱియు నాఱవ యధ్యాయమున నర్జునుఁడును (గీ.6.33) గీతల తుద నుపసంహారములో (గీ. 18.75) సంజయుఁడును గీతలలో నున్న యుపదేశమునకు 'యోగ' మని నామ మిడిరని పైనఁ జెప్పఁబడియే యున్నది. అటులే ప్రతి గీతా ధ్యాయాంతమునను నధ్యాయ సమాప్తిదర్శక మగు సంకల్పమున సైతము 'యోగశాస్త్ర' మను నదియే గీతలలోఁ బ్రతిపాద్యమైన విషయమని స్పష్టముగఁ జెప్పఁబడినది. కాని యీ సంకల్పములో నున్న శబ్దముల యర్థవిషయము ప్రస్తుత టీకాకారు లెవరును గమ నించినటుల తోఁపదు. "శ్రీమద్భగవద్గీతా సూపనిషత్సు" అను నారంభమున నున్న రెండుపదము లైన పిదప, ముందీ సంకల్పములో "బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే" యని రెండు శబ్దము లున్నవి. పైవానిలో మొదటి రెండుపదములకును నర్థము "భగవంతునిచే గానము చేయఁబడిన యుపనిషత్తులలో" నని యగుటచేఁ దర్వాత

రెండు శబ్దములచేతను "బ్రహ్మవిద్యలో యోగశాస్త్రము, అనఁగా- కర్మయోగ శాస్త్రము. ఇది దానిలో నుండువిషయ" మని యిపుడు స్పష్టపడుచున్నది. బ్రహ్మవిద్య యనఁగా బ్రహ్మజ్ఞానము. అది కలిగిన పిదప జ్ఞానులగు వారికి రెండు నిష్ఠలు గాని, మార్గములు గాని (గీ. 3.3) చూపఁబడియున్నవి. సాంఖ్యము, లేక, సన్యాస మనునది యొక మార్గము. అనఁగా- జ్ఞానానంతరమున జగత్తులోని సర్వకర్మల వదలి విరక్తుఁడై యుండుట; రెండవది యోగము, లేక, కర్మ యోగము. అనఁగా- కర్మల వదలక వాని మోక్షప్రాప్తి కెపుడును నడ్డులేకుండుయుక్తిచే నియమముగ నొనర్చుట. ఈ రెండుమార్గము లలో మొదటి దానికి జ్ఞాననిష్ఠ యనియు, మఱియొక నామ మిడుటం జేసి దాని వివేచన యుపనిషత్తులలో ననేక ఋషులచేతను, నితర గ్రంథకర్తలచేతను జేయఁబడినది; కాని బ్రహ్మవిద్యాన్తర్గతమగు కర్మ యోగముయొక్క కాని, యోగశాస్త్రముయొక్క కాని తాత్త్విక మగు నుపపాదనము భగవద్గీతయందుఁ దక్క మఱి యెచటను గాన రాదు. కావుననే యెవరిచే నీ సంకల్పము మున్ముందు రచింపఁ బడినదో (అది గీతాప్రతు లన్నిటిలోను స్పష్టముగ నుండుటచే గీతల కే వ్యాఖ్యానము చేయఁబడక మునుపే రచింపఁబడియుండు ననియనుమానము చేయఁబడినట్లు వెనుకనే చెప్పఁబడినది.) వారిచే గీతాశాస్త్ర విషయముయొక్క యపూర్వతను నిరూపించుటకొఱకు "బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే" యను సీపదము లా సంకల్పమున నాధారసహితముగను సహేతుకముగను వ్రాయఁబడినవి. వ్యర్థములు గాని మనఃకల్పితములు గాని కావనియు నిప్పుడు స్పష్టమగుచున్నది. మఱియు గీతలపై సాంప్రదాయికములగు టీకలు వ్రాయక మునుపు గీతల తాత్పర్య మని నిర్ణయించుకొనినదియు నీ సంకల్పముచేతనే సహజముగఁ దెలియును. నా యదృష్ట మేమి! యోగమార్గప్రవర్తకుఁడును, సర్వయోగములకును సాక్షాదీశ్వరుఁడు నగు (యోగ + ఈశ్వర) శ్రీకృష్ణభగవానుఁడు సర్వభూతహితము కొఱకు స్వయ

ముగఁ బట్టుపట్టి దేనియందలి రహస్యమును పూర్వ మర్జునునకు బోధించెనో యట్టి కర్మయోగమును బ్రతిపాదించుట యనునది సంభవించినది. 'యోగము', 'యోగశాస్త్రము' అను గీతలలోని శబ్దములకంటె, 'కర్మయోగము', 'కర్మయోగశాస్త్రము' అను పదములు పెద్దవి యగుట నత్యమే. కాని గీతలలోఁ బ్రతిపాద్యమగు విషయములో మరల నే విధమైన సందేహము నుండకూడదను తలంపుతో నీ గ్రంథమునకును, నీ ప్రకరణమునకును "కర్మయోగ శాస్త్రము" అను గొప్పనామము నే నిడితిని.

"ఒక కర్మను జేయుటకే, యే యనేకయోగములు గాని, లేక, సాధనములు గాని కలవో వానిలో నేది మిక్కిలి మంచిదియు, శుద్ధము నైన మార్గమో! దానిని నియమముతో నాచరించుట శక్య మగునా? కాదా? కానియెడల దాని కపవాద మేమి? మఱియు దేనికొఱకుఁ గలిగినది? మనము మంచిదనుకొను మార్గ మే కారణ మున మంచిది? ఏ కారణమున మనము చెడుదనుకొనునది చెడ్డది? మఱియు నీ మంచిచెడుగు లెవనిచే నే విధముగ నిశ్చయింపఁ బడవల యును? అట్లు నిశ్చయించుటకుఁ గారణ మేమి?" అను నిట్టివిషయము లే శాస్త్రముయొక్క యాధారముచే నిశ్చయింప వచ్చునో దానికి "కర్మయోగశాస్త్ర" మని కాని, గీతలలోనున్న సంక్షిప్తశబ్దాను సారముగ "యోగశాస్త్ర" మని కాని నామము. మంచిచెడుగులను నీ పదములు సామాన్యములుగ నున్నవి. మఱియు నా యర్థమునందే యొకానొకప్పుడు శుభాశుభము లనియు, నింకొకసమయమున హితాహితము లనియు, వేఱొక సమయమున శ్రేయస్కర మ్రశ్రేయస్కరము లనియు, మఱి యొకప్పుడు పాప పుణ్యము లనియుఁ బదముల వాడుచున్నారు. కార్యాకార్యములు, కర్తవ్యాకర్తవ్యములు, న్యాయాన్యాయములు నను నీ ద్వంద్వములను బోధించు శబ్దములకు నిదియ యర్థము. అయిన నీ శబ్దమును బ్రయోగించువారి సృష్టి

రచనా విషయికములగు మతములు వేర్వేఱుగ నుండుటచే గర్మ యోగశాస్త్రనిరూపణ ప్రకారములును వేర్వేఱుగనే యున్నవి. ఏ శాస్త్ర విచారము చేసినను దానిలోని విషయముల చర్చ సామాన్యముగ మూఁడువిధములుగఁ జేయవచ్చును. (1) "జడసృష్టిలో నున్న పదార్థములు, మన యింద్రియములకు గోచరించునటులే యున్నవి; అంతకంటె వానియందు దేవతాదికము లేమియు లేవు" అను నూహతోఁ బదార్థముల విచారణ చేయుటయే వీనిలో మొదటిది. దీనినే యాధిభౌతిక వివేచన యని వచింతురు. ఉదాహరణము- సూర్యుఁ డనునది యొక దేవత యని యంగీకరింపక కేవల పాంచ భౌతికమగు జడపదార్థపు ముద్ద యని వక్కాణించి, ఉష్ణత, ప్రకాశము, బరువు, ఆకర్షణము, మొదలగు నా పదార్థపు గుణధర్మములనే పరీక్షించుట సూర్యుని యాధిభౌతిక వివేచన యనఁబడును. రెండవ యుదాహరణమున కొక వృక్షమును గ్రహింతము. వృక్షమున కంకురోద్భేదము మొదలగునవి యంతర్గత మగు నే శక్తిచే నగునో దానిని విచారింపక "క్షేత్రమున బీజములు నాటిన నంకురము గలుగును. పిదప నా యంకురము వృద్ధి పొంది, కొమ్మలు, ఆకులు, పూవులు, కాయలు మొదలగునవి దాని దృశ్యవికారము లగును" అని దానిని కేవల బాహ్యదృష్టితో విచారించుట వృక్షమునొక్క యాధి భౌతికవివేచన యనఁబడును. రసాయనశాస్త్రము, పదార్థవిజ్ఞాన శాస్త్రము, విద్యుచ్ఛాస్త్రము మొదలగు నాధునికశాస్త్రములలో నుండు వివేచన యిటులే యుండును. వేయేల? ఇటులొక వస్తువుయొక్క దృశ్యగుణవిచారణ యైన మాత్రముననే తమ కృత్యము నెఱవేఱిన దనియు నింతకంటె సృష్టిలో నున్న పదార్థములను విశేషము విచారించుటవలన ఫల మేమియు లేదనియు నాధిభౌతికపండితులు తలంతురు. (2) ఈ పూర్వోక్తమగు నూహను వదలి "జడసృష్టిలో నుండు పదార్థముల మూల మేమై యుండును? ఈ పదార్థముల వ్యవ వ్యవహారము వాని గుణధర్మములచే మాత్రమే యగునా? లేక, వాని

యందు మఱియొకతత్త్వ మేదైనఁ గలదా?" యను నూహతో విచారించు నెడల నాధిభౌతికవివేచనకంటె నెక్కువగ మొదటికిఁ బోయి విచారింపవలసి వచ్చును. ఉదాహరణము- పాంచభౌతికమగు సూర్యుని, జడము, లేక, యచేతనమగు గోళములోఁ దదధిష్ఠాత్రి యగు సూర్యనామకదేవత యుండుటచే, నదియే జడమగు సూర్యుని వ్యవహారమును నడపించుచున్న దని తలఁచుటయే యాధిదైవిక వివేచన యనఁబడును. ఈ మతము ననుసరించి చెట్టు, నీరు, గాలి మొదలగు సర్వపదార్థములలోను నా జడపదార్థములకంటె వేఱగు ననేక దేవత లుండుటచే వారే జడపదార్థముల వ్యవహారముల నడిపించుచున్నారని చెప్పఁబడును. (శ) కాని, జడసృష్టిలో నున్న వేలకొలఁది జడపదార్థముల కిటుల వేలకొలఁది వేర్వేఱు దేవతలు న్నారని యంగీకరింపక "బాహ్యసృష్టియొక్క సర్వవ్యవహారములను నడిపించుచు మనుష్యులశరీరములలో నాత్మస్వరూపముగ నుండి యా జనులకు సకల సృష్టి జ్ఞానమును నిచ్చు నింద్రియాతీతమగు నొక చిచ్ఛక్తియే యీ జగత్తున నుండుటచే నా శక్తియే యీ జగత్తును నడిపించుచున్న" దని చెప్పుటయే యాధ్యాత్మిక వివేచన యగును. ఉదాహృతమగు సూర్యచంద్రాదుల వ్యవహారమువఱకుఁ బోనేల? చెట్లయాకులు కదలుటయు, నీ యచింత్యశక్తి ప్రేరణచేతనే యగు ననియు, సూర్యునియం దేనియు, నితర పదార్థములయం దేనియు స్వతంత్రులగు వేర్వేఱు దేవతలు లేరనియు నధ్యాత్మవాదు లందురు. ఏ విషయము వివేచనఁ జేసినను నీ మూఁడుమార్గములు చాల కాలమునందుండి వచ్చుచుండుటచే నుపనిషద్గ్రంథములలో నైతము వాని యుపయోగము చేయఁబడినటుల గోచరించుచున్నది. ఉదాహరణము- "జ్ఞానేంద్రియములు, ప్రాణము- వీనిలో శ్రేష్ఠమగున దేది?" యని విచారణఁ జేయుచు నొకప్పు డా యింద్రియముల యగ్న్యాది దేవతలను, నొకప్పుడు వాని సూక్ష్మ స్వరూపమును (అధ్యాత్మను) గ్రహించి బృహదారణ్యకాద్యుపనిషత్తులలో వీని బలా

బలవివేచన చేయఁబడినది. (బృ. 1.5.21-22; ఛాం.1.2-8; కౌషీ. 2.8). మఱియు గీతల సప్తమాధ్యాయములుదను నెనిమిదవయధ్యాయారంభమునను జెప్పఁబడిన యీశ్వరస్వరూప విచారణయు నీ యూహతోనే చేయఁబడినది. వానిలో "అధ్యాత్మవిద్యా విద్యానాం" (గీ. 10.32) అను నీ వాక్యము ననుసరించియు నాధ్యాత్మిక వివరణమునే మన శాస్త్రకర్తలితరులకంటె నధికముగ గౌరవించుచున్నారు. ఇటీవల పైనఁ జెప్పఁబడిన మూఁడుశబ్దముల యర్థమును కొంత మార్చి ఫ్రాన్సు దేశజుఁడును, ప్రసిద్ధుఁడునగు "కొంటు" అను నాధిభౌతిక పండితుఁడు *ఆధిభౌతిక ప్రతిపాదనమే సర్వోత్తమమనెను. అతఁడు "సృష్టికిఁ బూర్వ మే తత్త్వమున్నదో తెలిసికొన వలసినదిగాని దెలియవలసినది గాని యవసరము లేదనియు, నా తత్త్వ మగమ్య మగుటవలన (అనఁగా- ఎప్పుడును తెలిసికొనుటకు వీలుకాని దగుటచే) దాని యాధారమున నొక శాస్త్రరూపమగు పెద్ద గృహనిర్మాణ మనర్హము నశక్యము ననియు, పామరజనము, చెట్లు,

---

* ఫ్రాన్సుదేశమున అగస్టు కొంట్ (Aguste Comte) అనువాఁడు వెనుకటి శతాబ్దమున నుండెను. ఈతఁడు, పరమకవన, కాల్పీయమగు రీతిలో నెటులి విమర్శింపవలసివచ్చియుఁ దెలుపువట్టి యొక పెద్ద గ్రంథమును సమాజశాస్త్రముపై రచించెను. ఏ శాస్త్రమును దీసికొన్నను మొదట Theological పద్ధతి ననుసరించి చేయవలయును, పిమ్మట Metaphysical పద్ధతి ననుసరించి చేయవలయును. తుదకు దాని Positive స్వరూపము పిద్ధించును, అని యనేక శాస్త్రముల వాలోచించి యతఁడు విశ్వసించెను. ఈ మూఁడుమార్గములకుఁ బ్రాచీనములగు అధిదైవికాధ్యాత్మికాధిభౌతికములనే పేళ్ళనే యీ గ్రంథమున నుంచితిని. కాని యీ మార్గములను 'కొంటు' క్రొత్తగా కనిపెట్టలేదు. ఇవన్నియు పూర్వకాలమున నున్నవియే. అయినను వాని నాతఁ డైతిహాసక్రమమున నుపపాదించెను. వానిలో Positive (అధిభౌతిక) మార్గమే శ్రేష్ఠమని యాతఁ డెంచెను. చాలును. ఈ మాత్రమైన కొంటు క్రొత్తగ విమర్శించెను. కొంటు రచించిన గ్రంథము లనేకము లింగ్లీషులోనికిఁ దర్జుమా చేయఁబడినవి.

మబ్బులు, జ్వాలాముఖులు, (అగ్నిపర్వతములు) మొదలగు కదలు చున్న వస్తువులను దొలుతఁ జూచినప్పు డివియన్నియు, దేవతలేయని ధర్మవిషయకమగు మూఢభక్తిచే ననుకొనియె ననియు, తన మత మున నిదియే యాధిదైవిక విచారమనియు, పిదప, మనుష్యులు కొలఁది కాలమునకే యీ కల్పనను వదలి యీ సమస్త వస్తువులలో నేదేని యొక యాత్మతత్త్వము నిండియుండునని యనుకొన సాగి రనియు, నిది తన మతమున మానవీయాజ్ఞానప్రగతికి(పద్ధతికి) రెండవ మెట్టనియు, నిదియే యాధ్యాత్మికవివేచన యనియు, కాని సృష్టి నీ విధమున విచారించినను ప్రత్యక్షముగ నుపయోగించు శాస్త్రీయ జ్ఞానమున కేమియు వృద్ధిలేకునికిఁ, దుదకు సృష్టిలోనున్న వస్తువుల యదృశ్యములగు గుణధర్మములనే మనుష్యుఁ డత్యధికముగ శోధనఁ జేయుట కారంభించెననియు, దానివలననే మనుష్యులకిప్పుడు, ధూమ శకటము, విద్యుద్వార్తాయంత్రములవంటి యుక్తులు చూపించుటచే బాహ్యసృష్టిపై దాని యధికముగు వ్యాపారము నడచుట కారంభించిన దనియు, తన మతమున నిదియే యాధిభౌతిక వివేచన యనియు, నే శాస్త్రమునైన, నే విషయమునైన వివేచన సేయుట కీ మార్గమే యితర మార్గములకన్న నధికము లాభదాయకము, శ్రేష్ఠముననియు, కొంటు నిర్ణయించెను. కొంటుమతానుసారముగ సమాజశాస్త్రము యొక్కగాని కర్మయోగశాస్త్రముయొక్క గాని తాత్త్విక విచారమును జేయుట కీదృష్టినే గ్రహింపవలయును. మఱియు నా సంగతిని గ్రహించి, యితిహాసావలోకనముఁ జేసి ప్రథమమనుజుఁడును సర్వ మానవజాతియందును ప్రేమయుంచి సదా సమస్తజనుల క్షేమకళ్యాణ ముల కొఱకుఁ బ్రయత్నము చేయుటయే జగత్తులోఁ బరమమైన ధర్మమని సర్వవ్యవహారశాస్త్రముల మథితార్థ మీతనిచే నిర్ణయింపఁ బడినది. మిల్లు, స్పెన్సర్ మొదలగు నింగ్లీషు శాస్త్రజ్ఞు లీ మతమునే పురస్కరించిరని చెప్పవచ్చును. కొంటు, హెగిల్, షొపెహాయర్ మొదలగు జర్మను తత్త్వజ్ఞు లీ యాధిభౌతిక పద్ధతి నీతిశాస్త్ర వివేచ

నకుఁ జాలదని నిశ్చయించి మన వేదాన్తము ననుసరించి యధ్యాత్మ దృష్టిదేతనే నీతిని నమర్థించుమార్గము నీ కాలమునఁ గొంటుమతము నకు విరుద్ధముగ నైరోపాఖండమున మరల స్థాపించిరి. ఈ విషయమై పెక్కు సంగతు లుత్తరగ్రంథమునఁ జెప్పుదును.

విషయ ప్రతిపాదనమున నొక్కొక్కరి దృష్టియు, మార్గము నొక్కొక్కటి యగుటచే మంచిచెడుగు లను నొక విషయమునే చెప్పఁ దలఁచినను, కార్యాకార్యములు, ధర్మ్యాధర్మ్యములు, మొదలగు వేర్వేఱు పర్యాయపదములను బ్రయోగింపవలసి వచ్చినది. "భీష్మ ద్రోణాదులవధ యే యుద్ధమునఁ జేయవలసివచ్చునో యా యుద్ధ మును నేను జేయుట శ్రేయస్కర మగునా? కా నేరదా?" యని యర్జునునిశంక (గీ. 2.7). ఒక యాధిభౌతిక పండితుఁ డీ ప్రశ్నకు సమాధానముఁ జెప్పునెడల, భారత యుద్ధమువలన నర్జునునకుఁ దోఁచిన లాభాలాభములను, మొత్తముపై సమాజమునకుఁ గలుగు పరిణామమును, సారాసారవిచారమును జేసి, యుద్ధముఁ జేయుట న్యాయ్యమో యన్యాయ్యమో నిర్ణయించియుండును. కారణ మేమన- ఏ కర్మకైనను జగత్తులో గలుగు నాధిభౌతిక పరిణామము (అనఁగా- ప్రత్యక్షమగు బాహ్యపరిణామము) ను వదలినయెడల నా కర్మయొక్క మంచిచెడుగుల నిర్ణయించుటకు, మఱియొక సాధనమైనను, పద్ధతి యైనను, అధిభౌతికపండితులకు సమ్మతము కానేరదు. కాని యిట్టి యుత్తరముచే నర్జునుని సంశయము నివర్తింపనేరదు. ఏల యనఁగా- అర్జునుని దృష్టి యింతకంటె వ్యాపకముగ నుండెను. కేవల మీ లోకమున నీ శరీరమునకేకాక, పరలోకమున సైతము తన యాత్మకు పరిణామమును గలుగఁజేయు నీ యుద్ధము శ్రేయస్కర మగునా? కానేరదా? యను విషయమున, నిర్ణయ మాతని కావశ్యకముగ నుండెను. యుద్ధమందు భీష్మద్రోణాదులు చచ్చినఁ దమకు రాజ్య ప్రాప్తియై యిహలోకము లభించునా? లభింపదా? లోకులకుఁ

దము రాజ్యశాసనము, దుర్యోధన రాజ్యశాసనముకంటె సుఖకర మగునా? కానేరదా? యను విషయమున నతనికి సంశయము లేదు. మఱి యేమన- తాఁ జేయునది ధర్మ్యమా? అధర్మ్యమా? పుణ్యమా? పాపమా? యను విషయ మాతనికి తెలిసికొనవలసినదై యుండెను. మఱియు గీతలఱో నున్న వివేచనయు నా దృష్టితోనే చేయఁబడినది. గీతలలో కాక, మహాభారతములో నితరప్రదేశములలో నుండు కర్మాకర్మల వివేచనయు నీ తీరుననే (అనఁగా- పారలౌకికము నాధ్యాత్మికము నగు దృష్టితోనే) చేయఁబడుట వలన దానిలో నే కర్మయొక్క మంచిచెడుగులను నిరూపించుట కైనను ధర్మాధర్మశబ్దములే తఱుచుగ నన్నిస్థలముల వాడఁబడియున్నవి. కాని ధర్మము, దానికి ప్రతియోగి (అనఁగా- విరుద్ధము) యగు నధర్మము ననుసరించు నీ రెండుశబ్దములును వాని వ్యాపకమగు నర్థముచే నొకచో భ్రమను బుట్టించును. కానఁ గర్మయోగశాస్త్రమున నా శబ్దములు ముఖ్యముగ నే యర్థమున వాడఁబడినవో యనువిషయమున నిశ్చిత కొంత విరివిగ విచారించుట యవశ్యకర్తవ్యము. నిత్యవ్యవహారమునఁ బలుమాఱు "ధర్మశబ్దము" స్పష్టముగ "పారలౌకికసుఖము యొక్క మార్గము" అను నర్థమునఁ బ్రయోగించుచుండుట నెఱిఁగియే యున్నాము. మఱియుఁ బ్రసక్తానుసారముగ నెవరినైనను నీ "ధర్మమేమి"? అని మన మడిగిన, వాఁడు పారలౌకిక కళ్యాణార్థమై తా నే మార్గ మవలంబించి యున్నాఁడో, అనఁగా- వైదిక, బౌద్ధ, జైన, క్రైస్తవ, మహమ్మదీయ, పార్శీమతములలోఁదా నే మతావలంబకుఁడని యడుగుచున్నారని యనుకొని పైమతములలో నొకానొకదానిని దా నవలంబించియుండు దానినామము నుడువును. అటులే స్వర్గప్రాప్తిని గుఱించి సాధన భూతములగు యజ్ఞయాగాది వైదికవిషయముల మీమాంస నడచు చుండ "అథాతో ధర్మజిజ్ఞాసా" మొదలగు సూత్రములలో నున్న "ధర్మ" శబ్దమున కీ యర్థమే వివక్షితముగ నున్నది; కాని, ధర్మ శబ్దమున కీ మాత్రపు సంకుచితార్థముననే కాక యేతద్వ్యతిరిక్తము

లగు రాజధర్మములు, ప్రజాధర్మములు, దేశధర్మములు మొదలగు నైహిక నీతి నిబంధనలయందును ప్రయోగము కలదు. ధర్మశబ్దమున కీ రెండర్థములయందును వేర్వేఱుగఁ ప్రయోగములఁ జూపవచ్చును. పారలౌకిక ధర్మమునకు మోక్షధర్మమని కాని కేవలమోక్షమని కాని ప్రయోగ ముండుటయు, వ్యావహారికధర్మములకుఁ గాని, కేవల నీతికిఁ గాని, 'ధర్మ' మను నీ యనమస్తపదమును ప్రయోగించు టయు నిందుల కాధారములు. ఉదాహరణము— చతుర్విధపురుషార్థ ములను లెక్కించునపుడు, ధర్మార్థకామమోక్షములని మనము చెప్ప చున్నాము. ఈ శబ్దములలో మొదటి "ధర్మ" శబ్దములోనే మోక్షము సైత మంతర్భూత మైనచోఁ జివర మోక్షమని వేఱొక పురుషార్థవాచక శబ్దము చెప్పనేల? దీనివలన ధర్మపదముచే నీ స్థలమందు, జగత్తునఁ గాని, సంసారమునఁ గాని యున్న పలునీతిధర్మములే శాస్త్రకర్తల కిష్ట మని చెప్పవలయును దీనినే మనము కర్తవ్యకర్మ యని, నీతి ధర్మ మని, సదాచరణ మని ప్రస్తుతమునఁ జెప్పుచున్నాము; కాని ప్రాచీనసంస్కృత గ్రంథములలో "నీతి" లేక, 'నీతిశాస్త్రము' అను నీ శబ్దములు విశేషముగ రాజనీతినే యుద్దేశించి ప్రయోగింపఁబడు చుండుటచేఁ గర్తవ్యకర్మ, సద్వర్తనము — వీని సామాన్యవివేచనను 'నీతి ప్రవచన' మని చెప్పక 'ధర్మప్రవచన' మనియే పూర్వమందుఁ జెప్పుచు వచ్చిరి. కాని నీతిధర్మశబ్దములరెంటిలో నీ పారిభాషికభేదము సర్వసంస్కృత గ్రంథములలో గ్రహింపఁబడిన దను సిద్ధాన్తము కానరాదు. కావున నేనును నీతి, కర్తవ్య, ధర్మశబ్దము లీ గ్రంథమున నొక యర్థముననే ప్రయోగించితి. మఱియు మోక్షవిచారము చేయఁ దగియున్న ప్రకరణమునకు "అధ్యాత్మ" మనియు, "భక్తిమార్గ" మనియు స్వతంత్రనామములు ప్రయోగింపఁబడినవి. మహాభారత మున ధర్మశబ్ద మనేకస్థలముల నుండుటచే "ఒకని కొక కార్యమును జేయుట ధర్మప్రాప్త మయినది" అని విధింప వలసినపుడు ధర్మ శబ్దముచే 'కర్తవ్యశాస్త్రము' లేక, 'కాత్కాలికసమాజ వ్యవస్థా

శాస్త్రము' అను నర్థమే వివక్షిత మగుచున్నది: మఱియుఁ బారలౌకిక కళ్యాణపుమార్గము చెప్పనమయమున (అనఁగా- శాంతిపర్వపు ఉత్తరార్ధమందు) మోక్షధర్మమని వేఱుపేరు వాడఁబడినది. ఇటులే మన్వాది స్మృతిగ్రంథములలో నైతము చాతుర్వర్ణ్యము లగు కర్మలఁ జెప్పుచు, ధర్మశబ్దమే పలుమాఱు లనేకస్థలములఁ బ్రయోగింపఁ బడుటచేఁ భగవద్గీతలో నైతము. "స్వధర్మ మపి చావేక్ష్య"- స్వధర్మము నాలోచించి యుద్ధము చేయుము (గీ. 2. 31) అని యర్జునునకు భగవంతుఁ డుపదేశించినపుడును, మఱియు ముందు- "స్వధర్మే నిధనం శ్రేయఃపరధర్మో భయావహఃు" (గీ. 3.35) అను స్థలమందును ధర్మశబ్ద మైహలౌకిక మగు చాతుర్వర్ణ్యముయొక్క ధర్మమను నర్థముననే ప్రయోగింపఁబడినది. సమాజపు సర్వవ్యవహారములను సరళముగ నడిపించుట కొఱకును, నే దేని యొక వ్యక్తిమీఁదఁ గాని సమాజముమీఁదనే కాని, సర్వభారమును బడకుండ నా సమాజము నన్నివిధముల రక్షించుటకుఁ బోషించుటకును నాశ్రమవిభాగరూపమగు చాతుర్వర్ణ్యవ్యవస్థ ప్రాచీనులగు మహర్షులచే నేర్పఱుపఁబడినది. రానురా నీ చాతుర్వర్ణ్యమువారును గేవల జాతిమాత్రోపజీవులుగా (అనఁగా- సత్యములగు స్వకర్మల మఱచి కేవల నామధారులగు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులుగా) నుండి రను విషయము ప్రస్తుత మొకవైపున నుంచుదము. తొలుత నీ యవస్థ సమాజధారణార్థమై బయలుదేఱినది. కావున చాతుర్వర్ణ్యములో నొకజాతి, స్వధర్మమును (కర్తవ్యము) వదలిపెట్టినఁ గాని, యొకవర్ణము పూర్తిగ నష్టమైనప్పుడు దాని స్థాన మితరులు పూర్తి చేయకపోయినఁగాని, సమాజ మంతయు నా విధముననే బొత్తిగ వక్రమై క్రమక్రమముగ నశించును. కాదేని బొత్తిగ నీచావస్థనైనఁ బొందును. ఈ విషయ మెల్లరకు స్పష్టముగఁ దెలిసినదే. చాతుర్వర్ణ్యవ్యవస్థ లేకుండఁ, దోఁచినటులుగ వెలువడిన యనేక సమాజములు

పాశ్చాత్య ఖండములలో నున్నవి; కాని చాతుర్వర్ణ్యవ్యవస్థ లేక పోయినను, నాల్గువర్ణముల నిర్వధర్మములును, పుట్టుకను బట్టి లేకున్నను గుణవిభాగరూపమగు వేఱొకవ్యవస్థచే నైన నాదేశములోని సమాజములోఁ బ్రబలియున్నవను సంగతి మనము మఱువఁగూడదు. సారాంశ మేమనఁగా- ధర్మశబ్దమును మనము వ్యావహారికదృష్టితో నుపయోగించునపు డెద్దానిచే సర్వసమాజ ముద్ధరింపఁబడి పోషింపఁ బడునో యద్దాని మనము గ్రహించుచునే యున్నాము. అనుఖోదర్క (పరిణామమున దుఃఖము నిచ్చు) ధర్మమును వదలవలయునని మనువు చెప్పుచున్నాఁడు. (మను. 4.176). మఱియు శాంతిపర్వము నందు సత్యానృతాధ్యాయమున (శాం. 109.12) ధర్మాధర్మముల వివేచనయందు భీష్ముఁడును, తత్పూర్వమునఁ గర్ణపర్వములో శ్రీకృష్ణుఁడును-

ధారణా ద్ధర్మ ఇత్యాహు ర్ధర్మో ధారయతే ప్రజాః,
య త్స్యా ద్ధారణసంయుక్తం స ధర్మ ఇతి నిశ్చయః.
(మ. భా. కర్ణ. 69. 58)

- "ధర్మ" శబ్దము 'ధృ ధారణే' యను ధాతువు నుండి నిష్పన్న మగుటచే ధర్మముచేతనే ప్రజలందఱును బద్ధులు. దీనిచే సమస్త ప్రజలధారణ మగునో యదియే ధర్మ మని నిశ్చిత మగును అని చెప్పు చున్నారు. కావుననే యీ ధర్మము వదలిపోయిన యెడల సమాజ బంధనములు (కట్టుబాట్లు) చెదిపోయిన వని యెఱుంగవలయును. సమాజము కట్టుబాట్లు చెదినయెడల, ఆకర్షణశక్తి లేనప్పు డాకస మున నుండు సూర్యాదిగ్రహములకును, చుక్కాని లేనప్పుడు సంద్ర ములోని నావకును, గలుగు నవస్థయే సమాజమునకుఁ బొడమును. ఈ శోచనీయావస్థను బొంది సమాజము నశింపఁ గూడదు. కావున ద్రవ్యోపార్జన యందైనను సమాజరూపమగు ఘటికా యంత్రమునకు హాని కలుగకుండ నార్జింపవలయును. కామాది వాసనలఁ దృప్తిఁ

బొందింపవలసినచో, ధర్మాతిక్రమము లేకుండ చేయవలయును. ఈ తీరున ననేక స్థలములలో వచించి భారతము తుద వేదవ్యాసులు—

ఊర్ధ్వబాహు ర్విరౌ మ్యేష న చ కశ్చి చ్ఛృణోతి మామ్,
ధర్మా దర్థశ్చ కామశ్చ స ధర్మఃకిం న సేవ్యతే.

— రెండుచేతుల నెత్తి కొని యాక్రోశించుచున్నాను; కాని నా యాక్రోశము నెవ్వఁడును వినఁడు. ధర్మముచేతనే యర్థకామములు కలుగును. కావున నా ధర్మము నేల యాచరింపరు? అని చెప్పుచున్నారు. ఈ ధర్మదృష్టిచేతనే శ్రీ మహాభారతమును, ఐదవ వేద మనికాని, ధర్మసంహితయని కాని చెప్పుచున్నారు. ఆ ధర్మసంహితాశబ్దములో 'ధర్మ' శబ్దమునొక్క ముఖ్యార్థ మీ పై గ్రంథమువలన వాచకుల మనస్సునకు గోచరించును. పూర్వోత్తరమీమాంస లను పారలౌకికార్థప్రతిపాదకంబు లగు గ్రంథములవలెనే భారతము సైతము ధర్మగ్రంథమే కావున "నారాయణం నమస్కృత్య" యను ప్రతీకశబ్దములచే మహాభారతము సైతము బ్రహ్మయజ్ఞమునందు నిత్యపాఠములలోఁ జేర్చుకొనఁ బడియున్నది. పైఁ జెప్పఁబడిన ధర్మాధర్మనిరూపణలను విని యే రైనను, "1. నమాజధారణము, 2. రెండవ ప్రకరణమున సత్యానృత వివేకమందుఁ జెప్పఁబడిన సర్వభూతహితమును, అను నీ రెండు తత్త్వములును మీకు మాన్యము లను నెడల మీ దృష్టికిని, భేదమేమి? ఈ రెండు తత్త్వములును వెలుపలికిఁ బ్రత్యక్షముగ గోచరించుననియే గదా? (అనఁగా నాధిభౌతికములే కదా)" యని ప్రశ్న చేయుదురు. ఈ ప్రశ్నకు నవిస్తర విచారము నుత్తరప్రకరణమున జేయుదుము. నమాజధారణమే ధర్మముయొక్క ముఖ్యము బాహ్యోపయోగమను సిద్ధాన్తమును నే నంగీకరించినను, వైదికములు గాని, ఇతరములు గాని యగు సర్వధర్మములలో శ్రేష్ఠమును, సాధ్యమునైన యాత్మకళ్యాణమును, లేక, మోక్షమును గమనింపకయే నా దృష్టి నెప్పుడును వదువనీయ నని మాత్ర మిచ్చోఁ జెప్పుచున్నాను. ఇదియే యితర మతములకంటె మన మతమున నున్న విశేషము. నమా

ధారణము, సర్వభూతహితము నను నీ బాహ్యోపయోగకరములగు తత్త్వములు మన మోక్షమార్గమునకు బాధకము లగు నెడల వానిని మనము నిరాకరించెదము. వైద్యశాస్త్రము సైతము శరీర రక్షణము గుండ మోక్షప్రాప్తి సాధన మగుటచే గ్రహింపఁ దగియున్నదని మన యాయుర్వేద గ్రంథములచేఁ బ్రతిపాదింపఁబడినచో, నీ లోకమున వ్యవహార మెటుల చేయఁబడవలయునో, యా మహత్త్వవిషయ మే శాస్త్రమున విచారింపఁ బడవలయునో యట్టి కర్మయోగశాస్త్ర మాధ్యాత్మిక మగు మోక్షజ్ఞానమును వదలి మన శాస్త్రకారులచేఁ జెప్పఁబడు నను సంగతి యెప్పుడును సంభవింపదు. కావుననే, మోక్ష మునకు (ఆధ్యాత్మికోన్నతికి) అనుకూలము లగు కర్మలే, పుణ్యము లును, ధర్మములును, శుభములు నైన కర్మలు. మఱియు దానికిఁ బ్రతి కూలము లగు కర్మలే పాపములు, నధర్మములు, నశుభములు నగు కర్మ లని తలఁతును. కావుననే కర్తవ్యము, కార్యము, అకర్తవ్యము, అకార్యము నను శబ్దముల యెడ నర్థ ద్వయ ముండుటచేఁ గొంచెము సందిగ్ధముగ నున్నను ధర్మాధర్మశబ్దములనే తఱుచుగఁ బ్రయోగించు చున్నాను. దీనిలోనున్న మర్మ మిదియే. బాహ్యసృష్టిలో వ్యావహా రిక మగు కర్మను గాని వ్యాపారమును గాని ప్రస్తుతము ముఖ్యముగ విచారింపవలసి యున్నను, ఆ కర్మకు బాహ్యమగు పరిణామము యొక్క విచారముతోఁ గూడనే యీ వ్యాపార మాత్మయొక్క కళ్యా ణమున కనుకూలమైనదా? లేక, ప్రతికూలమైనదా? యను విచా రము సైతము మనచే నియమముగఁ జేయఁబడుచున్నది. "నాకు హిత మగు దానిని నేను వదలి లోకులకు హిత మగు దాని నేల చేయ వలయు" నని యాధిభౌతికవాదుల నెవరైన నడిగిన యెడల, సామా న్యముగ నది మనుష్యస్వభావ మందురే కాని, మఱి యే మని సమా ధానముఁ జెప్పుదురు? మన శాస్త్రకారుల దృష్టి యింతకంటెను సూక్ష్మాంశమును కనిపట్టినది. మఱియు నా వ్యాపకమైన యాధ్యా త్మికదృష్టితోనే కర్మయోగశాస్త్రము మహాభారతమున విచారింపఁ

బడుటచే భగవద్గీతలలో వేదాన్తనిరూపణ మిందులకే చేయఁబడినది. మానవుల కత్యంత హితమును, నద్గుణములయొక్క 'పరాకాష్ఠ' (అనఁగ: అధిక్యము) మొదలగు కొన్ని ముఖ్య ప్రయోజనములను గల్పించి యా ధోరణిచేతనే కర్మాకర్మవివేచన దేయఁబడవలయు నని ప్రాచీను లగు గ్రీకు పండితుల మత మగుటచేనాత్మహితమున నీ నర్వి విషయ సమావేశ మగునని 'అరిస్టాటిల్' అనువాఁడు తన నీతిశాస్త్ర మునఁ జెప్పి యున్నాఁడు (1. 7-8). అయిన నాత్మవిషయమున కీ విషయమున నియ్యవలసినంత ప్రాధాన్యము అరిస్టాటిల్ ఈయ లేదు. మనశాస్త్రకాయల సంగతి యటుల కానేరదు. ఆత్మయొక్క కళ్యాణము, లేక అధ్యాత్మికపూర్ణావస్థ, అనునదియే ప్రతి మానవునకును ప్రాథమి కమును ముఖ్యమును నగు సాధన మై యున్నది. మఱియు నితరము లగు హితములకంటె నదియే ప్రధానమైన దని యెంచి తదనుసార ముగనే ముందు కర్మాకర్మల విచారణఁ జేయవలయును. అధ్యాత్మ విద్యను వదలి కర్మాకర్మ విచారమును జేయుట యుక్తము గా దని యరిస్టాటిల్ సిద్ధాన్తికరించెను. మఱియు ప్రత్యుతము పాశ్చాత్యదేశ ములలోఁ గొందఱు పండితులచేఁ గర్మాకర్మ వివేచన కీ పద్ధతియే స్వీకరింపఁ బడినటుల గోచరించుచున్నది. ఉదాహరణము- జర్మను తత్త్వజ్ఞు ని యగు 'కాంటు'* అను వానిచేఁ ప్రథమమున "శుద్ధబుద్ధి మీమాంస- (వ్యవసాయాత్మిక బుద్ధియొక్క మీమాంస)" యను నధ్యాత్మవిషయ గ్రంథము వ్రాయఁబడిన పిదప దాని పూరణ మని 'వ్యావహారికబుద్ధిమీమాంస-(వాసనాత్మక బుద్ధియొక్క మీమాంస)' యను నీతిశాస్త్రగ్రంథము వ్రాయఁబడినది. మఱియు నింగ్లాండులో

---

* కాంటను నతఁడు జర్మనదేశపు తత్త్వవేత్తలలో నొకడు. ఈతఁ డర్వాచీనమగు తత్త్వశాస్త్రమునకు మూలపురుషుఁడు. ఈతని Critique of Pure Reason (శుద్ధబుద్ధిమీమాంస) అనునదియు, Critique of Practical Reason (వాసనాత్మకబుద్ధిమీమాంస) అనునయియు రెండుగ్రంథములు ముఖ్యసిద్ధ ములు. "ప్రోగ్" గ్రంథమునకు Prolegomena to Ethics అని పేరు.

సైతము 'గ్రీ' నను వానిచేఁ దన నీతిశాస్త్రోపోద్ఘాతమున, సృష్టికంకుఁ బూర్వమందున్న యాత్మతత్త్వము మొదల కొనియే చెప్పుట కారంభింపఁ బడెను; కాని యీ గ్రంథమునకుఁ బ్రతినిధిగఁ గేవల మాధిభౌతిక పండితుల నీతిగ్రంథములే మన దేశమందున్న యింగ్లీషు పాఠశాలలలోఁ దఱుచుగఁ బోధింపఁబడుటచే గీతలలో నున్న కర్మయోగశాస్త్ర మూలతత్త్వజ్ఞానము మనలో నింగ్లీషు చదివిన కొంత మంది విద్వాంసులకు సైతము సరిగా లేనంత స్థితికి వచ్చినది.

'ధర్మ' మను సామాన్యశబ్దమును వ్యావహారికనీతి నిబంధనలకు నైనను, సమాజధారణార్థమై వెలువడిన వ్యవస్థకు నైనను, నేనేల ప్రయోగింతునో, యా విషయము పై వివేచనవలనఁ దెలియును. మహాభారత, భగవద్గీత లను సంస్కృతగ్రంథము లందే గాక, మహారాష్ట్రాది దేశభాషా గ్రంథములలో సైతము, వ్యావహారిక కర్తవ్యములులేక, నియమములు నను నర్థమున ధర్మశబ్దమే నియమముగఁ బ్రయోగింపఁ బడుచున్నది. 'కులధర్మ, కులాచార' శబ్దములను మనము సమానార్థకములుగ నెన్నుచున్నాము. భారతయుద్ధమునఁ బృథ్వీలోఁ గ్రుంగిన రథచక్రమును బైకెత్తుటకు కర్ణుఁడు రథమునుండి క్రిందికి దిగినపిదప నర్జునుఁడు తన్ను వధించుట కుద్యుక్తుఁ డగుటఁ జూచి "శత్రువు నిరాయుధుఁడగు నపుడు చంపుట 'ధర్మయుద్ధము' కా"దని కర్ణుడు సెప్ప, శ్రీకృష్ణుఁడు, కర్ణునకు ద్రౌపదీవస్త్రాపహరణము, ఏకాకిగ నుండిన యభిమన్యుఁ బలువు రేకీభవించి యొనర్చిన వధము మొదలగు వెనుకటి సంగతుల జ్ఞప్తిపఱచి వానిలోఁ బ్రతివిషయమును-

"తేహ్వా గేలా హోతా కోతే రాధాసుతా తుఝా ధర్మ"

– ఓ రాధేయా! నీవు చేయు ధర్మోపదేశ మప్పు డే మాయె? నని యడిగినటుల మహారాష్ట్ర కవి యగు మోరోపంతుచే వర్ణితమైనది. మఱియు మహాభారతముననే యీ ప్రసంగమున "క్వ తే ధర్మ స్తదా

గతః" అని 'ధర్మ' శబ్దము ప్రయుక్త మగుటచే తుద కిట్టి ధర్మముఁ జేయు వారికి 'ఎట్టివాని కటులే' యను న్యాయానుసారముగ ఈ నముఁ జేయుటయే యోగ్య మని నిరూపింపఁ బడినది. సారాంశ మేమనగాఁ, సంస్కృతమున నైనను, మహారాష్ట్రాది దేశభాషల నైనను, బెద్దలచేఁ బ్రతి విషయమునను నధ్యాత్మదృష్టితో సమాజధారణార్థమై విధింపఁబడిన నీతినియమములు 'ధర్మ' శబ్దముచే బోధపఱుచుచుండుట యంతట వాడుకయగుటచే నా శబ్దమునే, నేనును నీగ్రంథమున నా యర్థమునందే ముఖ్యముగఁ బ్రయోగించితిని. సమాజధారణార్థ మై పెద్దలు నియమించినదియు, సర్వసమ్మత మైనదియు నగు నీతి నియమములు (అనఁగా: శిష్టాచారము లని మనచేఁ జెప్పఁబడినవి) ఈ దృష్టిచే ధర్మమునకు మూలము లగుచున్నవి. కావుననే మహా భారతమునను (అను. 104.157), స్మృతులలోను "ఆచారః ప్రథమో ధర్మః" యని యైనను, "ఆచారః పరమో ధర్మః" (మను. 1. 108) యని యైనను, ధర్మముయొక్క మూలములను జెప్పునపుడు "వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియ మాత్మనః" (మను. 2.12) అను వచనములు కనఁబడుచున్నవి; కాని కర్మయోగశాస్త్రమున నింత మాత్రముననే నిర్వాహము కాకపోవుటచే, నీ యాచారము ప్రవృత్త మగుటకు సైత మేమి కారణమై యుండు నను విషయము యొక్క సంపూర్ణ ము, రహస్యమును నగు విచారము చేయవలసినంత యవ నర మేమి గలిగెనో వెనుక రెండవప్రకరణమునఁ జెప్పఁబడినది.

ధర్మశబ్దమునకుఁ బ్రాచీన గ్రంథములలోఁ జేయఁబడిన రెండవ వ్యాఖ్యాన విచారమును సైత మిచ్చోఁ గొంత చేయవలయును. ఇది మీమాంసకుల వ్యాఖ్యానము. "చోదనా లక్షణోఽర్థో ధర్మః" (జై. సూ. 1.1.2) అని వారి లక్షణము. చోదన యనఁగాఁ బ్రేరణ; ఒకా నొక యధికారి యొక పురుషుని, 'నీ వీ పనిని చేయు' మని యైనను 'వద్ద' ని యైనను విధించుట, లేక, యాజ్ఞాపించుట యని దాని

యర్థము. ఎంత పర్యంత మిట్టి విధి యెవరిచేతను విధింపఁబడదో, లెక, శాస్త్రముద్వారా ప్రాప్తముకాదో, యంతపర్యంతము నే విషయ మునైన నెవరికైనను జేయుటకుఁ బూర్ణాధికార ముండదు. ధర్మ మనునది మొట్టమొదటఁ గట్టుబాటు మూలమున నిర్మింపఁబడిన దని దీని యభిప్రాయము. మఱియుఁ బ్రసిద్ధుఁడును నాంగ్లేయగ్రంథకర్త యగు 'హాబ్స్' యొక్క మతముతో నీ శబ్దవ్యాఖ్యానము కొన్ని కొన్ని యంశములలో సంబంధపడి యున్నది. ప్రతి మనుష్యుఁడును మూర్ఖావస్థయం దా యా సమయములఁ గలుగు ప్రబలమనోవృత్తుల ననుసరించి ప్రవర్తించును. కాని పిదప క్రమముగా నిట్టి స్వైరవర్త నము శ్రేయస్కరము కానేరదని తెలిసికొని యింద్రియములయొక్క యదృచ్ఛా వ్యాపారమునకుఁ గట్టుబా టొనరించి, యా హద్దును దాఁటక పోవుటచేతనే యందఱకు శుభ మగునను నిశ్చయమును బొందును. మఱియు, శిష్టాచారముచే నైనను, అన్యరీతిచే నైనను, దృఢ మై యున్న హద్దును ప్రతి మనుష్యుఁడు రాజశాసనమువలెఁ బాలించును. ఇట్టి నిబంధనలు బాగుగ స్థిరత్వమును బొందిన పిదప నవి యే శాస్త్రము లగును. వివాహవ్యవస్థ పూర్వ మాచరణమున లేదు. దానిని మొట్టమొదట శ్వేతకేతువాచరణములోనికిఁ దెచ్చెను. మఱియు సురాపానము శుక్రాచార్యులచే నిషేధింపఁబడిన దని వెనుకటి ప్రకర ణమునఁ జెప్పితిమి. శ్వేతకేతువును, శుక్రాచార్యులు నీ నిబంధనలఁ జేయుటకు నిమిత్తము లేమై యుండు నని విచారింపకయే, యిట్టి నిబంధన ననుసరించుటచే వచ్చు కర్తృత్వమును మాత్రమే మననున నుంచుకొనుటచే "చోదనా లక్షణోఽర్థో ధర్మః" అను 'ధర్మ' శబ్ద వ్యాఖ్యానము నిష్పన్న మైనది. పూర్వమున దాని మహత్త్వ మే మైనఁ దెలిసికొనిన యెడల ధర్మమునం దైనను ప్రవృత్తి కలుగును. భుజిం చుట, పానముఁ జేయుట, యింద్రియసుఖమును జెందుట యను నవి యొక్కనికైనఁ జెప్ప నక్కరలేదు. ఏలన అవి యింద్రియ

స్వాభావిక ధర్మము లగుటయే కారణము. "న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే"- మాంసభక్షణ, మద్యపాన, మైథునముల యం దేమియు దోషము (సృష్టికర్మకు విరుద్ధమగు విషయము) కాన రాదు (మను. 5.56) అను మనువచనమున కిదియే తాత్పర్యము. ఈ విషయములు మానవులకే కాక ప్రతిప్రాణికిని రాగముచేతనే ప్రాప్తము లగుచున్నవి. "ప్రవృత్తి రేషా భూతానాం" నమాజధారణార్థమై (అనఁగా: సర్వజన సుఖ నిమిత్తమై) యీ రాగప్రాప్తమైన స్వేచ్ఛా చరణము నణగఁ ద్రొక్కుట యను నదియే ధర్మము. కారణ మేమి యన -

ఆహారనిద్రాభయమైథునం చ సామాన్య మేత త్పశుభి ర్నరాణాం,
ధర్మో హి తేషా మధికో విశేషో ధర్మేణ హీనాః పశుభి స్సమానాః.

- ఆహారము, నిద్ర, భయము, మైథునము ననునవి మనుష్యులకును పశువులకును సమానముగనే రాగప్రాప్తము లగుచున్నవి. ధర్మము (అనఁగా: వీనిని నీతియొక్క కట్టుబాటులో నుంచుట) అనునదియే మనుష్యునకును పశువునకును గల భేదము. ఇట్టి ధర్మములేనివాడు పశువులతోనే సమానులు. మహాభారతమున శాంతిపర్వములో తత్స మానార్థకమగు శ్లోకము కలదు (మ. భా. శాం. 29. 4. 29). ఆహార నిద్రాదుల విధింపుటను బోధించు భాగవతములోని శ్లోకము క్రింది ప్రకరణమున వ్రాయఁబడినది. దాని ననుసరించియే భగవద్గీతల యందును-

ఇంద్రియ స్యేంద్రియ స్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ,
తయో ర్న వశ మాగచ్ఛే త్తౌ హ్యస్య పరిపంథినౌ.

(శ్రీ. 3.34)

- ఇంద్రియములయందును వానిచే నుపభోగ్యములు గాసి, త్యాజ్యములుగాని యగు పదార్థములయందును ప్రీతియు, విరోధము ననునవి స్వభావసిద్ధములై యనుక్రమముగా నున్నవి. వానికి

మనము పశులము కాఁగూడదు. ఏలయనఁగా- రాగద్వేషములు రెండును మనకుఁ శత్రువులు అని భగవంతుఁ డర్జునునకుఁ జెప్పెను. స్వభావముగఁ ప్రాప్తములగు స్వైరమనోవృత్తుల నణఁచుట యను ధర్మలక్షణమే భగవంతున కిష్టముగ నున్నది. మనుష్యేంద్రియములు వారికి వారు పశువులవలె సంచరించుటకుఁ దోడ్పడుచున్నవి. మతీయు వారి వారి బుద్ధియే వారి వారి నాకర్షించుచుండుము. ఈ కలహాగ్ని హోత్రమున దేహమందు సంచరించు పశుత్వమును హోమముఁ జేసి యెవరు కృతకృత్యు లగుదురో వారలే నత్యమైన యాస్తికులు, ధన్యులు నగుదురు. ధర్మ మాచారప్రభవ మన్నను, ధారణవలన ధర్మ మని యన్నను, "చోదనాలక్షణో ఽర్థో ధర్మః" యన్నను, ధర్మముయొక్క (వ్యావహారికమగు నీతి నిబంధనయొక్క) వ్యాఖ్యా నముఁ జేయు నప్పుడు, ధర్మాధర్మములయొక్క సంశయము వచ్చిన యెడల దానిని నిర్ణయించుట కీ మూఁడు లక్షణములు సైతము విశేష ముపయోగింపవు. ధర్మమూలస్వరూపము తొలి వ్యాఖ్యానముచేఁ దెలియఁబడును. దాని బాహ్యోపయోగము రెండవ వ్యాఖ్యచేఁ జెప్పఁ బడును. ధర్మమర్యాద ప్రథమమున నెవరిచే విధింపఁ బడినదియు మూఁడవ వాఖ్యయందుఁ దెలియవచ్చును. కాని యొక యాచారము నకు మతియొక యాచారమునకును భేద ముండును. ఇంతియ కాక యొక కర్మపరిణామమే యనేక విధము లగుటచేతను, ననేక ఋషుల చోదనలు భిన్నము లగుటచేతను, సంశయము పొడమినపుడు ధర్మ నిర్ణయమున కేదైన మతియొక మార్గ మాలోచింపవలసి వచ్చును. ఆ మార్గ మేది యని యక్షుఁ డడుగఁగా యుధిష్ఠిరుఁడు-

తర్కో ఽప్రతిష్ఠ శ్రుతయో ఽపి భిన్నా
నైకో ఋషి ర్యస్య వచః ప్రమాణమ్,
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం
మహాజనో యేన గత స్స పంథాః.

(మ. భా. వన. 312.117)

— తర్కము చంచలము, (బుద్ధి త్రివముగ నుండుకొలఁదియు ననేక విధానుమానములఁ గల్పనఁ జేయును) శ్రుతి (వేదవిధి) యనేక విధము. ధర్మశాస్త్ర మొక్క ఋషివచన మైన నన్యుల వచనమునకంటె నధిక ప్రమాణ మని యనుటకు వీలులేదు. మంచిది. ఈ వ్యావహారిక ధర్మముయొక్క మూలతత్త్వమును విచారింతమా, యదియు నంధకారబంధురముగ నున్నది. (సామాన్యమానవబుద్ధికిఁ దెలిసికొన సాధ్యము కాకున్నది). కావున మహాజను లే మార్గము ననుసరించి యుందురో యదియే ధర్మమార్గ" మని సమాధానముఁ జెప్పెను. ఈ యుత్తరము సరిగనే యున్నది; కాని మహాజను లన నెవరు? 'గొప్పవారు, గొప్పజననమూహ' మని యా పదమున కర్థము కానేరదు. ఏ సామాన్య మానవుల మనస్సున ధర్మాధర్మముల విషయమై యొకప్పుడును సంశయము గలుగదో, వారిచే విధింపఁ బడిన మార్గమున నడమట (అంధేనైవ నీయమానా యథాఽన్ధాఃకఠోపనిషత్తు) అని చెప్పినట్లు అంధకుకుంబరీ(గుడ్డివాని భాగవతము వలె)న్యాయముగ నుండును. మహాజను లన గొప్పశిష్టు లనుకొన్నను పూర్వశ్లోకమున నీ యర్థమే యిమిడియున్నను, ఆ శిష్టులవర్తన మెక్కడను నేకరూపతను వహించి యుండునటుల కానరాదు. ఉదాహరణము— పాపరహితయు, నగ్నిపరిశోధితయునగు జానకిని లోకాపవాదనివృత్తికై శ్రీరామచంద్రుఁడు కాననంబుల విడువఁ బంపెను. సుగ్రీవుఁడు తనకు సఖుఁ డగుటకై, తుల్యారిమిత్రుఁ (శత్రుమిత్రుల సమముగఁ జూచువాఁ) డని ప్రతిజ్ఞ యుండియు శ్రీరామచంద్రుఁడు తన కేమియు నపరాధము చేయని వాలిని వధించెను. పరశురాముఁడు పిత్రాజ్ఞచే మాతృకంఠచ్ఛేద మొనరించెను. పాండవుల నడత సరియై నదని యెంతుమా యనిన, నైదుగురికి నొక్కతెయే భార్య. స్వర్గమందున్న దేవతల నడత నాలోచింత మనిన, నొకఁ డహల్యాజారుఁడు; మఱియొకఁడు (బ్రహ్మ) మృగరూపమునఁ దన కూఁతునే యఖిలషించుటం జేసి రుద్రశరవిద్ధుఁడై నేఁటికిని నాకసమునఁ బడియున్న

వాఁడు. (ఐ.బ్రా. 3.38) ఈ సంగతియే మనస్సున నుంచుకొని, లవ కుమారునిముఖమున-"వృద్ధా స్తే న విచారణీయ చరితాఃⅠ- వృద్ధుల కృత్యముల గుఱించి విశేషముగ విచారింపఁగూడదని మనోహరముగ భవభూతి వర్ణించి యున్నాఁడు. ఇంగ్లీషులో "సైతాను" నితోనను వ్రాయుచు నొక గ్రంథకర్త, సైతాను స్నేహితునకును దేవ దూతకును గలిగిన పరస్పర కలహస్థితి యం దనేక పర్యాయములు దేవతలచేతనే దైత్యులు కపటప్రయోగ మూలమున వంచింపఁబడి నటుల స్పష్టమగ చున్నదని వ్రాసియున్నాఁడు. మఱియు నిటులే కౌషీతకీబ్రాహ్మణోపనిషత్తులో (కౌషీ. 3.1; ఐ.బ్రా. 7.28) నింద్రుఁడు ప్రతర్దనునకు "నేను వృత్రాసురుని (వాఁడు బ్రాహ్మణుఁడైనను) జంపితిని. బ్రహ్మప్రతిపాదక ఋక్కుల నెఱుంగని సన్యాసులను ముక్కలు ముక్కలుగ నటికి తోడేళ్ళవాత వేసితిని. మా ప్రతిజ్ఞల ననేకముల నుల్లంఘనఁ జేసినవారును, ప్రహ్లాదుని యాప్తులును, గోత్రజులు నైన పౌలోమ కాలఖంజనామ రాక్షసుల వధించితిని. ఇన్ని యొనర్చినను దానిచే "తస్య మే తత్ర న లోమ చ మామీయతే" - నా రోమమున కైనను వంకర కలుగలేదు అని చెప్పెను. "నీ కీ గొప్పవారి దుష్కర్మల విచారింపఁ బనిలేదు." తైత్తిరీయోపనిషత్తులోఁ జెప్పఁబడిన రీతిగ (తై.1.11.2) వారి మంచి చేఁతలనే యనుకరింపుము. మిగిలినవానినిఁ దగిలింపుము. పరుల రామునివలెఁ బిత్రాజ్ఞఁ బరిపాలింపుము; కాని మాతృవధ చేయకుము" అని యెవరైనఁ జెప్పినచో "మంచిచెడుగుల నెఱుంగుటకు సాధన మేమి?" యను మొదటి ప్రశ్నయే మరలఁ గలుగును. కావుననే వెనుకఁ జెప్పినఁ తీరున దన కృత్యములఁ జెప్పిన పిదప నింద్రుండు ప్రతర్దనునకు ఉత్తరగ్రంథమున "ఎవరు పూర్ణముగ నాత్మజ్ఞానులై యున్నారో వారికి మాతృవధ, పితృవధ, భ్రూణహత్య, స్తేయము మొదలగు నితర కర్మల దోషము లాపాదింపవు. ఈ విషయము మనస్సున నిడుకొని 'ఆత్మయన నేమి?' యనుటను మున్నుండు

నీవు తెలిసికొనుము. అటులైన నీకు సర్వసందేహనివృత్తి యగును" అని చెప్పి యనంతరము ప్రతర్దనుని కింఁదుం డాత్మవిద్య నుపదేశించెను. సారాంశ మేమన- "మహాజనో యేన గత స్స పంథాఃఁ" అను యుక్తి సామాన్యజనులకు సులభముగ నున్నను దానిచే మాత్రము సర్వకార్య నిర్వాహము కానేరదు. తుదకు మహాజనుల వర్తన యందలి సత్యమగు తత్త్వ మెంత గూఢముగ నున్నను సాత్మజ్ఞానమున రహస్యాంశములను విచారించుచుండు పురుషులకు దానినే శోధించి ప్రకటించుట యావశ్యక మగును. 'న దేవచరితం చరేత్"- దేవతల బాహ్యచరిత్రను మాత్ర మనుసరించి మనము ప్రవర్తింపఁ గూడదు అను వచనమున కిదియె కారణమై యుండును. కర్మాకర్మల నిర్ణయించుట కింతకన్న వేఱగు సులభమైన యుక్తి యనేకులచేఁ జెప్పఁబడినది. అది యేమన: సద్గుణమును సైతము విశేషముగ మనము వృద్ధిపొంద నీయఁగూడ దని తప్పక నియమము చేసికొనవలయును. అట్టి యతిప్రసంగముచే సద్గుణములే తుదకు దుర్గుణపర్యవసాయి లగును. దానము సద్గుణమే. "అతిదానాద్బలిర్బద్ధఃఁ"- దాన మతి యగుటచే బలిచక్రవర్తి బంధింపఁ బడెను. మఱియు గ్రీసుదేశమునఁ బ్రసిద్ధ పండితుఁడగు "అరిస్టాటిల్", తన నీతిశాస్త్రగ్రంథమునఁ గర్మాకర్మల నిర్ణయమున కీ యుక్తినే చెప్పి ప్రతి సద్గుణము నతి యగుటచే నెటుల వ్యర్థమగునో స్పష్టముగ నిరూపించెను. కాళిదాసు సైతము "కేవల శౌర్య మనఁగా పెద్దపులి వంటి భయంకర మగు క్రూరగుణము. కేవల నీతి యన మిత్రత్వమే యని నిశ్చయించి 'అతిథి' యను రాజు, ఖడ్గము-రాజనీతి యను నీ రెంటి యొక్క యోగ్యమగు మిశ్రణముచే రాజ్యమును నడిపించుచుండె"నని (రఘు. 17.47) రఘువంశమున వర్ణించియున్నాఁడు. "విశేషముగ మాటలాడి నేని వాచాలుఁడు; మితభాషి యైనచో మందుఁడు; మిక్కిలి వ్యయముఁ జేసిన అతివ్యయకారుఁడు; కొద్దిగ వ్యయము చేసిన లోభి; ముందు నడచువాఁడు దుస్సాహసి; వెనుకకుఁ దిరిగి

నచో ననమర్థుఁడు; మిక్కిలి పట్టుదల (ఆగ్రహము) గలవాఁడు దీర్ఘ క్రోధి; అది లేనివాఁడు చంచలుఁడు, విశేషముగ నాశ్రయింపవాఁడు సీమఁడు, ఆశ్రయింపనివాఁడు గర్వి యని యందురు "అని భర్తృహరి మొదలగు వారిచేఁ గొన్ని గుణదోషములు వర్ణింపఁబడి యున్నవి. కాని యిట్టి నికషోపలముదే సైతము సాంతముగఁ బై విమర్శము స్పష్టము కానేరదు. ఏలన: "అతి (అనఁగ విశేషము) యన నేమి? ఎవనినైన నియమస్థుఁ డని యేల చెప్పవలయును? ఈ నందేహము నెవ రెటులఁ దీర్పఁగలరు? ఒకనికిఁ గాని, యొక ప్రసంగమునఁ గాని, 'అతి' యగు నదియే, మఱియొకనికిఁ గాని, మఱియొక ప్రసంగమునఁ గాని కొఱఁతపడును. జన్మించుచుండఁగనే, సూర్యుని పట్టుకొను టకై పై కెగిరిన మారుతి కేమియు నా పని యశక్యముగఁ దోఁపలేదు. (వా.రామా. 7.శ్లో). ఇందువలననే శ్యేనము శిబికిఁ జెప్పినటుల ధర్మా ధర్మ సంశయము గలిగినపుడు ప్రతి మనుజుఁడు తుదకు-

అవిరోధాత్తు యో ధర్మ స్స ధర్మ స్సత్యవిక్రమ!,
విరోధిషు మహీపాల! నిశ్చిత్య గురులాఘవమ్.
న బాధా విద్యతే యత్ర తం ధర్మం సముపాచరేత్.

(మ.భా.వన. 131.11.12, మమ. 9.299)

— పరస్పర నిరుద్ధ ధర్మముల తారతమ్యములనైన, గురులాఘవముల నైనఁ జూచి ప్రతి విషయమునందు స్వబుద్ధిచే సత్య మగు ధర్మ నిర్ణ యమును, లేక కర్మనిర్ణయమును జేయవలయును. కాని, యంత మాత్రముచే 'ధర్మాధర్మముల సారాసారములను విచారణచేయుటయే, సంశయ సమయమున వాని నిర్ణయమునకు సత్య మగు పరీక్షాశిల' యని చెప్పుటకు సాధ్యము కానేరదు. కారణ మేమన:- ఎవరి బుద్ధి యెటు లుండునో తదనుసారముగనే వేర్వేఱు పండితులు సారాసార విచారమును సైతము వేర్వేఱు విధములుగఁ జేసి, యొక విషయము ననే నీతిమత్తానిర్ణయమును వేర్వేఱు విధములఁ జేసినటుల వ్యవ

హారములలోఁ బలుమాఱులు మనకు గోచరించుచున్నది. మఱియు నీ యర్థమే "తర్కాఽప్రతిష్ఠః" అను పూర్వోక్త వచనమున వర్ణిత మైనది. కావున 'ధర్మాధర్మసంశయ సంబంధ'మగు నీ ప్రశ్నను పూర్ణపాటులేక నిర్ణయించుట కితర సాధనము లున్నవా? లేవా? ఉన్నయెడల నేవి? మఱియు ననేక సాధనములున్నచో వానిలో నుత్తమమగున దేది? యను విషయము నిపుడు మనము విచారింపవలయును. శాస్త్రము నిర్ధారణఁ జేయునది యిదియే. "అనేక సంశయోచ్ఛేది పరోక్షార్థస్య దర్శకమ్" అనేక శంకలు కలుగుటచే బుద్ధికిఁ దొలుత గోచరముగాని విషయముల యందలి సందేహములను బోఁగొట్టి వానిలోనున్న యర్థమును నిశ్శంకముగను సుగమముగను జేయుటయు, ప్రత్యక్షము కానిదియు ముందుఁ గలుగునదియు నగు విషయమును యథార్థముగఁ దెలియఁజేయుటయు, నను నదియే శాస్త్రలక్షణము. మఱియు జ్యోతిశ్శాస్త్రము నభ్యసించుటచే రాఁబోవు గ్రహణముల సైత మెటుల చెప్పుట సాధ్యమగునో, యటుల విచారించిన నీ లక్షణములలో "పరోక్షార్థస్య దర్శకమ్" అను నుత్తరార్ధసార్థకత కన్పట్టును గాని యనేక సంశయములు జనించుటలో నవి యేవి యను సంశము తొలుతనే తెలియవలయును. కావుననే, యే శాస్త్రమునం దైనను సిద్ధాన్తపక్షమును జెప్పుటకు ముందుగ, నా విషయముపై గాఁగల పూర్వపక్షముల ననువాదముఁ జేసి వాని యందలి దోషము నైనను, అపూర్ణత నైనను నిరూపించుట, ననాతనాధునాతన గ్రంథకారుల పద్ధతిగ నున్నది. ఈ పద్ధతినే స్వీకరించి గీతలలోఁ గర్మాకర్మనిర్ణయార్థమై ప్రతిపాదింపఁబడిన సిద్ధాన్తపక్షమగు యోగమును (యుక్తిని) చెప్పుటకుఁ బూర్వ మీ కర్మాకర్మనిర్ణయార్థ మే యే యితర ప్రబలయుక్తులను పండితులు చెప్పుచున్నారో, వానిని సైత మిచ్చో నేను విచారించుచున్నాను. ఈ యుక్తులు మన దేశమునఁ బూర్వమున విశేషప్రచారములో లేకపోవుటయు, ముఖ్యముగఁ బాశ్చాత్యపండితులు వాని

నిటీవలఁ బ్రచారమునకుఁ దెచ్చుటయు సత్యమే! కాని యంతమాత్ర మున వాని విచారణ యీ గ్రంథమందు మనము చేయఁగూడదని చెప్పరాదు. కారణ మేమన:- కేవల ముభయ పక్షములను బోల్చి చూచుటకు మాత్రమే కాక, గీతలలో నాధ్యాత్మికమగు కర్మయోగ మహత్త్వమును గనిపెట్టుటకు సైత మీ యుక్తులు సంక్షేపముగనైనఁ దెలిసికొనుట యావశ్యకము.

ఇది కర్మయోగశాస్త్ర మను తృతీయ ప్రకరణము.

—

చతుర్థ ప్రకరణము

అధిభౌతిక సుఖవాదము

దుఃఖా దుద్విజతే సర్వ స్సర్వస్య సుఖ మీప్సితమ్.*

(మ.భా.శాం. 139.61)

— మన్వాదిశాస్త్రకారులు "అహింసా సత్య మస్తేయం" మొదలగు విధులను (నియమములను) విధించుటకుఁ గారణ మేమి? అవి నిత్యములా? అనిత్యములా? వాని వ్యాప్తి యెంతవఱకు? వానిలో మూలతత్త్వము లేవి? వానిలోఁ బరస్పరవిరుద్ధము లయిన రెండు ధర్మము లొక కాలమునందే ప్రాప్తము లయిన నే ధర్మమార్గము స్వీకరింపఁబడవలయును?- ఇట్టి ప్రశ్నలకు "మహాజనో యేన గత స్స పంథాఃʼʼ అనియో, లేక, "అతి సర్వత్ర వర్జయేత్" అనియో చెప్పు సామాన్యయుక్తిచే సమాధానము సంపూర్ణముగఁ గాక యుండుటచే నీశంకలను బాగుగఁ జర్చించి నివారించి శ్రేయస్కరమగు మార్గ మెద్దియో నిర్ణయించుట కేవైన నిశ్చిత సాధనములు గలవా? లేవా? ఏదైన నొక దృష్టిచే పరస్పర విరుద్ధములగు ధర్మముల గౌరవలాఘవములు, లేక, హెచ్చుతక్కువలగు మహత్త్వము మనచే నిర్ణయింపఁ బడుటకు శక్య మగునా? అను నీ విషయము ప్రకృతము నిశ్చయింపఁ బడును. ఇతర శాస్త్రీయ ప్రతిపాదనము ననుసరించి 'కర్మాకర్మ వివేచన' విషయమునందును, బ్రశ్నయొక్క యూహాపోహలను జేయుటలో సైతము, ఆధిభౌతిక మనియు, నాధ్యాత్మిక మనియు, నాధిదైవిక మనియు మూఁడు మార్గములు గలవు. వానిలో

---

* దుఃఖ మందఱకుఁ గష్టమై తోఁచును. సుఖము నందఱమ గోరుదురు.

నుండు భేదములు పూర్వప్రకరణమునఁ జెప్పఁబడినవి. అధ్యాత్మిక శాస్త్రమే వీని యన్నిటిలో శ్రేష్ఠ మని మన శాస్త్రకారుల యభిప్రాయము కాని, యధ్యాత్మమార్గమహత్త్వము పూర్ణముగఁ దెలియుటకై మిగిలిన యాధిదైవి కాధిభౌతికము లను రెండు మార్గముల విచారణఁ జేయుట యావశ్యక మగుటచేఁ గర్మాకర్మ పరీక్షణ విషయమున నాధిభౌతిక మూలతత్త్వముల చర్చ (పరీక్ష) యీ ప్రకరణమునఁ దొలుతఁ జేయఁబడినది. ఇటీవల (అర్వాచీనకాలమున) నాధిభౌతిక శాస్త్రము మిక్కిలి యభివృద్ధిఁ జెందెఁ గాన వ్యక్తపదార్థములయొక్క బాహ్య ములు, లేక, దృశ్యములగు గుణముల విచారణమే ముఖ్యముగఁ జేయవలసి వచ్చును. కావున నాధిభౌతికశాస్త్ర పఠనముతోనే యాయువు నంతయు నెవఁడు గడపునో, లేక, యీ శాస్త్రమునం దున్న విచారణ పద్ధతిలోనే యెవనికి పట్టుదల (అభిమానము) గలదో వానికి బాహ్యపరిణామము యొక్క విచారణ నొనరించుటయందే యభిరుచి తప్పక యుండును. మఱియు తన్మూలముగఁ దత్త్వజ్ఞాన దృష్టి కొద్దిగనో గొప్పగనో తఱుగుటచేత, నెద్దానిని విచారించినను, నాధ్యాత్మికములును బారలౌకికములునైన, లేక, యవ్యక్తములు నదృశ్యములు నైన, కారణములను వాఁ డెక్కువగ గౌరవింపఁడు; కాని, యిట్టి కారణములచే నాధ్యాత్మికదృష్టి, లేక, పారలౌకికదృష్టి, వదలి వేయఁబడిన యెడల, ప్రతి మనుజునకు నితరునితోఁ గలుగు చుండు జగత్తుయొక్క వ్యవహారము సరళముగ వర్తించుటకును, లోకసంగ్రహమునకును, నీతినిర్బంధ మావశ్యక మగుటచే పారలౌకిక మునం దెవ్వారి కాస్థలేదో, లేక యవ్యక్తమైన యధ్యాత్మజ్ఞానముపై, మఱియుఁ గ్రమముగ ని హేతువుంబట్టి పరమేశ్వరునిపై, నెవరికి విశ్వాస ముండదో, యట్టి విద్వాంసులకు సైతము కర్మయోగశాస్త్ర మత్యంత మహత్త్వము గలదని తోఁచుటచేఁ, గేవల మాధిభౌతిక శాస్త్రరీతిగనే, (అనఁగ కేవల ప్రైహిక దృశ్యయుక్తివాదము చేతనే) కర్మాకర్మ శాస్త్రములయొక్క యపపత్తి చెప్పుట శక్య మగునా?

కానేరదా? యను నీ విషయమై పాశ్చాత్యదేశమునందే, విశేష వివాదములు జరిగినవి. మఱియు నా చర్చ యిప్పుడు సైతము వర్ధిల్లుచునే యున్నది. వివాదమున, ఈ 'భవతి_న_భవతి' విషయమై నవీన (అర్వాచీన) లగు పాశ్చాత్య పండితులచే "నీతిశాస్త్రము యొక్క వివేచనఁ జేయుటలో నాధ్యాత్మిక శాస్త్రావశ్యకత యేమియును లేదు. ఏ కర్మయైనను మంచిది, లేక, చెడుది యను నిర్ణయమును ఆ (ప్రకృత) కర్మయొక్క బాహ్యపరిణామము మన కెటుల ప్రత్యక్షముగఁ గాన్పించునో, తదనుసారముగనే చేయఁబడవలయును. మఱియుఁ జేయుటకును సాధ్య మగును" అని సిద్ధాన్తము చేయఁబడినది. కారణ మేమన_ మనుజునిచేఁ జేయఁబడు కర్మలన్నియు సుఖప్రాప్తికైనను, దుఃఖనివృత్తికైనను, జేయఁబడును. వేయేల? మనుజుల కందఱికిను సుఖమే యైహికమయిన పరమసాధ్యము. మఱియు సర్వకర్మలయొక్క దృశ్యఫల మీ తీరుననే నిశ్చితమైన యెడల, సుఖప్రాప్తి, దుఃఖనివృత్తి యీ రెంటియొక్క తారతమ్యము (అనఁగా_గౌరవలాఘవముల) నాలోచించి సర్వకర్మలకు నీతిమత్తను నిర్ణయించుటయే, ముఖ్యమార్గ మగును. "ఏ యావు, వాలినకొమ్ములు గలిగి, సాధువై, యెక్కువపాల నిచ్చుచున్నదో, అదియే మంచి యావు" అని బాహ్యోపభోగముల నుండియే వ్యవహారమున నే పదార్థముయొక్క మంచిచెడుగు లైనను నిశ్చయింపఁబడు నెడల, నా తీరుననే "యే కర్మలనుండి సుఖప్రాప్తిరూప మైన దైనను, దుఃఖనివారణాత్మక మైన దైనను, బాహ్యఫల మధిక మగునో, యవియే నీతిదృష్టిచే సైతము (శేయస్కరము' లని యెఱుంగ వలయును. కేవలముగ బాహ్యములు, దృశ్యములునగు పరిణామముల గౌరవలాఘవములఁజూచి, నీతిమత్తను నిర్ణయించుట యనెడు సులభమును శాస్త్రీయమునగు నికషోపల (బంగారము నొరయుఱాయి) ముండఁగ నందుకై యాత్మానాత్మ విచారములో దిగుట యనెడి ద్రావిడప్రాణాయామమును జేయుట యోగ్యము కానేరదు. "అర్కేచే న్మధు

విందేత కిమర్థం పర్వతం వ్రజేత్?" * — సమీపమునందు (అనఁగా— కూర్చున్న ప్రదేశముననే) తేనె దొరకునేని తేనె పట్టును వెదకుటకై గుట్టలకు వెళ్ళనేల? కర్మయొక్క బాహ్యపరిణామమునే చూచి, నీతి పక్షమునుగాని, యనీతిపక్షమునుగాని నిర్ణయించుపద్ధతికి మే మాధిభౌతిక సుఖవాద మని నామం బిడినారము. కారణ మేమన— నీతి మత్తను నిర్ణయించుటకై యీ మతము ననుసరించి, యే సుఖదుఃఖములను నిర్ణయింపవలయునో యవి యన్నియుఁ బ్రత్యక్షముగఁ గాన్పించునవి యు బాహ్యములను (అనఁగా— బాహ్యపదార్థములకును నింద్రియములకును సంయోగ మగుటచేఁ బుట్టునవి, అనఁగ, నాధిభౌతికములు) నగుటచే నీ మార్గముసైతము సర్వజగత్తును నాధిభౌతికదృష్టితో మాత్రమే విచారించుచున్న పండితులచేతనే ప్రతిపాదింపబడినది; కాని, యీ వాదముయొక్క నవినశ్వరమైన విషయము నీ గ్రంథమునందుఁ జెప్పుట సాధ్యము కానేరదు. వేర్వేఱు గ్రంథకారుల మతములను సంక్షేపముగఁ దెలుపుట కైనను స్వతంత్ర గ్రంథము వ్రాయవలసి వచ్చును. కావున భగవద్గీతలలో గర్మయోగ శాస్త్ర స్వరూపమును, మహత్త్వమును సంపూర్ణముగ నెఱుంగుటకై నీతిశాస్త్ర సంబంధముగల యీ యాధిభౌతిక మార్గజ్ఞాన మెంతవఱ కావశ్యకమో యంతవఱకె యీ ప్రకరణమున సంక్షేపముగ నొక్కచోఁ గూర్చి నిరూపింపఁబడినది. ఇంతకంటె విశేషజ్ఞాన మెవరికైనఁ గావలసినచో, వారు పాశ్చాత్యపండితుల మూలగ్రంథములనే చూచికొనవలయును. పరలోక విషయమయి కాని, లేక, యాత్మ విద్యావిషయమయి కాని, యాధిభౌతికవాదు లుదాసీనులుగ నుందు

* ఈ శ్లోకమందలి 'అర్క-' శబ్దమువకు జిల్లేడు చెట్టనియు, వ్రత్తి చెట్టనియు ననేకు లర్థము చెప్పుచున్నారుఁ కావి బ్రహ్మసూత్రము ౩.౪.౫ శాంకరభాష్య టీక యం దర్క-శబ్దము సమీపార్థక మని యానందగిరిస్వామి చెప్పియున్నాఁడు. "ఏద్ధ స్యార్థవ్య సంప్రాప్తౌ కో విద్వా న్యత్న మాచరేత్" అని యీ శ్లోకము యొక్క యుత్తరార్ధము.

రని వెనుకఁ జెప్పఁబడి యున్నంతమాత్రము చేతనే యా మార్గాను చరు లగు విద్వాంసు లందఱును స్వార్థపరు లని కాని, కుక్షింభరులని కాని, నీతిశూన్యు లని కాని యెవ్వరు నెన్నుకొనఁగూడదు. పరలోక చింత లేకపోయినను, నైహికదృష్టిచే నైనను శక్యమైనంత వఱకు వ్యాప్తి కలుగఁ జేసి సర్వ ప్రపంచముయొక్క కల్యాణార్థమై యత్నించు టయే, మనుజుఁడైన వానికెల్ల కర్తవ్యమగు పని యని మిక్కిలి విస్పష్టముగను, సంతసముతోను చెప్పు, కోంట్, మిల్, స్పెన్సర్ మొద లగు సాత్త్వికవృత్తిగలిగిన పండితు లీ మార్గములోని వారలే. మఱియు వారి గ్రంథము లుదాత్తములును, బ్రగల్భములు నగు ననేక విధము లగు విచారములతో నిండియుండుటం బట్టి యవి యందఱిచేఁ జదువఁబడుటకు యోగ్యములై యున్నవి. కర్మయోగశాస్త్రము వేర్వే ఱుగ నున్నను 'జగత్తునకు కల్యాణ' మనెడి బాహ్యసాధ్యము విడువఁ బడనంతవఱకును నీతిశాస్త్రోపపాదన మను మార్గము భిన్నమైన దను నంతమాత్రమున నా శాస్త్రజ్ఞులను పరిహసింపఁ గూడదు. అది యట్లుండ నిండు! "నీతిశాస్త్రసిద్ధము లగు కర్మాకర్మలయొక్క నిర్ణ యమునకై యే యాధిభౌతిక బాహ్యసుఖములను విచారింపవ లయునో యవి యెవరివి? తనవియే యగునా? పరులవి యగునా? ఒకనివి యగునా? అనేకులవి యగునా?" యను విషయమై మతభేద ముండుటచే "నవీనులుం బ్రాచీనులు నగు నమస్తాధిభౌతికవాదులును ముఖ్యముగ నెన్ని వర్గము లగుదురు? మఱియు వారి మార్గ మెంత దనుక నిలుచునదిగాఁ గాని, నిర్దోషముగాఁ గాని యున్నది?" అను విషయమునే, యిప్పుడు క్రమముగ సంక్షేపముగా విచారింతము.

పీఠిలో మొదటి తరగతివారు కేవలము స్వార్థసుఖవాదులుగ నున్నారు. "పరలోకము పరోపకారము మొదలగునవి యన్నియు నసత్యము లగుటం జేసి యాధ్యాత్మిక ధర్మశాస్త్రములు వంచకులచే స్వోదరపూరణార్థమై వ్రాయఁబడినవి. ఈ జగత్తున స్వార్థమే సత్య

మైనది. మఱియు నే కృత్యములచే స్వీయ మగు నాధిభౌతికసుఖము వృద్ధిఁబొందునో, యవియె న్యాయ్యములు, ప్రశస్తములు నని తెలియ వలయు"నని యీ మార్గములోని వారు వచించెదరు. మన హిందూ దేశములో నీ మతము చార్వాకులచే స్పష్టముగనే వక్కాణింపఁబడినది. రామాయణములో నయోధ్యాకాండము చివర, జాబాలిచే రామునకుఁ జేయఁబడిన కుటిలోపదేశము గాని, మహాభారతములో నున్న కణిక నీతి గాని (మ.భా.ఆ. 142) యీ మార్గము నవలంబించియే యున్నవి. "పంచభూతము లేకీభవించినచో, వాని కలయికవలన నాత్మయనెడి గుణము బయలుదేరుచున్నది. మఱియు దేహమును దగులఁ బెట్టిన దానితో నాత్మ సైతము కాలిపోవును. అత్మవిచార మను నుపద్రవ ములోఁ బడక బుద్ధిమంతుఁడగు పురుషుఁ డీ దేహము జీవవంత మై యున్నంతపర్యంతము "ఋణము చేసి యైనను నేతినిఁ ద్రాగవల యును"— "ఋణం కృత్వా ఘృతం పిబేత్"; చచ్చిన పిదప నేమియు దేయలేము, ఏమియును లేదు అని చార్వాకు లనెడి మహా త్ములు నుడువుదురు. చార్వాకులు హిందూదేశమునందే పుట్టియుం డుటచే నేతిపై వారికంత యిష్టముండె నని తోఁచును. లేనిచో "ఋణం కృత్వా సురాం పిబేత్" అని యీ సూత్రమునకు రూపాం తర మేర్పడియుండును. "ఎక్కడి ధర్మము? ఎక్కడి పరోపకారము? ఈ జగత్తున నే వస్తువు పరమేశ్వరునిచేఁ జేయఁబడినది? శివ శివ! మరచి పోయితిని! పరమేశ్వరుఁ డెక్కడనుండి వచ్చినాఁడు? ఈ జగ త్తున నేఁ జూచిన వస్తువు లన్నియు నే ననుభవించుటకే కాని యా వస్తువులకు మఱియొక యుపయోగము లేనే లేదు. నేను మృతి నొందిన యెడల జగము మునిఁగియే పోవును. కావున నేను బ్రతికి యున్నంత పర్యంత మీ రోజున నిదియు, రే పదియు, నీ తీరున సర్వమును నేను స్వాధీనపఱచుకొని, నా కోరికల నన్నింటిని దీర్చు కొనియెద. ఒకవేళ తపస్సును గాని, దానమును గాని, నేను జేయు నెడలఁ బ్రతిష్ఠకొఱకే చేయుదును. రాజసూయము నైనను, అశ్వ

మేధము నైనను జేసినఁ బ్రతిష్ఠకైయే చేయుదును. కావున నీ జగత్తునకు 'నేను' అనునదియె యొక కేంద్రము; 'నేను' అనునదియే సమస్త నీతిశాస్త్రమునకును రహస్యముగ నున్నది. మిగిలిన దంతయు ననత్యమే" అని యిందలి సారాంశము. మఱియు గీతలలో—

ఈశ్వరోఽహ మహం భోగీ సిద్ధోఽహం బలవాన్ సుఖీ
(గీ. 16-42)

— నే నీశ్వరుఁడను, నేనే యనుభవించు వాఁడను, నేనే సిద్ధుఁడను, బలాఢ్యుఁడను, సుఖిని యని గీతలలోఁ బదునాఱవ యధ్యాయమునఁ జెప్పఁబడిన "ఆసురసంపత్తి" యీ మతమునే యుపపాదించుచున్నది. శ్రీకృష్ణుని స్థానమున నిట్టివారిలో జాబాలివంటివాఁ డర్జునుని వైపున నుండి యుపదేశింప వలసి వచ్చిన యెడల, తొలుతనే యర్జును నొక చెంపకాయం గొట్టి "ఓరీ! నీవు మూర్ఖుఁడవా యేమి? యుద్ధమునం దందఱను జయించి యనేక విధములగు రాజభోగములను, విలాసము లను, అనుభవింపఁదగిన బంగారమువంటి మంచిసమయము లభించి నప్పుడు 'దీనిని చేయుదునా? మానుదునా?'యని వ్యర్థమగు భ్రమను పొందియున్నావు. ఆత్మ యిక్కడిది? సుహృద్బాంధవాదులఁ బట్టు కొని యేల కూర్చుండియున్నావు? లెమ్ము. శత్రువుల జయింపుము. హస్తినాపుర సామ్రాజ్యమును, సుఖముగ నిష్కంటకముగ ననుభవిం పుము. ఇందుచే నీకు గొప్పశ్రేయస్సు కలదు. దృశ్యమగు నైహిక సుఖము గాక యీ జగత్తున మఱే మున్నది?" అని యుపదేశించి యుండును; కాని హేయ మయినదియు, పొట్టపోసికొనుటకు మాత్ర మేర్పడిన యీ రాక్షసోపదేశమునకుఁ దొలుతనే యర్జునుఁడవ కాశము నీయక శ్రీకృష్ణునితో—

ఏతా న్న హంతు మిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన,
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోఃకిన్ను మహీకృతే.
(గీ. 1-35)

— ఈ భూమియే కాదు. మూఁడులోకముల రాజ్యము సైతము (ఇంత గొప్ప విషయసుఖము) ఈ యుద్ధముచే నాకుఁ దనంతటనే లభించు నదియై యున్నను, దాని నిమిత్తమున సైతము కౌరవులను జంపుటకు నే నియ్యకొనను. వారు నన్ను జంపినను నొప్పికొందును అని వచించెను. అర్జునుండు దొలుతనే స్వార్థపరాయణము (తన విషయమునే పాటించుకొనుట మూలము గాఁగలవి) లనియు, నాధిభౌతికసుఖవాద సంబంధము లనియు, నిషేధించిన యాసురమతము నందలి విషయముల నెత్తిచెప్పుటయే యీ మతమును ఖండించుట యగును. ఇతరులేమైనను నరే! ఒక్క స్వీయమగు విషయోపభోగ సుఖమే పరమపురుషార్థమని యెన్ని నీతిమత్త (నీతి గలిగియుండుట) కును, ధర్మమునకును గలవరపాటు కలుగఁజేయు నీ యాధిభౌతిక వాదుల యత్యంత నీచ(కనిష్ఠ) మార్గమును కర్మయోగశాస్త్రకర్తలగు సర్వాగ్రంథకారులును, సామాన్యమనుజులును, మిక్కిలి నీతివిరుద్ధ మనియు, త్యాజ్య మనియు, గర్హ్య మనియు సిద్ధాంతపఱిచిరి. వేయేల? ఈ మార్గము నీతిశాస్త్ర మని కాని, నీతి వివేచన మని కాని పేర్కొనుటకును, బాత్రము కానేరదు. కావున నీ విషయమై విశేష విచారముఁ జేయుచుఁ గాలక్షేపముఁ జేయక, ఆధిభౌతికసుఖవాదు లలో రెండవ వర్గమును విమర్శింతము.

ఒక స్వార్థపరత్వమే కాని, లేక, యొక్క కుక్షింభరత్వమే కాని యీ జగత్తున సాగదు. కారణ మేమన— ఆధిభౌతికసుఖము ప్రతి మనుజునకు నిష్టమైనను దన సుఖ మితరుల సుఖోపభోగముల కడ్డము వచ్చిన యెడల, వారు మన సుఖమున కడ్డుచేయకమాన రనునది ప్రత్యక్షానుభవముననే యున్నది. దానంజేసియే, యితరులగు పలువు రాధిభౌతిక పండితులు, స్వీయమగు సుఖము నైనను, స్వార్థము నైనను సాధింపవలసినప్పుడు లోకుల కాత్మౌపమ్యము (అనఁగా— తనతోఁ బోలిక) గా నవకాశము నీయనినాఁడు తమకు సుఖము లభించుట

శక్యము కానేరదు. కావున స్వసుఖము కొఱకే దూర మాలోచించి పరుల సుఖమువైపునకు సైతము మనము మన దృష్టిఁ బ్రబలింపఁ జేయవలసివచ్చునని వచించుచున్నారు. ఈ యాధిభౌతిక వాదులను నేను రెండవవర్గములో గణనఁ జేయుచున్నాను. ఇచ్చోనుండియే నీతియొక్క యాధిభౌతిక మైన యుక్తికి నిజమైన యారంభమని చెప్పినఁ జెప్పవచ్చును. కారణ మేమన- సమాజమును బాగుపఱచు కొనుట కాధారభూతము లగు నీతినియమములు (అవఁగా- నిబంధనలు-కట్టుబాటులు) అక్కరయే లేదని చార్వాకులవలెఁ జెప్పక, తద్విరుద్ధముగనే, యవి యందఱచే నేల పాటింపఁబడవలయు ననువిషయమునకు స్వీయదృష్టిచేఁ గారణముఁ జెప్పుట కీ వర్గములోని వారు ప్రయత్నించిరి. "జగత్తున నహింసాధర్మ మెటు లుత్పన్న మైనది? మఱియు లోకులు దాని నేల పాలించిరి?" అను సూక్ష్మ విచారముఁ జేయుటకు, నాచే లోకులు హింసింపఁ బడినయెడల లోకులచే నేను హింసింపఁబడుదు ననియు, నా సుఖమే నా సుఖోపభోగమున కంతరాయమగు ననియు నుండు నీ స్వార్థపరత్వమూలక మగు భీతి తప్ప మఱియొక మూలకారణ మేమియుఁ గలుగదనియుఁ గన్పట్టుచున్నది. మఱియు నహింసా ధర్మానుసారముగనే యితర ధర్మము లన్నియు నీ స్వార్థపరత్వ మను కారణముచేతనే ప్రచారము లోనికి వచ్చినవి. "మనము స్వదుఃఖానుభవ సమయమునం దేడ్చుచున్నారము. మఱి యన్యుల కది తటస్థించిన దయఁజెందుదుము. ఏల యనిన మనకును మున్ముం దిట్టి దురవస్థ రాఁగల దను భీతిచే- అనఁగా- మనకు స్వయముగ రాఁ బోవు దుఃఖము తలఁపునకు వచ్చిన హేతువుచే; పరోపకారము, ఔదార్యము, దయ, మాయ, కృతజ్ఞత, నమ్రత, మైత్రి, మొదలగు నే గుణములనైనను జూచుట తోడనే లోకులహితముకొఱకు నేవి సాధనము లని తెలియవచ్చునో, వానిని మూలమునుండి క్రమముగఁ జూచినయెడలఁ దనదియేయగు

సుఖమునకు, లేక శ్రేయదుఃఖనివారణమునకు, అవి సాధనములు గనే కన్పట్టెడిని. మనకుఁ బనివడిన యెడల పరులు మనకు సాహాయ్యముఁ జేయవలయు ననుఁ లోపల నుండు నూహచే నితరుల కెవరికైనను దానమును, సాహాయ్యము నొనర్చు చున్నాము. మఱియు నితరులు తన్ను దయతోఁ జూడవలయు ననుఁ తలంపుతోనే తా నితరులయందు దయఁ జూపుచున్నాఁడు. ఏమియు లేక పోయినను లోకులచేఁ దాను మంచివాఁడని శ్లాఘింపఁ బడవలయు ననుఁ స్వార్థమూలకత్వహేతువైనను, నతని హృదయమం దుండును. 'పరోపకార-పరార్థము' లను శబ్దములు కేవల భ్రాంతిమూలకము లైనవే. మఱియు స్వార్థ మన- స్వీయమగు సుఖప్రాప్తి గాని, దుఃఖనివారణము గాని యగును. తల్లి తన బిడ్డకుఁ బాలిచ్చుటకుఁ గారణము, బిడ్డపైఁ బ్రేమ కానేరదు. మఱేమన- ఆమెకుఁ గలుగు పయోధర పీడయే ఆ దుఃఖనివృత్తి కొఱకైనను, లేక, భవిష్యత్కాలమున బిడ్డలు తన్నుఁ బ్రేమించి తనకు సుఖము నిత్తురని యైనను, ఆమె స్వార్థసాధకోపాయమును జూచుకొనుచున్నది" అని రెండవ వర్గములోని పీరి యుద్దేశము. తన సుఖముకొఱకే కానిండు. దూరదృష్టి కలిగి యితరులకు సైతము సుఖ మగు నట్లుగా నుండు నీతిధర్మము పాలింపఁ బడవలయు నని యీ మార్గమునందున్నవా రొప్పుకొనుటయే యీ మతమునకును చార్వాకమతమునకును గల గొప్ప భేదము. అయినను "మనుజుఁడనఁగా- కేవలము విషయసుఖ రూప మగు స్వార్థ మనెడు మూసలో నుండి వెలువడిన బొమ్మ" యని వచించు చార్వాకమతమే దీనిలోని ముఖ్యోద్దేశము. ఇంగ్లాండులో 'హాబ్సు' అనునాతఁడును, ఫ్రాన్సులో 'హెల్ వే సియస్' అను నాతఁడును నీ మతమును ప్రతిపాదించిరి. అయిన నీ మతములోని వారు 'ఇంగ్లాండు' లోఁ గాని, మఱియొకదేశమునఁ గాని విశేషముగ లేరు. 'హాబ్సు' యొక్క నీతిధర్మమునందలి యుక్తి ప్రసిద్ధమైన

పిదప 'బట్లరు'* వంటి విద్వాంసులు దానిని ఖండించి "మొత్తము మీఁద మనుజత్వము, పొట్టపోసికొనుటకు మాత్రమే కానేరదు; స్వార్థానుసారముగనే భూతదయ, ప్రేమ, కృతజ్ఞత మొదలగు సద్గుణములు సైతము మనుజులయందు పుట్టినదిమొదలు, కొంచెమో గొప్పో యుండియున్న" వని సిద్ధాన్తపఱచిరి. కావున నే వ్యవహార ముల నైన, నే కర్మలనైన, నీతిశాస్త్రానుసారముగ విచారించునపుడు, కేవలస్వార్థమువైపునకుఁ గాని, లేక, దూరదర్శి స్వార్థమువైపునకు గాని చూడక, స్వార్థపరార్థము లనెడి మనుష్య స్వభావమునందలి నైసర్గికప్రవృత్తుల రెంటియందును దృష్టినుంచి తీరవలయును. ఱఁడు పెద్దపులివంటి క్రూరజంతు వైనను దన శిశువుయొక్క సంరక్షణకై ప్రాణముల నిచ్చుటకు సిద్ధపడుచుండఁగ, మనుజులయందుఁ ప్రేమ యుఁ బరోపకారబుద్ధియు ననెడు గుణములు కేవలము స్వార్థమూల ములఁగనే పుట్టిన వని వచించుట వ్యర్థము. కేవల దూరదర్శిని యగు స్వార్థబుద్ధిచే ధర్మాధర్మములను పరీక్షించుట శాస్త్రదృష్టికి సైతము యోగ్యము కానేరదని సిద్ధ మగును. ఒక సంసారమందు మాత్రమే వ్యాపించి యుండుటవలన నపరిశుద్ధ మగు నంతఃకరణము గలవాఁడు జగత్తున నితరుల నిమిత్తమని చెప్పుచుఁ జేయు పనుల నన్నిటి ననేక సమయములందుఁ దన హితముకొఱకే చెయుచున్నాఁ డను విష యము ప్రాచీను లగు మన పండితు లెఱింగియే యున్నారు. "సానూ రాశీ రడే నూన, భావ అంతరీ చా భిన్న"– అత్తకొఱకుఁ గోడ లేడ్చును. అంతరభావము భిన్నము (గా. 2వ8వ. 2) అని తుకోబా వచించెను. కావున నెందఱో పండితులు 'హెల్‌వేసియస్' గారికన్నను

---

* 'హాబ్స్' యొక్క మత మాతని Leviathan అను గ్రంథమునందుఁ జెప్పఁబడియున్నది; 'బట్లరు' మతము నాతని Sermons on Human Nature అను గ్రంథమునం దున్నది, 'హెల్‌వేసియస్' యొక్క గ్రంథమందలి సారాంశము– 'మోర్లే' యనువానిచే, తన Diderot అను పుస్తకమునైనను గ్రంథమునందు (Vol. II. Chap. V.) వ్రాయఁబడి యున్నది.

మిక్కిలి యెక్కువగ నాలోచించి రని తేలుచున్నది. ఉదాహరణ మే మన— మనుజుల సమస్తము లగు (అనఁగా: స్వార్థములును బరార్థ ములు నగు) ప్రవర్తనలు దోషమయములుగ నున్నవి. "ప్రవర్తనా లక్షణో దోషః" (గౌ. సూ. 1.1.18) అను గౌతమన్యాయసూత్రము యొక్క యాధారమున బ్రహ్మసూత్రభాష్యములో శ్రీ శంకరాచార్యుల వారు వివరించిన (వే. సూ. శాం. భా. 2.2.8) దానిమీఁద వ్యాఖ్యా నముఁ జేయుచు శ్రీ యానందగిరిస్వామి "మన హృదయముల యందు కారుణ్యవృత్తి పుట్టుటవలన, మనకు రాఁబోవు దుఃఖము యొక్క నివారణకొఱకు మనము లోకులమీఁద దయఁ జూపుచు పరోపకారమును జేయుచునే యున్నాము" అని వ్రాసెను. ఆనంద గిరియొక్క యీ యుక్తి తఱచుగ మన దేశమునందున్న సర్వసన్యాస మార్గీయ గ్రంథములలోఁ దప్పక యుండుటచే సర్వకర్మములను స్వార్థపరములు కావున త్యాజ్యము లగు నను నీ సంగతియే దాని నుండి ముఖ్యముగ సిద్ధముఁ జేయుట కర్వాచీనులు ప్రయత్నముఁ జేయుచున్నారు; కాని బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుల వారికిని, వారి భార్యయగు మైత్రేయికిని రెండు స్థలములయందు జరిగిన సంవాదములో, (బృ. 2.4; 4.5) ఈ కోటీక్రమమే చమత్కార ముగ మఱియొక తీరున నున్నది. "నా కమృతత్వప్రాప్తి యెటు లగు?" నని మైత్రేయి యడుగ 'ఓ మైత్రేయీ! భార్యకు భర్త ప్రియుఁ డగుట యనునది భర్తకొఱకుఁ గానేరదు; తనయొక్క ప్రీతి కొఱకే. ఇటులే పుత్రుఁడు పుత్రునికొఱకుఁ దండ్రి కిష్టుఁడు కానే రఁడు. తండ్రి తన యుపకారముకొఱ కతనిం బ్రేమించుచున్నాఁడు.*

* What say you of natural affection? Is that also a species of self-love? Yes; All is self-love. Your children are loved only because they are yours. Your friend for a like reason. And your country engages you only so far as it has a connection with yourself" అని 'హ్యామ్' అను పఠఁ డీ కోటీక్రమమునే Of the Dignity or Meanness of Human Nature అను గ్రంథమున వ్రాసెను; కాని హ్యామ్ యొక్క స్వమత మీ మతము కన్న భిన్నము.

ద్రవ్యము, పశువులు మొదలగు నితర వస్తువులును నిటులే. "ఆత్మన స్తు కామాయ సర్వం ప్రియం భవతి"– ఆత్మప్రీత్యర్థమై సర్వ వస్తువులు తనకుఁ ప్రియ మగుచున్నవి. మఱియు నమస్త ప్రేమలు నీతీరుననే యాత్మమూలకము లయినచో, ఆత్మ యనఁగా (తా ననఁగా) నెవ రను విషయమును ప్రథమమున విచారణచేయ నక్కఱ లేదా? అని యడిగిరి. కావుననే "ఆత్మావా అరే! ద్రష్టవ్యశ్శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యఃⅱ- ఆత్మ యే వస్తువో (మొదట) చూడు! వినుⅰ దానియొక్క మననధ్యానములఁ జేయుము అని యాజ్ఞవల్క్యులు చివర కుపదేశించిరి. ఈ యుపదేశానుసారముగ నాత్మయొక్క నిజ మగు స్వరూప మొక పర్యాయ మెఱింగి పిదప జగ త్తంతయు నాత్మ మయ మగుటచే స్వార్థపరార్థములకు భేదమే లేనటులు మనస్సునకు నిశ్చయ మగును. యాజ్ఞవల్క్యునియొక్క యీ యుక్తివాదములచే నా యిరువు రొనర్చిన యనుమానము లొకదాని కొకటి విరుద్ధము లుగ నున్నవను విషయ మెల్లరకును సహజముగఁ దోఁచును. 'హాబ్సు' స్వార్థమునకే ప్రాధాన్యము నిచ్చుచున్నాఁడు. మఱియు సర్వము లగు పదార్థములను దూరదర్శియగువాఁడు స్వార్థములే యని తలఁచి స్వార్థము తప్ప నీ జగత్తున రెండవ దేమియు లేదని వక్కాణించు చున్నాఁడు. ఇఁక యాజ్ఞవల్క్యుఁడు స్వార్థ మను శబ్దమునందున్న 'స్వ' (తనది) యను పదముయొక్క యాధారమున నధ్యాత్మ దృష్టితోఁ దన యాత్మయందే సర్వభూతములకును, సర్వభూతముల యందుఁ దన యాత్మకును నవిరోధముగ నెటుల సమావేశ మగునను విషయమును జూపి, స్వార్థపరార్థముల నడుమఁ గల భేదమును భాసింపఁ జేయు ద్వైతముయొక్క బంధమునే సమూలముగఁ బెఱికి పాఱవైచుచున్నాఁడు. సన్యానమార్గమునకును, యాజ్ఞవల్క్యుని పూర్వోక్తమతమునకును గల విషయములో మున్ముందు విశేషవిచా రము సేయఁబడును. "సామాన్య మనుజుల ప్రవృత్తి స్వార్థపరము (అనఁగాఃⅱ ఆత్మ సుఖపరము)గ నుండును" అను నొక విషయముననే

కొంచె మెక్కువగ గౌరవించియైనను, అదియ యన్ని విధముల నిరపవాదముగ నున్నదని యెఱింగి యైనను, మన దేశము నందున్న ప్రాచీన గ్రంథకారులు దాని నాధారముగ నొనర్చుకొని, 'హాబ్సు' నకు విరుద్ధమగు నితరానుమానముల నెటు లొనర్చిరో తెలియఁ జేయుటకుఁ గావలసినంతవఱకే యాజ్ఞవల్క్యాదుల మత మిచ్చో నిరూపింపఁబడినది.

ఇంగ్లీషు గ్రంథకారుఁడగు 'హాబ్సు'ను, ప్రెంచి పండితుఁడగు 'హెల్వేసియ'న్సును ప్రతిపాదించిన విధముగ, మనుష్యస్వభావము బొత్తిగ స్వార్థపరము (అనఁగా తమోగుణ సంబంధము గలది కాని, రాక్షసధర్మము గలది కాని) కానేరదు. కావున స్వార్థముతోఁ గూడ పరోపకారబుద్ధి యను సాత్త్వికమనోవృత్తియు, మనుజుల హృదయ మునందుఁ బుట్టుకతోడనే స్వతంత్రముగ నిర్మిత మయిన దనియుఁ, బరోపకార మనఁగా, కేవలము దూరదర్శి స్వార్థము గా దనియు సిద్ధ మయిన పిదప, "స్వార్థ మనఁగ స్వసుఖము, పరార్థ మనఁగా నితరుల యొక్క సుఖము" అను నీ రెండు సిద్ధాన్తముల యందును సమాన మగు దృష్టి యుండుట వలనఁ గార్యాకార్యముల నిర్ణయమును జేయు శాస్త్రముయొక్క రచన ప్రాప్త మగుచున్నది. ఇది యాధిభౌతిక వాదులయొక్క తృతీయవర్గము. అయినను, స్వార్థ మయిన నేమి? పరార్థ మైన నేమి? ఈ రెండును నైహికసుఖవాచకములే యగును. "ఐహికసుఖము తప్ప మఱేమియు లేదు" అను నీ యాధిభౌతిక మత మీ పక్షమునందు నుస్థిరత వహించియుండును. "స్వార్థబుద్ధ్యనుసార ముగఁ బరార్థబుద్ధియు నైవర్గిక మని భావించుటచే నీతిని విచారించు నపుడు, స్వార్థానుసారముగనే పరార్థమును సైతము వీక్షించుట మనకుఁ గర్తవ్యమై యున్న"దని యీ పథమునందున్న వా రను కొందు రనునది మాత్రమే యీ రెండు మార్గములకుఁ గల భేదము. "సామాన్యముగ స్వార్థపరార్థములలో విరోధము పుట్టదు. అందుచే

మనుజుఁ డొనర్చు కర్మయంతయు తఱుగఁ సమాజమునకును హిత మే యగు చుండును. కారణ మేమన: సమాజ మనఁగా, ననేకుల సమూహ మగుటచే నందుఁ జేరిన ప్రతిమానవుఁడు నితరులకు నష్టము రానీయకుండఁ దన లాభమును బొందుటను బాటించిన యెడల, మొత్తముమీఁద సమాజమునకుఁ గల్యాణమే యగును. ఇందుకొఱకై స్వసుఖమును సైతము పాటించుకొనుచు నే మాత్రమైన లోకహిత మొనరించుచు వచ్చినయెడల నటు లొనరించుట యతనికిఁ గర్తవ్య మగును" అని యీ మార్గమం దున్నవారు సిద్ధాన్తపఱిచిరి. కాని యీ పక్షావలంబకులు, పరార్థముయొక్క శ్రేష్ఠత్వము నంగీకరింపక ప్రతిసమయమందును "స్వబుద్ధ్యనుసారముగనే, స్వార్థము శ్రేష్ఠ మయినదా? పరార్థమే శ్రేష్ఠ మయినదా? యను విచారణఁ జేయ వలయు" నని చెప్పుచుండుటచే, స్వార్థమునకును బరార్థమునకును విరోధము వచ్చినప్పుడు లోకుల సుఖమునకై తన సుఖ మెంతవఱకుఁ ద్యాగముఁ జేయవలయునో నిర్ణయించుట యను కష్టమునకు లోఁ బడక పలుమాఱులు స్వార్థమువైపునకే మనుజుఁడు ప్రవర్తించుటకు వీలుండును. ఏలన: స్వార్థ పరార్థములు రెండును సమానముగఁ బ్రబలము లని యెన్నఁబడినచో, సత్యమునకై ప్రాణముల నిచ్చుట గాని, రాజ్యమును గోలుపోవుట గాని యుండక పోవుటయే గాక, "ద్రవ్యరూపకముగ విశేష నష్టము గలుగు నెడల నది నహింపఁబడ వలయునా? యక్కఱలేదా?" యను విషయ మీ మార్గమునం దున్నవారి మతమున నిర్ణీతము గానేరదు. ఒకానొక యుదారునిచేఁ బరార్థమై తన ప్రాణము లీయఁబడిన యెడల నొకప్పు డీ మార్గములో నుండువా రాతని స్తుతి యొనరింతురు; కాని తమ కట్టి సమయము నమకూరెనేని స్వార్థ పరార్థము లను నీ రెండు పక్షములందును ప్రవర్తింపఁ జూచు పండితునకు స్వార్థమునందే మిక్కిలి పట్టుదలయుండు నని వేఱుఁగ జెప్ప నక్కఱ యుండదు. 'హాబ్స్' మతానుసారముగఁ

బరార్థ మనునది స్వార్థముయొక్కయే దూరదర్శిప్రకార మని యంగీక రింపక, స్వార్థపరార్థముల రెంటిని తక్కెడ సిబ్బులలో వైచి తూచి వాని తారతమ్యము ననుసరించి, స్వార్థమునే మిక్కిలి చాతుర్యముగ స్థిరపఱుచుచున్నా మని యెఱుంగుటం జేసి యీ మార్గములో నున్న వారు తమ మార్గ ముదాత్త మో, లేక, నిపుణమో యయినచో, 'స్వార్థము (కాని, ఎటులైనను స్వార్థమే!)' అని నామం బిడి దాని మహత్త్వమునే కొనియాడుచుందురు*. కాని, భర్తృహరి—

ఏతే సత్పురుషాः పరార్థఘటకా స్స్వార్థా న్పరిత్యజ్య యే
సామాన్యాస్తు పరార్థ ముద్యమభృత స్స్వార్థావిరోధేన యే
తేఽమీ మానవరాక్షసాः పరహితం స్వార్థాయ నిఘ్నన్తి యే
యే తు ఘ్నన్తి నిరర్థకం పరహితం తే కే న జానీమహే.

(నీతి. శత. 74)

— తమ లాభమును వదలి లోకుల హిత మొనర్చువారు నత్యమయిన సత్పురుషు లని వచింపవలయును. స్వార్థమును విడువకయే, లోకుల విషయమయి ప్రయత్నించువారు సామాన్య లగుదురు. మఱియు స్వలాభమునకై లోకులకు నష్టము గలుగఁ జేయువారు మనుజులు గా రనియు రాక్షసు లని యెఱుంగవలయును. కాని యందఱికంటెను జివరవారల (అనగా: లోకహితమును నిరర్థకముగ నష్టపఱుచువారల) కేమని పేరిడవలయునో మాకుఁ దెలియదు అని వక్రాణించుచున్నాఁడు. ఇటులే రాజధర్మము యొక్క యుత్తమస్థితిని వర్ణించుచుఁ గాళిదాసు—

స్వసుఖనిరభిలాషः ఖిద్యసే లోకహేతోः
ప్రతిదిన మథ వా తే వృత్తి రేవం విధైవ.

(శాకుం. 5.8)

---

* ఇంగ్లీషులో దీనిని enlightened self-interest అని చెప్పుదురు. దీనిలో Enlightened అను పదమునకు 'ఉదాత్త' మని లేక, 'శహాబా' (నిపుణ) యని భాషావ్యవహారించిరి.

– స్వీయమైన సుఖమును గమనింపకయే నీవు ప్రతిదినమును లోక హితార్థమై కష్టమును జేయుచున్నావు. ఇటులన నేల? నీ వృత్తి, లేక, నీ వ్యాపారము, ఇటులే యున్న "దని చెప్పెను. కర్మయోగశాస్త్ర ములో స్వార్థ పరార్థములను రెండు తత్త్వములను స్వీకరించి వాని తారతమ్యముచే ధర్మాధర్మములఁ గాని, కర్మాకర్మములఁ గాని నిర్ణ యింపవలయునని 'భర్తృహరి-కాళిదాసుల' యభిప్రాయము కానేరదు; అయినను పరార్థమై స్వార్థమును వదలివేయు వారలకు నా కాళిదాసభర్తృహరులచే నీయఁబడియుండు నగ్రస్థానమే, నీతి దృష్టితోఁ జూచినను న్యాయ్యముగాఁ గన్పట్టుచున్నది. కాత్త్విక దృష్టికిఁ (అనఁగా- ఉన్నది యున్నటుల విచారించునమయమున) బరార్థము శ్రేష్ఠమైనను, శుద్ధమగు నీతియొక్క పరమావధి యేదియో తెలియకమున్ను సామాన్యవ్యవహారమున 'సామాన్య మానవుఁ' డెటుల వ్యవహరింప వలసినదియు మేము నిర్ణయించు విషయము కావున నిపుణస్వార్థమునకు మే మిచ్చునట్టి యగ్రస్థానమే వ్యావ హారిక దృష్టికి యోగ్యమైనది.* ఈ మార్గము నవలంబించువార లీ కాళిదాస భర్తృహరుల వాదముపై యుక్తిఁ జెప్పుదురు. కాని మన మతానుసార మీ యుక్తివాదమం దేమియు లాభము కాన్పింపదు. బజారులో నుపయోగములో నున్న తూనికయుఁ గొలఁతయు నెప్పుడును గొంచె మెచ్చుతగ్గులై యుండును. ఇటులె రాజస్థానము లం దెల్లరకును బ్రమాణములుగ స్థిరపఱుపఁ బడిన తూనికలును, గొలఁతలును సైతము కొంచె మెచ్చుతగ్గులై యుండిన మన మా విషయములో నధికారులను దూషింపమా! అటులే కర్మయోగశాస్త్ర

* Sidgwick's Methods of Ethics Book I. Chap. II. § 2, pp. 18-29; also Book IV Chap. IV. § 3 p. 474. ఈ మూఁడవమార్గము పిఱ్ఱి తుఁచేఁ గల్పింపఁబడినది కానేరదు. ఇఁక నేమన-సామాన్యముగ మఱికొందఱు ఆంగ్లేయు లనేకు లీ మతమునే యవలంబించుటచే దానికి Common-sense morality అనియును బేరు గలదు.

మున నే మాత్రము లోప మున్నను నొప్పుకొనఁ గూడదు. నీతి ధర్మముయొక్క నిత్యశుద్ధ పూర్ణస్వరూపమును శాస్త్రీయముగ నిర్ణయింపఁబడని యెడల నది నిష్ఫలమని చెప్పవలసి వచ్చును. 'నిపుణమైన స్వార్థము' సామాన్య మనుష్యులయొక్క మార్గమని 'సిజ్విక్' వచించిన విషయ మనత్యము కానేరదు. భర్తృహరియు నా విషయమునే వచించుచున్నాఁడు; కాని పరమావధి యగు 'నీతిమత్త' (నీతి కలిగియుండుట) గల యీ సామాన్యజనులమతము శోధింపఁబడిన యెడల 'సిజ్విక్కు' 'నిపుణస్వార్థము' గొప్పదనుట పొరపాటని తేలును. కాన నిష్కలంకమైన నీతియొక్క గాని, సత్పురుషాచరణములయొక్క గాని మార్గ మీ సామాన్యకుక్షింభరుల మార్గముకంటె వేఱుగనుండు నని సామాన్య మనుజులకు సైతము దెలియును. మఱియు నీ యుద్దేశమే పై శ్లోకములో భర్తృహరిచే వర్ణితమైనది.

(1) కేవలస్వార్థి, (2) దూరదర్శిస్వార్థి, (3) ఉభయవాది (అనఁగా- ఉచ్చస్వార్థియు), అని యీ విధమున నాధిభౌతిక సుఖవాదులయొక్క మార్గత్రయము నింత పర్యంతము విచారించి యందు ముఖ్యదోషమును వక్కాఁడించితిమి; కాని యింతమాత్రముచే నాధిభౌతికమార్గము లన్నియు సమాప్తములు కానేరవు. "ఒక్కని సుఖము వైపునకే చూడక, సర్వజనులయొక్కయు నాధిభౌతికసుఖదుఃఖముల యందలి తారతమ్యములను విచారించియే, నీతియందలి కార్యాకార్యములను నిర్ణయింపవలయు" నను సాత్త్వికులగు నాధిభౌతికపండితుల మార్గము పీని యన్నిటికన్న చిట్టచివరిది శ్రేష్ఠమైనదియునై యున్నది. * ఒక్క సమయముననే, యొక కార్యముచేతనే, సమాజములో నున్న

* బెంథం. మిల్లు మొదలగు వండితు లీ మార్గమునకుఁ బ్రచారములుగ నున్నారు. Greatest good of the greatest number అను దానిని "పుష్కలజనులకు పుష్కలసుఖము (ఎక్కువమంది కెక్కువసుఖము)" అని తర్జుమా చేసినాము.

వారికందఱకును గాని, జగత్తునందుండు నెల్లవారికిఁగాని సుఖమును బ్రాపింపఁజేయుట శక్యము కానేరదు. ఒకరికి సుఖదాయకమని తోఁచినవిషయము మఱి యొకరికి దుఃఖకర మగును; కాని గ్రుడ్లగూబలకు వెలుతురిష్టము కాకపోయినంతమాత్రమునఁ ఆ వెలుతురు పనికి మాలినదని యెవ్వారును నుడువమిచేఁ, గొందఱకు మాత్రము లాభకరము కానివిషయ మెవ్వరికిని హితమును గలుగఁజేయునది కాదని కర్మయోగశాస్త్రము సైతము వక్కాణింపదు. మఱియు నీ కారణము చేతనే "లోకులయందఱియొక్క సుఖ" మనుదానికే "ఎక్కువ మంది కెక్కువ సుఖము" అని యిప్పు డర్థము సేయవలసి వచ్చుచున్నది. సారాంశ మేమనఁగా- "ఎక్కువ సంఖ్యమున కెక్కువ సుఖము దేనిచేఁ గలుగుచుండునో యదియే నీతిదృష్టికి న్యాయ్యమును గ్రాహ్యము నని మన మెఱుంగ నగు. మఱియు నీ తీరునఁ బ్రవర్తించుటయే యీ జగత్తున నందఱను సత్యముగఁ జేయఁదగినపని" యని యీ మతమునందలి యభిప్రాయము. ఆధిభౌతిక సుఖవాదుల యొక్క యీ తత్త్వ మాధ్యాత్మిక పథమునకు సైత మిష్టమే. వేయేల? ఈ సిద్ధాన్తము నాధ్యాత్మికవాదులే బహుకాలము క్రింద శోధించి యేర్పఱిచిరి. ఆధిభౌతికవాదులిప్పుడు దానిని మఱియొక విధముగ నుపయోగించిరి. దీనినే యీ రెండుమతములలోని భేదమని చెప్పినను జెప్పవచ్చును. "సత్పురుషుల యవతారము లోకులకు శుభమునకే కావున వారు తమ శరీరాయాసమును సైతము సరకుసేయక పరోపకారమునే చేయుచుందురు" అని తుకోబా చెప్పినటుల యీ విషయ మెవరికిని చెప్పనక్కఱలేదు. ఫలితార్థ మేమన- ఈ సిద్ధాన్తము సత్యమైనదని కాని యోగ్యమైనదని కాని యెప్పుకొననివారు లేరు. పూర్ణుడును యోగయుక్తుడు (అనఁగా- కర్మయోగయుక్తుడు) నగు జ్ఞానియొక్క లక్షణముల నుడువుచు, "సర్వభూతహితే రతాఃస," - సర్వభూతములకును గల్యాణమును చేయుటలో వారు నిమగ్నులై యుందురు అని భగవద్గీతలోనే రెండు పర్యాయములు స్పష్టముగఁ

జెప్పఁ బడి యున్నది (గీ. 5.25; 12.4). ధర్మాధర్మముల యొక్క నిర్ణయముకొఱకు సైతము మన శాస్త్రకారు లీ సిద్ధాన్తము నంగీకరించు చున్నారని రెండవప్రకరణములో వ్రాయఁబడిన.. "యద్భూతహిత మత్యంతం తత్సత్య మితి ధారణా" అను మహాభారత వచనముచే స్పష్ట మగును; కాని మన శాస్త్రకారులు వచించినటుల- సర్వభూత హితమునే, జ్ఞానియొక్క వర్తనకు సంబంధించిన బాహ్యలక్షణముగ నిర్ణయించి, ధర్మాధర్మ నిర్ణయమునకై దాని నా యా సందర్భముల యందు సాధారణ లక్షణముగా నుపయోగించుటయు; నీతిమత్తకు నిదియే ముఖ్యమగు సర్వస్వ మని యంగీకరించి యితర మగు నే విషయమును విచారింపక, కేవల మీ పుట్టకీటు మీఁదనే నీతిశాస్త్ర సంబంధమగు దృఢభవనమును నిర్మించుటయు నను నీ రెండు విషయములును మిక్కిలి వేర్వేఱుగ నున్నవి. ఆధిభౌతిక పండితులు రెండవ మార్గమును స్వీకరించి నీతిశాస్త్రమున కధ్యాత్మవిద్యతో సంబంధ మేమియును లేదని వక్కాణించెదరు. కావున వారు వచించున దెంతవఱకు సయుక్తికముగ నున్నదో ప్రస్తుతము మనము విచారణ చేయవలయును. 'సుఖము', 'హితము' అను నీ రెండు శబ్దములకు నర్థములో చాల భేదము కలదు. ప్రకృతమునం దా భేదము దూరముగ నుంచినను "సర్వభూతహిత" మనఁగా "ఎక్కువమంది కెక్కువ సుఖము" అని యర్థముఁ జెప్పినను, కార్యాకార్యముల నిర్ణయము నొనర్చుటలోఁ గేవల మీ సిద్ధాన్తమే యుపయోగింపఁ బడినచో ననేకములగు ననందర్భములు గలుగునని తోఁచుచున్నది. ఈ సిద్ధాన్తము నాధిభౌతికవాది యర్జునున కుపదేశముఁ జేయునెడల, "భారతయుద్ధములో నీకు జయము గలుగుటవలన నెక్కువ ప్రజ కెక్కువ సుఖ మగునటుల నుండె నేని భీష్ముని జంపియైన నీవు యుద్ధముఁజేయక తప్ప" దని యర్జుననకుఁ జెప్పనా? చెప్పఁడా? ఈ యుపదేశము, పైకి సులభముగఁ గన్పట్టుచున్నను, గొంత విమర్శించిన దానిలోనుండు ననంపూర్ణతయుఁ బ్రతిబంధకములును

దెలియును. అనేకు లనఁగా నెందఱు? పాండవుల బల మేడక్షౌహిణులును, కౌరవుల బలము పదునొకం డక్షౌహిణులును గావున, పాండవుల కపజయ మైనచోఁ గౌరవుల పదునొకం డక్షౌహిణులకు సుఖమగు నను నీ యుక్తివాదముచే పాండవులపక్షము న్యాయ్యముగ నున్నదని చెప్పవచ్చునా? భారతయుద్ధ మనియే చెప్ప నేల? అనేకములగు నితరనందర్భములలో నైతము నీతిమత్తా (నీతిగలిగి యుండుట) నిర్ణయము బొత్తిగ జనసంఖ్యను బట్టియే చేయుట పారపాటు. లక్షమంది దుర్జనులకు సుఖము గలుగఁ జేయుదానికంటె నొక్కని కైనను సజ్జనునకు సుఖము గలుగఁజేయునదియే నిజమయిన సత్కృత్య మని యెల్ల రెఱుంగుదురు. ఇటు లంద ఱొప్పికొనుటచే నొక్క సజ్జనుని సుఖము లక్షమంది దుర్జనుల సుఖముకంటె నెక్కువది యగునని తేలినది. కావున నీ సిద్ధాన్తాను సారముగ 'ననేకుల కధిక బాహ్యసుఖ మనునదియే నీతిమత్తాపరీక్షకు సాధన' మనెడు ప్రథమ సిద్ధాన్తము నిలువఁజాలదు. కావున లోకుల సంఖ్యయొక్క హెచ్చు తగ్గులను బట్టి యుండుటకును, నీతిమత్తకును, నిత్యసంబంధ ముండుటకు వీలులేదని చెప్పవలసి వచ్చును. మఱియు సామాన్యముగ నందఱకు నప్పు డప్పుడు సుఖావహముగ నుండు విషయమే దూరదృష్టి గలవారికి, పరిణామమునం దందఱకు ననుఖమునే కలుగఁ జేయునదిగ నున్నదని తోఁచునను సంశయమును సైతము గుర్తుంచు కొనవలయును. ఉదాహరణమునకై, 'సోక్రటీసు' యొక్కయు, 'ఏసుక్రీస్తు' యొక్కయు విషయమును వివరింతము. వీరిరువురును తమ తమ మతముల ననుసరించిన యెడల చిట్టచివరకు శుభము గలుగుననియే తమ దేశబంధువులకు నుపదేశమును చేయుచు వచ్చిరి కాని, వారి దేశబాంధవులు వారిని 'నవాజశత్రువులను' గా నిశ్చయించి దేహాన్తమగు ప్రాయశ్చిత్తము వారికి విధించి యొనరించిరి. 'అనేకుల కధిక సుఖ' మనెడి యీ సిద్ధాన్తము ననుసరించియే యిప్పటివారును, వారికి ప్రవర్తకులగువారును ప్రవర్తించి

యున్నారు; కాని యా కాలపు సామాన్యజనులయొక్క వర్తనము న్యాయ్యముగ నున్నదని యిప్పుడు మనము వచింపము. సారాంశ మేమన- 'అనేకుల కధికసుఖ' మనునదియే నీతియొక్క మూలతత్త్వ మని క్షణమాత్రము మన మొప్పుకొనినను, దానిచే "లక్షమందికి సుఖము దేనివలన కలుగును? దానిని నిర్ణయించు టెట్లు? దాని నెవరు చేయవలయును?" అను నీ ప్రశ్నముల కేమియు సదుత్తర ముల నిచ్చుట సాధ్యము కానేరదు. సామాన్యముగ నీ ప్రశ్నలకు సమాధానము నిర్ణయించుట యను కార్యము తమ తమ సందర్భము లంబట్టి యనేకుల కధికసుఖము గలుగఁ జేయవలసివచ్చినవారికి సులభము; కాని సామాన్య విషయములలో నంత ప్రయత్న మవ సరము లేదు. మఱియు మనోవ్యగ్రతకుఁ గారణములగు కొన్ని సందర్భములలో సామాన్యజనులకు, 'మన సుఖ మెందులో నున్న' దని నిర్దోషముగ విచారణ సేయఁదగినంత శక్తి లేకపోవుటచే, మేఁకలఁ గాయుమని పులి కొప్పఁ జెప్పినటుల, 'అనేకుల కధిక సుఖ' మనునట్టి నీతిసిద్ధాన్తమునే యీ యనధికారులగు లోకుల కుపదేశించి నచోఁ దుద కేమి యుపద్రవము సంభవించునో యనుకొనవలసి వచ్చునని 'సోక్రటీను-ఏనుక్రీస్తుల' యుదాహరణములవలన స్పష్ట మగుచున్నది. "మా నీతిసిద్ధాన్తమందలి ధర్మము నత్య మయినదే. తెలివిలేనివారు సరిగా నుపయోగము చేసికొనని యెడల మే మేమి చేయుదుము?" అను నీ సమాధానమునం దేమియు నర్థము లేదు. కారణ మేమన- "సిద్ధాన్తము సత్యమైన దైనను దాని నుపయోగిం దుటలో నధికారి యెవరు? ఆ యధికారి దీని నెపు డెటుల నుపయోగ పఱచుకొనవలయును?" మొదలగు ప్రశ్నలకు సమాధానము లగు మర్యాదలను సైతము చెప్పవలయును. అటుల చెప్పలేనియెడల మనమును, 'సోక్రటీస్' వలె నీతిమత్తను నిర్ణయించుటయందు సమర్థుల మని భ్రమఁజెంది, మంచిపనిని సైతము చెడఁ గొట్టికొనుట కవకాశము గలిగించుకొన్నవార మగుదుము.

ఒక్క సంఖ్యను బట్టియే నీతియొక్క యోగ్యమగు నిర్ణయము గానేరదు. మఱియు 'ననేకుల కధికసుఖ మెం దున్న'దను నంశమును సిద్ధాన్తముఁ జేయుటకు సిద్ధములుగ నుండు నే బాహ్యసాధనములు లేవు. ఈ రెండే కాక యీ మతములపై నితరములగు కొన్ని గొప్ప యాక్షేపణులు రావచ్చును. ఉదాహరణ మేమన- ఒకానొక కార్యము యొక్క బాహ్యపరిణామమును మాత్రముఁ బట్టియే యది న్యాయ్య మా? యన్యాయ్యమా? యను దానికిఁ, బూర్తిగను సమాధానము గను సిద్ధాన్తముఁ జెప్పుట తఱుచుగ శక్యము గాదు కొంచెము విచారించినఁ దప్పక తెలియును. ఒక గడియారము సరియగు సమయమును తెలుపుచున్నదా? లేదా? యని మాత్రము విచారించిన, "అది మంచిది యగునా? లేక, చెడుది యగునా?" యను విషయము నిర్ణయము చేయఁబడుచున్న దను మాట సత్యమే; కాని మనుష్యులు చేయు పనుల కీ పద్ధతిని సంబంధింపఁ జేయుటకుఁ బూర్వము, మనుష్యుఁడన, నొక గడియారము గాని, యంత్రము గాని, కాదని మనము గుర్తింగి యుండవలయును. సత్పురుషులందఱును జగత్తుయొక్క కల్యాణార్థమై యుండుట సత్యమే; కాని విపరీతముగ, లోకుల కల్యాణార్థమై సిద్ధముగ నుండువారు సర్వ కార్యములందును సాధువులుగనే యుండవలయునని లక్షణమును నుడువరాదు. మనుష్యుని యంతఃకరణము సైత మెటు లున్నదని చూడఁదగియున్నది. యంత్రములకు మనుష్యులకునుగల గొప్ప భేద మిదియే. కావుననే యజ్ఞానముచేఁ గాని, పొరపాటుచేఁ గాని యెవఁడైన నపరాధియైనచో, నతఁడు శిక్షాస్మృతియందు క్షమింపఁబడఁదగినవాఁ డని యున్నది. ఏ కర్మమైన "మంచిది యగునా? చెడుది యగునా? ధర్మ్య మగునా? అధర్మ్య మగునా? నీతియుక్తమా? కానేరదా?" అను విషయమున సత్యమగు నిర్ణయ మా పనియొక్క బాహ్యఫలము (లేక, పరిణామము) ను మాత్రమే (అనఁగా- ననేకుల కధిక సుఖప్రద మగునా? కానేరదా? యనుదానిని మాత్రమే) చూచి

నిశ్చయింపఁగూడదు. ఆ యా కార్యమును జేయువాని బుద్ధిగాని, లేక, యుద్దేశము గాని యెటు లున్నదనియు, దానితో పాటుగ నవశ్యముఁ జూడఁ దగియుండునని యీ చర్చవలన తేలిన తాత్పర్యము. అమెరికాలో నొకానొక గొప్ప పట్టణమునం దెల్లరకు నుపయోగించుటకు నెల్లవారికిని సుఖప్రాప్తికొఱకును 'ట్రూమ్‌వే' బండి వేయవలసి వచ్చెను; అయిన నా కార్యమును జేయుటకు ముఖ్యులగు నధికారులు సమ్మతింపక పోయిరి. అప్పుడు 'ట్రూమ్‌వే' వేయువారు ముఖ్యులగు నధికారులకు లంచమిచ్చిరి. పిదప వారు సమ్మతించిరి. అంతట వెంటనే 'ట్రూమ్‌వే' పని పూర్తియాయెను. పట్టణమునందున్న యెల్లరకును దాని మూలమున బహుసుఖమును లాభమును గలిగెను. పిదపఁ గొన్నిరోజులకు లంచము పుచ్చుకొనిన సంగతి వెల్లడియగుటచే 'ట్రూమ్‌వే' వేయువారిపై (వ్యవస్థాపకులపై) దండశాస్త్రసంబంధ మగు (క్రిమినల్) వ్యవహార మారంభ మాయెను. మొదటి పంచాయతీలో (జ్యూరీలో) నైకమత్య ముండదను నభిప్రాయమున, రెండవపంచాయతీ యెన్ను కొనఁబడెను. వారు లంచమిచ్చినవారిని దోషులుగ నిర్ణయించినందున 'ట్రూమ్‌వే' వేయువారు శిక్షింపఁబడిరి. ఈ యుదాహరణమున ననేకుల కధికసుఖప్రద మైనదను దానినే, నీతిసిద్ధాన్తముగ గ్రహించు నెడలఁ గార్యనిర్వాహము గానేరదు. లంచము నిచ్చుటచే 'ట్రూమ్‌వే' పూర్తియయిన దను బాహ్యపరిణామ మనేకుల కధిక సుఖప్రద మైనదియే. అయిన నంత మాత్రముచే లంచ మిచ్చుట యను విషయముమాత్రము న్యాయ్యము కానేరదు.* దానముఁజేయుట తనకు ధర్మ (దాతవ్య) మని యెఱింగి నిష్కామబుద్ధితో దాన మొనర్చుటయుఁ, గీర్తికొఱకుఁ గాని, లేక, యేదైన నితర ఫలము కొఱకుఁ గాని దాన మొనర్చుటయు, నను

* ఈ యుదాహరణము, డాక్టర్ పాల్‌కరస్ అనువాని The Ethical Problem (pp. 58, 59. 2nd Ed.) అను పుస్తకము నందుండి గ్రాయఁబడినది.

నీ ద్వివిధకార్యముల బాహ్యపరిణామ మొకవేళ నొక్క విధముగనే యుండినను, మొదటి విధము సాత్త్వికము, రెండవది రాజస మని భగవద్గీతలలో సైతము విడఁదీయఁబడినది (గీ. 17. 20-21). మఱియు నా దానమే యపాత్రున కీయఁబడిన, నది తామస మనియు, గర్హ్యా మనియుఁ జెప్పఁబడినది. లోకములో సైత మొక దరిద్రుఁ డొక ధర్మకార్యవిషయమయి కొంత ద్రవ్యము వెచ్చించునేని, ఆ ధర్మ కార్యమునకే శ్రీమంతుఁడు నూఱురూపాయలు వెచ్చించినను, వారిరువురి నీతిసంబంధమగు యోగ్యత సమానమే యని యెన్నుదురు. అయిన ననేకుల కధిక హితము దేనివలనఁ గలుగునని, యీ బాహ్య సాధనముచే విచారించు నెడల నీ రెండు దానములు నీతిదృష్టికి సమానయోగ్యతలు గలిగినవి కావని నుడువవలసి వచ్చును. 'అనేకుల కధిక హితము' అను నీ యాధిభౌతిక సిద్ధాన్తమున విశేషదోషము, చెప్పఁబోవునదియై యున్నది. కర్తయొక్క మనస్సులో నున్న యుద్దేశముయొక్క గాని, బుద్ధియొక్కగాని విచారణయం దేమియు నుండనేరదు. మఱియు లోని కారణము నరయ వలయునని వచించు నెడల ననేకుల కధికమగు బాహ్యసుఖ మనునదియే బంగారము నొరయునట్టి యొరపిడిరాతితోఁ బోల్పఁబడిన నీతిమత్త యను మొదటి ప్రతిజ్ఞకు విరోధము గలుగుచున్నది. వ్యవస్థ చేయు నభిగాని, సంఘము గాని యనేకులతో నేర్పడిన దగుటచే వారు చేయు వ్యవస్థలు గాని నియమములు గాని యోగ్యము లగునా? కావా? యను విచారణఁ జేయునెడ వారి యంతఃకరణ మెటుల నున్నదని చూడను పిలులేదు "వారు చేసిన వ్యవస్థచే ననేకుల కధిక సుఖ మగునా? కాదా?" యను బాహ్యవిచారము మాత్రముఁ జేసినఁ బూర్తియగును; గాని మఱియొకస్థలమునం దీ పద్ధతి యుపయోగింప దను విషయము, పై యుదాహరణచే నేరి కైనను సులభముగనే తెలియును. "అనేకుల కధిక సుఖ" మను సిద్ధాన్తము లక్ష్యింపదు; కాని ఒక విషయమును నీతి

దృష్టితో "న్యాయ్యమా? యన్యాయ్యమా?" యని విచారింపవలసిన యెడల, నీ బాహ్యవిషయమే కాక యనేక సందర్భములలో ననేక సందర్భములను సైతము విచారించుట యావశ్యకము; గాన, నీతి మత్తను నిర్ణయించుటలో నీ విషయమును మాత్రమే యన్నివిధముల నవలంబించుటకు వీలులేదు. ఇంతకంటె మిగుల నిశ్చితమును నిర్దోషమునగు సిద్ధాన్తమును శోధనచేసి కనిపట్టుట యావశ్యక మనియే నేను ముఖ్యముగఁ జెప్పుచున్నాను. "కర్మకంటె బుద్ధి శ్రేష్ఠ మైనది" (గీ. 2.49) అని గీతలోఁ బ్రారంభముననే చెప్పబడిన యభిప్రాయ మిదియే. బాహ్యకర్మలను మాత్రము చూచిన, నవి యనేక సమయ ములలో భ్రాంతిని గలిగించును. 'స్నానసంధ్యలు, తులసిమాలలు జప మాల' లనెడు బాహ్యకర్మలను బాగుగఁ జేయు చున్నను, 'అంతఃకరణమునఁ గ్రోధమూర్తిగ' నుండుట శక్యము గానిది కానేరదు; కాని లోన బుద్ధి పరిశుద్ధముగ నున్నయెడల, బాహ్యకర్మ, సుదాముని (కుచేలుని) యదుకులవలె నెంత తక్కువదై యున్నను, దానియొక్క ధార్మికమును నైతికమును నగు యోగ్యత యనేకుల కధిక సుఖమును గలిగించునట్టి గొప్ప యన్నదానము వంటిదని తలంపవలయును. కావుననే జర్మనుదేశపు తత్త్వజ్ఞానియగు 'కాంటు' * కర్మయొక్క బాహ్యము దృశ్యమునగు పరిణామముయొక్క కారణమ్యవిచారము గొఱ మని సిద్ధాన్తముఁ జేసి కాను జేసిన "నీతిశాస్త్రవివేచన" యను గ్రంథమును కర్తయొక్క శుద్ధబుద్ధి మొదలుకొని ప్రారంభము చేసెను. ఆధిభౌతిక సుఖవాదమునందున్న యీ న్యూనత, ప్రముఖ లగు నాధిభౌతికవాదు లెఱుంగనిది కానేరదు. మనుష్యఁ డొనర్చు పనులే యతని స్వభావము నెఱుంగఁజేయును. కాన నవి యతని నీతిమత్తను సైత మెఱుంగఁజేయు నని యంద అనుకొనెదరు; కాని బాహ్యపరిణామమునుండియే యవి మంచివని కాని, చెడువని కాని

* Kant's Theory of Ethics (tran. by Abbott) 6th Ed. p. 6.

చెప్పలే మని 'హ్యూమ్'♦ స్పష్టముగ వ్రాసెను. మఱియు నే పనియొక్క నీతిమత్తయైనను నా పని యొనర్చు వాని యభిప్రాయముం బట్టియే యుండును (అనఁగా నతఁ డా పని నే యుద్దేశముతోఁ జేయుచున్నాఁడో దాని నవలంబించియే యుండును) అను విషయమును 'మిల్లు' దొరగారు సైత మొప్పుకొనియున్నారు. కాని తన పక్షమును నిలుపుకొనుటకై "బాహ్యకర్మఫలమునం దేమియు భేదము లేనంత వఱకుఁ గర్త కాపనిఁ జేయవలయు ననుమాట దేనివలనఁ గలిగినను, గర్మ నీతిబాహ్యము గాకుండుటకు దానివలన నేమియు నాటుంకము గలుగ"దని 'మిల్లు' దీనిపై యుక్తిఁ జెప్పుచున్నాఁడు. *మిల్లు యొక్క యీ యుక్తియందు సాంప్రదాయిక సంబంధమగు నాగ్రహము గానవచ్చును. కారణ మేమన-బుద్ధి వేఱుగ నున్నప్పుడు రెండు కర్మలు నొక్కవిధముగఁ గాన్పించినను, యథార్థమున కవి యొకటే వెల్ల గల వగుట యెప్పుడును సంభవింపదు. కావుననే "(బాహ్య) కర్మలలో భేద ముండునంతవఱకు మొదటిది యగు 'మిల్లు' చెప్పిన నియమమే నిర్మూల మగు"నని 'గ్రీన్'దొరగారు సమాధానముఁ జెప్పిరి. †గీతలోని యభిప్రాయము సైత మిదియే. కారణ మేమన- ఇద్దఱొక

♦ "For as actions are objects of our moral sentiment, so far only as they are indications of the internal character, passions and affections, it is impossible that they can give rise either to praise or blame, where they proceed not from these principles, but are derived altogether from external objects." Hume's 'Inquiry concerning Human Understanding', Section VIII Part ii (p.368 of Hume's Essays' The World Library Edition).

* "Morality of the action depends entirely upon the intention, that is, upon what the agent wills to do. But the motive, that is, the feeling which makes him will so to do, when it makes no difference in the act, makes none in the morality." Mill's Utilitarianism. p. 27.

† Green's Prolegomena to Ethics, § 292 note. p. 348. 5th Cheaper Edition.

ధర్మకార్యముననే సమానముగ దాన మిచ్చినప్పుడు– ఇరువుర బాహ్య కర్మలు నన్నివిధముల నొక్క రీతిగనే యున్నను– ఇరువుర యుద్దేశములు వేఱుగుటచే నొకరి దానము సాత్త్వికముగను, మఱియొకరిది రాజసముగ నైన, లేక, తామసముగ నైనఁ గావచ్చునని గీతలలో నున్నది. అయిన నీ విషయమయి విశేషవిచారమును ముందీ దేశస్థులయొక్కయు పాశ్చాత్యులయొక్కయు మతములను నరిచూచునపుడు చేయుదము. బొత్తిగఁ గర్మయొక్క బాహ్యపరిణామమునే యవలంబించి యుండెడి యాధిభౌతిక సుఖవాదముయొక్క శ్రేష్ఠమగు యుక్తులు సైతము నీతినిర్ణయ నిమిత్తమున నెటుల సంపూర్ణములగునో, యా విషయమే ప్రస్తుతము విచారింపఁదగినది; కావున దానిని సమర్థించుటకు వెనుక 'మిల్లు' చెప్పిన విషయమే యుత్తమమగు యుక్తి యని తలఁచెదను.

"అనేకుల కధిక సుఖ" మను నాధిభౌతికపథమునఁ గర్తయొక్క బుద్ధిని గుఱించి యే విచారణయు లేకపోవుట యనునది యన్నింటిలోఁ బెద్ద దోషము. కారణ మేమన– మిల్లుయొక్క యుక్తి సత్యమని యంగీకరించినను, కేవల బాహ్యఫలము ననుసరించియె నీతిని నిర్ణయించు నీ సిద్ధాన్తము గొన్ని నియమములకు లొంగియున్నను (అనఁగా: ఏకదేశీయ మైనను), దాని నన్ని సందర్భములయందు సమానముగ నుపయోగించుకొనుటకు వీలు గా దని, 'మిల్లు' వ్రాసిన దానింబట్టియే సిద్ధమగుచున్నది. మఱియు "స్వార్థమునన్నఁ బరార్థమేల శ్రేష్ఠము? అది యెటుల సిద్ధించును?" అను విషయమునకు నేమియు సమాధానమును జెప్పక యీ సిద్ధాన్తము నవలంబించియే సర్వవిచారమును జేయుటవలన నుచ్చస్వార్థము (అనఁగా: నేర్పరియొక్క స్వార్థము) గొప్ప దని యనుటకు వీలు కలుగునను మఱియొక యాక్షేపణ యీ మతముపైఁ గలుగుచున్నది. స్వార్థపరార్థములు రెండును మనుష్యునితో పాటు నిర్మింపఁబడిన వైనయెడల

స్వార్థముకంటె నందఱయొక్కయు హితము గొప్ప దని యేల యొప్పుకొనవలయును? "అనేకుల కధిక హితము దానిలో నున్నది గాన నటు లొనర్చు" మను సమాధానము తగినది కానేరదు. ఏలన: లోకహిత మొనర్చునపుడు చాలవఱకు మనకు నది హిత మగును. కావున 'అనేకుల కధిక సుఖమును నే నేల చేయవలయు?' నను ప్రశ్న పుట్టు దను మాట సత్యమే యైనను, ఆ యాధిభౌతికవాదమునఁ జెప్పఁ బడిన మూఁడవ మార్గముకంటె నీ నాల్గవమార్గమున నున్న భేద మిదియ కాఁబోలు! స్వార్థపరార్థములకు విరోధము వచ్చినచో 'ఉచ్చ స్వార్థముయొక్క మార్గము నంగీకరింపక, స్వార్థమును వదలి పరార్థ మును సాధించుకొనుటకుఁ బ్రయత్నించుటయే ప్రతి మనుజుని విధి యని యనుట నాల్గవ భౌతికవాదుల మతము. "ఆధిభౌతికమతములో నుండు నీ భేదమునకు నెట్టి సమాధానముఁ జెప్ప నక్కఱ యుండదా?" యంటి మేని యీ యాటంక మా యాధిభౌతిక పథములోని యొక విద్వాంసునకుఁ దోఁచుటచే నతఁడు చిన్నపురుగు మొదలు మనుష్యుని వఱకునుండు సమస్త ప్రాణులయొక్క వ్యవహారపరిశీలన మొనరించి, "తనవలె తన సంతతిని, జ్ఞాతులను పరిపోషించుటయు, నెవరికి నపకార మొనర్పక తన బాంధవులకుఁ జేయఁ గలిగినంత యుపకారముఁ జేయుటయు ననెడు గుణము చిన్నపురుగు మొదలు మనుష్యునివఱకు నంతకంటె నెక్కువగఁ గాన్పించుచున్నది. కావున సజీవసృష్టియొక్క ప్రవర్తనలో నిదియ ముఖ్యము ధోరణిగఁ గన్పట్టుచున్నదని నుడువ వచ్చు" నని వచించెను. సజీవసృష్టిలో నీ ధోరణి తొలుత "సంతతి నుత్పాదించుట - రక్షించుట" యను విషయములలోఁ గాన్పించు చున్నది. స్త్రీ పురుషభేదము లేని సూక్ష్మకీటకసృష్టిలో నైత మొక కీటకదేహము వృద్ధిఁబొందుచుఁ బగిలి రెండు కీటకము లగుచున్నది. లేక, సంతతికొఱకే (అనగా: పరులకై యే) యీ చిన్నపురుగు తన దేహమును వదలి వేయుచున్నదని చెప్పినను చెప్పవచ్చును. అటులే సజీవసృష్టిలోని కీటకములకన్నఁ బై మెట్టున నున్నవియు, స్త్రీపురుష

రూపములు గలవియు నగు ప్రాణులు సైత మీ తీరుననే తమ సంతతిని రక్షించుటకై స్వార్థత్యాగముం జేయుట వలన నానందము ననుభవించు చున్నవి. మఱియు నీ గుణము క్రమక్రమముగ వృద్ధినిబొందుటచే మిక్కిలి మోటుతనము గల సంఘములలో సైతము సాహాయ్యమొనర్చుటకై సుఖముగనే ప్రవర్తించుచున్నారు. కావుననే నజీవసృష్టిలో శిరోమణి యగు మనుష్యుఁడు, 'పరార్థములోనే స్వార్థము నందువలె సుఖము ననుభవించుట' యను సృష్టియొక్క పైమెట్టు నెక్కి ధోరణిని, మున్నుగ నడుపుచు స్వార్థపరార్థముల విషయములోఁ బ్రకృతము భాసించుచున్న విరోధమును శుభ్రముగఁ దీసిపాఱవైచుటకుఁ బ్రయత్నింపవలయును. ఇదియే యీ జగత్తున మనుజునకు ముఖ్యకర్తవ్యము.* యుక్తివాదము సరి యైనదిగనే యున్నది. పరోపకారమును నద్దుణము మూఁగజంతువుల (అనఁగాఁ దిర్యగ్జంతువుల)లో సైతము తమ పిల్లలఁ బెంచునపుడు కానవచ్చుచున్నది. కావున జ్ఞానవంతులగు మనుజులు దానిని పరమావధిగఁ బూర్తి యొనర్చుట యనునదియే పురుషార్థమను సిద్ధాన్తమెంతయుం గ్రొత్తది కానేరదు. ప్రస్తుత కాలమునం దాధిభౌతికశాస్త్రజ్ఞానము మిక్కిలి వృద్ధిఁ బొందుచుండుటఁ జేసి యీ సిద్ధాన్తమున కాధిభౌతికమైన సమాధాన మిచ్చో మిగుల యుక్తియుక్తముగఁ జెప్పవలసివచ్చుననునది గొప్ప సంగతియే. మన శాస్త్రకారులదృష్టి యాధ్యాత్మికమైనను బ్రాచీన గ్రంథములలో—

అష్టాదశపురాణానాం సారం సారం సముద్ధృతమ్,
పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.

---

* ఈ యవతరి 'స్పెన్సరు' యొక్క Data of Ethics అను గ్రంథము నందు వ్రాయఁబడినది. తన మతమునకు 'మిల్లు' మతమునకు నందు భేదమును స్పెన్సరు, మిల్లున కంపిన లేఖయందు వ్రాసిన వృత్తాన్తమును పీ గ్రంథమున సుస్పష్టముగ వ్రాయఁబడినది. pp. 57, 123. Also see Bain's Mental and Moral Science pp. 721, 722. (Ed. 1875).

_ పరోపకార మనునది పుణ్యము; మఱియు పరపీడ యనునది పాపము; ఇదియే యష్టాదశ పురాణములయొక్క సారము అని చెప్పఁబడినది. మఱియు భర్తృహరియు- "స్వార్థో యస్య పరార్థ ఏవ స పుమా నేక స్సతా మ్రగ్ణీ:"_పరార్థమే యెవరికి స్వార్థముగ నున్నదో వారే సత్పురుషుల యందఱలో శ్రేష్ఠు లగుదురు అని చెప్పు చున్నాఁడు. ఇఁక నే మన- చిన్నకీటకము మొదలుకొని మనుష్యుల వఱకును సృష్టియందుఁ బైపైమెట్టు నెక్కుట యను మార్గమును విచారించునెడల "మానవులలోఁ బరోపకారబుద్ధి యనునొక సద్గుణము యొక్క యుత్కర్షమే వృద్ధినిఁ బొందినదా?, లేక, దానితో పాటు న్యాయబుద్ధి, దయ, విదగ్ధత, దూరదృష్టి, తర్కము, శౌర్యము, ధృతి, క్షమ, యింద్రియ నిగ్రహము, మొదలగు నితరములగు ననేక సాత్త్వికగుణములకు సైతము క్రమాభివృద్ధి యైనదా?" యని మఱి యొక ప్రశ్నము వెలువడును. ఈ విచారమును గమనించిన, నితర సజీవప్రాణులకంటె మనుష్యులలో సమస్తసద్గుణములు నధికముగ నున్నవని చెప్పవలసి వచ్చును. ఈ సాత్త్వగుణముల సమూహము నకు మన మిప్పుడే 'మనుష్యత్వ' మని పేరు పెట్టుదము. పరోప కారముకంటె మనుష్యత్వ మీ రీతిగ శ్రేష్ఠమని స్థిరపడిన పిదప నే కర్మయొక్క యోగ్యతాయోగ్యతల నైనను, లేక, నీతిమత్త నైనను, నిర్ణయించునపు డా యా కర్మ నొక్క పరోపకార బుద్ధిపద్ధతి చేతనే పరీక్షించుటకంటె, మనుష్యత్వముయొక్క_ అనఁగా- మానవజ్ఞాతు లలో నితర ప్రాణులకంటె నే యే గుణముల యాధిక్య ముండునని తోఁచుచున్నదో వానియన్నిటియొక్కయు- దృష్టితోఁ బరీక్షించుట యావశ్యకముగ నుండును. అనఁగా- ఒక్క పరోపకారబుద్ధి మీఁదనే యా భారమునుంచి యెటు లైనమ నిర్వాహమును జేయుటకంటె, "అందఱయొక్కయు 'మనుష్యత్వ' మే కర్మచే వృద్ధిఁబొందునో, లేక, యా 'మనుష్యత్వ' మే కర్మచే శోభించునో, యదియే తత్క్ర

త్యము; అదియే నీతి ధర్మము" అని మన మిప్పుడు చెప్పవలయును. మఱియు నీ వ్యాపక మగుదృష్టి, నొక్కసారి యొప్పుకొనిన యెడల "అనేకుల కధికసుఖ" మనునది మనము నిర్ణయించిన మనుష్యత్వ మున నొక యల్పభాగ మగును. కావున నీ యల్పదృష్టితో నన్ని పనుల యొక్కయు ధర్మత్వాధర్మత్వములను విచారింపవలయు ననుమతము లేశ మైన నిలువనేరదు. కావున మనుష్యత్వమునే ముఖ్యముగఁ జూడవలయునని తేలును. మఱియును మనుష్యత్వ మెందున్నదను విషయముయొక్క సూక్ష్మవిచారమును సైతము చేయ నారంభింతుమేని యాజ్ఞవల్క్యాలు చెప్పినటుల "ఆత్మా వా అరే! ద్రష్టవ్యః" అను ప్రశ్నయు సహజముగఁ దోఁచును. నీతిశాస్త్రశోధకుఁడగు నొక యమెరికా గ్రంథకారుఁడు సముచ్చయాత్మక మగు మనుష్యత్వ ధర్మమునకే "ఆత్మ" యని పేరిడి వ్యవహరించెను.

కేవలస్వార్థము (స్వీయమగువిషయసుఖము) అనెడి యత్యల్పమార్గమునుండి పై పైకిఁ బోవుచున్న యీ యాధిభౌతిక సుఖవాదుల మతమునఁ బరోపకారము చిట్టచివరకు మనుష్యత్వపర్యంత మెటుల రావలసినదియు పూర్వోక్తవివేచనల వలన నెఱుంగ నగును; కాని, మనుష్యత్వమని చెప్పినను, నాధిభౌతికవాదులయొక్క మనస్సులలోఁ దఱచుగ సర్వజనులకును బాహ్యవిషయ సుఖముయొక్క కల్పనయే ప్రధానమగుటచే నంతశ్శుద్ధియొక్క యైనను, అంతస్సుఖముయొక్క యైనను విచారణయే చేయని యాధిభౌతికవాదులయొక్క యీ కట్టకడపటిమార్గము మన యాధ్యాత్మిక శాస్త్రకారుల మతానుసారముగ నిర్దోషము గానేరదు. మనుజుల సర్వప్రవృత్తియు సుఖప్రాప్త్యర్థమయి కాని, దుఃఖనివారణార్థమయి కాని జరుగునని సామాన్యముగ నొప్పుకొనినను, "నిత్యము, నిత్యము నైన సుఖ మాధిభౌతికమా? (అనఁగాఁ: ఐహికవిషయోపభోగమున నున్నదా?, లేక, మఱియొకదాని యందున్నదా?") యను శంకకు సమాధానము ముందుగ

నిర్ణయింపక, యే యాధిభౌతిక పక్షమునైన నిర్ణయించుటకు వీలు లేదు. శారీరక సుఖముకంటె మానసికసుఖముయొక్క యోగ్యత గొప్పదని యాధిభౌతికవాదులు సైత మొప్పుకొని యున్నారు, "పశువు లనుభవింపఁదగిన సుఖములనెల్ల నీకుఁ గలుఁ గజేసెద, నీవు పశువుగ నుండుట కొప్పుకొందువా?" యని యడిగిన నెవ్వఁడు నొప్పుకొనఁడు. అటులే తత్త్వజ్ఞానముయొక్క గూఢవిచారణచే బొందఁబడిన విలక్షణమగు బుద్ధిశాంతియొక్క యోగ్యత, యైహిక సంపత్తి కంటెను, బాహ్యవిషయోపభోగముల కంటెను, వేయంత లెక్కువగ నుండునని జ్ఞానులగు వారికిఁ జెప్ప నవసరములేదు. మంచిది! లోకమతమును జూతు మేని యచ్చో సైతము నీతిమత్త, కేవల సంఖ్యను మాత్రమే యవలంబించి యుండదు. మనుష్యుఁ డొనర్చున దంతయు నాధిభౌతిక సుఖముకొఱకే గాన యాధి భౌతికసుఖ మనునది పరమసాధ్య మనెడు సిద్ధాన్తము మాన్యమని లోక మంతయు నొప్పనటుల తోఁపదు. బాహ్యసుఖమునే కాక జీవితాశను సైతము నిర్లక్ష్యముగ వదలి, యా యా సందర్భముల యందాధ్యాత్మికదృష్టితోఁ జూచిన, వానికంటె నధికయోగ్యత గల సత్యము మొదలగు నీతిధర్మములను బాలించునంతటి మనోనిగ్రహ ముండుటచేతనే, యా మనుష్యునియందు 'మనుష్యత్వ' ముండు నటుల మన మెఱుంగ వలయును. మఱియు నర్జునుని ప్రశ్నము సైతము "యుద్ధము సేయుటవలన నెవరి కెంత సౌఖ్యము కలుగు?" నని కానేరదు. మఱేమి యన- "నా యొక్క (అనఁగా: నా యాత్మ యొక్క) శ్రేయము దేనియం దున్నదో నా కెఱుంగఁ జేయుము" (గీ. 2.7; 3.2) అని శ్రీకృష్ణు నడిగెను. ఆత్మకు శాశ్వతమగు శ్రేయ మైనను, సుఖ మైనను నాత్మయొక్క శాంతియందే యున్నది. కావుననే, యైహికసుఖమైనను, సంపత్తి యైనను, నే మాత్రము లభించిన నా మాత్రముచేతనే యీ యాత్మకు సుఖమైనను శాంతి యైనమ గలుగువనెడి యాశలేదు. "అమృతత్వస్య తు నాశాఽస్తి

విత్తేన" అని బృహదారణ్యకోపనిషత్తులో నున్నది (బృ. 2. 4. 2). కఠోపనిషత్తులో నచికేతునకుఁ బుత్రులు, పౌత్రులు, పశువులు, ధనము, ధాన్యము మొదలగు ననేకవిధము లగు నైహికసంపదల నిచ్చుటకు మృత్యువు సిద్ధమై యుండఁగ "ఆత్మవిద్యయే నాకుఁ గావలయును, సంపద వలదు" అని నచికేతువు మృత్యువునకు స్పష్టముగ నుడివెను. మఱియు "ప్రేయ" మనఁగా- "ఇంద్రియము లకు సుఖమని తోఁచు నైహిక ప్రీతి" యనియు, "శ్రేయ" మనఁగా- "ఆత్మయొక్క నిజమగు కల్యాణమే" యనియు, రెంటిని విడదీసి-

శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్య మేత
స్తౌసంపరీత్య వివినక్తి ధీరః,
శ్రేయో హి ధీరోఽభిప్రేయసో వృణీతే
ప్రేయో మందో యోగక్షేమాద్వృణీతే.

(కఠ. 1.2.2)

- ప్రేయము (తాత్కాలికమగు బాహ్యేంద్రియసుఖము), శ్రేయము (సత్యముఁ జిరకాలికము నగు కల్యాణము) అనునవి మనుష్య నెదురు కొని వచ్చెనేని, "జాగ్రత్తగల వాఁ డీ రెంటిలో శ్రేయమునే కైకొని, ప్రేయమును తక్కువదానిగఁ దలఁచును. తెలివిలేనివాని కాత్మ కల్యాణమునకంటె ప్రేయమే (అనఁగా- బాహ్యసుఖమే) యెక్కువదై తోఁచునని చెప్పఁబడినది. కావుననే సంసారములో నున్న యింద్రియ గమ్యములగు విషయసుఖములే మనుష్యుల కీ లోకమునఁ బరమ సాధ్యము లనియు, మనుష్యుఁడు సేయున దంతయు బాహ్యసుఖము కొఱకును (అనఁగ- ఆధిభౌతిక సుఖము కొఱకును), దుఃఖ నివార ణముకొఱకే చేయుచున్నాఁ డనియుఁ జెప్పుట యోగ్యము కానేరదు.

ఇంద్రియ గమ్యమగు బాహ్యసుఖమునకంటె, బుద్ధిగమ్యమగు నంతస్సుఖమున కైనను, ఆధ్యాత్మికసుఖమున కైనను యోగ్యత యధిక మగుటయే కాక, నేఁడున్న విషయసుఖము లేపుండనేరదు.

అనఁగా- అదియ నిత్యము. నీతిధర్మముల యొక్క విషయ మట్లు కానేరదు. అహింస, సత్యము, మొదలగు ధర్మముల బాహ్యోపాధినే (అనఁగ- బాహ్య సుఖ దుఃఖములనే) యవలంబింపక యెల్లప్పు డేకరీతిగ నన్నిసందర్భములలోను సంబంధించు చున్నవి. కావుననే నిత్యములుగ నుండునని యందఱు నొప్పుకొనియే యున్నారు. "బాహ్యవిషయము నవలంబించి యుండని యన్ని నీతిధర్మములకు నిత్యత్వ ముండుటకుఁ గారణ మేమి? లేక, యవి యెచ్చో నుండి వచ్చినవి?" అను విషయముల కాధిభౌతికవాదముచే నేమియు సమాధానము కుదురదు. కారణ మేమనఁగా- బాహ్యసృష్టి యందున్న సుఖదుఃఖము లన్నియు స్వభావముచేతనే యనిత్యము లగుటచే వాని దుర్బలము లగు పాదములపై రచింపఁబడిన నీతి సిద్ధాన్తములును మిక్కిలి దుర్బలములైన వగును (అనఁగా- అనిత్యము లగును.) మఱియు నా కారణమున సుఖదుఃఖముల విచారణఁ జేయక "సత్యము నిమిత్తమై ప్రాణము పోయినను యుక్తమే యగు" నను నత్యధర్మమును సంబంధించిన త్రికాలాబాధితమగు నిత్యత్వ మనునది "అనేకుల కధికసుఖము" అను సిద్ధాన్తముచే సిద్ధము కానేరదు. సామాన్యవ్యవహారమున సత్యమున కై ప్రాణము నీయవలసిన సమయము వచ్చినప్పుడో, గొప్పగొప్పవారు సైత మసత్యమును యూహ యించు చున్నారు. మఱియు శాస్త్రకారులుసైత మా సమయములందు మిక్కిలి పట్టుదలగలిగి యుండరను విషయమును మనము చూచినను సత్యాది ధర్మములు నిత్యము లని యొప్పుకొన వలసిన యవసరము లేదని దీనిపై ననేకులు పూర్వపక్షమును జేయుదురు; కాని యీ యుక్తివాదము సరిలేదు. కారణ మేమన- సత్యముకొఱకుఁ ప్రాణముల నిచ్చునంతటి ధైర్యము లేనివారును, ప్రాణముల నిచ్చుట కిష్టముగలవారును, ఈ నీతిధర్మముయొక్క నిత్యత్వమును దమంతట తామే యొప్పుకొనుచున్నారు. ఈ కారణముననే మహాభారతములో నర్థకామాదిపురుషార్థములను దప్పకనిచ్చు వ్యావహారికములగు నన్ని

ధర్మములయొక్క విచారణను జేసి తుదకు, భారతసావిత్రిలోను, విదురనీతిలోను సైతము వ్యాసులు—

న జాతు కామా న్న భయా న్న లోభా-
ద్ధర్మం త్యజే జ్జీవితస్యాపి హేతోః,
ధర్మో నిత్య స్సుఖదుఃఖే త్వనిత్యే
జీవో నిత్యో హేతు రస్య త్వనిత్యః.

— సుఖదుఃఖము లనిత్యములు; గాని (నీతి) ధర్మము నిత్యము. కావుననే సుఖేచ్ఛచే నైన, భయముచే నైన, లోభముచేఁ నైనఁ బ్రాణముఁ బోఁగొట్టుకొనవలసినంత సమయమునం దైనను ధర్మము నెప్పుడును వదలరాదు. జీవము తొలుతనుండి నిత్యమైన దగుటచే సుఖదుఃఖాదివిషయము లనిత్యములే యగును. కావుననే యనిత్యము లగు సుఖదుఃఖముల విచారించుచుండక, నిత్యములగు జీవముల యొక్క ధర్మ సంబంధమును సైతము తప్పక జతపఱచి యుండ వలయును అని యందఱకు నుపదేశించిరి (మ. భా. స్వ. 5. 60; ఉ. 39.12-13). వ్యాసులవారి యీ యుపదేశ మెంతవఱకు యోగ్యమైన దను విషయమును జూచుటకై "సుఖదుఃఖముల నిష్కృష్ట స్వరూప మేమై యుండును? మఱియు దేనిని నిత్యసుఖ మని చెప్ప వలయును?" అను విచార మిప్పు డొనర్పవలయును.

ఇది యాధిభౌతిక సుఖవాద మను చతుర్థప్రకరణము.

పంచమ ప్రకరణము

సుఖదుఃఖవివేకము

సుఖ మాత్యంతికం యత్త ద్బుద్ధిగ్రాహ్య మతీంద్రియమ్.*
(గీతా. 6.21)

– ఈ జగత్తునందుఁ బ్రతి మనుజుఁడును, 'సుఖ మెట్లు కలుగును?' లేక, 'ప్రాప్తమైన సుఖ మెట్లు వృద్ధిఁబొందును?' లేక, 'దుఃఖ మెట్లు పోవును? లేక, యెట్లు తఱుఁగును?' అను విషయముననే యెల్లప్పుడు పరిభ్రమించు చుండును – అను సిద్ధాన్తము మన శాస్త్రకారులకు సమ్మతమే యగును. "ఇహ ఖల్వముష్మింశ్చ లోకే వస్తుప్రవృత్తయ స్సుఖార్థ మభిధీయంతే. న హ్యతః పరం త్రివర్గఫలం విశిష్టతర మస్తి"– ఈలోకమునగాని, బరలోకమున గాని సర్వప్రవృత్తులును సుఖము కొఱకే యగును. ధర్మార్థ కామములకు వీనికంటె వేఱగు ఫలము లేదు" (మ.భా.శాం. 190.9) అని శాంతిపర్వములో భృగువు భర ద్వాజునకుఁ జెప్పియున్నాఁడు; కాని తమకు నిజమగు సుఖ మెం దుండునదియు నెఱుంగక పోవుటచే మాయనాఁకములను గొంగునఁ గట్టుకొని యవియే సత్యము లైన వని నమించువానివలెఁ గాని, లేక, సుఖము నాకు లభించునని యాశించువానివలెఁ గాని, మనుజుఁడు తన జీవితకాలము ముగిసి ప్రాణములు కంఠగతము లైనను మృత్యు వకస్మాత్తుగఁ బైకుఱికినను, వేఱొక యాలోచననే చేయక వెనుకటి దురాశాగ్రంగమునే మనస్సున వల్లెవేయు చుండును. మఱియు నీ

---

* ఏది బుద్ధిచేతనే గ్రాహ్యమగుచు నింద్రియాతీత మగునో, అదియే యాత్యంతిక సుఖము.

తీరున సంసారచక్రము తిరుగుచుండుటచే నత్యము నిత్యమునగు సుఖ మేది యని యెవరును విచారము సేయరని యీ శాస్త్రకారుల యభి ప్రాయము. "సంసారము బొత్తిగ దుఃఖమయముగ నున్నదా? లేక, సుఖప్రధానముగఁ గాని దుఃఖప్రధానముగఁ గాని యున్నదా?" యను విషయమై తత్త్వజ్ఞానులగు నీ దేశస్థులకును, పాశ్చాత్యులకును నత్యం తము మతభేదము లున్నవి. ఈ యుభయపక్షములలో దేనినిగ్రహించి నను ప్రతి మనుజుఁడును దనకు దుఃఖప్రాప్తి కలుగకుండ మిక్కిలి సుఖమే సంప్రాప్త మగునటుల చేసికొనుటయే నిశ్రేయస మని తలంచుటను విషయమున నెవరికిని మతభేదము కానరాదు. 'సుఖ' శబ్దమునకు మాఱుగ 'హితము', 'శ్రేయము', లేక, 'కల్యాణ' మని యధికముగఁ బ్రయోగించుట వాడుకలో నున్నది. మఱియు వానిలోని పరస్పర భేదములు ముందుఁ జెప్పఁబడును. అయినను 'సుఖ' శబ్దార్థమునందే సర్వవిధములగు సుఖములకు నైన, లేక, కల్యాణములకు నైన సమావేశ మగునని యంగీకరించిన, సామాన్య ముగ మనుజుని యొక్క ప్రయత్నము లన్నియు సుఖార్థమే యగు నను మతము సర్వజనగ్రాహ్యమే యగు ననుట కే యాటుంకము నుండదు; కాని, యంతమాత్రముచే-

"య దిష్టం త త్సుఖం ప్రాహు ర్ద్వేష్యం దుఃఖమి హేష్యతే"- ఏది మన కిష్టంబో యది సుఖము; మన మెద్దాని ద్వేషింతుమో యది (అనగాఁ మన కేది వలదో యది) దుఃఖము (మ.భా.శాం. 295.27) అని మహాభారతాంతర్గత పరాశరగీతలలోనున్న సుఖదుఃఖముల లక్షణ ములు శాస్త్రదృష్టిచేఁ జూచిన, నేమియు దోషరహితములు గానేరవు. కారణ మేమి యన: ఈ వ్యాఖ్యానములో నున్న 'ఇష్ట' శబ్దార్థము, 'ఇష్టవస్తువు', లేక, 'ఇష్టపదార్థ'మని చెప్పుటకు శక్యమగును. ఇంతియ కాక, యిష్టపదార్థమును సైతము సుఖ మని చెప్పుట ప్రాప్త మగును. ఉదాహరణము: దప్పి యైనచో మన కుదక మిష్ట మైనను, 'జల'

మను బాహ్యపదార్థమునకు 'సుఖ' మను పేరిడుట యుక్తము గానేరదు అట్లగు నేని యేటినీటిలో మునిఁగిన మనుజుఁడు సుఖములో మునిఁగినాఁ డని చెప్పవలసిన ట్లగును. జలపానమువలనఁ గలిగిన యింద్రియతృప్తియే సుఖ మగును. ఈ 'యింద్రియతృప్తి', లేక, 'సుఖము' మనుజులకుఁ గావలయు నని తోఁచుట సత్యమే; కాని దాని మూలమున నేదేది కావలయు నని తోఁచునో యది యంతయు సుఖముగనే యుండవలయు నని వ్యాప్తిచే (వ్యాపకముగ) సిద్ధాన్తిక రించుట యుక్తము గానేరదు. కావుననే నైయాయికులు-"అనుకూల వేదనీయం సుఖం"- ఏ జ్ఞానము (వేదన)మనకుఁ బ్రతికూల మగునో యదియే సుఖము అని వ్యాఖ్యానముఁ జేసి సుఖదుఃఖము లనునవి రెండును నొక విధ మగు వేదన యని నిశ్చయించిరి. ఈ వేదనలు తొలుతనుండియు (అనఁగా: పుట్టినది మొదలు సిద్ధములును, కేవల మనుభవ గమ్యములు నగుటచే నైయాయికులయొక్క యీ వ్యాఖ్యా నముకంటె నిట్లక్షణము సుఖదుఃఖములకుఁ జెప్పుట సాధ్యము కానే రదు. ఈ వేదనారూపము లగు సుఖదుఃఖములు బొత్తిగ మనుష్యుల వ్యాపారము చేతనే వెలువడు నను నియమము లేదు. ఇఁక నేమన: ఒకానొకప్పుడు కొందఱు దేవతల కోపముచేఁ గూడ ననివార్యము (దుర్ధరము) లగు రోగము లుత్పన్నము లగుటచే వాని దుఃఖము మనుజు లనుభవింప వలసివచ్చును. కావుననే వేద శ్రుతిగ్రంథముల యం దీ సుఖదుఃఖములు సామాన్యముగ నాధిదైవికములు, నాధి భౌతికములు, నాధ్యాత్మికములు నని త్రివిధములుగ విభజింపఁబడినవి వానిలో దేవతల ప్రసాదకోపములచే నే సుఖదుఃఖము లనుభవింప వలసి వచ్చునో, వానికి సామాన్యముగ నాధిదైవికము లని పేరిడిరి. బాహ్యసృష్టిలో నున్న పృథివ్యాది పంచమహాభూతాత్మకపదార్థముల కును మనుజుల యింద్రియములకును సంయోగము గలుగుటచే వెలువడు శీతోష్ణాదుల ద్వారముగ సంప్రాప్తము లగు సుఖదుఃఖము

లకు నాధిభౌతికము లని పేరిడిరి. మఱియు నిట్టివియు, బాహ్య సంయోగము లేకయే యుద్భవించినవియు నగు నితర సర్వసుఖదుఃఖముల నాధ్యాత్మికము లని యందురు. సుఖదుఃఖములకు నీ విభాగ మంగీకరింపఁబడిన యెడల, శరీరమున వాతపిత్తాదుల స్థితి చెడుటచేఁ గలుగు జ్వరాది దుఃఖములయొక్కయు, అవి సామ్యావస్థనుండుటచే ననుభవగోచర మగు శరీరప్రకృతియొక్కయు స్వాస్థ్యగణన యాధ్యాత్మిక సుఖదుఃఖములలోఁ జేయవలసి వచ్చును. కారణ మేమన: ఈ సుఖదుఃఖములు పంచభూతాత్మక స్థూలశరీరములలో (అనఁగా: శరీరము నందే) ఉండినను శరీరముకంటె బాహ్య మగు పదార్థముల సంయోగముచే నుద్భవిల్లుచున్న వని నియతముగఁ జెప్పుటకు సాధ్యము కానేరదు. మఱియు నా కారణముచే నాధ్యాత్మికసుఖదుఃఖముల సైతము శారీరకము లనియు, మానసికము లనియు, వేదాన్తదృష్టిచే మరల విభజింపవలసి వచ్చును: కాని యీ తీరున సుఖదుఃఖములకు విభాగ మొనర్చిన యెడల నాధిదైవిక సుఖదుఃఖములు చేఱని చెప్ప నావశ్యకము లేదు. కారణ మేమనఁగ: దేవతల యనుగ్రహముచే నైనను, నిగ్రహముచే నైనను సంభవించు సుఖదుఃఖములు సైతము తుదకు మనుజులు శరీరముచే నైనను, లేక, మనస్సుచే నైనను ననుభవింపవలయు నను విషయము (సంగతి) స్పష్టముగనే యున్నది. కాన వేదాన్తగ్రంథములలోని పరిభాషల ననుసరించి సుఖదుఃఖములను ద్రివిధముగ విభజింపక, వానికి బాహ్యములు, లేక, శారీరములు-ఆభ్యంతరములు, లేక, మానసికములు అని రెండు వర్గములను గల్పించి మొదటివానికి (అనఁగా: సర్వవిధము లగు బాహ్యములు, లేక, శారీరము లగు సుఖదుఃఖములకు) నాధిభౌతికము లనియు, సకలాభ్యంతరములు, లేక, మానసికము లగు సుఖదుఃఖములకు నాధ్యాత్మికము లనియుఁ, బే ర్లీ గ్రంథములో నాచే యోజింపఁబడినవి. వేదాన్తగ్రంథములో నున్న పరిభాష ననుసరించి

యాధిదైవిక మని మూఁడవ వర్గీకరణమును వదలినాఁడను. కారణ మేమి యన: మా మతమున సుఖదుఃఖముల శాస్త్రీయవివేచనఁ జేయు టకు నీ ద్వివిధవర్గీకరణమే యధికోపయుక్త మగును. ముందు సుఖ దుఃఖవివేచనఁ జదువునపుడు వేదాన్తగ్రంథముల యొక్కయు, మా యొక్కయు పరిభాషయందలి యీ భేదమును గుర్తుంచుకొనవలయును.

సుఖదుఃఖములు ద్వివిధము లన్నను, త్రివిధము లన్నను బాధ లేదు. దుఃఖము మాత్ర మెవరికిని వల దనియే యుండును. కాన సర్వవిధములగు దుఃఖములను బొత్తిగ నివర్తింపఁజేసికొనుటయు నిత్యము ఆత్యంతికము నగు సుఖము లభించునటుల చేసికొనుటయు నను నదియే, మనుజునకుఁ బరమపురుషార్థ మని వేదాన్త-సాంఖ్య శాస్త్రముల రెంటియందును ప్రతిపాదింపఁబడినది (సాం.కా.1; గీ.6.21-22). "ఆత్యంతిక సుఖమే పరమసాధ్య మని యిటులు నిర్ణీతమైన పిదప సత్యమును, నిత్యము నగు సుఖ మేదని చెప్పవలయును? ఆ సుఖము లభించునా? లభింపదా? లభించె నేని యెట్లు? ఎప్పుడు? ఇత్యాది విషయవిచారణ సహజముగనే కలుగును. మఱియు నీ విచారణ యారంభింపఁబడె నేని తొలుతనే నైయాయికలక్షణానుసార ముగ 'సుఖదుఃఖము' లను నీ రెండును వేర్వేఱును, స్వతంత్రములు నగు వేదనలా? అనుభవములా? లేక, వస్తువులా?" యనియు, "వెలుతురు లేకపోవుటయే 'చీఁకటి' యను న్యాయరీతి నీ రెండు వేదనలలో నొకదాని యభావమే రెండవదాని స్వరూపమా?" యనియుఁ బ్రశ్నలు వెలువడుచున్నవి. దాహముచే నోరెండిపోయిన ఆ దుఃఖనివారణకొఱకై రుచిగ~ జలమును పానముఁ జేసినటులును, ఆఁకలి యాయెనేని మంచి యన్నమును భుజించి యా పీడను నివర్తింపఁజేసికొనినట్లును. కామవాసన ప్రదీప్తమై దుస్సహమగునేని స్త్రీసంగమముచేఁ తృప్తుల మగుచున్నా మని చెప్పి భర్తృహరి తుద కిటుల వచించెను—

ప్రతీకారో వ్యాధే స్సుఖ మితి విపర్యస్యతి జనః.

— వ్యాధియో, దుఃఖమో యేదియో సంప్రాప్తమగు నేని, దాని నివారణయే సుఖమని లోకులు సెప్పుదురు. దుఃఖనివారణాతిరిక్త మగు సుఖపదార్థము వేఱుగ కానరాదు. మనుజుఁడు స్వార్థమై యే వ్యవహారమును జేయుచున్నాఁడో దానికి మాత్రమె యీ న్యాయము సంబంధించునది కానేరదు. ఇతరుని కుపకారముఁ జేయు వేళ నతని దుఃఖమును జూచి మన మనస్సున నుద్భవిల్లిన కారుణ్యవృత్తి దుస్సహమగు నేని యా దుస్సహత్వ పీడానివృత్తికొఱకై మనము పరోపకారముఁ జేయుదుమని యానందగిరి స్వామిమత మని పూర్వప్రకరణములోఁ జెప్పఁబడినది. ఈ పక్షము స్వీకరింపఁబడె నేని మహాభారతమున నొక స్థలమునందు—

తృష్ణార్తిప్రభవం దుఃఖం దుఃఖార్తిప్రభవం సుఖమ్.

(శాం. 25.22; 174.19).

— ఏదైన నొక యాశ ప్రథమమున నుత్పన్నమై, దాని పీడచే దుఃఖమును, ఆ దుఃఖపీడచే నుత్తరత సుఖము నుద్భవించును—అని సుఖదుఃఖము లెటుల వర్ణింపఁబడినవో, యదియే యథార్థమని చెప్పవలసి వచ్చును. "ప్రథమమున మనుజుని మనంబున నొకానొక యాశ, లేక, వాసన, లేక తృష్ణ గాని యుత్పన్నమగును. దాని వలన దుఃఖ మగు నేని యా దుఃఖనివారణమే సుఖ మగును. సుఖ మన వేఱైన స్వతంత్రపదార్థము లేదని యిందలి యభిప్రాయ" మని సారాంశము. విశేష మేల చెప్పవలయును? సంసారమందున్న మానవుల సర్వప్రవృత్తులు వాసనాత్మకములే, లేక తృష్ణాత్మకములే యగుటచే సర్వసాంసారికకర్మలను త్యాగముఁ జేయనియెడల తృష్ణాబీజము సంపూర్ణముగ నిర్దగ్ధము కానేరదు. మఱియుఁ దృష్ణాబీజము నిశ్శేషముగ నష్టము కానినాఁడు నత్యమున్ను, నిత్యము నగు సుఖప్రాప్తి యగుట సంభవింప దనియు, ఇంతకంటె నెక్కువగనే యేతన్మార్గా

వలంబులచే నూహ చేయఁబడినది. బృహదారణ్యకోపనిషత్తులో వికల్పముగను (బృ. 4.4.22; వే.నూ. 3.4.15), మఱియు జాబాల-సన్యాసోద్యుపనిషత్తులలో ముఖ్యముగను నిదియే మార్గము ప్రతిపాదింపఁబడినది. అష్టావక్రగీతలలోను (9.8; 10.3-8), అవధూతగీతలలోను (3.46) ఈ యర్థమే యనువాదము సేయఁబడినది. ఎవని కాత్యంతిక సుఖము (మోక్షము) ను సంపాదింపవలయునని యభిప్రాయము గలుగునో వాఁడు శక్యమగు నంత వేగముగా సంసారమును వదలి సన్యాసమును గ్రహింప వలయునని యీ మార్గముయొక్క చరమ సిద్ధాన్తమై యున్నది. శ్రుతిగ్రంథములలో వర్ణింపఁ బడినవియు, శ్రీశంకరులచే నీ కలియుగమున స్థాపింప బడినవియు నగు శ్రౌత-స్మార్త-కర్మ-సన్యాసమార్గము లీ సిద్ధాన్తమునననుసరించియే వెలువడినవి. ఇందువలన సుఖ మను వాస్తవమగు పదార్థము లేదనియు, ఉన్నదంతయు దుఃఖమే యనియు, అదియు తృష్ణామూలక మనియుఁ, గావుననే యీ తృష్ణాదివికారములనే మున్ను సమూలముగ నశింపఁజేసినఁ గాని 'స్వార్థపరార్థము' లను నుపద్రవము నశించి మనస్సునకు మూల సామ్యావస్థ (అనఁగా- శాంతి యను నదియే) మిగిలి యుండదనియు విస్పష్ట మగుచున్నది; మఱియు నీ యభిప్రాయము ననుసరించియే మహాభారతాంతర్గత శాంతి పర్వములో పింగల గీతలలోను, అదే తీరున మంకిగీతలలోను—

యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్,
తృష్ణాక్షయసుఖ స్యైతే నార్హత ష్షోడశీం కలామ్.

— ఇహలోకములో కామముయొక్క, (అనఁగా- వాసనయొక్క) తృప్తిచే నావిర్భూతమగు సుఖముయొక్కయు, స్వర్గము నందలి మహాసుఖముయొక్కయు, యోగ్యత తృష్ణాక్షయముచే లభించు సుఖముయొక్క పదియాఱవకళ (భాగ) యంతయైనను గానేర దని చెప్పఁబడినది (శాం. 174.48; 177.49). వైదికసన్యాస మార్గధర్మములే

జైనులు, బౌద్ధులు మొదలగు వారిచే ననుకరింపఁబడినవి. కావుననే యీ యుభయగ్రంథములయందుఁ దృష్ణయొక్క దుష్పరిణామమును, త్యాజ్యతయును, పూర్వోక్తరీతిగ వేయేల? నరసముగనే వర్ణింపఁబడినవి. (ఉదాహరణమునకు-'ధమ్మపదము' నం దున్న తృష్ణావర్గమును జూడుము.) టిబెట్ దేశమునందుస్న బౌద్ధధర్మ గ్రంథములలోఁ జూచిన యెడల మహాభారతమునందున్న పూర్వోక్తశ్లోకమే గౌతమబుద్ధునకు బుద్ధత్వము సంభవించిన పిదప వానిచే వాక్రువ్వఁబడినటుల చెప్పఁబడినది. *

పూర్వోక్త తృష్ణాపరిణామము భగవద్గీతాంగీకారమును సైతము పడసినదే. అయినను దానిని తప్పించుకొనుటకుఁ గర్మలను బొత్తిగ వదలుట యుచితము గాదని గీతాసిద్ధాన్త మగుటచే సుఖదుఃఖముల యొక్క వెనుకఁ జెప్పఁబడిన యుక్తుల నిచ్చో సూక్ష్మముగ విచారింప వలయును. తృష్ణ మొదలగు దుఃఖముల నివృత్తిచేతనే యన్ని సుఖములు కలుగు ననియు, సన్యాసమే ముక్తికి సాధన మనియుఁ గొంద ఱందురు. ఆ మాట మున్నన్ని విధములచేతను సత్యమని నుడువుటకు సాధ్యము కానేరదు. ఒకపరి యనుభవింపఁబడిన (చూడఁబడినవి, వినఁబడినవి మొదలగు) వస్తువులు మరలఁ గావలయునను కోరిక పొడముట, 'కామము', 'వానన', లేక, 'యిచ్ఛ' యని చెప్పుదురు. ఇష్టమగు పదార్థము శీఘ్రముగ లభింపనియెడల దుఃఖము కలుగును. అందుచే నీ యిచ్ఛ తీవ్రమగు చుండును. లేదా, లభించిన సుఖము చాలక యధికాధికముగఁ గావలయునను కోరికయేని పొడమును.

---

* Rockhill's Life of Buddha P. 33. 'ఉదానము' అను పేరు గల పాళీగ్రంథమున (పు. 2) ఈ శ్లోక మున్నది; కాని యీ శ్లోకము బుద్ధత్వము ప్రాప్తమగు సమయమందు బుద్ధుని వాక్కునందుండి వెలువడినదని పర్జింపఁబడ లేదు. దీనింబట్టి యీ శ్లోకము ఆదిబుద్ధుని ముఖమునందుండి వచ్చినది గాకయే యుండునని స్పష్టముగఁ గావ్రించుచున్నది.

ఈ యిచ్ఛల రెంటికే తృష్ణయను నామము ప్రాప్తమైనది; కాని కేవల మిచ్ఛ కీ రీతిగఁ దృష్ణాస్వరూపప్రాప్తి కాకమునుపే యా యిచ్ఛ పూర్ణ మైనయెడల దానివలనఁ గలుగు సుఖము తృష్ణాదుఃఖక్షయము వలన నైనదని నుడువుటకు సాధ్యము కానేరదు. ఉదాహరణ మేమియన- అనుదినమును నియతమగు సమయమునందే భుజించిన, ప్రతిదినము నందును భోజనమునకు ముందు మనకు దుఃఖము గలుగునని మన యనుభవమున లేదు. నియత కాలమున భోజనము లభింపని పక్షమున జీవ మాఁకలిచే వ్యాకుల మగును. లభించిన వ్యాకుల పడదు. మంచిదీ. తృష్ణకు నిచ్ఛకు నిట్లు భేదమును జెప్పక, రెండును సమానార్థకములే యని యంగీకరించిన, అన్ని సుఖములు తృష్ణా మూలకములే యను సిద్ధాన్తము స్థిరపడనేరదు. ఉదాహరణ మేమన- ఒకానొక బాలునినోట పటికబెల్లపు ముక్కను హఠాత్తుగఁ బడవేసి నపుడు దానివలన వానికిఁ గలుగు సుఖము వెనుకనుండు తృష్ణా క్షయము వలనఁ గలిగినదని చెప్పుటకు సాధ్యము కానేరదు. ఇటులే మన మే తావునకైనఁ బోవునపుడు, దారిలో రమ్యమగు నొక యుద్యానవన ముండి యందు మనోహరము లగు కోకిలధ్వను లాక స్మికముగ వీనులకు సోఁకినఁ గాని, లేక, యా దారిలోనే యొక దేవా లయ ముండి యందు దేవుని రమ్య మగు విగ్రహము గాన్పించినఁ గాని, మన మనంబునకుఁ గలుగు సంతోషరూప మగు సుఖ మంతకుఁ బూర్వము గలిగిన తృష్ణాదుఃఖము శాంతించుట వలనఁ గలిగినది కా దను విషయము, మన యనుభవములో నుండు నదియే. ఈ యుదా హరణము గుర్తుంచుకొందు మేని, సన్యాసమార్గమం దున్న పూర్వోక్త మగు సుఖశబ్దవ్యాఖ్యానమును వదలి "ఇంద్రియములకు వస్తువుల యందుండు మంచిచెడుగుల గ్రహింపఁ జేయు శక్తి స్వాభావికముగ నుండును గాన, తదనుసారముగ నింద్రియములు దమ తమ వ్యాపా రములఁ జేయుచుండ, వాని నొక సమయమునం దనుకూలముగను, మఱియొక సమయమునం దననుకూలముగను విషయము ప్రాప్త

మగును గావున నదివఱకుఁ దృష్ణ, లేక, యిచ్ఛ లేకపోయినను మనకు సుఖదుఃఖములు కలుగు" నని చెప్పవలసివచ్చును. ఈ యభిప్రాయ మునే మనస్సున నిడుకొని "మాత్రాస్పర్శ" ముచే శీతోష్ణాదికముల యనుభవములు గలుగుట వలన "సుఖదుఃఖము లుద్భవిల్లు"నని గీత లలోఁ జెప్పఁబడినది (గీ. 2. 14). సృష్టిలోని బాహ్యపదార్థములకు 'మాత్ర'యని పేరు. ఈ బాహ్యపదార్థములకు నింద్రియములకు సం యోగ మగునేని సుఖరూపము, లేక, దుఃఖరూప మగు వేదన యుత్ప న్నమగునని దీని యర్థము; అదియే కర్మయోగముయొక్క సిద్ధాన్తము. "పీనులకు కఠినధ్వని యేల యప్రియము గావలయును? నాలుకకు మధురరసము ప్రియమగు నెట్లు? నేత్రములకుఁ బున్నమ నాఁటి వెన్నెల యానందదాయకముగఁ దోఁపనేల?" అను ప్రశ్నలకు సమా ధాన మెవ్వరును జెప్పలేరు. జిహ్వకు మధురరసము లభ్ద మైనఁ దృప్తి కలుగు నని మాత్రమే మనకుఁ దెలియును. అధిభౌతిక సుఖస్వరూప మీ రీతిఁ గేవల మింద్రియాధీన మగుటచేఁ బిదప దాని పరిణామ మే మైనను ననేక సమయములయం దిట్టి వ్యర్థ మగు నింద్రియ వ్యాపా రము నడచుటలోనే సుఖ మున్నటులఁ దోఁచును. ఉదాహరణ మేమ నఁగా: మన మే దేని యొక యాలోచనఁ జేయునపుడు తఱుచుగ మన కలవాటుగు శబ్దము (మాటలు) లప్పు డప్పుడు మన నోటినుండి యప్రయత్నముగ వచ్చినను మన యాలోచన లితరుల కేమియుఁ దెలియఁజాలవు. మఱి యొకప్పుడు వీనికి విరుద్ధముగ, ననేక సమ యములం దిట్టి స్వాభావిక మగు వ్యాపారముచే మనంబునందు రహస్యముగ నిడుకొనఁదగిన విషయము వెల్లడి యగుటచే నష్టము సైతము సంభవించును. పసివాఁడు తొలుత నడువ నభ్యసించు సమయమున దిన మంతయు నటు నిటు వ్యర్థముగఁ దిరుగుదురు. ఇటు లేల తిరుగుదు రనఁగా నట్లు తిరుగుట వారికి సంతసముగ నుండుటయే. కావున సుఖము లన్నియు దుఃఖాభావరూపముగనే

యున్న వని చెప్పక_"ఇంద్రియ స్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవ స్థితౌ"_ ఇంద్రియములకును, శబ్దస్పర్శాది విషయములకును నడుమ రాగము, ద్వేషము ననునవి రెండు వ్యవస్థితములై యున్నవి. అనఁగా ప్రారంభము నుండియు స్వతస్సిద్ధములుగనే యున్నవి (గీ. 3. 34) అని భగవద్గీతలలోఁ జెప్పఁబడినందున నీ వ్యాపారమాత్ర కల్యాణార్థ మెటు లగును? లేక, కల్యాణదాయక మెటు లగు?" నను విషయము మాత్రమే మనము విచారింపవలయును. మఱియు దాని నిమిత్తమై యింద్రియముల యొక్కయు మనస్సుయొక్కయు వృత్తిని నశింపఁ జేయుట యను నమ్మకమునకుఁ లోఁబడక యీ వృత్తిచే మనకు లాభోత్పత్తి యగుటకై యింద్రియములను, మనస్సును మన యధీన ములుగ నుంచుకొన వలయుననియు, వాని యిష్టమువచ్చినటు లెల్ల నడువనీయఁ గూడదనియు భగవంతుని యుపదేశమై యున్నది. ఈ యుపదేశమునకును, తృష్ణను సర్వమనోవృత్తులను సమూలముగ నశింపఁజేయవలయు నని చెప్పుటకును, భూమ్యాకాశముల కున్నంత భేదముండును. జగత్తులోని సర్వపదార్థములను, లేక, కర్తృత్వము లను బొత్తిగ నశింపఁజేయవలయు నని గీతయొక్క తాత్పర్యముగాదు మఱి యేమన:_ పదునెనిమిదవ యధ్యాయములో (18 26) కర్త యందు సమబుద్ధి వెంటనే, ధృతి, ఉత్సాహము నను గుణము లుండ వలయు నని గీతాశాస్త్రము చెప్పుచున్నది. కాని యీ విషయమై మున్నధికముగ విచారింతము. ప్రస్తుతము "సుఖదుఃఖము లనునవి భిన్నవృత్తులా? లేక, యొకదాని యభావమే రెండవదా?" యను విషయము మాత్రమే విచారణీయము; ఈ విషయమున గీతల యభిప్రాయ మేది యను సంశము పూర్వోక్త వివేచనచేఁ జదువరు లెఱుంగుదురు. క్షేత్ర మన నేమియో చెప్పుచు సుఖదుఃఖములు వేర్వేఱుగ గణింపఁబడిన వనుట (గీ. 13. 6) మాత్రమే కాక, సుఖ మనునది పత్త్వముయొక్క యు, తృష్ణ యనునది రజస్సుయొక్క యు లక్షణమని

చెప్పుటచే (గీ. 14. 6. 7) సత్త్వరజోగుణములు వేర్వేఱుగ స్వీకరింపఁ బడినవి. ఈ హేతువుచే సైతము సుఖదుఃఖములు రెండును బరస్పర ప్రతియోగు లైనను వేర్వేఱుగు రెండు వృత్తు లని భగవద్గీతలలో నంగీకరింపఁ బడినటుల స్పష్టముగనే యున్నది. ఏ పనియైనను దుఃఖకరముగ నున్నదని వదలుటచే త్యాగఫలము రా దనియు, నీ త్యాగము రాజస మనియు (గీ. 18. 8) చెప్పుటచే రాజసత్యాగమునకుఁ బదునెనిమిదవ యధ్యాయమునఁ జూపఁబడిన న్యూనత సైతము 'సర్వసుఖమును దృష్ణాక్షయమూలక మైనదే' యను సిద్ధాన్తమునకు విరుద్ధముగ నున్నది.

"సర్వసుఖములును తృష్ణాక్షయరూపములు గాని, దుఃఖాభావరూపములు గాని కానందున సుఖదుఃఖము లనునవి రెండును స్వతంత్రవస్తువు లని యంగీకరించినను, ఈ రెండు వేదనలు పరస్పర విరుద్ధములుగాఁ గాని, ప్రతియోగులుగాఁ గాని యగుటచే నేమియు దుఃఖానుభవము లేనివారికి సుఖముయొక్క రుచి నెఱుంగుటకు శక్యమగునా? కానేరదా? యని మఱియొక ప్రశ్న కలదు. మొదట దుఃఖానుభవము కలిగినఁ గాని సుఖముయొక్క రుచి తెలిసికొనుటకు శక్యము కాదని యనేకుల యభిప్రాయ మయి యున్నది. సుఖముయొక్క రుచి తెలియవలయు నేని పూర్వము దుఃఖానుభవ మావశ్యకము కానేర దనుటకు స్వర్గమునందలి దేవతల నిత్యసుఖమును దృష్టాంతముగఁ గైకొని కొందఱు పూర్వోక్త విషయమునకు విరుద్ధముగనే సమర్థింతురు. కారముగ నుండు పదార్థమును దినైనఁ దినక పోయినను, బెల్లము, పంచదార, మామిడిపండ్లు, అరఁటిపండ్లు మొదలగు పదార్థములయొక్క వేర్వేఱగు మాధుర్యము నెఱింగినటులును, మున్నుగా దుఃఖానుభవము లేకపోయినను, దూదిమెత్తపైఁ బరుండునప్పటికంటె హంసతూలికా తల్పమునఁ బరుండునప్పుడును, మేనావారిలో నున్నప్పటికంటె పాలకీలో నున్నప్పుడును, గలుగు

వేర్వేఱగు సుఖము నెడతెగకుండ నదా యనుభవించుటచే వినువు కొనకుండ నుండుట యశక్యము గానేరదు: కాని యీ జగత్తునందలి వ్యవహారముల నాలోచింపఁగా నీ వాదమే వ్యర్థముగఁ గాన్పించు చున్నది. దేవతలకును విశేషముగ సంకటములు తటస్థించినటుల పురాణములలో ననేక దృష్టాంతము లుండుటచేతను, స్వర్గసుఖము గూడ పుణ్యము నశింపఁగనే నశించుటచేతను, స్వర్గమున నుండువారి దృష్టాన్తము దీనిని సమర్థింప లేదు. (అనఁగా- ప్రకృతార్థసాధకము గానేరదు). ఒక వేళ సమర్థించిన నది మనకు ప్రకృతోపయోగి యెటు లగును? "నిత్య మేవ సుఖం స్వర్గే" అనునది సత్య మని యంగీకరించినను, దాని వెంటనే "సుఖం దుఃఖ మిహోభయం"- ఈ జగత్తున సుఖదుఃఖములు రెండును కలసియే యున్నవి (మ.భా. శాం 190.14) అని చెప్పఁబడినది. దాని ననుసరించియే సమర్థరామ దాసుగారు సైతము- "జగీ సర్వసుఖీ అసా కోణ అహే, విచారే మనా సర్వశోధూన పాహే"- లోకమందు సర్వసుఖియెవఁడు గలఁడు? ఓ మనసా! నీవే బాగుగ విచారించి చూడుము అని తమ యనుభవమును చెప్పిరి. ఇంతియ కాక-

సుఖం సుఖే నేహ న జాతు లభ్యం
దుఃఖేన సాధ్వీ లభతే సుఖాని.

(మ.భా.వన. 233.4)

సుఖముచే సుఖ మెపుడును లభ్యము కానేరదు; పతివ్రత సుఖ పడుటకై కష్టము నోర్వవలయును అని ద్రౌపది సత్యభామ కుపదే శించినదియు లోకానుభవము ననుసరించి యుండుటచే సత్యమే యనవలయును. కారణ మేమియన- నేరేడుపండు పెదవిపై బడినను నోటికి లాగుకొనవలసి వచ్చును. నోటియందుఁ బడినను చప్పరింప వలసిన కష్టముఁ జేయవలసివచ్చును. కష్టపడిన పిదప నరునకుఁ గలుగు సుఖమునకును, సదా సుఖమునే యనుభవించువాని కుండు

సుఖమునకును మిక్కిలి తారతమ్యము గల దను విషయము నిర్వి వాదమే! కారణమేమి యన- నదా సుఖానుభవముదే, సుఖానుభవ సాధనము లగు నింద్రియముల శక్తి సైతము తగ్గును.

ప్రాయేణ శ్రీమతాం లోకే భోక్తుం శక్తి ర్న విద్యతే,
కాష్ఠా న్యపి హి జీర్యన్తే దరిద్రాణాం చ సర్వశః.
(మ.భా.శాం. 28.29).

— తఱుచుగ భాగ్యవంతునకు రుచ్యమగు నన్నముఁ దినుట కైనను శక్తియుండదు. దరిద్రునకు కొయ్యలైనను పూర్తిగ జీర్ణము లగును. ఈ నంగతి ప్రసిద్ధ మైనదియే కావున "ఐహిక మగు విచారణయే చేయునపుడు దుఃఖము ననుభవింపకయే సుఖమును మాత్ర మనుభవ గోచరము చేసికొన నగునా? కానేరదా?" యను విషయమును విచారించుటకై వ్యర్థముగ కాలయాపనఁ జేయుటచే నేమియుఁ బ్రయోజన ముండదు. "సుఖ స్యానంతరం దుఃఖం, దుఃఖస్యానం తరం సుఖమ్"—సుఖము వెంబడి దుఃఖము దుఃఖము వెంబడి సుఖము సంబంధించియే యున్నవి" (మ.భా.వన, 260.49; శాం. 25.23). మఱియు మేఘసందేశ కావ్యమున (మే.1.14) మహాకవికాళిదాసుఁడు.

క స్యైకాంతం సుఖ ముపనతం దుఃఖ మేకాంతతో వా,
నీచైర్గచ్ఛ త్యుపరి చ దశా చక్రనేమి క్రమేణ.

— ఎవరికైన నదా సుఖమే కలుగునా? లేక, దుఃఖమే కలుగునా? సుఖదుఃఖములస్థితి చక్రనేమివలె నొకపరి పైకిని, మఱియొకపరి క్రిందికిని వచ్చుచుండు నని చెప్పినట్లు సుఖదుఃఖముల విషయ మెల్లప్పు డిటులు జరుగుచునే యుండును. కాని యీ దుఃఖము మన సుఖముయొక్క మాధుర్యమును వృద్ధిపఱచుట కేర్పడినను సరియే! లేక, ప్రకృతి వికారమగు నీ సంసారమందు దేని కుపయోగించినను సరియే. వినువు పుట్టుక నొకటే విధముగ విషయసుఖమె లభించుట

బొత్తిగ నసంభవము గాకపోవచ్చును; కాని దుఃఖ మేమాత్రము లేక సుఖము మాత్రమే యనుభవసిద్ధ మగుట యీ లోకమునమాత్ర మశక్యము. మఱియొక లోకమున శక్యమగు నేమో!!

జగత్తునం దున్నవ్యవహార మంతయు, కేవల సుఖమయము గాకపోవుటచే సుఖదుఃఖాత్మక మని తప్పక నుడువ ననువగుట వలన, "సంసారమున సుఖ మధికమా? దుఃఖ మధికమా?" యను మూఁడవ ప్రశ్న వెలువడును. ఆధిభౌతిక సుఖమే పరమసాధ్య మని యంగీకరించు పాశ్చాత్యపండితులలో ననేకులు "సంసారమునందు సుఖముకంటె దుఃఖమే యధిక మగు నెడల, సంసారమునందలి యుపద్రవమునఁ బడక, యందఱో, లేక, యధిక సంఖ్యాకు లగు జనులో, యాత్మహత్యఁ జెసికొని యుందు రని యభిప్రాయపడు చున్నారు. మనుజుఁడు తన జీవితకాలము వృద్ధి యగుచున్న దని యేవగించుకొనుట లేదు. కావుననే సంసారమునం దతనికి దుఃఖము కంటె సుఖమే యధికముగ ననుభవములో నుండవలయును. కావు ననే, సుఖ మనునదియే యందఱికును పెక్కింటికంటె ముఖ్యముగ సాధింపఁదగినదని యెంచి ధర్మాధర్మ నిర్ణయమును సైతము తదను సారముగనే చేయవలయును; కాని యాత్మహత్యకును, సంసార సుఖమునకును గల్పించిన సంబంధము బాగుగ నాలోచించిన సత్యము గానేరదు. ఒకానొక సమయమున, నెవఁడో యొకఁడు సంసారమున విసువుఁజెంది ప్రాణత్యాగమునుసైత మొనర్చుచునేయున్నాఁడు; కాని యటులు వాఁడొనర్చు కార్యమును లోకులపవాదములలో (అనఁగా- వెట్టిపనులలో) నొకదానినిగఁ జెప్పదురు. ఇందువలన జీవమును బోఁగొట్టుకొనుటయుఁ, బోఁగొట్టుకొనక పోవుటయు, ననువానికి సంసారసుఖముతో సంబంధ ముంచక సామాన్యజనులు దీని నొక స్వతంత్రమగు విషయమని తలఁచుచుండు నటుల కాన్పించుచున్నది. నాగరికులగు మనుజులకు మిక్కిలి కష్టమని తోఁచు మోటుమనుజుని

నంసారమును విచారించిన నీ యూహయే కలుగును. ప్రసిద్ధుఁడును, సృష్టిశాస్త్రజ్ఞుఁడు నగు 'చార్లెస్ డార్విన్' అను నతఁడు తన ప్రవాస గ్రంథములో దక్షిణ అమెరికాలో మిక్కిలి దక్షిణదేశము యొక్క ప్రాంతమునందుఁ దన కనుభవములోనున్న మోటుజనుల వర్ణించుచు "ఈ మోటుజనులు— పురుషులును స్త్రీలు అత్యంత శీతల మగు తమ దేశములో పండ్రెండు నెలలును దిగంబరులై తిరుగుదురు. తమయొద్ద నాహారపదార్థములను నిలువఁజేసికొనక పోవుటకే ననేకదివసము లాహారమే లేక జీవింపవలసినవారు. అయినను వారి జనసంఖ్య వృద్ధియగుచునే యున్నది." * అని వ్రాసెను. కాని యట్టి మోటు జనులైనను జచ్చుట కిష్టపడరు. ఇంతమాత్రమునకే వారి నంసారము సుఖమయమని యెవ్వరును జెప్పఁజాలరు. వా రాత్మహత్యఁ జేసికొన రను మాట సత్యమే. దానికిఁ గారణ మేమై యుండునని సూక్ష్మముగ విచారించితి మేని, "నేను పశువును గాను, మనుజుఁడను" అను విష యముననే యొక్కొక్కఁడును నంతసించు చున్నాఁడని తోఁచును. ఇతర ములగు నన్ని సుఖములకంటె మనుజుఁ డగుట యను సుఖమును, ఎంత కష్టమయ మైనను ఈ నంసారముపై దృష్టి నుంచక మనుష్య త్వమునకుండు నీ శ్రేష్ఠమగు నానందమును, బోఁగొట్టుకొనుట కెప్పు డును సిద్ధము కానంత గొప్ప దానినిగ నెన్నును. మనుజుఁడే కాదు. పశుపక్ష్యాదులు సైత మాత్మహత్యఁ గావింపవు. కావున వాని నంసార ములు సైతము సుఖమయమే యగునా యేమి? అనఁగా— మనుజు డైనను లేక, పశుపక్ష్యాదు లైనను చచ్చుట కిష్టపడనంత మాత్రము ననే వారి నంసారము సుఖమయముగా నున్నదను భ్రమను గలి గించు నూహను జెందకూడదు. మఱి యేమనఁగాఁ— నంసార మెటు లున్నను లెక్కసేయక బొత్తిగ నచేతన మైనది సచేతన మైనదిగ మాఱుటలోనే యపరిమితానంద మున్నదనియు, ఆ చేతనము గల

* Darwin's Naturalist's Voyage Round the World, Chap. X.

వానిలో సైతము మానవుఁడ నైతి నను నానందము సర్వశ్రేష్ఠమైన దనియు, నత్యమగు నీ యనుమానమే యే జంతువును చచ్చుట కిష్ట పడకపోవుటచేఁ దేలు ననియు మన శాస్త్రకారులు సిద్ధాన్తముఁ జేసిరి-

భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః,
బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠా నరేషు బ్రాహ్మణాః స్మృతాః.
బ్రాహ్మణేషు చ విద్వాంసః విద్వత్సు కృతబుద్ధయః,
కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవాదినః.
(మను. 1.96.27; మ.భా.శాన్తి. 5-12)

— అచేతనములకంటె సచేతనములు, సచేతనములలో సైతము బుద్ధి గలవియు, బుద్ధిగలవానిలో మనుజులును, మనుజులలో బ్రాహ్మణులును, బ్రాహ్మణులలో విద్వాంసులును, విద్వాంసులలో కృతబుద్ధులును (సంస్కృత బుద్ధిగలవారు), కృతబుద్ధులలో కర్తలును, కర్తలలో బ్రహ్మవాదులును-అని మన శాస్త్రములలో నంతకంత కెక్కువవాఁడగుటకుఁ జెప్పఁబడిన మార్గము దీని ననుసరించియే చెప్పఁబడినది. ఈ న్యాయము ననుసరించియే "యెనుబదినాలుగు లక్షలయోనుల లోను నరదేహము శ్రేష్ఠము; నరులలో ముముక్షువు; ముముక్షువులలో సిద్ధుఁడు" నని ప్రాకృత గ్రంథములలోఁ జెప్పఁబడినది. "సబ్ సే జీవ్ ప్యారా"- అన్నిటికంటె తన ప్రాణ మెక్కువ యైనది అని చెప్పుటలో నిదియే తాత్పర్య మగుటచే నీ సంసారము దుఃఖమయ మైనను నాత్మహత్య చేసికొనిన వారిని వెట్టివాఁడనియు, ధర్మ శాస్త్రానుసారముగఁ బాపు లనియు నెన్నెదరు (మ.భా.కర్ణ. 70-28). ఆత్మహత్యను జేసికొనుటకు యత్నించుటయే నేర మని దండనీతి శాస్త్రజ్ఞులు నుడువుదురు. మనుష్యుఁ డాత్మహత్యఁ జేసికొనక పోవుటచే సంసారము సుఖమయ మని యనుమానముఁ జేసికొనుటకు మార్గము లేదవి యీ తీరున సిద్ధాన్త మయిన పిదప సంసారము సుఖమయమా? దుఃఖమయమా?" యను ప్రశ్నకు సమాధానముఁ జెప్పు

టకుఁ బూర్వకర్మానుసారముగ నొక్కపరి తనకు లభించిన నరదేహమును స్వాభావికమగు నదృష్టము నొక మూలనుంచి, తదుత్తరకాలీనమైన దానిని (అది లభించిన పిదప నగు దానిని; అనఁగా- సంసారమందున్న విషయమును మాత్రము) మనము విచారింపవలయును. మనుష్యుఁడు జీవించియుండుటయే సంసారమునఁ బ్రవర్తించుటకుఁ గారణముగ నున్నది. ఆధిభౌతికపండితులు సెప్పినటుల, "సంసారమందున్న సుఖాధిక్యమునకుఁ బూర్తి యనునది లేదు- చావకుండవలయుననుబుద్ధి స్వాభావికముగనే యున్నది. అది సంసారమందున్న దుఃఖముల తారతమ్యముచేఁ బుట్టినది కానేరదు అని మఱియొక విధమున నుపపాదింపవచ్చును. కావుననే సంసారము సుఖమయముగా నున్నదను విషయము జీవించియుండవలయునని స్వాభావిక సుఖముగ నుండుటచే సిద్ధము గానేరదు.

కేవల మనుష్యజన్మ రూపమగు మహాభాగ్యము, పిదప సంభవించిన మానవ సంసారము నను విషయములను బొరపాటు కలుగునటుల కలుపక మనుష్యత్వము, మనుజుల సంసారము (అనఁగా- నిత్యవ్యవహారము) అను నీ రెంటిని వేఱ్ఱేఱుగాఁ జేసిన పిదప, "శ్రేష్ఠుఁడును, నరదేహధారియు నగు ప్రాణికి సంసారమందు సుఖమధికమా? దుఃఖమధికమా?" అనుప్రశ్నకు నుత్తర మిచ్చుటకు ప్రతిమనుజునకు గల 'ప్రస్తుత' వాసనలలో నెన్ని సఫలము లయినవో, యెన్ని నిష్ఫలము లైనవో యను నీ విషయమును విచారించుట దక్క రెండవ సాధన మేమియు లేదు. ప్రస్తుత మని చెప్పుటకు గారణ మేమి యన- అందఱు నాగరికులు సనుభవించుచున్న విషయ మెల్లప్పు డనుభవింపఁబడుటచే దానిలోని సుఖమును మనము మఱచిపోవు చున్నాము. నూతనముగ మనకుఁ గావలయునని తోఁచు వస్తువులలో నెద్ది లభించుచున్నదో యెఱింగి దాని మూలమునసే సంసారమందున్న సుఖదుఃఖముల నిర్ణయించు చున్నాము.

ఇప్పుడు మనకెన్ని సుఖసాధనము లున్నవో, నూఱేండ్లక్రింద వీనిలో నెన్ని సుఖసాధనము లున్నవో వానిని సరిచూచుటయును, నేఁడు నేను సుఖముగ నున్నానా? లేదా? యని విచారించుటయు ననుసీ రెండు విషయములును మిక్కిలి భిన్నములుగ నున్నవి. ఉదాహరణ మేమి యన- నూఱేండ్ల క్రిందట నెడ్లబండిపైఁ బ్రయాణముఁ జేయుట కంటె నిప్పుడు ధూమశకటముతోఁ బ్రయాణముఁ జేయుట చాల సుఖకర మను నంగతి నెల్లరు నొప్పుకొందురు; కాని, ధూమశకటము వల్లనగు సుఖము సిప్పుడు మఱచుటచే నొకప్పుడు ధూమశకట మాలస్య మైనప్పుడు మనకు మిక్కిలి కష్టమై తోఁచును. కావున, ఉన్న సుఖసాధనమును లక్ష్యపెట్టక మనుష్యుని ప్రస్తుత సుఖదుఃఖముల విచారమును ప్రస్తుతమందున్న వాని యావశ్యకతను బట్టియే చేయుచున్నాఁడు. ఈ యావశ్యకత యెంతవఱకని విచారింప, దాని కెప్పుడు నంతము లేదని స్పష్ట మగును; నేఁ డొక కోరిక సఫలమైనను రేపు దానిస్థానమున మఱియొక కోరిక పుట్టుటచే నీ క్రొత్తకోరికనే నెరవేర్పవలయునని తోఁచును; మానవునికోరికయు నొక యడుగు మున్నగనే పరువిడుచుండుటచే నతని శిరోబాధ యెప్పటికిని మాయు నది కానేరదు. "సుఖ మంతయుఁ దృష్ణాక్షయరూపకముగనే యున్నది. ఎంత సుఖము లభించినను మనుష్యుఁడు మరల ననంతుష్టుఁడుగనే యుండును" అను నీ రెండువిషయముల భేదము నిప్పట్టున లెస్సగ గుర్తుంచు కొనవలయును- ప్రతిసుఖమును దుఃఖాభావ రూపముగ నుండక పోవుటచే సుఖదుఃఖము లనునవి యింద్రియముల స్వతంత్రములగు రెండువేదనలుగ నున్నవని చెప్పుట లేదు. ఒకప్పుడు లభించిన యే సుఖములచే నైనఁ దృప్తినొందక యింకను సుఖమే కావలయునని చెప్పి యసంతుష్టుఁడుగ నుండుట వేఱు. ప్రథమ వాదము సుఖముయొక్క వస్తుస్వరూపమును సంబంధించి యున్నది. "ప్రాప్త మయిన సుఖముచే సంపూర్ణ మగుతృప్తి యగునా? కానేరదా? యనునది రెండవప్రశ్న యయి యున్నది. విషయావన యెల్లప్పుడు

నొక తీరుననె వృద్ధినొందు చుండుటచే ననుదినము నూతనము లగు సుఖములు లభింపక పోయినను పూర్వపుసుఖములనే యనుభ వింపవలయునని తోఁచుటచే మనోవాంఛ యెంతయుఁ దఱుఁగదు. 'ల్హాసెలియస్' అను రోమన్ చక్రవర్తి జిహ్వాసుఖమును దఱుగ నీ కించి భుజించిన యన్నము నోషధిమూలమునఁ గ్రక్కి యనుదినము పెక్కుమాఱులు భుజించువాఁ డని యొక కథ గలదు; కాని, పఱ్ఱా త్తప్తుఁడగు యయాతియొక్క కథ యింతకంటె నెక్కువ నీతిని బోధించుచున్నది. ఒకప్పుడు యయాతిని శుక్రాచార్యు లోక కారణ మున వృద్ధుఁ డగునటుల శపించెను. మరల దయ గలిగి యితరుల కా ముదునలితనము నిచ్చి, యాతని పడుచుందనమును స్వీకరింప నగునని యాచార్యుం డనుగ్రహించెను. వెంటనే యయాతి తన పుత్రుఁడగు 'పూరువు' యొక్క పడుచుందనముఁ గైకొని వేయివత్స రంబు లొక్కతీరున విషయసుఖముల ననుభవించి తుదకు భూమిలో నుండు సకలపదార్థములును నొక మనుష్యుని కైనను సుఖాభిలాష ముల శమింపఁజేయఁ జాలవని తెలిసికొనెను. మఱియు—

న జాతు కామఃకామానా ముపభోగేన శామ్యతి,
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే.

(మ. భా. ఆ. 75. 49)

— సుఖోపభోగముచే విషయాభిలాష శమింపదు. హోమద్రవ్యముచే నగ్ని శమింప నటుల విషయోపభోగముచే విషయాభిలాష యధికా ధికముగ వృద్ధినొందును అని యయాతి వాక్కుచ్చె నని మహాభార తములోని యాదిపర్వమున వ్యాసులు వక్కాణించియున్నారు. మఱియు ని శ్లోకము మనుస్మృతి యందు సైత మున్నది (మను. 2.94). సుఖ సాధనము లెంత యధికముగ నున్న నింద్రియాభిలాష యెల్లపుడు మితి లేక యభివృద్ధి నొందుచుండుటచే నెల్లపుడును సుఖ మనుభ వింప మనుజుఁడు కోరుచుండును. అందుచే సుఖేచ్ఛ యెప్పుడును

శాంతి పొందనేరదు. దాని కెట్టి యాటంకమునైనఁ గలిగింపవలయు ననుటయే దీని కాత్పర్యము. ధర్మశాస్త్ర గ్రంథకారుని తత్త్వము పూర్ణముగ మాన్య మగుటచే, కామోపభోగములకుఁ బ్రత్యేకముగ నేది యైన నియమ ముంచవలయు నని వా రందఱు తొలుతనుండియు నుదువుచునే యున్నారు. విషయోపభోగ మనునదియే యీ జగత్తునఁ బరమసాధ్యముగ నున్న దని చెప్పఁ జను లీ యనుభవసిద్ధాన్తము వైపునకుఁ గొంచెము చూచినయెడల వారి మతమునం దున్న నిస్సారత వారికిఁ దప్పక తెలియును. వైదిక మతసంబంధ మగు నీ సిద్ధాన్తము బౌద్ధధర్మములలోను స్వీకరింపఁ బడుటచే యయాతికి ప్రతినిధిగ మాంధాత యను పురాణప్రసిద్ధుఁ డగు రాజు మరణ సమ యమునందు—

న కహాపణవస్సేన తిత్తి కామేసు విజ్జతి,
అపి దిబ్బేసు కామేసు రతి సో నాధిగచ్ఛతి.

(ధమ్మపద. 188. 187)

— కార్షాపణము లనెడు నాణెములు వర్షించినను కోరికలు శమింపవు. స్వర్గసుఖములు లభించినను కాముకుఁ డగు పురుషునకు కామము శాంతింపదు అని చెప్పినట్లు బౌద్ధగ్రంథములలో వర్ణింపఁబడినది. విషయోపభోగము పూర్తి యగుట యీ రీతి నెప్పటికి నశక్య మగుటచే ప్రతి మనుష్యునకును "నేను దుఃఖించు చున్నాను" అనియే యెప్పుడును దోఁచును. ప్రతి మనుజునకు నీ రీతిగనే యుండునని తెలిసికొనిన యెడల మహాభారతమునందుఁ జెప్పిన తీరున—

సుఖా ద్బహుతరం దుఃఖం జీవితే నాస్తి సంశయః

(మ. భా. కాం. 205. 8; 330. 18)

— ఈ జీవితమునందు (అనఁగా: సంసారమునందు) సుఖముకంటె దుఃఖమే యధికముగ నున్నది. మఱియు తుకారాం బావా వర్ణించిన తీరున—

సుఖ పాహతాఁ జవాపాడేఁ దుఃఖ వర్వతా ఏవడేఁ
(తుకా. గా. 2078)

— ఈ సంసారమున సుఖమును విచారించిన నావగింజంత యనియు, దుఃఖమును విచారించినఁ బర్వతమంత యనియుఁ దెలియును అని సిద్ధాన్తముఁ జేయుట యవసరము. ఉపనిషత్తుల సిద్ధాన్త మిటులే యగుటచే మైత్ర్యుపనిషత్తులలోను (మైత్ర్యు. 1 2-4) గీతలలోను సైతము మనుష్యజన్మ మశాశ్వత మనియు, దుఃఖాలయ మనియు, పృథ్వి యందున్న సంసార మనిత్య మనియు సుఖముగ నున్న దనియుఁ (గీ. 8. 15; 9. 33) జెప్పఁబడినది. జర్మనీ పండితుఁడగు 'శోపెన్‌హాఎర్' అను వానికి సైత మిదియే సమ్మత మగుటచే దానిని సిద్ధపఱచుట కొఱకొక చమత్కార మగు దృష్టాంతము చెప్పఁబడినది. అది యేది యనఁగా: మనుష్యుల కున్న సుఖేచ్ఛ లన్నిటిలో నెన్ని సఫలము లగుచున్నవో వానిం బట్టి యతఁడు సుఖి యని తెలిసికొను చున్నాను. సుఖేచ్ఛకంటె సుఖోపభోగము కొఱతవడు నెడల దానిం బట్టి యాతఁడు దుఃఖి యనుకొనుచున్నాను. ఈ ప్రమాణమునే గణిత శాస్త్రము ననుసరించి చూపవలసినయెడల సుఖోపభోగమును సుఖే

చ్ఛచే భాగించి, అపూర్ణాంకరూపముచే $\frac{\text{సుఖోపభోగము}}{\text{సుఖేచ్ఛ}}$ అని వ్రాయ

వలయును; కాని యీ యపూర్ణాంక మించుక విలక్షణముగ (అనఁగా వేఱుగ) నున్నది. దానియొక్క (సుఖేచ్ఛయొక్క) ఛేదము, దాని యొక్క (అనఁగా: సుఖోపభోగముయొక్క) యంశముకంటె నధిక ముగ వృద్ధి నొందుటచే నీ యపూర్ణాంకము $\frac{3}{4}$ ఉన్నయెడల, పిదప $\frac{3}{8}$ (అనఁగా: అంశము త్రిగుణమైన యెడల ఛేద మైదంతలు వృద్ధిఁ జెంది యధికాధికముగ నపూర్ణమే) అగుచుండును. కావున మను ష్యుఁడు పూర్ణసుఖము గలవాఁ డగు నని యాశఁ జెందుట వ్యర్థముగ నున్నది. మునుపు సుఖ మెంత యున్న దని విచారించుచు నీ య

పూర్ణాంశముయొక్క యంశస్థానమునే మనము స్వతంత్రముగ విచారించితి మేని యంశముకంటె భేదము విశేషము వృద్ధిఁ జెందిన దను విషయ మాలోచనకే రాఁజాలదు; కాని కాలయాపనము నపేక్షింపక "మనుజుఁడు సుఖియా? దుఃఖియా?" యను సంగతి మాత్రమే విచారింప వలసినపుడు, అంశము, భేదము అను నీ రెంటియొక్క విచారణఁ జేయవలసివచ్చును; మఱియు నీయపూర్ణాంక మెప్పుడును పూర్ణము కానేర దను సంగతి మనస్సునకుఁ దోఁచును. "న జాతు కామఃకామానాం" (మ. 2. 94) అను వచనము యొక్క భావము నిదియే. సుఖదుఃఖముల పరిమితిని దెలిసికొనుటకు, వేఁడిని కొలుచు యంత్రము (అనఁగా: థెర్మామీటరు) వంటి నిశ్చితమైన సాధనములు లేకపోవుటచే, వాని తారతమ్యమునకు గణితశాస్త్రపద్ధతిగ నొనర్చిన ప్రస్తారము ననేకు లొప్పుకొనరు; కాని యీ పూర్వపక్ష సిద్ధాంతముల రీతిగ నంసార మందున్న మనుజునకు సుఖ మెక్కు డని స్థిరపఱుచుట కెట్టి కొలఁత గాని తూనిక గాని కానరాదు. కావున నుభయ పక్షములకును సాధారణమగు నా యాక్షేప మిదివరలోఁ జేయఁబడిన యుపపాదనలో నున్న సామాన్య సిద్ధాంతమునకు (అనఁగా సుఖోపభోగమునకంటె సుఖేచ్ఛ యనివార్యముగ వృద్ధినొందుటచే సిద్ధ మగు సిద్ధాంతమునకు) నేమియు బాధకము గానేరదు. 'స్పెయిన్' దేశమును దురుష్కులు పాలించుచుండఁగా మూఁడవ 'అబ్దుల్‌రహిమానుఁడు'* (అక్కడ నొక న్యాయమూర్తియును, బరాక్రమవంతుఁడునగు నొక రాజు) చక్రవర్తియై యుండి, తన దినము లెటులఁ గడచుచున్నవో తెలియుటకై దినచర్య వ్రాసెను. దానివలన నేఁబది సంవత్సరముల వారి రాజ్యపాలనాకాలమునఁ దుదకుఁ బదునాలుగు దినములు మాత్రమే పూర్ణసుఖమునఁ గడచినటుల విశదమైన దని తురుష్కుల యితిహాసగ్రంథములలోఁ జెప్పఁబడినది. "జగత్తున ముఖ్య

* Moors in Spain, p. 128 (Story of the Nations Series).

ముగ నైరోపాఖండమున నున్న ప్రాచీన నవీన తత్త్వజ్ఞుల మతము లను విచారించిన, వారిలో 'సంసారము సుఖమయ' మని వచించు వారియొక్కయు, 'దుఃఖమయ' మని వచించు వారియొక్కయు సంఖ్య సమానముగ నున్నటుల కాన్పించుచున్న"దని యొకరు వ్రాసి యున్నారు. • ప్రాసువలె నుండు నీ సంఖ్యలలో నొకవైపున హిందూ తత్త్వజ్ఞుల మత మును సంఖ్యను జేర్చిన నా పళ్లెర మెంత క్రిందికి వంగునో వచింప నక్కఱ యుండదు. సంసార సుఖదుఃఖములకుఁ బూర్వోక్త మగు నిరూపణము విని సన్యాసమార్గము మంచి దను పురుషుఁడు "సుఖ మనునది యథార్థపదార్థము కాకపోవుటచే నాశారూప ములగు సకల కర్మల వదలినఁ గాని శాంతి కలుగ నేర" దని చెప్పుట మీ కిష్టము గాకపోయినను మీరు వచించినరీతిగనే తృష్ణనుండి య సంతోషమును, అసంతోషము నుండి దుఃఖమును, గలుగుచో నీ య సంతోషమును దూరముగఁ జేసికొనుటకైనను మనుష్యులు తృష్ణను సర్వ సాంసారిక కర్మములను (అవి పరోపకారార్థము లైనను, లేక, స్వార్థము లైనను) వదలి యెల్లప్పుడును సంతుష్టుఁడుగ నుండవలయు నని చెప్పుట కేమి యభ్యంతర" మని యడుగును. మహాభారతము లోనే— "అసంతోషస్య నా స్త్యంతః తుష్టి స్తు పరమం సుఖమ్"—అసం తోషమున కంతము లేకపోవుటచే, సంతోష మను నదియే పరమ సుఖమై యున్నది (మ. భా. వన. 21వ. 22) యని యొక వచన మున్నది. జైన బౌద్ధ ధర్మముల మూలాధారములు సైత మీ మత మునే యవలంబించి యున్నవి. పాశ్చాత్యదేశస్థుఁడగు 'శోపెన్‌హో యెర్' * అను నతఁ డిటీవల నీ మతమునే ప్రతిపాదించియున్నాఁడు; కాని దీనికి విరుద్ధముగ, "నోటు నపశబ్దములు వచ్చునని నాలుక గోసి కొనవలయునా?" యనియు, "అగ్నిచే నెప్పుడైన నిండ్లు గాలిపోవు

• Macmillan's Promotion of Happiness. p. 26.

* Schopenhauer's World as Will and Representation, Vol. II Chap. 46.

నని యగ్నిని బొత్తిగ వదలి వంటలను సైతము మానుకొనవల యునా?" యనియు విచారింపవచ్చును. కావున నగ్నికే కాక విద్యు చ్ఛక్తికి సైతము తగిన నియమము నేర్పఱిచి తగు సాధనములతోఁ బ్రతిదినము మనము వాడుకొనునటుల, తృష్ణకు నసంతుష్టికి సైతము తగు నియమముల నేర్పఱచి యుపయోగ పఱచుకొనుట యశక్యము కానేరదు. వీనిలో నసంతుష్టి యనునది యెల్లప్పుడు నే విధమునను బొత్తిగ నుపయోగించునది కానేర దని యను నెడల నా విషయము ప్రత్యేకము; కాని బాగుగ విచారించిన నా విషయ మటుల స్థిర పడనేరదు. అసంతుష్టి యనఁగా దురాశయే కాని, లేక, దుఃఖమే యని కాని, యర్థము కానేరదు. ఇట్టి యసంతుష్టి శాస్త్రకారులచే సైత మేవగింపఁబడి యున్నది. ఇఁక నేమనఁగ: మనమున్న స్థితి లోనే యెల్లప్పుడు నుండి, కష్టపడక, శక్తి కొలఁది, శాంతత్వమును, సమచిత్తత్వమును సాధించుచుఁ బ్రగమముగ నెక్కువగ బాగుపఱచుచు, మునుపున్న స్థితిని సాధ్య మగునంత యౌన్నత్యమునకుఁ దెచ్చునట్టి కోరికకు మూలకారణ మగు నసంతోషము పనికిరాదని వచించుట కే నాఁడును వీలు కానేరదు. ఏల యన: బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రు లను నాలుగు జాతులుగల మన సమాజమున, బ్రాహ్మణులు జ్ఞానమునను, క్షత్రియు లైశ్వర్యమునను, వైశ్యులు ధనధాన్యముల యందును నభివృద్ధిఁ జెందవలయు ననెడి కోరికనే వదలిన పక్షమున నీ సమాజము శీఘ్రముగ నడుగంటు నని చెప్పనక్కఱలేదు. ఈ యభి ప్రాయమును మనంబున నూనియే వ్యాసులవారు– "యజ్ఞో విద్యా వముత్థాన మసంతోష శ్శ్రియం ప్రతి"– యజ్ఞము, విద్య, ఉద్యోగము, నైశ్వర్యవిషయక సంతోషము ననునవి క్షత్రియుల గుణములు (మ. భా. శాం. 28.9) అని ధర్మరాజునకుఁ జెప్పిరి. అటులె 'విదుల' తన పుత్రున కుపదేశించుచు, "సంతోషో వై శ్రియం హన్తి"–సంతోషముచే నైశ్వర్యము నశించును (మ. భా. ఉ. 132. 33) అని చెప్పెను.

"అసంతోష శ్రియో మూలమ్" (మ.భా.నభా. 55.11) * అని మఱి యొకచో సైత మున్నది. బ్రాహ్మణధర్మములలో సంతోష మనునది గుణ మని చెప్పఁబడినను, చాతుర్వర్ణ్య ధర్మానుసారముగ ద్రవ్యవిష యమునఁ గాని, ఇహలోకమందలి యైశ్వర్య విషయమునఁ గాని సంతోష మనియే దాని యర్థము. తన కున్న జ్ఞానము చాలు నని బ్రాహ్మణుఁ డనుకొన్నను, వైశ్యశూద్రులు తమ తమ జాతిధర్మముల ననుసరించి తమ కున్నవియే చాలు నని యనుకొన్నను, బుద్ధిపూర్వ ముగఁ దమకు నష్టముఁ జేసికొన్న వా రగుదురు. అసంతోషమే యన్ని విధముల గొప్పతనమునకును, మోక్షమునకును, ప్రయత్న మునకును, నైశ్వర్యమునకును మూలమై యున్న దనునది యిందలి సారాంశము. ఈ యసంతోషమును మనము బొత్తిగ వదలితిమేని యీ లోకమునందును, బరలోకమునందును మనకు మంచియవస్థ లభింపదని ప్రతి మనుజుఁడును దప్పక యెఱుకపఱుచుకొనవలయును. భగవద్గీతలో సైతము శ్రీకృష్ణుని యుపదేశము వినుఁ- "భూయఃకథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మేఽమృతమ్"- అమృతమువంటి నీ సంభాషణను వినుచున్న నాకు తృప్తి కలుగుట లేదు. కావున మరల నీ విభూతిని వచింపుము (గీ. 10.18) అని యర్జునుఁ డడిగిన పిమ్మట భగవంతుఁడు వెండియుఁ దన విభూతిని చెప్పుటకుఁ బ్రారంభించెను; కాని యర్జునునకు "నీవు నీ కోరికను మానుకొనుము, అతృప్తి (అసంతోషము) యోగ్యము కానేరదని భగవంతుఁ డుపదేశము చేయలేదు. దీనివలన మంచి (కల్యాణకారక మగు) విషయ మున యోగ్య మగు సంతోష ముండుట భగవంతునకు సైత మిష్టమే యని సిద్ధ మగుచున్నది. మఱియు- "యశసి చాధిరతి ర్వ్యసనం శ్రుతౌ"- కోరిక యుండవలయును కాని, యది యశస్సును సంపాదించునదై యుండవలయును. వ్యసనము సైత ముండవల

* Cf. "Unhappiness is the cause of progress." Dr. Paul Carus' The Ethical Problem, P. 25[1] (2nd Ed).

యునుకాని, యది విద్యకు సంబంధించినదిగ నుండవలయును. ఇటు లైన నవి నింద్యములు కానేరవు అని భర్తృహరిలో నొక శ్లోక మున్నది. కామక్రోధాది వికారముల నశింపఁజేసి నటుల యసంతోషమును సైతము బొత్తిగ నశింపఁ జేయఁగూడదు. అటుల నశింపఁ జేసిన నశుభములనే కాక శుభంబులను సైతము నశింపఁజేసిన వాఁడగు ననుమాట నిశ్చయమే. కావున విషయోపభోగములచేఁ దృప్తిఁ జెందుటకు మాత్రమే యత్యాశను జెఁది యిహలోక సుఖప్రవాహమునఁ బడిపోవువాని సంపత్తికి 'ఆసురీసంపత్తి' యని గీతల పదునాఱవ యధ్యాయమునఁ బేరిడఁబడి యున్నది. ఇట్టి యుత్తరోత్తరాభిలాషఁ జెందుటచే మనస్సులో నున్న సాత్త్వికవృత్తి నశించి యతఁడధోగతినిఁ జెందుటయే కాక, తృష్ణోపశాంతి యెప్పుడును గలుగకపోవుటచేఁ గామోపభోగముల యందలి కోరిక యంతకంత కెక్కువై తుద కాతడు సంతుష్టిలేకయే చనిపోవును; కాని వీనికి వ్యతిరేకముగఁ దృష్ణయొక్క గాని, అసంతోషముయొక్క గాని యీ దుష్పరిణామమును తప్పించుకొనుట కన్ని తృష్ణలను, అన్ని కర్మలను నొక్కసారిగనే వదలిపెట్టుటయు సాత్త్వికమార్గము కానేరదు. వెనుకఁ జెప్పినతీరునఁ దృష్ణ, లేక, అసంతోషము అనునది రాఁబోవు గొప్ప తనమునకు మూలమై యున్నది. కావుననే చోరభయము లేకుండుటకై ధనికుల రూపు మాపుటకు యత్నింపకయే, తృష్ణచే (అసంతోషముచే) నేది దుఃఖమగునో దానిని బాగుగ విచారించి దుఃఖకారకమగు నాశను మాత్రము వదలుట యను యుక్తిరూప మగు మధ్యమార్గమును స్వీకరింపవలయును. కావున సర్వకర్మలను వదలుటకుఁ గారణ మేమియుఁ గానరాదు. దుఃఖమును గలిగించు నాశనుమాత్రము వదలి స్వధర్మానుసారముగఁ గర్మలు చేయుట యను యుక్తిని, లేక, కౌశలమును యోగ మని కాని కర్మయోగ మని కాని చెప్పుచున్నారు (గీ. ౨. ౫౦). అదియ గీతలలో ముఖ్యముగఁ బ్రతిపాద్య మగుటచే

గీతలలో నెట్టి యాశ దుఃఖకారక మని స్థిరపఱుపఁబడినదో యను సంశము సిచ్చో మఱికొంత విచారింతము.

మనుష్యుఁడు వీనులచే వినుచున్నాఁడు; త్వగింద్రియముచే స్పృశించు చున్నాఁడు; ముక్కుచే ఘ్రాణించు చున్నాఁడు. ఇంద్రియముల యీ వ్యాపారము వాని స్వాభావికవృత్తి కనుకూలముగ నున్నచో సుఖమును, ప్రతికూలముగ నున్నచో దుఃఖమును గలుగునని సుఖదుఃఖముల వస్తుస్వరూపమునకు లక్షణము పూర్వము నందుఁ జెప్పఁబడినది; కాని సుఖదుఃఖములవిచార మీ వ్యాఖ్యానము చేతనే సంపూర్ణము కానేరదు. ఆధిభౌతిక సుఖదుఃఖములు గలుగుటకు బాహ్యపదార్థములకు నింద్రియములకు సంయోగము కలుగుట మొట్టమొదట నావశ్యకము. అనను, ఈ సుఖదుఃఖముల యనుభవము మనుజునకుఁ బిమ్మట నే రీతిగఁ గలుగునని విచారించిన నింద్రియ వ్యాపారముచేఁ గలుగు నీ సుఖదుఃఖముల నెఱుంగుట యను పని ప్రతి మనుజుఁడును తుదకుఁ దన మనస్సు చేతనే చేయవలసి వచ్చు నని స్థిరపడును. "చక్షుఃపశ్యతి రూపాణి మనసా న తు చక్షుషా" — చూచుట యను కార్యము మనస్సు యొక్క సాహాయ్యము లేక నేత్రము మాత్రానానే జరుగదు. ఆ మనస్సు వ్యాకులముగ నున్న యెడల నేత్రములతోఁ జూచినను జూడనటులే యుండును (మ. భా. శాం. 311. 17) అని మహాభారతములో నున్నది. బృహదారణ్యకోపనిషత్తున సైతము "నా మనస్సు మఱియొకచో నుండుటచే నాకు గోచరింపలేదు. (అన్యత్రమనా అభూవం నాదర్శం)" — నా మనస్సు రెండవ వస్తువునం దుండుటచే నాకు వినఁబడలేదు. (అన్యత్ర మనా అభూవం నాశ్రౌషం)" అని చెప్పఁబడినది (బృ. 1. 5. 3). దీనివలన నాధిభౌతిక సుఖదుఃఖము లనుభవగోచరము లగుటకు నింద్రియములు మాత్రమే కారణము కానేరవు. మఱి యేమన— వానికి మనస్సుయొక్క సాహాయ్య ముండి తీరవలయునని విస్పష్ట

మగుచున్నది. అధ్యాత్మిక సుఖదుఃఖములు మానసికములే. ఇటుల వక్కాణించుటచే నన్ని సుఖదుఃఖానుభవములుఁ దుదకు మనస్సునే యవలంబించి యున్నవని కనఁబడుచున్నది. ఇది సత్యమగునేని, మనోనిగ్రహముచే సుఖదుఃఖానుభవముల నిగ్రహము సైతము సాధ్యము కాకపోనేరదని ముందు న్యాయముగనే సిద్ధమగును. ఈ యభిప్రాయమునే మనస్సున నుంచుకొని సుఖదుఃఖముల లక్షణములను, మనువు, నైయ్యాయికుల లక్షణములకంటె వేఱుగఁ జెప్పి యున్నాఁడు—

సర్వం పరవశం దుఃఖం సర్వ మాత్మవశం సుఖమ్,
ఏత ద్విద్యా త్సమాసేన లక్షణం సుఖదుఃఖయోఃఁ.
(మనుస్మృతి. 4.160)

— పరకీయుల (బాహ్యవస్తువుల) యధీనమై యున్న దంతయు దుఃఖము. మనస్సునకు స్వాధీనమై యున్న దంతయు సుఖము. ఇవియె సుఖదుఃఖములకు కల్పితములగు లక్షణములు. నైయ్యాయికుల లక్షణములలో నున్న 'వేదనా' శబ్దమునందు శారీరకము, మానసికము నని రెండు విధములగు వేదన లుండుటచే సుఖదుఃఖముల బాహ్య వస్తుస్వరూపము సైతము వారిచేఁ జూపింపఁబడినది. మనువుయొక్క దృష్టి సుఖదుఃఖముల యాభ్యంతరానుభవమందు మాత్రమే యున్న దను విషయమును గమనించు నెడల సుఖదుఃఖముల యొక్క యీ రెండులక్షణములలో విరోధ ముండదు. సుఖదుఃఖానుభవములకు నింద్రియావలంబన మీ రీతిగ లేకుండుటచే—

భైషజ్య మేత ద్దుఃఖస్య యదీత న్నానుచింతయేత్.
(మ.భా.శాం. 205.2)

— మనస్సుచే దుఃఖచింతన చేయకుండుటయే దుఃఖనివారణకు దివ్యమైన యౌషధము. ఈ న్యాయానుసారముగ నితిహాసముల

యందు సైతము మనస్సును స్థిరపఱచుకొని నత్యము కొఱకును ధర్మముల కొఱకును సుఖముగ నగ్ని కాష్ఠములను (మండుచున్న కట్టెలను) భక్షించినటు లనేకదృష్టాంతము లున్నవి. కావున మనము చేయఁదగిన దంతయు మనోనిగ్రహముతో నందలి ఫలాశను వదలి సుఖదుఃఖముల యందు సమబుద్ధి నుంచి చేయవలయును. అటులు చేసినఁ గర్మములను వదలకపోయినను వానివలన మనకుఁ గలుగు బాధ మనకుఁ దగులునని భీతియైనను, తగులుటయైనను, ఉండ నేరదని గీతలలోఁ జెప్పఁబడియున్నది. ఫలాశ వదలుట యనఁగా, ఫలము లభించినను దాని వదలుట యనియైనను, లేక, ఫలమేరికి నే నాఁడును లభింపదని వానసయుంచుటయైనను, అర్థము కానేరదు. అట్లే ఫలాశయుఁ, గర్తృత్వాభిమానమును గూడ మిచ్చ, ఆశ, హేతువు, లేక, ఫలమునందలి ప్రీతికొఱ కొకానొక విషయమును యోజిం చుటయు, అను వీనియందు విశేష మయిన భేదము గలదు. కాలు సేతులు కదల్పవలయునని మాత్రమే యిచ్ఛపుట్టుటకును, ఎవనినైనఁ బట్టుకొనుటకొఱకో, లేక, తన్నుటకొఱకో కాలుసేతులను గద లింప వలయునని యిచ్ఛపుట్టుటకును భేద మున్నది. మొదటి కోరిక కదలించుటకు మాత్రమే కలుగుటచే దానియం దితరకారణ మేమియు నుండదు. "ఈ కోరికయే లేనినాఁ డన్నిపనుల కాటంక మగును. ఈ కోరిక యుండినచో ప్రతికర్మకు నేదో యొక పరిణామము గాని, ఫలముగాని యుండు" నను జ్ఞానము సైతము ప్రతిమనుజునకు నుండ వలయును. జ్ఞానముమాత్ర ముండుటయే కాక, యీ ఫలము నిమిత్తమై యీ కర్మ నిట్లుచేయుదు ననుకొనియే యే పనినైనను జేయుటకు యత్నింపవలయును. లేనినా, డతఁడు చేయుపను లన్నియు వెట్టివాని చేఁతలవలె వ్యర్థము లగును. ఇట్టి నకలేచ్ఛలును, హేతువులును, లేక యోజనలును, తుదకు దుఃఖమును గలిగింపు నవియుఁ గానేరవు. వానిని వదలిపెట్టవలయునని గీతయుఁ జెప్పుట లేదు. అయినను వానికి బహుదూరముగ నరుఁ డింతకంటె నెక్కు

వగాఁ బ్రవర్తించుటచే "నేఁ జేయుచున్నకర్మ కీ ఫలము. నే నే పనిఁ జేయుచున్నానో యా కర్మ కీ ఫలము తప్పక లభింపవలయు ననిచేయుచున్నాను" అను కర్మఫలము విషయమై కర్తయొక్క బుద్ధిలో నున్న మమత్వాసక్తి, (అహంకారము, అభిమానము, అభినివేశము, లేక, ఆగ్రహము)చే మనస్సు ఆకర్షింపఁ బడును. ఇష్టానుసారముగ ఫలము లభించుట కాటంకము కలిగెనేని దుఃఖపరంపరయె యారంభ మగును. ఈ యాటంక మనివార్యమును, దైవకృతము నయ్యె నేనియే యాశయు నుండనేరదు. మనుష్యకృత మగునేని క్రోధద్వేషములు కనిపించి పినిచేఁ బాపకర్మలను జేయించి, పీనిని నశింపఁ జేయును. కర్మపరిణామ విషయిక మమత్వయుక్తమగు నీ యాసక్తికే 'ఫలాశ' యనియు, 'సంగ' మనియు, 'అహంకారబుద్ధి' యనియు, 'కామ' మనియు వేర్వేఱుగ నామంబు లిడఁబడినవి. సంసారమందున్న దుఃఖపరంపర కిచ్చో నుండియే సత్యమగు ప్రారంభ మనిస్పష్టపఱచుటకు గీతల రెండవయధ్యాయములో విషయసంగము నుండి కామమును, కామము నుండి క్రోధమును, క్రోధము నుండి మోహమును, తుదకు మనుజునకు నాశమునుగూడ సంభవించు నని చెప్పఁబడినది (గీ.2-62-63). జడసృష్టిలో నుండు చేతనముల కర్మలును స్వయముగ దుఃఖములకు మూలములు కాకపోవుటచే మనుష్యులకు వానియందుండు ఫలాశ, కామము, సంగము అనునవియే సత్యముగ దుఃఖమూలములుగ నున్నవి అని యిట్లు నిశ్చితమయినపిదప, దుఃఖశాంతికొఱకు విషయములయందలి సంగమును, కామమును, లేక, ఫలాశను మాత్రమే మనోనిగ్రహముచే వదలినఁ జాలును. సన్యాసమార్గము ననుసరించువారు చెప్పనటుల సర్వ విషయములను, సర్వకర్మలను, సర్వకామములను వదలుట యావశ్యకము కానేరదు. ఇటులే ప్రతివిషయము న్యాయమున నిష్పన్న మగును. కావున "ఫలాశను వదలి యెప్పటి విషయముల నప్పుడు నిష్కామము నిస్సంగము నగు బుద్ధిచే సేవించువారలె సత్యమగు

స్థితప్రజ్ఞు" లని, తర్వాత గీతలలోఁ జెప్పఁబడినది (గీ. 2.64). జగత్తున నున్న కర్మయొక్క వ్యవహారమున కెప్పుడును బ్రతిబంధ ముండదు. మనుజుఁ డీ జగత్తును వదలినను, ప్రకృతి స్వగుణధర్మాను సారముగఁ బ్రవర్తించుచునే యుండును. జడప్రకృతికి స్వీయములగు సుఖదుఃఖములు లేవు. మనుజుఁడు తనకు లేని మహత్త్వము నారోపించుకొని ప్రకృతివ్యాపారాసక్తుఁ డగుటచే సుఖదుఃఖములను బొందుచున్నాఁడు; కాని యీ యాసక్తిగల బుద్ధిని వదలి "గుణా గుణేషు వర్తంతే"- ప్రకృతియొక్క గుణధర్మముల ననువరించి సర్వ వ్యాపారములును నడచుచునే యున్నవి (గీ. 3-28) అను నిట్టి భావనలచే సర్వవ్యవహారముల నొనర్చు నెడల ననంతోషముయొక్క దుఃఖ మేమియు నుండనేరదు. కావున సంసారము దుఃఖప్రధానమని విలపింపక, లేక, దాని వదలి వేయవలయునని నమ్మక, ప్రకృతి యొక్క వ్యాపారమును, ప్రకృతియే చేయుచున్నదని యెఱింగి—

సుఖం వా యది వా దుఃఖం ప్రియం వా యది వాఽప్రియమ్,
ప్రాప్తం ప్రాప్తముపాసీత హృదయేనాపరాజితః.

(మ.భా.శాం. 25.28)

— సుఖము గాని, దుఃఖము గాని, యేది యే వేళ నెటుల ప్రాప్త మగునో దాని నా యా వేళలయందే మనస్సును వ్యాకులత్వమును బొందనీయక (అనఁగా- వ్యాకులుఁడ వై నీ కర్తవ్యమును వదలక) సేవింపుము అని వ్యాసులచే ధర్మరాజునకు బోధింపఁబడెను. సంసార మందున్న కొన్ని కర్తవ్యములు దుఃఖమును సహించి సైతము తప్పక చేయవలసి వచ్చు నను సంగతి మనంబున నిడికొన్న పక్షమున, నీ యుపదేశము యొక్క మాహాత్మ్యము పూర్ణముగఁ దెలియును. భగవద్గీతల యందును- "య స్సర్వ త్రానభిస్నేహ స్తత్ త్ప్రాప్య శుభాశుభమ్" — శుభాశుభములు ప్రాప్తము లయినను, ఎవఁడు నియమముగ నిస్సంగుఁడై వాని స్తుతినైనను, నిందనైనను జేయఁడో,

వాడె స్థితప్రజ్ఞుఁ డగును (గీ. 2. 57) అని స్థితప్రజ్ఞుల లక్షణమును జెప్పి, యయిదవ యధ్యాయమున— "న ప్రహృష్యే ప్రియం ప్రాప్య నోద్విజే ప్రాప్య చాప్రియమ్"— సుఖము నొంది యుప్పొంగ రాదు. దుఃఖము నొంది వ్యసనపడరాదు (గీ. 5. 20) అని దెప్పెను. మఱియు రెండవ యధ్యాయములో నీ సుఖదుఃఖముల నిష్కామ బుద్ధిచే సహింపవలయునని చెప్పఁబడినది (గీ. 2.14-15). మఱియొక స్థలమునందును నీ యుపదేశమే మరల మరలఁ జేయఁబడినది (గీ. 5.9; 13.9). వేదాన్తశాస్త్రపరిభాషలో దీనికే "కర్మలను బ్రహ్మార్పణము చేయుట" యని పేరిడుటచే, భక్తిమార్గమునందు 'బ్రహ్మార్పణ'మునకు మాఱుగా 'కృష్ణార్పణ'మను శబ్దమును బ్రయోగించుచున్నారు. ఇదియే సర్వగీతార్థసారము.

కర్మ యెట్టిదైనను, దాని నొనర్చుటలో నిచ్ఛను, ఉద్యోగమును వదలిపెట్టక స్వకర్తవ్యములందు ఫలాశ నుంచక, పరిణామములందు సంప్రాప్తములగు సుఖదుఃఖముల ననుభవించుటకు సిద్ధుఁడగుచు నిస్సంగబుద్ధితోఁ జేయవలయును. అట్లు సేయునెడల తృష్ణయొక్క గాని యసంతోషముయొక్క గాని నివారణ మొనర్చు కొనకపోవుటచేఁ గలుగు దుష్పరిణామమును తప్పించుకొన వీలు కలుగును. ఇంతియ కాక తృష్ణతోనే కర్మను నాశము నొనర్చుటచే జగత్తు నాశమగునను ప్రసంగమున కవకాశము లేకయే మనోవృత్తి శుద్ధమగును. గాన, నట్టి కర్మ సర్వభూతహితప్రదముగ నుండును. ఫలాశ నిటుల త్యజించుటకుఁ గూడ, వైరాగ్యముచే నింద్రియములను, మనస్సును, పూర్ణముగ నిరోధింపవలసివచ్చు ననువిషయము నిర్వివాదముగనే యున్నది; కాని యింద్రియములను స్వాధీనములుగ నుంచుకొని స్వార్థమునకు మాఱుగ వైరాగ్యముతోడను, నిష్కామబుద్ధితోడను, లోకసంగ్రహార్థమై యా యింద్రియములు దమ తమ పనులను జేయునట్లు సేయుటయు, నన్యాన మార్గానుసారముగఁ దృష్ణానివృత్తి

కొఱ కింద్రియముల సర్వవ్యాపారములను (అనఁగా- కర్మముల) నాగ్రహమువలన సమూలముగ నాశనము చేయుటయు నను నీ రెంటికిని భూమ్యాకాశముల కున్నంత యంతర మున్నది. గీతలలోఁ జెప్పఁబడిన వైరాగ్యమును, ఇంద్రియ నిగ్రహమును మొదటి పద్ధతి లోనివి. రెండవపద్ధతిలోనివి కానేరవు. ఈ తీరుననే యనుగీతలలోని జనక-బ్రాహ్మణసంవాదములో (మ.భా అశ్వ. 82. 17-68) బ్రాహ్మణ రూపము ధరించివచ్చిన ధర్మదేవతకు జనకచక్రవర్తి-

శృణు బుద్ధిం చ యాం జ్ఞాత్వా సర్వత్ర విషయో మమ,
నాహ మాత్మార్థ మిచ్ఛామి గంధాన్ ఘ్రాణగతా నపి.

....

నాహ మాత్మార్థ మిచ్ఛామి మనో నిత్యం మనోంతరే,
మనో మే నిర్జితం తస్మా ద్వశే తిష్ఠతి సర్వదా.

- ఏ (వైరాగ్య) బుద్ధిని మనంబున నిడుకొని, సర్వవిషయముల నే సేవించు చున్నానో దానిని నీకుఁ జెప్పుచున్నాను. నాసికచే నాత్మార్థమై గంధము నాఘ్రాణించుటలేదు. (నేత్రములచే నాత్మార్థమై చూచుట లేదు. మొ.) మనస్సు నాత్మార్థమై (అనఁగా- స్వలాభార్థమై) యుపయోగపఱచుట లేదు. కావున నాసికను, (నేత్రములను ఇత్యాదుల) మనస్సును నేను జయించుటచే నవి నాయధీనములైయే యున్నవి అని వచించెను. కేవల మింద్రియవృత్తిని మాత్రము నిరోధించుకొని మనస్సుచే విషయచింతనము సేయువాఁడు దంభుఁడగును. మనోనిగ్రహముచే, గామ్యబుద్ధిని జయించి నకల మనోవృత్తులకును లోకసంగ్రహార్థముగ స్వస్వవిషయముల నవకాశము నిచ్చువాఁడె శ్రేష్ఠుఁడగు నని గీతలలో (గీ. 3.6-7)నున్నదాని కిదియే తాత్పర్యము. "బాహ్య మైన జగత్తు నైనను, లేక, యింద్రియ వ్యాపారముల నైనను నేను బుట్టింపలేదు. స్వభావసిద్ధముగనే యున్నవి; సన్యాసియెంత నిగ్రహముగలవాఁ డయ్యును ఆఁకలి

యెక్కువైనపుడు భిక్షకై వెడలు చున్నాఁడు (గీ. 8.88); విశేషకాల మొక్క స్థలమునసేకూర్చున్నచో, కొంతసేపు లేచినిలుచును. నిగ్రహ మెంత యొనర్చినను నింద్రియముల సహజవ్యాపారము వదల రని మన మెఱింగినచో నింద్రియముల వృత్తులను, సకలకర్మము లను, అన్నికోర్కులను, అనంతోషమును, నాశముఁజేయుదు మను దురాగ్రహములోఁ బడక (గీ. 2.47; 18.59) మనోనిగ్రహముచే ఫలాశను వదలి సుఖదుఃఖములను సమానములుగ నెంచి (గీ. 2.88) నిష్కామబుద్ధితో లోకోపకారార్థమై సర్వకర్మములను శాస్త్రోక్తరీతిగఁ జేయుచుండుటయె కౌశలముయొక్క (బుద్ధిశాలితనము యొక్క) మార్గమని సిద్ధమగుచున్నది. కావుననే—

కర్మణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతు ర్భూ ర్మా తే సంగోఽస్త్వకర్మణి.
(గీ. 2. 47)

— నీ పి కర్మభూమియందు జన్మించిన కారణంబున, కర్మములు సేయుటయందే నీకధికార మున్నది; అది సత్యము; కాని యీ యధికారము నీకు విహితమగు కర్మను చేయువఱకె యున్న దని గుర్తుంచు కొనవలయు నని భగవంతుఁడర్జునునకు మొదటఁ జెప్పుచున్నాఁడు. 'ఏవ' అను పదముచేఁ గర్మయందుఁ దప్ప నితర విషయమున (అనఁగా: కర్మఫల విషయమై) మనుష్యున కధికారము లేదని యర్థము సహజముగ నగును. విషయమిటు లూహింపఁబడుటయే కాక రెండవ పాదమున— "కర్మఫల విషయమున నీ కెప్పుడు నధికారము లేదు. కారణ మేమన:— కర్మఫలముయొక్క సంభవానంభవములు నీ యధీనములు కానేరవు. అవి సదా పరమేశ్వరాధీనములుగఁ గాని, సృష్టి యందున్న కర్మవిపాకము నవలంబించి కాని, యున్నవి" అని భగవంతుఁడు మరల స్పష్టముగఁ జెప్పెను. ఫల విషయమున మన కధికారము లేకపోవుటచే నిట్టి ఫలము గలుగ

వలయు నని కోరుటయే వెట్టితనము. ఈ మూఁడవ విషయము నైత మనుమానాధీనము కాదు. కావున నీవు కర్మఫలాభిలాషను మనం బున నిడుకొని యే కార్యమును జేయకుము కర్మవిపాకానుసార ముగ నీవు చేయు సర్వకర్మలకును దగిన ఫలము తప్పక వచ్చును. నీ కోరికచే తక్కువగఁ గాని యెక్కువగఁ గాని శీఘ్రముగఁ గాని యాల స్యముగఁ గాని యగుటకు వీలు లేదు. కావున నిట్టి తృష్ణచే నీకు మాత్రము దుఃఖమును వఱఁకును గలుగు నని మూఁడవ పాదము నందుఁ జెప్పఁబడినది; కాని, "కర్మఁను చేయుము. ఫలాశను వద లుము అని పటాటోపముఁ జేయుచు గూర్చుండుట కంటెఁ గర్మను బూర్ణముగ విసర్జించుటయే మంచిది కదా?" అని యిచ్చట నెవర యినను-ముఖ్యముగ సంన్యాసమార్గీయులు ప్రశ్నఁ జేయుదురు. ఇందు నిమిత్తమే తుదకు "కర్మను జేయకపోవుటలో (అకర్మాణి) నీ వాగ్ర హమును బొందకుము. నీయధికారాను సారముగ ఫలాశను వదలి పెట్టి కర్మనే చేయుచుండు" మని భగవంతుఁడు స్పష్టముగ విధించెను. కర్మయోగదృష్టిచే నీ శ్లోకముల యందున్న నాలుగు పాదముల సిద్ధాంతములును, కర్మయోగ శాస్త్రమునకు, లేక, గీతాధర్మములకు నందలి చతుస్సూత్రి యని చెప్పఁదగినంత మహత్త్వము గలవిగ నున్నవి.

సంసారము నందలి సుఖదుఃఖము లెప్పుడు నొకడాని వెంబడి నొకటి వచ్చుచుండును గాని సుఖముకంటె దుఃఖరాశియే తుద కధి కముగ నున్న దని సిద్ధ మయినను సాంసారిక కర్మలను వదలిపెట్టక పోయిన యెడల నత్యంత దుఃఖనివృత్తి కాపలయు ననియు, నత్యంత సుఖమును బొందవలయు ననియుఁ గోరు మానవుని ప్రయత్నము వ్యర్థ మని యందఱకుఁ బోధించును. అధిభౌతికము మాత్రము (అనఁగా ఇంద్రియ గమ్య మగు బాహ్యవిషయోప భోగరూప మగు సుఖము) నపేక్షించినను నాతఁడు తెలిసికొనిన సంగతి తప్పని వదించుటకు

సాధ్యము కానేరదు. చంద్రబింబమును బట్టుకొనుటకు నాకసము వైపునకు చేయుచాచు బాలుని పిడికిలి లోనికిఁ జంద్రబింబము లభింప నటుల, అంతము లేని సుఖాశచేఁ గేవలాధిభౌతికసుఖము నపేక్షించుట వలన నెప్పుడును అది లభింపదు. ఆధిభౌతికసుఖమనునది యొక్కటియే సుఖముయొక్క స్వరూపము కానేరదు. కావున దానిని సైతము వదలి యాత్యంతికమును నిత్యము నగు సుఖమును బొందుటకు మార్గము వెదకుట మంచిది. సుఖమును శారీరక మనియు మానసిక మనియు విభజించిన పిదప, శరీరముయొక్కగాని యింద్రియములయొక్కగాని వ్యాపారముకంటె మనస్సునకే తుద కధికమగు మహత్త్వ మీయవలసి వచ్చునని పూర్వమునందుఁ జెప్పఁబడినది. శారీరక మగు (అనఁగాఁ: ఆధిభౌతిక మగు) సుఖమునకంటె మానసిక సుఖముయొక్క యోగ్యత యధిక మను జ్ఞానులయొక్క సిద్ధాంతము జ్ఞానుల మను గర్వముతో నొనర్చినది కాదు. కావున దానిలోనే శ్రేష్ఠ మగు మానవజన్మయొక్క నిత్య మైన మహత్త్వము (సార్థకత) ఉన్న దని ప్రసిద్ధాధిభౌతికవాది యగు 'మిల్లు' తన యుపయుక్తతా వాదమునందు వ్రాసిన గ్రంథమున బద్ధాంజలియై యంగీకరించియున్నాఁడు. *కుక్కలు, పందులు, ఎద్దు మొదలగునవి సైతము మనుష్యునివలె నింద్రియసుఖములందుఁ బ్రీతి గలవియే. విషయోపభోగము మాత్రమే యీ జగత్తున సుఖ మని మనుజుఁ డెంచిన యెడల మనుజుఁడు పశువగుట కంగీకరించి యుండును. పశువులకు సకల విషయ సుఖములను నదా నంపాదింపవలయు ననికోరికయున్నను పశువుగా నుండుట కెవ్వరు నొప్పుకొనక పోవుటచేఁ బశువులకంటె మనుజులలో నే దేని యొక యెక్కువ యుండుట విస్పష్టము. ఈ

* It is better to be a human being dissatisfied than a pig satisfied; better to be Socrates dissatisfied than a fool satisfied. And if the fool, or the pig, is of a different opinion, it is because they only know their own side of the question. Utilitarianism, p.14 (Longmans 1907).

విశేష మేమి యని విచారింతు మేని మనస్సు, బుద్ధి యను నీ రెంటి మూలమున తనయొక్కయు, బాహ్యసృష్టి జ్ఞానముగల యాత్మ యొక్కయు స్వరూపమును విచారింపవలసి వచ్చును. ఒకసారి యీ విషయవిచారణఁ జేసితి మేని 'పశువులు, మనుజులు' అను నీ రెండు జాతులకును సమానముగనే సాధ్యమగు విషయోపభోగసుఖముకంటె మనోబుద్ధులచేత సాధ్యమగు గొప్ప విషయముల యందును మనో బుద్ధుల శుద్ధావస్థయందును నున్న సుఖమే మనుష్యునకు శ్రేష్ఠత్వము లేక, అత్యంత సుఖ మగునని మొత్తముమీఁద తాత్పర్యము తేలును. ఈ సర్వసుఖములు ఆత్మాధీనములు (అనఁగా: బాహ్యవస్త్వపేక్ష లేవియు లేనివి, లేక, యితరుల సుఖమును తగ్గింప నవసరములేకయే స్వప్రయత్నము చేతనే స్వయముగఁ బొందఁదగినవి) గావున మన మనోబుద్ధుల నెంత బాగు చేసికొనుచున్నామో యంతగా నా సుఖ స్వరూపము సైత మంతకంత కెక్కువ శుద్ధముగను అసంకీర్ణముగ నుండును. "మనసి చ పరితుష్టే కోఽర్థవాన్ కో దరిద్రః?" - మనస్సు తృప్తిఁజెందిన యెడల దరిద్రులును ధనవంతులును సమానులుగనే యుందురు అని భర్తృహరి వక్కాణించియున్నాఁడు. 'ప్లేటో' యను పేరుగల గ్రీకు తత్త్వవేత్తయును "శారీరక మగు (అనఁగా: బాహ్యము లేక, యాధిభౌతిక మగు) సుఖముకంటె మనస్సుఖము శ్రేష్ఠము. మనస్సుఖము కంటె బుద్ధిగ్రాహ్యమైన (అనఁగా: పరమాధ్యాత్మికమైన)సుఖము శ్రేష్ఠ*" మని ప్రతిపాదించెను. కావున మోక్ష విచారమును దూరముగ నుంచినను ఆత్మవిచారములో నిమగ్నమైన బుద్ధికే పరమసుఖము లభించుట శక్య మగునని సిద్ధ మగుచున్నది. ఆ కారణముచేతనే భగవద్గీతలలో సుఖము సాత్త్వికము, రాజసము, తామసము అని త్రివిధములుగ విభజించి వానిలో "తత్సుఖం సాత్త్వికం ప్రోక్తం ఆత్మబుద్ధిప్రసాదజమ్." "ఆత్మనిష్ఠ (అనఁగా- సర్వభూత

* Republic Book IX.

ముల యందును ఆత్మయొక్కటియే యని యాత్మయొక్క సత్య స్వరూపమును తెలిసికొని దానియందె సక్త) మయిన బుద్ధియొక్క ప్రసన్నతచేఁ బ్రాప్తమగు నాధ్యాత్మిక సుఖమే సాత్త్వికము (శ్రేష్ఠము) అని మొదట వక్కాణించి, (గీ. 18.37) పిదప "ఇంద్రియముల నుండియు, నింద్రియ విషయముల నుండియుఁ గలుగు నట్టి యాధి భౌతిక సుఖముయొక్క మార్గము దీనికంతె క్రిందిది (అనఁగా- రాజసము); (గీ. 18.38) చిత్తమోహజనక మగునట్టియు నిద్రాలసత్వ ముల వలనఁ గలుగునట్టియు సుఖము తామసము (అనఁగా- అన్నిం టిలో కనిష్ఠమైనది)-" అని క్రమముగ వర్ణింపఁబడినది. ఈ ప్రకరణా రంభము నందున్న గీతలలోని శ్లోకతాత్పర్య మిదియే. కావున నీ పరమసుఖానుభవ మొకసారి యగు నేని పిదప నెంత గొప్ప దుఃఖ ములు వచ్చినను నీ స్థితిలోనుండి పురుషుఁడు చలింప నేరఁడని గీతయే చెప్పుచున్నది (గీ. 6.22). ఈ యత్యంతసుఖము స్వర్గమునందలి విషయసుఖములలో సైతము లేని దగుటచే దానిని సంపాదించుట కొఱకు ముందుగ మన బుద్ధి ప్రసన్నము కావలయును. ఈ ప్రసన్నత యేవిధమునఁ గలుగునో విచారింపక విషయోపభోగమునందు మాత్రమే నిమగ్నుఁడగువానియొక్క సుఖము క్షణికమును ననిత్యము నగును. కారణ మేమియన- నేఁడున్న యింద్రియ సుఖములు రేపుండవు. ఇంతియకాక యే విషయము మనకే యింద్రియములకు నేఁడు సుఖకరముగ నుండునో యా విషయమై రేపు మన యింద్రియ ములకుఁ గారణాంతరములచే దుఃఖకరముగ నుండును. ఉదాహరణ మేమి యన- వేసవికాలములో నే శీతజలము మధురముగను సుఖ ముగ నుండునో, యదియె శీతకాలమునందు దుఃఖకరముగనుండును. కానిమ్ము. ఇంతయైనను దానివలన సుఖేచ్ఛయొక్క పూర్ణతృప్తి కాదని సైతము పూర్వమునందుఁ జెప్పఁబడియేయున్నది. కావున 'సుఖ' మనుశబ్దము సాధారణార్థానుసారముగ సర్వవిధసుఖములయం దుప యోగింపఁబడినను, ఒక సుఖమునకును, మఱియొక సుఖమునకును

పరస్పర భేదముకలదని యొప్పుకొనవలసి వచ్చును. ఎప్పుడును వ్యవహారమునందు సుఖ మనఁగా నింద్రియ సుఖ మనియే ముఖ్యముగ నర్థమగుచున్నది; కాని యింద్రియాతీతమును, (ఇంద్రియ సుఖమున కంటె మిక్కిలిదూరమున నున్నది) కేవలమునగు నాత్మనిష్ఠగల బుద్ధికి మాత్రము గోచరమగు సుఖమునకును, విషయోపభోగరూప మయిన సుఖమునకును భేదము చూపవలసినపుడు, విషయోపభోగ మనెడి యాధిభౌతిక సుఖమును కేవల సుఖ మనియు, ప్రేయ మనియు, నాత్మబుద్ధిప్రసాదజమును (అధ్యాత్మికసుఖమును) శ్రేయ స్సనియు, కల్యాణ మనియు, హిత మనియు, ఆనంద మనియు, లేక, శాంతి యనియు వక్తాఁదించుట యభ్యాసమై యున్నది. వెనుకటిప్రకరణము తుద నుపపాదింపఁబడిన కఠోపనిషత్తులోని వాక్యములో ప్రేయశ్శ్రేయ శ్శబ్దములలో నచికేతునిచే నుపపాదింపఁబడిన భేదము సైత మీధోరణి నవలంబించియె యున్నది. మృత్యువుచే నతని కగ్నియొక్క రహస్యము తెలుతఁ జెప్పఁబడినది ఈ సుఖము ప్రాప్తమైన పిదప ముందు నచికేతుఁడు తన కాత్మజ్ఞానము చెప్పుమని వర మడుగఁగా, దానికిఁ బ్రతినిధిగ మృత్యు వనేకము లగు నితరైహిక సుఖములచే నతనిని లోభపెట్టెను. ఇట్టి యనిత్యమగు నాధిభౌతిక సుఖముపై, లేక, ప్రథమదర్శనములోనే రుచిందు 'ప్రేయో' వస్తువుపై, భ్రమఁ జెందక దూరదర్శియై యాత్మకు శ్రేయమే (అనఁగా- పరిణామము నందుఁ గళ్యాణకరమగు నాత్మవిద్యయె) కావలయునని నచికేతుఁడు పట్టుఁబట్టి తుదకు దానిని సంపాదించుకొనెను. కావున నాత్మబుద్ధి గమ్యసుఖమును గాని, లేక, యాధ్యాత్మికానందమును గాని, మన శాస్త్రకారులు శ్రేష్ఠసుఖ మని చెప్పుట చేతను ఈ నిత్యసుఖ మాత్మవశ మగుటచేతను ఎల్లరును బొందుట కుపయుక్తముగ నున్నదనియు సంపాదించుటకు యత్నింప వలయుననియు దాని సారాంశము. మానవమాత్రునకు పశుధర్మాతిరిక్తమగు నొక గొప్ప సుఖ మిదియె

యై యున్నది. ఈ యాత్మానందము కేవలము బాహ్యోపాధినే యవలంబించి యెప్పు డురడునది కాదు. కావున నది సర్వసుఖముల లోను నిత్య మయినదియు స్వతంత్ర మయినదియు శ్రేష్ఠ మయినదియునై యున్నది. ఇదియె గీతలలో 'నిర్వాణప్రదమగు శాంతి' యని పేర్కొనఁబడి యున్నది (గీ. 6-15). స్థితప్రజ్ఞునియొక్క బ్రాహ్మీస్థితియందలి పరమావధియగు సుఖము సైత మిద్దియ (2.71; 6.28; 12.12; 18.62).

ఆత్మశాంతి గాని యాత్మసుఖము గాని యత్యంతశ్రేష్ఠమగు సుఖ మగుట చేతను, నది యాత్మవశ మగుటచేతను, అది యెల్లరుఁ బొందుటకు యోగ్యముగ నున్నదని నిర్ణయింపఁబడినది. అన్ని లోహములలో బంగారు మిక్కిలి విలువగలది యైనను ఇనుము మొద లగు నితర లోహముల యావశ్యకత యెట్లు లేకపోలేదో, చక్కెర మిక్కిలి మధుర మయినదయినను, ఉప్పు లేనిది యెటుల పనిఱగదో యటులే యాత్మసుఖము, లేక, శాంతి గొప్పదైనను శారీరకసుఖ మవసరము కాకపోనేరదు. ఏమి లేకున్నను శరీరధారణార్థ మైనను ఐహికవస్తువులయొక్క సంబంధ మీ శాంతికిఁ గావలయు ననునది నిర్వివాదాంశమే. ఈ యభిప్రాయముచేతనే యాశీర్వాదముయొక్క సంకల్పమునందుఁ గేవలము 'శాంతిరస్తు' అని చెప్పక 'శాంతిః పుష్టి స్తుష్టి శ్చాస్తు' (అనఁగా: శాంతితోఁ గూడఁ పుష్టితుష్టులు రెండును కావలయు) అని చెప్పుట వాడుకయై యున్నది. కేవలము శాంతి చేతనే తుష్టి యగు నని శాస్త్రకారుల కభిప్రాయ మగు నేని యీ సంక ల్పమునందు 'పుష్టి' యను పదము చేర్చుటకు నేమియుఁ గారణ ముండకపోవును. అయినను పుష్టి (అనఁగా: ఐహికసుఖముయొక్క యభివృద్ధి) యే కావలయు నని యెప్పుడు ననుకొనఁ దగదు. కావున శాంతి, పుష్టి, తుష్టి (సంతోషము) అను నీ మూఁడును యోగ్యముగ నీదేఁ బొందఁబడు గాక యనియు, నీవు వీనిని సంపాదించుకొన

వలయు ననియు, ఈ సంకల్పమునందలి భావార్థమై యున్నది. కఠో పనిషత్తునకు నిదియే తాత్పర్యము. నచికేతుఁడు మృత్యువొయొక్క (అనఁగా: యమునియొక్క) లోకమునకు వెళ్ళినపుడు యముఁడు నచికేతుని మూఁడు వరముల నడుగు మని చెప్పఁగాఁ దదనుసారముగ నాతఁ డడిగిన మూఁడు వరముల నిచ్చెను. ఈ విషయమే యీ యుపనిషత్తున సవిస్తారముగ వర్ణింపఁబడినది; కాని మృత్యువు వర మడుగు మని చెప్పఁగానే నచికేతుఁ డొక్కమాఱే (మొదటనే) బ్రహ్మ జ్ఞానము చెప్ప మని వర మడుగక "నా తండ్రి కోపించినాఁడు కావున నతనిని నాకు ప్రసన్నునిఁ జేయుము" అని మొదటి వరమును, పిదప "అగ్నియొక్క (అనఁగా: ఐహిక సమృద్ధినిఁ బొందించుటకు సమర్థ మగు యజ్ఞాది కర్మలయొక్క) జ్ఞానము నుపదేశింప మని రెండవ వరము నడిగెను. ఈ వరమును బొందిన పిమ్మటఁ దుదకు "నా కాత్మ విద్యను వక్కాణింపు" మని మూఁడవ వరము నడిగెను; గాని యీ మూఁడవ వరమునకు మాఱుగ నింక విశేషమగు సంపత్తి నిచ్చెద నని చెప్పఁగా— ప్రేయఃప్రాప్తికి మాత్ర మావశ్యకమగు యజ్ఞాది కర్మల యొక్క జ్ఞానప్రాప్తి యయిన పిదప వాని విషయమగు నధికాశను జెందక— "ఇప్పుడు మోక్షము నిచ్చునట్టి బ్రహ్మజ్ఞానమునే నా కుపదే శింపుము" అని నచికేతుఁడు పట్టుఁబట్టెను. ఈ యుపనిషత్తు తుద నుండు మంత్రములో నున్న రీతిగ బ్రహ్మవిద్య, యోగవిధి (అనఁగా: యజ్ఞయాగాది కర్మలు) అను నీ రెంటిని పొంది నచికేతుఁడు మోక్షము నొందెను (కఠ. 6.18) అని సారాంశము. దీనివలన జ్ఞానకర్మనముచ్చ యమే యీ యుపనిషత్తునకుఁ దాత్పర్య మని సిద్ధాన్త మగుచున్నది. ఇంద్రుని విషయమై యిట్టి కథ యొకటి కలదు. ఇంద్రుఁడు స్వయ ముగ బ్రహ్మజ్ఞానముచేఁ బూర్ణుఁడై యున్నాఁ డనునదియే కాక ప్రతర్దనుని కాయనచే నాత్మవిద్య యుపదేశింపఁబడిన దని కౌషీతక్య పనిషత్తులోఁ జెప్పఁబడినది. అయిన నింద్రునకు రాజ్యముపోయి

ప్రహ్లాదుఁడుఁ త్రైలోక్యాధిపతి యయిన పిదప దేవతల గురువగు బృహస్పతివద్దకు నింద్రుఁ డేగి "శ్రేయస్సు దేనిలో నున్నదో దానిఁజెప్పుము" అని యడిగెను అప్పుడు బృహస్పతి రాజ్యపదభ్రష్టుడఁగు నింద్రునకు బ్రహ్మవిద్య(అనఁగాఁ: ఆత్మజ్ఞానము) నుపదేశించి "ఇంతియ శ్రేయము (ఏతావచ్ఛ్రేయ ఇతి)" అని వచించెను; కాని ఇంద్రుఁ డంతమాత్రము నకే సమాధానము నొందక "ఇంక నేమి యయిన విశేషంబు గలదా? (కో విశేషో భవేత్) అని మరల నడుగ బృహస్పతి ఇంద్రుని శుక్రుని యొద్ద కంపెను. అచ్చో నటులే యగుటచే "ప్రహ్లాదున కావిశేషము తెలియు"నని శుక్రుఁడు పలికెను. ఇంద్రుఁడు బ్రాహ్మణవేషధారియై ప్రహ్లాదుని కడ కేగి తుదకు శిష్యుఁడై కొంతకాలము సేవించిన పిదప శీలము (సత్యముగను ధర్ముగను నడచుటయను స్వభావము) అను నదియే త్రైలోక్యాధిపత్యము సంపాదించుటకు మూలకారణము గాన నదియే శ్రేయస్సని ప్రహ్లాదుఁ డింద్రునకుఁ జెప్పెను. తరువాత "నీ సేవచే నేను సంతుష్టుఁడ నయితిని. నీ వడిగిన వరమును నీకిచ్చెదను" అని ప్రహ్లాదుఁడు చెప్పఁగా "నీ శీలము నా కిమ్ము" అని విప్రవేషధారియగు నింద్రుఁడు కోరెను. ప్రహ్లాదుఁ డందులకు వల్లె యన, వెంటనే శీలము, పిదప ధర్ముము, సత్యము, సచ్చరిత్రము, తుద కైశ్వర్యము నను దేవతలు ప్రహ్లాదుని యొడలినుండి వెడలి యింద్రుని శరీరమునందుఁ బ్రవేశించినవి. దాని మూలమున నింద్రుఁడు రాజ్యమును బొందెను అని భారతమున శాంతిపర్వమున (124) భీష్ముఁడు ధర్మరాజున కొక ప్రాచీనకథను వక్కాణించెను. కేవల మొక యైశ్వర్యముకంటె నొక యాత్మజ్ఞాన మధిక యోగ్య మైన దయినను, ఈ జగత్తునం దుండి వ్యవహరింపవలయు నని కోరికగల వానికి లోకాను సారముగ నైహికసమృద్ధి తనకుఁ గాని తన దేశమునకుఁ గాని సంపాదించుకొను నావశ్యకత నీతిసిద్ధమగు హక్కు గావున, మానవున కీ జగత్తునఁ బరమసాధ్య మగునది యేమి యను ప్రశ్నకు శాంతియు

పుష్టియు, ప్రేయము శ్రేయము, లేక, జ్ఞానము ఐశ్వర్యము, అను నీ రెంటియొక్క సమీచ్యమే మా కర్మయోగశాస్త్రమునందలి కడపటి యుత్తరమని యీ సుందరమయిన కథవలన స్పష్టమగును. ఏ భగవంతునికంటె మఱియొకఁడు ఈ జగత్తునందు శ్రేష్ఠుఁడు లేఁడో, ఎవని మార్గము నవలంబించి యితరులు నడచుచున్నారో (గీ. 3. 23) ఆ భగవంతుఁడు సంపత్తిని (ఐశ్వర్యము) వదలెనా యేమి?—

ఐశ్వర్యస్య సమగ్రస్య ధర్మస్య యశస శ్శ్రియఃr,
జ్ఞానవైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగ ఇ తీరణా.
(విష్ణు 6.5.74)

— సమగ్రమైన యైశ్వర్యము, ధర్మము, యశస్సు, సంపత్తి, జ్ఞానము, వైరాగ్యము అను నీ యాఱు విషయములకు 'భగ' మని పేరు అని భగ శబ్దమునకు వ్యాఖ్యానము పురాణములలోఁ జేయఁబడినది. ఈ శ్లోకములో నైశ్వర్యశబ్దార్థము యోగైశ్వరము లని వచింతురు. కారణ మేమియన: 'శ్రీ' యన సంపత్తి యని యర్థము. ఈ శబ్దము మున్ను వచ్చియున్నదే. వ్యవహారములో నైశ్వర్యశబ్దమునందు సత్తయును, యశస్సును, సంపత్తియు, జ్ఞానశబ్దమునందే వైరాగ్యమునకును, ధర్మమునకును సమావేశముండుటచే బూర్వోక్తశ్లోకమునందున్న సకలార్థములు జ్ఞానైశ్వర్య పదములచేతనే లౌకికదృష్టిచే స్పష్టపడుచున్నవని చెప్పుట కేమియు నభ్యంతరము లేదు. ఎందు నిమిత్తము జ్ఞానైశ్వర్యముల జంట భగవంతునిచే నంగీకరింపఁబడినదో యా హేతువుచే, నా విషయము ప్రమాణమే యని యెఱింగి యితరులు సైతము దాని నాచరింపవలయును (గీ. 3.21; మ. భా. శాం. 341.25). ఆత్మజ్ఞానమునందియే యీ జగత్తునందుఁ బరమసాధ్యమగు సిద్ధాన్తమనియు, సంసారము దుఃఖమయము గాన దాని బొత్తిగ వదలవలయుననియుఁ జెప్పువారు సన్న్యాసమార్గములోని వారు గాని, కర్మయోగమార్గములోని వారు కారు. వేర్వేఱు మార్గములం దున్న యీ సిద్ధాన్తముల

నొకచోటికిఁ జేర్చి గీతార్థమును విపరీతముఁ జేయుట యోగ్యము కానేరదు. అయినను జ్ఞానవిహీన మగు సంపత్తి, అసురీసంపత్తి యని గీతలలోనే చెప్పఁబడెను. కావున నైశ్వర్యముతోడ జ్ఞానమును, జ్ఞాన ముతోడ నైశ్వర్యమును, శాంతితోడఁ బుష్టియుఁ, బుష్టితో శాంతియును జతగా నుండి తీరవలయు నని సిద్ధ మగుచుండఁగ జ్ఞానముతోఁబాటుగ నీ శాంతిపుష్టులు రెండు నేల యుండరాదు? జ్ఞానముతోడనైన నైశ్వ ర్యము కావలయు నని చెప్పిన యెడల కర్మ చేయవలసిన దనుట ముఖ్యముగనే ప్రాప్త మగును. ఏలన: "కర్మా ణ్యారభమాణం హి పురుషం శ్రీ ర్నిషేవతే"- కర్మఁజేయు మనుజునకే యీ జగమున శ్రీ (అనఁగా: ఐశ్వర్యము) లభించును (మను. 9. 300) అని మనువు చెప్పినందునఁ బ్రత్యక్షానుభవముచే నా విషయమే సిద్ధమగును. గీత లలో నర్జునునకుఁ జేసిన యుపదేశము సైత మటులే యున్నది (గీ. 8.8). మోక్షదృష్టిచేఁ గర్మ యావశ్యక మయినది కాకపోవుటచేఁ దుదకు (అనఁగా: జ్ఞానప్రాప్త్యనంతరము) నర్వకర్మలు వదలిపోవు తీర వలయు నని యనేకులు చెప్పుచున్నారు; కాని ప్రస్తుతము సుఖదుఃఖ ముల విచారము మాత్రమే కర్తవ్య మైనది గావున, మోక్షకర్మల స్వరూప మిప్పటికిని బరీక్షింపకుండుటచే నా యాక్షేపణకు సమాధాన మిప్పుడు చెప్పుట సాధ్యము కానేరదు. ముందు 9-10 ప్రకరణము లలో నధ్యాత్మమును, కర్మవిపాకమును లెస్సగా విచారించి పదునో కండవ ప్రకరణములో నీ యాక్షేపము సంభవింపఁ దగినది కానేర దని నిరూపించెదము.

సుఖదుఃఖములు రెండును భిన్నములును స్వతంత్రములు వయిన వేదనలుగ నున్నవి. కేవల సుఖోపభోగములచేత సుఖేచ్ఛ తీరదు. కాన సంసారము దెల్లప్పుడును దుఃఖరాశియె యధికముగ మన్నట్లు కనఁబడుచున్నది. ఈ దుఃఖమును తప్పించుకొనుటకుఁ దృష్ణను, అసంతోషమును, కర్మములను సమూలముగ నాశము

సేయుట యోగ్యము కానేరదు. కావున నొక్క ఫలాశను మాత్రము వదలి సర్వకర్మములఁ జేయుచుండ వలయు ననుట శ్రేయస్కరముగ నున్నది. కేవల విషయోపభోగసుఖ మెప్పుడును బూర్ణ మగునది కాదు. అది యనిత్యమును, పశుధర్మము నగుటచే బుద్ధీంద్రియములు గల మానవులకు నీ జగత్తునందు నత్య మైన ధ్యేయము, దీనికంటె నున్నతస్థానమును గావలయును. ఆత్మబుద్ధి ప్రసాదముచేఁ బ్రాప్త మగు శాంతిసుఖ మను నదియే నత్య మగు ధ్యేయ మగును. ఆధ్యా త్మికసుఖ మిూరీతిగ శ్రేష్ఠ మైన దైనను, ఈ జగత్తునం దాధ్యాత్మిక సుఖము నొందుటకు నుచితములగు నైహికవస్తువులతో సంబంధ మావశ్యక మగును. అందుచే నిస్సామబుద్ధితోఁ బ్రయత్నము (అనఁగా: కర్మ) చేయవలయును. ఈ విషయము కర్మయోగశాస్త్రానుసారముగ సిద్ధ మైన పిదప సుఖము కావలయు నను మూహతో విచారించినను కేవ లాధిభౌతికసుఖ మనునదియే పరమసాధ్యమని యొప్పుకొని కర్మ సంబంధ మైనదియు నగు బాహ్యపరిణామముయొక్క తారతమ్యము చేతనే నీతిమత్తను నిర్ణయించుట యోగ్యము కానేర దని వేఱుగఁ జెప్ప నక్కఱయుండదు. ఏలయన: ఎప్పుడును స్వయముగఁ బరి పూర్ణావస్థ నొందుటకు నమర్థము గాని వస్తువు పరమసాధ్య మని యంగీకరించుట పరమ శబ్దోపయోగముఁ జెఱచుటయే కాక, యెండ మావులయందు నిజముగ జల మున్నదనుటవలె నయోగ్య మగును. పరమసాధ్యమే యనిత్యము నపూర్ణము నయినయెడల దానిఁ గోరు టచే, మన యొడిలో నైనను ననిత్యవస్తువు తప్ప రెండవ దేది పడును? "ధర్మో నిత్య స్సుఖదుఃఖే త్వనిత్యే" అను వచనమునందున్న మర్మ మిదియె. "అనేకుల కధిక సుఖ" మను నీ శబ్దార్థ మేమి యని తెలిసి కొనుటలో నాధిభౌతికవాదులలో నైతము, చాల మతభేదము కలదు. మనుజుఁ డనేక పర్యాయములు సర్వవిషయసుఖముల నణఁగ ద్రొక్కి సత్యము కొఱకును, ధర్మము కొఱకును ప్రాణము నిచ్చుటకు నియ్య

కొనుటచే నాతని కోరిక యప్పుడును నాధిభౌతిక సుఖప్రాప్తియందే యుండునని చెప్పుట యుక్తము కాదని యీ పండితులలో ననేకు లభిప్రాయపడుచున్నారు. కావున, సుఖశబ్దస్థానమున హితశబ్దమునైనను కల్యాణశబ్దము నైనను జేర్చి 'అనేకుల కధిక సుఖ' మను సూత్రమును "అనేకుల కధిక హితము" లేక, "యనేకుల కధిక కల్యాణ" మని మార్చినరింప నగునని చెప్పిరి: కాని యిటు లొనర్చినను గర్తయొక్క బుద్ధి యెట్టిదై యుండవలయునో తేలలే దను మొదలగు దోషములును నీ మతమందు సైతము స్థిరముగ నున్నవి. మంచిది. విషయసుఖములతో మానసికసుఖముల సైతము విచారింప వలయుననిన, ఏ కర్మయొక్క నీతిమత్తనైనను దాని బాహ్యపరిణామము బట్టియే స్థిరపఱుపవలయు ననెడి ప్రథమ ప్రతిజ్ఞకు విరోధము కలుగుటయే గాక కొలఁదిగ నధ్యాత్మపక్షము నొప్పుకొని నటు లగును. కాని యిట్లు చివరకు నధ్యాత్మపక్షము నవలంబింపకతప్పని యెడల కొంత మాత్రమే యొప్పుకొన నేల? కావున సర్వభూతహితమును, ననేకుల కధికసుఖమును, మనుష్యత్వముయొక్క పరమోత్కర్ష యు మొదలగు నీతినిర్ణయమునకు సర్వబాహ్యసాధనములు (అనఁగా: ఆధిభౌతిక మార్గములు) గౌణము లని స్థిరపఱచి యాత్మప్రసాదరూపమగు నత్యంత సుఖమును, దాని ననుసరించియుండు కర్తయొక్క శుద్ధ బుద్ధియు నను నీ యాధ్యాత్మిక నికషోపలముచేఁ గర్మాకర్మల పరీక్షఁ జేయవలయు నని మా కర్మయోగశాస్త్రమునందుఁ దుదకు సిద్ధాన్తిక రింపఁబడినది. ఏ విషయ మైనను నరే, దృశ్యమైన సృష్టికంటె దూరముగ నుండు తత్త్వజ్ఞానమునందుఁ బ్రవేశించుకు యవనరము లేదని శపథము సేయు వారి విషయము వేఱు. అట్టి ప్రతిజ్ఞ లేనివారి కీ కర్మయోగశాస్త్రమున మనోబుద్ధులను శుద్ధపఱచుకొనుటయే కాక, నిత్యమగు నాత్మయొక్క నిత్యకల్యాణమే ప్రధాన మని చెప్పవలయు ననుట యుక్తిచే సైతము ప్రాప్తమగుచున్నది. వేదాన్తములోనికిఁ బోచ్చిన, సర్వము బ్రహ్మమయ మగుటచే వ్యవహారము సేయుటకు

లేదు లేదని యనేకులు సెప్పు యుక్తి సరియగు నది కానేరదు. సామాన్యముగ, వేదాన్తమునఁ బ్రచారములో నున్న పతనపాతన గ్రంథములన్నియు, సన్యాసమార్గానుసారుల చేతనే వ్రాయఁబడియుండుటచే, సన్యాసమార్గమునకుఁ బ్రష్ణాయ మగు సంసారము సర్వము నిస్సారముగఁ దోఁచుటచే, వారి గ్రంథములలోఁ గర్మయోగముల కుపపత్తి యనుకూలముగఁ జెప్పఁబడక యుండుట యథార్థమే. వేయేల? ఈ పర సంప్రదాయమును సహింపని గ్రాంథికులు సన్యాసమార్గమందున్న పూర్వపక్ష సిద్ధాన్తముల రీతిని కర్మయోగములో గ్రుచ్చి, సన్యాసము, కర్మయోగము ననునవి రెండును స్వతంత్రమార్గము లనియుఁ దెలుపుటకు యత్నించుచున్నారు. కాని యీ మతము సత్యము కానేరదు. సన్యాసమార్గమువలెఁ గర్మయోగమార్గము సైతము వైదికధర్మములం దనాదిగ స్వతంత్రముగ వచ్చుచున్నది. మఱియు నీ మార్గప్రవర్తకులు వేదాన్త తత్త్వమును వదలక, కర్మయోగశాస్త్రమునకుఁ దగిన యుపపత్తినిఁ జెప్పుచున్నారు. భగవద్గీత యను గ్రంథము సైతమీ మార్గము ననుసరించినదియే. గీతల వదలినను, అధ్యాత్మదృష్టితోఁ గార్యాకార్య శాస్త్రముయొక్క వివేచనఁ జెయుపద్ధతి నింగ్లాండులో నుండిన 'గ్రీన్' వంటి గ్రంథకారులు స్వయముగ నారంభించిరి. * జర్మనీ దేశము నందన్నచో యది 'గ్రీన్' కాలమున కర్వాచీనపూర్వమునందే యారంభింపఁబడినది. దృశ్యమగు సృష్టి నెంత విచారించినను, ఈ సృష్టినిఁ జూచువాఁడును, కర్మలఁజేయువాఁడును నెవఁడైనదియుఁ దెలియునంతవఱకు మానవున కీ జగంబున ముఖ్యముగఁ గర్తవ్యతా విచారము తత్త్వసంబంధమగు దృష్టితోఁ జూచిన సంపూర్ణముగనే యుండును, "ఆత్మా వా అరే ద్రష్టవ్య శ్శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః"అను యాజ్ఞవల్క్యుని యుపదేశము సైతము నీ ప్రకరణమునకు ముఖ్యముగ సంబంధించియే యున్నది. దృశ్యమగు

* Prolegomena to Ethics, Book I; and Kant's Metaphysics of Morals (trans. by Abbot in Kant's Theory of Ethics).

జగత్తును పరీక్షింపఁగా పరోపకారమువంటి సిద్ధాన్తములు తుదకు వెలువడినపక్షమున నధ్యాత్మవిద్యయొక్క మాహాత్మ్యము కొఱపడదు. విపరీతముగ సర్వభూతములయందును నొక యాత్మయే యున్న దను వాదమును దృఢపఱచుచునే యున్నదని నుడువఁబడుచున్నది: అధి భౌతికవాది న్యయముగ తెచ్చిపెట్టుకొనిన నియమమును వదలి, దూరముగ నేగుటకు వీలు కానేరదను దానికి ప్రతిక్రియ యేమియు లేదు. మన శాస్త్రవాదుల దృష్టి యింతకంటెను దూరదర్శియగుటచే నధ్యాత్మదృష్టిచేఁ గర్మయోగ శాస్త్రమునకుఁ బూర్ణమగు నుపపత్తి చెప్పఁబడినది. కాని యీ యుపపత్తినిఁ జెప్పుటకంటెఁ బూర్వము నందుఁ గర్మాకర్మపరీక్షయొక్క రెండవ పూర్వపక్షమును గొంచెము విచారించుట యావశ్యక మగుటచే నా మార్గము నిప్పుడు తర్కింతము.

గీతారహస్యమున సుఖదుఃఖవివేక మను పంచమ ప్రకరణము.

షష్ఠ ప్రకరణము

అధిదైవతపక్ష – క్షేత్రక్షేత్రజ్ఞ విచారము

సత్యపూతాం వదే ద్వాచం మనఃపూతం సమాచరేత్.*
(మను. 6. 46)

అధిభౌతిక మార్గమె కాక, కర్మాకర్మ పరీక్షకు నాధిదైవతమని సైతము మఱియొక మార్గము గలదు. ఈ మార్గావలంబకు లీ తీరున నుడివెదరు– మానవుఁడు కర్మాకర్మలను, లేక, కార్యాకార్యములను నిర్ణయించునమయమునం దీ కర్మవలన నెవరి కెంత సుఖమో, లేక, దుఃఖమో కలుగునని కాని, దానిలో సగటునకు సుఖరాశి యధికమా? దుఃఖరాశి యధికమా? యని కాని విచారింపఁడు. ఆత్మాత్మ విచారమునందు సైత మెప్పుడును ప్రవేశింపఁడు. అనేకులగు జను లీ కోలాహల మెఱుంగరు. వేయేల? ప్రతిమనుజుఁడు నాత్మనుఖార్థమే ప్రతి కర్మను జేయునను నియమమును లేదు. అధిభౌతికవాది యే యుక్తి చెప్పినను జెప్పఁగాక! ధర్మాధర్మముల నిర్ణయించు మనుజుని మనస్థితి యెటు లుండునని క్షణమాత్రము విచారించితిమేని, మనుజుని మనస్సున నుండునవియు, స్వాభావికములు, నుదాత్తములు నగు కారుణ్యము, దయ, పరోపకారము మొదలగు మనోవృత్తులే యొక్కసారిగ నొకానొక కార్యముఁజేయుటయం దతని నెప్పుడును ప్రేరణఁ జేయునని మనకు స్పష్టముగఁ దోఁచును. ఉదాహరణ మేమి

---

* ఎయ్యది సత్యమునేఁ బవిత్రము (అనఁగా– శుద్ధము) గాఁ జేయఁ బడినదో, యట్టి వాక్యమునే పలుకవలయును. అట్లే యెయ్యది మనస్సునకు శుద్ధముగఁ దోఁచునో, దానినే యాచరింప వలయును.

యన- ఒక దరిద్రుని మనముచూచితి మేని "ఏమియయినను ధర్మా చరణ సేసినచో జగత్తునకు, లేక, మన యాత్మకు నెంత కల్యాణ మగును" అను సంగతి తోఁపక మునుపే దయార్ద్రహృదయులమై స్వశక్త్యనుసారముగ ధర్మాచరణ మొనరించి ముక్తుల మగుదుమ్మాము బాలుఁ డేడ్చె నేని యతనికి పాలిచ్చినచో నెండజీ నెంత హితమగు నని యేమియు విచారింపక తల్లి పా లిచ్చుచున్నది. అనఁగా- ఈ యుదాత్త మనోవృత్తియే కర్మయోగశాస్త్రమునకు ముఖ్యమగు మూలబంధము (పునాది)గ నున్నదని తాత్పర్యము. ఈ మనోవృత్తిని మన కెవ్వారు నొసంగలేదు. కావున నది స్వభావసిద్ధమగు అనఁగా- ఒకదృష్టితో స్వయంభువ యగు దేవతగా నున్నది. న్యాయమూర్తి తన గద్దియపైఁ గూర్చున్నప్పుడు న్యాయదేవతచే స్ఫురింపఁ జేయఁ బడిన న్యాయమును నిర్ణయించు చున్నాఁడు. ఈ స్ఫురణము వాని మనోవృత్తియందు లేనప్ప డతని వలన నన్యాయము వాటిల్లును. న్యాయదేవతవలెనే, కారుణ్యము, దయ, పరోపకారము, కృతజ్ఞత, కర్తవ్యప్రేమ, ధైర్యము మొదలగు సద్గుణములయొక్క స్వాభావిక మగు మనోవృత్తియు దేవతగ నున్నది. ఈ దేవతల శుద్ధస్వరూప మెట్టి దైనదియుఁ బ్రతిమానవునకును సహజముగనే తెలియును; కాని, లోభముచేఁ గాని, ద్వేషముచేఁ గాని, మాత్సర్యముచేఁ గాని, లేక, యిట్టి మఱియొక కారణముచేఁ గాని యీ దేవతలయొక్క స్ఫురణము తన యభిప్రాయములో లేనివానిని దేవత లేమి చేయఁగలదు? ఇది నిత్య మగునా? యని కాని, లేక, యనేక సమయములందు దేవత లకుఁ బరస్పరకలహ ముండుటచేత నొక కార్య మొనర్చినప్పుడే దేవతయొక్క స్ఫూర్తి బలవత్తర మని యెన్నవలయు నని కాని, మనము సంశయించుమాట సత్యమే. మఱియు నీ సందేహమును నిర్ణయించుటకు, న్యాయము, కరుణ మొదలగు దేవతలకంటె వేఱగు వ్యక్తితో నాలోచింపవలసి వచ్చునని తోఁచును; కాని యిట్టి సమయ ములయందు సైత మధ్యాత్మవిచారముయొక్క గాని, సుఖదుఃఖ

ముల తారతమ్యముయొక్క గాని కోలాహలములోఁ బడక మన మనోదేవతయొక్క సాక్ష్యము నడుగుదు మేని, యా దేవతయె రెంటిలో నే మార్గము శ్రేయస్కరముగ నున్నదియు వెంటనే నిర్ణయించు చుండును. ఆ కారణముననే వెనుకఁ జెప్పిన సకల దేవతల కంటె మనోదేవతయె శ్రేష్ఠురాలు. 'మనోదేవతా' శబ్దమందు, మనస్సునందు కోరిక, క్రోధము, లోభము మొదలగు వికారముల నన్నింటిని జేర్పక, మనస్సున నున్న నదనద్వివేచకము, నీశ్వర దత్తము, లేక, స్వాభావిక మైనది యగు శక్తిమాత్రమే యీ ప్రకరణమునందు వివక్ష యొనరింపవలసిన దని తెలియవలయును. ఈ శక్తికే 'నదనద్వివేకబుద్ధి*' యని గొప్ప పేరు కలదు. కావున నే సంశయము కలిగినను స్వస్థాన్తఃకరణముతోడను, శాంతముతోడను విచారించిన యెడల నీ 'నదనద్వివేక దేవత' యెప్పుడు నతని మోస గింపదు. ఇట్టి సమయములందు "నీవు నీ మనస్సున విచారించు కొమ్ము" అనియే మన మితరులకుఁ జెప్పుచున్నాము. ఏ నద్గుణమున కే సమయమున నెంత మహత్త్వ మీయవలయునో యీ మహాదేవత యొక పట్టిక (జాబితా) నెప్పుడును సిద్ధము చేసియుంచును గానఁ దదనుసారముగ నా యా సమయములం దీ మనోదేవత తన నిశ్చయములను వెంటనే ప్రకటనఁ జేయును. ఒకానొకసమయమం దాత్మసంరక్షణమునకు నహింసకు విరోధము గలుగుటచే (అనఁగా దుష్కాలము వచ్చినప్పుడు) అభక్ష్యభక్షణముఁ జేయవచ్చునా? కూడదా? యని మనము సంశయపడుదు మేని, మనము శాంతచిత్తులమై యీ మనోదేవతకే యధీనము (కొలు నిచ్చుట) చేసితి మేని వెంటనే "అభక్ష్యభక్షణము చేయుము" అని నిర్ణయము వెలువడును. అటులె స్వార్థమునకుఁ గాని, పరార్థమునకుఁ గాని, లేక,

---

*ఈ నదనద్వివేకబుద్ధియే ఆంగ్లేయులో Conscience అని చెప్పఁబడును. మఱియు అధిదైవతపక్షము Intuitionist School అని చెప్పఁబడును.

పరోపకారమునకుఁ గాని పరస్పరవిరోధము గలిగె నేని దాని నిర్ణయ మును సైతము నీ మనోదేవత చెప్పినటులే చేయవలయును. కాంత ముగ విచారింపఁగా మనోదేవత గృహములో నున్న యీ ధర్మాధర్మ తారతమ్యపట్టిక యొక గ్రంథకారునకు* లభించుటచే నతఁడు తన గ్రంథమునఁ బ్రచురపఱచెను. ఈ పట్టికలో నగ్రతాపూర్వకమగు పూజ్యభావమునకు నగ్రస్థానము (అనఁగా అన్నిటికన్న గొప్పది యగు స్థాన) మీయఁబడెను. దాని వెంబడి కారుణ్యమునకును, పిదప కృతజ్ఞత, ఔదార్యము, వాత్సల్యము మున్నగు వానికిని, ఒకటి వెంబడి నొకదానికి క్రమముగ నీచస్థానము లీయఁబడినవి. ఈ నీచ స్థానము లందున్న సద్గుణములకు నగ్రస్థానము నందలి సద్గుణము లకును విరోధము వచ్చెనేని యగ్రస్థానదేవతకే యధికాధిక మగు గౌరవము నీయవలయు నని యీ గ్రంథకాఁడని యభిప్రాయము. కార్యాకార్యములను గాని ధర్మాధర్మములను గాని నిర్ణయించుట కాతని మతమందు దీనికంటె యోగ్యమగు మార్గము గాన్పింపదు. కారణ మేమన-దృష్టిని మన మెంతదూరము ప్రసరింపఁజేసి యనేకుల కధిక సుఖ మెం దున్నదో దాని నిశ్చయించినను, అనేకులకు దేనియందు హితమున్నదో దానినే చేయుటకు శక్తి గాని యధికారము గాని యీ తారతమ్యబుద్ధియందు లేనందున, తుద కనేకులహితము నే నేల చేయ వలయు ననుసంశయమొక్క నిర్ణయము కామిచే, మరల నన్ని శంకలును యథాప్రకారముగఁ గలుగుచునే యున్నవి. ఏ న్యాయమూ ర్తి యును ప్రభువువలన నధికారము నొందకయే యొక న్యాయనిర్ణయ మును జేసెనేని, యా నిర్ణయముయొక్క ఫలితమువలెనే, సుఖదుఃఖ

* ఈ గ్రంథకారునిపేరు James Martineau. (జేమ్స్ మార్టినో). ఈ విషయమును తన Types of Ethical Theory (Vol. II. P. 266. 3d Ed.) అను గ్రంథమున సూచించియున్నాఁడు; ఈ మార్టినో ఈ మార్గమునకు Ideo-psychological అని పేరుపెట్టెను; కాని నేను దాని నీయాధిదైవతపక్షములోనే చేర్చితిని.

ములను దూరదృష్టిచే విచారించి చేసిన కార్యాకార్యముల నిర్ణయమును, "నీ విట్లు చేయుము నీ కిది చేయఁ దగినదియే" యని కేవల దూరదృష్టి యెవరికిని జెప్పనేరదు. కారణ మేమి యన-దూరదృష్టి యయినను మానుషకృత్యమగుటచే మానవులమీఁద నేయధికారము చేయనేరదు. ఇట్టి విషయములో మనకంటె గొప్ప యధికారికి రెండవ వారెవరైన నాజ్ఞాపకులుగ నుండవలయును. మనుజునికంటె శ్రేష్ఠమగుటచే మానవునిపై నధికారము నలుపుటకు సమర్థమగు నీశ్వరదత్త సదసద్వివేకదేవతయే దానిని నలుపవలయును. ఈ దేవత స్వయంభువ యగుటచే వ్యవహారమున సైతము నా 'మనోదేవత' నాకు నిట్టిసాక్ష్యమీయ లేదని చెప్పుటయు వాడుకలోనే యున్నది. ఒకానొకఁ డొక తప్పుకార్యముఁ జేసెనేని, వాడు తనంతట తానే సిగ్గుపడుట కాని, యేవగించుకొనుట గాని యీ మనోదేవతయొక్క శిక్షాఫలములే యగును. కావున నీ స్వతంత్రులగు మనోదేవతలుగల రని సిద్ధమగును. కారణ మేమి యన- నే మనుజుఁడును తన్ను తానే యేల యేవగించుకొను? నను విషయమున కేమియు యుక్తి లేదని యీ మతము నందలి యభిప్రాయము.

ఈ చెప్పిన మార్గ మాధిదైవతమార్గావలంబులగు పాశ్చాత్యులది. పశ్చిమదేశము నందుండి వచ్చిన క్రైస్తవధర్మోపదేశకు లీ మార్గమును సాధారణముగ నంతట వ్యాపింపఁ జేసిరి. వారి మతమున, ధర్మాధర్మములు నిర్ణయించుటలోఁ గేవలాధిభౌతిక సాధనములకంటె నీయీశ్వరదత్తమగు సాధనము సులభమును, శ్రేష్ఠముగను నుండుటచే గ్రాహ్యముగ నున్నది. పూర్వము మన దేశములో నిట్టి స్వతంత్రమగు కర్మయోగశాస్త్రము లేకపోయినను, వెనుకఁ జెప్పిన మతములన్నియు ప్రాచీన గ్రంథములలోఁ బ్రసిద్ధములగు ననేక స్థలముల స్పష్టముగఁ గాన్పించు చున్నవి. మనస్సుయొక్క వేర్వేఱువృత్తులను మహాభారతమున ననేక ప్రదేశములయందు దేవతాస్వరూపముగ వర్ణించినట్లు కాన్పించుచున్నది. ధర్ముము, సత్యము, వృత్తము,

శీలము, శ్రీ, ఇత్యాది దేవతలు ప్రహ్లాదుని శరీరమునందుండి వెలువడి యింద్రుని శరీరమునఁ జొచ్చినటుల పూర్వమునందుఁ జెప్పఁబడి యున్నది. కార్యాకార్యములను, లేక, ధర్మాధర్మములను నిర్ణయించు దేవతకే 'ధర్మ' మని పేరగుటచే, శిబిచక్రవర్తియొక్క సత్త్వమును బరీక్షించుట కొకపరి యక్షరూపమునను, తుదకు శునకరూపమునను, అది ప్రకట మైనదని తెలియుచున్నది. స్వయముగ భగవద్గీతలలో సైతము (10-34) కీర్తి, శ్రీ, వాక్కు, స్మృతి, మేధ, ధృతి, క్షమ యనునవి యన్నియు దేవతలని వక్ఖాణింపఁబడినవి. వానిలో స్మృతి, మేధ, ధృతి, క్షమ యనునవి మనోధర్మములుగ నున్నవి. మనస్సొక దేవత యగుటచేఁ బరబ్రహ్మయొక్క ప్రతీక మని చెప్పి యుపనిషత్తులలో నా యుపాసనయుఁ (ప్రతీకోపాసన) జెప్పఁబడినది (తై: 3.4; ఛాం. 3.18) "మనఃపూతం సమాచరేత్" — మనస్సున కేది శుద్ధ మని తోఁచునో దానిని జేయవలయును అని మనువు చెప్పినపుడు (6-46) 'మనస్సు' అను శబ్దమునకు 'మనోదేవత' యను నర్థమే మనువుచే నుద్దేశింపఁబడి యుండునని చెప్పవచ్చును. సామాన్య వ్యవహారమున సైతము "మనోదేవత కేది మాన్యముగ నుండునో దానినే చేయు" మని మనము చెప్పుచున్నారము. "మనఃపూత" శబ్దార్థము మహారాష్ట్రభాషలో విపరీతముగ నున్నది. అనేక సమయములయందుఁ దోఁచున దెల్లఁ జేసినవాఁడు మనఃపూతముగ సంచరించుచున్నాఁడని మహారాష్ట్రమునఁ జెప్పుచున్నారు; కాని యీ శబ్దమునకు "మనస్సునకు శుద్ధమని, లేక, పరిశుభ్రమని తోఁచిన దానినే చేయుము" అని నత్యమైన యర్థము. మనుసంహితయొక్క నాల్గవ యధ్యాయమున—

> యత్కర్మ కుర్వతోఽస్య స్యాత్ పరితోషోఽంతరాత్మనః,
> తత్ప్రయత్నేన కుర్వీత విపరీతం తు వర్జయేత్.
>
> (మను. 4.161.)

— ఏ కర్మము లొనర్చుటచే మన యంతరాత్మ సంతసించునో వానినే ప్రయత్నపూర్వకముగఁ జేయవలయును; దానికి విపరీతముగ నున్నపక్షమున వదల వలయును అని మనువే దానిని వివరించి చెప్పెను. ఇటులే చాతుర్వర్ణ్యధర్మము మొదలగు వ్యావహారికముల యొక్క నీతుల మూలతత్త్వమును చెప్పుచు, మను యాజ్ఞవల్క్యాది స్మృతికర్తలు సైతము—

వేదఃస్మృతిఃసదాచారఃస్వస్య చ ప్రియ మాత్మనఃఏత చ్చతుర్విధం ప్రాహుఃసాక్షా ద్ధర్మస్య లక్షణమ్.

(మను. 2.12.)

— వేదము, స్మృతి, శిష్టాచారము, తన యాత్మకు రుచించుట యను నీ నాల్గును ధర్మమునకు ముఖ్యములగు లక్షణములు అనియే చెప్పిరి. "తనయాత్మ కేది రుచించునో" యనఁగా "మనస్సున కేది శుద్ధమని తోఁచునో" యనియె యర్థము. శ్రుతి, స్మృతి, సదాచారములచే నే కర్మయొక్క ధర్మాధర్మముల నిర్ణయము కానేరదో దాని నిర్ణయించుటకు నాల్గవసాధనము మనఃపూతత్వ మని నిశ్చయించినటుల దీనివలన స్పష్ట మగుచున్నది. మహాభారతమున నింద్రప్రహ్లాదులకు వెనుకటి ప్రకరణమునఁ జెప్పిన సంగతి జరిగిన పిదప 'శీల' లక్షణముఁ జెప్పుచు ధృతరాష్ట్రుఁడు—

య దన్యేషాం హితం న స్యాత్ ఆత్మనఃకర్మ పౌరుషమ్,అవ్రతేవ వా యేన న తత్కుర్యాత్ కథంచన.

(మ.భా.శాం. 124-88)

— మనము సేయు నే కర్మ లోకులకు హితము గాదో, లేక, దేని విషయమై మనలో మన మెప్పుడు లజ్జపడవలసి యుండునో యా కర్మ నెప్పుడును జేయరాదు అని చెప్పఁబడినది. 'లోకహితము గాక పోయినను' 'లజ్జ యగుచున్న' దను పదములచే 'అనేకుల కధిక

హిత' మనునదియు, 'మనోదేవత' యనునదియు నగు నీ రెండు పక్షములు నీ శ్లోకమునసే యొప్పుకొన్నఁబడిన వని చదువరులకు స్పష్ట ముగఁ దెలియును. మనుస్మృతియందు సైతము— "ఏ పనినైన చేసి నప్పుడును, లేక, చేయుచున్నప్పుడును లజ్జ యగునో యది తామ సము. మఱియు నే కర్మఁ జేయునప్పుడు లజ్జయుండదో, లేక, యంత రాత్మ సంతసముతో నుండునో యది సాత్త్విక మనఁ బడును (మను. 12. 35-37)" అని యున్నది. మఱియు ధమ్మపద మను పేరు గల బౌద్ధగ్రంథములో సైత మీ విచారము చేయఁబడి యున్నది (ధమ్మ పద. 67, మఱియు 68 చూడు) కర్మాకర్మల విషయమైన సంశయము వచ్చినప్పుడు—

సతాం హి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః.

(శాకు. 1-20)

— సత్పురుషులు సందేహాస్థలములయందుఁ దమ యంతఃకరణము యొక్క సాక్ష్యమునే యంగీకరింతురు అని మహాకవి కాళిదాసు సైతము వక్కాణించు చున్నాఁడు. చిత్తవృత్తిని నిరోధించి, మనస్సు నొక విషయమునసే స్థిరముఁ జేయుటయే పాతంజలయోగము యొక్క కార్యము. మఱియు నీ యోగశాస్త్రము మన దేశమున బహుకాలమునుండి ప్రచారములో నున్నందుచేఁ గర్మా కర్మల సందేహము పొనఁగినచో నంతఃకరణమును స్వస్థమును, శాంతమును గావించికొని యోగ్య మని తోఁచినఁ దానిఁ జేయవలయునను మార్గ మును మనవారి కొరు లెవ్వరు నేర్ప నవసరము లేదు. స్మృతిగ్రంథ ముల యన్నింటి ప్రారంభమున, స్మృతికర్తలగు ఋషులు దమ చిత్తము నేకాగ్రముగఁ జేసికొనియే ధర్మాధర్మములఁ జెప్పుచున్నట్లు వక్కాణింపఁబడియున్నది (మను. 1. 1). ఎవనియందైన నీ రీతిగ మనస్సాక్ష్యమును గైకొనుమార్గము సకృద్దర్శనమునందుఁ జూచుటకు

మిక్కిలి సులభమై తోఁచును; కాని 'శుద్ధ మనస్సన నేమి?' యను విషయము తత్త్వజ్ఞానదృష్టితో సూక్ష్మముగ విచారించిన నీ సులభ మగు పక్షము తుదవఱకు నిలుచునది కానేరదు. కావుననే కర్మయోగ శాస్త్రమును మహాప్రాసాదము నీ స్తంభములమీఁద మన శాస్త్రకారులు నిర్మింపలేదు. ఈ తత్త్వజ్ఞాన మేది? యని యిచ్చో విచారింపనగును గాని దీనికంటె ముందు పాశ్చాత్యులగు నాధిభౌతికవాదు లీయాధి భౌతికపక్షము నెటుల ఖండించిరో యా విషయము కొంచె మిచ్చో విచారించెదను. కారణ మేమి యన- ఈ విషయమున నాధ్యాత్మి కాధిభౌతికవాదుల రెండు మార్గములకు కారణములు వేర్వేఱుగ నుండి నను దుదకు ఫలితార్థమొక్క తీరుననే యుండుటచేఁ దొలుతొల్త నాధి భౌతిక కారణములను జెప్పితి మేని పిదప నాధ్యాత్మిక కారణముల యొక్క మహత్త్వము, లేక, యుక్తియుక్తత చదువరులకు వేగిర ముగఁ దెలియును.

అధిదైవత మార్గమునందు వెనుకఁ జెప్పినటుల శుద్ధమనో దేవతకే యగ్రస్థాన మిచ్చి యున్నందున "అనేకుల కధిక సుఖ" మను నాధిభౌతిక నీతిమార్గమునఁ గర్తయొక్క బుద్ధిని గుఱించి యే విచారణయుఁ గానేర దని వెనుకఁ జెప్పఁబడిన దోష మీ యాధి దైవతపక్షమునకు సంబంధించి యుండదని స్పష్టమగుచున్నది. కాని దీనిని సదసద్వివేకరూపిణియగు శుద్ధమనోదేవత యని యనవల యునో సూక్ష్మముగ విచారించితి మేని యీ మార్గమునందు సైతము కుఱియొక యపరిహార్యమగు దోషము సిద్ధమగును. ఏ విషయము నాలోచనకుఁ గైకొన్నను దాని నన్ని విధముల విచారించి "యిది గ్రాహ్య మగునా? కానేరదా? చేయుట కర్హ మగునా? కానేరదా? చేసినను లాభదాయకము, లేక, సుఖదాయక మగునా? కానేరదా?" యని నిశ్చయించుట యను పని, ముక్కు కన్ను మొదలగు నింద్రియ ములు సేయునది కాకపోవుటచే నా పనిని సిద్ధాన్తముఁ జేయుటకు,

మనస్సొక స్వతంత్ర మగు నింద్రియముగ నున్న దని యెవరికిని చెప్ప నక్కఱలేదు. అనఁగా- కార్యాకార్యములను, లేక, ధర్మాధర్మములను మనస్సే నిర్ణయించును, గాన దాని నింద్రియ మని కాని దేవత యని కాని చెప్పవచ్చును. ఈ విషయము నాధిదైవిక మార్గము లోనివారే చెప్పుదురేని యందుల కెవరును వివదించువారు లేరు. కాని, పాశ్చాత్యుల యాధిభౌతికపక్షము దీనికంటె నొక మెట్టు పైకి పోయి నట్లున్నది. "మంచి, చెడుగు (సత్తు, లేక, అసత్తు) న్యాయము, లేక, యన్యాయము, ధర్మము, లేక, యధర్మము," అనువాని నిర్ణయించుటయు" మఱియు "నే దేని యొక పదార్థము "బరువుగ నున్నదా? తేలికగ నున్నదా? పచ్చగ నున్నదా? నల్లగ నున్నదా?" యనియు, లేక, యొకానొక లెక్క "సరియా? తప్పా?" యని విచారించి నిర్ణయించుటయు" నను నీ రెండువిషయములు నత్యం తము వేర్వేఱుగ నున్నవి. రెండవదాని నిర్ణయమును మనస్సు న్యాయశాస్త్రపద్ధతిని చేయఁగలదు. మొదటిదానియందున్న విషయ మును నిశ్చయపఱచుటకు మనస్సు మిక్కిలి యసమర్థ మగును. కావున నా కార్యమును మన మనస్సున నుండు సదసద్వివేచనశక్తి రూపయగు దేవతయే చేయుచున్నది" యని పాశ్చాత్యులలోని యాధిభౌతికవాదు లనుచున్నారు. "ఒక లెక్క 'సరిగానున్నదా, తప్పుగా నున్నదా?' యని నిశ్చయించుచు మన మా లెక్కలో నున్నరాశి నైనను, గుణకారము నైనను బరిశీలించిన పిదప మన మతము స్థిరపఱచు చున్నాము. అనఁగా- ఈ విషయమును నిర్ణ యించుటకంటె మున్నుగా రెండవ వ్యాపారమును గాని, రెండవ క్రియను గాని మనస్సు చేయవలసి యుండును" అని దానికిఁ గారణముఁ జెప్పుదురు; కాని మంచిసెబ్బరల నిర్ణయ మట్టిది కానేరదు. ఒకఁ డొకనిని చంపె నని మనకుఁ దెలిసిన వెంటనే "చీ, వాఁడు తప్పు చేసెను" అని మనము వాక్రుచ్చుచున్నాము. ఆ విషయమై మన మేమియు విచారింప నక్కఱలేదు. అనఁగా: ఏమియు విచా

రింపక వెంటనే చేసిన నిర్ణయము, లెస్సగ విచారించి చేసిన నిర్ణ
యము నను నీ రెండు నొక్క మనోవృత్తియొక్క వ్యాపారములే
యని చెప్పుటకు వీలులేదు. దానికొఱకు సదసద్వివేచనశక్తి యను
నది యొక స్వతంత్రయగు మానసికదేవత యని యొప్పుకొన వల
యును. ఎల్లమనుజుల యంతఃకరణములలో శక్తి గాని, దేవత గాని
యొకవిధముగనే యుండుటచే నందఱకును హత్య యనునది యొకటే
తీరునఁ దప్పని తోఁచు నను విషయ మెవ్వ రెఱుఁగనిది కానేరదు. ఈ
యాధిభౌతికయుక్తివాదమునకు నాధిభౌతికవాదులు- "ఒకానొక
విషయముయొక్క నిర్ణయమును మనము వేగముగఁ జేసినంత
మాత్రముచేతనే యది, యే విషయమున కర్థము మనము నిర్ణయిం
చుచున్నామో యా విషయముకంటె వేఱుగ నుండవలయు నని
యంగీకరింప వీలు లేదు. ఏలయన: ఒక పనిని వేగిరముగనో,
యాలస్యముగనో చేయుట యభ్యాసముం బట్టి యుండును. లెక్క
విషయమునే గమనింపుము. వర్తకులు పుట్టి మొదలు సేర్ల వరకు
చిల్లరలెక్కలను నోటిచేతనే చెప్పుచున్నారు. కావున నట్టి యుత్తమ
గణితముఁజేయు వాని దేవతకంటె గుణకారముఁజేయు నతని దేవత
భిన్నము గానేరదు. నిత్యాభ్యాసముచే నొకానొక విషయ మింత
యభ్యాసములో నుండును. కొంచె మైనను విచారింపకయె దానిని
సహజముగఁ జేయును. అటులే బాగుగ గుఱిఁ గొట్టగలవాఁ డెగురు
చున్న పావురమును సులభముగఁ దుపాకితోఁ గాల్చినంతమాత్రమున
నా గుఱిఁ గొట్టుట యొక దేవత యని యెవరు ననరు. ఇంతియ
కాక గుఱికొట్టుట, యెగురుచున్న పక్షివేగమును గొలుచుట, మొద
లగు శాస్త్రీయోపపత్తు లనవసరము లని యెవ్వరు ననరు. రణభూమి
యందు నిలువఁబడి నలుగడల దృష్టిని ప్రసరింపఁజేసె నేని శత్రు
సముదాయ మెచ్చటు నున్నదియు 'నెపోలియన్' చక్రవర్తికిఁ జక్కగఁ
దెలియు నని చెప్పుచున్నారు; కాని యంతమాత్రముచే యుద్ధకళ
యొక స్వతంత్రదేవతగ నున్నదనియు నితరములగు మానసికశక్తులతో

దానికే సంబంధమును లేదనియు నెవరును జెప్పలేరు. ఏ పనియం దైన నొకానొకని బుద్ధి చుఱుకుగను, మఱియొకని బుద్ధి మందముగను ప్రవర్తించు ననునది సత్యమే; కాని యంతమాత్రముచేతనే యిరువురి బుద్ధియు వేర్వేఱుగ నున్నదని మనము చెప్పము. ఇంతియ కాక, కార్యాకార్యములయొక్క గాని ధర్మాధర్మముల యొక్క గాని నిర్ణయ మెప్పుడును వెంటనే యగు నని నియమము లేదు. కారణ మేమి యన: "దీనిని చేయుదుమా? లేక, మానుదుమా?" యను సంశయ మెల్లప్పుడునుగలుగకపోయినను, అర్జునునకువలె నీ సంశయ మా యా సమయములయం దెల్లరకుఁ గలుగును. ఇంతియ కాక, కొన్ని విషయముల కార్యాకార్యనిర్ణయములో నొక్కొక్కరి కొక్కొక యభిప్రాయ ముండును. సదసద్వివేచనాశక్తిరూపయగు స్వయంభూ దేవత యొక్కతెయైన యెడల నీ మతభేదము లేల? అనఁగా: మానవ బుద్ధి యెట్లుశిక్షితము, లేక, సంస్కృతమై యుండునో దాని ననుసరిం చియే యా విషయము నతఁడు నిర్ణయించు నని తాత్పర్యము. అనే కులు మోటువాండ్రు తమవంటి మనుజులను జంపుట యనునది దోష మని యెన్నక, చంపఁబడిన మానవుని మాంసముసైత మానందముతో భక్షింతురు; కాని, మోటువాఁడ విషయమును మనము వదలినను, దేశాచారానుసారముగ నొకదేశమందు నింద్యమని యెన్నఁబడుచున్న యాచారము మఱియొక దేశమున సర్వజన మాన్య మయియుండును. ఒకభార్య యుండఁగా మఱియొకభార్యను వివాహమాడుట యైరోపా ఖండమునఁ దప్పుగ జను లెన్నుదురు; కాని, దాని విషయమై హిందూ దేశములో నెవరికి నెక్కువగ విధినిషేధములు తోఁపవు. సభలయందు శిరస్సుపైఁ దలపాగను దీసి కూర్చుండుట హిందువులకు లజ్జగఁ దోఁ చును; కాని, యాంగ్లేయులు నెత్తిపై టోపీని తీసి కూర్చుండుటయే సభ్యతకు లక్షణ మని యెన్నుదురు. ఈశ్వరదత్త మయినది గాని, స్వాభావిక మైనది గాని యగు సదసద్వివేచనాశక్తి మూలముననే

దుష్కార్యము లొనర్చుట లజ్జావహ మనునది సత్యమయిన యెడల, నందఱి కొక కార్యమున నొకటే విధమగు లజ్జ యేల యుండరాదు? ఆటవికుఁ డైనను దా నెవరి యన్నమును దినునో యతనిపై నాయుధ ప్రయోగముఁ జేయుట నింద్య మని యెన్నుచున్నాఁడు; కాని బాగుగ నాగరికత నేర్చిన పాశ్చాత్యుల రాష్ట్రములలో సైతము సమీప రాష్ట్ర ముల వారిని యుద్ధములో వధించుట స్వదేశభక్తి లక్షణ మని యెన్నెదరు. సదసద్వివేచనాశక్తి రూప దేవత యొక్కటెయే యగునేని యీ భేద మేల యుండవలయును? అలవాటునుబట్టి గాని సదసద్వివేచనా శక్తి భేదము నొప్పికొనిన యెడల దాని స్వయంభూతత్వ నిత్యత్వము లకు బాధవచ్చును. మోటుతనమును వదలి మనుజుఁడు (నాగ రకుఁడు) క్రమముగ సంస్కృతుఁడు కాఁగా నాతని మనస్సు, బుద్ధియు వికసించుచుండును; ఈ తీరునఁ దెలివి వృద్ధిఁ బొందిన పిదప, మొదటు మోటుతనముతో నున్నప్పుడు విచారింపని విచార ముల నన్నిటిని, ఈ సంస్కృతస్థితియందు (నాగరికత కలిగిన పిదప) వేగముగ నిర్ణయింప సమర్థుఁ డగును. వేయేల? ఇట్లు బుద్ధిని వృద్ధిఁ బొందించుటయే నాగరికతకు లక్షణము. నాగరికుఁడు, చూచిన వస్తువు నెల్ల నిమ్మని యడుగఁ డను విషయ మెట్లు తన యవయవ ముల రూఢ మగు నింద్రియ నిగ్రహముయొక్క పరిణామముగఁ దోఁచుమన్నదో, యట్లే సదసద్వివేచనఁ జేయు మనశ్శక్తి యును మెల్ల మెల్లగ వృద్ధి నొంది కొన్ని విషయములలో నైనను, గొంచె మైనను విచారముఁ జేయకయే తాను స్వయముగ నీతిసిద్ధ మగు నిర్ణయమును జేయఁగలిగినంత దృఢ మైనది యగునని తోఁచును. సమీపమున, లేక, దూరమున నున్న వస్తువును జూడవలసి వచ్చు నేని నేత్రముల యొక్క నరముల స్నాయువులఁ గొంచె మెచ్చు తగ్గుగ నణఁచి పెట్టవలసి వచ్చును. ఈ కార్య మంతయు మనము తెలిసికోలేనంత త్వరలో జరుగుచున్నది; కాని, యంతమాత్రముచే నీ విషయోపపత్తి

నెవ రయిన నిరుపయోగ మని యందురా? కావున మనుజునియొక్క మనస్సు, లేక, బుద్ధి యనునది యెల్లప్పుడు నన్ని పనులయందు నొక్కవిధముగనే యున్నదనియు, నొకవిధమగు బుద్ధిచేతనే నలుపును ఎఱుపును వేఱుగఁ దెలిసికొనుచున్నా ఁడనియు, సదసత్పదార్థములను మఱియొక బుద్ధిచే నెఱుఁగుచున్నా ఁడనుట యథార్థము కానేర దనియు, నొకనికిఁ దెలివి తగ్గుగనుండె నేని, మఱియొకనికి నశిక్షి తత్వము ననంపూర్ణత్వమును వృద్ధిఁబొందు ననుటయే భేద మనియు, నీ భేదమును లెస్సగ గమనించి యే విషయము నైనను వేగముగఁ జేయుట యనునది యభ్యాసముయొక్క ఫలమే యను ననుభవమును సైతము గమనించితి మేని మనస్సుయొక్క స్వాభావికశక్తులలో సద సద్వివేచనాశక్తి యను భిన్నమును స్వతంత్రమును విలక్షణమునైన శక్తియున్నదని యంగీకరించుట కేమియు నావశ్యకత లేదనియు, పాశ్చాత్యాధిభౌతికవాదులచే సిద్ధాన్తీకరింపఁబడిన మన ప్రాచీన శాస్త్రకారుల యీ విషయమునందలి చివర సిద్ధాన్తము సైతము పాశ్చాత్యులగు నాధిభౌతికవాదుల సిద్ధాన్తమువలె నున్నది. స్వస్థము, శాంతమునగు నంతఃకరణముతో నొకానొక విషయమును విచారణ చేయవలయు ననుట వా రొప్పుకొనినదే; కాని ధర్మాధర్మముల నిర్ణయించు బుద్ధి యొకటి యనియు, తెలుపు నలుపులను నిర్ణయించుబుద్ధి యొకటియనియు నను మతము వారి కిష్ట మగునది కానేరదు. మనస్సే యే విధముగ నలవాటుపడి యుండునో యా యా విధముగనే మంచిచెఱ్ఱలను నిర్ణయించును గావున మనస్సును సంస్కరించు కొనుటకై ప్రతిమానవుఁడును యత్నింపవలయు నని సైతము వారు చెప్పుదురు; కాని, యీ సంస్కార మెట్టిది? యెట్లు చేయవలయు? నను విషయమై నియమములు సైతము చెప్పఁబడినవి గాని, సదసద్వివేచనాశక్తి యమనది సామాన్య బుద్ధికంటె వేఱుగ నొక యీశ్వరదత్తమగు విషయ మని వా రొప్పుకొనరు. మనుజునకు జ్ఞానమెట్లు

కలుగునో యతని మనోబుద్ధుల వ్యాపార మే చందమున నడచునో దానియొక్క సూక్ష్మపరీక్ష పూర్వమే చేయఁబడినది. ఈ పరీక్షనే క్షేత్ర క్షేత్రజ్ఞ విచార మని చెప్పుదురు. క్షేత్ర మనఁగా శరీరము; క్షేత్రజ్ఞుఁ డనగా నాత్మ. ఈ క్షేత్ర క్షేత్రజ్ఞుల విచారమే యధ్యాత్మ విద్యకు మూలముగ నున్నది. క్షేత్రక్షేత్రజ్ఞ విద్యాజ్ఞానము లెస్సగఁ గలిగిన పిదప, నదనద్వివేచనాశక్తియే గాక యే యితర మనోదేవతలు నాత్మకంటెఁ బై మెట్టువారని గాని, స్వతంత్ర లని కాని నుడువుటకు వీలు లేనందున నాధిదైవతపక్ష మేల నిలువనిదియు సులభముగఁ దెలియును. కావుననే, యీ స్థలమునం దాక్షేత్రక్షేత్రజ్ఞ విద్యను మనము కొంచెము విచారింతము. భగవద్గీతలలో నున్న యనేకము లగు మంచి సిద్ధాన్తములయొక్క సత్యమగు నర్థమే తన్మూలముగఁ బుదువరులకు స్పష్టముగఁ దెలియఁగలదు. మనుష్యునియొక్క దేహ (పిండము, క్షేత్రము, లేక, శరీర) మనునది యొక గొప్ప కార్య స్థానము (ఫ్యాక్టరీ) గ నున్నదని చెప్పవచ్చును. ఒకానొక కర్మాగారములో నెట్లు వెలుపలనుండు పదార్థములను లోపలికిఁ దీసికొందురో, అట్లు తీసికొనిన పదార్థములను పరీక్షించి వ్యవస్థ చేసి పిదపఁ గర్మాగారోపయోగమునకుఁ దగు పదార్థ మెద్దియో తగని దెద్దియో నిశ్చయించిన పిమ్మట, వెలుపలనుండి లోనికి వచ్చిన యసంస్కృత పదార్థముచే నూతనపదార్థమును సిద్ధపఱిచి యెట్లు వెలుపలికిఁ బంపుదురో, యటులనే మనుజుని శరీరమునందుఁ బ్రతి క్షణమునందు ననేక వ్యాపారములు జరుగుచున్నవి. సృష్టిలో నుండు పాంచభౌతిక పదార్థములయొక్క జ్ఞానము మనుజునకుఁ గలుగుటకు నింద్రియములె ప్రథమ సాధనములుగ నున్నవి. జగత్తు నందున్న పదార్థములయొక్క సత్యస్వరూపము, లేక, మూలస్వరూప మేదియో యది యింద్రియములద్వారా తెలిసికొనుట కెవ్వరికిని సాధ్యము కానేరదు. మన యింద్రియముల కా పదార్థము లెటుల గన్పట్టు

చున్నవో యట్లే యవి యున్నవని యాధిభౌతికవాదు లనుకొను చున్నారు; కాని తే పెవ్వనికైన నొకానొక క్రొత్త యింద్రియము పుట్టెనేని యతని దృష్టిచే సృష్టియం దున్న పదార్థముల గుణధర్మము లప్పుడున్న వానికంటె వేఱుగ నుండునని చెప్ప నక్కఱ యుండదు. మనుజుని యింద్రియములు సైతము రెండువిధములు గలవై యున్నవి. మొదటివి కర్మేంద్రియములు; ఇతరములు జ్ఞానేంద్రియ ములు. హస్తములు, పాదములు, వాక్కు, గుదము, ఉపస్థ యను నీ యైదును కర్మేంద్రియములు. మనము మన శరీరముచేఁ జేయు వ్యాపార మంతయు నీ కర్మేంద్రియముల మూలముననే చేయుచు న్నాము. మఱియును, ముక్కు, కన్నులు, చెవులు, నాలుక, చర్మము నను నీ యైదును జ్ఞానేంద్రియములు. నేత్రములతో రూపమును, నాలుకచే రసమును, చెవులచే శబ్దమును, ముక్కుతో వాసనను, చర్మముచే స్పర్శము నెఱుంగు చున్నాము. ఏ బాహ్యపదార్థమును విచారించినను, మనకుఁ గలుగుచున్న యా పదార్థముయొక్క జ్ఞాన మంతయు దానియొక్క రూపము, రసము, గంధము, శబ్దము, స్పర్శము ననువానికంటె వేఱుగ నేమియు లేదు. ఉదాహరణ మేమి యన- ఒక బంగారుకణికను విచారించిన నది పచ్చగాఁ దెలియును. త్వగింద్రియమునకు గట్టిగఁ దోఁచును. కొట్టిన సాగును. ఇట్లు కంటికిఁ గనఁబడుచున్న దాని గుణమువలె మన చూపునకు బంగారముగ నున్నవి. ఈ గుణములు మాటిమాటికి నొక పదార్థమునం దొక్క విధము గనే్పస్పష్టముగఁ గనఁబడె నేని బంగార మనునది మన మతము ననున రించి స్వతంత్ర పదార్థ మగును. వెలుపలనున్న పదార్థమును లోపలికిఁ దీసికొమటుకును, లోపల నున్న పదార్థమును వెలుపలకు నంపుటకు వే తీరువఁ గర్మాగారములయందు ద్వారము లుండునో యటులనే మానవదేహమునకు జ్ఞానేంద్రియము లనునవి బాహ్యపదార్థములను లోపలికిఁ దీసికొమటుకును, కర్మేంద్రియము లనునవి లోపల నున్న పదార్థములను వెలుపలికిఁ ద్రోయుటకును ద్వారములయి యున్నవి.

సూర్యకిరణము లొక పదార్థముపైఁ బడి, యచ్చోనుండి తిరిగి మన నేత్రములలోఁ బడెనేని మన యాత్మకు నా పదార్థరూపము తెలియును. ఒకానొక పదార్థమునుండి బయలువెడలు గంధముయొక్క సూక్ష్మ పరమాణువులు మన నాసికలో నుండు మజ్జారూపతంతువులపైఁ బడెనేని మనకు దానివాసన తెలియును.

ఇతరము లగు జ్ఞానేంద్రియ వ్యాపారములు నిటులే నడుచుచున్నవి. జ్ఞానేంద్రియము లీ రీతిని వ్యాపారము సేయు నేని వాని మూలమున బాహ్యసృష్టియందున్న పదార్థములు తెలియుచుండును; కాని జ్ఞానేంద్రియములు సేయు వ్యాపారములయొక్క జ్ఞానము స్వయముగ నా జ్ఞానేంద్రియముల కుండనందున జ్ఞానేంద్రియములు జ్ఞాతలని వచించుటకు సాధ్యము కానేరదు. కాన నవి బాహ్యపదార్థములను లోనికిఁ గైకొనిపోవు ద్వారములు మాత్రమే యని చెప్పఁబడినవి. ఈ ద్వారములలో నుండి పదార్థము లోపలికిఁ బోయిన పిమ్మట దానికి ముందు వ్యవస్థ కల్పించుపని మనస్సుదై యున్నది.

ఉదాహరణ మేమి యన-రెండుజాములయినప్పుడు 12 గంటలు కొట్టినపిమ్మట గంట లిన్ని కొట్టఁబడిన వను విషయము కర్ణము గ్రహింపలేదు. ఒక్కొకదెబ్బయు నెల్లెట్లు గంటకుఁ దగులునో యా యా విధముగ వాయువుయొక్క దెబ్బవలన మన చెవికిఁ దగులుటచే మజ్జాతంతువులగుండ ప్రత్యేకమగు దెబ్బయొక్క వేర్వేఱగు సంస్కారములు మొదట మననునఁ గలుగఁగా వాని నన్నింటిని మొత్తము చేసి యిన్ని గంటలు కొట్టినారని నిశ్చయించుపని మనస్సు స్వయముగఁ జేయుచున్నది. జ్ఞానేంద్రియములు పటువుల కున్నవి. గడియారము నందుండి యొక్కొక్కదెబ్బ బయలుదేఱు క్రమమున, ఒక్కొక్క దెబ్బయొక్కయు సంస్కారము వాని శ్రోత్రములగుండ మనస్సువఱకును వెళ్లును; గాని యా మన స్సన్నింటిని మొత్తముఁ జేసి 12 గంట లాయెనని తెలిసికొనునంత వికసితము కాలేదు.

ఈ విషయమునే శాస్త్రీయపరిభాషాప్రకారము చెప్పవలసి వచ్చినచో పశువులకు సైత మనేక సంస్కారములదే వేర్వేఱగు జ్ఞానము కలిగి నను, ఆ నానాత్వమునందలి యేకత్వముయొక్క బోధ వానికి లేదని చెప్పుదురు. భగవద్గీతలో "ఇంద్రియాణి పరాణ్యాహు రింద్రియేభ్యః పరం మనః"-ఇంద్రియములు బాహ్యపదార్థముల కంటె శ్రేష్ఠములు. ఇంద్రియములకంటె మనస్సు శ్రేష్ఠము (గీ. 3. 42) అని చెప్పఁబడిన దానికి సైతమిదే భావార్థము. 'మనస్సు స్థిరముగ లేనియెడల నేత్ర ములు తెఱుకొని యున్నను గనఁబడదు. వీనులు తెఱుకొని యున్నను వినఁబడదను విషయము చెప్పఁబడియే యున్నది. జ్ఞానేం ద్రియములగుండ బాహ్యపదార్థములను దేహమునెడి కర్తాగారమునందు మనస్సునెడి ప్రవేశకుఁడు (గుమాస్తా) ప్రవేశ పెట్టి యతఁడే వీని వర్గీ కరణమును (వీని నంగతిని) విచారించు చున్నాఁడని తాత్పర్యము. ఈ విచారణ మెట్లగు నను దాని నిమిత్తమై, యింతదనుక దేనిని సామాన్యముగ మనస్సని చెప్పుచుంటిమో, దానినే యిఁకముం దెన్ని భేదములుగ విభజింపవలసి వచ్చునో, యొక మనస్సునకే యధికార భేదానుసారముగ నే యే నామము లిడవలసి వచ్చునో, యా విష యము నిప్పుడు నిరూపించెదము.

జ్ఞానేంద్రియములగుండ మనస్సునకుఁ గలిగిన సంస్కారము లన్నిటిని ముందొకచోట నుంచి, వానిని వేర్వేఱుగ విచారించి (పరీక్షించి) వానిలో "మంచిదేది? చెడుదేది? గ్రహింపఁదగిన దేది? విడువఁదగిన దేది? లాభమును గలుగఁజేయున దేది? నష్టమును గలిగించున దేది?" యను దాని ముందు నిర్ణయింపవలయును. ఇది నిర్ణయించితి మేని, ముందు దీనిలో నే విషయము మంచిదియో, లాభదాయకమో, యోగ్యమో, కల్యాణకరమో, దానినే చేయుటకు మనమె ప్రవర్తింతుము అని సామాన్య వ్యవహారములోనే యున్నది. ఉదాహరణము- మన మొక యుద్యానవనములోనికి వెళ్లుదు మేని

నేత్రము శ్రోత్రము నను జ్ఞానేంద్రియములచేఁ బూలతోఁట యందలి వృక్షములలోని పుష్పములయొక్క సంస్కారము మన మనస్సునందుఁ గలుగును. కాని "యీపుష్పములలో నే పుష్పములవానన మంచిది? యేది చెడుది?" అను జ్ఞానము మన యాత్మకుఁ గలిగినఁ గాని యే పుష్పమునైనను బుచ్చుకొంద మను కోరిక మనస్సునందుఁ బుట్టదు. వానిఁ బుచ్చుకొన వలయునని ప్రయత్నము సైతము చేయము. కావున (1) జ్ఞానేంద్రియములచే బాహ్యపదార్థజ్ఞానము కలిగి సంస్కారసామ్యము (అనఁగా-సరిచూచుట) కొఱకు నిశ్చితమగు నొక పట్టిక సిద్ధము సేయుట, (2) ఈ సరిచూచుట యైనపిదప వాని మంచిచెడుగులయొక్క సారాసారముల విచారించి యే విషయము గ్రహింపఁదగినది, యేది గ్రహింపఁదగినదికాదు, అని నిశ్చయించుట, (3) ఈ నిశ్చయమయిన పిదప గ్రాహ్యవస్తువును బొందుదమనియు, నగ్రాహ్యవస్తువును ద్యజింతమనియుఁ గోరిక గలిగి తదనుసారముగఁ ప్రవర్తించుట, యని మొత్తముపై మనోవ్యాపారములు మూఁడు విధములుగ విభజింపఁ బడుచున్నవి.

ఇట్లు ప్రవృత్తికలుగుట కీ మూఁడుక్రియలలో నేమియు నెమ్మ తగ్గులు లేకుండ నదా యొకవిధముగనే యొకదాని వెంబడి మఱి యొకటి యుండవలయునని నియమము లేదు. పూర్వమునం దెప్పుడైనను జూడఁబడిన యొక విషయము కావలయునని కోరిక యుండును. అయిన నంతమాత్రముచే నీ మూఁడు క్రియలలో దేనినైనను వలదని మాత్రము చెప్పుటకు సాధ్యము కాదు. న్యాయస్థానమొక్కటియైనను, దానియందు మొదట నుభయపక్షములవారుగాని, లేక, వారి ప్రతినిధులు గాని, తమ తమ పక్షమును న్యాయాధీశుని యెదుట పట్టికా రూపముగ నిడిన పిదప, నుభయపక్షములను బూర్తిగ విచారించి న్యాయాధీశుఁడు తాను నిర్ణయించుచున్నాఁడు. న్యాయాధీశునిచేఁ జేయఁబడిన నిర్ణయము నిస్సంశయముగ నా

చరణము (అమలు) లోనికిఁ దెచ్చును. ఇది సామాన్యముగ న్యాయ స్థానములలో జరుగు కార్యవిభాగము. ఇటులే యింతదనుక సామాన్య ముగ గుమాస్తా యని చెప్పుచున్న మనస్సుయొక్క వ్యాపారములలో సైతము కార్యవిభాగ ముండును. వానిలో నెదుటునున్న విషయములో సారాసారవివేచన చేసి, యే విషయమైన "ఇటులే యున్నది (ఏవ మేవ) మఱియొక విధముగ లేదు (నాన్యథా) అని నిశ్చయించుట యను న్యాయాధీశుని కార్యము కేవలము 'బుద్ధి' యను నింద్రి యముయొక్క సంబంధము గలది కావున వెనుకఁ జెప్పిన మనో వ్యాపారము లన్నిటిలో నీ సారాసారవివేచనా శక్తిని విభజించిన పిదప మిగిలిన వ్యాపారము లన్నియు నే యింద్రియముచే నగునో దానికి మాత్రమే 'మనస్సు' అని పేరిడుట వేదాంత సాంఖ్యము లనెడు శాస్త్రములలో నభ్యాసమై యున్నది (సాం. కా. 28; 27). ఈ (చిన్నదియగు) మనస్సే న్యాయవాదివలె ఒకానొక విషయ మిట్లున్నది (ఇది సంకల్పము), లేక, దీనికి విపరీతముగ నట్లున్నది (వికల్పము), మొదలగు కల్పనలను బుద్ధి యెదుట నిర్ణయమునకై ప్రదర్శించుచున్నది. కావున నది 'సంకల్పవికల్పాత్మకము (అనఁగా- నిశ్చయింపక కల్పించునట్టి యింద్రియము) మాత్రమే' అని చెప్పఁ బడినది. 'సంకల్ప' శబ్దము కొన్నిచోట్ల నిశ్చయార్థమందు సైతము ప్రయోగింపఁ బడుచున్నది (ఛాందోగ్య. 7.4.1. చూడు). కాని యీ మనస్సునకుఁ జెప్పిన లక్షణమునందు సంకల్పశబ్దము నిశ్చయము నపేక్షింపక, యొక విషయ మిట్టిదే యని, తోఁచుట, అంగీకరించుట, సంకల్పించుట, గ్రహించుట, తెలిసికొనుట, దేని నైనను, యోజిం చుట, ఇచ్ఛయించుట, చింతించుట, ఊహించుట, మొదలగు వ్యాపారముల నుద్దేశించియే ప్రయోగింపఁబడినది; కావి, న్యాయ వాదివలె తన కల్పనను బుద్ధికెదుట నిశ్చయార్థముగఁ బెట్టుట యను వ్యాపారము మాత్రముచేతనే మనస్సు చేయుపని సమాప్తి కానేరదు.

బుద్ధి మంచిచెడుగుల నిర్ణయించిన పిదప బుద్ధికి గ్రాహ్యముగ నుండు విషయమును గర్మేంద్రియముల మూలమున నాచరింపఁ జేయుట (అనఁగా- దానిని అమలులో నుంచుట) యను 'నాదరు' యొక్క పనిని సైతము మనస్సే చేయుచున్నది. అందుచే మనస్సును మఱి యొక విధముగ వ్యాఖ్యానముఁ జేయవచ్చును. బుద్ధిచేఁ జేయఁబడిన నిర్ణయము నాచరణలోని కెట్లు తీసికొని రావలయునని యాలోచించుట యొక విధమగు సంకల్పరూపముగ నున్నదని చెప్పవచ్చును. అయినను దానికి సంస్కృతమునందు "వ్యాకరణము- విస్తరింపఁ జేయుట" అని రెండవ స్వతంత్ర నామము గలదు.

ఈ పని తప్ప మిగిలిన కార్యము లన్నియు బుద్ధిచేఁ జేయఁబడునవి. మన కల్పనలయొక్క సారాసారములను విచారించునది మనస్సు కానేరదు. ఈ సారాసారములను విచారించి యీ వస్తు వీ విధముగ నున్నది యను మొదలగు వాని నిశ్చయించుటయు, తర్కముచేఁ గార్యకారణముల నాలోచించి యొక నిశ్చితమగు ననుమానమునైనను కార్యాకార్యనిర్ణయము నైనను చేయుటయు, అను నీ వ్యాపారము లన్నియు బుద్ధి చేయునవిగనే యున్నవి. సంస్కృతమున నీ వ్యాపారమును 'వ్యవసాయ' మని, లేక, 'అధ్యవసాయ' మని చెప్పుదురు. కావున నీ రెండు శబ్దముల నుపయోగించి బుద్ధియొక్కయు (కనిష్ఠమగు), మనస్సుయొక్కయు మధ్యమున నున్న భేదమును జూపుటకు-

వ్యవసాయాత్మికా బుద్ధిః మనో వ్యాకరణాత్మకమ్.

(మ.భా.శాం. 251.11)

- బుద్ధి (యను నింద్రియము) వ్యవసాయమును జేయునది (అనఁగా సారాసారములను విచారించి నిశ్చయమును జేయునది). మనస్సు (కనిష్ఠ మయినది) వ్యాకరణము (అనఁగా: విస్తారము, లేక, పిదప వ్యవస్థను గల్పించు - ప్రవర్తకమగు నింద్రియము) అయి యున్నది.

(అనఁగా: బుద్ధి వ్యవసాయాత్మికగను, మనస్సు వ్యాకరణాత్మకముగను నున్నది) అని, మనోబుద్ధుల వ్యాఖ్యానము మహాభారతములోఁ జేయఁబడి యున్నది. భగవద్గీతలో సైతము "వ్యవసాయాత్మికా బుద్ధిః" అనియే యున్నది (గీ. 2. 44). అక్కడనే బుద్ధి యనఁగ సారాసారవివేచనను జేసి నిశ్చయించునట్టి యింద్రియమని యున్నది. బుద్ధి యనునది యొక ఖడ్గము వంటిది. ఏ వస్తువు తన యెదుటికి వచ్చునో, లేక, యెవరిచే నైనఁ దేఁబడునో, దానిని ఖండించుట యనునదియే బుద్ధియొక్క పని. దానికి మఱియొక గుణమైనను ధర్మమైనను లేదు (మ. భా. వన. 181.20). సంకల్పము, వానన, ఇచ్ఛ, స్మృతి, ధృతి, శ్రద్ధ, ఉత్సాహము, కారుణ్యము, ప్రేమ, దయ, కృతజ్ఞత, కామము, లజ్జ, ఆనందము, భీతి, రాగము, సంగము, ద్వేషము, లోభము, మదము, మత్సరము, క్రోధము మొదలగునవి యన్నియు మనస్సుయొక్క గుణములు (బృ. 1.5.3; మైత్ర్యు. 6.30). కావున ఈ మనోవృత్తి యే మూల కొరుగునో దాని ననుసరించి మనుజునకు నే పనియైనను జేయుటయందుఁ బ్రవృత్తి కలుగును.

ఉదాహరణము:- మనుష్యుఁ డెంత బుద్ధిమంతుఁ డైనను, దరిద్రుల స్థితి యెట్లుండు నదియుఁ బూర్ణముగఁ దెలిసియుండినను, తన మనస్సులో నున్న కారుణ్యవృత్తి బయల్పడక పోయె నేని, యా దరిద్రునకు సాయము చేయుద మను కోరిక యెప్పుడు నుండనేరదు. యుద్ధము చేయవలయు నని యిచ్ఛ యుండినను ధైర్యము లేనిది యుద్ధము చేయనేరఁడు. మనస్సుచేయ నిచ్ఛయించు దాని పరిణామమిది యని మాత్రమే బుద్ధి చెప్పఁమండును; కాని యిచ్ఛ, ధైర్యము మొదలగు గుణములు బుద్ధిధర్మములు కాకపోవుటచే బుద్ధి స్వయముగ (అనఁగా: మనస్సుయొక్క సాయము లేకయే) నెప్పుడు నింద్రియములను ప్రేరణ చేయనేరదు. విరుద్ధముగఁ గ్రోధాదులకు వశమగు మనస్సు స్వయముగ నింద్రియములను ప్రేరణఁ జేసినను, బుద్ధి

యొక్క సారాసారవిచారము లేక కేవల మనోవృత్తి ప్రేరణమాత్ర మున సంభవించు కర్మ నీతిదృష్టితో విచారించిన నిర్దోషముగనేయుండు నని నియమ ముండదు.

ఉదాహరణము :- బుద్ధి నుపయోగింపక కారుణ్యవృత్తి మాత్ర ముతో నేది దానముఁ జేసిన నది యపాత్రదానమై దాని దుష్పరిణా మముగూడ సంభవించును. సారాంశ మేమి యన :- బుద్ధియొక్క సాహాయ్యము లేనియెడల మనోవృత్తి గ్రుడ్డిదానివలె నుండును. కావున మానవునకు శుద్ధకర్మ సంపుటిల్లు విషయమునందు బుద్ధి శుద్ధముగను (అనఁగా: మంచిచెడులను దప్పులేక నిర్ణయించునదిగ), మనస్సు బుద్ధ్యధీనమై నడచునదిగను, ఇంద్రియములు మనోధీనము లుగను నుండవలయును. ఇటుల వానికిఁ బరస్పర సంబంధముండ వలయును; బుద్ధిమనశ్శబ్దములే కాక యంతఃకరణచిత్తము లను శబ్దములు సైతము ప్రచారమున నున్నవి. వీనిలో నంతఃకరణశబ్దము నకు "లోపలనుండు కరణము, అనఁగ: ఇంద్రియము" అని ధాత్వర్థ మగుటచే, దానిలో సామాన్యముగ మనస్సు, బుద్ధి, చిత్తము, అహం కారము మొదలగు వన్నియుఁ జేరును. మనస్సు తొలుత బాహ్యవిషయ గ్రహణము (అనఁగా: చింతనమును) చేయుచుండు నేని యదియే చిత్త మగును (మ. భా. శాం. 274. 17). కాని సామాన్యముగ నీ శబ్దము లన్నియు సమానార్థకములుగనే ప్రయోగింపఁబడుటచే ననేక సమయములం దీయర్థ మెక్కడ వివక్షితమో తెలిసికొనలేక సందేహ పడుచున్నారు. ఈ సందేహ ముండఁ గూడదనియే యీ శబ్దముల నన్నిటిని వదలి శాస్త్రీయపరిభాషలో, 'మనోబుద్ధి' శబ్దములే పూర్వోక్తమగు నిశ్చితార్థమునందుఁ బ్రయోగింపఁబడుచున్నవి.

మనోబుద్ధుల నీ తీరున విభజించిన పిదప న్యాయాధీశుఁ డను సంబంధమును బట్టి బుద్ధి మనస్సుకంటె శ్రేష్ఠ మగుటచే, బుద్ధికి మనస్సు గుమాస్తా యగును. "మనసస్తు పరా బుద్ధిః"- మనస్సు కంటె బుద్ధి శ్రేష్ఠమైనది, లేక, పరమందున్నది (గీ. శ్లో. 42) అను నీ

గీతావాక్యపు భావము సైత మిదియే. అయినను వెనుకఁ జెప్పి నట్లీ గుమాస్తాయును రెండు విధములగు పనులు చేయవలసి వచ్చును. (1) వెలుపలనుండి (అనఁగా: జ్ఞానేంద్రియముల ద్వారా) లోపలికిఁ బ్రవేశించినవాని సంస్కారములకు వ్యవస్థను జేసి బుద్ధి కెదురుగా నీ సంస్కారములను నిశ్చయార్థమై యుంచుటయు, (2) బుద్ధిచే నిశ్చయింపఁ బడిన పిమ్మట బుద్ధియొక్క యాజ్ఞను గర్మేంద్రియముల కిచ్చి దాని మూలమున బుద్ధియందలి యుద్దేశము సిద్ధించుటకు నావశ్యకమగు బాహ్యక్రియలను జేయించుటయు, నిట్లు దుకాణము పెట్టుట కొఱకు, మొదట కొనుట, పిదపఁ గూర్చుండి యమ్ముటయునను రెండు పనుల ననేక సమయములం దొక్కఁడే గుమాస్తా చేయుచుండు నటుల మనస్సుయొక్క స్థితియై యున్నది. ఇందలి తాత్పర్యమేమనఁ- మన మొక స్నేహితుని జూచితి మేని యప్పు డతనిని బిలువ నిచ్ఛ కలిగి 'ఓరీ!' యని పిలుతుము. అప్పు డంతఃకరణమున కెన్ని వ్యాపారములు గలుగునో చూడుము. తొలుత నేత్రములచే (అనఁగా: జ్ఞానేంద్రియములచే) మన మిత్రుఁడు సమీపమున నున్నాఁ డను సంస్కారము నోమూలమున బుద్ధికడ కేగఁ దన్మూలమున నా పదార్థజ్ఞానమాత్మకుఁ గలుగును. ఇంతటితో మొదటిపని (అనఁగా: జ్ఞానముపుట్టుటయను క్రియ) సమాప్త మయినది. పిమ్మట నా మిత్రుని పిలువవలయునని యాత్మ బుద్ధిద్వారా నిశ్చయించును. బుద్ధియొక్క విషయములను వ్యవహారములోనికిఁ గొనివచ్చుటకై మనస్సునకు మాటలాడవలయునని కోరిక కలుగుటచే మనస్సు కర్మేంద్రియముల ద్వారా 'ఓరీ' యని పలుకరించు చున్నది. పాణినీయ శిక్షాగ్రంథమున, శబ్దోచ్చారణక్రియ యీ రీతిగనే వర్ణింపఁబడి యున్నది-

> ఆత్మా బుద్ధ్యా సమే ర్థ్యాన్ మనో యుఙ్క్తే వివక్షయా,
> మనః కాయాగ్ని మాహన్తి స ప్రేరయతి మారుతమ్.
> మారుత స్తూరసి చరన్ మంద్రం జనయతి స్వరమ్.

— ఆత్మ మొట్టమొదట బుద్ధిద్వారా సకల విషయములను గ్రహించు టచే మనస్సున మాటలాడుద మను కోరిక పొడమును. మనోమూల మునఁ గాయాగ్ని (జాఠరాగ్ని) చలించును. ఆ కాయాగ్ని వాయు వును బేరణఁ జేయును. పిదప నీ వాయువు హృదయమునందుఁ బ్రవేశించి మంద్రస్వరమును బుట్టించును. ఈ స్వరమే పిదపఁ గంఠ్య తాల్వాది రూపమున నోటినుండి వెలువడును. పై శ్లోకములోని చివరి పాదములు రెండును మైత్ర్యుపనిషత్తు (7.11)లో సైతము కానఁబడు చున్నవి. అందువలన నీ శ్లోకభావము, లేక, శ్లోకమే పాణినికంటెఁ బ్రాచీనమైన దని తోఁచుచున్నది.* కాయాగ్నినే యాధునిక శారీర శాస్త్రమునందు మజ్జాతంతవు లని వాడుచున్నారు. కాని బాహ్యపదా ర్థములయొక్క జ్ఞానమును లోనికి కొనిపోవు నవియు, బుద్ధియొక్క యాజ్ఞను మనస్సు ద్వారా కర్మేంద్రియములకుఁ దెలియఁజేయు నవియు నగు మజ్జాతంతువులు వేర్వేఱుగ నున్నవి. కావుననే మన స్సులు సైతము రెండని యనవలయు నని పాశ్చాత్యులగు శారీరశాస్త్ర జ్ఞులు నుడువుచున్నారు. మన శాస్త్రకారులు మనస్సులు రెండని యంగీ కరింపక, మనోబుద్ధులను విభజించి మనస్సుభయాత్మకముగ నున్న దని మాత్రమే (అనఁగ: అది కర్మేంద్రియముల విషయమై కర్మేం ద్రియానుసారముగను, జ్ఞానేంద్రియముల విషయమై జ్ఞానేంద్రియా నుసారముగను సంచరించు నని మాత్రమే) చెప్పిరి. కాని యిరువుర తాత్పర్యము నొక్కటియే. ఉభయ శాస్త్రకారుల యభిప్రాయము చేతను బుద్ధి, నిశ్చయించు న్యాయాధీశుఁ డగు నేని, మనస్సు తొలుత జ్ఞానేంద్రియముల విషయమై వ్యాకరణాత్మకము, లేక, వ్యవహార ములోఁ బెట్టునది (అనఁగ: కర్మేంద్రియములను న్యాయముగఁ బ్రవ

* మైత్ర్యుపనిషత్తు పాణినికంటెఁ బ్రాచీనమని 'మాక్సుముల్లరు' అను పండితుఁడు వ్రాసియున్నాఁడు. Sacred Books of the East Series, Vol. XV. pp. 47-51. దీని గురించిన యధిక విచారమును పరిశిష్టప్రకరణమునఁ జూచుకొనుము.

ర్తింపఁ జేయునది) అగును. అయినను, ఏ విషయముయొక్క యాజ్ఞ నెట్లు నెరవేర్పవలయు ననుఁ విషయమై యొకానొకప్పుడు మనస్సు సైతము సంకల్పవికల్పములను గూడ చేయవలసి వచ్చును. కావున మనస్సును వ్యాఖ్యానముఁ జేయుము, సామాన్యరీతిగ "సంకల్పవికల్పాత్మకం మనః" అని మాత్రమే చెప్పుట పరిపాటిగ నున్నది. కాని యెప్పుడైనను మనస్సుయొక్క రెండు వ్యాపారములును దానియందే చేరునని యెఱుంగవలయును.

బుద్ధి యనఁగ: సారాసారవివేకముఁ జేయు నింద్రియ మని చెప్పఁబడిన యర్థము శాస్త్రీయనూక్ష్మ వివేచనార్థ మయినది. కాని యీ శాస్త్రీయమగు నర్థ మెప్పుడును బిదపనే నిర్ణయింపఁ బడును. కావున నీ శాస్త్రీయార్థమును నిర్ణయింపక మునుపే బుద్ధిశబ్దమునకు రూఢమగుచున్న వ్యావహారికమగు నర్థవిచారణ సైత మిచ్చోఁ జేయవలయును. వ్యవసాయాత్మిక యగు బుద్ధిచేఁ దొలుత నే వస్తువునైన విచారించిననే కాని యా వస్తుజ్ఞానము మనకుఁ గలుగ నేరదు. వస్తుజ్ఞానము పొడమిన పిదపఁ గాని దానినిఁ బొందుద మను కోరిక పుట్టదు. కావున వ్యవహారమునందు, మామిడిచెట్టును, మామిడిపండును సైతము 'మామిడి' యనిన వ్యవసాయాత్మిక బుద్ధిని, మఱియు ఆ బుద్ధియొక్క జ్ఞానాది రూప ఫలములను, జూపుటకు, గూడ 'బుద్ధి' యను నొక శబ్దమే జనసామాన్యముగ వ్యవహారము లం దనేక పర్యాయము లుపయోగింపఁ బడుచున్నది.

ఉదాహరణము:- "అతని 'బుద్ధి' యసత్యముగ నున్నది" యనునపుడు, "అతని 'వానన' యసత్యముగ నున్న" దని యనుటలే, 'ఇచ్ఛ', లేక, 'వానన' యనునది శాస్త్రీయమగు నభిప్రాయమున మనోధర్మ మగుటచే దానిని బుద్ధియని నుడువుట యుక్తము కానేరదు; కాని బుద్ధిశబ్దముయొక్క శాస్త్రీయమగు విచారణ చేయక మునుపటి నుండియు, బుద్ధి యను నొక శబ్దమునే,

(1) సారాసారవివేచనఁ జేయు నింద్రియము, (2) ఆ యింద్రియ వ్యాపారమూలమునఁ బిదప మానవుని మనస్సునందుఁ గలుగు వానన లేక, ఇచ్ఛ అను రెండర్థములయందు సాధారణముగ లోకు లుపయో గించుచునే యున్నారు. కావున మామిడియొక్క భేదమును జూపింప వలసి వచ్చెనేని, తొలుత చెట్టను నూహతో నైనను, లేక, పండను నూహతోనైనను 'మామిడి' యను శబ్దమును వాడినట్లు, 'బుద్ధి' శబ్దముయొక్క రెండర్థముల యందలి భేదమును దెలియఁజేయవలసి వచ్చినపుడు నదనద్వివేకము చేయు శాస్త్రీయబుద్ధికి వ్యవసాయాత్మిక యని విశేషణమును జెప్పుచున్నారు. 'వానన'ను, 'బుద్ధిమాత్రమే' యని యైనను, స్పష్టముగఁ జెప్పవలయునని పూనినచో 'వాస నాత్మకబుద్ధి' యని యైనను జెప్పుచున్నారు. గీతలయందు 'బుద్ధి' శబ్దము పూర్వోక్తార్థద్వయమునందును బ్రయోగింపఁ బడియున్నది (గీ. 2.41,44; 3 42); కర్మయోగవివేచన బాగుగఁ దెలియుటకొఱకు వెనుకఁ జెప్పిన రెండర్థములను దప్పక గుర్తుంచుకొనవలయును.

మనుజుఁ డే దేని యొక కర్మ నారంభించినపు డా కర్మ మందిదా? లేక చెడుదా? లేక, చేయుటకుఁ దగనిదా? తగినదా? యను విషయమునఁ దాను తన వ్యవసాయాత్మికబుద్ధిచేఁ దొలుత విచారించుచున్నాఁడు; కాని, యా కర్మలుచేయుటయం దిచ్ఛయైనను, వానన (వాననాత్మక)బుద్ధియైనను నాతని మనస్సున నుదయించుటచే నా పని యొనర్చుటకుఁ బ్రవర్తించుచున్నాఁడు. ఇది యా మనోవ్యా పారములయొక్క క్రమము. వీనిలోఁ గార్యాకార్యముల నిర్ణయించుట యనునది (వ్యవసాయాత్మిక)బుద్ధియొక్క వ్యాపార మయియున్నది. ఆ యింద్రియములు స్వాధీనములుగ నుండె నేని తప్పు వాననలు (అనఁగ: చెడుబుద్ధులు)మనస్సునఁ గలిగినందున మనస్సు చెడనేరదు. కాన తొలుత వ్యవసాయాత్మికబుద్ధిని శుద్ధముగను, స్థిరముగను నొన రింపవలయునని గీతలలోని కర్మయోగశాస్త్రమునకు ముఖ్యమగు

సిద్ధాన్త మయియున్నది (గీ. 2.41). గీతలలోనే కాక 'కాంటు'* అను తత్త్వవేత్తయును, బుద్ధి ని తిరున ద్వివిధముగ విభజించి శుద్ధబుద్ధి (అనఁగాఁ: వ్యవసాయాత్మికబుద్ధి) యొక్కయు, వ్యావహారికబుద్ధి (అనగాఁ: వాసనాత్మకబుద్ధి) యొక్కయు వ్యాపారములను రెండును స్వతంత్ర గ్రంథములందు వివేచనఁ జేసెను. నిజముగ విచారించిన, వ్యవసాయాత్మికబుద్ధిని ఎట్లు స్థిరము చేయవలసినదియు పాతంజల యోగశాస్త్రమున నుండవలయును గాని, కర్మయోగశాస్త్రమున నుండవలసిన పనిలేదు. అయినను కర్మలను విచారించుచు, కర్మల యొక్క పరిణామము చూచుటకంటె నా కర్మలఁ జేయించు వాసన (అనఁగా- వాసనాత్మకబుద్ధి) యెటులున్నదో తెలుతఁ జూడవలయు నని గీతలలో సిద్ధాన్తీకరింపఁబడెను (గీ. 2.49); తదనుసారముగనె వాసనలను విచారించితిమేని, యెవరి వాసనాత్మకబుద్ధి స్థిరముగను శుద్ధముగను గుదురలేదో, వారి మనస్సునందు వేర్వేఱగు వాసనారూప తరంగము లుద్భవిల్లుచున్నవనియు, నందుండి యా వాసనలెప్పుడును శుద్ధములుగ నైనను పవిత్రములుగ నైన మండునని నియమము లేద నియుఁ గాన్పించును (గీ. 2.41). వాసనయే శుద్ధము కానియెడలఁ బిదప శుద్ధమగు కర్మ మాత్ర మెటుల సంభవిల్లును? కావున కర్మ యోగశాస్త్రమువ సైతము "వ్యవసాయాత్మికబుద్ధిని శుద్ధముగ నుంచు టకు సాధనములు గాని, యుపాయములు గాని యేవి?" యని విస్తరముగ విచారింపవలసిన యావశ్యకత కలుగును. ఇందుకొఱకే భగవద్గీతలలో నాఱవ యధ్యాయమున బుద్ధిని శుద్ధముగఁ జేయుట కొక సాధన మను నూహతోఁ బాతంజలయోగము వివేచనఁ జేయఁ బడినది; కాని యీ సంబంధమును తెలిసికొనలేక గీతలలోఁ బాతం

* ఈ 'కాంటు' మత మట్లు వ్యవసాయాత్మకబుద్ధికి Pure Reason అనియు, వాసనాత్మకబుద్ధికి Practical Reason అనియు నామంబు లిచ్చెను. ఈ రెండు బుద్ధులయొక్క వివేచనము వ్యతంత్రములగు రెండు గ్రంథములు వ్రాసెను.

జలయోగము ప్రతిపాద్యముగ నున్నదని కొందఱు సాంప్రదాయిక టీకాకారులు తాత్పర్యమును వెలిపుచ్చిరి. గీతాశాస్త్రమునందు 'బుద్ధి' యనుశబ్దమునకుఁ బూర్వోక్తములగు రెండర్థములును, ఆ యర్థము లందలి పరస్పరసంబంధమును గుర్తుంచుకొనుట కున్న యావశ్యకత దీనివలనఁ జదువరులకుఁ దెలియును.

అది యటు లుండనిమ్ము. ఇంతవఱకు మనుజుని యంతఃకరణము నందలి వ్యాపారము లెట్లు నడచుచున్నవో చూచి, "మనో బుద్ధులయొక్క కార్యము లెవ్వి? బుద్ధిశబ్దమునకు మఱియొక యర్థ మేమి?" యనుట చెప్పఁబడినది. మనస్సును, వ్యవసాయాత్మక బుద్ధిని, ఇటుల విడఁదీసిన పిమ్మట నిప్పుడు నదనద్వివేక దేవత కేమి గతియగునో చూతము. మంచిచెడుగులను వివేచించుటయే యీ దేవతయొక్క కార్య మగుటచేఁ గనిష్ఠ మగు మనస్సునం దిది చేరదు. ఏ విషయమునైనను విచారించి నిర్ణయించువ్యవసాయాత్మిక బుద్ధి యొక్కటియే యగుటచే నదనద్వివేచనాశక్తికి వేఱుగ నవకాశ ముండనేరదు. విషయముయొక్క సారాసారవివేకము నైనను జేసి నిర్ణయించి చెప్పవలసిన విషయము లనేకము లుండియుండును. వ్యాపారము, యుద్ధము, దండనీతి, నీతిశాస్త్రము, వర్తకము, కృషి మొదలగువాని ప్రతి ప్రపంగము నందును సారాసారవివేకము నేర్పఱుపవలసి వచ్చును. అంతమాత్రముచే దీనియందున్న వ్యవసాయాత్మికయగు బుద్ధి భిన్నము కానేరదు. సారాసారవివేకమును నీ పని యెచ్చోఁ జూచిన నొక్కటిగనే యున్నది. కావున నా వివేకము లేక నిర్ణయించు బుద్ధియు నొకటిగనే యుండవలయును. మనస్సు ననునరించి బుద్ధియు శారీరధర్మము నుండుటచేఁ బూర్వకర్మానుసారముగఁ బెక్కుతరముల నుండి వచ్చుచున్న సంస్కారములచే నైనను, శిక్షణము మొదలగు నితర కారణములచే నైనను, బుద్ధి కొంచెమెచ్చు తగ్గుగ సాత్త్వికముగ నైనను, రాజసముగ నైనను తామసముగనైన నుండవచ్చును. కావుననే యొక బుద్ధికి తోఁచునట్టి విషయము

మతియొక బుద్ధికి తోఁపదు. కాని యంతమాత్రముచే బుద్ధీంద్రియము సదా వేఱుగనే యున్నదని చెప్పఁగూడదు. ఉదాహరణార్థము నేత్ర మును జూడుము. కొందఱకు మెల్లకన్ను లుండును. మఱికొందఱకు దిరుగుడు కన్నులుండును. కొందఱకు గ్రుడ్డివిగఁ, గొందఱకు రేఁజీ కటివిగ నుండును. కొందఱకుఁ జూపు బాగుగ నుండును. ఇట్లున్నను నేత్ర మను నింద్రియ మొకటి గాక యనేకము లున్నవని మనము చెప్పుదుమా? బుద్ధియు నిటులే యొక్కటియే యున్నది గాని యనేకములు లేవు. ఏ బుద్ధి బియ్యమును గోదుమలను వేఱుగఁ దెలిసికొను చున్నదో, యదియే రాతిని వజ్రమును వేఱ్వేరని తెలిసి కొనును. అదియే, తెలుపును నలుపును తీపును చేఁదును వే ర్వేఱని యెఱుంగును. అదే యెక్కడ భయపడవలయునో, యెచ్చో నక్కఱ లేదో, సత్పదార్థమేదియో, యసత్పదార్థ మేదియో, లాభ మెద్దియో నష్ట మెద్దియో, యేది ధర్మమో, యేది యధర్మమో, చేయఁదగిన దెద్దియో, చేయఁదగని దెద్దియో, యను నీ యన్ని విషయముల యందలి తారతమ్యమును విచారించి తుదకు నిర్ణయించుచున్నది. సామాన్యవ్యవహారములో దానిని మనోదేవత యని యెంత వేఱుగఁ జెప్పినను, తత్త్వజ్ఞానము ద్వారా దానిని విచారించిన నదియే వ్యవసాయాత్మిక బుద్ధి యగును. ఈ యభిప్రాయమునే మనస్సున నుంచుకొని గీతలయొక్క పదునెనిమిదవ యధ్యాయములో నొక బుద్ధినే సాత్త్విక మనియు, రాజస మనియు, తామస మనియుఁ ద్రివిధముగ విభజించి—

> ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే,
> బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధి స్సా పార్థ సాత్త్వికీ.
> (గీ. 18.30.)

— ఏ పనిని జేయవలయునో, దేనినిఁ జేయ నక్కఱ యుండదో, యేది చేయుటకు యోగ్యమో, యేది చేయుటకు యోగ్యము

కానేరదో, దేనికి భయపడవలయునో, దేనికి నక్కఱ లేదో, దేని యందు బంధ మున్నదో, దేనియందు మోక్షమున్నదో, యిఱుంగఁ గల బుద్ధి సాత్త్విక మగుచున్నది అని నుడివిన పిదప-

యయా ధర్మ మధర్మం చ కార్యం చాకార్య మేవ చ,
అయథావ త్ప్రజానాతి బుద్ధి స్సా పార్థ రాజసీ.
(గీ. 18.31.)

– ధర్మాధర్మములయొక్క యు, కార్యాకార్యములయొక్క యు, యథార్థ నిర్ణయమును నరిగఁ జేయలేని (అనఁగా: పొరపడు) బుద్ధి రాజసము అనియుఁ దుదకు-

అధర్మం ధర్మ మితి యా మన్యతే తమసా వృతా,
సర్వార్థాఁ విపరీతాంశ్చ బుద్ధి స్సా పార్థ తామసీ.
(గీ. 18.32.)

– అధర్మమునే ధర్మ మని తలఁచునది గాని, లేక, సర్వవిషయముల విపరీతముగ (అనఁగా- తలక్రిందై) నిర్ణయించునది గాని యగు బుద్ధి తామసము అని యర్జునునకు భగవంతుఁడు సెప్పెను. ఈ వివేచన వలన మంచిచెడుగులను మాత్రమే వివేచించు నదనద్వివేకరూపిణియు స్వతంత్రయు నగు నొక దేవత కలదని గీత యెప్పుకొన్న దని స్పష్ట మగుచున్నది. ఎప్పుడును మంచిదానినే గ్రహించుబుద్ధి యుండనే యుండదని దీని యర్థము కానేరదు; కాని బుద్ధియొక్క టియే యగుటచే మంచివస్తువులను వివేచించుట యను నీ సాత్త్విక ధర్మమందు ననేక పూర్వసంస్కారములచేఁ గాని, యభ్యాసముచేఁ గాని, యింద్రి యనిగ్రహముచేఁ గాని, లేక, యూహాదుల వలనఁగాని కలుగును. ఈ పూర్వసంస్కారములు మొదలగు కారణములు లేనప్పు డా బుద్ధియే యొక కార్యాకార్యనిర్ణయరూప కార్యమునందేకాక యితరవిషయము లందు సైతము రాజసము గాని, లేక, తామసము గాని కావచ్చునని

వెనుక జెప్పిన శ్లోకముయొక్క భావార్థము. "చోరునకును, వర్తకునకును వేర్వేఱు దేశస్థులగు మనుష్యులకును, బుద్ధియందు భేద మేలయుండు?" నను ప్రశ్నకు నీ సిద్ధాన్తముచే సమాధానము కుదిరినటుల నదనద్వివేచనాశక్తిని స్వతంత్రదేవతగ నంగీకరించినయెడల గుదురదు. తన బుద్ధిని సాత్త్వికముగ జేయుటయే ప్రతి మనుష్యుడును జేయదగిన పని. ఇంద్రియనిగ్రహము లెక యటులజేయుట శక్యము కానేరదు. మనుజునియొక్క వ్యవసాయాత్మకబుద్ధి యెంత పర్యంతము నిజమగు హిత మెచ్చో నున్నదో యని సారాసారవివేచన నైనను, పరీక్షనైనను జేయక, బొత్తిగ నింద్రియమార్గాను సారముగ నడచుచున్నదో, యంత పర్యంతము దానిని శుద్ధమని నుడువరాదు. కావున బుద్ధిని, మనస్సునకు నైనను, ఇంద్రియములకు నైనను లోబడనీయక, బుద్ధియొక్క యధీనతలోనికే యింద్రియములును మనస్సును వచ్చునటుల మనము నియమము చేయవలయును.

భగవద్గీతలలో ననేక స్థలములయం దీ విషయమే తెలుపబడియున్నది (గీ. 2. 67-68; 3. 7-41; 6. 24-26); ఈ కారణముననే కఠోపనిషత్తులో శరీరమును రథముగాఁ బోల్చి శరీరసంబంధులగు నింద్రియరూపము లగు గుఱ్ఱములను విషయోపభోగ మార్గమునందు నియమముగ నడపుటకు (వ్యవసాయాత్మక) బుద్ధి యను సారథి, మనస్సను కళ్లెమును ధైర్యముతో బాగుగ లాగిపట్టుకొనవలయు ననిరూపకాలంకారముతోఁ జెప్పఁబడినది (కఠ. 3. 3-9); మహాభారతమునందు సైతము రెండు మూఁడుస్థలములం దీ రూపకాలంకారమే కొద్ది భేదముతోఁ జెప్పఁబడినది (మ.భా.వన. 210.28; స్త్రీ. 7 18; అశ్వ. 51.5). ఇంద్రియ నిగ్రహమువలనఁ గలుగు విషయమును జెప్పునపుడీ దృష్టాంత మెంత యుక్తముగ నున్నదియు గ్రీసుదేశములోఁ బ్రసిద్ధుఁడగు 'ప్లేటో' యను తత్త్వవేత్త సైతము తన గ్రంథమునందు (ఫీడ్రస్. 246) ఇంద్రియ నిగ్రహమును గుఱించి వ్రాయుచు

నీ దృష్టాంతమునే యిచ్చుటవలనఁ దెలియును. భగవద్గీతయం దీ దృష్టాంతము ప్రత్యక్షముగ లేదు; కాని పూర్వమునం దుదాహరింపఁబడిన గీతాశ్లోకమునందలి యింద్రియనిగ్రహముయొక్క వర్ణన, యీ దృష్టాంతమును మనమునం దిడుకొనియే చేయఁబడిన దను విషయము పూర్వాపర సందర్భము నెఱింగినవారికిఁ దెలియక యుండదు. సామాన్యముగ (అనఁగ: శాస్త్రీయమగు సూక్ష్మమైన భేదము లొనర్చుట యావశ్యక మగునప్పుడు) దీనినే మనోనిగ్రహ మని చెప్పుదురు; కాని మనోబుద్ధులను వెనుకఁ జిప్పినటుల విడఁదీయ వలసినప్పుడు, నిగ్రహ మను కార్యమును వ్యవసాయాత్మక బుద్ధి చేయవలయును గాని, మనస్సు చేయనేరదు. ఈ వ్యవసాయాత్మక బుద్ధి శుద్ధమగుటకుఁ బాతంజలయోగమందలి సమాధిచే నైనను, భక్తిచే నైనను, జ్ఞానముచే నైనను, ధ్యానముచే నైనను, పరమేశ్వర స్వరూపము నెఱింగి యన్ని జంతువులయందు నొక్క యాత్మయే కలదను విషయమును బుద్ధియందు దృఢముగ నుంచుకొనవల యును. వ్యవసాయాత్మకబుద్ధి యీ విధముగ నాత్మనిష్ఠ కలదియై, మనోనిగ్రహముచే మనస్సును నింద్రియములును దాని యధీనము లుగ నుండుట యభ్యాసమైన యెడల, ఇచ్ఛ, వానన మొదలగు మనోధర్ములు (అనఁగా- వాసనాత్మక బుద్ధులు) న్యయముగనే శుద్ధములు పవిత్రములు నగుటచే శుద్ధసాత్త్విక కర్మవైపునకు దేహేంద్రియాదులు స్వాభావికముగనే ప్రవర్తించును. అధ్యాత్మ దృష్టితో విచారింప నివి యన్నియు నదాచరణమునకు మూలములు (అనఁగా- కర్మయోగ శాస్త్రముయొక్క రహస్యములు).

మనోబుద్ధులయొక్క నియతమగు ప్రవృత్తిదప్ప నదనద్వివేక శక్తి యను స్వతంత్రదేవతను మన శాస్త్రకారు లంగీకరింపకపోవుటకుఁ గారణ మేమియో యీ వెనుకటి వివేచనవలనఁ బుదువరులకు స్పష్ట పడును. మనస్సును గాని, బుద్ధినిగాని గౌరవార్థమై దేవత యము

వారి మతమునం దేమియు దోషము లేదు; కాని, దేనిని మనము మనస్సని, బుద్ధి యని చెప్పుచున్నామో దానికంటె వేఱుగునదియు, స్వయముగఁ బుట్టినదియు, మూఁడవదియు నగు నదనద్వివేకదేవత, యథార్థమగు విచారముచే సిద్ధము కానేరదని యతనిచే నిర్ణయింపఁ బడినది. "నతాం హి సందేహపదేషు...." అను నీ వాక్యమందలి సారస్య మిప్పుడు స్పష్టపడును. ఎవని మనస్సు శుద్ధముగను, ఆత్మ నిష్ఠముగను నున్నదో, యతఁడు తన యంతఃకరణమును సాక్ష్యముగఁ గైకొనుట తప్పు కానేరదు. వేయేల? అతఁడు తన మనస్సును శక్యమగునంత శుద్ధము చేసికొని, యే కర్మనైన నారంభించుటకు ముందుగ దాని సాక్ష్యముఁ గైకొనవలయునని సైతము చెప్పవచ్చును కాని మోసగాఁడు 'నే నిటులే నడచుచున్నా' ననుటవలన నేమియు ప్రయోజనము లేదు. కారణ మేమియన-ఆ యిరువురి నదనద్వివేచనా శక్తియు నేకము కానేరదు. సత్పురుషునిది సాత్త్వికము మోసగానిది కామసము. సారాంశ మేమి యన- దీని నాధిదైవతపక్షావలంబుల నదనద్వివేకమని చెప్పుదురో, దానిని తత్త్వజ్ఞానముద్వారా విచారణఁ జేసిన నది స్వతంత్రదేవత కా నేరదనియు, వ్యవసాయాత్మక బుద్ధిస్వరూపములోనే యిది యొక యాత్మ (అనఁగా: సాత్త్వికస్వరూపము) గ నున్నదనియు మన శాస్త్రకారుల సిద్ధాన్తము. మఱియు నా సిద్ధాన్తముచే నాధిదైవతపక్షము తనంతటఁ దానే ఖండింపఁబడును.

ఆధిభౌతికపక్షమున కేక దేశీయత్వమును (పూర్వపక్షకోటిలోఁ జేరుట), అపూర్ణతయు, నాధిదైవత పక్షముయొక్క యీ సులభమగు యుక్తియు, నిష్ప్రయోజనము లని యిట్లు సిద్ధమైన పిదపఁ "గర్మయోగశాస్త్రము యుక్తియుక్తమగుటకు మరియొక మార్గ మెద్దియైన నున్నదా లేదా?" యనునది విచారింపవలసి వచ్చును. ఈ మార్గమునే యాధ్యాత్మిక మందురు. కారణ మేమి యన:- బాహ్యకర్మలకంటె బుద్ధి శ్రేష్ఠమయిన దయినను నదనద్వివేకబుద్ధి యను

నది యొకానొక స్వతంత్ర మయినదియు, స్వయముగాఁ బుట్టిన దియు నగు దేవత కాదని నిశ్చయించిన పిదప "శుద్ధకర్మ నంమటిల్లు టకు బుద్ధి నెట్లు శుద్ధముగ నుంచవలయును? శుద్ధబుద్ధి యని దీనికి పేరు? బుద్ధిని శుద్ధ మెటుల చేయవలయును?" అను నీ ప్రశ్నలు కర్మయోగశాస్త్రమునందు సైతము విచారించుట యావశ్యక మగును. ఈ విచారమొక బాహ్యదృష్టినే విచారించునట్టి శాస్త్రమును (అధిభౌతిక శాస్త్రమును) వదలి, యాధ్యాత్మికజ్ఞానములోఁ బ్రవేశించినఁ గాని పూర్ణము గానేరదు. ఆత్మయొక్కయైనను, పరమేశ్వరునియొక్క యైనను సర్వవ్యాపియగు సత్యస్వరూపము పూర్ణముగ గోచరముకాని బుద్ధి శుద్ధము కానేరదని భరతఖండము నందలి శాస్త్రకారుల తుది సిద్ధాన్తము. కావున నిట్టి బుద్ధి యని (అనఁగా: ఆత్మనిష్ఠ బుద్ధి యని) దీనిని జెప్పవలయునో తెలుపుటకే గీతయం దధ్యాత్మశాస్త్రమునెక్క నిరూపఁ జేయఁబడినది; కాని యీ పూర్వాపర సంబంధము నెఱింగి కొనక, గీతలయొక్క సాంప్రదాయిక టీకాకారులలోఁ గొందఱు వేదాంత మనునదియే గీతలయందు ముఖ్యప్రతిపాద్య విషయ మని నిశ్చయించుచున్నారు. గీతలలోఁ బ్రతిపాద్యమగు విషయసంబంధ ములో నేటి టీకాకారులచే నిర్ణయింపఁబడిన యర్థమును బాగుగలేదని పైన సవిస్తరముగఁ జూపించెదము. బుద్ధి యెటుల శుద్ధ మగునని విచారించుటకు నాత్మయొక్క యు విచార మావశ్యకమగునని మాత్రమే యిప్పుడు నిరూపింపవలసిన విషయము. ఈ యాత్మవిచారము రెండు విధములుగఁ జేయనగును. (1) తన, పిండము, క్షేత్రము, లెక, శరీరముయొక్కయు మనస్సుయొక్కయు వ్యాపారములను పరీక్షించి దానివలన క్షేత్రజ్ఞరూపియగు నాత్మయొక్క స్వరూపమెటుల నిష్పన్న మగునని వివేచించుట మొదటివిధము (గీ.అ. 13). దీనికే శారీరక మని, లెక, క్షేత్రక్షేత్రజ్ఞవిచారమని పేరు. ఈ కారణమువనే వేదాన్త సూత్రములను "శారీరకసూత్రములు (శరీరముయొక్క విచారము చేయునవి)" అని మడివెదరు. ఇట్లు తన శరీరమును మనస్సును

విచారించిన పిదప, (2) దానివలన నిష్పన్నమగు తత్త్వము, మన చుట్టునున్న దృశ్యసృష్టిని (అనఁగాఁ బ్రహ్మాండమును) పరీక్షించుటచే నిష్పన్నమగు తత్త్వము, ననునవి రెండును గలిసి యొక్కటిగ నున్నవా? లేక, వేఱుగ నున్నవా? యని విచారించుట రెండవ విధము. ఈ సృష్టిపరీక్షను క్షరాక్షరవిచార మని, లేక, వ్యక్తావ్యక్త విచారమని యందురు. క్షరము, లేక, వ్యక్తము, అనఁగా: సృష్టి యందున్న సకల నశ్వరపదార్థములకు, అక్షరము, లేక, అవ్యక్తము, అనఁగా: సృష్టియందున్న యీ నాశవంతములగు పదార్థములకు సార భూతమైనది నిత్యమైన తత్త్వముగ నుండును (గీ. 8. 21; 15. 16). క్షేత్రక్షేత్రజ్ఞ విచారముచేతను, క్షరాక్షరవిచారముచేతను, నీ రెండును నెవరివలన వెలువడినవో, ఏది ఈ రెండు తత్త్వములకంటెఁ బరముగ నున్నదో, ఏది సర్వమునకు మూలభూతమయిన తత్త్వ మని నిష్పన్న మగునో, దానిని పరమాత్మ యని కాని, పురుషోత్తముఁడని కాని చెప్పు దురు (గీ. 8.60). భగవద్గీతల యం దిది సంపూర్ణముగ విచారింపఁబడి తుదకు సర్వమునకు మూలభూతమగు పరమాత్మ రూపమయిన తత్త్వముయొక్క జ్ఞానముచే బుద్ధి యెటుల శుద్ధమగునో నిరూపించి కర్మయోగశాస్త్రమున కుపపత్తి చెప్పఁబడినది. కావున నీ యుపపత్తి నెఱుంగ దలంచితి మేని మనము సైత మా మార్గమునే యవలం బింపవలయును. వానిలో బ్రహ్మాండజ్ఞానము, లేక, క్షరాక్షరవిచారము ముందు ప్రకరణములోఁ జెప్పఁబడును. సదసద్వివేక దేవతయొక్క సత్యస్వరూపమును నిర్ణయించుట కీప్రకరణమునందుఁ బ్రారంభింపఁ బడిన పిండజ్ఞానము, లేక, క్షేత్రక్షేత్రజ్ఞవిచార మపూర్ణముగనున్నది గాన, దానిని మాత్రమే యిప్పుడు విచారించి ముగించెదము.

పాంచభౌతిక మగు స్థూలదేహము, పంచ కర్మేంద్రియములు, పంచజ్ఞానేంద్రియములు, ఈ జ్ఞానేంద్రియములయొక్క శబ్ద-స్పర్శ-రూప-రస-గంధాత్మకములగు నయిదు విషయములు, సంకల్పవికల్పా

త్మకమగు మనస్సు, వ్యవసాయాత్మికయగు బుద్ధియు ననువాని విచారణ సంపూర్ణమయినది. కాని యింతమాత్రముచే శరీరవిచారము పూర్ణముకానేరదు. మనోబుద్ధులు రెండును విచారించుటకు సాధనములు (అనగా: ఇంద్రియములుగ) గ నున్నవి. జడమగు శరీరమున వీని కంటె వేఱుగ ప్రాణరూపమగు చేతన (చలనాత్మక వ్యాపారము) లేనిచో, మనోబుద్ధు లుండినను లేకపోయినను సమానముగనే యుండును. అనఁగా: పై నుదాహరింపఁ బడినవి గాక, 'చేతన' యను మఱియొక తత్త్వమును శరీరమునందుఁ జేర్చవలయును. 'చేతనా' శబ్దమునకే యనేక పర్యాయములు చైతన్యమునియు నర్థమగుచున్నది; కాని, చేతనాశబ్ద మిచ్చో చైతన్యమను నర్థమునందుఁ బ్రయోగింపఁ బడలేదని యెఱుంగనగును. చేతన యనఁగా: జడదేహమునందు గన్పట్టెడి ప్రాణములయొక్క సంచలనాత్మకక్రియ, చేష్ట, లేక, బ్రదికియుండుట యను వ్యాపారము మాత్రమే యిచ్చో నుద్దేశింపఁబడినది. ఏ చిచ్ఛక్తి చే జడపదార్థములందు సైతము చలనాదిక్రియ (అనఁగా: వ్యాపారము) కలుగునో నదియే చైతన్యము; ఈ శక్తి యేది యని ప్రస్తుతము మనము విచారింతము. శరీరమునందుఁ గాన్పించుచున్న 'బ్రతికియుండుట' యను వ్యాపారము (అనగా: చేతన) కంటె వేఱుగనదియు, పరకీయము నాత్మీయము నను భేదమునకు గారణమైనదియు, మఱియొక విధమగు గుణము కలదు. కారణమేమి యనవెనుకఁ జెప్పినటుల బుద్ధియను నింద్రియము కేవలముసారాసారములను విచారించి నిర్ణయమును జేయునది యగుటచే స్వపరభేదమునకు మూలమగు నహంకార మా బుద్ధికంటె వేఱైన దని నుడువవలసివచ్చును. ఇచ్ఛాద్వేషములు, సుఖదుఃఖములు మొదలగు ద్వంద్వములు మనస్సుయొక్క గుణములే. నైయాయికు లివి యాత్మగుణములవి యందురు. కావున నీ తప్పును దిద్దుటకై వేదాన్తశాస్త్రము మనోగుణము లనియే బోధించుచున్నది. ఇటులే పంచమహాభూతము

లే మూలతత్త్వము నుండి వెలువడినవో యా ప్రకృతిరూపమగు తత్త్వము శరీరముననే చేరును (గీ. 13-5-6). ఈ తత్త్వములన్నియు నే శక్తిచే స్థిరములుగ నుండునో యా శక్తి యీ యన్నిటికంటెను వేఱుగ నున్నది. దానిని 'ధృతి' యని నుడువుదురు (గీ. 18 33). ఈ విషయముల నన్నిటి నొక్కచోటికిఁ, జేర్చిన నే సముచ్చయమగు పదార్థము నిష్పన్నమగునో, దానిని (నవికార) శరీరమనియు క్షేత్ర మనియు శాస్త్రములలోఁ జెప్పుదురు. దీనినే వ్యవహారమునందు, నడచుచున్నది, మాటలాడుచున్నది (నవికార) మనుష్యశరీరమనియు లేక, పిండ మనియుఁ జెప్పుచున్నాము. క్షేత్రశబ్ద మిట్లు గీతాప్రమా ణముచే నిర్ణయింపఁబడెను గాని యిది యిచ్ఛాద్వేషాది గుణముల నెంచుచు ని వ్యాఖ్యానములయందుఁ గొన్ని స్థలములలో రమారమిగ ప్రాయఁబడినది. విస్తారము భేదము లేదు. ఉదాహరణము:- శాంతి పర్వము (320) నందలి జనక సులభా సంవాదమునందు శరీర మన నేమియో తెలుపుచు పంచకర్మేంద్రియములను వదలి వానికిమాఱుగ కాలము, నదనద్భావము, విధి, శుక్రము, బలము నను నాఱు గుణ ములును జేర్పఁబడినవి. ఈ గణనానుసారముగఁ బంచకర్మేంద్రియ ములును పంచమహాభూతములలోనే చేరునవి యగును. గీతలోని గణన వనుసరించి కాలమున కాకాశమునందును, విధి శుక్ర బలాదు లకు నితర మహాభూతములయందును, లేక, ప్రకృతియందును నంతర్భావమని చెప్పవలసివచ్చును. ఏది యెట్లున్నను క్షేత్రశబ్దమున కందఱు నొక్క యర్థమునే చెప్పుదురు. మానసికము లైనను, శారీర కము లైనను, అన్ని వస్తువులును, గుణములును, ప్రాణరూప మగు చేతనతోఁ గూడిన సముదాయముతోఁ గలసి 'క్షేత్ర'మని చెప్పఁబడును. 'శరీర' మను శబ్దము 'దేహ' మను నర్థమం దుపయోగింతురు. కావున దానికంటె వేఱుగు 'క్షేత్ర' మను శబ్ద మిచ్చో నుపయోగిం పఁబడును. 'క్షేత్ర' మను శబ్దమునకు 'దేను' అని ముఖ్యార్థము.

కాని యా ప్రకరణమున నా శబ్దము, సవికారము సజీవము నగు మనుష్యదేహమునందు లాక్షణికముగ నుపయోగింపఁ బడినది. వెనుక నేను దీనినే గొప్ప కార్యాలయ మని చెప్పితిని. వెలుపలినుండి కార్యాలయములోనికిఁ బదార్థములను దీసికొనుటకు, అక్కడనుండి (అనఁగ ఫ్యాక్టరీలో నుండి) పదార్థములను వెలుపలికిఁ బంపుటకును యథాక్రమముగ జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియము లనునవి యీ కార్యాలయమునకుఁ దలుపులును, మనస్సు, బుద్ధి, చేతన యనునవి దాని యందుఁ బనిచేయువారును నై యున్నవి. ఈ పని చేయువారు సేయునెడియుఁ, జేయించునడియు నగు పనినే క్షేత్రముయొక్క వ్యాపారమని కాని, వికారమని కాని, లేక, ధర్మమని కాని చెప్పుదురు.

క్షేత్రశబ్దమున కీ తీరున నర్థము నిశ్చయించిన పిదప "ఈ క్షేత్ర (చేను) మెవరిది? ఈ కార్యాలయమునం దధికారి యెవరు? కలఁడా? లేఁడా?" యను నీ సందేహము సహజముగ నిప్పన్న మగుచున్నది 'ఆత్మ' యను శబ్ద మనేక స్థలములయందు మనస్సు, అంతఃకరణము లేక, తాను, స్వయముగ అను నీ యర్థములం దుపయోగించుట కర్హముగ నున్నను నా పదమునకు క్షేత్రజ్ఞుఁడు, లేక, శరీరమునకు స్వామి యని యర్థమై యున్నది. మనుష్యులు సేయు మానసికములును శారీరకములు నగు పనుల నన్నింటిని, వాని బుద్ధి మొదలగు నంతరింద్రియములును, చర్మము మొదలగు జ్ఞానేంద్రియములును, హస్తపాదాది కర్మేంద్రియములును జేయుచున్నవి. మనోబుద్ధు లను నీ రెండింద్రియములు నీ గుంపులోని కెల్ల శ్రేష్ఠములు. ఇవి శ్రేష్ఠము లైనను నితరములగు నింద్రియములవలెఁ దొలుదొల్త జడదేహము యొక్క (అనఁగాఁ ప్రకృతియొక్క) వికారములుగనే యున్నవి. (ముందు ప్రకరణమును జూడుము). కావున మనోబుద్ధు లను నీ యింద్రియములు సర్వశ్రేష్ఠము లయినను దమ తమ ముఖ్యవ్యాపార ములకంటె నితరమగు బాహ్యవిషయమున నేమియుఁ జేయుటకు

రావు. అట్లు చేయుట శక్యమును గానేరదు. మనస్సాలోచనఁ జేయుటయు, బుద్ధి నిశ్చయముఁ జేయుటయు నత్యమే కాని, యంతమాత్రముచే నీ కార్యములను, మనస్సును బుద్ధియు నెవరికై చేయుచున్నదియు, నా యా సమయములయందు మనోబుద్ధులకు సంఘటిల్లెడు వేర్వేఱు వ్యాపారములయొక్క యేకత్వజ్ఞానమునకు నావశ్యకమగు నేకీకరణము నెవరు చేయునదియు, నా యేకీకరణానుసారముగఁ బిదప సర్వేంద్రియములను దమ తమ వ్యాపారములయందా మనోబుద్ధుల కనుకూలముగఁ జేయించుటకు మార్గమును జూపువా రెవరైనదియు నిర్ణీతము కానేరదు. మనుజునకు జడదేహ మే కార్యమును జేయుచున్న దనియుఁ జెప్పుటకు సాధ్యము కానేరదు. కారణ మేమి యన: శరీరమున నుండు చేతన (అనఁగా: ఇటు నటు సంచరించుట యను వ్యాపారము) నాశమగు నేని జడదేహము మిగిలియున్నను నేమియుఁ జేయనేరదు. జడదేహముయొక్క మాంసము, స్నాయువు మొదలగు నవయవము లన్న పరిణామము లగుటచే నెల్లప్పుడు నశించుచు నెల్లప్పుఁడు గొత్తగఁ బుట్టుచుండును. కావున 'నిన్న విషయమును జూచినదియు, నేఁడు విషయమును జూచినదియు నే నొకఁడనే' యను నేకత్వబుద్ధి యెప్పుడు మాఱుచుండు జడదేహము యొక్క ధర్మమే యయి యున్నదని చెప్పఁగూడదు. మంచిది! జడదేహమును వదలి చేతనయే స్వామి యని చెప్పితి మేని గాఢనిద్రయందు ప్రాణాది వాయువులయొక్క శ్వాసోచ్ఛ్వాసాదులు, లేక, రుధిరాభిసరణము (రక్తము ప్రవహించుట) మొదలగు వ్యాపార (అనఁగా: చేతన)ము లున్నను 'నే' నను జ్ఞానముండదు (బృ.22.14-18). కావున చేతన, లేక, ప్రాణాదులయొక్క వ్యాపారము, అనునదియు, జడమునందుఁ బుట్టినట్టి యొక విధమగు గుణ మగుటచే సర్వేంద్రియ వ్యాపారముల నేకీకరణముఁ జేయు మూలభూతమగు స్వామిశక్తి కాదని సిద్ధమగుచున్నది (కఠ. ౨.౨). 'నా యొక్క యితరునియొక్క' యను నీ షష్ఠ్యంత విశేషణములచే నహంకార రూపమగు

గుణముయొక్క బోధ కలుగుచున్నది. కాని, 'అహ' మనఁగా నెవ రనునది (అనఁగా: నే నెవ రనునది) దానిచే నిర్ణీతము కాలేదు. 'నే' ననునది బొత్తిగ భ్రమ యంటి మేనిప్రతి మనుజునకు నట్టి యనుభవము లేకపోవుటచే నీ యనుభవమును వదలి యే కల్పనయైనను జేయుట యనునది- "ప్రతీతి వీఱజేఁ బోలజేఁ, తేఁ అవఘేఁచి కంటా ళవాఁడేఁ, తోఁడ పనరూన జైసేఁ నుడేఁ, రడోన గేలేఁ"- అనుభవము నకు విరుద్ధముగనేమి చెప్పినను గుక్క నోరుఁ దెఱచి మొఱఁగునటు లుండునే కాని నరిగా నుండనేరదు (దా. 9. శ్లో. 12) అని సమర్థరామ దాసుగారు చెప్పినటు లుండును. అనుభవవిరుద్ధముగా నీ విషయము నొప్పుకొన్నను నింద్రియ వ్యాపారములయొక్క యేకత్వమునకు యుక్తి కుదురనే కుదురదు. "'నేను' అనునది వేఱుగ నొక పదార్థము కానేరదు గాన క్షేత్రశబ్దమున నమావేశము చేయుటకుఁ దగిన మనస్సు, బుద్ధి, చేతన, జడదేహము మొదలగు నన్నిటియొక్కయు సంఘాతమును 'నేను' అని చెప్పవచ్చును" అని యనేకు లందురు. కాని చెక్కపైఁ జెక్కనిడిన మాత్రముచేతనే పెట్టె కానేరదు. గడి యారముయొక్క చక్రముల నన్నింటి నొక్కచో నుంచినను దాని యందు నడక పుట్టదు. ఈ విషయము మనము ప్రత్యక్షముగనే కనుచున్నారము. కావున సంఘాతమాత్రము చేతనే కర్తృత్వము వచ్చునని చెప్పరాదు. క్షేత్రముయొక్క సర్వవ్యాపారములును బొత్తిగఁ బిచ్చివాని వ్యాపారములవలె జరుగుట లేదు. కాన, నొక విధమగు గతి, లేక, యుద్దేశము కారణమై యుండునని యెవరికిని జెప్ప నవసరము లేదు. క్షేత్ర మను కార్యాలయమున బుద్ధి మొదలగు నందఱు గుమస్తాలకు నీ ధోరణి నెవరు కలుగఁ జేయుచున్నారు? 'సంఘాత' మనఁ బ్రోగగుట. సర్వపదార్థముల నొకచోఁ బ్రోగు చేసినను నవి యన్నియుఁ గలిసి యొక జీవ మగుటకు దానిలోనుండి యొక ప్రాడు గ్రుచ్చవలసివచ్చును. అట్లు గ్రుచ్చినను నది మరల నెక్కడ నైనను సంబంధము వదలిపోవును. ఈ ద్రా డేమయి యుండు

నని యిప్పుడు మనము విచారింపవలయును. సంఘాతము భగవద్గీత లలో లేనిది కానేరదు. దాని గణన క్షేత్రములోనే చేయఁబడుచున్నది (గీ. 13.6). క్షేత్రమునకు యజమానుఁ డెవరైనదియు నిందుచే స్థిరము కానేరదు. సముచ్చయములో నే వైనను గ్రొత్త గుణములు పుట్టునని కొంద ఱందురు; కాని యీ మత మంతకు మునుపే పనికి రాదు. కారణమేమి యన- పూర్వమునం దే రూపము చేతను లేని వస్తు వీ జగత్తునందుఁ గ్రొత్తగ నుత్పన్నము కానేర దని తత్త్వజ్ఞానులగు పురుషులు పూర్ణముగ విచారించి సిద్ధాన్తీకరించిరి (గీ. 2.16). కాని యీ సిద్ధాన్తము కొంచెము కాలము దూరముగ నుంచినను, "సంఘాతమున నుత్పన్నము కాఁబోవు నూతన గుణమె, క్షేత్రమునకు స్వామి యెందుకు కానేరదు?" అను మఱియొక ప్రశ్న పిదప సహజముగ వెలువడును. "ద్రవ్యమును వాని గుణములును వేఱు గావు. గుణముల కేమయినఁ గొంచె మాధార ముండవలసి వచ్చును. కావున నముచ్చయము వలనఁ బుట్టు గుణములకు ఱదులుగ మేము నముచ్చయమునే యీ క్షేత్రమునకు స్వామి యని చెప్పుచున్నాము" అని యిప్పటి యాధిభౌతికశాస్త్రజ్ఞులు దీనిపై యుక్తిఁ జెప్పుచున్నారు. బాగుగనే యున్నది; కాని వాడుకలో నగ్ని శబ్దమునకు మాఱుగ 'కొయ్య' యను శబ్దమును, 'మెఱపు' అను శబ్దమునకు మాఱుగ 'మబ్బు' అను పదమును, 'భూమి నాకర్షించుట' యనుటకు మాఱుగ 'భూమి' యనియు నేల చెప్పుట లేదు? క్షేత్రముయొక్క సర్వవ్యాపారముల నొక నియమముగను, క్రమముగను, సంబంధించుటల నడుపుటకు మనోబుద్ధులకంటె వేఱగు నేదైన నొక శక్తి యుండవలయు ననునది మాత్రము నిర్వివాద మయినను, ఆ శక్తియొక్క యధిష్ఠాన మిప్పటికిని మనకుఁ దెలియకపోవుటచే నైనను, లేక, యీ శక్తియొక్కయో యధిష్ఠానము యొక్కయో పూర్ణస్వరూప మిప్పటికిని జెప్పుటకు సాధ్యము కాకపోవుటచే నైనను, ఆ శక్తి యనునదే లేదని చెప్పుట

న్యాయ్యమా? తనభుజములపైఁ దాను కూర్చుండి నను యనంగత మైనటులె సంఘాతము సంఘాతము నెఱుంగుచున్న దని చెప్పుట సైత మసంగతము. కావున దేహేంద్రియాది సంఘాతముయొక్క వ్యాపారము, దీనియొక్క యుపభోగార్థమైనను, లేక, లాభార్థ మైన నగునో, యది యేదయినను సంఘాతముకంటె వేఱుగ నుండ వలయు నని తర్కదృష్టిచే సైతము దృఢమగు ననుమానము నిష్పన్న మగును. సంఘాతముకంటె భిన్నముగ నుండు నీ తత్త్వము స్వయ ముగ సర్వవిషయములఁ దెలిసికొనున దగుటచే సృష్టియందున్న యితర పదార్థములవలె నది మనకు స్వయముగ గోచరము కాక పోవుట సత్యమే; కాని యింతమాత్రమునకే దానియొక్క యస్తిత్వ మున కేమియు బాధ రానేరదు. కారణ మేమి యన- సర్వపదార్థ ములను 'జ్ఞేయ ములు'గనే యుండవలయు నను నియమము లేదు. జ్ఞాతయు, జ్ఞేయము (అనఁగా: తెలిసికొనువాఁడును, అతనిచేఁ దెలి యఁదగిన వస్తువు) అని యవి రెండు వర్గములుగ నున్నవి. రెండవ వర్గములోఁ జేరని వస్తువు మొదటి వర్గములోఁ జేరును గావున దానికి అస్తిత్వము, జ్ఞేయవస్తువునకు వలెనే పూర్ణముగ సిద్ధమగును. వేయేల? సంఘాతమునకు దూరముగ నున్నయాత్మ తానే జ్ఞాత యగుటచే దానికిఁ గలుగఁబోవు జ్ఞానమున కది విషయము కాకపోయినను నేమియు నాశ్చర్యము లేదనవచ్చును. ఈ యభిప్రాయమును బట్టియే "ఓరీ! సర్వమును దెలిసికొను వానిని దెలిసికొనుటకు మఱియొకఁ డెచ్చోనుండి వచ్చును?"- "విజ్ఞాతారమరే! కేన విజానీయాత్?" అని బృహదారణ్యకోపనిషత్తులో (బృ. 2.4.14) యాజ్ఞవల్క్యునిచేఁ జెప్పబడియున్నది. కావున హస్తపాదాదీంద్రియములు మొదలు పైకిఁ బోయి పోయి, ప్రాణము, చేతన, మనస్సు, బుద్ధియు నను వీని కంటెను, వీని కధీనులు నేకదేశీయులు నగు గుణాస్తాలకంటెను సైతము దూరముగ నుండునదియు, వాని యన్ని వ్యాపారముల నేకీ

కరణముఁ జేయునదియు, నా యా వ్యాపారములందు వాని వానిఁ బ్రేరణ చేయునదియు, వానియొక్క కర్మలకు సాక్షీభూత మయినదియు, వానికంటె నధికవ్యాపకముగను, నమముగ నుండునదియు నగుశక్తి యీ చేతనావిశిష్టమగు (అనఁగా: సజీవమగు) దేహమునందు (అనఁగా: క్షేత్రమునందు) వాసముఁ జేయుచున్న దని తుదకు సిద్ధాన్తము చేయవలసివచ్చును. ఈ సిద్ధాన్తము సాంఖ్యవేదాన్తశాస్త్ర ములలెంటి ననుసరించియే యున్నది. అర్వాచీనకాలమునందు జర్మన్ దేశపు తత్త్వజ్ఞుఁడు 'కాంటు' అను నతఁడు బుద్ధివ్యాపారములను సూక్ష్మముగ బరీక్షించి యీ సిద్ధాన్తమే తేలునని నిరూపించినాఁడు. మనస్సు, బుద్ధి, అహంకారము, లేక, చేతన అనునవి యన్నియు దేహము (క్షేత్రము) యొక్క గుణములుగను, లేక, యవయవ ములుగనున్నవి. వీనికిఁ బ్రవర్తకుఁడు వీనికంటె వేఱుగను స్వతంత్రుఁ డుగను, వీనికంటె వెలుపలి వాఁడుగను నున్నాఁడు. "యో బుద్ధేః పరతస్తు సః" (గీ. 3-42). వీనికే సాంఖ్య శాస్త్రములోఁ బురుషుఁ డని పేరిడిరి. వేదాన్తమునందు 'క్షేత్రజ్ఞుఁ' డనియు, 'క్షేత్రమును దెలిసికొను నాత్మ' యనియుఁ జెప్పుచున్నారు. 'నే నున్నాను' అని ప్రతి మనుజునకునుఁ గలుగునట్టి సాక్షాత్ప్రతీతియే దానియొక్క యస్తిత్వమునకుఁ బరమావధి (వే.సూ.శాం.భా. 3.3.53-54) '.నేను లే' నని నోటను మాటనైన ననఁడు. 'లేను' అను క్రియాపదము నకుఁ గర్త యొక్క (అనఁగా: నా యొక్క, లేక, యాత్మయొక్క) యస్తిత్వము నతఁడు మఱియొక విధముగ నొప్పుకొనుచునే యున్నాఁడు. 'నేను' అను నీ యహంకారయుక్తమగు నగుణరూపముచే దేహమునం దిట్లు మనకు స్వయముగ వ్యక్తమగు నాత్మయొక్క (అనఁగా: క్షేత్రజ్ఞునియొక్క), మొదటి నుండియు శుద్ధమును, గుణ రహితము నయిన స్వరూప మేది? యను విచారము, శక్తికొలఁది నిర్ణయించుటకే వేదాన్తశాస్త్రము ప్రవర్తించినది (గీ. 18.4); అయిన

నీ నిర్ణయము కేవలము దేహముయొక్క (క్షేత్రము యొక్క) విచారము నందుండియే స్థిరము కానేరదు. క్షేత్రక్షేత్రజ్ఞులవిచారమే కాక బాహ్యసృష్టిని (అనఁగా- బ్రహ్మాండమును సైతము) విచారించి యేమని తేలునో చూడవలయునని పూర్వమునందుఁ జెప్పఁబడినది. బ్రహ్మాండముయొక్క యీ విచారమునకే క్షరాక్షరవిచారమని పేరు. క్షేత్రక్షేత్రజ్ఞ విచారముచే క్షేత్రమునందు (అనఁగా- దేహమునందు, లేక, పిండమునందు) ఏ మూలతత్త్వ (క్షేత్రజ్ఞుఁడు, లేక, యాత్మ) మున్నదియు నిర్ణీత మగును. క్షరాక్షరవిచారముచే బాహ్యసృష్టి (అనఁగాఁ బ్రహ్మాండము) యందున్న మూలతత్త్వము తెలియును. పిండబ్రహ్మాండములయొక్క మూలతత్త్వము లిట్లు ముందు వేర్వేఱుగ బాగుగ విచారించి, యీ రెండుతత్త్వములు నొకటియే యని నిశ్చయ మయిన పిదప-అనఁగాఁ: ఏది పిండమందుఁ గలదో యది బ్రహ్మాండ మందును గలదని- వేదాన్తశాస్త్రమున సిద్ధాన్తీకరింపఁ బడినది. * అదియే నర్వచరాచరసృష్టిలోఁ దుదకు నత్యమైనది. పాశ్చాత్యుల దేశమందును నిట్టి యూహాపోహ లుత్పన్నము లైనవి. కాంటు మొదలగు కొందఱు పాశ్చాత్యతత్త్వజ్ఞులయొక్క సిద్ధాన్తము మన దేశమునందున్న వేదాన్తశాస్త్రజ్ఞులయొక్క సిద్ధాన్తములతో ననేక విషయములకు నంబంధించియున్నది యని తెలిసికొంటిమేని యాధి

---

* క్షరాక్షరవిచారము - క్షేత్రక్షేత్రజ్ఞవిచారము నను మన శాస్త్రమున నున్న వర్గీకరణమును 'గ్రీకు' దొరగా రెఱుఁగనే యెఱుఁగరు. అయినను Prolego- mena to Ethics అను గ్రంథమున తాము జేసిన యధ్యాత్మనివేదనము, Spiritual Principle in Nature అనియు, Spiritual Principle in man అనియు రెండుగ విభజించి, పిదప దాని కేకత్వమును జూపెను. క్షేత్ర క్షేత్రజ్ఞ విచారమునందు Psychology మొదలగు మానవశాస్త్రములను, క్షరాక్షర విచారమునందు Physics, Metaphysics మొదలగు శాస్త్రములను జేరును. మఱియు వీని నన్నిటిని విచారించినపిదప నాత్మస్వరూపమును నిర్ణయింపవలసి వచ్చు నను విషయమును పాశ్చాత్యవిద్వాంసులు సైత మొప్పుకొందురు.

భౌతికశాస్త్రముల కిప్పుడున్నంత వృద్ధి పూర్వకాలమున లేకపోయినను వేదాన్తమునందున్న సిద్ధాన్తముల నాంతరదృష్టిచే బహుకాలము క్రిందనే శోధించి తీసినవారి యలౌకిక బుద్ధివైభవమునకు నాశ్చర్య పడకమానము. ఆశ్చర్యపడుటయే గాక మనము వారిపై మంచి యభిమానము సైత ముంచవలయును.

ఇది అధిదైవతపక్ష-క్షేత్రక్షేత్రజ్ఞవిచార మను షష్ఠప్రకరణము

—

పంచమ ప్రకరణము

కాపిలసాంఖ్యశాస్త్రము

క్షరాక్షరవిచారము

ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి.*

(గీతా. 13.19.)

శరీరము, శరీరస్వామి, లేక, యధిష్ఠాత_ క్షేత్రము, క్షేత్రజ్ఞుఁడు_ అను వానిని విచారించినట్లే, దృశ్యసృష్టి, దానియందలి మూలతత్త్వము_ క్షరము, అక్షరము అను వాని నన్నిటినిగూడ విచారించి యాత్మయొక్క స్వరూపనిర్ణయమును జేయవలయు నని పూర్వప్రకరణమునఁ జెప్పితిమి. ఈ క్షరాక్షరసృష్టిని యోగ్యమగు విధమున విచారించునవి మూఁడు శాస్త్రములు. (1) న్యాయశాస్త్రము, (2) కాపిలసాంఖ్యము, వేదాన్తము; కాని, మొదటిరెంటిలో నున్న సిద్ధాన్తముల నపూర్ణములుగ నిశ్చయించి, బ్రహ్మస్వరూపనిర్ణయము వేదాన్తశాస్త్ర మను మూఁడవ రీతిని జేయఁబడినది. కావున వేదాన్తము యొక్క యుపపత్తి నెఱుంగుటకుఁ బూర్వము నైయాయికుల యొక్కయు, సాంఖ్యులయొక్కయు, కల్పనలేవో మన మవశ్య మెఱుంగవలయును. బాదరాయణాచార్యులవారి వేదాన్తసూత్రముల యం దీ పద్ధతి యంగీకరింపఁబడినది. వారు నైయాయిక_సాంఖ్య మతములను రెండవ యధ్యాయములో ఖండించినారు. ఆ విషయ

* ప్రకృతి పురుషు లీవాడు లని యెఱుంగవలయును.

మంతయు నిచ్చో నుడువుట కసాధ్యమైనను, భగవద్గీతారహస్యము నెఱుంగుట కావశ్యక మగునంతవఱకుఁ బరిచయము ముందు ప్రకరణ మునఁ జేయుచున్నాము. నైయాయికుల సిద్ధాన్తముకంటె సాంఖ్యుల సిద్ధాన్తము మిక్కిలి గొప్పది. కారణ మేమియన- బాదరాయణా చార్యులవారు (వే.సూ. 2.1.12; మఱియు, 2.2.15-17) చెప్పినటుల కాణాద న్యాయ మతములను, శిష్టుఁడును, ప్రముఖుఁడు నగు నే వేదాన్తియు నొప్పుకొనక పోయినను, కాపిలసాంఖ్యశాస్త్రమందలి యనేక సిద్ధాన్తములు మనువు మొదలగువారి స్మృతులలోను, గీతల లోను నున్నవి గాన, వాని ముందుగ ఱదువరు లెఱుంగవలయును. సాంఖ్యశాస్త్రమునందలి యనేకకల్పనలు, వేదాన్తమునందు స్పష్టముగ గాన్పించు చున్నను, సాంఖ్య వేదాన్తులయొక్క చివరిసిద్ధాన్తములు మిక్కిలి భేదముగలవైయున్న వను సంగతి చదువరులకుఁ దెలియుటకై మొదటనే యీ విషయమును జెప్పవలసివచ్చును. "వేదాన్తసాంఖ్య శాస్త్రముల రెంటియందును నంగీకరింపఁబడిన కల్పనముం దెవ్వరిచేఁ గల్పింపఁబడినది?- వేదాన్తులచేతనా? సాంఖ్యులచేతనా?-" అనియు నొకప్రశ్న వెలువడుచున్నది; కాని యింత యగాధమగు విచారము నీ గ్రంథమున సాధ్యము కానేరదు. ఉపనిషత్తులు (వేదాన్తము) సాంఖ్యము నను నివి రెండు నొకప్పు డిరువురు సోదరులవలె నొక్క సారిగనే పుట్టినందున, నుపనిషత్తులు రచించినవారిచే స్వతంత్రముగ శోధించి తీయఁబడియుండునా? లేక, సాంఖ్యశాస్త్రములో నుండి కొన్నిసిద్ధాన్తములఁ గైకొని వానిని వేదాన్తశాస్త్రమున కనుకూలముగ మార్పుచేసి యుందురా? లేక, ప్రాచీనములగు నుపనిషత్తులయం దున్న సిద్ధాన్తములనే కపిలాచార్యులవారు తన యిష్టానుసారముగ సంస్కరించి సాంఖ్యశాస్త్రరచనఁ జేసి యుందురా? యని త్రివిధముగ నూహింపవలసి వచ్చుచున్నది; కాని యుపనిషత్తులు సాంఖ్యము నను నీ రెండును ప్రాచీనములే యైనను వానిలో నుపనిషత్తు లధిక

ప్రాచీనములు (శ్రౌతములు)గ నున్నవని విచారించితి మేని కడపటి యూహ యన్నింటికంటె నెక్కువగ నమ్మఁదగి యున్నదని తోఁచును. ఎటులయిన నుండనిమ్ము. తొలుత న్యాయసాంఖ్య సిద్ధాన్తములు మనకుఁ దెలిసెనేని వేదాన్తముయొక్క- ముఖ్యముగ గీతలలోని వేదాన్తముయొక్క- తత్త్వము త్వరగఁ దెలియును. కావున నీ రెండు స్మార్తశాస్త్రములయొక్క క్షరాక్షర సృష్టిరచనా విషయమైన మత భేదమును ముందు మన మించుక విచారింతము.

"ఒకానొక వివక్షితము, లేక, గృహీత మయిన విషయము నందుండి ముందు తర్కానుసారముగనే యనుమానముల నెటుల తీయవలయును? ఈ యనుమానములలో నొప్పగున దేది? తప్పగున దేది? ఎందువలన? అది యే న్యాయశాస్త్రమున ముఖ్యముగఁ జెప్పఁబడు విషయము?" అని యనేకు లడుగుదురు. ఆ ప్రశ్నలు యుక్తములు కానేరవు. అనుమానము మొదలగు ప్రమాణఖండము న్యాయశాస్త్రమున కొక భాగముగ నున్నది; కాని, ఇది ముఖ్యము కాక పోవుటచేఁ బ్రమాణములే కాక, సృష్టియందున్న యనేక వస్తువుల (అనఁగా: ప్రమేయ పదార్థముల) నొకటిగఁ జేసియైనను, లేక వర్గీకరించి యైనను, క్రిందివర్గమునకుండి పైవర్గమునకుఁ బోనుపోను "సృష్టిలోని యన్ని పదార్థములకును మూలభూతములగు వర్గము లెన్ని?" లేక, "పదార్థము లెన్నియై యుండును? వాని గుణధర్మము లెవ్వి? వానియందుండి పిదప నితర పదార్థము లెట్లు పుట్టినవి? ఏ రీతిగ సిద్ధమగును?" అను నీ విధమగు ప్రశ్న లన్నియు న్యాయశాస్త్రమునందు విచారింపఁబడుచున్నవి. వేయేల? ఇందుకొఱకే యీ శాస్త్రము నిర్మింపఁబడినది. కేవల మనుమాన ఖండమును విచారించుటకుఁ గానేరదని చెప్పినను జెప్పవచ్చును. కణాదునియొక్క న్యాయసూత్రారంభమును, పిదప రచనయు నిట్టిదే. కణాదానుయాయులందఱు కాణాదులే. జగతునకు మూలకారణము పరమాణు వని వారి

మతము. కణాదునియొక్క పరమాణువ్యాఖ్యానమును, పాశ్చాత్యులగు నాధిభౌతికశాస్త్రజ్ఞుల పరమాణువ్యాఖ్యానమును రెండు నొక రీతిగనే యున్నవి. పదార్థములను విభజించుచు, తుట్టతుదకు విభాగార్హత లేనివానిని బరమాణువు (పరమ+అణువు) లని చెప్పుచున్నారు. ఈ పరమాణువులు గుమికూడిన కొలఁది వానియందు నవీనగుణములు సంయోగముచేఁ బుట్టుటవలన వేర్వేఱుపదార్థములు పుట్టుచున్నవి. మనస్సునకును శరీరమునకును బరమాణువు లున్నవి. అవి కలిసి యొక్కచో నుండిన చైతన్య మగును. పృథివి, అప్పు (జలము), తేజస్సు, వాయువు, వీని పరమాణువులు స్వభావముగనే వేర్వేఱుగ నున్నవి. పృథివికి మూలభూతమగు పరమాణువునందు నాలుగు గుణములును (రూపము, రసము గంధము, స్పర్శము), జలపరమాణువునందు మూఁడుగుణములును, తేజఃపరమాణువు నందు రెండును, వాయుపరమాణువునం దొకే గుణము నున్నవి. ఈ తీరున సర్వజగత్తును ననాదినుండియు సూక్ష్మములు, నిత్యములునగు పరమాణువులచే వ్యాపింపఁబడినది. పరమాణువులు దక్క జగత్తున కితర మూలకారణము లేదు. సూక్ష్మములు నిత్యములునగు పరమాణువులొకదానితో నొకటి కలియుట కారంభమయినప్పుడు సృష్టియందు వ్యక్తపదార్థములు పుట్టును. వ్యక్తసృష్టియొక్క యుత్పత్తి విషయమై నైయాయికులచేఁ గల్పింపఁబడిన యీ కల్పనకు 'ఆరంభవాద' మని పారిభాషికనామము. కొందఱు నైయాయికు లీ పరమాణువులకంటెఁ బైన నేమి యున్నదియు విచారింపరు. మరణసమయమునం దీశ్వరుని స్మరింపుమని దగ్గఱ నున్న యాప్తులు చెప్పఁగ "పీలవః! పీలవః!! పీలవః!!!" — పరమాణువులు! పరమాణువులు!! పరమాణువులు!!! అని యొకానొక నైయాయికుఁ డన్నట్లు కథను జెప్పుచున్నారు. అయినను గొందఱు నైయాయికులు పరమాణువులయొక్క సంయోగమునకు నీశ్వరుఁడు నిమిత్తకారణమని యంగీకరించి సృష్టియొక్క కారణ పరంపరారూపమగు గొలుసును బూర్తి చేసికొను

చున్నారు. వీరిని సేశ్వరనైయాయికులని వచించుము, వేదాన్తసూత్ర ములయొక్క రెండవయధ్యాయము నందలి రెండవపాదమునందు మొదట నీ పరమాణువాదమును (2. 2. 11-17), పిదప నీశ్వరుఁడు కేవల నిమిత్తకారణముగ నున్నాఁడను మతమును (2. 2. 37-39) ఖండింపఁబడినవి.

వెనుకఁ జెప్పిన పరమాణువాదముఁ బదివిన యెడల హూణ భాషాభ్యానము చేసిన చదువరులకు, అర్వాచీనుఁడును రసాయన శాస్త్రజ్ఞుఁడునగు 'డాల్టన్' అను పండితుఁడు ప్రతిపాదించిన పరమాణు వాదము స్మరణలోనికి రాకమానదు. కాని పాశ్చాత్యుల దేశమునం దున్న 'డాల్టను' యొక్క పరమాణువాదము, 'డార్విన్' అనుపేరు గల ప్రసిద్ధుఁడగు సృష్టి శాస్త్రజ్ఞునియొక్క యుత్క్రాంతివాదము వలన నెట్లు మూలఁబడినదో, యటులె పూర్వకాలమునందు హిందూదేశ మునసైతము సాంఖ్యమతముచేఁ గాణాదమతము వెనుకకు మరలింపఁ బడెను. మూలపరమాణువులకు కదలిక యెట్లు వచ్చినదియుఁ గాణా దులు చెప్పలేరు. ఇంతియ కాక, వృక్షములు, మనుష్యులు, పశువులు మొదలగు సచేతనప్రాణులకు పైకెక్కుటకు మార్గ మెటుల లభించి నది? అచేతనములకు సచేతనత్వ మెటుల లభించును?" మొదలగు నితరము లయిన సందేహములకు నీ మతానుసారముగ సరియగు సమాధానము రానేరదు. ఈ సంగతిని గుఱించి బాగుగ పాశ్చాత్యుల దేశమునందు 1900 శతాబ్దమునందు 'లామార్క్', 'డార్విన్' అను వారిచేతను, మన దేశమునందుఁ, బూర్వమునఁ గపిలమహాముని చేతను చెప్పఁబడినది. ఒక్క మూలభూత పదార్థముయొక్క గుణములే వికసింపుటచే సృష్టియొక్క నమస్తమగు రచనయు నగుచున్న దని యీ యిరువుర మతము. ఈ హేతువుచేతనే పూర్వమున హిందూ దేశమునను, ప్రకృతమున పాశ్చాత్యుల దేశమునను పరమాణు వాదము వెనుకఁబడినది. అటులె పరమాణువు లవిభాజ్యములు కావని సైత మిప్పటి పదార్థశాస్త్రజ్ఞులచే సిద్ధాన్తీకరింపఁబడెను. ఇప్పు

డెట్లు సృష్టిలోని యనేక పదార్థములను విడఁదీసియుఁ బరీక్షించియు ననేక సృష్టిశాస్త్రముల యాధారమునఁ బరమాణువాదమును, లేక, ఉత్క్రాంతివాదమును, సిద్ధముఁ జేయుచున్నారో యట్లు పూర్వమున లేకుండెను. సృష్టియందలి పదార్థములయందు వేర్వేఱుగ ప్రొత్త క్రొత్తవియు నగు ప్రయోగములను చేసి చూచి వాని ననేకవిధములుగ విభజించి వానియందలి గుణధర్మముల నిశ్చయించుట, సజీవసృష్టిలో నున్న నవీనములును ప్రాచీనములు నగు ననేక ప్రాణులయొక్క శరీరావయవముల నొకచోటికిఁ జేర్చి పోల్చుట, మొదలగు నాధి భౌతికశాస్త్రజ్ఞుల నూతనయుక్తులు కణాదునకుఁ గాని, కపిలునకుఁ గాని తోఁపలేదు. వారి దృష్టియెదుట నా సమయమునం దున్న నితర సామగ్రితో మాత్రమే వారు సిద్ధాంతీకరించిరి. అయినను సృష్టి యొక్క వృద్ధిగాని, క్షయము గాని యెటులై యుండు నను విషయ ములో సాంఖ్యశాస్త్రకారులచేఁ జెప్పఁబడిన తాత్త్వికసిద్ధాన్తములలోను అర్వాచీనులగు నాధిభౌతిక సిద్ధాన్తుల తాత్త్విక సిద్ధాన్తములలోను విశేషము భేదము కానరా దను నంగతి యాశ్చర్యకరమై యున్నది. సృష్టిశాస్త్రజ్ఞానాభివృద్ధి యగుటచే నీ మతమున కాధిభౌతికోపపత్తి యిప్పుడు మిక్కిలి యుక్తియుక్తముగ నున్నటుల చెప్పవచ్చును. కావున నాధిభౌతికజ్ఞానాభివృద్ధిచే మనుజులకు వ్యావహారిక దృష్టి యందు విశేషలాభము కలిగినదను నంశమునం దేమియు నందేహము లేదు; కాని యొక్క యవ్యక్త మనెడు ప్రకృతివలన నానా విధము లగు వ్యక్తపదార్థసృష్టి యెటులాయె నను విషయమున కర్వాచీనాధి భౌతికశాస్త్రజ్ఞుఁడు కపిలునికంటె విశేషముగ నేమియు సమాధానము చెప్ప లేదని తెలియు నిమిత్తమై కాపిలసిద్ధాన్తమును, బిదప నా యా ప్రదేశములయందు 'హెకెల్' యొక్క సిద్ధాన్తమును బోల్చి చూచుటకై కొందెము నిరూపించెదను. 'హెకెల్' అను నతఁ డీ సిద్ధాన్తముఁ గ్రొత్తగఁ గనిపెట్టలేదు. 'డార్విన్', 'స్పెన్సరు' మొదలగు

పూర్వాధిభౌతిక పండితుల యాధారముచే, తాను స్వసిద్ధాన్తమును ప్రతిపాదించినటుల 'హెకెల్' తన గ్రంథములలోఁ దేటతెల్లముగ వ్రాసికొనెను. అయిన నీ సిద్ధాన్తముల నన్నింటి నొకచోటఁ జేర్చి 'హెకెల్' 'ప్రపంచముయొక్క కట్టుకథలను' *తన గ్రంథములో సంక్షేపముగను సులభముగఁ దెలియునట్లును జెప్పుటచే, సౌలభ్యము కొఱకు ఆ 'హెకెలు' నకే యాధిభౌతిక తత్త్వజ్ఞుల యందఱకంటె నాధిక్యమును గల్పించి, వాని మతము ప్రధానముగ నీ ముందు ప్రకరణములోఁ జెప్పఁబడుచున్నది. 'హెకెల్' చెప్పు నీ విషయము మిక్కిలి యిమిడికతో నున్నదని చెప్పనక్కఱలేదు. కావున నిచ్చో నీ సిద్ధాన్తము నంతకంటె విశేషముగ విచారించుటకు శక్యము కానేరదు. ఈ విషయమై విశేషముగ నెఱుంగఁ గోరువారు 'స్పెన్సర్', 'డార్విన్', 'హెకెల్' మొదలగు ప్రముఖుల మూలగ్రంథములనే చూడవలయును.

కాపిలసాంఖ్యమును విచారించుటకు ముందుగ, 'సాంఖ్య' శబ్దముయొక్క వేర్వేఱగు రెండర్థముల నిచ్చటఁ జెప్పుచున్నాను. మొదటి యర్థము కపిలాచార్యులచేఁ జెప్పఁబడిన సాంఖ్యశాస్త్రము. అదియే యీ ప్రకరణమునందును, భగవద్గీతయందును నొకసారి (గీ. 18. 13) చెప్పఁబడినది; కాని యీ యర్థమే కాక సమస్తమగు జ్ఞానమును సామాన్యముగ 'సాంఖ్య' మనియే పేర్కొనుట వాడుకయై యున్నది. కాన దానియందు వేదాన్తశాస్త్రము సైతము చేరియున్నది. 'సాంఖ్యనిష్ఠ', 'సాంఖ్యయోగము' నను శబ్దములందున్న సాంఖ్యశబ్దమునకు నీ సామాన్యార్థమే వివక్షితముగ నున్నది. భగవద్గీతలలో నీ నిష్ఠయందున్న వారిని సాంఖ్యులని (గీ. 2.39; 3.3; 4.5;

---

*The Riddle of the Universe by Ernst Haeckle అను గ్రంథము యొక్క R. P. A. cheap Reprint అను మఱల ముద్రింపించిన పుస్తకమును నేను ప్రతిపత్తంమున నుదాహరణార్థమై గ్రహించితిని.

18.24) చెప్పినచోట, సాంఖ్య లనఁగా, నొక కాపిల సాంఖ్య మార్గ మవలంబించినవారే యని యర్థము గాదనియు, ఆత్మానాత్మవిచార ముచే సర్వకర్మల సన్యసించి బ్రహ్మజ్ఞానమునందు మగ్నులయిన వేదాన్తులు ననియుఁ జెప్పిరి. 'సాంఖ్య' మను శబ్దము 'సం-ఖ్యా' యను ధాతువునుండి యుత్పన్న మగుటచే శ్లోక్ర పెట్టువాఁడని మొదట నర్థ మగును. కాపిలశాస్త్రమునందలి మూలతత్త్వముల లెక్క యిరువదియైదు గాన వానిని లెక్కించువాఁ డను నర్థమునందు 'సాంఖ్య' మను నొక పేరు మొదట నిష్పన్న మైనది. పిదప సాంఖ్య మనఁగా: సామాన్యముగ సర్వవిధమైన తత్త్వజ్ఞానము, అను వ్యాపకార్థము వెలువడినటుల శబ్దశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. కావున మొట్టమొదటి నుండియు కాపిల భిక్షువులను సాంఖ్య లని చెప్పుట వాడుకయగుటచే వేదాన్తులగు సన్యాసులకు సైత మా శబ్దమే యుపయోగింపఁబడుచున్నటుల తోఁచుచున్నది. ఎటులయినను సరే! సాంఖ్యశబ్దమున కీ యర్థభేదమున సందేహము లేకపోవు నిమిత్త మీ ప్రకరణమునందు 'కాపిలసాంఖ్యయోగ' మని గొప్ప పేరు స్వయముగ నిడితిని. కణాద న్యాయశాస్త్రమునందు వలెనే యీ కాపిలసాంఖ్యశాస్త్రము నందును, సూత్రము లున్నవి; కాని గౌడపాదాచార్యులు గారైనను, శారీరక భాష్యకర్తలగు శ్రీ శంకరాచార్యులు గారైనను, ఈ సూత్రములను దమ గ్రంథములలోఁ నాధారముగఁ గైకొనక పోవుటచే నీ సూత్ర ములు ప్రాచీనములు కావని యనేకుల యభిప్రాయము. ఈశ్వర కృష్ణునియొక్క 'సాంఖ్యకారిక' లను గ్రంథ మీ సూత్రములకంటె ప్రాచీనమని యెన్నుచున్నారు. ఆ కారికలపై శంకరాచార్యులవారి పరమగురువగు గౌడపాదులవారు భాష్యముఁ జేసిరి. కావున శంకర భాష్యమునందు సైత మీ కారికలే యనువాదము చేయబడినవి. మణీయు ఇ. స. 570 కంటె పూర్వమునందు చైనాభాషలోనికి తర్జుమా

చేయఁబడిన యీ గ్రంథ మిప్పుడు లభించును. *"షష్టితంత్ర"మను అఱువది ప్రకరణములుగల గ్రంథ మంతకుఁ బూర్వమే సిద్ధమై యుండెను. దానియందలి తాత్పర్యమే (కొన్ని ప్రకరణములను వదలి) డెబ్బది యార్యావృత్తములలో నీ గ్రంథమునఁ జెప్పఁబడినది యని యీశ్వరకృష్ణుఁడే నీ కారికల చివరఁ జెప్పఁబడినది. 'షష్టితంత్ర'మను గ్రంథ మిప్పుడు లభింపదు కావున నీ కారికల యాధారముననే కాపిల సాంఖ్యశాస్త్రముయొక్క మూలసిద్ధాంతముల నిచ్చో వివేచనఁ జేయుచున్నాను. మహాభారతమున సాంఖ్యమత మనేకాధ్యాయములందు నిరూపింపఁబడినది; కాని దానియం దన్నిచోట్లను వేదాంతమతము కలిసియుండుటచేఁ గాపిలసాంఖ్య మిది యని నిశ్చయించుటకు మఱియొక గ్రంథ మాలోచించవలసి వచ్చును. ఆ విషయములో సాంఖ్యకారికలకంటె నధికప్రాచీనమగు మఱియొక గ్రంథ మేదియుఁ గాన్పింపదు. "సిద్ధానాం కపిలో మునిః"- సిద్ధులలో గపిలమునిని నేనే (గీ. 10-26) అని భగవంతుఁడు గీతలలోఁ జెప్పియుండుటచేఁ గపిలా

* బౌద్ధగ్రంథములనుండి యీశ్వరకృష్ణులవారి విషయ మిప్పుడు లెస్సగనే తెలిసికొనఁబడినది. బౌద్ధపండితుఁ డగు వసుబంధుని గురువు ఈశ్వరకృష్ణునకు సమకాలికుఁడును, ప్రతిపక్షిగను నుండెను. వసుబంధునియొక్క జీవచరిత్రము పరమార్థునిచే (ఇ. స. 499-569) చైనాభాషలో వ్రాయఁబడినది. అది ఇప్పుడు ప్రసిద్ధమై ముద్రింపఁబడి యున్నది. ఈ హేతువుచే ఈశ్వరకృష్ణుని కాలము సుమారు ఇ.స. 450 అయియుండుమ అని డాక్టర్ 'ఇకకమ' అనువానిచే స్థిరపఱుపఁబడినది. Journal of the Royal Asiatic Society of Great Britain and Ireland, 1905 pp. 33.53. కాని డాక్టర్ 'విన్‌సెంట్ స్మిత్' అను వానియొక్క మతముం బట్టి వసుబంధునికాలమే ఇసపీసన్‌యొక్క నాల్గవ శతాబ్దముగ (సుమారు 280-360) ఉండవలయును. ఏనఁ అతని గ్రంథము లలో ఇ. స. 404 లో చైనాభాషయందు భాషాన్తరీకరింపఁ బడినవి. వసుబంధుని కాలమిట్లుల వెనుకకు లాగఁబడి యుండుటచే ఈశ్వరకృష్ణుని కాలముగూడ పటులే సుమారు రెండువందల సంవత్సరములు వెనుకకు (అనఁగా: ఇ. స. 240 సుమారుకు) లాగవలసివచ్చినది Vincent Smith's Early History of India, 3rd Edition, p. 328.

చార్యుల యోగ్యత స్పష్టమగును. అయినను కపిలబుషి యెక్కడ నెప్పుడు పుట్టినదియు తెలియదు. సనత్కుమారుడు, సనకుఁడు, సనందనుఁడు, సనత్సుజాతుఁడు, సనుఁడు, సనాతనుఁడు, కపిలుఁడు నను పీ రేడ్గురు బ్రహ్మానస పుత్రులనియు, వారికి జ్ఞాన మా జన్మసిద్ధ మనియు, శాంతిపర్వమున (340. 67) నొకచోఁ జెప్పఁబడినది. మఱి యొకచోట (శాం. 218) కపిలునకు 'ఆసురి' శిష్యుఁడనియు, నా యాసురికి పంచశిఖుఁడు శిష్యుఁడనియు, నాతఁడు జనకునకు సాంఖ్య శాస్త్ర ముపదేశించె ననియు నున్నది. మఱియు శాంతిపర్వమునందు (301. 108-109) "సాంఖ్యులచే సృష్టిరచనాసంబంధము మొదలగు వానిలోఁ జెప్పఁబడిన విషయమే పురాణములయందు, నితిహాసముల యందు, నర్థశాస్త్రమునం దన్నిదిక్కులఁ గాన్పించుచున్న"దని భీష్ముఁడు చెప్పినట్లు స్పష్టముగఁ గాన్పించుచున్నది. వేయేల? "జ్ఞానం చ లోకే యదిహాస్తి కించి త్సాంఖ్యాగతం తచ్చ మహన్మహాత్మన్"-ఈ జగత్తున జ్ఞాన మంతయు సాంఖ్యుల వలననే వెలువడినది (మ.భా.శాం. 300. 109) అని చెప్పినను జెప్పవచ్చును. పాశ్చాత్యగ్రంథకారు లుత్క్రాంతి వాదము నిప్పు డన్ని విషయముల నేల యుపయోగింతురో చక్కగ విచారించితి మేని, యుత్క్రాంతివాదముయొక్క సిద్ధాన్తముతో సమాన మగు సాంఖ్యశాస్త్రమును, మన దేశమునం దున్నవారును బూర్వము ప్రతి విషయమునందును గ్రహించియుండుట యొక నూతనవిషయ ముగఁ దోఁపదు. (1) గురుత్వాకర్షణము, (2) సృష్టిరచన యందలి యుత్క్రాంతితత్త్వము*, (3) బ్రహ్మైక్యము నను నీ మూఁప కల్పన

* 'ఉత్క్రాంతితత్త్వ' మను శబ్దము Evolution Theory అను సర్వమున ప్రస్తుతము రూఢ మయినందున నా శబ్దమునే నే నిచ్చో నుపయోగించితిని. కాని యుత్క్రాంతిశబ్దమునకు సంస్కృతమున 'మరణ'మని యర్థము. కావ, ఉత్క్రాంతి తత్త్వ మను శబ్దముకంటె, గుణవికాసము, గుణోత్కర్షము, లేక, గుణపరిణామ మను సాంఖ్యులయొక్క శబ్దమునే యుపయోగించుట మిక్కిలి ప్రశస్తముగ నుండునని నా యభిప్రాయము.

లనేక సంవత్సరముల క్రిందనే యొక్కొక్క మహాత్మునకు స్ఫురించి నవి. కావున నే గోళమునం దే సామాన్య సిద్ధాన్తములు కాని, వ్యాపక తత్త్వములు కాని, ప్రచారములో నున్నవో, వానినే యనుసరించి తాము ప్రతిపాదించుట యను వాడుక సామాన్యముగ నన్ని దేశము లలో నున్న గ్రంథములయందు లెస్సగఁ గాన్పించును.

కానిమ్ము: కాపిలశాస్త్రముయొక్క యభ్యాస మర్వాచీనకాల మునందుఁ దఱుచుగ నశించుటచే దాని నిప్పుడు ప్రస్తావించుట యవ సర మైనది. ఇప్పుడు కాపిలశాస్త్రమునం దున్న ముఖ్యసిద్ధాన్తము లేవియో విచారింతము. ఈ జగత్తున నూతనపదార్థ మెప్పుడును బుట్టదు. కారణ మేమి యన: "శూన్యమునుండి (అనఁగా: లేలుత నేమియు లేకపోవుట యను దానినుండి) శూన్యముతప్ప మఱియొకటి యేమియుఁ బుట్టుటకు వీలులేదు. కావున పుట్టిన వస్తువునందుఁ (అనఁగా: కార్యమునందు) గానవచ్చు గుణములు దేనివలనఁ బుట్టి నవో, దానియందు (అనఁగా: కారణమునందు) సూక్ష్మరూపముగ నైన నుండి తీరవలయు నని తప్పక యెఱుంగవలయు" నని సాంఖ్య శాస్త్రమునందలి మొదటి సిద్ధాన్తము (సాం.కా. 9). "ఒక పదార్థము నశించుటచే దానివల్ల మఱియొక పదార్థము పుట్టును" అని బౌద్ధ కాణాదుల సిద్ధాన్తము. "బీజము నష్టమైన పిదప దానినుండి యంకు రమును, అది నశించిన పిదప దానినుండి వృక్షమును బుట్టుచున్న" దని వా రుదాహరణము నిత్తురు; కాని సాంఖ్యులును, వేదాన్తులును నీ మతము నొప్పుకొనరు. వృక్షముయొక్క బీజమునందున్న ద్రవ్యము నశింపక, యదియే భూమి, లేక, గాలి యందుండి మఱి యొక ద్రవ్యము నాకర్షించుకొనుటచే, బీజమునకు నంకుర మను క్రొత్తరూపమును (అనఁగా: అవస్థను) గలుగఁజేయును (వేనూ.శాం. భా. 2.1-28 చూడు). అటులే కొయ్యలు కాలెనేని, దుమ్ము, పొగ మొదలగునవి దాని రూపాన్తరములే యయి యున్నవి. కట్టెలలోని

ద్రవ్యము బొత్తిగ నశించుటచేఁ, బొగ యను నూతన పదార్థము పుట్ట నేరదు. "కథ మసతః స జ్ఞాయేత"- ఏది బొత్తిగ లేనే లేదో, దాని నుండి, యుండునట్టి పదార్థ మెటుల పుట్టును (ఛాం. 6. 2. 2) అని ఛాందోగ్యోపనిషత్తులోఁ జెప్పఁబడినది. జగత్తుయొక్క మూలకారణము నకు 'అసత్' అను శబ్ద ముపనిషత్తులలో నక్కడక్కడ నుపయోగిం పఁబడి యున్నది (ఛాం. 3. 19. 1; తై. 2.7.1); కాని, దాని కర్థము 'అభావము=లేమి' అని కానేరదు. నామరూపాత్మక మగు వ్యక్తస్వ రూపముయొక్క (అనఁగా: అవస్థయొక్క) యభావ మని మాత్రమే దాని యర్థమని వేదాన్తసూత్రములందు సిద్ధాంతీకరింపఁ బడెను (వే.సూ. 2.1.16-17). పాలవలనఁ బెరుగు పుట్టును గాని యుదకము నుండి పుట్టనేరదు. నువ్వులనుండి నూనె వచ్చును గాని ఇసుకనుండి రానేరదు. ఇట్టి ప్రత్యక్షానుభవములనుండియు నీ సిద్ధాన్తము నంగీక రింపవచ్చును. కారణమునందు లేని గుణములు కార్యమునందు స్వయ ముగఁ బుట్టునని యంగీకరించిన యెడల, నీటివలనఁ బెరు గేల పుట్ట దను ప్రశ్నకు సమాధానము చెప్పుట సాధ్యము కానేరదు. సారాంశ మేమి యనఁ: స్వయముగలేని పదార్థమునుండి యిప్పు డస్తిత్వములో నుండు పదార్థములు పుట్టనేరవు. కావున నే కార్యమును విచారిం చిన దానియొక్క ప్రకృతిద్రవ్యాంశమును, గుణమును, మూలకారణ మునం దే రూపముననయిన నుండి తీరవలయు నని సాంఖ్యులచే సిద్ధా స్తీకరింపఁ బడెను. ఈ సిద్ధాన్తమునకే సత్కార్యవాద మని పేరు. పదార్థములందున్న జడద్రవ్యములు, కర్మశక్తి యు నెప్పుడును నశిం పవు. ఏ పదార్థమునకైన నెన్ని రూపాంతరములు వచ్చినను, దుదకు సృష్టియందున్న ముఖ్యమగు ద్రవ్యాంశముయొక్కయుఁ, గర్మశక్తి యొక్కయు మొత్త మెప్పుడు నొకరీతిగనే యుండునను సిద్ధాంతమర్వా చీను లగు పదార్థవిజ్ఞానశాస్త్రజ్ఞులచే సైతము సిద్ధాస్తీకరింపఁ బడెను. దీపము వెలుగునపుడు చమురు నశించుచున్న దని మనకు గోచరించు చున్నను, తైలపరమాణువులు బొత్తిగ నశింపక, కాటుక, పొగ, మొద

లగు సూక్ష్మద్రవ్యరూపము నొంది యస్తిత్వమును జెందియున్నది. మఱియు నీ సూక్ష్మద్రవ్యములఁ గలిపి చూచితి మేని యదియును, చమురుగ మండుచున్నప్పుడు దానితోఁ గలిసిన గాలియందలి పదార్థమును, అను నీ రెంటియొక్కయు తూనిక సమానముగ నుండును. మఱియు నీ పద్ధతియే కర్మశక్తిని సంబంధించు నని యిప్పుడు సిద్ధమయినది. కాని యాధునిక పదార్థవిజ్ఞానశాస్త్రజ్ఞులయొక్కయు సిద్ధాన్తములు రెండును జూపుల కేకముగఁ గాన్పించినను, సాంఖ్యుల సిద్ధాన్త మొక పదార్థమునుండి మఱియొక పదార్థము పుట్టు నను నొక విషయమునకు మాత్రమే (అనఁగాఁ: కార్యకారణమాత్రమునకే)యను కూలించును; కాని యర్వాచీన మగు పదార్థవిజ్ఞానశాస్త్రమునం దున్న సిద్ధాన్తములు వినికంటె నధిక వ్యాపకములుగ నున్నవను సంగతి మఱవఁ గూడదు. "కార్యమందలి యే గుణమైనను కారణమందు లేని గుణములనుండి పుట్టనేరదను నదియే కాక, కారణములకు కార్య రూపము వచ్చిన పిదప నా కార్యమందున్న ద్రవ్యాంశమును, కర్మ శక్తి యును లేశమైన నశింపక, పదార్థములయందు వేర్వేఱు స్థితుల యందున్న ద్రవ్యాంశమునకును, కర్మశక్తికిని సంబంధించిన తూని కయు నెప్పుడు నొక్కవిధముగనే యుండును గాని, ఎక్కువయైనను, తక్కువయైనను గానేరదు" అని ప్రత్యక్షప్రయోగము వలన గణిత పద్ధతితో నిప్పుడు సిద్ధాన్తము చేయఁబడెను. ఇదియే యీ రెండు సిద్ధాన్తములలో నుండు గొప్పభేదము. ఈ యూహతోఁ జూచితి మేని భగవద్గీతలయందు "నాసతో విద్యతే భావః"-ఏది లేదో యది ఎప్పుడు నస్తిత్వమునకు రానేరదు - ఈ మొదలగు రెండవ యధ్యాయారంభమునఁ జెప్పఁబడిన సిద్ధాన్తములు (గీ. 2. 16) చూచుటకు 'సత్కార్యవాదము' వలె నుండినను, కేవలము కార్యకారణాత్మకమగు నస్కార్యవాదముకంటె నర్వాచీనము లగు పదార్థవిజ్ఞానశాస్త్రము నందలి సిద్ధాన్తములకును, ఆ సిద్ధాన్తములకును, అధిక సామ్యమున్నటులఁ

గాన్పించుచున్నది. పూర్వమునం దుదాహరింపఁబడిన ఛాందోగ్యోప నిషత్తునందలి వచనముల కిదియే భావము. 'సత్కార్యవాదము' యొక్క సిద్ధాన్తములను వేదాన్తులు సైత మొప్పుకొందురు; కాని, యీ సిద్ధాన్తములు, నగుణసృష్టికంటె పైకిఁ బోలేవు. నిర్గుణమునుండి సగుణముపుట్టినటు లేల గాన్పించునను నందులకు సమాధానము వేఱుగఁ జెప్పవలయునని యద్వైతవేదాన్తశాస్త్రముయొక్క యభిప్రాయ మని సారాంశము. ఈ వేదాన్తమతము సవిస్తరముగ ముందుండు నధ్యాత్మప్రకరణమున విచారింపఁబడును. ఇప్పుడు సాంఖ్యులమత మెంత వఱకు వ్యాపించినదో యది మాత్రమే విచారింపఁదగినది కావున సత్కార్యవాదముయొక్క సిద్ధాన్తమును లెస్సగ విచారించి క్షరాక్షర విచారశాస్త్రమునందు సాంఖ్యులు దాని నెటుల నుపయోగము చేసి నదియు విచారింతము.

సాంఖ్యమతానుసారముగ నీ సత్కార్యవాదము సిద్ధమగు నేని దృశ్యసృష్టియొక్క యుత్పత్తి, పూర్వమునం దేమియు పదార్థములేనిదే శూన్యమునందుండియే పుట్టిన దను మతము తనంతటనే యఱఁగి పోవును. కారణము- 'శూన్య' మనఁగా: 'లేద'ని యర్థము. 'ఏదియు లేనిదాని యందుండి యునికిగల వస్తువులు పుట్టవు' అనియు స్పష్టార్థము. అనఁగా: సృష్టి యేదైన నొక పదార్థమునందుండి పుట్టినదై యుండవలయును. ఇప్పుడు మనకు సృష్టియందుఁ గనఁబడు గుణము లన్నియు నా మూలపదార్థమునం దుండవలయు ననుసీ యంశము స్పష్టముగ సిద్ధమగుచున్నది. ఇప్పుడు సృష్టివైపునకుఁ జూచితి మేని దానియందు వృక్షములు, పశువులు, మనుజులు, ఱాళ్లు, బంగారము, వెండి, వజ్రము, నీళ్లు, వాయువు మొదలగు ననేక పదార్థములు మన యింద్రియములకు గోచరము లగుచున్నవి. వాని రూపములును, గుణములును వేఱుగనే యున్నవి. ఈ భేదము (అనఁగా: నానాత్వము) స్థిరమగు నదియు మూలమునం దున్నదియు కాకపోవుటచే నాది

యందు సర్వవస్తువులయందున్న ద్రవ్య మొకటిగనే యున్నదని సాం ఖ్యుల సిద్ధాన్తము. అర్వాచీనులగురసాయనశాస్త్రజ్ఞులు కొన్ని కొన్ని ద్రవ్యము లను వేఱుపఱచి చూచి యఱువది రెండు తత్త్వములు మూల పదార్థము లని స్థిరపఱిచిరి. కాని, "యీ యఱువదిరెండు తత్త్వము లును స్థిరమయినవి కాకపోవుటచే, మొదట నేదో యొక పదార్థము న్నది. ఆ పదార్థమునం దుండియే సూర్యుఁడు, చంద్రుఁడు, నక్షత్ర ములు, భూమి మొదలగు ప్రపంచమంతయుఁ బుట్టినది" అని పాశ్చా త్యులగు పదార్థశాస్త్రవేత్తలు ఇప్పుడు నిశ్చయించిరి. కావున నా సిద్ధా న్తవిషయమై విశేషవివేచన చేయనక్కఱ యుండదు. జగత్తునందలి యన్ని పదార్థములకు మూలభూతమగు ద్రవ్యమును సాంఖ్యశాస్త్రము నందు ప్రకృతి యని నుడువుదురు. 'ప్రకృతి' శబ్దార్థము 'మూలము (మొదలు)' అని యగుటచే నీ ప్రకృతి నుండి ముందుఁ బుట్టఁబోవు పదార్థములను 'వికృతు'లని యైనను, 'మూలభూతద్రవ్యముల వికా రము' లని యైనను జెప్పుదురు.

కాని, యన్ని పదార్థములలోను ద్రవ్య మొక్కటియే యైనను ఈ ద్రవ్యము నందలి గుణముగూడ నొక్కటియే యైనను, నత్కార్య వాదానుసారముగ నొక గుణమునుండియే యనేక గుణములు వెలు వడుటకు వీలులేదు. ఱాయి, మన్ను, నీరు, బంగారము, మొదలగు జగత్తులోని వేర్వేఱు పదార్థములను జూచితి మేని, వానియందు వేర్వేఱగు ననేక గుణము లుండునటులఁ గనఁబడును. కావున పదార్థ మాత్రమునొక్క గుణములను దొలుతఁ బరీక్షించి యా గుణములే సత్త్వ మని, రజ స్సని, తమ స్సని మూఁడు వర్గములుగ సాంఖ్యులచే విభజింపఁబడినది. కారణ మేమి యన: ఏ పదార్థమును తీసికొన్నను, శుద్ధమును నిర్మలమునగు పూర్ణావస్థయు, తద్విరుద్ధమగు నికృష్టావ స్థయు నను రెండు భేదములు సహజముగ నా వస్తువున కుండుటచే, నికృష్టావస్థ నుండి పూర్ణావస్థలోనికి వృద్ధినొందు చుండుటయే దాని

యొక్క ప్రవృత్తిగ నుండునటుల కానఁబడును. ఈ మూఁడవస్థల లోను శుద్ధావస్థకు సాత్త్విక మనియు, నికృష్టావస్థకుఁ దామస మనియు, ప్రవర్తకావస్థకు రాజస మనియు విశేషణముల నిచ్చు సత్త్వము, రజస్సు, తమస్సు నను నీ మూఁడు గుణములు నన్నిపదార్థములకును మూలభూత మగు ద్రవ్యమునందు (అనఁగా: ప్రకృతి యందు) ప్రారంభము నుండియు నున్నవని సాంఖ్యులు చెప్పుచున్నారు. వే యేల? ఈ మూఁడు గుణములే ప్రకృతి యనియు నన వచ్చును. ఈ మూఁడు గుణములలోను ఒక్కొకదాని సామర్థ్యము తొలుత నొకరీతిగ నుండును. మొదట ప్రకృతి సామ్యావస్థయం దుండును. ఈ సామ్యావస్థ జగత్తుయొక్క ప్రారంభదశయం దుండును. జగత్తు లయ మగునేని తిరుగ నుత్పన్న మగును. సామ్యావస్థ యందు చలనము మొదలగున వేమియు నుండవు. సర్వమును స్తబ్ధ ముగ నుండును. అనంతరమునం దీ మూఁడు గుణములు హెచ్చు తగ్గులయ్యె నేని ప్రవృత్త్యాత్మక మగు రజోగుణముచే మూలప్రకృతి యందుండి యా యా పదార్థములు పుట్టిన పిదప సృష్టి కారంభ మగును. సత్త్వరజస్తమోగుణము లను నీ మూఁడును తొలుత సామ్యావస్థలో నుండుటచే వానియందు హెచ్చుతగ్గు లెటుల కలుగు నని యిప్పు డొక శంక వెలువడుచున్నది; కాని, ప్రకృతియొక్క స్వాభావిక మూలధర్మమే యిది యని సాంఖ్యులు సమాధానము చెప్పుదురు (సాం. కా. 61). ప్రకృతి జడమైనను స్వయముగనే యది సర్వవ్యవహారములఁ జేయుచున్నది. ఈ మూఁడు గుణములలోను తెలివి యునది సత్త్వగుణముయొక్క లక్షణము. అజ్ఞానము (తెలివిలేమి) తమోగుణ ధర్మము. రజోగుణ మనునది ప్రవర్తకము (అనఁగా: మంచి చెడుగులయందుఁ బ్రవర్తింపఁ జేయునది). ఈ మూఁడు గుణములు నెప్పుడును వేర్వేఱుగ నుండనేరవు. అన్నిపదార్థములయందును సత్త్వ రజస్తమోగుణములు కలిసియున్నవి. మఱియు నీ కలయిక యెప్పు

డును మూఁడు గుణముల న్యూనాధికభావము ననుసరించియే వెలువడును. మూలద్రవ్య మొకటియైనను, గుణభేదముచే నొక మూల ద్రవ్యమునుండియే బంగారము, ఇనుము, మన్ను, నీరు, ఆకసము, మానవశరీరము మొదలగు వేర్వేఱు వికారములు పుట్టుచున్నవి. దీనిని మనము సాత్త్వికపదార్థ మనెదమో దానియందు రజస్తమస్సు లను రెండు గుణములకంటెను సత్త్వగుణముయొక్క పరాక్రమ మెక్కువగ నుండుటచే, దానియం దెప్పుడు నుండు రజస్తమోగుణము లణఁగఁ ద్రొక్కఁబడుట వలన మన దృష్టి మాత్రము ప్రసరింపదు. రూఢిగఁ జూచితి మేని సత్త్వరజస్తమో గుణములు మూఁడును ఇతర పదార్థము లందువలె సాత్త్వికపదార్థమునందు నున్నవని యెఱుంగవలయును. కేవల సాత్త్వికములును, కేవల రాజసములును, కేవల తామస ములును లేనే లేవు. ప్రతి పదార్థమునందును మూఁడు గుణముల యొక్కయు పరస్పర సంబంధము కలదు. ఈ పెచ్చుతగ్గు లగుటలో నే గుణము ప్రబల మగునో, దానినిబట్టి ప్రతి పదార్థమును, సాత్త్విక మనియు, రాజస మనియు, తామస మనియు మనము చెప్పుచున్నాము (సాం.కా. 12; మ.భా.అశ్వ-అనుగీత. 86; మఱియు శాం. 301 చూడు). ఉదాహరణము: మన శరీరములో రజస్తమస్సుల కంటె సత్త్వ మధికమగు నేని మన దేహమునందు జ్ఞానము కలిగి సత్య మేదియో తెలియును; చిత్తవృత్తి శాంతమగును. ఇంతియే కాని ఇట్టి సమయమునందు శరీరమున రజస్తమస్సులు బొత్తిగ లేకపోవు. అవి యణఁగియుండుటచే వాని సామర్థ్యము బయలుపడనేరదు (గీ. 14. 10). సత్త్వమునకు మాఱుగ రజోగుణము ప్రబల మగునేని మానుషశరీరమందు లోభ ముత్పన్న మగుటచే, 'కావలయు' నను కోరిక పుట్టి యనేక కృత్యములను జేయుటకు మనుజుఁడు ప్రవర్తించును. అటులే సత్త్వరజస్సులకంటె తమస్సు ప్రబల మగునేని నిద్ర, ఆలస్యము, స్మృతిభ్రంశము మొదలగు దోషములు శరీరమునం దుత్పన్నము లగును. అనఁగా: జగత్తునందలి పదార్థములలో బంగారము,

లోహము, పొదరసము మొదలగు నానాత్వము లన్నియు ప్రకృతి యందలి సత్త్వరజస్తమో గుణముల యన్యోన్య సంబంధము యొక్కయు, పెచ్చుతగ్గులయొక్కయు ఫలమే యని తాత్పర్యము. మూలప్రకృతి యొకటి యయినను నీ నానాత్వ మెట్లు పుట్టునను విచారమును 'విజ్ఞాన' మని చెప్పుచున్నారు. దీనియందే సకలాధి భౌతికశాస్త్రమును జేరును. ఉదాహరణము: రసాయనశాస్త్రము, విద్యుద్విజ్ఞానశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము అను నీ సర్వవిధజ్ఞానములును విజ్ఞానములే యగును.

సామ్యావస్థ యందలి యీ మూలప్రకృతి 'అవ్యక్తము' (అనఁగా: ఇంద్రియములకు అగోచర మగునది), దాని యందలి సత్త్వరజస్తమో గుణముల యన్యోన్య సంబంధముచేఁ బుట్టెడు ననేక పదార్థములు మన యింద్రియములకు గోచరము లగుచున్నవి. అనఁగా: మనము చూచు నదియు, విను నదియు, నాకు నదియు, మూర్కొను నదియు, తాఁకు నదియు వ్యక్త మని సాంఖ్యశాస్త్రమునఁ జెప్పఁబడెను. 'వ్యక్తము' అనఁగా: ఇంద్రియములకు స్పష్టముగ గోచరమగు పదార్థము. అది వాని యాకృతిచే నైనను, రంగుచే నైనను లేక, యింక నే గుణముచే నైనను వ్యక్త మగును. వ్యక్తపదార్థము లనేకము లగుటచే వానిలో వృక్షము, తొయి మొదలగు కొన్ని 'స్థూలములు' గను, మనస్సు, బుద్ధి, యాకాశము మొదలగునవి కొన్ని పదార్థము లింద్రియములకు గోచరము (వ్యక్తము) లైనను 'సూక్ష్మములు'గను నున్నవి. సూక్ష్మ మనఁగా: 'చిన్నది' యని యీ స్థూలసూక్ష్మదర్థము కానేరదు. కారణ మేమన: ఆకాశము సూక్ష్మమైనను, జగత్తు నంతయు వ్యాపించి యున్నది. కావున సూక్ష్మ మనఁగా: స్థూలముకంటె విరుద్ధమని యైనను, వాయువుకంటె విరళమని యైన నెఱుంగవలయును. స్థూలసూక్ష్మశబ్దములచే నే పదార్థముయొక్క సంఘటన యెటులున్నదో యెఱుంగ నగును. వ్యక్తావ్యక్తశబ్దములచే

నా వస్తువుయొక్క ప్రత్యక్ష జ్ఞానము మనకుఁ గలుగుటకు వీలున్నదో లేదో తెలియును. కావుననే వే ఱ్ఱేరగు రెండు పదార్థములు సూక్ష్మము లయినను వానిలో నొకటి వ్యక్తము, రెండవది యవ్యక్తము కాఁగలదు. ఉదాహరణము: వాయువు సూక్ష్మ మయినను స్పర్శేం ద్రియముచే నది యెఱుఁగఁబడుట వలన దానిని వ్యక్త మందురు. సర్వ పదార్థములయొక్కయు మూలద్రవ్య మగు ప్రకృతి వాయువుకంటె నత్యంత సూక్ష్మమగుటచే నే యింద్రియమునకు గోచరము కానేరదు. అందుచేతనే యవ్యక్త మగుచున్నది. ప్రకృతియే యింద్రియమునకు గోచరింపకపోయె నేని 'యది యున్నటుల ప్రమాణ మేమి?' యని యొక ప్రశ్న వెలువడును; కాని యనేక పదార్థముల నవలోకించిన పిదప నత్కార్యవాదానుసారముగ నా యన్నిటియొక్క మూలరూప మింద్రియ ప్రత్యక్షములో గోచరింపకపోయినను, సూక్ష్మరూపముచే నుండియే తీరవలయునని యనుమానముచే సాంఖ్యు లీ ప్రశ్నకు సమాధానముఁ జెప్పిరి (సాం.కా. 8). మఱియు వేదాన్తులచే బ్రహ్మ స్తిత్వము సిద్ధపఱుచుట కీ యుక్తియే స్వీకరింపఁబడినది (కఠ.6.12-13. వీనిమీఁది శంకరభాష్యముఁ జూడు.) ప్రకృతి యత్యంత సూక్ష్మమ నియు, నవ్యక్త మనియు నీ రీతిగ నంగీకరించితి మేని నైయాయికుల పరమాణువాదము స్వయముగ భ్రష్ట మగును. కారణ మేమి యన: పరమాణువు లవ్యక్తములు ననంఖ్యము లయినను ప్రతి పరమాణువును స్వతంత్ర వ్యక్తిగాఁ గాని, యవయవముగాఁ గాని యుండుటచే రెండు పరమాణువుల నడుమ నేమి పదార్థ మున్న దను ప్రశ్న మరల శేషిం చియే యున్నది. కావుననే, "ప్రకృతిలో పరమాణు రూపమైన యవ యవభేదము లేమిచే నది యెప్పుడు నొకదాని కొకటి సంబంధించియే లేక, యొకే తీరుననే, నడుమ నేమియు ఖండము లేక, యవ్యక్తము (ఇంద్రియములకు గోచరము కానిది) నిరవయవము నగు రూపముతో నెల్లప్పుడు నంతయు వ్యాపించి యున్నదని సాంఖ్యులు వక్కాణించె

దరు. పరబ్రహ్మను వర్ణించుచు 'దాసబోధ' యను గ్రంథమున శ్రీ సమర్థరామదాస స్వామివారిచే —

జికడే వహావేఁ తికడే అపార, కోడీకడే నాహీఁ పార.
ఏక జినసి స్వతంత్ర, దూసరేఁ నాహీఁ.

(దాస. 20. 2. 8)

— ఎటుచూచిన నది (బ్రహ్మము) యపారముగనే యున్నది. ఎక్కడను దాని కంతము గానరాదు. అది యొకటే విధము గలదియు స్వతంత్ర మైనదియునై యున్నది. దానియందు ద్వైతము (మఱి యేమియు) లేదు అని చెప్పఁబడెను. ఈ వర్ణన సాంఖ్యులయొక్క ప్రకృతికి సైతము సంబంధించియే యున్నది. త్రిగుణాత్మక మగు నవ్యక్తము, స్వయంభువు నేకవిధ మైనదియు నగుటచే నంతట తెఱపి లేక నిండియున్నది. ఆకాశము వాయువు నను భేదము పిదపఁ గలిగి నది; అవి సూక్ష్మము లయినను, వ్యక్తము లగుటచే వీని కన్నిటికి మూలభూతమగు ప్రకృతియే, స్థిరమైనదియు సర్వవ్యాపకమునగు నవ్యక్త మయినది. అయినను వేదాన్తుల పరబ్రహ్మకును సాంఖ్యుల ప్రకృతికిని భూమ్యాకాశముల కున్నంత భేద మున్నది. కారణ మేమి యన: పరబ్రహ్మము చైతన్యరూపమును, నిర్గుణము నయినది. ప్రకృతి జడరూపమును, నత్త్వరజస్తమోమయ మయినదియు (అనఁగా: సగుణముగ) నై యున్నది; కాని యీ విషయములో విశేషవిచారము పిదపఁ జేయుదము. ప్రస్తుతము సాంఖ్యులయొక్క మత మేమి యనునది మనకు విచారణీయము. స్థూలసూక్ష్ములు, వ్యక్తా వ్యక్తములు నను శబ్దములకు నిట్లర్థము చేసిన పిమ్మట సృష్టియొక్క ప్రథమారంభమునఁ బ్రతిపదార్థము సూక్ష్మము నవ్యక్తమునగు ప్రకృతియొక్క రూప మగుటదే వ్యక్తము (అనఁగా: ఇంద్రియ గోచరము) అయెను. ప్రళయకాలమున నీ వ్యక్తస్వరూపము నాశన మగు నేని మరల నవ్యక్తప్రకృతితోఁ గలసి యవ్యక్తమగుచున్న దని

చెప్పవలసివచ్చును. గీతలయందును నీ మతమే యనువదింపఁబడినది. (గీ. 2. 28. మఱియు, 8. 18). ఈ యవ్యక్తప్రకృతికే 'అక్షర' మనియు, ప్రకృతినుండి పుట్టిన సర్వపదార్థములకును 'క్షర' మనియు సాంఖ్యులిడిన ఇతర నామములు. క్షర మనఁగ 'బొత్తిగ నశించునది' యను నర్థమును గ్రహింపక 'కేవలము వ్యక్తస్వరూపముయొక్క నాశ' మని మాత్రమే యిచ్చట నర్థము చెప్పవలయును. ప్రధాన మనియు, గుణక్షోభిణి యనియు, బహుధానక మనియు, ప్రసవ ధర్మిణి యనియు ప్రకృతికి నామాంతరము లున్నవి. సృష్టియం దున్న యన్ని పదార్థములకును మూలము గావుననే ప్రధాన మనియు, ప్రకృతియొక్క గుణత్రయసామ్యావస్థను స్వయముగనే మార్చు నదిగావున గుణక్షోభిణియనియు, గుణత్రయరూపమగు పదార్థభేదము యొక్క బీజములు దానియం దుండుటచే బహుధానక మనియు, దీనినుండి సకలపదార్థములు పుట్టుచున్నవి (ప్రసూతములు) కావున ప్రసవధర్మిణి యనియు నామములు ప్రకృతి కిడుచున్నారు. ఈ ప్రకృతినే వేదాన్తశాస్త్రమునందు 'మాయ' (అనఁగా : మాయికమగు దృశ్యము) అని చెప్పుచున్నారు.

సృష్టియందలి సకలపదార్థములు 'వ్యక్త' మనియు, 'అవ్యక్త' మనియు, లేక, 'క్షర' మనియు, 'అక్షర' మనియు రెండు వేఱుగా నున్న పిదప క్షేత్రజ్ఞవిచారమునఁ జెప్పఁబడిన యాత్మ, మనస్సు, బుద్ధి, యహంకారము, ఇంద్రియములు ననునవి, సాంఖ్యమతాను సారముగ నే వర్ణములోఁ జేర్చఁదగిన వనునది మొదటి ప్రశ్నయై యున్నది. క్షేత్రమును నింద్రియములును జడములే యగుటచే వ్యక్తమునందే యవి చేరును. కాని, మనస్సు, నహంకారము, బుద్ధియు ననుమానికిని విశేషముగ నాత్మకును, వ్యవస్థ యెటుల చేయవల యును? యూరపు ఖండమునం దిప్పుడు ప్రసిద్ధుఁడును సృష్టిశాస్త్ర వేత్తయునైన 'హెకెల్' అను నాతఁడు మనస్సు, బుద్ధి, యహం

కారము, ఆత్మ యనునివి యన్నియు శరీరధర్మములుగానే యున్నవని తన గ్రంథములలో నిరూపించు చున్నాఁడు. మనుజుని శిరస్సులోని మెదడు చెడె నేని, యతని స్మరణశక్తి నశించును. ఆతనికి పిచ్చి యెత్తుటను మనము చూచుచున్నాము. అటులె శిరస్సుపై గాయము తగిలి యందలి మెదడులోని యొక భాగము చెడిపోయె నేని యా భాగమునకు మానసికశక్తి లేనటుల గాన్పించుచున్నది. మనోధర్మ మనునది జడముయొక్క గుణముగనే యున్నది. సారాంశ మేమన. జడమునందుండి దాని నెక్కాలమునందును వేఱుపఱచుటకు సాధ్యము కానేరదు. కావుననే తలయందు మెదడువలెనే, మనోధర్మము, నాత్మయు ననువానిని, వ్యర్థమనువర్గములోనే చేర్పవలయును. ఈ తీరున వ్యవస్థఁ జేసితిమేని, యవ్యక్తము, జడప్రకృతి యనునవియె తుదకు నేకాకులై (ఒంటిగ) మిగిలి యుండును కారణమేమి యన- సర్వవ్యక్త పదార్థములు నీ మూలభూత మగు నవ్యక్తము నుండియే పుట్టినవి. ప్రకృతి తప్ప జగత్తునకు నుత్పాదకుఁడు గాని, కర్త గాని మఱియొకఁడు లేఁడు. మూలప్రకృతియొక్క శక్తి వృద్ధి యగు చుండఁగనే, దానికి 'చైతన్యము', లేక, 'యాత్మ' అను రూపాన్త రము వచ్చును. ఈ మూలప్రకృతికిని, సత్కార్యవాదమునకు వలె, విధానములును, నియమములును సిద్ధము లయినవి; వానివలెనే సర్వజగత్తును, దానితోఁబాటు మనుజులును కారాగృహబద్ధులవలె నున్నారు. 'ఆత్మ' యని వేఱు పదార్థము లేదనునదియే కాక, యది యవినాశి గాదు, స్వతంత్రమయినది గాదు. ఇంక మోక్ష మెచ్చటి నుండి వచ్చును? 'నా యిచ్ఛానుసారముగ నే నే పని చేయుదు' నని యొక్కొక్కనికిఁ దోఁచున దంతయు భ్రమయే. ప్రకృతి యే మూలకు లాగునో యతఁ డామూల కేగవలయును. సారాంశ మేమి యన: "కై. శంకరమోరోనరాడే" యనువానిచేఁ 'గలహపురి' యను నాటకారంభమునందు ధ్రువపదములో (పల్లవి) చెప్పినరీతిగ నున్నది.

విశ్వ సర్వ హేఁ తురంగ మోతా ప్రాతిమాత్ర హై కైదీ,
పదార్థధర్మాఁ చియా శృంఖలా క్యాఁతేఁ కోది న భేదీ.

— ఈ ప్రపంచ మంతయు నొక గొప్ప కారాగృహము. ప్రాణు లందఱును ఖైదీలు. పదార్థములయొక్క గుణధర్మములు అను ఈ సంకెళ్ళ నెవరును త్రెంపఁజాలరు. ఇట్లు సకల చరాచర సృష్టి యొక్కయు వ్యవహారము నడచుచున్నదని "హెకెల్" అను వాని మతము. సర్వసృష్టికిని మూల మీ తీరున జడమును నవ్యక్తము నగు ప్రకృతి యొక్కటియే యగుటచేఁ దన మతమునకు 'నద్వైత' మని *'హెకెల్' పేరిడుకొనెను; కాని యీ యద్వైతము జడమూలకము (అనఁగా: జడ మగు నొక్క యాకృతియందే సర్వవిషయములను జేర్చునది) అగుటచే దీనిని జడాద్వైత మని కాని యాధిభౌతికశాస్త్రా ద్వైత మని కాని నే నందును.

కాని, సాంఖ్యశాస్త్రకారు లీ జడాద్వైతమును నొప్పుకొనరు. మనస్సు, బుద్ధి, అహంకారము, ఇవి పంచభూతాత్మక మగు జడ ప్రకృతి ధర్మములుగ నున్న వను విషయమును వా రొప్పుకొందురు. తదనుసారముగ నవ్యక్త మగు ప్రకృతి యందుండి క్రమముగ బుద్ధి, అహంకారము మొదలగు గుణములు పుట్టునని సాంఖ్యశాస్త్రమునఁ దొలుతఁ జెప్పఁబడినది; కాని జడప్రకృతి యందుండి చైతన్యము పుట్టుటకు వీలుకాకపోవుటయే కాక, యెవఁ డైనను తన భుజముల మీఁద దా నెటు లాసీనుఁడు కాలేఁడో, యటులే, ప్రకృతి నెఱుం గునది, లేక, చూచునది. ప్రకృతికంటె వేఱగు పదార్థమైననే కాని "నేను దీని నెఱుంగుచున్నాను" అను సంభాషణమే ప్రచారములో నుండనేరదు. సృష్టి వ్యవహారముఁ గంటి మేని "నే నెఱుంగునదియు

---

*అద్వైతమువకు Monism అని 'హెకెల్' మొదట పేరిడెను. అందుపై నీ 'హెకెల్' ఒక స్వతంత్రమగు గ్రంథము వ్రాసెను.

లేక, చూచునదియు, నాకంటె వేఱుగ నున్న" దని యందఱకు యనుభవములోనే యున్నది. కావున జ్ఞాత జ్ఞేయము, చూచువాఁడు చూడఁబడు వస్తువు, లేక, ప్రకృతిని జూచువాఁడు జడప్రకృతియు అను నీ రెండుపదార్థములును నారంభమునందుండి వేర్వేఱుగనున్న వని సిద్ధాన్తీకరించుట యావశ్యక మగునని సాంఖ్యులచే నిశ్చయింపఁ బడినది (సాం.కా. 17). పూర్వప్రకరణమునందు క్షేత్రజ్ఞుఁ డనియు, నాత్మయనియుఁ జెప్పఁబడిన పదార్థమే ద్రష్టయు, జ్ఞాతయు, ఉపభోక్తయు నగుటచే, ఈతనినే సాంఖ్యశాస్త్రమునందు 'పురుషుఁడు' అని లేక, 'జ్ఞః' (జ్ఞాత) అని చెప్పుచున్నారు. ఈ జ్ఞాత ప్రకృతికంటె వేఱుగుటవలన స్వభావముగనే ప్రకృతినంబంధము లగు నత్త్వరజస్తమో గుణములకు దూరముగ నుండువాఁడు, అనఁగా: నిర్గుణుఁడును, వికారమును బొందనివాఁడును, జూచుట యొఱుంగుట మొదలగునవి తప్ప నితరమగు దాని నేమియును జేయనివాఁడును, అగుటచే జగత్తునందు జరుగు పటాటోప మంతయు నొక ప్రకృతి ధర్మమే యయి యున్నదని సిద్ధమగుచున్నది. సారాంశ మేమన: 1. 'ప్రకృతి' యచేతనము, 'పురుషుఁడు' నచేతనుఁడు; 2. ప్రకృతి పటాటోపమును జేయును, పురుషుఁడుదాసీనుఁడు నకర్తయు నగును; 3. ప్రకృతి త్రిగుణాత్మకము, పురుషుఁడు నిర్గుణుఁడు; 4. ప్రకృతి గ్రుడ్డిది, పురుషుఁడు సాక్షి. ఇట్లు రెండు వేర్వేఱు తత్త్వము లీ సృష్టియం దనాదిసిద్ధములుగను స్వతంత్రములుగను స్వయంభువులుగను నున్నవి యని సాంఖ్యశాస్త్ర సిద్ధాన్తము. దాని ననుసరించియే భగవద్గీతలలో- "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి" - ప్రకృతియు, పురుషుఁడు నను వీరిద్దఱు ననాదులుగ నున్నారు (గీ. 13. 19) అని తొలుతఁ జెప్పి, వెంటనే - "కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతి రుచ్యతే"- దేహేంద్రియ వ్యాపారములను ప్రకృతి యొనర్చుచున్న దనియు, "పురుష స్సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతు రుచ్యతే" - పురుషుఁడు సుఖదుఃఖముల యుపభోగమునందు

కారణమగుచున్నాఁ డనియుఁ జెప్పఁబడినది; కాని, "ప్రకృతిపురుషు లిద్ద ఱనాదులు" అను మతము గీతలయందుఁ జెప్పఁ బడినను, ఈ రెండు తత్త్వములు స్వతంత్రములు స్వయంభువులు నని గీత యొప్పు కొనదని యెఱుంగవలయును. కారణ మేమి యన: గీతలయందలి ప్రకృతి తన 'మాయ' యని భగవంతుఁడు చెప్పినాఁడు (గీ. 7.14; 14.3) మఱియుఁ బురుషుని విషయములో సైతము-"మ మై వాంశో జీవలోకే"-వాఁడు నా యంశమై యున్నాఁడు(గీ. 15.7) అని చెప్పి నాఁడు. అనఁగా: గీత సాంఖ్యశాస్త్రముకంటె నెక్కువగనే విచారించి నది; కాని యిప్పుడే గీతవైపునకు దృష్టిని బోనీయక సాంఖ్యశాస్త్రము ముందేమి చెప్పు నను విషయము విచారింతము.

సాంఖ్యశాస్త్ర ప్రమాణముగ సృష్టియం దున్న పదార్థము లన్నియు, అవ్యక్తము (మూలప్రకృతి), వ్యక్తము (దాని వికారము), పురుషుఁడు (జ్ఞుఁడు) అని మూఁడు వర్గములుగ నున్నవి. కాని వీనిలో వ్యక్తపదార్థముయొక్క స్వరూపము ప్రళయకాలమున నశించును; కావున మూలమునందలి యవ్యక్తప్రకృతి, పురుషుఁడు ననుఁ నీ రెండు తత్త్వములును మిగిలియుండును. ఈ రెండు మూలతత్త్వములు 'అనాదులు, స్వయంభువులు' నని సాంఖ్యులయొక్క సిద్ధాంతము. కావున వారిని ద్వైతులు (రెండుమూలతత్త్వముల నంగీకరించువారు) అని చెప్పుచున్నారు. వీరు ప్రకృతి పురుషులకంటె వ్యతిరిక్తమగు నీశ్వరుని గాని, స్వభావమును గాని, కాలమును గాని, మఱియొక మూలతత్త్వమును గాని యొప్పుకొనరు. *కారణ మేమి యన:

---

* ఈశ్వరకృష్ణుఁడు శుద్ధనిరీశ్వరవాది; ఈతని సాంఖ్యకారికలయందు మూలవిషయమగు విషయము చెప్పిది యార్యావృత్తములలో నిమిడ్చి చెప్పఁబడిన దని తుద మున్న ఉపసంహారాత్మకమగు మూఁడు శ్లోకములలోఁ జెప్పఁబడినది; కాని "కోల్‌బ్రూక్" అను వానిచేతను, "విల్సన్" అను వానిచేతను జేయఁబడిన యింగ్లీషుభాషాంతరములలోఁ గూడి, బొంబాయిలో, రా. రా. తుకారామతాత్తి యాచే ముద్రింపఁబడిన పుస్తకములో మూలవిషయమునై నఱువదితొమ్మిది యార్యలు

నగుణుఁడగు నీశ్వరుఁడు, కాలము, లేక, స్వభావము ననునవి యన్నియు, వ్యక్తము లగుటచే నవ్యక్తమగు ప్రకృతియందుండి

మాత్రమే యుండెను. అప్పుడు చెప్పబడియవ శ్లోక మేది యని 'విల్సన'కు శంక కలిగెను. కాని యీ శ్లోక మాతనికి లభింపనందున నా సందేహ మటులే విలిచి యుండెను. ఈ లభింపని యార్యావృత్తము ప్రస్తుతమం దున్నవానిలో నఱువది యొకటవ శ్లోకమునకుఁ దరువాతిదై యుండవలయునని నా యభిప్రాయము. అఱువది యొకటవ శ్లోకము పై మన్న గౌడపాదాచార్యులుగారి భాష్యము రెంటికిఁ గలదు. మఱియు (161) ఈ భాష్యమునందలి ప్రతీకము లగు పదములఁ దీసి కూర్చు మేమి—

కారణ మీశ్వర మేకే ప్రబువతే కాలం వరే స్వభావం వా,
ప్రజాః కథం నిర్గుణతో వ్యక్తిః కాల స్స్వభావశ్చ.

అని యగును. ఇది పూర్వోత్తర సందర్భములను సైతము సమన్వయించియే యున్నది. ఈ యార్య విరీశ్వరమతమును ప్రతిపాదించుచు గావ, వెనుకటి వార లలో నెవరో తీసివైచినటుల తోఁచుచున్నది; కాని మూలశ్లోకములలో జ్ఞాతృ శోధన (అవఁగాఁ జదు మేమి రావివాఁదని తెలియక మామగారు తన యల్లుని దాటియాకులలో వ్రాసిన గ్రంథమునకు హరికాశము (కవ్వ) పెట్టు మనఁగాఁ ఆ మూర్ఖుఁడు ఆ పుస్తకములోని గ్రంథము వ్రాయనట్టి యాకులకు సైతము హరిద్రశము పూసెనఁట. ఇట్టి దానికి జ్ఞాతృశోధ యందురు) చేయు పీ బుద్ధిమంతుఁడా శ్లోకమునొక్క భాష్యమున సైతము తీసివైచుటకు మఱచినందున మనము శోధించి యా శ్లోకమున గనిపెట్టఁ గలిగితిమి. కాని యా జ్ఞాతృశోధకుని మన మిపు డుపకారిగ నెన్నవలయును. పూర్వము కొందఱు స్వభావమును, మఱికొందఱు కాలమును జగత్కారణముగఁ దలఁచుచుండ, వేదాంతు లందఱి కన్న నెక్కువ లోఁతుగ విమర్శించి 'ఈశ్వరుఁడు జగత్కారణ' మని చెప్పిరి. ఇది 'శ్వేతాశ్వతరోపనిషత్తు'లోని యాఱవయధ్యాయ మందలి తొలిమంత్రము వలనఁ దెలియుచున్నది. ఈ మంత్ర మేమన ఓ—

స్వభావ మేకే కవయో వదన్తి కాలం తథాఽన్యే పరిముహ్యమానమ్,
దేవ స్యైషా మహిమా తు లోకే యేనేదం భ్రామ్యతే బ్రహ్మచక్రమ్.

కాని, యీ మూఁడు మూలకారణములను సాంఖ్య లొప్పుకొన రని తెలియఁజేయుటకే సైఁ జెప్పిన యార్యావృత్తమును, ఈశ్వరకృష్ణుఁ డఱువది రెండవదానిగా వ్రాసెను.

వెలువడు వ్యక్తపదార్థమునందె యవి చేరును. ఈశ్వరుఁడు నిర్గుణుఁ డని యున్నను సత్కార్యవాదానుసారముగ, నిర్గుణమగు మూలతత్త్వ మందుండి త్రిగుణాత్మకమగు ప్రకృతి యేనాఁడును పుట్టునేరదు; కాని 'ప్రకృతియు, పురుషుఁడు' నను రెండుపదార్థములకంటె నీ సృష్టి యందు మూఁడవది యగుకారణ మేదియు లేదని వారిచే సిద్ధాంతీక రింపఁబడియున్నది. ఈ రీతిగ రెండుమూలతత్త్వములను నిశ్చయించిన పిదప నా రెండుపదార్థముల నుండియు సృష్టి యెటులఁ గలిగిన దను విషయమును తమ మతము ననుసరించి వారు వ్యవస్థ చేసిరి. నిర్గుణ పురుషుఁడు స్వయముగ నేమి చేయుటకు సమర్థుఁడు కాకపోయినను ప్రకృతికి నతనికి సంయోగ మగునేని, యాపు దూడకుఁ బాలిచ్చు నటులును, సూదంటురాతి సామర్థ్యముచే నినుమున కాకర్షణశక్తి వచ్చినటులును, మూలమగు నవ్యక్తప్రకృతి తన గుణములయొక్క (సూక్ష్ములు, స్థూలములు) వ్యక్తస్వరూపమును పురుషునియెదుటఁ జూపును (సాం. కా. 57). పురుషుఁడు నచేతనుఁడు జ్ఞాతయు నైనను, కేవలు (నిర్గుణు)ఁ డగుటచే నతని యొద్ద స్వయముగఁ గర్మలను జేయు సాధనము లేమియు లేవు. ప్రకృతి, కర్మలను జేయునది యైనను, జడము, లేక, యచేతన మగుటచే నే పని చేయవలయునో దానికిఁ దెలియదు. కావున గ్రుడ్డివాఁడును, కుంటివాఁడును కలిసిన పిదప, గ్రుడ్డివాని భుజము మీదఁ గుంటివాఁడు కూర్చుండుటచే నిరువురకును దారిసాగునటుల, జడప్రకృతికిని, నచేతనుఁ డగు పురుషునకును సంయోగము కలిగె నేని, సృష్టిలోని కర్మ ప్రారంభ మగును. (సాం.కా. 21) మఱియు నాటకములందు ప్రేక్షకుల మనో రంజనమునకై యే తీరున నొకానొక నటి కొంతసే పొక వేషమును మఱికొంతసేపు మఱియొక వేషమును ధరించి యాడునో, యటులనే పురుషునియొక్క లాభము కొఱకు (పురుషార్థముకొఱకు) పురుషుఁ డేమియు ప్రత్యుపకారము చేయకపోయినను, ప్రకృతి, నత్త్వరజ

స్తమోగుణములయొక్క హెచ్చుతగ్గులచే ననేక వేషములఁ దాల్చి పురుషునియెదుట నాట్యముఁ జేయుచుండును (సాం.కా. 59). ఈ ప్రకృతియొక్క నాట్యమును మఱచి, మోసముచేఁ గాని, లేక, వృథాభిమానముచేఁ గాని (గీ. 3.27) ప్రకృతియొక్క యీ కర్తృత్వ మును పురుషుఁడు తనపై ననవసరముగ వేసికొని సుఖదుఃఖము లను నుఱ్ఱాళ్ళతో నెంతవఱకుఁ దన్ను బంధించుకొను చున్నాఁడో, యంతవఱకు నతని కెప్పుడును మోక్షము లభింపదు; కాని యెప్పుడు త్రిగుణాత్మకప్రకృతి వేఱయినది యనియు, తాను వేఱయినవాఁడని యుజ్ఞానము పురుషునకుఁ గలుగునో, యప్పుడే యతఁడు ముక్తుఁ డగుచున్నాఁడు (గీ. 13.29-30; 14 20.) కారణ మేమి యన: ద్రష్ట (చూచువాఁడు) యగు పురుషుఁడు నిజముగఁ దొలుతనుండి కర్తయు బద్ధుఁడును గాఁడు. వాఁడు స్వతంత్రుఁడుగను, స్వభావముగనే యకర్తయు నై యున్నాఁడు. ఈ యున్నదంతయు ప్రకృతియొక్క కార్యము. వేయేల? మనోబుద్ధులు సైతము ప్రకృతియొక్క కార్య ములే యగుటచే బుద్ధిసంబంధమగు జ్ఞాన మంతయు ప్రకృతి చేయు పనుల ఫలమే యై యున్నది. ఈ జ్ఞానము, సాత్త్విక మనియు, రాజస మనియు, తామస మనియుఁ ద్రివిధముగ నున్నది (గీ. 18. 20-22). వానిలో బుద్ధికి సాత్త్వికజ్ఞానము కలిగె నేని "నేను వేఱు, ప్రకృతి వేఱు" అని తోఁచును. సత్త్వము రజస్సు తమ స్సనునవి మూఁడు గుణములును ప్రకృతిసంబంధములే కాని పురుషునివి కావు. పురుషుఁడు నిర్గుణుఁ డగుటచే త్రిగుణాత్మక ప్రకృతియే యతనికి సహా యముగ నున్నది (మ. భా. కాం. 204.8). ఈ సాహాయ్య మెప్పుడు స్వచ్ఛమయినది యగునో, అనఁగా: ప్రకృతి వికారమగు బుద్ధి యెప్పుడు సాత్త్విక మగునో, యప్పుడు 'నేను వేఱు, ప్రకృతి వేఱు' అని తన సత్యస్వరూప మీ స్వచ్ఛమగు నద్దమునందుఁ బురుషునకుఁ బ్రతిఫలింపును; ప్రకృతి లజ్జిల్లురాలువలె మరల నా పురుషుని

యెదుట నాట్యము నలుపదు. ఈ యవస్థ ప్రాప్తమగు నేని, సర్వ పాశముల నుండి ముక్తుఁడై స్వాభావికమగు కైవల్య పదమును బొందును. కైవల్య మనఁగా: కేవలత్వ (ఒంటరితనము, లేక, ప్రకృతి సంయోగము లేక యుండుట;) మని యర్థము. కావునఁ బురుషుని యీ నైష్ఠికస్థితినే సాంఖ్యశాస్త్రమునందు, మోక్ష (వదలుట) మని చెప్పుచున్నారు; కాని, యట్టి స్థితియందు "పురుషుఁడు ప్రకృతిని వదలునా? లేక, ప్రకృతియే పురుషుని వదలునా?" యను నొక సూక్ష్మమగు ప్రశ్న సాంఖ్యులచే నడుగఁబడినది. "భర్త కంటె భార్య యె ట్లైనదా?, లేక, భార్యకంటె భర్త పొట్టివాఁడా?" అని ప్రశ్న చేయుటవలె నీ ప్రశ్నయు నిరర్థక మని యనేకులకు స్ఫురించును. కారణ మేమి యన: రెండువస్తువులు వియోగమును జెందు నేని, యెది దేనిని వదలె నని విచారించుట నిష్ప్రయోజన మగుటచే రెండును బరస్పరము నడలించుకొని పోయె నని మన బుద్ధికి గోచర మగును; కాని, కొంత సూక్ష్మముగ విచారించితి మేని, సాంఖ్యుల యీ ప్రశ్న వారి యూహను బట్టి తప్పు కాదని తోఁచును. సాంఖ్య శాస్త్రానుసారముగఁ బురుషుఁడు, నిర్గుణుఁడు, నకర్తయు, నుదాసీనుఁడు నగుటచే, 'వదలిపెట్టుట,' లేక, 'పట్టుకొనుట' అను నీ క్రియలయొక్క కర్తృత్వ మా సిద్ధాన్తముం బట్టి పురుషున కుండ నేరదు (గీ. 13.31-32). కావునఁ గర్తృత్వ మనునది ప్రకృతి ధర్మ మగుటచేఁ బ్రకృతియే పురుషుని వదలి పోవుచున్నది. అనఁగా: ప్రకృతియే పురుషుని యందుండి తన్ను ముక్తురానిగఁ జేసికొను చున్నదని సాంఖ్యులచే సిద్ధాన్తీకరింపఁబడెను (సాం.కా. 62; గీ. 18-84). సారాంశ మేమి యన:- మోక్ష మన, వెలుపలినుండి పురుష నకు నంప్రాప్తమగు వేఱైన యవస్థ కానేరదు; పురుషునియొక్క స్వాభావికమగు మొదటి స్థితికంటె వేఱగు స్థితియును గానేరదు. ముంజగడ్డియొక్క చర్మము, లోపల నున్న కాఁడకంటె వేఱయినట్లును, లేక, నీటిలో నున్న నాఁచు నీటికంటె వేఱయినట్లును, ప్రకృతి

పురుషుల సంబంధమైయున్నది. ప్రకృతియొక్క గుణములచే మోహమును జెందిన సామాన్యపురుషుఁ డీ భేదమును గుర్తింపలేక సంసారమనెడు చక్రములోఁ దిరుగుచున్నాఁడు. కాని, యీ భేదము నెఱింగిన వాఁడే ముక్తుఁ డగును. అతనినే 'జ్ఞాత' (లేక, బుద్ధుఁడు) యనియు, 'కృతకృత్యుఁ' డనియు వచింతురని మహాభారతములోఁ జెప్పబడియుండుటచే (మ.భా.శాం. 194.58; 248.11; 306 308), ఈ "ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్" (గీ.15.20) అను గీతావచనమునందున్న బుద్ధిమచ్ఛబ్దమున కిదియె యర్థము. అధ్యాత్మశాస్త్రదృష్టితోఁ జూచినను మోక్షమున కిదియె నత్యన్వరూపమైయున్నది (వే.సూ.శాం.భా. 1.1.4). కాని, "పురుషుఁడు స్వభావముగనే కేవలుఁ" డనుటకు కారణము చెప్పక, "యాత్మ యాది యందుండియుఁ బరబ్రహ్మరూపుఁడగుటచే నతఁడు మూలభూతమగు రూపమును (అనఁగా: పరబ్రహ్మను) ఎఱుంగుటయే" 'మోక్ష' మనునదియే, సాంఖ్యుల వేదాంతముకంటె నద్వైతవేదాంతమందున్న విశేషవిషయము. సాంఖ్యవేదాంతముల యందున్న భేదము ముందుప్రకరణములో స్పష్టముగఁ దెలుపఁబడును.

పురుషుఁడు (ఆత్మ) నిర్గుణుఁడు, ఉదాసీనుఁడు, అకర్తయును సాంఖ్యమత మద్వైతులకుఁ బూర్ణముగ నిష్టమైన దైనను, ఒక ప్రకృతినే చూచువారును, స్వతంత్రులునగు పురుషులాదియందుండియు ననంత్యులున్నా రనెడి యీ పురుషుల సంఖ్యావిషయసంబంధమగు కల్పనను వేదాన్తులొప్పుకొనరు (గీ. 8.4; 13.20-22; మ.భా.శాం. 351; మఱియు వే.శాం.భా. 2.1.1). ఉపాధి భేదముచే జీవులు వేర్వేఱుగ వెలయుచున్నారు. వస్తుముగఁ జూచిన సర్వము బ్రహ్మమే యని వేదాన్తుల సిద్ధాన్తము; కాని, యేల ప్రతిమనుజుని యొక్క జన్మ మరణ సంసారము లనునవి వేర్వేఱుగ నున్నవో, ఎందుచేత, ఒకఁడు సుఖి మఱియొకఁడు దుఃఖి యను భేదము స్పష్టముగ కాన్పించుచున్నదో, యా కారణముల చేతనే ప్రతి యాత్మయు,

లేక, ప్రతిపురుషుఁడు ననాదిగ వేర్వేఱుగుటచే వారినంఖ్యయు ననంత మగును (సాం.కా. 18) సకల సృష్టికిని ప్రకృతి; పురుషుఁడు నను రెండును మూలతత్త్వములే; కాని, దానియందున్న పురుషశబ్దముచే ననంఖ్యలగు పురుషుల సముదాయము చెప్పఁబడు నని సాంఖ్యుల యొక్క యర్థమై యున్నది. ఈ యనంఖ్యులగు పురుషులయొక్కయు త్రిగుణాత్మక ప్రకృతియొక్కయు నంయోగముచే సృష్టియందున్న సర్వవ్యవహారములు నడుచుచున్నవి. ప్రతి పురుషునకును ప్రకృతికిని సంయోగ మగునేని ప్రకృతి తన గుణములయొక్క వ్యాప్తి నా పురుషుని యెదుటఁ బెట్టును. పురుషుఁడుదాని నుపభోగించును. ఇట్లు జరుగఁగా జరుగఁగా నే పురుషునకుఁ జుట్టునున్న ప్రకృతి సాత్త్విక రూపమగునో, యా పురుషునకే (అందఱకుఁగాదు) నిజమగు జ్ఞానము కలుగును. ఆ జ్ఞానము పూర్ణముగఁ గలిగిన పిదప, ప్రకృతియొక్క నాట్య మాఁగుటచే, తన మూలభూతమగు కైవల్యస్వరూపమును బొందుచున్నాఁడు; కాని, యతనికి మోక్షము లభించినను, మిగిలిన వానికి నంసారము నడచుచునే యుండును. పురుషుఁ డీ రీతిఁగ కైవల్యస్వరూపమును బొందెనేని, యా క్షణమునందె యా పురుషుఁడు ప్రకృతి పాశమునుండి ముక్తుఁడై యుండవలయునని యెవరికైనను దోఁపవచ్చును; కాని, సాంఖ్యమతానుసారముగ నట్లు కానేరదు. ప్రకృతివికారములగు దేహేంద్రియములు మరణపర్యంత మతనిని వదలవు. అట్లగుటకుఁ గారణ మేమి యన: "ఎట్లు, కుమ్మరియొక్క చక్రముపై కుండ సిద్ధమయి తీసివేయఁబడినను, పూర్వసంస్కారాను సారముగఁ జక్రము కొంతసేపు తిరుగుచుండునో, యట్లే కైవల్యమును జెందిన పురుషునియొక్క శరీరము కొన్ని దినములు మిగిలి యుండునని సాంఖ్యులు చెప్పెదరు (సాం. కా. 67). అయినను కైవల్యముఁ జెందిన పురుషునకు నా శరీరము వలన నేమి యాటంకమును నుఖదుఃఖములయొక్క బాధయు నుండనేరదు. కారణ మేమి యన: జడప్రకృతియొక్క వికారమగు దేహము సైతము జడ మగు

టుచే సుఖదుఃఖములు రెండును దానికి సమానములుగనే యుండును. మఱియు సుఖదుఃఖములు పురుషుని వని చెప్పవలసివచ్చెనేని 'ప్రకృతి యొక్క వ్యవహారమును, దానును వేఱగుటచే సర్వకర్తృత్వములు ప్రకృతివే కాని తనవి కావు' అను నీ తత్త్వము నా పురుషుఁ డెఱింగి నందునఁ బ్రకృతి యెంత నాట్యము చేయుచున్నను తా నుదాసీనుఁడు గనే యుండును. ఏ పురుషుఁడు ప్రకృతియొక్క గుణత్రయమునుండి ముక్తుఁడయి జ్ఞానమును బొందఁడో, యతనికి జననమరణప్రవాహము తప్పదు; కాని సత్త్వగుణాధిక్యముచే దేవయోనియందును, రజో గుణాధిక్యముచే మానవయోనియందును, తమోగుణప్రాబల్యముచే పశువులయందును పుట్టును (సాం.కా. 44.54). ప్రతి మనుజునకును చుట్టునున్న ప్రకృతి (అనఁగాఁ స్వబుద్ధి) యందున్న సత్త్వరజస్తమ ములయొక్క హెచ్చుతగ్గులచే జననమరణరూపమగు సంసారచక్ర ఫలము నతఁడు పొందును. "ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థాఃఁ"– సాత్త్విక వృత్తికలిగిన పురుషులు స్వర్గమునకుఁ బోదురు. మఱియు తామస పురుషుల కధోగతి ప్రాప్తమగు నని సైతము గీతలలో చెప్పఁబడినది (గీ. 14.18). కాని, యీ స్వర్గాధిఫలము లనిత్యములు. జననమరణ ములనుండి ముక్తుఁడు గావలయునని తలఁచె నేని, లేక, సాంఖ్యపరి భాషానుసారముగఁ బ్రకృతికంటె నుండు తన భేదమును, కైవల్య మును, స్థిరముగ నుంచవలయు నని తలంచె నేని, త్రిగుణాతీతుఁడై విరక్తు (సన్యస్తుఁ) డగుట దక్క నతనికి వేఱొండు మార్గ మేదియు లేదు. కపిలాచార్యులగారి కీ జ్ఞానమును, వైరాగ్యమును బుట్టకతోడనే సంప్రాప్తములైనవి. కాని, యెల్లరకు నిట్టి స్థితి పుట్టుకతోడనే కలుగుట దుర్లభము. కావున తత్త్వవివేక రూపమగు సాధనముచే ప్రకృతి పురుషుల నడుమనుండు భేదము నెఱింగి, తన బుద్ధిని శుద్ధము చేసి కొనవలయు నని ప్రతిమనుజుఁడును ప్రయత్నింపవలయును. ఈ ప్రయత్నముచే బుద్ధి సాత్త్వికమగు నెడల, వెంటనే జ్ఞానము, వైరాగ్యము, ఐశ్వర్యము అను గుణములు పుట్టుటచే తుదకు మనుజు

నకుఁ గైవల్యప్రాప్తి యగును. ఈ స్థలమునం దైశ్వర్య శబ్దమునకు, 'ఇచ్ఛయించిన పదార్థముల నెల్లఁ బొందుటకుఁ దగినయోగ సామర్థ్య' మని యర్థము. సాంఖ్య మతానుసారముగఁ గర్మము సాత్త్విక గుణములలోనే చేరును; కాని కేవల ధర్మముచే కేవల స్వర్గమే ప్రాప్త మగును. జ్ఞానవైరాగ్య (సన్యాస) ములచే, మోక్షమును, లేక, కైవల్య మును బొందిన పురుషులయొక్క దుఃఖములు అత్యంతికముగ నివర్తించునని దాని యందున్న కడపటి భేదము కపిలాచార్యులచే నిరూపింపఁబడినది.

దేహేంద్రియబుద్ధులలో మొదట సత్త్వగుణ మధిక మగుటచే నంతకంతకు శ్రేష్ఠుఁ డగుచుఁ దుదకు 'త్రిగుణాత్మక ప్రకృతి వేఱు, తాను వే' ఱను జ్ఞానము నొందిన పురుషుఁడు 'త్రిగుణాతీతుఁడు', అనఁగా: సత్త్వరజస్తమస్సు లను మూడు గుణములకు దూరముగ నుండువాఁడని సాంఖ్యులు చెప్పుచున్నారు. ఈ త్రిగుణాతీతావస్థలో సత్త్వరజస్తమోగుణములలో నే గుణమును శేషించియుండదు. కావున సూక్ష్మదృష్టితో విచారించిన, సాత్త్వికము, రాజసము, తామసము నను మూఁడు స్థితులకంటె నీ స్థితి వేఱుగనే యున్నదని యొప్పు కొనవలసివచ్చును. ఈ యభిప్రాయము మనస్సున నుంచుకొనియే భక్తిని, సాత్త్వికము, రాజసము, తామసము నని విభజించి యీ గుణత్రయాతీతుఁడగు పురుషుఁడు నిర్హేతుకముగ నభేదభావముతోఁ జేయు భక్తికి నిర్గుణభక్తి యని నామవిపేరు పెట్టఁబడినది(భాగ.శి 25; 7.14). కాని, సాత్త్వికము, రాజసము, తామసము నను నీ వర్గీకరణము కన్న నధికమగు వర్గీకరణములోఁ బ్రయత్నించుట యుక్తము కానేరదు. కావుననె సత్త్వగుణముయొక్క యత్యంతోత్కర్షచేతనే, తుదకు త్రిగుణాతీతావస్థ ప్రాప్తమగు నని యంగీకరించి సాత్త్వికవర్గమునందే దీనిని సాంఖ్యశాస్త్రజ్ఞులు చేర్చుచున్నారు. గీతయందు నా పద్ధతియే స్వీకరింపఁబడినది. ఉదాహరణము: 'ఉన్న

దంతయు నొకటే' యను నభేదాత్మక జ్ఞానమే సాత్త్విక మగునని గీతలో: జెప్పఁబడినది (గీ. 18. 20); గీతలలో నత్త్వగుణమును వర్ణించుచుఁ త్రిగుణాతీతావస్థ పదుమూఁడవ యధ్యాయములోఁ దుదకు వర్ణింపఁబడినది; కాని, ప్రకృతిపురుషులను నీ ద్వైతము భగవద్గీతలయం దొప్పుకొనఁబడకపోవుటచే నా గీతలలో 'ప్రకృతి, పురుష, త్రిగుణాతీత' మొదలగు సాంఖ్యుల పారిభాషికశబ్దము లన్ని చోట్లను గొంచెము భిన్నమగు నర్థమున నుపయోగింపఁ బడినవి. అనఁగా: సాంఖ్యులయొక్క ద్వైతముపై నద్వైతపరబ్రహ్మముయొక్క యాచ్ఛాదన గీతలలో స్థిరముగనే సిద్ధాన్తీకరింపఁబడిన దని యెఱుంగ వలయును. ఉదాహరణము: సాంఖ్యులయొక్క ప్రకృతిపురుషభేదమే పదుమూఁడవ యధ్యాయమున గీతలలోఁ జెప్పఁబడినది (గీ. 13. 19 24); కాని, యక్కడనుండు ప్రకృతి పురుషశబ్దములు క్షేత్రక్షేత్రజ్ఞ శబ్దములకు సమానార్థకములుగనే యున్నవి. అటులె పదునాలవ యధ్యాయమునందున్న త్రిగుణాతీతావస్థయు, త్రిగుణాత్మకయగు మాయయొక్క వ్యాప్తినుండి వదలఁబడి, ప్రకృతి పురుషులకంటె నతీతుఁడగు పరమాత్మ నెఱుఁగు సిద్ధపురుషుని దని చెప్పఁబడినది. ప్రకృతియు, పురుషుఁడు ననుసీ రెండును వేఱగు తత్త్వము లనియు, 'పురుషునకుఁ గైవల్యము', అనఁగనే త్రిగుణాతీతావస్థయని యంగీకరింపవారు సాంఖ్యులు గారు. అధ్యాత్మ ప్రకరణమున నీ భేదమును స్పష్టముగఁ జూపించెదను; గాని, గీతలలో నధ్యాత్మపక్షమే ప్రతిపాద్యమైనను, అధ్యాత్మతత్త్వముఁ జెప్పుట సాంఖ్యపరిభాషను గాని, సాంఖ్యవాదమును గాని ప్రతి దిక్కున నుపయోగించి యుండుటచే గీతలు చదువుచున్నపుడు శుద్ధసాంఖ్యులమతమే గీతలలో గ్రహింపఁ దగి యున్నదని భ్రమాత్మకజ్ఞానము పుట్టుట కవకాశ ముండును. కావున సాంఖ్యశాస్త్రమున నుండు సిద్ధాన్తములకును గీతయందున్న సాంఖ్యసిద్ధాన్తములకు నున్న భేద మిచ్చో కొంచెము చెప్పఁబడినది.

ప్రకృతి పురుషులకు దూరమున పరబ్రహ్మరూపమగు నొక మూలభూత జగత్తత్త్వ మున్నదనియు దానినుండి ప్రకృతిపురుష లెల్లరు సృజింపఁబడి రను నీ యుపనిషత్తులయం దున్న యద్వైతసిద్ధాన్తమున కనుకూలమయినవి దక్క నితర సాంఖ్యసిద్ధాన్తము లఙ్గీకార్యము లని వేదాన్తసూత్రభాష్యమునందు శ్రీ శంకరాచార్యులు వచించినారు. (వే.సూ.శాం.భా. 2.1.౪). గీతలయందలి యుపపాదనయు నిటులే యున్నది.

ఇది కాపిలసాంఖ్యశాస్త్రము లేక క్షరాక్షరవిచారము
అను పఞ్చమప్రకరణము.

—

అష్టమ ప్రకరణము

విశ్వముయొక్క సృష్టిసంహారములు

గుణా గుణేషు జాయన్తే తత్రైవ నివిశన్తి చ*

మహాభారత, శాంతి. 305. 28.

కాపిలసాంఖ్యము ననుసరించి జగత్తుయొక్క స్వతంత్రమైన మూలతత్త్వము లగు ప్రకృతి పురుషులయొక్క స్వరూపమును, ఈ రెంటికిని సంయోగ మను నిమిత్త కారణము పుట్టిన పిదప పురుషుని యెదుట ప్రకృతిచే ప్రదర్శింపఁబడిన స్వీయగుణముల యాపణ (దుకాణ)ము నందుండి యతఁ డెట్లు ముక్తుఁడు గావలయు ననునంశమును, వివేచింపఁబడినవి; కాని యీ ప్రకృతియొక్క యాపణము, లేక, నాట్యము 'సంసారరూపమగు కొట్టు' అని యొక మహారాష్ట్ర కవి స్పష్టముగఁ జెప్పినాఁడు. దానినే జ్ఞానేశ్వరమహారాజు గారు 'ప్రకృతియొక్క టుంకసాల' యని చెప్పుచున్నారు. ఆ ప్రకృతియొక్క సంసారము, అనఁగాఁ ప్రకృతి యే ఏకమున పురుషుని యెదుట వ్యాపించునో దానియొక్క లయ మెట్లు లగునో యా విషయమింకను బాగుగ వివరింపఁబడలేదు. కావున నీ ప్రకరణమునందు దానిని విచారించుదున్నాఁడను. ప్రకృతియొక్క యీ వ్యాపారమునే "విశ్వముయొక్క సృష్టియుసంహారము" నని చెప్పుచున్నారు. కారణ మేమన: ఈ జగత్తంతయు, లేక, సృష్టియంతయు సాంఖ్యమతాను

---

* గుణములయందే గుణములు పుట్టుచున్నవి. వానియందే లయమును పైతము పొందుచున్నవి.

సారముగ ననంఖ్యులగు పురుషులయొక్క లాభముకొఱకే ప్రకృతిచే నిర్మింపఁబడినది. ప్రకృతిచే సర్వబ్రహ్మాండము నెటుల సృజింపఁబడిన దను విషయము 'దానబోధ' లో రెండు మూఁడు స్థలములందు నర సముగ 'సమర్థుని'చేఁ జెప్పఁబడినది; కాని యందుండియే విశ్వము యొక్క 'ఉభారజీ(సృష్టి)' 'సంహారజీ (లయము)' అను శబ్దముల నేను గైకొంటిని. అటులే భగవద్గీతలయొక్క, యేడవ యెనిమిదవ యధ్యాయములలో నీ విషయమే ముఖ్యముగ నిరూపింపఁబడుటచే, పదునొకండవ యధ్యాయముయొక్క యారంభమున-"భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశో మయా"-భూతములయొక్క సృష్టి లయములు నీచేత విస్తారముగఁ జెప్పఁబడినవి. నాచేత వినఁబడినవి. ఇప్పుడు నాకు నీ విశ్వరూపమును జూపి కృతార్థునిఁ జేయుము (గీ. 11. 2) అని యర్జునుఁడు భగవంతుఁడగు శ్రీకృష్ణుని ప్రార్థించుట వలన, విశ్వముయొక్క సృష్టిసంహారములు క్షరాక్షరవిచారముల యొక్క ముఖ్యభాగములే యని స్పష్ట మగుచున్నది. సృష్టియందలి యనేకములగు (నానా) వ్యక్తపదార్థములలో నొక్కటియే యవ్యక్త మగు మూలద్రవ్య మున్నదని యెఱుంగుట జ్ఞానము (గీ. 18. 10). ఒక మూలభూతమగు నవ్యక్తద్రవ్యము నుండియే వేర్వేఱగు ననేక వ్యక్తపదార్థములు ప్రత్యేకముగ నెట్లు నిర్మింపఁబడిన (గీ. 13. 30) వని యెఱుంగుట విజ్ఞానము; దానియందు క్షరాక్షరవిచారము చేరి యుండుటయే గాక, క్షేత్రక్షేత్రజ్ఞ జ్ఞానము సధ్యాత్మము నను విష యములును దానియందే చేరుచున్నవి.

భగవద్గీతానుసారముగఁ బ్రకృతి తన సంసారమును నడపిం చుటకు సమర్థ మయినది కాకపోవుటచే నీ కార్యము పరమేశ్వరేచ్ఛ చేతనే నడచు చున్నదని చెప్పఁబడినది (గీ. 9. 10); కాని, ప్రకృతి స్వతంత్ర యని కపిలాచార్యులు చెప్పినటుల నిదివఱకే చెప్పితిని. సాంఖ్యశాస్త్రానుసారముగఁ బురుషునియొక్క సంయోగ మను నిమిత్త

కారణమే ప్రకృతియొక్క సంసారారంభమునకుఁ జాలును. ఈ విషయములోఁ బ్రకృతి మఱియొక దాని నపేక్షించదు. ప్రకృతి పురుషులకు సంయోగ మగునేని దానియొక్క టంకసాల ప్రారంభమగును. వసంతర్తువునం దే తీరున వృక్షములకు చిగుళ్ళు పుట్టి క్రమక్రమముగ పత్ర పుష్ప ఫలములు పుట్టునో (మ.భా.శా. 231.73; మను. 1.80), అటులే ప్రకృతియొక్క యాదిసామ్యావస్థ భంగ మగుటచే దాని గుణములు విస్తరిల్లు నని సాంఖ్యులు వచించుచున్నారు. వేదసంహితయందు, నుపనిషత్తుందుఁ, స్మృతులయందు నా ప్రకృతిని మూలమని యనక, దీనికి వ్యతిరేకముగ పరబ్రహ్మము మూలమని నచించి, దానియందుండి "హిరణ్యగర్భ స్సమవర్త తాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్"- ముందు హిరణ్యగర్భుడు పుట్టెను (ఋ. 10 121. 1). ఈ హిరణ్యగర్భుని యందుండి సర్వసృష్టియును బుట్టినది (ఋ 10 72; 10. 190). లేక, మొదట ఉదక ముత్పన్న మయినది (ఋ. 10.82.6; తై బ్రా. 1.1.3/; ఐ.ఉ. 1.1.2). దాని యందుండి సృష్టి. లేక, యీ యుదకమునం దొక యండము పుట్టి దాని యందుండి బ్రహ్మదేవుఁడు, బ్రహ్మదేవునియందుండి, లెక, మూలమగు నండము నుండియే జగత్తంతయు గలిగెను (మను. 1.8-13; భాం. 3.19); లేక, యీ బ్రహ్మదేవుఁడే (పురుషుఁడు) సగముభాగము స్త్రీ యాయెను (బృ 1. 4. 3; మను. 1. 32); లేక, జలోత్పత్తికి ముసుపే పురుషుఁడుండెను (కఠ.ఉ.4.6). పరబ్రహ్మమునుండి మొదట తేజస్సు, జలము, పృథ్వి (అన్నము) యను నీ మూఁడుతత్త్వములే పుట్టి వానియొక్క కలయికచేతనే పిదప నకల పదార్థములు నిర్మింపఁబడినవి (భాం.6.26) అని జగదుత్పత్తి యనేక విధములుగఁ జెప్పఁబడినది. అయిన నాత్మ రూపమగు మూలబ్రహ్మమునందుండియే యాకాశాది పంచమహాభూతములు క్రమముగ వెలువడినవని (తై. ఉ. 2.1) తుదకు వేదాన్తసూత్రములలో సిద్ధాన్తికరింపఁబడినది (వే.సూ. 2.3.1-15). ప్రకృతి,

మహత్తు మొదలగు తత్త్వములును కఠ (3. 11), మైత్రాయణీ (60. 10); శ్వేతాశ్వతరములు (4. 10; 6. 16) మొదలగు నుపనిషత్తులలో స్పష్టముగనే చెప్పఁబడినవి. వేదాన్తులు ప్రకృతిని స్వతంత్ర యసి యొప్పుకొనక పోయినను శుద్ధబ్రహ్మమునందే మాయాత్మకప్రకృత యను నీ వికార మొకసారి కనఁబడిన పిదప, తర్వాత నున్న జగత్తు యొక్క యుత్పత్తిక్రమ విషయమై వారికిని సాంఖ్యులకును దుద కేక వాక్యత యయిన దని దీనివలనఁ గాన్పించుచున్నది. ఈ కార ణముచేతనే యితిహాసములందును, పురాణములందును, నర్థశాస్త్రము మొదలగు వానిలో నున్న జ్ఞాన మంతయు సాంఖ్యము నందుండియే వచ్చినదని మహాభారతమునందుఁ జెప్పఁబడినది(శాం.301.108.109) ఇటు లనుటచే నీ జ్ఞానము వేదాన్తులకుఁ గాని, పౌరాణికులకుఁ గాని కపిలుని వలననే కలిగిన దని యర్థము కానేరదు. సృష్టియొక్క యుత్పత్తి జ్ఞాన మంతట నొక తీరుననే యున్నదని మాత్రమే దీని యభిప్రాయము. వే యేల? సాంఖ్యశబ్దము జ్ఞానమను వ్యాపకార్థమునందే యిక్కడఁ బ్రయోగింపఁబడిన దనియుఁ జెప్పనచ్చును. అయినను శాస్త్ర మీ దృష్టితో సృష్ట్యుత్పత్తి క్రమముయొక్క సంబంధము విశేషపద్ధతి మీఁదఁ గపిలాచార్యులచేఁ జెప్పఁబడినందున, భగవద్గీత లందును నీ సాంఖ్యక్రమమే ముఖ్యముగ స్వీకరింపఁబడియున్నది. కావున దానినే యీ ప్రకరణమునందు వివేచన చేయుచున్నాఁడను.

ఇంద్రియముల కగోచరమును (అనఁగా: అవ్యక్తము), సూక్ష్మమును, ఏకవిధమును నై నలుగడల నఖండముగ వ్యాపించియున్న నిరవయవ మగు నొక మూలద్రవ్యమునే సర్వమగు వ్యక్తసృష్టియు నుత్పన్నమయిన దను నీ సాంఖ్యసిద్ధాన్తము పాశ్చాత్యుల దేశమందున్న యర్వాచీనాధిభౌతికశాస్త్రజ్ఞుల కిష్టమైనదియే. ఇంతియె కాక, యీ మూలద్రవ్యమం దున్న శక్తి క్రమక్రమముగ వృద్ధియగుచున్నదనియు, ఈ పూర్వాపరక్రమము, లేక, సరణిని వదలి, నడుమనే

చిన్న మొక్కవలె నిర్మాణము కాలే దనియు, వారిచే నిప్పుడు నిశ్చ యింపఁబడినది. ఈ మతమునే 'ఉత్క్రాంతివాద' మని నుడివెదరు. పాశ్చాత్యులరాష్ట్రమునందు గత శతాబ్దములో ముమ్మందు శోధించి యీ సిద్ధాన్తమును దెలిసికొన్నప్పు డక్కడ మహాకలహము వాటిల్లెను. దేవునిచే పంచమహాభూతములును, జంగమకోటియందున్న ప్రత్యేక ప్రాణిజాతియు వేర్వేఱు సమయములందు వేర్వేఱుగను, స్వతంత్ర ములుగను నిర్మింపఁబడిన వను మతమునే, ఈ యుత్క్రాంతివాదము వెలువడుటకు పూర్వము క్రైస్తవు లెల్లరు సత్యముగ నమ్మిరని క్రైస్తవ మత పుస్తకములలో నున్నది. కావుననే యుత్క్రాంతివాదముచే నీ సిద్ధాన్తము తప్పని నాలుగు మూలల వ్యాపించినప్పుడు నలుదెసల నుండియు నుత్క్రాంతివాదుల కోలాహల మెక్కువై నేఁటికిని కొద్ది గనో గొప్పగనో జరుగుచునే యున్నది. అయినను శాస్త్రీయమగు సత్యముయొక్క బల మధిక మగుటచే సృష్టియొక్క యుత్పత్తి విషయ ములో నిప్పుడు నకల విద్వాంసులకు నధికాధికముగ నది యిష్టముగ నున్నది. ఈ మతానుసారముగ "సూర్యమాలయందు మొదట నొక విధమగు సూక్ష్మద్రవ్య ముండెను. దాని నడకయొక్కయో, లేక, యుష్ణముయొక్కయో, పరిమాణము కొంచెము తఱుగుటచే నా ద్రవ్యము విశేషముగఁ జెదరినందున భూమియు, సర్వగ్రహములును క్రమక్రమముగ నిర్మితము లైనవి; సూర్యఁ డనునది తుదకు శేషించిన యంశముగ నున్నది. పృథ్వి యనునది తొలుత సూర్యునివలె వేఁడి యగు నొక ముద్దగా నుండెను. దానియందున్న యుష్ణత క్రమ ముగాఁ దఱుగఁగా మూలద్రవ్యములోఁ గొంత పలుచగను, కొంత గట్టిగను నయినది. దానియందు, పృథ్వికైనున్న వాయువును, జల మును, వానిక్రింద భూమి యను నొక ముద్దయు వెలువడినది. పిదప నీ మూఁటియొక్క సంయోగముచేతనే సజీవ నిర్జీవసృష్టి యంతయు వెలువడినది" అని పాశ్చాత్యులు చెప్పుదురు. 'డార్విన్' మొదలగు

పండితులు మనుష్యులు సైత మిటులే చిన్న చిన్న కీటకముల యం దుండి క్రమముగ వృద్ధిఁ బొందుచున్నారని నిరూపించిరి. అయిన నాత్మయను భిన్నముగు నొక మూలతత్త్వము నంగీకరింపవలయునా? లేదా? యను విషయమయి యీ యాధిభౌతికవాదులకును నాధ్యా త్మికవాదులకును నిప్పటికిని విశేషముగు మతభేద మున్నది. 'హెకెల్' వంటి కొందఱు పండితులు జడమునుండియే వృద్ధినొందుచు నాత్మ-చైతన్యము లుత్పన్నము లైనవని యంగీకరించి జడాద్వైతము నిరూ పించు చున్నారు. దీనికి విపరీతముగ "మనకుఁ గలుగు సృష్టిజ్ఞాన మంతయు మన యాత్మసంబంధమగు నేకీకరణవ్యాపారముయొక్క ఫలమగుటచే నాత్మయొక్క స్వతంత్ర తత్త్వ మని యంగీకరించుట యావశ్యకము" అని కాంటు వంటి యధ్యాత్మజ్ఞానులు నుడువుచు న్నారు. కారణ మేమి యన:- బాహ్యసృష్టి నెఱుంగు నాత్మ తనకే గోచరమగు సృష్టియొక్క యొక భాగమై యున్న దని, లేక, యీ సృష్టినుండియే యిది యుత్పన్న మైన దని చెప్పుట తన భుజముపైఁ దా నాసీనుఁ డయ్యె నని చెప్పిన ట్లుండును. కావున హేతువాదముచే నీ పలు కొప్పఁదగినది కాకపోవును. ఈ కారణముచేతనే సాంఖ్య శాస్త్రమునఁ బ్రకృతి పురుషు లను నీ రెండు తత్త్వములును స్వతంత్ర ములుగ నంగీకరింపఁబడినవి. కావున నాధిభౌతిక సృష్టిజ్ఞాన మెంత వృద్ధినొందినను సృష్టియందున్న మూలతత్త్వముయొక్క స్వరూప వివేచన తప్పక వేర్వేఱు పద్ధతులచేఁ గావింపఁబడవలయు నని నేఁటి కిని గొప్ప పాశ్చాత్యపండితులు చెప్పుచున్నా రని సారాంశము. కాని యొక జడప్రకృతియందుండి సర్వవ్యక్త పదార్థములు నే క్రమమున వెలువడినవని మాత్రము విచారించితి మేని, పాశ్చాత్యుల యుత్క్రాంతి మతమునకును, సాంఖ్యశాస్త్రమునందు వర్ణితమైన ప్రకృతియొక్క వ్యాప్తిని గుఱించిన తత్త్వమునకును, విశేష భేద మేమియు లేదని చదువరులకుఁ దోఁచును. కారణ మేమన: అవ్యక్తమును, సూక్ష్మమున-

ఏకరూపము నగు మూలప్రకృతి యందుండియే క్రమక్రమముగ (సూక్ష్మము, స్థూలమునయిన) బహు విధమగు వ్యక్తసృష్టి నిర్మాణ మైనది" అను నీ ముఖ్యసిద్ధాన్త మిరువురకు నేకరీతిగనే సమ్మతముగ నున్నది. కాని యాధిభౌతికవిజ్ఞాన మిప్పుడు విశేషముగ వృద్ధినొందు టచే 'సత్త్వరజస్తమస్సు'లను నీ సాంఖ్యులయొక్క మూఁడు గుణ ములకు మాఱుగ నర్వాచీనులగు సృష్టికారులచే, గతి, ఉష్ణత, లేక, యాకర్షణశక్తి యను గుణములే ప్రధానముగ నంగీకరింపఁ బడినవి. సత్త్వరజస్తమస్సు లనెడు త్రిగుణములయొక్క హెచ్చు తగ్గు లనుట కంటె, గతి, యుష్ణత లేక, యాకర్షణశక్తి యను వాని హెచ్చుతగ్గు లనుటచే నాధిభౌతికశాస్త్రజ్ఞులకు శీఘ్రముగఁ దెలియు ననుమాట సత్యమే. అయినను-"గుణా గుణేషు వర్తంతే"(గీ. 3 28)అని చెప్పఁ బడిన గుణముల సంబంధమగు వ్యాప్తియొక్క, లేక, గుణోత్కర్ష యొక్క, తత్త్వము రెండు పక్షములందును సమానముగనే యున్నది. గడియారపుఁ జక్రమును గదలించితి మేని యది యే రీతిగ మెల్ల మెల్లగ విప్పుకొని బాహుళ్యము నొందునో, యటులే సత్త్వరజస్తమో గుణ ములయొక్క సామ్యావస్థయందుఁ బడిన ప్రకృతి యను గడియారము మెల్ల మెల్లగ సడలుచు నడచె నేని సర్వవ్యక్తసృష్టి నిర్మాణమగు నని సాంఖ్యమునందుఁ జెప్పఁబడినది. దీనికిని, ఉత్క్రాంతివాదమునకును వాస్తవముగ నే భేదమును లేదు. అయిన నీ గుణోత్కర్షతత్త్వము క్రైస్తవధర్మములవలె తిరస్కరింపఁబడక, గీతలయందు నుపనిషదాది వైదిక గ్రంథములందు నక్క డక్కడ నద్వైతవేదాంతము వలెనె యవిరోధముగ స్వీకరింపఁబడె ననుట నీ భేదము తాత్త్వికధర్మదృష్టిచే నెఱింగఁ దగియున్నది.

అది యట్లుండ నిమ్ము; ప్రకృతి యను నంకురము వృద్ధినొందు క్రమసంబంధ విషయమయి సాంఖ్యశాస్త్రకారులు చెప్పిన దిప్పుడు విచారింతము. ఈ క్రమమునే గుణోత్కర్షవాదము, లేక, గుణపరి

ణామవాద మని నుడువుచున్నారు. ఏ కార్యము నైన నారంభింపక పూర్వమే 'నే నీ కార్యమును జేయుదును' అని మనుజుఁడు నిశ్చయించి యుండును. లేక, వాని కది యెనర్చుటకు బుద్ధి పొడము నని యెవ్వరికిని చెప్పనక్కఱ లేదు. వేయేల? ఉపనిషత్తులయందు సైతము మూలభూతమగు నొక పరమాత్మకు "మనము పెక్కు మందిగ నగుదుము" "బహుస్యాంప్రజాయేయ"- అని సంకల్పముదయించిన పిదప సృష్టియైన దని చెప్పఁబడినది (ఛాం. 6.2.3; తై. 2.6). ఇటులె యవ్యక్తప్రకృతి యైనను స్వీయమగు సామ్యావస్థను వదలి వ్యక్తసృష్టిని నిర్మించుటకొఱకు నాదిలో నిశ్చయించుచున్నది. నిశ్చయ మనఁగా- వ్యవసాయము. దానింజేయుట బుద్ధికి లక్షణ మయి యున్నది. కావుననే ప్రకృతియందు వ్యవసాయాత్మక బుద్ధి యాదియం దుత్పన్న మగునని సాంఖ్యులచే సిద్ధాన్తికరింపఁబడెను. సారాంశ మేమియన: దేనినైనను జేయుటకు మనుజునకుఁ దొలుత బుద్ధి పుట్టునటులె, ప్రకృతికిని తాను వ్యాపారము చేయుటకు మొదట బుద్ధి పుట్టవలయును. మనుజప్రాణి సచేతన మగుటచే (అనఁగా:ఆ ప్రాణియం దున్న ప్రకృతిసంబంధమగు బుద్ధితో సచేతన పురుషునకు (ఆత్మకు) సంయోగ మగుటచే) మనుజునకుఁ గలిగిన వ్యవసాయాత్మకబుద్ధి మనుజునకుఁ దెలియును గావునను, తానే జడ మగుటచేఁ దన బుద్ధినే తా నెఱుఁగదు గావున నీ రెంటియందు విశేష భేదము గలదు. ఈ భేదము పురుషసంయోగముచేఁ బ్రకృతియం దుత్పన్నమగు చైతన్యమూలమునఁ గలుగుచున్నది; అది శుద్ధ జడ ప్రకృతియొక్క గుణము కానేరదు. మానవేచ్ఛతో సమముగ నుండు నట్టి 'అన్వయం వేద్యశక్తి' జడపదార్థమున నున్న దని యంగీకరించినఁ గాని గురుత్వాకర్షణము లేక రసాయనక్రియయు, లోహచుంబకముయొక్క యాకర్షణ ప్రసారణములును మొదలగు కేవల జడసృష్టియందె స్పష్టముగఁ గాన్పించుచున్న గుణములకు మూల

కారణమును జక్కగఁ జెప్పుటకు వీలులేదని* యర్వాచీనాధిభౌతిక సృష్టిశాస్త్రజ్ఞులు సైత మిప్పుడు చెప్పుచున్నా రను విషయము దెలిసె నేని ప్రకృతియందు మొదట బుద్ధి యను గుణ ముత్పన్న మగు నను సాంఖ్యసిద్ధాన్త మాశ్చర్యముగఁ దోఁపదు. ప్రకృతియందుఁ దొల్ల నుత్పన్న మగు నీ గుణమును, అచేతన మనియైనను లేక, యనంవేద్య మన స్వయముగ నెఱుఁగుటకు వీలులేని బుద్ధి యని యైననుజెప్పుము. కాని యేమి చెప్పినను మనుజునకు నుత్పన్న మగు బుద్ధియుఁ బ్రకృతికి నుత్పన్న మగు బుద్ధియు నీ రెండును దొలుత నొకవర్గములోనివే యను నంగతి స్పష్టముగనే యున్నది. కావుననే యది రెండు స్థలములందు నొకే రీతిఁగ వ్యాఖ్యానము నలుపఁబడినది. ఈ బుద్ధికే 'మహత్తు, జ్ఞానము, మతి, అసురి, ప్రజ్ఞ, ఖ్యాతి,' ఈ మొదలగునవి నామాంతర ములు. వీనిలో 'మహత్తు' (పుల్లింగమునందు ప్రథమైకవచనము 'మహాన్=గొప్పది') అను పేరు, 'ప్రకృతి యిప్పుడు గొప్పది యగు చున్నది'యను కారణముచేఁ గాని, లేక, యీ గుణశ్రేష్ఠత్వమూలమునఁ గాని యిడఁ బడినదని తోఁచుచున్నది. ప్రకృతియందు మొదట నుత్పన్న మగు మహత్తు, లేక, బుద్ధి యను గుణము, నత్త్వరజస్తమో

* Without the assumption of an atomic soul, the commonest and most general phenomena of Chemistry are inexplicable. Pleasure and pain, desire and aversion, attraction and repulsion must be common to all atoms of an aggregate; for the movements of atoms which must take place in the formation and dissolution of a chemical compound can be explained only by attributing to them sensation and Will. "— Haeckel in the Perigenesi of the plastidule cited in the Plantineau's "Types of Ethical Theory" vol. II. p. 399. 3rd. Edn. Haeckel himself explains this statement as follows— 'I explicitly stated that I conceived the elementary psychic qualities of sensation and will which may be attributed to atoms to be unconscious, just as unconscious as the elementary memory which, I, in common with the distinguished psychologist Ewald Hering, consider to be a common function of all organised matter or more correctly the living substances.'— The Riddle of the Universe. Chap. IX. p. 63, (R.P.A. Cheap Edn.)

గుణముల కలయికయొక్క పరిణామమే యగుటచే, దృష్టికి నొకటి గఁ గాన్పించినను పిదప ననేక విధములగుటకు సమర్థమగును. కారణ మేమియనఁ: సత్వరజస్తమోగుణములు చూపునకు మూఁడుగఁ గాన్పించినను వానియొక్క కలయికలోఁ బ్రతి గుణము ననంతముగ నగుచు ని మూఁడింటిలో నొక్కొక్క దానియొక్క యనేకములగు రీతులచే ననంతము లగుటకు సమర్థ మగును. అవ్యక్తమగు ప్రకృతియందుండి నిర్మాణమగు నీ బుద్ధి ప్రకృతివలెనె సూక్ష్మముగ నున్నది. కాని, వ్యక్తా వ్యక్త శబ్దములకును, సూక్ష్మస్థూలశబ్దములకును బూర్వప్రకరణమునఁ జెప్పఁబడిన యర్థము ననుసరించి బుద్ధి ప్రకృతి వలెనె సూక్ష్మ మయిన దైనను ప్రకృతివలె నవ్యక్తము కానేరదు; కావున, దాని యొక్క జ్ఞానము మనుజునకుఁ గలుగను వీలుండును. కావున నీ బుద్ధి యిప్పుడు వ్యక్తము (అనగాఁ: మనుజునకు గోచరమగు పదార్థము) అనుదానిలోనే చేరును. మఱియు బుద్ధియే కాక, పిదప నుత్పన్నము లగు ప్రకృతివికారము లన్నియు వ్యక్తములే యని సాంఖ్యశాస్త్రము నందు వక్కాణింపఁబడినది. ఒక మూలప్రకృతి తప్ప నితరములగునే తత్త్వములు నవ్యక్తములు కానేరవు. అవ్యక్తప్రకృతిలో నీ తీరున వ్యక్తము వ్యవసాయాత్మకము నగు బుద్ధియు నుత్పన్న మయినను ప్రకృతి యిప్పటికి నొక రీతిగనే యున్నది. ఏకత్వమును వదలి బహుత్వము నొందుటనే 'పృథక్త్వ' మని చెప్పుచున్నారు. ఉదా హరణము: పాదరసము నేలపైఁ బడె నేని చిన్నచిన్న బిందువులుగ నగును. బుద్ధి పిదప సైతము పృథక్త్వము, లేక, బహుత్వము నొంది ననే తప్ప నొక ప్రకృతివల్లనే యనేక పదార్థము లుత్పన్న మగుటకు శక్యము కానేరదు. బుద్ధియందుండి వెనుక నుత్పన్న మగు నానాత్వ మును గుణమునే యహంకార మని వచించెదరు. కారణ మేమన: పృథక్త్వమును 'నేను–నీవు' అను నీ శబ్దములచేతనే వ్యక్తము చేయ వలసివచ్చును. మఱియు, 'నీవు–నేను' అనఁగనే, 'అహంకారము'– అహం అహం (నేను, నేను) కారము=చేయుట– అగును. ప్రకృతి

యందుత్పన్నమగు నహంకార మను గుణమునే యస్వయంవేద్యము, అనఁగా దనకుఁ దెలియని దని చెప్పినను చెప్పవచ్చును; కాని, మనుజునకున్న యహంకారమును, ఏ యహంకారముచే వృక్షములు, పాషాణములు, జలము, లేక, వేర్వేఱగు మూలపరమాణువులు నేకత్వము నొందిన ప్రకృతి యందుండి నిర్మితము లగునో యా యహంకారము నను నీ రెంటియొక్క జాతియు నొక్కటియే. పాషాణమునకు చైతన్యము లేదు గాన 'అహ' మను జ్ఞాన ముండదు. నోరు లేదు గాన 'నేను వేఱు నీవు వేఱు' అని స్వాభిమానముతో మఱి యొకరికిఁ జెప్పుట సాధ్యము కాకపోవుటయే భేదముగ నున్నది. ఇతరములగు వానియందుండి పృథక్త్వముగ నున్నదానియొక్క, అనఁగా: అభిమానముయొక్క, లేక, యహంకారముయొక్క తత్త్వ మంతట నొకటిగనే యున్నది. ఈ యహంకారమునే తైజస మని, అభిమాన మని, భూతాది యని, ధాతువనియుఁ జెప్పిరి. అహంకార మనునది బుద్ధిలోని యొక భేదమగుటచేఁ దొలుత బుద్ధి యుత్పన్న మయినఁ గాని యహంకార ముత్పన్నము కానేరదు. కావున నహంకార మనునది రెండవది, అనఁగా: బుద్ధికిఁ బిదప నుత్పన్నమగు గుణమని సాంఖ్యులచే సిద్ధాన్తీకరింపఁ బడినది. సాత్త్విక రాజస తామస భేదములచే నహంకారము త్రైతము బుద్ధివలె ననేక విధము లగునని చెప్ప నక్కఱలేదు. ముందుఁ జెప్పఁబోవు నీ గుణములును, ఈ రీతిగనే వేర్వేఱుగఁ బ్రిఘాతమ్ముచే ననంతము-లగును. వేయేల? వ్యక్తసృష్టి యందుఁ బ్రతిపదార్థము నీ రీతిగనే యనంతములగు సాత్త్వికరాజస తామసము లను భేదముల నొందును. ఈ సిద్ధాన్తము ననుసరించియే గుణత్రయవిభాగమును శ్రద్ధాత్రయవిభాగమును జెప్పఁబడినవి (గీ. అ. 14; 17).

వ్యవసాయాత్మకబుద్ధియు నహంకారము నను రెండు వ్యక్త గుణములును మూలమగు సామ్యావస్థయం దున్న ప్రకృతియం

దుత్పన్నము లగునేని ప్రకృతికి నేకత్వము పోవుటచే నందుండి యనేక పదార్థము లుత్పన్నము లగును. అయినను దాని సూక్ష్మత్వ మప్పటికిని స్థిరముగనే యుండును. అనఁగా: నైయాయికుల సూక్ష్మ పరమాణువుల కిప్పు డారంభము గల్గునని చెప్పినను జెప్పవచ్చును. కారణ మేమన- అహంకారము పుట్టుటకు ముందు ప్రకృతి యఖండముగాను నిరవయవముగాను నుండును. కేవల బుద్ధియు, కేవలాహంకారము ననునవి నిజముగఁ జూచితి మేని కేవల గుణములుగ నున్నవి. కావునఁ బ్రకృతియొక్క గుణమును వదలి యవి యుండునని పూర్వోక్త సిద్ధాన్తముయొక్క యర్థమును గైకొన నక్కఱలేదు. మొదట నొక్కటియు, నిరవయవమునగు ప్రకృతియం దీ గుణము లుత్పన్నము లగునేని దానికే బహుత్వమును, సావయవద్రవ్యాత్మక మగు వ్యక్తరూపమును వచ్చునని మొత్తముమీఁద భావార్థకముగ నున్నది. మూలప్రకృతియం దహంకారముచే వేర్వేఱు పదార్థములను సృజించు శక్తి యిటులు పుట్టిన పిదప వృద్ధినొంది రెండుశాఖలయ్యెను. ఒకటి- వృక్షములు, మనుజులు మొదలగు సేంద్రియ ప్రాణులసృష్టి; రెండవది-నిరింద్రియ పదార్థముల సృష్టి. ఈ స్థలమునందు ఇంద్రియ శబ్దముచే "ఇంద్రియములుగల ప్రాణులయొక్క యింద్రియముల శక్తి" యని మాత్రమే యర్థ మని యెఱుంగవలయును. కారణ మేమనఁగా: సేంద్రియప్రాణులను జడదేహముననే చేరును. జడమనఁగా ఇంద్రియ సృష్టి. ఈ ప్రాణులయొక్క యాత్మ పురుషఁ డను పేరుగల మఱియొక వర్గములోఁ జేరును. సృష్టిని విచారించుచు, దేహమును, ఆత్మను వదలి యింద్రియములనే సాంఖ్యులు విచారించిరి. సేంద్రియములు నిరింద్రియములు దక్క మూఁడవ పదార్థము సృష్టియం దుండుట కవకాశము కలుగదు గావున నహంకారమునందుండి దేహముకంటె నధికశాఖలు వెలువడుటకు వీలులేదని చెప్ప నక్కఱ యుండదు. వీనిలో నింద్రియశక్తి శ్రేష్ఠ మగుటచే నింద్రియసృష్టిని సాత్త్వికము (సత్త్వగుణోత్కర్షచేఁ బుట్టునది) అనియు, నిరింద్రియ

సృష్టిని తామసము (తమోగుణోత్కర్షవలన పుట్టినది) అనియుఁ జెప్పిరి. సారాంశ మేమన- అహంకారము స్వశక్తి చే వేర్వేఱు పదార్థములను బుట్టించుచున్న యెడల దానియంది యొకప్పుడు సత్త్వగుణోత్కర్ష కలుగుటచే, నొకవైపునఁ బంచజ్ఞానేంద్రియములును పంచకర్మేంద్రియములును మనస్సును గలిసిన యింద్రియసృష్టికి మూలభూతములగు నేకాదశేంద్రియములును, రెండవ వైపునఁ దమోగుణోత్కర్ష కలుగుటచే, నిరింద్రియసృష్టికి మూలభూతములగు పంచతన్మాత్రద్రవ్యములును, ఉత్పన్నము లగుచున్నవి. ఈ ప్రకృతియొక్క సూక్ష్మత్వమిప్పటికిని స్థిరముగనే యుండుటచే నహంకారముచే నుత్పన్నములగు పదునాఱు తత్త్వములును సూక్ష్మములుగనే యున్నవి.* శబ్దము స్పర్శము, రూపము, రసము, గంధము, వీని తన్మాత్రలును(అనఁగా ఒకదానితో నొకటి కలియక వేర్వేఱుగ నున్న ప్రతి గుణమయొక్క యతిసూక్ష్మము లగు మూలస్వరూపములు), అనునవి నిరింద్రియ సృష్టికి మూలతత్త్వము లగుటచే, మనస్సుతోఁ గూడ నేకాదశేంద్రియము లనునవి సేంద్రియసృష్టికి బీజము లయియున్నవి. వీనిలోఁ మొదటి యైదింటి నేల గ్రహింపవలయునో, లేక, రెండవ పదునొకటి నేల గ్రహింపవలయునో యను విషయము సాంఖ్యమునందు సోపపత్తికముగ విచారణ నలుపవలసి నట్లున్నది. అర్వాచీనులగు సృష్టి శాస్త్రజ్ఞులు సృష్టియందున్న పదార్థములను, ఘనపదార్థము (కఠి

* ఇంగ్లీషులో ఈ విషయము సంక్షేపముగఁ జెప్పఁబడినదేవి యిట్లు చెప్పఁబడియున్నది:-

The Primeval matter (Prakriti) was at first homogeneous. It resolved (Buddhi) to unfold itself, and by the principle of differentiation (Ahamkara) became heterogenous. It then branched off into two sections- one organic (Sendriya) and the other inorganic (Nirindriya). There are eleven elements of the organic and five of the inorganic creation. Purusha or the observer is different from all these and falls under none of the above categories.

నము) లని, ద్రవపదార్థము (పలుచనివి) లని, వాయుపదార్థము లని మూఁడు విధములుగ విభజించియున్నారు; కాని పదార్థముయొక్క వర్గీకరణములో సాంఖ్యులు పీరికంటె వేఱుగఁ జెప్పుదురు. "సృష్టి యందలి సకల పదార్థముల జ్ఞానమును మనుష్యునకు జ్ఞానేంద్రియ పంచకము వలనఁ గలుగును. ఈ జ్ఞానేంద్రియముల రచన యొక యింద్రియమున కొక గుణమే తెలియునంత విలక్షణముగ నున్నది. నేత్రములు వానన నెఱుంగలేవు. వీనులు చూడలేవు. త్వగింద్రియము రుచి నెఱుంగ లేదు. నాలుక మాటలు వినలేదు. నాసిక రూపమును గ్రహింపనేర"దని సాంఖ్యులు చెప్పుదురు. అయిదు జ్ఞానేంద్రియము లకును శబ్దస్పర్శరూపరసగంధము లను నయిదు విషయములు నియమింపబడినచో, సృష్టియందలి యన్ని గుణములు నైదింటికంటె నెక్కువగ నున్నవని వచించుటకు వీలులేదు. కారణ మేమి యన: ఈ యైదింటికంటె నెక్కువగ గుణము లుండునని కల్పించినను, వాని నెఱుంగుటకు సాధనము లెవ్వియు లేవు. ఈయయిదు గుణములలోను ప్రతి గుణము ననేక భేదములను బొందఁ గలదు. ఉదాహరణము-శబ్ద మనుగుణ మొక్కటియైనను, సూక్ష్మము, స్థూలము, కర్కశము, పరుషము, భగ్నము, మంజులము నని యైనను, లేక, సంగీతశాస్త్రమునఁ జెప్పినటుల. నిషాదము, గాంధారము, షడ్జము మొదలగునవి యనియైనను, లేక, వ్యాకరణ శాస్త్రానుసారముగ తాలవ్యము, ఓష్ఠము, మొదలగునవి యని యైనను, అనేక భేదము లొకే శబ్దమునకే యుండును. రసము, లేక, రుచి యనునది మొత్తమున నొకటియే యైనను తీపి, పులును, చేఁదు, కారము, ఉప్పు, ఒగరు-అను వీనిచే ననేకవిధములగును. రూప మొక గుణమే యైనను తెలుపు, నలుపు, ఆకుపచ్చపు, నీలము, పసిమి, యెఱుపు నని యనేక విధములుగ నున్నది. అటులే మాధుర్యము (తీపి) అను నొక విశిష్టమగు రుచిని తీసికొనినను, చెఱకుయొక్క తీపి వేఱు, పంచదార తీపి వేఱు, బెల్లపు తీపి వేఱు నని దానికిని మరల ననేక భేదములు కలుగును. వేర్వేఱు గుణము

లకు వేర్వేఱగు కలయికను విచారించితి మేని యీ గుణవైచిత్ర్యము ననేక విధములుగనై యనంత మగును. కాని యే మైనను పదార్థముల యొక్క మూలగుణము లింతకంశె నెప్పుడును విశేషము కానేరవు. కారణ మేమి యన: ఇంద్రియము లైదుగనే యుండుటచేతను, ప్రతి ఇంద్రియమున కొకే గుణ ముండుటచేతను అని యెఱుంగవలయును. కావున నొక శబ్దగుణమే కాని, లేక, స్పర్శగుణమే కాని, కలిగిన వేర్వేఱగు (అనఁగా: రెండవ గుణముయొక్క కలయిక లేని) పదార్థములు మనకుఁ గాన్పింపకపోయినను మూలమునందు కేవల శబ్దము కేవల స్పర్శము, కేవల రూపము, కేవల రసము, కేవల గంధము, శబ్దతన్మాత్రము, స్పర్శతన్మాత్రము, రూపతన్మాత్రము, రసతన్మాత్రము గంధతన్మాత్రము-అను మూలప్రకృతియొక్క వేర్వేఱు సూక్ష్మములగు తన్మాత్రవికారము లైనను, లేక, ద్రవ్యము లయినను నుండవలయు నని సాంఖ్యులచే సిద్ధాన్తికరింపఁబడినది. పంచతన్మాత్రలయొక్క గాని వాని యందుండి వెలువడిన పంచమహాభూతములయొక్క గాని సంబంధములో నుపనిషత్తులలోఁ జెప్పబడిన విషయము ముందు విచారింపఁబడును.

ఇటుల నిరింద్రియ సృష్టియొక్క విచారణ సలుపుటచే దాని యం దైదు సూక్ష్మములగు మూలతత్త్వములు మాత్రమే యున్నవని తేలిన పిదప సేంద్రియసృష్టి విచారించితి మేని, జ్ఞానేంద్రియపంచకము మనస్సును నీ పదునొకటికంశె నధిక మగు నింద్రియము లేరికి లేనట్లు కాన్పించుచున్నది. వీనిలో స్థూలదేహమునందు హస్తపాదాదీంద్రియములు స్థూలముగఁ గాన్పించినను నా ప్రతీంద్రియమునకు మొట్టమొదట సూక్ష్మతత్త్వ మేది యైన నుండిననే కాని యింద్రియములు వేర్వేఱగ నుండుటకు వీలుండదు. పాశ్చాత్యులగు నాధిభౌతికవాదుల యుత్క్రాంతివాదమునందు దీని విచారణ బాగుగనే జరిగినది. మిక్కిలి చిన్నది యగు (అనఁగా: మొదట గోళాకారముగ

నున్న) జంతువులకుఁ ద్వగింద్రియ మొక్కటియే యున్నది. ఆ తత్త్వ మునం దుండియే యితరములగు నింద్రియములు క్రమక్రమముగ నుత్పన్నము లగుచున్న వని యర్వాచీన సృష్టిశాస్త్రజ్ఞులు వక్కాణించె దరు. ఉదాహరణము- మూలజంతువుయొక్క త్వగింద్రియమునకును, ప్రకాశమునకును సంయోగ మారంభ మగునేని నేత్రము లుత్పన్నము లగును (ఇవి మొ॥). ప్రకాశము మొదలగువాని సంయోగముచే స్థూలేంద్రియములు ప్రాదుర్భవించునను నాధిభౌతికవాదుల తత్త్వము సాంఖ్యులకు సైత మిష్ట మగుటచే మహాభారతమునందు-

శబ్దరాగ శ్రోత్రస్య జాయతే భావితాత్మనః,
రూపరాగా త్తథా చక్షుః ఘ్రాణం గంధజిఘృక్షయా.

(మ.భా.శాం. 218-18.)

– ప్రాణులకు, శబ్దమును వినవలయునని భావ ముత్పన్న మగునేని వీనులును, రూపమును జూడవలయు నని యిచ్ఛ కలిగెనేని నేత్రము లును, వాసనను గ్రహింప వలయునని బుద్ధి పొడమె నేని నాసికయు నుత్పన్నము లగును అని సాంఖ్యమునం దున్నటులే యింద్రియములు ప్రాదుర్భవించె నని చెప్పఁబడెను. కాని, సాంఖ్యులు- "త్వగింద్రియ ము లుత్పన్న మైనను, మూలప్రకృతియందే యా యా యింద్రియము లుత్పన్నమగు నైసర్గికశక్తి లేనియెడల నజీవసృష్టిలోనున్న యత్యంత సూక్ష్మ మగు జంతువుయొక్క త్వగింద్రియముపై సూర్యప్రకాశ మెంత తగిలినను దాని శరీరమునకుఁ గన్ను లే చోటఁ బుట్టును?" అని యడుగుదురు. ఒక జంతువు నేత్రములు గలదిగను, మఱియొకటి లేనిదిగను, నిర్మితము లయిన పిదప, జడసృష్టి యధికముగ నగు నపుడు నేత్రములు గల ప్రాణులే చిరకాల ముండు ననియు, నితరము లచిరకాలమునసే నశించుననియు 'డార్విన్' అను వాని సిద్ధాన్తము. కాని, "కన్నులు మొదలగు నా యా యింద్రియములు తొలుతనే యేల

యుత్పన్నములు కానేరవు?" అను దానికి సమాధానము పాశ్చాత్యుల యాధిభౌతిక సృష్టిశాస్త్రము చెప్పదు. ఈ సకలేంద్రియములు మొదట నొక యింద్రియము నుండియుఁ బిమ్మటఁ బరంపరగను పుట్టినవి గాక యహంకారముచే ప్రకృతికి బహుత్వము సంభవించెనేని యీ యహంకారము నుండి యైదు సూక్ష్మములగు జ్ఞానేంద్రియములును మనస్సు కర్మేంద్రియములు నందు కలసి వేర్వేఱుగ పదునొకండు శక్తులు గాని మూలప్రకృతి యందుండియే స్వతంత్రముగ నొక్కసారిగనే పుట్టుచున్నందున వానినుండి పిమ్మట స్థూల మగు సేంద్రియసృష్టి కలుగుచున్నదని సాంఖ్యుల యభిప్రాయము. ఈ పదునొకండింటిలోను "మనస్సు జ్ఞానేంద్రియముల విషయమై సంకల్పవికల్పాత్మకమును, (అనఁగా: జ్ఞానేంద్రియముల విషయములచే గ్రహింపఁబడిన సంస్కారముల నొకదానితో మఱియొక దానిని జతపఱచి బుద్ధికి నెదురుగ నిర్ణయార్థము పెట్టునది), కర్మేంద్రియముల విషయమయి వ్యాకరణాత్మకమును (అనఁగా: బుద్ధియొక్క నిర్ణయములను గర్మేంద్రియముల ద్వారా వ్యవహారములో నుంచునదియు) అను నుభయవిధము లగు (అనఁగా: ఇంద్రియ భేదానుసారముగ వేర్వేఱగు)పనులను చేయునది" అని పూర్వమున నాఱవ ప్రకరణమునఁ జెప్పఁబడినది. ఉపనిషత్తులలో నింద్రియములను ప్రాణము లని చెప్పిరి. ఈ ప్రాణము పంచభూతాత్మకము కానేరదు. పరమాత్మ యందుండి వేఱుగ నుత్పన్న మయిన దని యని సాంఖ్యశాస్త్రమువలె నుపనిషత్తులు నభిప్రాయపడుచున్నవి (ముండ. ౭.౧.౩). ఈ ప్రాణములయొక్క (అనఁగా: ఇంద్రియముల యొక్క సంఖ్య యుపనిషత్తులలోఁ గొన్నిస్థలములయం దీడనియు, కొన్ని స్థలములయందు పది, పదునొకండు, పండ్రెండు, మఱియు పదుమూఁడనియుం జెప్పఁబడినది; కాని యుపనిషత్తులయం దున్న యీ సర్వవాక్యములకు నేకవాక్యత నలుపఁబడె నేని యింద్రియ

సంఖ్య పదునొకం డనియే సిద్ధమగు నని వేదాన్తసూత్రముల యాధారమున శ్రీశంకరాచార్యులు నిశ్చయించిరి (వే.సూ.శాం.భా. 2.4.3-6). మఱియు గీతలయందు- "ఇంద్రియాణి దశైకం చ"- ఇంద్రియములు పదియు నొక్కటి అనఁగా: పదునొకండు (గీ. 13. 5) అని సుస్పష్టముగనే చెప్పఁబడెను. అనఁగా: ఈ విషయములో సాంఖ్య వేదాన్తశాస్త్రముల రెంటికిని మతభేద మించుక లేదని తాత్పర్యము.

సేంద్రియ సృష్టియందు మూలభూతములగు పదునొకం డింద్రియశక్తులును లేక, గుణములును, నిరింద్రియసృష్టికి మూల భూతము లగు పంచతన్మాత్రద్రవ్యములును కలిసి క్రమముగ సాత్త్వికమును తామసము నయిన యహంకారమునుండి యుత్పన్నము లైన పిదప, వానిలో పంచతన్మాత్ర ద్రవ్యములనుండి పంచమహాభూతములును, (వీనికి 'విశేషము' లనియుం బేరు గలదు) స్థూల నిరింద్రియ పదార్థములు నిర్మింపఁబడుచున్నవి. యథానంభవముగ సూక్ష్మములగు నేకాదశేంద్రియములతో సంయోగము కలుగుటచే సేంద్రియ సృష్టియుఁ గలుగుచున్న దని సాంఖ్యులచే సిద్ధాన్తీకరింపఁబడుచున్నది.

ప్రకృతియందుండి మున్ను ప్రాదుర్భూతములు కాఁబోవు తత్త్వముల గుఱించి యింత పర్యంతము వర్ణింపఁబడిన సాంఖ్యుల క్రమ మీ క్రిందఁ గాన్పింపఁబడిన వంశవృక్షమువలన సుస్పష్టముగఁ దెలియును.

బ్రహ్మాండవంశవృక్షము.

పురుషుఁడు — ప్రకృతి
(అవ్యక్తమును సూక్ష్మమును)

ఈ రెండును వ్యయంతువులు, మఱియు అనాదులు.

(నిర్గుణుడు. పర్యాయశబ్దములు— జ్ఞుఁడు, ద్రష్ట మొదలగునవి.)

(సత్త్వరజస్తమోగుణిని. పర్యాయశబ్దములు—ప్రధానము, అవ్యక్తము, మాయ, ప్రసవధర్మిణి మొదలగునవి.)

మహత్తు, లేక, బుద్ధి (వ్యక్తము సూక్ష్మము)
(పర్యాయశబ్దములు—ఆసురి, మతి, జ్ఞానము, ఖ్యాతి, మొదలగునవి.)

అహంకారము (వ్యక్తము సూక్ష్మము)
(పర్యాయ శబ్దములు — అభిమానము, వైజనము మొదలగునవి.)

(సాత్త్వికసృష్టి, అనఁగా: వ్యక్తమును సూక్ష్మేంద్రియములును.)

(తామసము, అనఁగా: విరింద్రియసృష్టి)

పంచబుద్ధీంద్రియములు పంచకర్మేంద్రియములు, మనస్సు

పంచతన్మాత్రలు (సూక్ష్మములు)

విశేషములు, లేక, పంచమహాభూతములు, (స్థూలములు)

సమస్తమిది తత్త్వము లింగశరీరము (సూక్ష్మము)

స్థూలపంచ మహాభూతములు పురుషుఁడును గలసి మొత్తముపై తత్త్వము లఱువదియై దగును. వీనిలో మహత్తు, లేక, బుద్ధియందుండి పుట్టిన మూఁడుగుణములు మూలప్రకృతియొక్క వికారములు.

అందును, సూక్ష్మతన్మాత్రలును పంచస్థూలమహాభూతములును ద్రవ్యాత్మకమగు వికారములు. కావున, బుద్ధియు, నహంకారమును, ఇంద్రియములును గేవల శక్తులుగఁ గాని గుణములుగఁ గాని యున్నవి. ఈ యిరువది మూఁడు తత్త్వములు వ్యక్తము లనియు, మూలప్రకృతి యవ్యక్త మనియు నీ రెంటికిని భేదము. సాంఖ్యు లీ యిరువదిమూఁడు తత్త్వములలోను దిక్కునకు, కాలమునకు నాకాశమునందే యంతర్భావము నొప్పుకొనుచు, ప్రాణము వేఱని యంగీకరింపక, సర్వేంద్రియముల వ్యాపారములు నారబ్ధము లగునేని వానినే యీ ప్రాణము లని యందురు (సాం.కా. 29). కాని, వేదాన్తు లీమతము నొప్పుకొనరు. ప్రాణము స్వతంత్రతత్త్వ మని యందురు (వే.సూ. 2.4.9). అటులె, సాంఖ్యులు వచించు రీతిఁగ, ప్రకృతి పురుషు లిద్దఱును, స్వయంభువులును, స్వతంత్రులును కారనియు, ఒక పరమేశ్వరుని యొక్క రెండువిభూతులే యని యువేదాన్తులందు రని వెనుక వక్కాణించితిమి. సాంఖ్యులకును, వేదాన్తులకును నడుమ నున్న యీ భేదము గాక మిగిలిన సృష్టియొక్క యుత్పత్తిక్రమ ముభయ పక్షములందును సమానముగనే యున్నది. ఉదాహరణము-మహాభారతము నందున్న బ్రహ్మయను గీతలలో రెండు పర్యాయములు వృక్షము, లేక, బ్రహ్మవనము వర్ణింపఁబడినది (మ.భా.అశ్వ. 37.20-28; మఱియు 47. 12-15). అది సాంఖ్యుల తత్త్వము ననుసరించియే యున్నది.

అవ్యక్తబీజప్రభవో బుద్ధిస్కంధమయో మహాన్,
మహాహంకారవిటప ఇంద్రియాన్తరకోటరః.
మహాభూతవిశాఖశ్చ విశేషప్రతిశాఖవాన్,
సదాపర్ణ స్సదాపుష్ప శ్శుభాశుభఫలోదయః.
అజీవంః సర్వభూతానాం బ్రహ్మవృక్ష స్సనాతనః,
ఏనం ఛిత్వా చ భిత్వా చ తత్త్వజ్ఞానాసినా బుధః.
హిత్వా సంగమయాన్ పాశాన్ మృత్యుజన్మ జరోదయాన్,
నిర్మమో నిరహంకారో ముచ్యతే నాత్ర సంశయః.

– అవ్యక్తము, (ప్రకృతి) దీనికి బీజమో, బుద్ధి (మహత్) దీనికి స్కంధమో (బోదియో), అహంకారము దీనికి ముళ్ళపల్లవమో, మనస్సును దశేంద్రియములును దీనిలో నుండు తొఱ్ఱలో, (సూక్ష్మము లగు) మహాభూతములు (పంచతన్మాత్రలు) దీనికి పెద్దకొమ్మలో, విశేషములు (అనగా: స్థూలమహాభూతములు) దీనికి రెమ్మలో, ఏది యెప్పుడు వాకులు పుష్పములు శుభాశుభము లను ఫలములును గలిగియుండునో యా సనాతన మగు బ్రహ్మవృక్షము సర్వప్రాణులకు నాధారభూత మైనది. దీనిని తత్త్వజ్ఞానరూప మగు కత్తి చే ఛేదించి, ముక్కలుగఁ జేసి, జ్ఞాని జన్మ జరా మృత్యువులను గలుగఁ జేయు సంగమయము లగు పాశములను దెగనేసి, మమత్వ బుద్ధిని, అహం కారమును వదలె నేని, నిస్సంశయముగ ముక్తుఁడగును. సారాంశ మేమనఁగా: ఈ బ్రహ్మవృక్ష మనఁగా, సంసారరూపమగు కొట్టు, లేక, ప్రకృతి, లేక, మాయయొక్క దుకాణము. దీనిని వృక్ష మని చెప్పుట యను క్రమము బహుకాలము క్రిందట నుండియు (అనగా: ఋగ్వేదకాలమునందుండియు) కలదు. ఉపనిషత్తులలో దీనినే 'సనాతనమైన యశ్వత్థవృక్ష' మని చెప్పినారు (కఠ. 6. 1). కాని, యిక్కడ (అనగా: వేదాన్తమునందు) నీ వృక్షముయొక్క మూలము (అనగా: పరబ్రహ్మము) పై నున్నదనియు, శాఖ లన్నియు (దృశ్య సృష్టియొక్క దుకాణము) క్రింద నున్నవనియు మాత్రమే భేదము చెప్పఁబడినది. ఈ వైదికవర్ణనను, సాంఖ్యులతత్త్వమును ననుసరించి గీతలలో నశ్వత్థవృక్షము వర్ణిత మయిన దని గీతలలోని 15. 1; మఱియు 2 వ శ్లోకములపై నేను వ్రాసిన టీకయందు స్పష్టముగఁ గనఁబఱచి యున్నాను.

పైన వృక్షరూపముగ వర్ణించిన యిరువదియైదు తత్త్వములనే సాంఖ్యులును వేదాన్తులును వేర్వేఱుగ వర్గీకరణ మొనరించిరి. ఈ వర్గీకరణమునందు పైతము కొంత పరిచయమిచ్చెఁ గలుగవలయును.

ఈ యిరువదియైదు తత్త్వములకును మూలప్రకృతి, ప్రకృతి వికృతి, వికృతి, న-ప్రకృతి-న-వికృతి, అని నాల్గు వర్గములుగా నున్నవని సాంఖ్యులు చెప్పుచున్నారు. (1) ప్రకృతితత్త్వము మఱియొక దాని యందుండి పుట్టినది కాకపోవుటచే దానిని మూలప్రకృతియని చెప్పు దురు. (2) ఈ మూలప్రకృతిని వదలి రెండవమెట్టుపైకి వచ్చితిమేని మహత్తత్త్వ ముందును. మహత్తత్త్వము ప్రకృతిచేఁ బుట్టినది యగు టచే, ప్రకృతియొక్క వికృతి, లేక, వికార మయియున్నది. మఱియు నహంకార మీ మహత్తత్త్వము నందుండి వెలువడినది గాన మహ త్తత్త్వ మనునది యహంకారమునకు ప్రకృతి, లేక, మూలముగ నున్నది. ఇటులనుటచే మహత్తత్త్వము, లేక, బుద్ధి యను నీ గుణ మొక వైపున నహంకారమునకు ప్రకృతి, లేక, మూలము అగుచు న్నది. మఱియు రెండవవైపున మూలప్రకృతియొక్క వికృతి (అనఁ గా: వికారము) యై యున్నది. కావున సాంఖ్యులచే నిది 'ప్రకృతి-వికృతి' యనువర్గములోఁ జేర్పఁబడినది; ఇటులే యహంకారమును పంచతన్మాత్రలను ప్రకృతి వికృతి వర్గములోనే చేర్చవలసివచ్చును. ఏ తత్త్వము లైనను గుణము లైనను ముందు తా మొకదాని యందుండి పుట్టి (వికృతులై) పిదప మఱియొక తత్త్వమునకు మూలభూతము (ప్రకృతి) లగునో, వానిని 'ప్రకృతి-వికృతు' లని చెప్పుదురు. మహత్తు (మహాన్), అహంకారము పంచతన్మాత్రలు నను నీ యేడు తత్త్వములు నిట్టివే యగును. (3) పంచజ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియములు మనస్సు, స్థూల పంచ మహాభూతములు నను నీ పదియాఱు తత్త్వములనుండి పిదప నితరములగు తత్త్వము లెవ్వియు పుట్టలేదు. కాని, యివియే మఱియొక దానియందుండి పుట్టినవి. కావున నీ పదియాఱు తత్త్వములను 'ప్రకృతి-వికృతు' లనక, కేవ లము 'వికృతులు' లేక, 'వికారము' లని నుడువుదురు. (4) పురు షుఁడు ప్రకృతి కాఁడు, వికృతియును కాఁడు. స్వతంత్రుఁడు, ఉదాసీ

నుఁడు, ద్రష్టయు నై యున్నాఁడు. ఈశ్వరకృష్ణు లితుల వర్గీకరణ మొనర్చిరి-

మూలప్రకృతి రవికృతిః మహదాద్యాః ప్రకృతివికృతయ స్సప్త,
షోడశకస్తు వికారో న ప్రకృతి ర్న వికృతిః పురుషః.

(సాం.కా. 3.)

– మూలప్రకృతి యనునది అవికృతి (అనఁగా: దేనియొక్క వికారమును కానేరదు.) మహత్తు మొదలగునవి యేడును (అనఁగా, మహత్తత్త్వము, అహంకారము, పంచతన్మాత్రలు–అనునవి) ప్రకృతి వికృతులు. మఱియు మనస్సుతోఁ జేరి పదునొకండగు నింద్రియ ములును, స్థూలపంచమహాభూతములును గలసి పదునాఱు తత్త్వ ములును వికృతులే, లేక, వికారములే. పురుషుఁడు, ప్రకృతియును కాఁడు, వికృతియును కాఁడు అని చెప్పిరి. పిదప నీ యిరువదియైదు తత్త్వములును, మరల నవ్యక్తము, వ్యక్తములు, జ్ఞుఁడు, అని మూఁడువర్గములుగ చేయఁబడినవి. వానిలో మూలప్రకృతి యనునది యొక్కటియే యవ్యక్తము. ప్రకృతినుండి యుత్పన్నము లైన యిరువదిమూఁడు తత్త్వములును వ్యక్తములు. పురుషుఁడనువాఁడు 'జ్ఞు' డగును. ఇది సాంఖ్యుల వర్గీకరణము. పురాణములందును, స్మృతులయందును, మహాభారతము మొదలగు వైదికమార్గగ్రంథ ములయందు నీ యిరువదియైదు తత్త్వములె తఱుచుగఁ జెప్పఁబడు చున్నవి. (మైత్ర్యు. 6.10; మను. 1.14-15. చూడుము.) కాని యుపనిషత్తులలో నివి యన్నియు పరబ్రహ్మము నందుండియే యుత్పన్నము లయిన వని యున్నది. వానిలో నీ విషయమున విశేషముగ వివేచనమైనను, వర్గీకరణ మైనను నొనర్పఁబడ లేదు. ఉపనిషత్తులపిదపఁ బుట్టిన గ్రంథములందు మాత్ర మవి వర్గీకరింపఁ బడినటుల స్పష్టముగఁ గాన్పించుచున్నది; కాని పూర్వోక్తమగు సాంఖ్యులవర్గీకరణముకంటె నది వేఱుగనే యున్నది. మొత్తముపై

తత్త్వము లిరువదియైదు. వానిలో పదునాఱుతత్త్వములు సాంఖ్యము నందువలెనే వికారములు (అనఁగా: ఇతరతత్త్వముల నుండి యుత్పన్నము లైనవి). కావున వానిని ప్రకృతి, లేక, మూలభూత పదార్థము, అను వర్గమునంఁదుఁ జేర్చలేదు. ఇవిగాక తొమ్మిది తత్త్వ ములు మిగిలియున్నవి.. 1. పురుషుఁడు, 2. ప్రకృతి, 3. మహత్తు (మహత్తత్త్వము), 4. అహంకారము, మఱియు పంచతన్మాత్రలు వీనిలో పురుషుఁడును, ప్రకృతియును గాక మిగిలిన యేడుపదార్థము లను ప్రకృతివికృతులని సాంఖ్యులు చెప్పుదురు; కాని వేదాన్తశాస్త్ర మునందుఁ బ్రకృతి స్వతంత్ర యని యొప్పుకొనక పోవుటచే నొక పరమేశ్వరునం దుండియే పురుషుఁడును ప్రకృతియు నుత్పన్నము లగునని సిద్ధాన్తము. ఈ సిద్ధాన్తము నంగీకరింతు మేని, 'మూల ప్రకృతి-ప్రకృతి-వికృతి' యను సాంఖ్యుల భేద మేమియు నుండ నేరదు. కారణ మేమియన: ప్రకృతియైనను పరమేశ్వరునందుండియే యుత్పన్న మైనది. కావున దానిని మూలమని చెప్పుటకు వీలులేదు. కావుననే యది ప్రకృతివికృతి వర్గములోనికి వచ్చును. కాఁబట్టి సృష్ట్యుత్పత్తిని జెప్పుచు నొక పరమేశ్వరుని యందుండి యొకవైపున జీవులును, రెండవవైపున (మహదాదులగు నేడు ప్రకృతి-వికృతులు) నెనిమిది విధములైన ప్రకృతియు నిర్మితము లయినవని వేదాన్తులు నుడువుచున్నారు (మ. భా. శాం. 306. 29; మఱియు, 310. 310. చూడుము). అనఁగా: వేదాన్తుల వర్గీకరణమువలె నిరువదియైదు తత్త్వములలో పదునాఱుతత్త్వములను వదలి, మిగిలిన తొమ్మిది తత్త్వములును 'జీవ' మనియు, 'అష్టధా ప్రకృతి' యనియు రెండు విధములుగ వర్గీకరింపఁబడినవి. వేదాన్తుల యీ వర్గీకరణమే భగవద్గీతలో స్వీకరింపఁబడినది. కాని దానియందుఁ దుదకు గొంచెము భేద ముండును. సాంఖ్యులు దేనిని పురుషుఁ డందురో దానినే గీతల యందు జీవుఁ డనెదరు.కావున జీవ మనునది యీశ్వరుని యొక్క

పరాప్రకృతి (అనఁగా: శ్రేష్ఠస్వరూపము) గ నున్నదని చెప్పఁబడినది; మఱియు సాంఖ్యులు దీనిని మూలప్రకృతి యందురో యదియే గీతలయందుఁ బరమేశ్వరునియొక్క 'అపర' (అనఁగా: కనిష్ఠ) మగు స్వరూపమని చెప్పఁబడినది (గీ. 7.4-5). ఇటులు రెండు విధములుగ వర్గీకరణ మొనర్చినపిదప వానియందున్న రెండవవర్గముయొక్క (అనఁగా: కనిష్ఠస్వరూపముయొక్క) భేదము చెప్పవలసినప్పు డీ కనిష్ఠ స్వరూపము గాక దానియందుండి యుత్పన్న మయిన యితర తత్త్వములఁ జెప్పవలయును. కారణ మేమన: కనిష్ఠస్వరూపము (అనఁగా: సాంఖ్యులమూలప్రకృతి) ప్రకృతిభేదములలోనిది కానేరదు. ఉదాహరణము: ఒక తండ్రికి బిడ్డ లెందఱో చెప్పవలసివచ్చినచో బిడ్డలతోనే తండ్రిని సైతము గణింపరాదు. కావున పరమేశ్వరుని యొక్క కనిష్ఠస్వరూపమునకు ముందు భేదము లెన్ని యున్నవో చెప్పుచు వేదాన్తుల 'యష్టధాప్రకృతి' లో, మూలప్రకృతిని వదలి, మిగిలిన మహత్తత్త్వము, అహంకారము, పంచతన్మాత్రలు ననుసీ యేడీ యా మూలప్రకృతియొక్క భేదములు, లేక, ప్రకారములు నని చెప్పవలసి వచ్చును. ఇటు లొనర్చితి మేని పరమేశ్వరునియొక్క కనిష్ఠస్వరూపము, లేక, మూలప్రకృతి యేడు విధములుగ నున్నదని చెప్పవలసి వచ్చును; కాని, పైఁజెప్పినవిధమున వేదాన్తులును ప్రకృతి యెనిమిది భేదములు గల దానిగ వచించెదరు. వేదాంతులు చెప్పు నెనిమిది విధములకును, గీతలలోఁ జెప్పియుండెడు విధములకును గొంతవిరోధము గాన్పించును. ఈ విరోధము లేకుండుటయు 'అష్టధా ప్రకృతి' యని చెప్పుటయు గీతలకు నిష్టముగనే యున్నది. కావున మహత్తత్త్వము, అహంకారము, పంచతన్మాత్రలు ననుసీ యేడింటిలోనే మనస్సును నెనిమిదవతత్త్వమును జేర్చుటచేఁ బరమేశ్వరుని కనిష్ఠ స్వరూపము (అనఁగా: మూలప్రకృతి) ఎనిమిది విధము (అష్టధా) లయిన దని గీతలలోఁ జెప్పఁబడియున్నది (గీ. 7. 5). వీనిలో మనస్సులోనే దశేంద్రియములును, పంచతన్మాత్రలును, పంచ

మహాభూతములును జేరును. కావుననే గీతలయందుండు వర్గీకరణము నకును సాంఖ్య-వేదాన్తులవర్గీకరణమునకును భేదము కాన్పించినను తత్త్వములయొక్క మొత్తపు సంఖ్య దానికంకె హెచ్చుతగ్గులుగ లేదని కాన్పించును. తత్త్వము లన్నిగ్రంథములలో నిరువదియైదే. అయినను వర్గీకరణ భేదముచే భ్రమఁ జెందకుండుటకై యీ మూఁడు వర్గీకరణములు కోష్ఠరూపముగ నొకచోఁ జేర్చి యిచ్చోఁ జూపఁ బడినవి. ఈ కోష్ఠమున గీతలలో పదుమూఁడవయధ్యాయమునందలి (18.5) వర్గీకరణము నొప్పుకొనక, సాంఖ్యులు సెప్పునటులే పంచ వింశతితత్త్వములును వేఱుగఁ జెప్పఁబడినవి; దానివలన వర్గీకరణము భిన్నముగ నుండినను రెండుప్రదేశములందును తత్త్వసంఖ్య యొకటి గనే యున్నదని స్పష్ట మగును.

పంచవింశతిమూలతత్త్వములయొక్క వర్గీకరణము

సాంఖ్యులవర్గీకరణము,	తత్త్వములు.	వేదాన్తులవర్గీకరణము.	గీతలవర్గీకరణము
న-ప్రకృతి-న-వికృతి	1 పురుషుఁడు	పరబ్రహ్మయొక్క శ్రేష్ఠస్వరూపము.	వరాప్రకృతి
మూలప్రకృతి.	1 ప్రకృతి.		అపరాప్రకృతి
	1 మహత్తు	పరబ్రహ్మయొక్క	అపరాప్రకృతి
7 ప్రకృతి-వికృతులు.	1 అహంకారము	కనిష్ఠరూపము	(ఎనిమిది విధము
	5 తన్మాత్రలు	(ఎనిమిది	లైనది)
	1 మనస్సు	విధములైనది)	
	5 బుద్ధీంద్రియములు	వికారములని వేదా	వికారములగు
16 వికారములు.	5 కర్మేంద్రియములు	న్తులు పదునాఱు	అనే వీనిదునై దు
	5 మహాభూతములు	తత్త్వములను,	తత్త్వములను
	—	మూలతత్త్వము	మూలతత్త్వము
	25	లోనే లెక్కించు	లలో గీత
		చున్నారు.	లెక్కించుట.

అది యటు లుండనిమ్ము. అదియందు సామ్యావస్థలోనే యుండునదియు, నేక స్వరూపమును, నిరవయవమును, అవ్యక్తమును జడము నగు ప్రకృతికి వ్యక్తసృష్టిని పుట్టించు నస్వయంవేద్యబుద్ధి కలిగినపిదప, నహంకారముచే దానియందె సావయవమగు బహు భవన మేర్పడి, పిదప నొకవైపున సాత్త్వికములును (అనగా: ఇంద్రియసృష్టికి మూలభూతములు, సూక్ష్ములు నగు నేకాదశేంద్రియములును) రెండవవైపున నిరింద్రియములును (అనగా: తామస సృష్టికి మూలభూతములును సూక్ష్ములు నగు పంచతన్మాత్రలును) గుణమునందుండి గుణములును, ఈ గుణపరిణామవాదానుసారముగ నెటుల నిర్మితము లైనవి యను వివేచన సమాప్తమయినది. ఇఁకను సృష్టి (స్థూలమహాభూతము లైనను, వానియందుండి వెలువడునితర జడపదార్థము లైనను) యే క్రమమున వెలువడిన దను నంశ మిచ్చో స్పష్టముగ వివరింపఁబడును. సూక్ష్మతన్మాత్రలనుండియే స్థూలమహా పంచభూతము లైనను, లేక, 'విశేషము' లనునవి యైనను గుణ పరిణామముచే నుత్పన్నము లైనవని మాత్రమే సాంఖ్యశాస్త్రము నందుఁ జెప్పఁబడినది. కాని, వేదాన్తశాస్త్రములో నున్న గ్రంథముల యం దీ ప్రశ్న మధికముగ వివేచింపఁబడుటచేఁ బ్రబంధానుసారముగ వాని యుత్పత్తి నిచ్చో సంక్షేపముగ నిరూపించెదను. ఈ నిరూపణము వేదాన్తశాస్త్రము ననుసరించి యుండును గాని, సాంఖ్యశాస్త్రాను సారముగ నుండనేరదు. స్థూలపృథ్వి, జలము, తేజస్సు, వాయువు, ఆకాశము నను వానిని పంచమహాభూతములు, లేక, విశేషములు, అని చెప్పుచున్నారు. వీనియొక్క యుత్పత్తిక్రమము తైత్తిరీయోపని షత్తునం దిటుల చెప్పఁబడినది. 'ఆత్మన ఆకాశ స్సంభూతః, ఆకాశా ద్వాయుః, వాయో రగ్నిః, అగ్నే రాపః, అద్భ్యః పృథివీ, పృథివ్యా ఓషధయః ...."— పరమాత్మ యందుండి (సాంఖ్యులు చెప్పునటుల జడ మగు మూలప్రకృతి యందుండి కానేరదు) తొలుత ఆకాశము, నాకాశమునందుండి వాయువు, వాయువునందుండి యగ్నియు,

అగ్నియందుండి జలమును, జలమునందుండి పృథ్వియు నుత్పన్నము లైనవి (తై.ఉ.2.1). ఉపనిషత్తునందలి యీ క్రమమునకుఁ గారణము మాత్రము చెప్పఁబడ లేదు; కాని యుత్తరవేదాన్తగ్రంథములందుఁ బంచమహాభూతముల నిర్మాణక్రమమున కుపపత్తి సాంఖ్యశాస్త్రోక్త మగు గుణపరిణామముయొక్క సిద్ధాన్తము ననుసరించియే యోజింపఁ బడినది. "గుణా గుణేషు వర్తన్తే" యను న్యాయమున నాదియందు నొక గుణమే గల పదార్థ ముత్పన్న మైనది. దానినుండి రెండు గుణ ములు గలదియు, మూఁడు గుణములు గలదియు నగు పదార్థము లుత్పన్నములయి వృద్ధిఁ జెందుటకుఁ బ్రారంభ మైనది. పంచమహా భూతములలో నాకాశమునకు ముఖ్యముగ నొక శబ్దమే గుణ మగు టచే నాకాశము మొదట నుత్పన్న మైనది. పిదప వాయువు పుట్టెను. కారణ మేమి యన: వాయువునందు శబ్దస్పర్శములను రెండుగుణము లున్నవి. గాలి వినరు నేని, వినఁబడుటయే కాక, యది మనయొక్క స్పర్శేంద్రియమునకు సైతము గోచర మగుచున్నది. వాయువున వెంటనే యగ్ని పుట్టెను. కారణ మేమి యన: శబ్దస్పర్శములను నీ రెండు గుణములె కాక యీ యగ్నియందు రూప మను మూఁడవ గుణమును గలదు. ఈ మూఁడు గుణములే కాక రుచి, లేక, రస మను నాల్గవ గుణము జలమం దుండుటచే నగ్ని వెంబడి జల ముత్పన్నము గావలసి యున్నది. తుదకు పృథ్వియం దీ నాల్గుగుణములకంటెను గంధ మను గుణము విశేషించియుండుటచే నుదకమునందుండి పృథ్వి యుత్పన్న మయినదని సిద్ధాన్త మగుచున్నది" అని యుత్తరవేదాన్త గ్రంథము లలోఁ జెప్పఁబడినది. యాస్కునిచే నీ సిద్ధాన్తమే యంగీకరింపఁబడినది (నిరుక్త. 14.4). స్థూలపంచమహాభూతము లీ విధమున నిర్మితము లయిన పిదప– "పృథివ్యా ఓషధయః, ఓషధీభ్యోఽన్నం, అన్నా త్పురుషః"– పృథివియందుండి వనస్పతియు, వనస్పతియందుండి యన్నము, నందుండి పురుషుఁడు నుత్పన్నము లయ్యెను (తై.2.1.) అని తైత్తిరీయోపనిషత్తులోఁ దరువాత నున్నది. పిదపఁ గాఁబోలు

సృష్టి పంచమహాభూతముల కలయికచేఁ బుట్టినది కావున నా కల యిక యను క్రియను వేదాన్తులు 'పంచీకరణ' మని పేర్కొనిరి. పంచీకరణ మనఁగా: పంచమహాభూతములలోను ఒక్కొక్కదానియొక్క భాగమును హెచ్చుతగ్గులుగఁ గైకొని యవి యన్నియుఁ గలుపుటచేఁ గ్రొత్తక్రొత్తపదార్థములు సిద్ధించుట యని యర్థము. ఈ పంచీకరణ మనంతవిధముగ నగును.

కాళేఁ పాఁథరేఁ మేళవితాఁ, పారవే హోతేఁ తత్త్వతా,
కాళేఁ పివళేఁ మేళవితాఁ, హిరవేఁ హోయ.

(దాసబోధ. 9.6.10)

— నలుపును దెలుపును గలుగుటచే నీల మగు రంగు పుట్టును. నీలపు రంగు నాకుపచ్చరంగును గలుగుటచే పసుపురం గగును అని దాస బోధలో నున్నది. పదుమూఁడవ దశకములో—

త్యా భూగోళాచే పోఁటీ, అనంత బీజాంచీ యా కోటీ,
పృథ్వీ పాణ్యా హోతాఁ భేటీ, అంకుర నిఘతీ.
పృథ్వీ వల్లీ నానారంగ, పత్రేఁ పుష్పాంచే తరంగ,
నానా స్వాద తే మగ, ఫళేఁ జాలీఁ.
....
అండజ, జారజ, స్వేదజ, ఉద్భిజ,
పృథ్వీ పాఁటీ సకలాంచేఁ బీజ,
ఐసేఁ హేఁ నవలచోజ, సృష్టిరచనేచేఁ.
చారీ ఖాణీ చారీ వాణీ, చౌత్యాఁ శీలక్షం జీవయోనీ,
నిర్మాణఝాలే లోక తిన్హీ, పిండ బ్రహ్మాండ.

(దాస. 13.3.10-15)

---

* ఎనుబదినాలుగు లక్షల జీవయోనుల కల్పన బొరాజీతులచేఁ జేయబడినది. కావున నది యూహతో రమారమిగఁ జెప్పఁబడినదని స్పష్టమగుచున్నది. అయిన నది బొత్తిగ విశ్వసనీయముగఁ జెప్పఁబడినది కానేరదు. పాశ్చాత్యులగు నాధిభౌతికశాస్త్రజ్ఞు లుత్క్రాంతివాదానుసారముగ మనుష్యప్రాణులు సృష్టింపఁ

– పృథ్వియం ననంతకోటి బీజజాతులు పుట్టుచున్నవి. పృథివికిని

మున నొక చిన్న గోళాకారముగ నున్న సజీవ మగు సూక్ష్మ జంతువునుండి వెలువడిరవి అందురు. ఈ కల్పనను బట్టి చిన్న గోళాకారముగ నున్న జంతువు పెద్ద గోళముగ నున్న జంతువగుటకును, ఈ స్థూలజంతువు మరల చిన్న పురుగగుటకును, ఆ చిన్నపురుగు పిదప మనుష్యప్రాణి యగుటకును నడుమ ప్రతియోనికి (అవఁగాఁ ప్రతి జాతికిని) నెన్నియో తరములై యుండవలయునని స్పష్టమయియే యున్నది. దీనివలన నుదకమందున్న చిఱుచేఁపలయొక్క గుణధర్మములు క్రమముగా వృద్ధిఁబొందఁగా నా చేఁపయే చివరకు మనుష్యరూపమును బొందుటకు, మధ్యనున్న వేర్వేఱుయోనులలో మొత్తము పై నుమా రేఁబదిమూఁడులక్షల దెబ్బది యైదువేలతరము లుండవలయు ననియు, నీ తరముల సంఖ్యయు వింతకంటె పది రెట్లు పైతము కాఁదగు ననియు, నొక యాంగ్లేయ జీవశాస్త్రజ్ఞుఁడు గుణించెను. నీటియందున్న చిన్న జలచరము మొదలు మనుష్యప్రాణివఱకున్న యోనులివి. వీనియందే చిన్న జలచరములకన్న పూర్వమందుండు సజీవజంతువులనుపైతము కలుపుదు మేని యింక నెన్ని లక్షల తరములఁ గల్పింపవలయునో యూహించి రమారమి వచించుటకు పైతము శక్యము కానేరదు. మన పురాణము లందున్న యెనుబదినాలుగులక్షల యోనులయొక్క కల్పనకంటె నాధిభౌతికశాస్త్రజ్ఞులయొక్క పురాణములి యందున్న తరముల కల్పన యెంత యెక్కువగ నున్నదియు దీని వలన నెఱుంగనగు. కాలకల్పన విషయమునఁ గూడ నిటులే యుండును. సజీవ సృష్టియం దున్న సూక్ష్మజంతువు లీభూమిపై నెప్పుడు పుట్టినవియు స్థూలదృష్టిచే పైతము వచించుటకు శక్యము కానేరదు. సూక్ష్మములగు జలచరముల యుత్పత్తియు కోట్ల కొలఁది వత్సరంబుల క్రిందట నాయె నవి భూగర్భగతజీవశాస్త్రజ్ఞులు చెప్పుచున్నారు. ఈ విషయమున సంక్షేపమగు వివేచనము గుఱించి "The Last Link by Ernst Haeckel with notes, etc., by Dr. H. Gadow (1898)" అను గ్రంథమును జూడుము. ఈ 'గాడో' యనువాఁ డీ పుస్తకముకోఁ జేర్చిన యుపయోగకరము లగు రెండు మూఁడు పరిశిష్టముల నుండి యీ పై విషయములు గ్రహింపఁబడినవి. పురాణముల యందున్న యెనుబదినాలుగు లక్షల యోనుల లెక్కలోఁ దొమ్మిది లక్షలు జలచరము లనియుఁ, బదిలక్షలు పక్షు లనియు, పదునొకండు లక్షలు కృము లనియు, ఇరువది లక్షలు పశువు లనియు, ముప్పదిలక్షలు స్థావరము లనియు ,నాలుగు లక్షలు మనుజు లనియుం జెప్పఁబడినది (దావ బోధ. 20. 6. చూడుము)

జలమునకును సంయోగ మైన పిదప నా బీజములనుండి యంకుర ములు పుట్టుచున్నవి. ఆ యంకురముల నుండి యనేకములగు చెట్లు పుట్టుచున్నవి. పత్రములును బుష్పములును వానివలనఁ బుట్టును. ఆ పుష్పముల నుండి యనేక విధములై మిక్కిలి రుచిగల పండ్లును బుట్టును .... అండజములు, జరాయుజములు, స్వేదజము, లుద్భిజ్జములు ననువాని కన్నిటికిని పృథ్వియు జలమును బీజములై యున్నవి. ఈ సృష్టిరచన మిక్కిలి యద్భుత మైనది. ఇట్లు నాలుగు గనులును, నాలుగు వాక్కులును, ఎనుబదినాలుగులక్షల జీవ యోనులను * త్రిలోకములును, పిండమును, బ్రహ్మాండ మంతయు నిర్మింపఁబడినవి అని సమర్థులచేఁ జెప్పఁబడినదియు దీని ననుసరించియే యున్నది; కాని పంచీకరణముచేఁ గేవల జడపదార్థములే (అనఁగా: దేహములే) యుత్పన్నము లగును. ఈ జడదేహమును నచేతనప్రాణిగ జేయుటకు, దీనితో, తొలుత సూక్ష్మేంద్రియములకును, పిదప నాత్మ కును (అనఁగా: పురుషునకును) సంయోగ మావశ్యక మను దానిని మఱవరాదు.

ఉత్తర వేదాంతగ్రంథముల యందుండు నీ పంచీకరణము, ప్రాచీనము లగు నుపనిషత్తులయందు లే దనియు నిచ్చో నుదువల యును. తన్మాత్రలను, మహాభూతముల నేనింటిని, ఒప్పక ఛాందోగ్యోపనిషత్తులో తేజస్సు, జలము, అన్న (పృథ్వి)ము నను నీ మూఁడు సూక్ష్ము లగు మూలతత్త్వములనే కొని, యీ మూఁటియొక్క మిశ్రణముచేఁ (అనఁగా: 'త్రివృత్కరణము'చే) బిదప వివిధసృష్టియు నిర్మిత మయినదని చెప్పఁబడినది; మఱియు "అజా మేకాం లోహిత శుక్ల కృష్ణాం, బహ్వీ: ప్రజాః సృజమానాం సరూపాః"-ఎఱుపురంగు గలదియు (అనఁగా: తేజోరూపము గలదియు) తెల్లనై నదియు, (అనఁగా: జలరూపము గలదియు), నీలరూపము (అనఁగా: పృథ్వీరూపము) గలదియు, మూఁడు రంగులు (అనఁగా: మూఁడు తత్త్వములు) గల

దియునైన యజ (అనఁగా: ఆఁడు మేక) యందుండి నామరూపాత్మక మగు ననేక ప్రజ (అనఁగా: సృష్టి) యుత్పన్న మైనది అని శ్వేతాశ్వ తరోపనిషత్తునఁ జెప్పఁబడినది. ఛాందోగ్యోపనిషత్తుయొక్క యేడవ యధ్యాయమున, శ్వేతకేతువునకును, వాని తండ్రికిని జరిగిన సంవాదము కలదు. దానియందు సారంభమునందే శ్వేతకేతువునకు నతని తండ్రి స్పష్టముగఁ జెప్పెను- "తండ్రీ! జగత్తున కారంభమున 'ఏకమే వాద్వితీయం సత్', తప్ప, అనఁగా: ఎక్కటి చూచినను, సర్వము, నేకము, నిత్యమునగు పరబ్రహ్మ తప్ప, మఱియొకటి యేమియు లేక యుండెను. ఏది యనత్తో (లేదో) దానియందుండి సత్తు (పదార్థము) ఎట్లుత్పన్న మగును? కావున నారంభమున సత్పదార్థమే యంతటను నిండియున్నది. పిదప నాతని 'కనేకులు కావలయు'నను సంకల్ప (అనఁగా: నేను బెక్కుమంది యగుదు ననుసంకల్ప) ముదయించుటచే దానినుండి క్రమముగ సూక్ష్మమగు తేజస్సు (అగ్ని), అప్పు (జలము), అన్నము (పృథ్వి) ఉత్పన్నము లైనవి. పిదప నీ మూఁడు తత్త్వములయందే జీవరూపముగఁ బరబ్రహ్మ ప్రవేశింపఁగనే వానియొక్క 'త్రివృత్కరణ' మగుటచే జగత్తునం ద నేక నామరూపాత్మక వస్తువులు నిర్మితము లయినవి. స్థూలాగ్నియే (అనఁగా: సూర్యుఁడే), లేక, బీజభూతమగు తేజస్సు నందలి యెఱుపే సూక్ష్మ తేజోరూప మగు మూలతత్త్వముయొక్కయు, తెలుపే (శుక్లము) సూక్ష్మమగు జడతత్త్వముయొక్కయు, నలుపే సూక్ష్మమగు పృథ్వీ తత్త్వముయొక్కయుఁ బరిణామ మయి యున్నది. అటులే మను ఱుఁడు భక్షించుచుండు నన్నమునందును సూక్ష్మతేజస్సు, సూక్ష్మ మగు నప్తత్త్వము (నీటియొక్క తత్త్వము), సూక్ష్మపృథ్వీతత్త్వము నను నీ మూఁడు తత్త్వములే నిండియున్నవి. పెరుఁగును చిలికిన వెన్న వచ్చినటులే వెనుకఁ జెప్పఁబడిన మూఁడు తత్త్వములచేతను సిద్ధించిన యన్న ముదరములోనికిఁ జొచ్చిన పిదప, దానిలోని తేజస్సెముకయు, మజ్జయు, వాణియు, అను వరునగా స్థూలము, మధ్య

మము, సూక్ష్మము నగు పరిణామము నొందును. మఱియు నటులె యప్తత్త్వము నందుండి, మూత్రము, రక్తము, ప్రాణము ననునవియు పృథ్వీతత్త్వము నందుండి పురీషము, మాంసము, మనస్సు నను నీ మూఁడు ద్రవ్యములును బుట్టుచున్నవి (ఛాం. 6. 2-6). మూలము లగు మహాభూతము లయిదింటి నంగీకరింపక మూఁటినే యంగీకరించి త్రివృత్కరణముచే సర్వదృశ్యపదార్థములయొక్క యుత్పత్తి వ్యవస్థను జెఱుఁ (బోధించు) ఛాందోగ్యోపనిషత్తునందును నీ మార్గమే కలదని వేదాన్తసూత్రములలో (20.4.20) చెప్పఁబడియున్నది. కావు ననే పంచీకరణ మను పేరును బాదరాయణాచార్యు లుపయోగింపరు. అయినను తైత్తిరీయము (2. 1) నందును, ప్రశ్నోపనిషత్తు (4. 8) నందును, బృహదారణ్యకము (4. 4. 5) మొదలగు నితరోపనిషత్తులం లందును, శ్వేతాశ్వతరము (6.12) నందును, వేదాన్తసూత్రము (2.3.1-14) లందును, తుదకు గీతలయందును (7.4; 13 5) ఈ మూఁడింటికి మాఱుగఁ బంచమహాభూతములు చెప్పఁబడినవి. గర్భోపనిషత్తునందును, మనుష్యదేహము పంచాత్మక మని యారంభమునందే చెప్పఁబడినది. మహాభారతమునందుఁ గాని, పురాణములయందుఁ గాని, వినియం దుండి గ్రహించియే పంచీకరణము స్పష్టముగఁ జెప్పఁబడినది (మ.భా.శాం. 184-186). ఇందువలన పంచీకరణకల్పన సర్వవేదాన్తులకును దుదకు గ్రాహ్యమై యున్నది. త్రివృత్కరణము మిగుల ప్రాచీన మైనను, మూఁటికి బదులుగ నైదింటి నంగీకరించిన పిదప త్రివృత్కరణముయొక్క పద్ధతి ననుసరించియే పంచీకరణముయొక్క కల్పనయు వెలువడినది. కావున త్రివృత్కరణము వెనుకఁబడినదని స్పష్టముగఁ గాన్పించుచున్నది. మానుషదేహము పంచమహాభూతముల యందుండి పుట్టుటయే కాక, యీ పంచమహాభూతములలోఁ బ్రతి భూతము నయిదు విధములుగ శరీరమునందు విభజింపఁబడియున్నది. ఉదాహరణము- త్వక్కు, మాంసము, అస్థి, మజ్జ, స్నాయువు నను నీ యయిదు నన్నమయ మగు పృథ్వియొక్క వికా

రములే. ఇట్లు పంచీకరణ శబ్దముయొక్క యర్థము పిదప వృద్ధినొంది నది (మ. భా. శాం. 184.20.25, మహారాష్ట్ర భాష యందున్న దాన బోధలో 17.8 చూడు). ఈ కల్పనయుఁ బూర్వోక్తమగు ఛాందోగ్యో పనిషత్తునందలి త్రివృత్కరణముయొక్క వర్ణనపై స్ఫురింపఁబడినదే యని కాన్పించుచున్నది. కారణ మేమన: అక్కడఁ గూడ, తేజస్సు, అప్త త్వము, పృథ్వి యను నీ తత్త్వము లొక్కొక్కటి ముమ్మూఁడు విధ ములుగ మనుష్యదేహమునందు సృష్టమగు చున్నదని తుదకుఁ జెప్పఁ బడినది.

మూలభూతమగు నవ్యక్తప్రకృతి యందుండియైన, వేదాన్త సిద్ధాన్తానుసారముగఁ బరబ్రహ్మ యందుండియైన ననేక నామరూప ముల ధరించిన సృష్టియం దచేతనము (అనఁగా: నిర్జీవములు, లేక, జడపదార్థములు) లెట్లు నిర్మింపఁబడె నను విషయము వివేచింపఁ బడెను. ప్రస్తుతము సృష్టియందలి సచేతనములయొక్క (అనఁగా: సజీవప్రాణుల యొక్క) యుత్పత్తి విషయములో సాంఖ్యశాస్త్రము చెప్పు విశేష మంతయు విచారించి, పిదప వేదాన్తశాస్త్రములో నున్న సిద్ధాన్తమునకును దానికిని నున్న సంబంధ మెంతవఱ కని విచారించె దము. మూలప్రకృతి వలన వెలువడిన పృథివ్యాదిస్థూల పంచమహా భూతములకును, సూక్ష్మమగు నింద్రియములకును, సంయోగ మగు నేని, సజీవప్రాణుల దేహము సిద్ధమగును; కాని యీ శరీరము సేం ద్రియ మైనను జడమే. ఈ యింద్రియములను ప్రేరేపించు తత్త్వము జడప్రకృతికంటె భిన్న మయినందున దానిని పురుషుఁ డని చెప్పుచు న్నారు. ఈ పురుషుఁడు తొలుత అకర్త యగుటచే, వానికిని ప్రకృతి కిని సంయోగ మగునేని సజీవసృష్టి యారంభ మగును. మఱియు "నేను వేఱు, ప్రకృతి వేఱు" అను జ్ఞానము కలిగిన పిదపఁ బ్రకృతి పురుషుల కిదివఱకున్న సంయోగము నశించుటచే ముక్తి కలుగును. లేనియెడల జననమరణ ప్రవాహమునం దతఁడు పడవలసియే యుం

డునను నీ సాంఖ్యులసిద్ధాన్తము వెనుకటి ప్రకరణమునఁ జెప్పఁబడి యున్నది; కాని 'పురుషుడువేఱు-ప్రకృతి వే'ఱను జ్ఞానము లేనందున మరణము నొందు నాత్మకు (సాంఖ్యపరిభాషానుసారముగ పురుషునకు) ఈ నవీనములగు జన్మము లెటుల ప్రాప్తము లగు ననువివేచన మింతవఱకుఁ జేయకపోవుటచే దాని విషయమై యిచ్చోఁ జక్కగా విచారించుట మిక్కిలి యావశ్యక మయి యున్నది. జ్ఞానము లేక చచ్చిన మనుజుని యాత్మ ప్రకృతి చక్రములో నుండి ముక్తి నొంద దను నంశము స్పష్టముగనేయున్నది. కారణ మేమి యన: అటులగు నేని, జ్ఞానమున కైనను, పాపపుణ్యముల కైనను గౌరవము లేమిచే, మరణానంతరమునఁ బ్రతి వ్యక్తి యు ప్రకృతి యందుండి మోక్షమును బొందుచున్న దని చార్వాకునివలెఁ జెప్పఁవచ్చును. మంచిదే! మరణానంతరమునం దాత్మయే (పురుషుఁడే) మిగిలియుండుటచే కానే నూతనము లగు జన్మములను బొందుటకుఁ దగిన పనులపుచున్నాఁడని చెప్పితి మేని, పురుషుఁ డకర్తయు నుదాసీనుఁడు కాన, సర్వకర్తృత్వ మీ మూలభూతసిద్ధాన్తమునకు బాధను కలిగించును. ఇంతియే కాక యాత్మ స్వయముగనే నూతన జన్మములను బొందు నని యంగీకరించితి మేని, యిది దాని ధర్మమగుటచే, జనన మరణప్రవాహము నందుండి, యెప్పుడును ముక్తి నొందుట సాధ్యము కాదని యనవస్థయుఁ బ్రాప్త మగును. కావున జ్ఞానములేకయే మనుజుఁడు మరణించినను, నూతనజన్మలను గలిగింపఁ జేయు ప్రకృతికిని పురుషునకును సంబంధ ముండవలయు ననియే సిద్ధ మగును. అయినను మరణానంతరమున స్థూలదేహమునకు నాశము గలుగుటచే నీ సంబంధ మిప్పుడు స్థూలమహాభూతాత్మక ప్రకృతితో కానేర దని స్పష్ట మగుచున్నది. కాని ప్రకృతి యనఁగా నొక స్థూలపంచమహాభూతములే యని యర్థము కానేరదు. ప్రకృతి యందుండి మొత్తమున నిరువదిమూఁడు తత్త్వములు నిర్మితము లగుచున్నవి. స్థూలమహాభూతములును నీ యిరువదిమూఁటిలోను గడపటి యై దై యున్నవి. ఈ కడపటి

వైన యైదు తత్త్వములను (పంచమహాభూతములును) మొత్తము మీఁద నిరువదిమూఁడు తత్త్వములలోనుండి తీసివైచితి మేని మిగులు నవి పదునెనిమిది తత్త్వములు. కావున జ్ఞానములేక మృతినొందిన మనుజుఁడు పంచమహాభూతాత్మక శరీరమునుండి (అనఁగా: కడపటి యైదు తత్త్వముల యందుండి) విముక్తుఁ డయినను ప్రకృతియొక్క యితరములగు పదునెనిమిది తత్త్వములతో నున్న సంబంధ మీ మరణముచేఁ బోదని మొత్తముపై ఫలితార్థము తేలినది. మహత్తు (బుద్ధి) అహంకారము, మనస్సు, దశేంద్రియములు, పంచతన్మాత్రలు ననునవి పదునెనిమిది తత్త్వములు (816వ పుటలో బ్రహ్మాండముయొక్క వంశవృక్షమును చూడుము) ఇవన్నియు సూక్ష్మములుగనే యున్నవి. కావునఁ బురుషునకును, వీనికిని సంయోగము స్థిరమగుటచే, పుట్టిన దేహమును స్థూలశరీరమునకు విరుద్ధమగు సూక్ష్మశరీరము, లేక, లింగశరీరము అని చెప్పుచున్నారు (సాం. కా. 40). ఒకానొక ప్రాణి జ్ఞానవిహీనుఁడై మృతినొందె నేని, మరణసమయమునం దతని యాత్మతోనే ప్రకృతియొక్క పదునెనిమిది తత్త్వము లను నీ లింగశరీరము స్థూలదేహమునుండి లేచి పోవును. జ్ఞానప్రాప్తి యగు పర్యంత మా పురుషుఁడు నూతనజన్మల నొందవలసి వచ్చును. మనుష్యుఁడు మృతినొందిన పిదప జీవముతో జడదేహమునుండి బుద్ధి, యహంకారము, మనస్సు, దశేంద్రియములును, వాని వ్యాపారములును నష్టమగుట ప్రత్యక్షసిద్ధమే. కావున లింగశరీరమునం దీ పదుమూఁడు తత్త్వములఁ జేర్చుట కేమియు నభ్యంతరము లేదు. కాని, "యీ పదుమూఁడు తత్త్వములతో, పంచసూక్ష్మతన్మాత్రలను లింగశరీరములోఁ జేర్చుట కేమియుఁ గారణము కాన్పింపదు" అని దీనిపై ననేకులు శంకఁ జేయుదురు. "మహత్తు, అహంకారము, మనస్సు, దశేంద్రియములు నను నీ పదుమూఁడు తత్త్వములే ప్రకృతియొక్క గుణములు. నీడకు పదార్థముయొక్క యు, చిత్తరువునకు గోడ, లేక, కాగితముయొక్క యు

నాశ్రయము లెటు లవసరములో యటులే యీ గుణాత్మకములగు పదుమూఁడు తత్త్వములు నొకచోట నుండుట కేదైన నొక యాధారము కావలయు" నని సాంఖ్యులు దీనికి నుత్తరమును వచించెదరు. వీనిలో నాత్మ (పురుషుఁడు) స్వయముగ నిర్గుణుడు, నకర్తయు నగుటచే స్వయముగనే గుణముల కాధారము కానేరఁడు. మనుజుఁడు జీవించియున్నప్పు డతని దేహము నందున్న స్థూలపంచమహాభూతములే యీ పదుమూఁడు తత్త్వములకు నాశ్రయ మగుచున్నవి కాని మరణానంతరమున (స్థూలదేహనాశానంతరమున) స్థూలపంచమహాభూతములకు నీ యాశ్రయ ముండనేరదు. అప్పు డీ గుణాత్మకములగు తత్త్వములకు నేదయిన మఱియొక ద్రవ్యాత్మక మాశ్రయముగ నుండవలయును. మూలప్రకృతి యాశ్రయ మంటి మేని యది యవ్యక్తము, అవికృతము నగు స్థితిలో నుండుటచే (అనఁగా: అనంతము, సర్వవ్యాపకమునగుటచే) నొక చిన్న లింగశరీరమున బుద్ధ్యాది గుణములకు నాధారము కానేరదు. కావున మూలప్రకృతియొక్క ద్రవ్యాత్మకవికారములలోనే, స్థూలమహాపంచభూతములకు మాఱుగ వానికి మూలభూతములగు పంచసూక్ష్మతన్మాత్ర ద్రవ్యములకును, పూర్వోక్తములగు గుణములకువలెనే యాశ్రయము లను తలంపున, లింగశరీరమునందు సమావేశము చేయవలసివచ్చును (సాం.కా. 41). అనేకులు సాంఖ్యగ్రంథకారులు లింగశరీరమునకును స్థూలశరీరమునకును నడుమఁ బంచతన్మాత్రవికారమగు మూఁడవశరీరమును గల్పించి యది లింగశరీరమున కాశ్రయ మని ప్రతిపాదించు చున్నారు. కాని, సాంఖ్యకారికల యందున్న నలువదియొకటవ యార్యావృత్తమునకు సత్యమగు నర్థమటుల కానేరదు. కావున, టీకాకారులు భ్రాంతిచే మూఁడవ శరీరమును గల్పించి రని మా యభిప్రాయము. ఏలన: ఈ యార్యావృత్తమునకు బుద్ధి మొదలుగాఁ గల పదుమూఁడుతత్త్వముల వలెఁ బంచతన్మాత్రలను లింగశరీరమునందుఁ జేర్చుటకుఁ గారణమును

దెలుపుటఁ దప్ప మఱియొక యుద్దేశ మేమియు లేదని మా యూహ.*

సూక్ష్ములగు పదునెనిమిదితత్త్వముల వికారమగు సాంఖ్యోక్త లింగశరీరమునకును, ఉపనిషత్తులలో వర్ణింపఁబడిన లింగశరీరమున కును విశేషభేదము లేదని కొంత విచారించిన నెవరికైనఁ దెలియును. "తృణజలూక యే రీతిగ నొక గడ్డి పరకయొక్క చివరకుఁ బోయి యా ప్రదేశమును పట్టుకొని మఱియొక పరకను ముందుకాళ్లతోఁ బట్టుకొని, వెనుకటి తృణముపై నున్న తన వెనుకటి భాగము నెటుల లాగుకొనునో యట్లే యాత్మ యొక శరీరమును వదలి మఱియొక శరీరములోనికి వెళ్లుచున్న"దని, బృహదారణ్యకోపనిషత్తులో (4.4.3) వచింపఁబడియున్నది; కాని, యీ యొక దృష్టాంతమునుండియే, ఒక యాత్మయే మఱియొక శరీరములోనికి వెళ్లుచున్న దనియు, అదియు నొక శరీరము పోయిన వెంటనే పోవుచున్నదనియు నీ రెండను మానములు సిద్ధములు కానేరవు. కారణ మేమి యన: బృహదారణ్యకోపనిషత్తులోనే పిదప (బృ. 4.4.5) ఆత్మవలెనే (సూక్ష్ము లగు)

---

* శబ్దకుమారిలనిచే రచియింపఁబడిన 'మీమాంసాశ్లోకవార్తిక' మను గ్రంథములోనున్న యీ శ్లోకములో (ఆత్మవాద. శ్లో. 82) వాదును మేము చెప్పినటులనే యీ యార్య కర్థము వ్రాసినటుల కాన్పించుచున్నది.

అంతరాభవదేహో హి నేష్యతే వింధ్యవాసినా,
తదస్తిత్వే ప్రమాణం వా న కించి దవగమ్యతే.

అంతరాభవ, అనఁగా లింగశరీరమునకును స్థూలశరీరమునకును మధ్య నున్న, దేహము, లేక, శరీరము వింధ్యవాసికి సమ్మతము కాదు. ఇట్టి దేహ మున్నదని వచించుటకుఁ బ్రమాణములేదు. ఈశ్వరకృష్ణుఁడు వింధ్యపర్వతమున నివసించుఁ గాన వతనికి వింధ్యవాసి యని పేరు. అంతరాభవ శరీరమునకు గంధర్వ మనియు మఱియొక నామము గలదు. అమరకోశమున 1.8.182 వ శ్లోకమున, దానిపై. రా.రా. 'కృష్ణజీగోవిందజీ' అను వానిచే ప్రచురింపఁబడిన 'క్షీరస్వామియొక్క టీక' యను నీ గ్రంథముయొక్క ప్రస్తావనలోని యెనిమిది యవ పుటను జూడుము.

పంచభూతములు, మనస్సు, ఇంద్రియములు, ప్రాణములు, ధర్మాధర్మములు అనునవియు, శరీరమునందుండి వెలువడినటుల చెప్పబడినది. కావున, నాత్మకు స్వకర్మానుసారముగ నా యాలోకములయొక్క ప్రాప్తియగును గాన, నచ్చోఁ గొంతకాల ముండు నని చెప్పబడుచున్నది (బృ. 6.2.14-15). ఈ తీరుననే ఛాందోగ్యోపనిషత్తునందును, జలమను మూలతత్త్వముతో నున్న జీవునికిఁ గలుగు గతి వర్ణింపబడుటచేత (ఛాం. 5.3.3; 5.9.1) దానికి వేదాన్తసూత్రములలో నిర్ణయింపబడిన యర్థము నందుండియు (వే.సూ. 3. 1. 1-7) లింగశరీరము నం దుదకమువలె, తేజస్సు, అన్నము నను మూఁడు మూలతత్త్వములకును సమావేశము చేయుట ఛాందోగ్యోపనిషత్తునకు నిష్టముగనే యున్నదని స్పష్టమగును. సారాంశ మ్మేమన- మహదాదిగ పదునెనిమిది సూక్ష్మతత్త్వములచే నిర్మితమగు సాంఖ్యుల లింగశరీరమునందు ప్రాణములు, ధర్మాధర్మములు (అనఁగా: కర్మలు) ననునవి చేరె నేని వేదాన్తమం దున్న లింగశరీర మగు నని తెలుచున్నది; కాని సాంఖ్యశాస్త్రానుసారముగ నేకాదశేంద్రియముల వృత్తియందును, ప్రాణముల వృత్తియందును, బుద్ధీంద్రియ వ్యాపారములయందును ధర్మాధర్ముము లుండును. కావున నీ భేదము శబ్దకృతమే యగుటచే లింగశరీరముయొక్క ఘటనవిషయ మయి వేదాన్తులకును సాంఖ్యులకును యథార్థముగ నేమియు భేదము లేదని సైతము చెప్పవచ్చును. ఈ కారణముననే మైత్ర్యుపనిషత్తులో (మై. 6. 10) "మహదాదిసూక్ష్మ పర్యంతం" అను సాంఖ్యోక్త మగు లింగశరీరముయొక్క లక్షణము "మహదాద్యవిశేషాంతం" అని ఇట్లు పర్యాయశబ్దములచే వచింపఁబడినటుల కాన్పించుచున్నది.* భగవద్గీతలయందు- "మనష్షష్ఠానీంద్రి

---

* ముప్పదిరెండు ఉపనిషత్తులుగల యానందాశ్రమ ప్రతియందు మైత్ర్యుపనిషత్తునందలి మైమంత్రమునకు "మహదాద్యం విశేషాంతం" అను పాఠము వ్రాయఁబడినది. దానినే టీకాకారులును స్వీకరించిరి. ఈ పాఠమును స్వీకరించితిమేని యారంభమున నున్న మహత్తత్త్వమును లింగశరీరమునఁ జేర్చి 'విశే

యాణి"– "మనస్సు పంచజ్ఞానేంద్రియములు ననునవియే సూక్ష్మ శరీర మగును" (15. 7) అని చెప్పన పిదప "వాయుర్గంధా నివాశ యాత్"– వాయు వెటుల పుష్పములలోని సుగంధమును హరించునో యటులే జీవము స్థూలశరీరమును వదలి పెట్టినను నీ లింగశరీరమును దనతోఁ దీసికొని వెళ్లును (15-8) అని చెప్పఁబడియున్నది. అయినను గీతలలో నున్న యధ్యాత్మజ్ఞాన ముపనిషత్తులయం దుండియే వెలువడిన దగుటచే నీ శబ్దమునందే మనస్సుతోఁ గూడి యాఱింద్రియములును, అయిదు కర్మేంద్రియములును, పంచతన్మాత్రలును, ప్రాణమును పుణ్యపాపములును అను పీనియొక్క సంగ్రహము భగవంతున కిష్టమైన దని చెప్పవలయును. మనుజుఁడు మృతిఁ జెందెనేని యీ జన్మ యం దలి పుణ్యపాపముల ఫలమును భోగించుట కొఱకుఁ పంచతన్మాత్ర రూపమగు సూక్ష్మశరీరము ప్రాప్తమగు నని మనుస్మృతియందును చెప్పఁబడినది (మను. 12.16-17) "వాయుర్గంధా నివాశయాత్" అని గీతలలో నున్న దృష్టాంతము నందుండి యీ శరీరము సూక్ష్మ

షాంతం' అను వదములతో సూచింపఁబడిన విశేషమును (అనఁగా: పంచమవా భూతమును) వదల వలసి వచ్చును. అనఁగా: 'మహదాద్యం' అనుదానిలో మహత్తును స్వీకరించి, 'విశేషాంత' మనుదానిలో విశేషమును వదలవలయు నని యర్థము చేయవలసివచ్చును. కాని యాద్యంతములు చెప్పఁబడినపుడు రెంటిని గ్రహించుట గాని, రెంటిని వదలివేయుటగాని యుక్తమగును. కావున 'మహదాద్యం' అనువదములో చివర నున్న యవస్వారమును తీసివైచి "మహదాద్య విశేషాన్తం" (మహదాది + అవిశేషాన్తం) అని పాఠము గ్రహింపవలయు నని ప్రొఫెసర్ 'దాయవర్' అను నతఁడు చెప్పెను. ఇట్లు చేయుట మేని, (అవిశేషం, అని వదచ్చేదముఁ జేసి మహత్తునకు నవిశేషమునకు (అనఁగా: ఆద్యంతముల రెంటికిని) నొక న్యాయమే యన్వయించుచుండుటచే రెంటికిని లింగశరీరము నందు సమావేశము కాఁగలదు ఇదియే యీ పాఠమునందలి విశేషగుణము. కాని యీ పాఠమును గ్రహించిన వర్థమునందు భేద మేమియు నుండదని గుర్తుంచు కొనవలయును.

ముగ నున్నదని మాత్రమే సిద్ధమగును. దానియొక్క యాకారమెంతో తెలియరాదు; కాని మహాభారతమునం దున్న సావిత్ర్యుపాఖ్యాన ములో (మ. భా. వన. 296. 16) సత్యవంతుని స్థూలమగు శరీరమం దుండి యంగుష్ఠమాత్ర పురుషుడు యమునిచే వెలి కీడ్వబడె ననియున్నది. "అంగుష్ఠమాత్రం పురుషం నిశ్చకర్ష యమో బలాత్" — ఈ వర్ణన వలన నీ లింగశరీరము దృష్టాంతమునకైన నంగుష్ఠమంత యాకారము గలదని యంగీకరించినటుల కాన్పించుచున్నది.

లింగశరీరము మన చర్మ చక్షుస్సులకుఁ గాన్పింపక పోయినను అది యుండునట్లె యనుమానముచే సిద్ధ మైనదియు, ఆ శరీరమునకు ఘటకావయవములు లేవనియు విచారించితిమి కాని, ప్రకృతిని పంచస్థూలమహాభూతములను వదలి శేషించిన పదునెనిమిదితత్త్వముల యొక్క సముచ్చయముచే లింగశరీరము నిర్మిత మగునని చెప్పుటచే సర్వవిధములగు సంశయములు తీరవు. లింగశరీర మున్న స్థలముల యందెల్ల నీ పదునెనిమిదితత్త్వముల సముచ్చయమును, స్వస్వగుణ ధర్మానుసారముగ, మాతాపితల స్థూలదేహమునందుండి కాని, పిదప స్థూలసృష్టియందున్న యన్నమునందుండి కాని, హస్తపాదాది స్థూలావయవములను, లేక, స్థూలేంద్రియములను పుట్టించి వాని పోషించువిషయమునం దేమియు సంశయము లేదు; కాని పదునెనిమిదితత్త్వముల సముచ్చయముచేఁ గలిగిన లింగశరీరము, పశువులు, పక్షులు, మనుజులు నను వేర్వేఱు దేహముల నేల పుట్టించునదియు నిప్పటికిని జెప్పవలసియే యున్నది. సజీవసృష్టియందున్న సచేతనతత్త్వములను, సాంఖ్యులు పురుషుడని చెప్పుచున్నారు; సాంఖ్యమతమునం దీపురుషులసంఖ్య లయినను, ప్రతిపురుషుడును స్వభావముగ నుదాసీనుడు నకర్తయు నగుటచేఁ బశుపక్ష్యాదిప్రాణుల ప్రత్యేక దేహములను నిర్మించుటయందుఁ గర్తృత్వము పురుషుని వైపునకు రానేరదు. వేదాన్తసూత్రమునందుఁ బాపపుణ్యాటకర్మల

పరిణామముచే నీ భేద ముత్పన్నమగు నని యున్నది. ఈ కర్మవిపాక వివేచన పిదపఁ జేసెదము. సాంఖ్యశాస్త్రానుసారముగఁ గర్మయనునది ప్రకృతి పురుషులకంటె భిన్న మగు మూఁడవతత్త్వ మనుటకు వీలు లేదు. పురుషుఁ డుదాసీనుఁడుగ నున్నాఁడు. కావుననే కర్మయనునది ప్రకృతి సంబంధములగు సత్త్వరజస్తమోగుణముల వికారమే యై యున్న దనవలసి వచ్చును. లింగశరీరములో నున్న పదునెనిమిది తత్త్వముల సముచ్చయములో బుద్ధి యనునది ముఖ్య మయినది. కారణ మేమి యన: బుద్ధియందుండియే యహంకారము మొదలగు పదునేడుతత్త్వము లుత్పన్నము లగును. వేదాన్తములోఁ గర్మ యని చెప్పఁబడుదానినే సాంఖ్యశాస్త్రములో సత్త్వరజస్తమస్సులను మూఁడు గుణముల హెచ్చుతగ్గులచేఁ గలుగు బుద్ధియొక్క వ్యాపారమని యైనను, ధర్మమని యైనను, వికారమని యైన నందురు. బుద్ధి యొక్క యీ ధర్మములకు 'భావము' లని పేరు గలదు. ఈ సత్త్వ రజస్తమోగుణముల తారతమ్యముచే నీ భావ మనేక విధములుగ నున్నది. పుష్పములకు వాసనవలె, వస్త్రములకు రంగువలె, లింగ శరీరమునకు నీ భావము లంటుకొని యుండును (సాం. కా. 40). ఈ భావములవలెఁ గాని, వేదాన్తుల పరిభాషయందలి కర్మవలెఁగాని, లింగశరీరము సైతము నూతనముగ జన్మింపవలసి వచ్చును. ఒకజన్మ మెత్తుచు మాతాపితల శరీరమునందుండి యే ద్రవ్యమును లింగశరీర మాకర్షించుకొనుచున్నదో యా ద్రవ్యములయందు సైతము మరల నితరము లగు భావములు వచ్చుచున్నవి. దేవయోని, మనుష్య యోని, పశుయోని, వృక్షయోని యను భేదము లీ భావసంబంధ మగు సముచ్చయముయొక్క. పరిణామము లగుచున్నవి (సాం.కా. 43. 55.). ఈ సర్వభావములలో సాత్త్వికగుణములు వృద్ధి చెందిన మనుజునకు జ్ఞానవైరాగ్యములు ప్రాప్తము లగును. వాని మూలమున ప్రకృతి పురుషుల భేదము తెలియును. అప్పుడు పురుషుఁడు మూల భూతమగు కైవల్యమును బొందును. మఱియు లింగశరీరము వదలి

పోయె నేని, యతని దుఃఖ మత్యంతము నివర్తించును. కాని యీ ప్రకృతి పురుషభేద మెఱుంగక సాత్త్వికగుణమే యుత్కర్షము నొందె నేని లింగశరీరము దేవయోనియందు (అనఁగా: స్వర్గమునందు) జన్మము నొందును. రజోగుణము ప్రబలమగునేని మనుష్యయోని యందు (అనఁగా: పృథ్వియందు) జనించును. తమోగుణాధిక్య మగునేని తిర్యగ్యోనియందుఁ బుట్టవలసి వచ్చును (గీ. 14 8).

ఈ తీరున మానవయోనిలో జన్మించిన పిదప, రేతోబిందువు నందుండి, క్రమముగ కలలము (మావి), బుద్బుదము, మాంసము, పేశి (గ్రుడ్డు), పిమ్మట వేర్వేఱగు స్థూలేంద్రియము లెఱుఁగు పుట్టు నను విషయము "గుణా గుణేషు జాయన్తే" అను సిద్ధాన్తము నవలంబించియే సాంఖ్యశాస్త్రములోఁ జెప్పఁబడినది (సాం. కా. 43; మ. భా. శాం. 320). గర్భోపనిషత్తులోను దఱుగ నటులే చెప్పఁబడినది. సాంఖ్యశాస్త్రమునందలి 'భావ' శబ్దమునకుఁ బూర్వోక్త మగు పారిభాషికార్థము, వేదాన్తగ్రంథములలో నుద్దేశింపఁబడకపోయినను భగవద్గీతలలో- "బుద్ధి ర్జ్ఞాన మసమ్మోహ: క్షమా సత్యం దమ శ్శమ:" ఇత్యాది గుణములను దీని పిదప నుండు శ్లోకమునందు భగవంతుఁడు 'భావము'లని పేర్కొనెను (గీ. 10. 4-5; 7. 12). అది తఱుగ సాంఖ్యశాస్త్రముయొక్క పరిభాషను మనంబున నిడుకొనియే చెప్పఁబడియుండు నని పూర్వోక్త మగు వివేచనమువలనఁ దెలియును. ఈ తీరున సాంఖ్యశాస్త్రానుసారముగ మూలము, నవ్యక్త ము నగు ప్రకృతి యందుండి యైన, లేక, వేదాన్తానుసారముగ మూలము, నద్వ్యూపము నగు పరబ్రహ్మమందుండి యైన, సృష్టియం దున్న సర్వసజీవపదార్థములును, నిర్జీవములగు వ్యక్త పదార్థములును, క్రమముగ నిర్మితములయిన పిదప, సృష్టియొక్క సంహారసమయము వచ్చినపుడు పూర్వోక్త మగు సృష్టియొక్క గుణపరిణామక్రమమునకు విపరీతక్రమముగనే సర్వవ్యక్తపదార్థములు నవ్యక్తప్రకృతియం దైనను, లేక, మూల

భూతమగు బ్రహ్మమందైనను లయ మగుచున్నవని, సాంఖ్యవేదాన్తో భయశాస్త్రములయొక్క సిద్ధాన్తము (వే. సూ. 2.3.14; మ.భా.శాం. 282). ఉదాహరణము-పంచమహాభూతములలో పృథ్వి జలములోను, జల మగ్నిలో, నగ్ని వాయువులో, వాయు వాకాశములో, నాకాశము తన్మాత్రలలో, తన్మాత్ర లహంకారమునందు, నహంకారము బుద్ధి (మహత్తు) యందు, బుద్ధి, లేక, మహత్తు ప్రకృతియందు, వేదాన్తానుసారముగ బ్రకృతి మూలబ్రహ్మమునందును లయము నొందుచున్నవి.

సృష్టి ప్రారంభమయిన పిదప లయ మగు వఱకు నెంత కాల మగు ననునది యెక్కడను సాంఖ్యకారికలలోఁ జెప్పఁబడలేదు. అయినను మనుసంహితయందును (1.66-78), భగవద్గీతలయందు (8.17), మహాభారతమునందును (శాం. 231) చెప్పఁబడిన కాలగణన సాంఖ్యులకు సైతము మాన్యము కాకపోదు. మన యుత్తరాయణము దేవతలకుఁ బగలు, మన దక్షిణాయనము దేవతలకు రాత్రియు నగును; కారణ మేమి యన: సూర్యుఁడు మేరుపర్వతమునందు (అనఁగా: ఉత్తరధ్రువస్థానమునందు) నుండు నని స్మృతిగ్రంథములందే కాక, జ్యోతిశ్శాస్త్రముయొక్క సంహితయందును వర్ణింపఁబడినది (సూర్యసిద్ధాన్తము 1.13; 12.37-67). అనఁగా: రెండయనములు గలసి మనకు నొక యేఁడగునేని దేవతలకు నొక యహోరాత్రమును, మఱియు మనకు 360 సంవత్సరము లగునేని దేవతలకు 360 యహోరాత్రములును, లేక, యొక వత్సరము నగును. కృత, త్రేతా, ద్వాపర, కలియుగము లని నాలుగు యుగము లున్నవి. కృత యుగమునకు నాలుగువేల వత్సరములును, త్రేతాయుగమునకు మూఁడువేల వత్సరములును, ద్వాపరయుగమునకు రెండువేల వత్సరములును, కలియుగమున కొకవేయి వత్సరముల చొప్పున నీ యుగములు కల్పింపఁబడినవి. కాని యొక యుగము సమాప్తినొందిన

వెంటనే రెండవయుగము ప్రారంభము కామిచే, రెంటిమధ్యను సంధి కాలముగ కొన్ని వత్సరంబులు నడచు చున్నవి. కృతయుగమయొక్క యాద్యంత సంధికాలములో నొక్కొక్కదానికి నన్నూఱు వత్సరములును, త్రేతాయుగముయొక్క సంధులలో నొక్కొక్కదానికి మున్నూఱువత్సరములును, ద్వాపరయుగముయొక్క యాద్యంత సంధులలో నొక్కొక్కదానికి ఇన్నూఱువత్సరములును, కలియుగ సంధికాలములో నొక్కొక్కదానికి నూఱువత్సరములును గలిసి వేయి వత్సరములు కావున నాలుగుయుగముల సంధిద్వయమునకు మొత్తముపై రెండు వేల వత్సరములు సంధికాల మగును. ఈ రెండువేల వత్సరములను కృతయుగ, త్రేతాయుగ, ద్వాపరయుగ, కలియుగములకు మొదట ప్రాయఁబడిన సంఖ్య ననుసరించి పదివేల వత్సరములును, కలిసి మొత్తముపై నాలుగు యుగములకున్న పండ్రెండువేల వత్సరములును మనుష్యమానములా? దేవమానములా? మానుష్యములే యందుమేని కలియుగ మారంభమై యిప్పటి కైదువేల వత్సరము లగుచుచే, వేయి మానవ వత్సరములు కలిగిన కలియుగము సమాప్తి బొందుటయకాక దానిపిదప రాఁబోవు కృతయుగము సైతము సమాప్త మగుటచే మన మిప్పుడు త్రేతాయుగమున నున్నా మని చెప్పవలసివచ్చును. ఈ విరోధపరిహారార్థమై యీ పండ్రెండువేల సంవత్సరములును దేవ మానముచే గణన యని పురాణములయందు నిశ్చయింపఁబడినది. దేవతల పండ్రెండువేల సంవత్సరంబులందు మేని మనుష్యులకు $360 \times 12000 = 43,20,000$ నలువదిమూఁడులక్షల యిరువదివేల సంవత్సరము లగును. ఇప్పటికి పంచాంగమునందున్న యుగపరిమాణ మీ పద్ధతి ననుసరించియే యున్నది (దేవతలయొక్క). ఈ పండ్రెండువేలయేం డ్లనఁగా: మనుష్యులకు మహాయుగము, లేక, దేవతల యుగ మగును. దేవతల డెబ్బదియొక్క యుగములకు మన్వంతర మని పేరు. పదునాలుగు మన్వంతరములు కలవు. మొదటి మన్వంతరముయొక్క ప్రారంభమునందును, చివరయందును,

మఱియు, తర్వాతనుండు ప్రతి మన్వంతరముయొక్క అంతమున నుండు నాద్యంతకాలముతోఁ జేరి యొక్కొక్కటి కృతయుగమంత ప్రమాణముగల పదునైదు సంధికాలము లగుచున్నది. ఈ పదునైదు సంధికాలములును, పదునాలుగుమన్వంతరములును కలిసి, దేవతలకు నొక వేయియుగములు, లేక, బ్రహ్మదేవునకు నొక దివస మగును. (సూర్యసిద్ధాంతము. 1.15-20) తిరుగ నిట్టి వేయియుగము లగునేని బ్రహ్మదేవునకు నొక రాత్రి యగునని మనుస్మృతియందును, మహాభారతమునందు నున్నది (మను. 1.69-73; మఱియు, 79; మ.భా. శాం. 231.18-31; మఱియు యాస్కునియొక్క నిరుక్తము. 14.9 చూడు).

ఈ గణనానుసారముగ బ్రహ్మదేవున కొక పగ లనఁగా: మనుష్యునకు నాలుగు పద్మముల ముప్పదిరెండు కోట్ల సంవత్సరము లగును. దీనికే కల్పమని పేరు* బ్రహ్మదేవుని యీ దివసము, లేక, కల్పము, ఆరంభ మగునేని—

అవ్యక్తా ద్వ్యక్తయ స్సర్వాః ప్రభవ న్త్యహరాగమే,
రాత్ర్యాగమే ప్రలీయన్తే త ఏ వావ్యక్తసంజ్ఞకే.
(గీ. 8.18.)

— అవ్యక్తము నందుండి సృష్టియందున్న సర్వవ్యక్తపదార్థములు పుట్టుచున్నవి; మఱియు బ్రహ్మదేవునకు రాత్రి యారంభ మగునేని యీ సర్వవ్యక్తపదార్థములును మరల నవ్యక్తములో లయము నొందుచున్నవి అని భగవద్గీతలయందును (మఱియు, గీత. 9.7 చూడుము), స్మృతిగ్రంథములందును, మహాభారతమునందును, నితరగ్రంథము

* జ్యోతిశ్శాస్త్రానుసారముగ యుగాదిగణనయొక్క విచారమునకై శంకర బాలకృష్ణదీక్షితునిచే, తన 'భారతీయజ్యోతిశ్శాస్త్ర' మను పేరుగల గ్రంథమున పలుమాఱు విరూపింపఁబడినది. (చూడు.పు. 103-105; 193 మొదలగునవి.)

లందును చెప్పఁబడినది. ఇంతియకాక ప్రలయము పురాణాదికముల యందు మఱియొక విధముగను నిరూపింపఁబడియున్నది; కాని సూర్యచంద్రాదికమగు సకలసృష్టియునప్పుడు (ఈ ప్రళయమునందు) నష్టము కానేరదు. గావున నీ ప్రళయమును, బ్రహ్మాండముయొక్క యుత్పత్తిలయములతోఁ బోల్చినపుడు, గణనకు రా నవశ్యము లేనిది యగును. అనఁగాఁ లెక్కలోనే యుంచరు. కల్పమనఁగాఁ బ్రహ్మ దేవున కొక పగలు గాని, రేయి గాని యగును. ఇట్టివి 360 పగళ్లును 360 రాత్రులును నగు నేని, అతనికి నొక వత్సర మగును. కావుననే బ్రహ్మదేవునియొక్క యాయుష్యము బ్రహ్మమానానుసారముగ నూఱువత్సరములే యని కల్పించుటచే వానిలో నగ మాయుష్యము చని రెండవ నగముయొక్క (అనఁగాఁ వీఁబదియొకటవ సంవత్సరము యొక్క) మొదటి దివసము, లేక, శ్వేతవరాహ మను పేరుగల కల్ప మిప్పు డారంభ మాయెను; ఈ కల్పముయొక్క పదునాలుగు మన్వం తరములలో నాఱు మన్వంతరములు గడచి యేడవ మన్వంతరము యొక్క (అనఁగాఁ వైవస్వతమన్వంతరముయొక్క) డెబ్బదియొక్క మహాయుగములలో నిరువదియేఁడు మహాయుగములు గడచినవి. ఇరువదియెనిమిదవ మహాయుగమునందున్న కలియుగముయొక్క ప్రథమ పాదము (అనఁగాఁ చతుర్థభాగము) ప్రకృతము జరుగు చున్నదని పురాణాదిగ్రంథములలో నున్నది (విష్ణుపురాణము 1. 3. చూడు). శక॥ 1821-వ సంవత్సరమునకు నీ కలియుగముయొక్క 5000 యేండ్లు గడచినవి. ఇట్లు లెక్కింతు మేని కలియుగమునందు ప్రళయ మగుటకు, శక॥ 1821-వ సంవత్సరమునకు మనుష్యమాన ప్రకారముగ 3,91,000 వత్సరములు మిగులునవి కాన్పించుచున్నది; ప్రస్తుతమన్వంతరపు తుదను గాని, లేక, వర్తమాన కల్పాన్తమునఁ గాని, కాఁబోవు మహాప్రళయపు నంగతి దూరముగనే యున్నది. మనుష్యమానము ప్రకారము నాలుగుపద్ములు ముప్పదిరెండుకోట్ల

వత్సరంబులకు బ్రహ్మదేవునకు ప్రకృతము నడచుచున్న యీ దినము యొక్క పూర్ణమధ్యాహ్నము (అనఁగా: ఏడవమన్వంతరము) ఇంకను ముగియలేదు.

ఇంతదనుక చేయఁబడిన సృష్టిప్రళయములయొక్క విచారము, పరబ్రహ్మవలన జగత్తు పుట్టిన దను నొక్క విషయమును వదలి వేదాన్తశాస్త్రమునందును, సాంఖ్యశాస్త్రమునందును నుండు తత్త్వజ్ఞానము నవలంబించియుండుటచే సృష్ట్యుత్పత్తిక్రమముయొక్క యీ పరంపరనే మన శాస్త్రకారు లెప్పుడును ప్రమాణ మని నమ్ముదురు. భగవద్గీతలందు నిటులే నుడువఁబడినది. శ్రుతి, స్మృతి, పురాణములలోఁ గొన్నిస్థలములయందుఁ దొలుత బ్రహ్మదేవుఁడు, లేక, హిరణ్యగర్భుఁడు, జన్మించినాఁ డనియు, లేక, యుదక ముత్పన్నమై దాని యందు పరమేశ్వరుని బీజమువల్ల నొక సువర్ణమయమగు నండము వెలువడిన దనియు మొదలగు సృష్ట్యుత్పత్తిక్రమముయొక్క మఱియొక కల్పన స్పష్టముఁగా నిర్ణయించుచున్నదని యీ ప్రకరణారంభమున చెప్పఁబడియే యున్నది; కాని యీశర్వకల్పనలు గౌణములని కాని, లేక, యుపలక్షణాత్మకములని కాని యెఱింగి వాని కుపపత్తిఁ జూపు ప్రసంగము వచ్చినప్పుడు, హిరణ్యగర్భుఁడు, లేక, బ్రహ్మదేవుఁడు ప్రకృతియే యగునని చెప్పవలసివచ్చును. భగవద్గీతలయందును- "మమ యోని ర్మహద్బ్రహ్మ" (గీ. 14.3) "త్రిగుణాత్మక ప్రకృతికి బ్రహ్మ యని పేరు గాన తన బీజము నుండి యీ ప్రకృతియందుత్రిగుణములచే ననేక మూర్తులుత్పన్నములగునని భగవంతుని చేఁ జెప్పఁబడినది. బ్రహ్మదేవునివలన నారంభమున దక్షాదిసప్తమానస పుత్రులును సప్తమనువులు నుత్పన్నులయిరి. వారిచేఁ బిదపఁ జరాచరసృష్టి నిర్మింపఁబడినది (మ.భా.అ. 65-67; మ.భా.శాం. 207; మను. 34-63). మఱియు నేది యొక పర్యాయము గీతలలోఁ జెప్పఁబడినదో (గీ. 10 6) అదియంతయు బ్రహ్మదేవుఁడు, అనగా ప్రకృతి

యని యర్థము కావున, పూర్వోక్తమగు సాత్త్విక సృష్టియొక్క యుత్పత్తిక్రమమునకు సంబంధించియే యున్నదని వేదాన్తగ్రంథములలో నిరూపింపఁ బడినది. ఇటులే యితర స్థలములందు నెఱుంగ వలయును. ఉదాహరణము: శైవములు, లేక, పాశుపతములు నగు దర్శనములందు శివుఁడు నిమిత్తకారణ మని యుండుటచే నతని యందుండి, కార్యము, కారణము మొదలుగఁ గలిగిన యయిదు పదార్థము లుత్పన్నము లయిన వని తలఁచుచున్నారు. మఱియు నారాయణీయములు, లేక, భాగవతధర్మములందు వాసుదేవుఁడు ప్రధానుఁ డని యనుకొనుటచే వాసుదేవుని యందుండి తొలుత సంకర్షణుఁడు (జీవుఁడు), సంకర్షుని యందుండి ప్రద్యుమ్నుఁడు (మనస్సు), ప్రద్యుమ్ననియందుండి యనిరుద్ధుఁడు(అహంకారము), ఉత్పన్ను లయిరని చెప్పఁబడినది; కాని వేదాన్తశాస్త్రానుసారముగ జీవుఁ డను నతఁడు ప్రతి సమయమునందును నూతనముగఁ బుట్టు వాఁడు కానేరఁడు. అతఁడు నిత్యుఁడు, సనాతనుఁడునగు పరమేశ్వరుని నిత్యమగు- కావుననే యనాదియగు-నంశమైనవాఁడు కాన, వేదాన్త సూత్రముల యందలి రెండవ యధ్యాయముయొక్క రెండవ పాదములో (వే. సూ. 2.2.42-45) భాగవతధర్మములందున్న జీవుని యుత్పత్తి విషయమున, పూర్వోక్తమతమును ఖండించి యీ మతము వేదవిరుద్ధము గనుకనే త్యాజ్యమని చెప్పఁబడినది; మఱియు వేదాన్త సూత్రములలో నున్న యీ సిద్ధాన్తము గీతలలో ననువాదము చేయఁ బడినది (గీ. 13.4; 15.7). అటులే సాంఖ్యులు ప్రకృతిపురుష లను రెండు స్వతంత్ర తత్త్వముల నంగీకరించుచున్నారు: కాని, యీ ద్వైతము గాక ప్రకృతిపురుష లను రెండు తత్త్వములును, నిత్యుఁడు నిర్గుణుఁడునగు పరమాత్మయొక్క విభూతులే యని వేదాన్తముల యొక్క సిద్ధాన్త మగుటచే నది భగవద్గీతలయందును గ్రాహ్యమై యున్నది (గీ. 9.10); కాని యీ విషయమై యధికవివేచన ముందు ప్రకరణములోఁ జేయఁబడును. భాగవతధర్మ[illegible]లు, లేక, నారాయ

జీయధర్మములయందున్న వానుదేవభక్తి యు, ప్రవృత్తిపరధర్మముల యొక్క తత్త్వమును భగవద్గీతలకు మాన్యము లయినను, "వాసుదేవునియందుండి తొలుత సంకర్షణుఁడు, లేక, జీవుఁడుత్పన్నుఁడాయెను. వానియందుండి పిదప ప్రద్యుమ్నుఁడు (మనస్సు), ప్రద్యుమ్ననియందుండి యనిరుద్ధుఁడు (అహంకారము) వెలువడి" రనెడి భాగవతధర్మముల యందలి యీ కల్పన గీతలకు సమ్మతము కానందున, సంకర్షణుఁడు, ప్రద్యుమ్నుఁడు, అనిరుద్ధుఁడు ననువారి నామములైనను గీతలలో నెచ్చో లేవని మాత్రమే ప్రస్తుతము చెప్పఁదగినది. పాంచరాత్రాగమములోఁ జెప్పఁబడిన భాగవతధర్మముల కంటె గీతలలో నున్న భాగవతధర్మముల కిదియే మహత్త్వము. భగవద్గీతలయందు భాగవతధర్మములు చెప్పఁబడినంత మాత్రముచే సృష్ట్యుత్పత్తులయొక్క క్రమవిషయ మైనను జీవ-పరమేశ్వర-స్వరూపముల విషయమైనను, భాగవతాది భక్తిసంప్రదాయము లందున్న మతములు సైతము గీతలకు మాన్యములుగ నుండవలయునని ప్రమాదముఁ జెందఁగూడదు. కావున నీ విషయము ముఖ్యముగ వ్రాయఁబడినది. సర్వవ్యక్తావ్యక్తస్వరూపము, లేక, క్షరాక్షరరూపము, అగు జగత్తునకు, సాంఖ్యశాస్త్రోక్తులగు ప్రకృతి-పురుషు లను నీ రెంటి కంటె పరమును, మూలమునగు మఱియొక తత్త్వ మేది యైన నున్నదా? లేదా? యని విచారించెదము. దీనికె యధ్యాత్మ మనియు లేక, వేదాన్త మనియు పేరు.

ఇది విశ్వముయొక్క సృష్టిసంహారము అను అష్టమప్రకరణము

నవము ప్రకరణము

అధ్యాత్మము

పర స్తస్మాత్తు భావోఽన్యోఽవ్యక్తోఽవ్యక్తా త్సనాతనః,
య స్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి. *
(గీతా. 8-20)

క్షేత్రక్షేత్రజ్ఞ విచారములో క్షేత్రజ్ఞుఁడని చెప్పఁబడువాఁడె సాంఖ్యశాస్త్రమునఁ బురుషుఁ డని చెప్పబడును. కావున సమస్త క్షరాక్షర (చరాచర) సృష్టియొక్క యుత్పత్తి సంహారములను విచారించి నచో సాంఖ్య మతానుసారముగఁ దుదకుఁ బ్రకృతి పురుషు లను నీ రెండుతత్త్వములె స్వతంత్రములు, ననాదులునగు మూలతత్త్వములుగ సిద్ధము లైనవి. పురుషుఁ డెడతెగని తన దుఃఖముల నన్నింటిఁ బోఁగొట్టుకొని, మోక్షము నొందుటకుఁ బ్రకృతికంటె దన కున్న భేదమును (కైవల్యమును) తెలిసికొని, త్రిగుణాతీతుఁడు కావలయు ననుఁ విషయము పూర్వోక్తములగు రెండు ప్రకరణములకును ఫలి తార్థము. ప్రకృతి పురుషులకు సంయోగ మైన పిదప, ప్రకృతి, పురుషుని యెదుట తన నాట్యము నెటుల ప్రదర్శించుచున్న దను విషయములో సాంఖ్యుల పద్ధతికంటె నర్వాచీన (నవీన) సృష్టివేత్తలు కొందెము వేఱుగఁ జెప్పుచున్నారు. ఆధిభౌతికశాస్త్ర మె ట్లంతకంతకు

---

* ఆ (సాంఖ్యులయొక్క) యవ్యక్తముకంటె శ్రేష్ఠమును సనాతనము నగు మఱియొక యవ్యక్తపదార్థము కలదు. అది సర్వప్రాణులు నశించినను నాశము నొందనేరదు. అదియే యంతిమగతి యగును.

వృద్ధిఁ బొందుచుండునో యటులె యీ పద్ధతియం దింకను గ్రొత్త మార్పులు గలుగ వచ్చును; కాని యొక యవ్యక్తమగు ప్రకృతి నుండియే సర్వవ్యక్తపదార్థములను సత్త్వరజస్తమోగుణముల హెచ్చు తగ్గులచే నిర్మితములయిన వను నాదిసిద్ధాన్తమును మార్చుట సాధ్యము కానేరదు. అయిన నీ విషయము శాస్త్రాంతరమునకు సంబంధించినది గాని వేదాంతశాస్త్రమునకు సంబంధించినది కాదని యెఱింగి మన మీ విషయములో వాదముఁ జేయుచు కాలమును గడపరాదు. కావున "పిండబ్రహ్మాండములకు మూల మగు శ్రేష్ఠతత్త్వ మెద్ది? మనుష్యుఁడు తద్రూపుఁ డెట్లగును?" అని నిశ్చయించుట కది (ఆ వేదాన్తశాస్త్రము) బ్రవర్తిల్లెను; కాని తన యెదుట మఱియొక శాస్త్రమును ప్రవర్తింప నీయదు. సింహ మెదుట నక్కలవలె, వేదాన్తము నెదుట నితర శాస్త్రములు మౌనము వహించును. కావుననే—

తావ ద్గర్జంతి శాస్త్రాణి జంబుకా విపినే యథా,
న గర్జతి మహాశక్తిః యావ ద్వేదాన్త కేసరీ.

— అని యొక ప్రాచీన సుభాషితకారునిచే వేదాన్తయాథార్థ్య మిట్లుల వర్ణింపఁబడినది. 1 క్షేత్రక్షేత్రజ్ఞవిచారణ నొనర్చిన పిదప సిద్ధుఁడగు ద్రష్ట (అనఁగా: పురుషుఁడు, లేక, యాత్మ) యు, 2 క్షరాక్షరసృష్టి యొక్క విచారణ చేసిన పిదప సిద్ధించు సత్త్వరజస్తమోగుణాత్మక మగు నవ్యక్తప్రకృతియు ననునీ రెండును స్వతంత్రము లనియు జగత్తుయొక్క మూలతత్త్వ మీ తీరున రెండు విధములుగ నంగీకరించుట యావశ్యక మని సాంఖ్యులు చెప్పుచున్నారు. కాని యింత కంటె లోతుగ విచారించి, సాంఖ్యమతానుసారముగ, పురుషులు నిర్గుణు లయినను వా రనేకులుగ నున్నారు గాన నీ యనంఖ్యులగు పురుషులకు లాభము దేనిలో నున్నదని యాలోచించి యీ తీరునఁ బ్రతిపురుషునిఁ బ్రవర్తింపఁజేయు సామర్థ్యము ప్రకృతియం దున్నదని యంగీకరించుట యుచితము కాదనియు, విభక్తపదార్థముల

కన్నింటికి నవిభక్తమగు నవ్యక్తమును మూలతత్వమునగు నొకటి "అవిభక్తం విభక్తేషు" అను న్యాయముగ నున్న దనియు, ఆ యవిభక్తపదార్థముయొక్క స్వాభావికమగు జ్ఞానక్రియయే సృష్టికంతకును మూల మనియు, ఆ జ్ఞానక్రియయొక్క సాహాయ్యము చేతనే, సృష్టి యందున్న యనేకవ్యక్తపదార్థములకు నొక యవ్యక్త ప్రకృతియందు సమావేశముఁ జేయవచ్చు ననియు, ఆ జ్ఞానక్రియచేతనే 'ప్రకృతియు-అసంఖ్యపురుషులు' నను నన్నిటికి నొక పరతత్వము నందే తుద కవిభాగముగ సమావేశము నిరాతంకముగఁ జేయవచ్చుననియు, ఆలోచింపఁగనే సాత్త్వికమగు తర్కదృష్టిచే మిక్కిలి సయుక్తికముగ నున్న దనియు వేదాన్తులు చెప్పుచున్నారు (గీత. 18. 20-22). వేర్వేఱుగ నుండుట యనునది యహంకారముయొక్క పరిణామముగ నున్నది. మఱియు పురుషులు నిర్గుణు లగుదురేని యసంఖ్యు లగు నా పురుషులందు వేర్వేఱుగ నుండుట యను గుణ ముండనేరదు. లేక, మొట్టమొదట మనుష్యు లసంఖ్యులు కారనియుఁ బ్రకృతియందున్న యహంకారగుణ మనెడి యుపాధిచే నీ యసంఖ్యత్వము వారియం దుత్పన్న మగునటులఁ గాన్పించుచున్నదని చెప్పవలసివచ్చును. ఇంతియకాక స్వతంత్రుఁడగు పురుషునకు స్వతంత్రమగు ప్రకృతితోఁ గలిగిన సంయోగము సత్యమా? మిథ్యయా? యను మఱియొక ప్రశ్న వెలువడును. సత్య మని యందు మేని యది యెప్పుడును వదలిపోవుటకు శక్యము గాక పోవును గాన, సాంఖ్యమతానుసారముగ నాత్మకు ముక్తి యే నాఁడును లభింపదు. మఱియు మిథ్య యని యంగీకరింతుమేని, పురుషుని సంయోగకారణమున, ప్రకృతి తన వ్యాపారము నతని యెదుటఁ జేయుటకు నారంభించు నని చెప్పుట నిర్మూల మగును. అవు దూడకొఱకుఁ బాలిచ్చునటుల, ప్రకృతి పురుషుని లాభముకొఱ కెప్పుడును నాట్యము సేయుచున్న దను దృష్టాంతము సైతము యుక్తియుక్తముగ లేదు. కారణ మేమి యనఁ గోగర్భమునందుండి దూడ పుట్టుటచే దూడయందు గోవునకుఁ

ద్వితీయుండునటుల ప్రకృతికి పురుషునియందుఁ ద్వితీ యున్నదని చెప్పుట సాధ్యము కానేరదు (వే. సూ. శాం. భా. 2.2.8). ప్రకృతి పురుషు లిరువురును సాంఖ్యశాస్త్రానుసారముగ మొదటినుండియు నత్యంత భిన్నులు. ఎటులన: ప్రకృతి జడముగను, పురుషుఁడు నచేతనుఁడుగ నున్నారు. సృష్ట్యారంభమునం దీ రెండుపదార్థములు నత్యంతభిన్నములును స్వతంత్రములు నగునేని, వానిలో నొకదాని ప్రవృత్తి రెండవదాని లాభార్థ మేల కావలయును? ఇది ప్రకృతికి స్వభావ మని యుపపాదించుట సరియగు సమాధానము కానేరదు. స్వభావమని చెప్పితిమేని 'హెకెల్' పండితుని జడాద్వైత మేల తప్పగును? మూలప్రకృతియొక్క గుణములు వృద్ధిఁబొందుచు, దానిలోనే స్వయముగ చూచునదియు, స్వయముగను సైతము విచారించునదియు నగు చైతన్యశక్తి యుత్పన్నమగును. అనఁగా: ఇది దాని స్వభావమై యున్నది అని హెకెల్ చెప్పుచున్నాఁడు గదా! కాని, యీ మతము నంగీకరింపక, సాంఖ్యశాస్త్రము, ద్రష్ట (చూచువాఁడు) వేఱనియు, 'దృశ్యసృష్టివే' అనియు కొంత భేదము చెప్పినచో, నే న్యాయముచే నీ భేద ముత్పన్నమగునో యా న్యాయమునే తరువాత సైత మింక కొంచె మేల యధికముగ నుపయోగింప కూడదు? దృశ్యసృష్టి నెవ రెంత పరీక్షించినను, 'నేత్రముల మజ్జా తంతువులం దీ ధర్మము లున్న'వని నిశ్చయించినను నిశ్చయించువాఁడు మరల భిన్నుఁడుగనే యున్నాఁడు. సృష్టిని చూచెడు పురుషుఁడు, దృశ్యసృష్టికంటె నీ విధముగ వేఱయిన పిదప నీ చూచువాఁ డెవఁడని మనము కొంత విచారింపవలసియున్నది. "దృశ్యసృష్టియొక్క సత్యస్వరూపము మన యింద్రియములకుఁ గనఁబడునట్లున్నదా? లేక, కనఁబడు దానికంటె భిన్నముగ నున్నదా?" యని మనము విచారింపవలసిన యెడల దాని కేదైనను మార్గము కలదా? లేదా?" యను నీప్రశ్న కెప్పుడును సమాధానము చెప్పుట శక్యము కానేరదు. కావున ప్రకృతి-పురుషుఁడు నను రెండు తత్త్వ

ములు నాదియందుండి భిన్నములు స్వతంత్రములుగ నున్నవని యంగీకరించుట యుక్తముగ నున్నదని సాంఖ్యులు చెప్పుచున్నారు; మఱియు నొక యాధిభౌతికశాస్త్ర పద్ధతిచేతనే విచారించితి మేని సాంఖ్యమతము యుక్తి విరుద్ధముగ నున్నదనుటకు సాధ్యము కానేరదు. కారణ మేమి యన: సృష్టిలోని యితర పదార్థములు మన యింద్రియములకుఁ గాన్పించును గాన వాని గుణధర్మముల నెట్లు పరీక్షించుచున్నాఁడో యటులే 'చూచువాఁడు' (వేదాన్తులచే 'ఆత్మ' యని చెప్పఁబడువాఁడు) చూచువానియొక్క యింద్రియములకు (అనఁగా: తన యింద్రియములకు) భిన్నరూపముతో నెప్పుడుఁ గనఁబడఁడు; ఏ పదార్థ మింద్రియములకు నీ రీతిగ గోచరము కానేరదో (అనఁగా: ఇంద్రియాతీతమో) దానిని మాన వేంద్రియములతో నెట్లు పరీక్షింపఁగలము? భగవద్గీతలయందే—

నైనం ఛిందన్తి శస్త్రాణి నైనం దహతి పావకః,
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః.

(గీ. 2.23.)

— ఆత్మ, సృష్టియందున్న యితరపదార్థములవలె తేజస్సు, ఉదకము మొదలగు పల్చనిపదార్థముల సంయోగముచే ద్రవత్వమును జెందదు; పదునైనకత్తులు దానిని నఱుకలేవు. నిప్పు దీనిని కాల్పలేదు. గాలి దీనిని శుష్కింపఁ జేయలెదు. సృష్టియందున్న పదార్థములను బరీక్షించుటలో నాధిభౌతికశాస్త్రవేత్తల కున్న యుక్తులన్నియు నీ విషయములో నుపయోగింపవని సారాంశము; కాని యాత్మ నెట్లు పరీక్షింపవలయు ననుప్రశ్న కఠినముగఁ దోఁచును. కొంత విచారించితి మేని దానియం దేమియు కాఠిన్య మున్నటులఁ గాన్పింపదు. సాంఖ్యశాస్త్రమునందు మాత్రము పురుషుఁడు నిర్గుణుఁడుగ స్వతంత్రుఁడుగ నున్నాఁడని యెట్లు నిశ్చయింపఁబడినది? తన యంతఃకరణమునందలి యనుభవముచేతనే చేయఁబడినదా? లేక, మఱియొక విధముననా?

అటులే ప్రకృతి-పురుషుల సత్యస్వరూపమును నిర్ణయించుట సైతమేల చేయఁ గూడదు? ఆధిభౌతికశాస్త్రములకు, అధ్యాత్మికశాస్త్రములకు నుండు గొప్పభేద మిదియే. ఆధిభౌతికశాస్త్రములయొక్క విషయము లింద్రియ గోచరము లగుచున్నవి. అధ్యాత్మశాస్త్రవిషయము లింద్రియాతీతములు. (అనఁగా; కేవలస్వసంవేద్యములు=తమయంతట తామే తెలిసికొనఁదగినవి) "ఆత్మ స్వసంవేద్యమయిన యెడల ప్రతి పురుషునకును దానిజ్ఞాన మెట్లు కలుగునో యట్లే కానిమ్ము! అధ్యాత్మశాస్త్రముయొక్క యావశ్యకతయేమి?" యని యెవ రయిన నడుగుదురు. ప్రతి మనుజుని మనస్సుగాని యంతఃకరణముగాని యొకే రీతిగశుద్ధముగ నుండెనేని యీ ప్రశ్న యోగ్యమైనది యగును. ప్రతి మనుజుని మనశ్శుద్ధియైనను, లేక, శక్తియైనను, ఏ హేతువుచే నొక విధముగ నుండదని మనకు ననుభవగోచర మగునో, యా హేతువుచే నెవరిమన స్సత్యంతశుద్ధముగను పవిత్రముగను విశాలముగ నున్నదో వారి ప్రతీతినే (అనుభవమునే) యీ విషయమున మనము ప్రమాణముగ నంగీకరింపవలయును. ఏమియు లేకయే 'నా కటుల తోఁచుచున్నది', లేక, 'నీకిటులతోఁచును' అని వితండావాదము పెంచుటచే నేమియు లాభము లేదు. యుక్తివాదమును బొత్తిగా వదలు మని వేదాన్తము పెప్పదు. అధ్యాత్మశాస్త్రము నందున్న విషయము స్వసంవేద్యము కావుననే కేవ లాధిభౌతిక యుక్తులచే నిర్ణయించుటకు తగినది కానేరదు గావున నత్యంతశుద్ధము, పవిత్రము, విశాలమునగు మనస్సు కలిగిన మహాత్ము లీ విషయమునందు స్వీయము నపరోక్షము నయిన యే యనుభవమును చెప్పిరో దానికి విరుద్ధమగు యుక్తివాద మీ శాస్త్రమందు గ్రహించుటకు వీలు లేదని వేదాన్తశాస్త్రము చెప్పుచున్నది. అధిభౌతికశాస్త్రమునం దెట్లు ప్రత్యక్షవిరుద్ధమగు ప్రమాణము నంగీకరింపరో, యట్లే వేదాన్తశాస్త్రమునందును యుక్తికంటె స్వానుభవము, లేక, యాత్మప్రతీతియే మిక్కిలి గొప్ప

దని యంగీకరింతురు. ఈ యనుభవమునకు ననుకూలమగు యుక్తినే వేదాన్తు లొప్పుకొందురు. శ్రీ మచ్ఛంకరాచార్యులు వేదాన్తసూత్ర భాష్యములో నీ సిద్ధాన్తము నుదివిరి గాన నధ్యాత్మశాస్త్రము నభ్య సించువా రీ విషయమును తప్పక గుర్తుంచుకొనవలయును.

అచింత్యాః ఖలు యే భావాః న తాం స్తర్కేణ సాధయేత్,
ప్రకృతిభ్యః పరం యత్తు త దచింత్యస్య లక్షణమ్.

— ఇంద్రియాతీతము లగుటచే చింతించుటకు నశక్యము లగు పదార్థ ముల నొక తర్కముచేఁ గాని యనుమానముచేఁ గాని నిర్ణయింపఁ గూడదు; సర్వసృష్టికిని మూలమగు ప్రకృతికంటెఁ బరముగ నున్న యీ పదార్థ మిట్లు అచింత్యమగును అని యొక ప్రాచీనశ్లోకము కలదు. అదే మహాభారతమునందును (మ. భా. భీష్మ. 5. 12), మఱియు 'సాధయేత్' అనుదానికి మాఱుగ 'యోజయేత్' అను పాఠభేదముతో శంకరాచార్యుల వేదాన్తసూత్ర భాష్యమునందును వ్రాయఁబడినది (వే.సూ.శాం.భా. 2 1.27). ముండక, కఠోపనిషత్తులలో నీ తీరుననే యాత్మజ్ఞానము కేవల తర్కముచే ప్రాప్తము కానేరదని చెప్పఁబడినది (ముండ.3.2.3; కఠ. 2.8-9; మఱియు, 22). అధ్యాత్మశాస్త్రమునం దుపనిషద్గ్రంథముల మాహాత్మ్యము విశేష ముండుటకు కారణ మిదియే. మనస్సు నేకాగ్రముగఁ జేయవలయు నేను విషయమున పూర్వ కాలమున భరతఖండమునందు విశేషచర్చ జరుగుటచే దుదకు(పాతం జల) యోగశాస్త్ర మను నొక స్వతంత్రశాస్త్రము వెలువడెను. ఈ శాస్త్ర మునందు ప్రవీణులే కాక, సహజముగఁ బవిత్రము విశాలము నగు మనస్సు గలిగిన గొప్పఋషీశ్వరులు తమ మనస్సు నంతర్ముఖముఁ జేసి యాత్మయొక్క స్వరూప విషయమున తమ యనుభవమును, లేక, దానివిషయమున శుద్ధము శాంతము నగు తమ బుద్ధికి స్ఫురించిన విష యములను నుపనిషత్తులలోఁ జెప్పిరి. కావుననే యధ్యాత్మతత్త్వము నిర్ణయించి యెవ రైనను దుద కీ శ్రుతులయందున్న యనుభవమును

శరణుఁ జొచ్చుటఁ దక్క నింకొక మార్గము లేదు (భ. 4.1). మను ష్యులు తమ తమ బుద్ధికుశలతచే నీ యాత్మానుభవమును బలపఱచు యుక్తి వాదములను వేర్వేఱుగఁ జెప్పుదురు; కాని,వానిచే మూలభూత మగు ననుభవముయొక్క ప్రామాణ్యము హెచ్చుగాని, తగ్గుగాని కానే రదు. భగవద్గీత యనునది స్మృతిగ్రంథమే కాని, యీ విషయమున నుపనిషత్తులతో సమానముగనే దాని యోగ్యతను బట్టి యంగీకరింపఁ బడుచున్న దని ప్రథమ ప్రకరణారంభముననే వక్కాణింపఁబడినది. కావున గీతలయందు నుపనిషత్తులయందును ప్రకృతికంటె పరముగ నున్న యీ యచింత్యపదార్థవిషయమై చేయఁబడిన సిద్ధాన్తముల నన్నిటిని తొలుత (కారణము నుడువక) సాధారణముగ నుపన్యసించి దానికి శాస్త్రరీతిగ నుపపత్తి యెట్లు సంభవించునో యీ విచార మీ ప్రకరణాంతమునఁ జేయఁబడును.

ప్రకృతి పురుషుఁడు నను సాంఖ్యులయొక్క ద్వైతమును, భగవద్గీత లొప్పుకొనవు. ఈ రెంటికి పరమం దున్నదియు సర్వవ్యాప కమును, అమృతము నగు మూఁడవ తత్త్వము చరాచరసృష్టికి మూల కారణ మని గీతల యందున్న యధ్యాత్మజ్ఞానముయొక్కయు, వేదాన్తశాస్త్రముయొక్కయు ముఖ్యసిద్ధాన్తముగ నున్నది. సాంఖ్య లచే నంగీకరింపఁబడిన ప్రకృతి యవ్యక్తముగ నున్నను, త్రిగుణాత్మ కమే (అనఁగా: నగుణమే) యగును; కాని యేది నగుణమో యది నశ్వర మగుటచే నీ నగుణము నవ్యక్తము నగు ప్రకృతి నశించిన పిదప మిగులు నవ్యక్తమే సర్వసృష్టికి సత్యమును, నిత్యము నగు తత్త్వమగు నని ప్రకృతి-పురుష విచారము చేయునపు డీ ప్రకరణారంభమున వ్రాయఁబడిన విషయము గీతలలోని (గీ. 8. 20) శ్లోకమునందుఁ జెప్పఁబడినది. పిదప పదునైదవ యధ్యాయమునందు, క్షరము-అక్ష రము-వ్యక్తము-అవ్యక్తము-అని సాంఖ్యశాస్త్రానుసారముగ రెండు తత్త్వములను చెప్పిన పిదప-

ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః,
యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః.

(గీ. 15.17.)

— ఈ రెంటికంటెను భిన్నుఁడగు పురుషుఁడే యుత్తముడు, పర మాత్మ యను పేరు గలవాఁడు, నవ్యయుఁడు, సర్వశక్తి గలవాడు నగును. మఱియు నతఁడే మూఁడు లోకములను వ్యాపించి వానిని సంరక్షించుచున్నాఁడు అని చెప్పఁబడినది. ఈ పురుషుఁడు క్షరాక్షరము లగు-వ్యక్తావ్యక్తములగు-రెంటికంటెను పరముగ నుండుటచే నతనికి పురుషోత్తముఁ డను పేరు సార్థక మైనది (గీ. 15.18). మహాభారత మునందును పరమాత్మ శబ్దమును వ్యాఖ్యానముఁ జేయుచు-

ఆత్మా క్షేత్రజ్ఞ ఇత్యుక్తః సంయుక్తః ప్రాకృతైర్గుణైః,
తై రేవ తు వినిర్ముక్తః పరమాత్మే త్యుదాహృతః.

(మ.భా.శాం. 187.24)

— ఆత్మ దేహమునందు బద్ధుఁడగునేని యతనిని క్షేత్రజ్ఞుడు (జీవాత్మ) అని చెప్పుదురు. ఆ జీవాత్మయే ప్రాకృతము లగు (అనఁగా: ప్రకృతి యొక్క, లేక, దేహముయొక్క) గుణముల యందుండి ముక్తుఁడగు నేని పరమాత్మ యనఁబడును అని భృగువు భరద్వాజునకుఁ జెప్పెను. పరమాత్మ విషయమై యిదివఱకుఁ జేయఁబడిన రెండు వ్యాఖ్యానము లును భిన్నము లని తోఁచుట కవకాశ మున్నను న్యాయముగ నవి భిన్నము లయినవి కానేరవు. క్షరాక్షరసృష్టి, జీవుఁడు, (లేక, సాంఖ్య శాస్త్రానుసారముగ నవ్యక్తమగు ప్రకృతియు, పురుషుఁడు) నను నీ రెంటికిని పరమునం దొక పరమాత్మయే యుండుటచే నొకప్పుడు క్షరా క్షరములకు పరముగను, నొకప్పుడు జీవమునకు, లేక, జీవాత్మకు (పురుషునకు) పరముగను నున్నాఁడనియు, నొక పరమాత్మకే ద్వి విధముగ లక్షణము, లేక, వ్యాఖ్యానము చెప్పవచ్చును. ఈ యభి

ప్రాయమునే మనస్సున నుంచుకొని కాళిదాసు సైతము "పురుషుని లాభము కొఱకుఁ బ్రవర్తించు ప్రకృతివి నీవే. నహుషుగ నుదాసీనుఁడ వగుటచే నా ప్రకృతిని చూచు పురుషుఁడును నీవే" అని పరమేశ్వరుని కుమారసంభవము (2. 18) లో వర్ణించినాఁడు. అటులే గీతలలో భగవంతుడును, "మమ యోని ర్మహ ద్బ్రహ్మ"– ప్రకృతి నాకు యోని, లేక, నా స్వరూపములలో నొకటి యనియు, జీవము, లేక, యాత్మ యనునది నా యంశముగనే యున్నది (గీ. 15. 7) అనియుఁ జెప్పెను. మఱియు నేడవ యధ్యాయములో–

భూమి రాపోఽనలో వాయుః ఖం మనో బుద్ధి రేవ చ,
అహంకార ఇ తీయం మే భిన్నా ప్రకృతి రష్టధా.
(గీ. 7. 4)

– పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము అని ప్రకృతి యెనిమిది విధములుగ నున్నది అనియు, (అపరేయ మిత స్త్వన్యాం) "సర్వజగత్తు నెవరిచే ధరింపఁబడినదో యట్టి జీవమును నాయొక్క రెండవ ప్రకృతిగా నున్నది" (7. 5) అనియు భగవంతుఁడు చెప్పుచున్నాడు. మహాభారతమున శాంతి పర్వములో సాంఖ్యులయొక్క పంచవింశతి తత్త్వము లనేక ప్రదేశము లందు వివేచన చేయఁబడెను. అయిన నీ పంచవింశతి తత్త్వములకుఁ బరముగ షడ్వింశ (26వది) మగు నొక పరమతత్త్వ మున్నదనియు దానిని తెలిసికొనిన కాని మనుష్యుఁడు 'బుద్ధుడు' (జ్ఞాని) కానేరఁడనియు (శాం. 308), అన్ని చోట్లను జెప్పఁబడినది. సృష్టియందున్న పదార్థములను జ్ఞానేంద్రియములచే నెఱుంగుటయే మన సంబంధమగు సృష్టి కావున, ప్రకృతికి, శేక, సృష్టికే యనేక పర్యాయములు జ్ఞాన మని పేరిడుటచే నీ దృష్టిచేత నీ పురుషుఁడు జ్ఞాత యగుచున్నాఁడు (శాం. 306. 35-41); కాని సత్యమగు జ్ఞేయ మేది కలదో (గీ. 13.12) యది, ప్రకృతియు, పురుషుఁడు (అనఁగా: జ్ఞానము,

జ్ఞాత) అను నిరువురికంటెను బరముగనే యున్నది. అదియే పరమ పురుషుఁడని గీతలలోఁ జెప్పఁబడినది. "ముల్లోకములను వ్యాపించి, నదా ధరించు మహాపురుషుని, లేక, పరమపురుష నెఱుంగుము. వాఁడొక్కఁడు, అవ్యక్తుఁడు, నిత్యుఁడు, అక్షరుఁడు" అని భగవద్గీత యందే కాక వేదాన్తశాస్త్రమునం దున్న సర్వగ్రంథములలో స్పష్ట ముగఁ జెప్పఁబడినది. అక్షరము, అవ్యక్తము నను నీ రెండు విశేషణములును సాంఖ్యశాస్త్రమునందు ప్రకృతినిఁ దెలుపుచున్నవి. కారణ మేదియు జగత్తునకు లేదని సాంఖ్యులు సిద్ధాన్త మొనర్చిరి (సాం. కా. 61); కాని వేదాన్తదృష్టిచేఁ బరబ్రహ్మమే యక్షరము (ఎప్పుడు నాశము నొందనిది) అగుటచే నది యవ్యక్తము (అనఁగా: ఇంద్రియముల కగోచరము) అగును. కావున గీతలయం దక్షరావ్యక్తశబ్దములే ప్రకృతికంటె పరముగనున్న పరబ్రహ్మస్వరూపమును జూపించుటకు ప్రయోగింపఁబడుచున్నవి. ఈ విషయమును జదువరులు ముఖ్యముగ గమనింపవలయును (గీ.8.20;11.37;16.17). ఈ వేదాన్తమతానుసారముగఁ బ్రకృతి యవ్యక్త మయినను దాని నక్షర మని చెప్పుట యోగ్యము కానేరదు. సత్యమే; కాని గీత ప్రకృతి పురుషుల కంటె పరమం దున్న మూఁడవవాఁడగు నుత్తమ పురుషునియొక్క సర్వశక్తిత్వమునకు కలుగు బాధ నొప్పుకొనదు; కాని మిగిలిన సృష్ట్యుత్పత్తిక్రమ సంబంధములోని సాంఖ్యశాస్త్రసిద్ధాన్తము గీతలకు సంగీకార్య మగును. కావున సాంఖ్యులచే సంగీకరింపఁబడిన పరిభాషను వదలక యీ శబ్దములచేతనే గీతలయందు క్షరాక్షరముల (వ్యక్తావ్యక్తముల)యొక్క సృష్టి వర్ణింపఁబడినది; మఱియు దానియం దుండియే బ్రహ్మస్వరూపమును జెప్పవలసిన ప్రసంగము తటస్థించినపుడు సందేహము లేకుండుటకై సాంఖ్యుల యవ్యక్తముకంటె పరమగు నవ్యక్తమును, సాంఖ్యుల యక్షరముకంటె పరమగు నక్షరము నను మాటల కూర్చవలసి వచ్చును. ఉదాహరణము: ఈ ప్రకరణారంభముననున్న శ్లోకమును పీక్షింపుము. 'అవ్యక్తము', 'అక్షరము' అను నీ రెండు

శబ్దములు నొకానొకప్పుడు సాంఖ్యుల ప్రకృతిని, మఱియొకప్పుడు వేదాన్తుల పరబ్రహ్మము నుద్దేశించి (అనఁగా: రెండును వేర్వేఱు విధములుగ నుద్దేశించి) గీతలలోఁ గూర్చఁబడిన వని గీతలను జదువుచున్నప్పుడు తప్పక గమనింపవలయునని సారాంశము. సాంఖ్యుల యొక్క యవ్యక్తప్రకృతికంటె పరముగనున్న మఱియొక యవ్యక్తమే వేదాన్తానుసారముగ జగత్తునకు మూల మగును. జగత్తుయొక్క మూలతత్త్వసంబంధములో సాంఖ్యవేదాన్తుల నడుమ నున్న భేదమిదియే. మూలమున నే యధ్యాత్మశాస్త్రమునం దున్న మోక్షస్వరూపము సైతము సాంఖ్యుల మోక్షస్వరూపముకంటె నెట్లు వేఱుగునో యయ్యది ముందుఁ జెప్పఁబడును.

'ప్రకృతి-పురుషుడు' అను నీ సాంఖ్యులయొక్క ద్వైతము నంగీకరింపక యీ రెండు నెవరి విభూతిగ నున్నవో యట్టి పరమేశ్వర రూపము, లేక, పురుషోత్తమ రూపమగు మూఁడవ తత్త్వ మేదియనియు, దానికిని, ప్రకృతి, పురుషులకును నెట్టి సంబంధ మున్నదనియు, ప్రశ్నలు సహజముగ వెలువడును. ప్రకృతి, పురుషుఁడు, పరమేశ్వరుఁడు నను నీ ముగ్గురినే యధ్యాత్మశాస్త్రమునందు జగత్తు, జీవుడు, పరబ్రహ్మము అని క్రమముగఁ జెప్పుచున్నారు. ఈ మూఁడు వస్తువులస్వరూపమును, వీని పరస్పర సంబంధమును నిర్ణయించుటయే వేదాన్తశాస్త్రమునకు ముఖ్యప్రయోజనము. కావున నుపనిషత్తులలో నెక్కడఁ జూచిన నిదియే చర్చింపఁబడినది. అయినను, ఈ విషయములో సకల వేదాన్తులకు నైకమత్యము లేదు. కొంద ఱీ మూఁడు పదార్థములు తొలుత నొక్కటిగ నున్న వనియు, మఱికొంద ఱీ జీవ జగత్తులు పరమేశ్వరునికంటె పూర్వమునందు కొంచెముగనో యత్యంతముగనో భిన్నముగను నున్నవనియుఁ దలఁచుచున్నారు. అందువలననే యద్వైతులు, విశిష్టాద్వైతులు, ద్వైతులు నని వేదాన్తులు మూఁడు తెగలుగ నున్నారు. జీవము, జగత్తుల వ్యవహారము సర్వము

పరమేశ్వరేచ్ఛచే నడచుచున్న దను సిద్ధాన్తము నందఱు నొప్పుకొను చున్నారు; కాని మొదట నీ మూఁడు వస్తువుల స్వరూప మాకాశము వలె నొకటిగ నఖండముగ నున్నదని యనేకు లొప్పుకొనుచున్నారు. జడము, చేతనము నొకటి యగుటకు శక్యము కామిచే దానిమ్మ పండులో ననేక బీజము లున్న కారణమున ఫలమున కేకత్వము లే దని యెంచఁ దగనియట్లు జీవజగత్తు లనునవి పరమేశ్వరునిలో నంత ర్గతము లయినను, అవి పరమేశ్వరునికంటె మొదటినుండి భిన్నములు గనే యున్న వనియు, మూఁడు నొకటిగనే యున్న వనియు నుపనిష త్తులలోఁ జెప్పినపుడు, దానిమ్మపండువలె నొకటియే యని దాని కర్థ మని యెఱుంగవలయు నని కొందఱు వేదాన్తు లందురు. జీవస్వరూప విషయమై యిట్లు వేర్వేఱు మతము లొక్కపరియే వెలువడిన పిదప నుపనిషత్తులందును, గీతలందు నున్న శబ్దముల కర్థము సైత మా యా సాంప్రదాయికులచేఁ దమ తమ టీకలలో ననేక విధములుగ మార్చఁ బడినది. అందువలన గీతలలో నున్న నత్యాభిప్రాయము తెలియఁ బడక పోవుటచే గీతలలో నున్న వేదాన్తము ద్వైతమో, యద్వైతమో యై యున్నదని గీతలలోని సాంప్రదాయిక టీకాకారుల మతాను సారముగ, ముఖ్యముగ నిరూపింపఁబడిన విషయముగ స్థిరపడినది. కానిమ్ము; ఈ విషయమయి విశేషముగ విచారింపుటకు మున్ను జగత్తు (ప్రకృతి), జీవుడు (ఆత్మ, లేక, పురుషుఁడు), పరబ్రహ్మము (పరమాత్మ, లేక, పురుషోత్తముఁడు) అను వీరి కుండు పరస్పరసంబం ధమును గుఱించి, భగవంతునిచే నందేమి చెప్పఁబడెనో విచారింతము. ఈ విషయములో, గీతలయొక్కయు, యుపనిషత్తులయొక్కయు తాత్పర్య మొకటియే యగుటచే గీతయం దున్న విచారమంతయును పూర్వ ముపనిషత్తులలో నుండినదే యనియు, ఇఁక ముందు చేయఁ బోవు వివేచనయందుండి చదువరు లెఱుంగుదురు.

ప్రకృతి-పురుషు లిరువురికంటె పరమం దున్నపురుషోత్తముని పరమపురుషుని, పరమాత్మను, లేక, పరబ్రహ్మను వర్ణించుచు భగవ

ద్దీతలందు 'వ్యక్తము-అవ్యక్తము(క్షేత్రములకు కాన్పించునది-కాన్పింప నిది)' అని దానికి రెండుస్వరూపములు మొదట చెప్పఁబడినవి. వీనిలో వ్యక్తము (అనఁగా: ఇంద్రియములకు గోచరమగు రూపము) నగుణ ముగనే యుండవలయు నని స్పష్టముగ నున్నది. అవశిష్ట మయినది యవ్యక్తము. ఈ రూప మవ్యక్తము (అనఁగా: ఇంద్రియములకు గోచరము కానిది) అను మాట సత్యమే; కాని యది యింద్రియము లకు గోచరము కా దనునంతమాత్రము చేతనే నిర్గుణముగ నుండ వలయు నని చెప్పుటకు వీలులేదు. కారణ మేమనఁగా: మన క్షేత్ర ములకుఁ గాన్పింపక పోయినను, దానియందు సర్వవిధములగు గుణములు సూక్ష్మరూపమున నుండవచ్చును. కాన నవ్యక్తమే నగుణ మనియు, సగుణ-నిర్గుణ మనియు, నిర్గుణ మనియు మూఁడు విధము లుగ విభజింపఁబడినది. 'గుణశబ్దముచే మనుష్యుల బాహ్యేంద్రియ ములకే కాక మనస్సున కైనను గోచరములగు సకల గుణములు నిక్కడ నుద్దేశింపఁబడినవి. పరమేశ్వరునియొక్క మూర్తిమంత మగు నవతార మైన శ్రీకృష్ణమూర్తి యీ విషయమునే యుపదేశించుట కొఱకు సాక్షాత్తుగ నర్జునుని యెదుట నిలువఁబడి యుండెను. కావున గీతలలో నా యా స్థలములందు "ప్రకృతి నా స్వరూపముగనే యున్నది' (గీ.౪.8) "జీవుఁడు నాయంశముగ నున్నాఁడు"(గీ.15.7) "సర్వభూతములకు నంతర్యామి యగునాత్మ నేనే" (గీ. 10.20) "జగత్తులో నేదేది శ్రీమంతముగఁ గాని, లేక, విభూతిమంతముగఁ గాని యగు మూర్తిగ నున్నదో యది యంతయు నాయొక్క యంశముచేతనే యుత్పన్న మయినది" (గీ. 10-41). "నాయందు మనస్సునుంచి నా భక్తుఁడవు కమ్ము" (గీ. ౯. 34) "అటు లగుదు వేని నన్నే పొందుదువు. నీవు నా కిష్టుఁడ వని నేను ప్రతిజ్ఞఁ జేయు చున్నాను" (గీ. 18.65) అని తనయొక్క వ్యక్తస్వరూప విషయమునే భగవంతుఁడు ప్రథమపురుషచే నిర్దేశించినాఁడు; మఱియు సకల చరా చరసృష్టియందును తన వ్యక్తస్వరూపము సాక్షాత్తుగ నిండియున్న

దని విశ్వరూపదర్శనముచే నర్జునునకు ప్రత్యక్షముగ నమ్మకమును బుట్టించిన పిదప తుదకు నవ్యక్తముకంటె వ్యక్తము నుపాసించుట మిక్కిలి నులభము. కావున 'నీవు నాయందు భావమును నిలుపుము (గీ. 12.8). "నేనే బ్రహ్మకు, అవ్యయ మగు మోక్షమునకు, శాశ్వత మగు ధర్మమునకు, పరమసుఖమునకు మూలస్థానముగ నున్నాను" (గీ. 14.27) అని యర్జునున కుపదేశించెను. ఇందుచేఁ బ్రారంభము నుండి తుదవఱకును గీతలయందు భగవంతునియొక్క వ్యక్త స్వరూపమే ప్రధానముగ వర్ణింపఁబడిన దని చెప్పుట కేమియు సాటుంకము కానరాదు.

కాని యింతమాత్రముచేత గీతలలో వ్యక్తుఁడగు పరమేశ్వరుఁడె తుదకుఁ బొందఁదగినవాఁడని చెప్పఁబడిన దనెడి కేవల భక్త్యభిమానులగు కొందఱు పండితులయొక్కయు, టీకాకారులయొక్కయు మతము స్వీకరించుటకు సాధ్యము కానేరదు. కారణ మేమన: పూర్వమునందు చెప్పఁబడినదానివలెనే తనవ్యక్తస్వరూపము మాయిక మగుటచే దానికి పరమందున్న యవ్యక్తమే (అనఁగా: ఇంద్రియములకు గోచరముకాని స్వరూపమే) ముఖ్యముగ నున్నదని భగవంతుఁడు స్పష్టముగఁ జెప్పినాఁడు. ఉదాహరణము –

అవ్యక్తం వ్యక్తి మాపన్నం మన్యన్తే మా మబుద్ధయ:,
పరం భావ మజానన్తో మ మావ్యయ మనుత్తమమ్.
(గీ. 7.24.)

– నే నవ్యక్తుఁడ (అనఁగా: ఇంద్రియములకు నగోచరుఁడ) నైనను, మూర్ఖులు నన్ను వ్యక్తుఁడని యెన్నుచున్నారు. మఱియు వ్యక్తమునకుఁ బరముగ నున్న శ్రేష్ఠము నవ్యయము నగు నా స్వరూపము నెఱుంగలేరు" అని చెప్పి తరువాతి శ్లోకములో "నేను నాయొక్క యోగమాయచే నాచ్ఛాదితుఁడ నగుటచే మూర్ఖులు నన్నెఱుంగలేరు" (7.25) అని భగవంతుఁ డేడవయధ్యాయములోఁ జెప్పియున్నాఁడు.

అటులే నాలుగవయధ్యాయములో "నేను జన్మవిరహితుఁడను, అవ్య యుఁడనైనను స్వయముగ ప్రకృతి నధిష్ఠించి నా మాయచేతనే (స్వాత్మమాయయా) జన్మమెత్తుచున్నాను. అనఁగా: వ్యక్తుఁడ నగుచున్నాను" (గీ. 4.6) అని తన వ్యక్తస్వరూపమునకు నుపపత్తి చెప్పి నాఁడు. ముం దేడవయధ్యాయములోఁ ద్రిగుణాత్మక ప్రకృతి యను నది నాదగు దైవీమాయ యగుటచే దాని నెవరు తరింతురో వారు నన్ను కలిసికొందురనియు ఆ మాయచే నష్టజ్ఞానులు, మూఢులు, నరాధములు నగువారు నన్నుఁ బొంద" (గీ. 14. 15) రనియు చెప్పి తుదకు పదునెనిమిదవయధ్యాయములో (గీ. 18.61.) "ఓ యర్జునా! సర్వభూతముల హృదయములందు జీవరూపముగ నీశ్వరుఁడే వాసముఁ జేయుచు తన మాయచేతనే సకలభూతములను యంత్రమువలెనె ప్రేరిపుచున్నాఁడు" అని యర్జునునకు శ్రీకృష్ణ మూర్తి బోధించినాఁడు. అర్జునునకుఁ జూపిన విశ్వరూపమునే నారదు నకు భగవంతుఁడు చూపినటుల భారతమునందలి శాంతిపర్వాంతర్గత మయిన నారాయణీయప్రకరణములోఁ జెప్పఁబడినది (భా.శాం.339). మఱియు నారాయణీయములగు, లేక, భాగవతము లయిన ధర్మములే గీతలలోను ప్రతిపాద్యములని నేను మొదటిప్రకరణములో నిరూపించి యున్నాను. నారదునకు నీ రీతిగ సహస్రనేత్రములును రంగులును నితరములగు దృశ్యగుణములును గల విశ్వరూపమును జూపిన పిదప—

> మాయా హ్యేషా మయా సృష్టా య న్మాం పశ్యసి నారదః
> సర్వభూతగుణై ర్యుక్తం నైవం త్వం జ్ఞాతు మర్హసి.
>
> (శాం. 339.44.)

— నీవు చూచుచున్న నా రూప మంతయు నాచే నిర్మితమయిన మాయ కావుననే సర్వభూతముల గుణములతో నేను కూడినవాఁడ నని యెఱుంగుము అని యిట్లు భగవంతుఁడు చెప్పి "నా సత్య

స్వరూపము, సర్వవ్యాపకము, అవ్యక్తము, నిత్యము నయినది. దానిని సిద్ధులు తెలిసికొందురు" (శాం. 339.48) అనియుఁ జెప్పెను. కావున గీతలయం దర్జునునకుఁ జూపిన విశ్వరూపముగూడ మాయి కముగనే యున్నది. కావున నుపాసనార్థమయి వ్యక్తస్వరూపము భగవంతునిచే గీతలలోఁ బ్రశంసింపఁబడినను పరమేశ్వరునియొక్క శ్రేష్ఠస్వరూప మవ్యక్త (అనఁగా: ఇంద్రియముల కగోచర) మగుటచే నవ్యక్తుఁడు వ్యక్తస్వరూపమును ధరించుట, యనునది యతని మాయగనే యున్నదనియు, ఈ మాయ నతిక్రమించి తుదకు, దీని కంటె పరము శుద్ధము నగు నవ్యక్తస్వరూపముయొక్క జ్ఞానము కలిగినఁ గాని మోక్షము లభింప దనియు గీతలలో సిద్ధాంతముగ నున్నదని పూర్వోక్త వచనముల నుండి నిర్వివాదముగనే తెలియునని సారాంశము. మాయ యన నేమియో విశేషముగ ముందు విచారించెదము. పూర్వోక్తమగు వాక్యములను బట్టి యాలోచింపఁగా నీ మాయావాదమును శ్రీ శంకరాచార్యులు నూతనముగఁ గల్పింపలే దనియు, అంతకు పూర్వమునందే భగవద్గీతలలోను, మహాభారతము లోను, భాగవతధర్మములలో నున్న దనియుఁ దెలియుచున్నది. శ్వేతాశ్వతరోపనిషత్తునందును— "మాయాం తు ప్రకృతిం విద్యా న్మాయినం తు మహేశ్వరమ్" — మాయ యన ప్రకృతి (సాంఖ్యు లది) యగును. మఱియు నా మాయకు నధిపతి పరమేశ్వరుఁడు. అతఁడే తన మాయచేఁ బ్రపంచమును నిర్మించుచున్నాఁడు (4. 10) అని సృష్టిక్రమము పెప్పఁబడినది.

పరమేశ్వరునియొక్క శ్రేష్ఠమగు స్వరూపము వ్యక్తము కాదనియు నవ్యక్తముగ నున్న దనియు స్పష్ట మయినను, ఈ శ్రేష్ఠమగు నవ్యక్త రూపము సగుణమా? నిర్గుణమా? యనియు నిచ్చోఁ గొంత విచారణీయము. కారణ మేమనఁగా: సాంఖ్యశాస్త్రమం దున్న ప్రకృతి యవ్యక్త మైనను (అనఁగా: ఇంద్రియముల కగోచర మైనను)

సగుణమై (అనఁగా: సత్త్వరజస్తమో గుణాత్మకమయి) యున్నది. ఈ సగుణమైన యవ్యక్త రూపమగు నొక దృష్టాంతము మన యెదుట నుండుటచేఁ బరమేశ్వరుని యవ్యక్తము శ్రేష్ఠమునగు స్వరూపము నటులే సగుణముగ గ్రహింప వలయు నని యనేకులు తలంచెదరు. అవ్యక్తుఁడగు పరమేశ్వరుఁడు దన మాయచే నైనను వ్యక్తసృష్టిని నిర్మించుటవల్లను, సర్వప్రాణుల హృదయములయందుండి వారి వారి వ్యాపారములను వారిచేఁ జేయించుటవల్లను (గీ. 18.61), తాను సర్వయజ్ఞములకును భోక్తగా, ప్రభువుగా నుండుటవల్లను (గీ. 9.24), ప్రాణిమాత్రమునకు బుద్ధిని ప్రేరణఁ జేసి శ్రద్ధను బుట్టించువాఁ డగుటవల్లను, సుఖదుఃఖాది సర్వ 'భావ' ములను గలిగించువాఁ డగుటవల్లను, "లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హితాన్" (గీ. 7. 22) అని యన్నట్లు ప్రాణులయొక్క వాసనానురూపముగ ఫలముల నిచ్చుటవల్లను, నవ్యక్తుఁ డైనను (అనఁగా: ఇంద్రియముల కగోచరుఁ డయినను) దయ, కర్తృత్వము మొదలగు గుణములతోఁ గూడినవాఁడు గావున సగుణుఁడే కావలయునని సిద్ధముగుచున్నది. దీనికి విపరీతముగ- "న మాం కర్మాణి లిమ్పన్తి" - నన్ను కర్మలయొక్క గాని, గుణములయొక్క గాని యపరిశుద్ధత యెప్పుడును బాధింప నేరదు (గీ. 4 14) అనియు, ప్రకృతియొక్క గుణములచే మోహముఁ జెందిన మూర్ఖు లాత్మనే కర్త యనుకొందురనియు (గీ. 27; 14. 19), లేక, యవ్యయుఁడు నకర్తయు నగు నీ పరమేశ్వరుఁడే ప్రాణిమాత్ర హృదయమునందు జీవరూపుఁడుగ నుండుటచే (గీ. 18.61) నన్నిజంతువుల కర్తృత్వము, కర్మయునను నీ రెంటిచే న్యాయ్యముగ ననంబద్ధుఁ డయినను నజ్ఞానముచే లోకులు మోహమును బొందుదు రనియు, భగవంతుఁడు చెప్పెను (గీ. 5. 14-15). అవ్యక్తుఁడగు (అనఁగా: ఇంద్రియములకు గోచరముకాని) పరమేశ్వరునిస్వరూప మిట్లు సగుణ మనియు, నిర్గుణ మనియు, వేర్వే

ఱుగఁ జెప్పఁబడలేదు; కాని కొన్నిస్థలములయందు నీ రెండు రూప ముల నొక్కచోట మిశ్రమము చేసియు వ్యక్తుఁడగు పరమేశ్వరుఁడే వర్ణింపఁబడెను. ఉదాహరణము: "భూతభృన్న చ భూతస్థఃⅈ నేను భూతముల కాధారభూతుఁడనే కాని వానిలో లేను (గీ. 9. 5) అనియు, మఱియు "పరబ్రహ్మ నత్తును గాదు, అసత్తును గాదు" (గీ. 13-12) అనియు, పదుమూఁడవ యధ్యాయమునందు, "సకలేం ద్రియములు గలవాఁడువలె భాసమానుఁడైనను సర్వేంద్రియ విరహి తుఁడును, నిర్గుణుఁడును గుణములను భోగించువాఁడు" (గీ .13-14) అనియు, "దూరమందున్నను సమీపమున నున్నాఁడు" (గీ. 13.15) అనియు, "అవిభక్తుఁ డుగను, విభక్తుఁ డుగను గన్పట్టు చున్నాడు" (గీ. 13. 16) అనియు పరమేశ్వరస్వరూపము పరస్పరవిరుద్ధముగ (అనఁగా: సగుణముగను నిర్గుణముగను) చెప్పఁబడినది. అయినను రెండవ యధ్యాయముయొక్క ప్రారంభముననే "ఈ యాత్మ యవ్య క్తము, అచింత్యము, అవికార్యముగ నున్నది" (గీ. 2.15) అని చెప్పి పదుమూఁడవయధ్యాయములో "ఈ పరమాత్మ యనాది, నిర్గుణుఁడు, నవ్యయుఁడు నగుటచే నతఁడు శరీరమునందున్నను నేమియుం జేయు వాఁడు గానేరఁడు. అతనికి దేని గంధముఁ దగులదు" (13-31) అని శుద్ధమును, నిర్గుణమును, నిరవయవము, నిర్వికారము, అచింత్యము, ననాదియునగు నవ్యక్త స్వరూపముయొక్క శ్రేష్ఠత్వమే చెప్పఁబడినది.

భగవద్గీతానుసారముగ నుపనిషత్తులయందు నవ్యక్తుఁ డగు పరమేశ్వరుని స్వరూప మొకప్పుడు సగుణ మనియు, నొకప్పుడు సగుణ-నిర్గుణ మనియు, నుభయ విధముగను, ఘటియొకప్పుడు శుద్ధ నిర్గుణ మనియు మూఁడు విధములుగఁ జెప్పఁబడినటుల గాన్పించుచు న్నది. ఉపాసనకు నెప్పుడు ప్రత్యక్షమూర్తి యెదురుగ నుండి తీరవల యునని నియమములేదు. నిరాకారమగు (అనఁగా: చక్షురాదిజ్ఞానేం ద్రియములకు నగోచర) మగు స్వరూపమును సైతము నుపాసింప

వచ్చును; కాని యెవరిని మన ముపాసింపవలయునో వారు చక్షురా
దీంద్రియముల కగోచరులైనను, మనస్సునకు గోచరమైననేకాని వారి
నుపాసించుటకు శక్యము కానేరదు. ఉపాసన యనఁగా: చింతనము,
మననము, లేక, ధ్యానముగా నుండును. మఱియుఁ జింతిత పదార్థ
మునకు రూపము లేకపోయినను, మఱియొక యే గుణములైనను
మనస్సునకుఁ దెలిసిననే కాని మనుజుఁడు, మనస్సున దానిని చిం
తింపఁజాలఁడు. కావున నవ్యక్త (అనఁగా: నేత్రముల కగోచర) మగు
పరమాత్మయొక్క చింతనము, మననము, ఉపాసన, యుపనిషత్తులలో
నెక్కడెక్కడఁ జెప్పఁబడినదో యా యా ప్రదేశములం దవ్యక్తుఁ డగు
పరమేశ్వరుఁడు సగుణుఁడుగనే కల్పింపఁబడినాఁడు. పరమేశ్వరుని
యందుఁ గల్పింపఁబడిన యా గుణము లుపాసకులయొక్క యధి
కారానుసారముగఁ గొంచె మెచ్చుతగ్గుగ వ్యాపకములు, లేక,
సాత్త్వికములుగ నున్నవి. మఱియుఁ దమ తమ నిష్ఠానుసారముగ
నుపాసనాఫలము వారికి ప్రాప్త మగును. "పురుషఁ డనువాఁడు
క్రతుమయుఁ డగుటచే నెవరి క్రతు (నిశ్చయము) వెట్టిదో వారికి
తదనుసారముగనె మరణానంతరమున ఫలము లభించును" అని
ఛాందోగ్యోపనిషత్తున నున్నది (3. 14. 1). మఱియు దేవతలను
భజించినవారు దేవతలను, పితరుల భజించినవారు పితరులను బొందు
చున్నారు (గీ. 9. 25) లేక, "యో యచ్ఛ్రద్ధ స్స ఏవ సః"— తన
శ్రద్ధానుసారముగ సిద్ధిని బొందుచున్నాఁడు (17. 3) అని భగవద్గీతల
యందును జెప్పఁబడినది. ఉపాసకుని యధికారభేదానుసారముగ
నుపాస్యుఁడు, నవ్యక్తుఁడునగు పరమేశ్వరునియొక్క గుణములు నుపని
షత్తులయందు వేర్వేఱుగ వర్ణింపఁబడినవి. ఉపనిషత్తులయం దీ
ప్రకరణమును 'విద్య' యని చెప్పుచున్నారు. విద్య యనఁగా నీశ్వర
ప్రాప్తియొక్క (ఉపాసనానురూప) మార్గము. మఱియు నది యే
ప్రకరణమునఁ జెప్పఁబడినదో తుదకు దానికిఁగూడ 'విద్య' యనియే
పేరు. 'శాండిల్యవిద్య' (ఛాం. 3.14.), 'పురుషవిద్య' (ఛాం. 8.

16-17), 'పర్యంకవిద్య' (కౌషీ. 1), 'ప్రాణోపాసన' (కౌషీ. 2) మొదలయిన యనేక విధోపాసన లుపనిషత్తులలోఁ జెప్పఁబడినవి. అవి యన్నియు వేదాన్తసూత్రములలోని మూఁడవయధ్యాయముయొక్క మూఁడవపాదమునందు వివేచనచేయఁబడినవి. ఈ ప్రకరణమునం దవ్యక్త పరమేశ్వరుఁడే, మనోమయుఁడు, ప్రాణశరీరుఁడు, భారూపుఁడు, సత్యసంకల్పుఁడు, ఆకాశాత్మయు, సర్వకర్ముఁడు, సర్వకాముఁడు, సర్వగంధుఁడు, సర్వరసుఁడుగ నున్నాఁడని నగుణత్వమే వర్ణింపఁబడినది (ఛాం. 3.14.2). కావున తైత్తిరీయోపనిషత్తునందు అన్నము, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము నను సీరూపములచే బ్రహ్మోపాసన క్రమముగ మెల్లెక్కునట్లు చెప్పఁబడినది (తై. 2.1-5; 3.2-6). బృహదారణ్యకమునందు (2.1) గార్గ్యుఁడగు బాలాకి యజాతశత్రుఁడను రాజునకు, ఆదిత్యుఁడు, చంద్రుఁడు, విద్యుత్తు, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, లేక, దిక్కులు, పీనియం దున్న పురుషులు బ్రహ్మస్వరూపులుగ నుపాస్యులని తొలుత చెప్పినాఁడు. కాని సత్యమగు బ్రహ్మ దీనికంటె పరమందున్నాఁడని యజాతశత్రువు బాలాకికిఁ జెప్పి తుదగు ప్రాణోపాసన ముఖ్యమని చెప్పినాఁడు. అయిన నీ పరంపర యిచ్చటనే సమాప్తము కానేరదు. పూర్వోక్తమగు నకల బ్రహ్మస్వరూపములను 'ప్రతీకములు' (అనఁగా: నుపాసనార్థమై తీసికోఁబడిన గౌణస్వరూపములు), లేక, 'బ్రహ్మ నిదర్శకచిహ్నము' లని చెప్పుచున్నారు. ఈ స్వరూపమునే మూర్తి రూపముగ నేత్రములయెదుట నునిచితి మేని ప్రతిమ యగును; కాని వాస్తవికమగు బ్రహ్మస్వరూపము దీనికంటె భిన్నముగ నున్నదని సర్వోపనిషత్తుల సిద్ధాన్తమయి యున్నది (కేన. 1.2-8). ఈ బ్రహ్మ లక్షణములను జెప్పుచు ననేకస్థలములందు "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" (తై. 2.1), "విజ్ఞాన మానందం బ్రహ్మ" (బృ. 3.9.28)- బ్రహ్మ సత్యము (సత్), జ్ఞానము (చిత్), మఱియు ఆనంద

రూపము, లేక, సచ్చిదానందరూపముగ నున్నది అని సకల గుణములను ప్రిగుణములలో నంతర్భావముఁ జేసి వ్యాఖ్యాన మొనర్చిరి. మఱికొన్ని స్థలములయందు భగవద్గీతానుసారముగ "బ్రహ్మ సత్తును కానేరదు, అసత్తును కానేరదు" (ఋ. 10 129.1), లెక, "అణోఁరణీయాన్ మహతో మహీయాన్"- అణువునకంటె చిన్నది. "మహత్తు కంటె మహత్తు" (కఠ. 2. 20), "తదేజతి తన్నైజతి తద్దూరే తద్వన్తి కే"- అది చలించునది. చలింపనిది. అది దూరమునందును, సమీపమునందు నున్నది" (ఈశ. 5; ముం 3.1.7). మఱియు సర్వేంద్రియ గుణాభాసుఁ డైనను సర్వేంద్రియ వివర్జితుఁడు (శ్వేత. 3. 17) అని యిటులు పరస్పరవిరుద్ధము-లగు గుణము లాతని యందున్నవని చెప్పఁబడినది. తునకు ఈ సర్వలక్షణములను పదలి, "ధర్మాధర్మములకంటెను, కృతాకృతములకంటెను భూతభవిష్యత్తుల కంటెను పరమం దున్నదే బ్రహ్మమని యెఱుంగుము" అని మృత్యువుచే నచికేతువునకు బోధింపఁబడినది (కఠ .2. 14); మఱియు నటులే మహాభారతమునం దున్న నారాయణీయధర్మములయందు బ్రహ్మ రుద్రునకును (మ.భా.శాం. 331.11); మోక్షధర్మములయందు నారదుఁడు శుకునకును చెప్పిరని యున్నది (331.44). బృహదారణ్యకోపనిషత్తునందు (2.3 2) మొదట, బ్రహ్మకు పృథివియు, జలము, నగ్నియు నను మూఁడు మూర్తములగు రూపము లని చెప్పి, యీ యమూర్తముయొక్క సారభూతమగు పురుషుని రూపము, లెక, రంగు మాఱునని చూపిన పిదప, తుదకు 'నేతి నేతి' అనఁగా: "ఇంత వఱకు నేది చెప్పఁబడినదో యది కాదు, అది బ్రహ్మ కానేరదు". ఈ సర్వమగు నామరూపాత్మకమగు మూర్తామూర్త పదార్థములకంటె నేది 'యగ్రాహ్యము', 'అవర్ణనీయము' నగునో దానిని పరబ్రహ్మగా నెఱుఁగు మని యుపదేశింపఁబడినది (బృ. 2.6: వే. సూ. 3 2.22.). వేయేల? చెప్పుటకు శక్యములగు పదార్థముల యన్నింటికంటెను

బరముగ నున్నదే బ్రహ్మమగుటచే నవ్యక్తము నిర్గుణము నయిన స్వరూపమును జూపుటకు 'నేతి నేతి' యనునది యొక చిన్ననిర్దేశము, లేక, అదేశము, సూత్రము, గుర్తు. కావుననే బృహదారణ్యకోపనిషత్తు నందే యది నాలుగు పర్యాయములు చెప్పఁబడినది (2.3.6; 4.2.4; 4.4.22; 4.5.15). మఱియు నటులే యితరములగు నుపనిషత్తుల లోను "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" (తై. 2.9)-అదృశ్యం (అదృశ్యము), అగ్రాహ్యం (ముం. 1.1.6), "న చక్షుషా గృహ్యతే నాఽపి వాచా" (ముం. 3.1.8.)-నేత్రములకు గోచరింప నిదియు, వాక్కుతోఁ జెప్పనలవిగానిదియు-

అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం
తథాఽరసం నిత్య మగంధవచ్చ యత్,
అనాద్యనంతం మహతః పరం ధ్రువం
నిచాయ్య తన్మృత్యుముఖా త్ప్రముచ్యతే.

(కఠ. 3.15)

- పంచమహాభూతములయొక్క శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము నను నైదుగుణములు లేనివాఁడును, అనాది భూతుఁడు, ననంతుఁడు, నవ్యయుఁడును అని పరబ్రహ్మయొక్క నిర్గుణము నచింత్యము నగు స్వరూపము చెప్పఁబడినది (వే.సూ. 3.2.22-30; చూడుము). మహాభారతము శాంతిపర్వములో నున్న నారాయణీయ, లేక, భాగవత ధర్ములఁ జెప్పునప్పుడును భగవంతుఁడు తన నిజమగు స్వరూపమును "అదృశ్యము, అగ్రేయము, అస్పృశ్యము, నిర్గుణము, నిష్కలము (నిరవయవము), అజము, నిత్యము, శాశ్వతము, నిష్క్రియముగనున్న" దని నారదునకుఁ జెప్పి తన్నే "వాసుదేవ పరమాత్మ" యని చెప్పుచున్నా రనియు, తానే, సృష్టిస్థితిలయములను జేయు త్రిగుణాతీతుఁ డగు పరమేశ్వరుఁడుగ నున్నాఁడనియు చెప్పియున్నాఁడు (మ.భా.శాం. 339.21-28).

భగవద్గీతలయందే కాక, మహాభారతాంతర్గత నారాయణీయ, లేక, భాగవత ధర్మములయందును, బరమేశ్వరునియొక్క వ్యక్తస్వ రూపముకంటె నవ్యక్తస్వరూపము శ్రేష్ఠ మని చెప్పఁబడెను. మఱియు నీ శ్రేష్ఠమగు నవ్యక్తస్వరూపము మరల నగుణ మనియు, నగుణ-నిర్గుణ మనియుఁ, దుదకుఁ గేవల నిర్గుణ మనియు, మూఁడు విధములుగ చెప్పఁబడినట్లు పూర్వోక్తములగు వచనముల వలనఁ దెలుసు. అవ్య క్తమును, శ్రేష్ఠమునగు స్వరూపమునకును బరస్పర విరుద్ధములగు నీ మూఁడు స్వరూపములకును సంబంధ మెట్లుండును? ఈ మూఁడింటి లోను నగుణ నిర్గుణ మను నుభయాత్మక రూపమే, నగుణమునుండి నిర్గుణమునందుఁ (లేక, యజ్ఞేయమునందు) జేరుటకుమార్గము, లేక, సాధనముగ నున్నదని యెఱుంగవచ్చును. కారణ మేమి యనఁగా- తొలుత నగుణరూపజ్ఞానము కలిగిన పిదప, క్రమముగా నొక్కొక్క గుణమును వదలుటచే నిర్గుణస్వరూప మనుభవగోచర మగును; ఈ విధముననే బ్రహ్మప్రతీకముయొక్క యుపాసన యుపనిషత్తులలో మెత్తెక్కునటుల చెప్పఁబడినది. ఉదాహరణ మేమనఁగా: తైత్తిరీయో పనిషత్తులోని భృగువల్లియందు మొదట నన్నమే బ్రహ్మ మని భృగువు నకు బ్రహ్మచే నుపదేశింపఁబడినది. అనంతరమున, క్రమముగ, ప్రాణము, మనస్సు, విజ్ఞానము, ఆనందము నని బ్రహ్మస్వరూప మతనికిఁ దెలుపఁబడినది (తైత్తి. శి. 2-6) లేక, నిర్గుణమును, గుణ బోధకములగు విశేషణములచే వర్ణించుట యెప్పుడు శక్యము కానే రదు. కావున పరస్పర విరుద్ధములగు విశేషణములచే నాతనిని వర్ణిం చుట యుక్త మనియు చెప్పవచ్చును. కారణ మేమనఁగా: 'దూర' శబ్దమును గాని 'సత్' అను శబ్దమును గాని యుచ్చరించితి మేని యే దైన మఱియొక వస్తువు సమీపమున నున్నదని కాని, లేక, అనత్తుగ నున్నదని కాని మనస్సునకుఁ దెలియుచుండును. కాని యొక బ్రహ్మమే యంతట నిండియుండఁగా నా బ్రహ్మకు దూర మని కాని, 'సత్' అని కాని విశేషణములున్న నది దేనికి సమీపమున నున్నదనియు,

'అసత్' దానికంటె నేది యనియు చెప్పదుము? ఈ కారణమున, "దూరమున లేదు. సమీపమున కానరాదు. సత్తు కానేరదు. అసత్తును గానేరదు" అను నీ సంభాషణచే దూరమును సమీపమును, 'సత్-అసత్' మొదలగు పరస్పర సాపేక్షగుణముల జంటలు గాక మిగిలిన నిర్గుణమే యన్ని చోట్లు, నదా నిరపేక్షముగను స్వతంత్రముగ నుండు నది యగు బ్రహ్మ మని తెలియుటకుఁ బరస్పర విరుద్ధము లగు విశేషణములు కలిగిన యీ భాషనే వ్యవహారములో నుపయోగింపవలయును. ఇంతకంటె గత్యంతరము లేదు (గీ. 13.12). ఉన్నదంతయు బ్రహ్మమే యగుటచే, దూరమందును నదియె, సమీపమునందు నదియే యగును. కావున మఱియొక దృష్టితోఁ జూచితి మేని యీ బ్రహ్మను బరస్పర విరుద్ధములగు విశేషణములచే నొక కాలమునందే రెండు గుణములు నున్నటుల చెప్పినను చెప్పవచ్చును (గీ. 11. 37; 13 & 15). కాని, నగుణ-నిర్గుణమని యుభయ విధములఁ జెప్పినదాని కిట్లుపపత్తి గాన్పించినను, నగుణ-నిర్గుణము లను నీ పరస్పర విరుద్ధ స్వరూపము లొక పరమేశ్వరునికే యెట్లు సంభవించు నను ప్రశ్నకు విఁరణము మిగిలియే యున్నది. అవ్యక్తుఁడగు పరమేశ్వరుఁడు వ్యక్తమగు, లేక, యింద్రియగోచరమగు స్వరూపమును ధరించుటయే యాతని మాయగ నున్నది; కాని వ్యక్తము, లేక, యింద్రియగోచరము గాక యవ్యక్తముగనే యుండి నిర్గుణము సగుణమైనప్పుడు దానినేమని చెప్పవలయును? ఉదాహరణము: నిరాకారుఁడగు నొక పరమేశ్వరుని, ఒకఁడు "నేతి నేతి" యనియు, నిర్గుణుఁడనియు, నొకఁడు సర్వగుణసంపన్నుఁడు, సర్వకర్మ యనియు, దయాళు వనియు, సగుణుఁడనియుఁ దలఁచుచున్నారు. అప్పుడు దీనికి కారణ మేమనియు లేక, యిందులో శ్రేష్ఠమగు పక్ష మేది యనియు, ఈ నిర్గుణావ్యక్త బ్రహ్మయందుండి సర్వవ్యక్త సృష్టియు నెటు లుత్పన్నమైన దనియు, బాగుగ వ్యాఖ్యానముఁ జేయుట యావశ్యకము. సర్వసంకల్పములకు

దాతయు నవ్యక్తుఁడు నగు పరమేశ్వరుఁడు యథార్థముగ నగుణుఁడగుటచేతనే యుపనిషత్తులయందును, గీతలయందును వర్ణింపఁబడిన నిర్గుణస్వరూపముయొక్క వర్ణన యతిశయోక్తిగఁ గాని, లేక, వ్యర్థమైన ప్రశంసాపరముగఁ గాని యున్నదని చెప్పుట యధ్యాత్మశాస్త్రముయొక్క మూలాధారమును ఛేదించుటయే. కారణమేమన: గొప్ప ఋషీశ్వరులు మనస్సు నేకాగ్రముఁ జేసికొనుటచే నూత్మము శాంతము నగు విచారముచే "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" (తై. 2 9)– ఏది మనస్సునకైనను దుర్గ్రహ మగునో, దేనిని వర్ణింప శక్తి లేదో, ఏది బ్రహ్మస్వరూపముగ నున్నదని తుదకు సిద్ధాన్తము సేయఁబడినదో, యట్టి యనుభవము అతిశయోక్తి యేనియు, నా మనస్సునకు ననంతము నిర్గుణము నగు బ్రహ్మయొక్క యవగాహనము గాక యుండుట వలన, సత్యబ్రహ్మము నగుణమే యయి యుండవలయునని నుడువుట, సూర్యునికంటె నా దివటీ బహుకాంతి గలది యనుటవలె నుండు నందురు. ఒక సమయమున నీ నిర్గుణస్వరూపోపపత్తి యుపనిషత్తులలోనైన, లేక, గీతలలోనైన లేనియెడల నా విషయము వేఱె యగును. కాని వాస్తవముగ సత్యబ్రహ్మము నగుణము కానేరదు. భగవద్గీతలలో పరమేశ్వరునియొక్క శ్రేష్ఠము నత్యమునగు స్వరూప మవ్యక్తముగనే యున్నదనియు, నతఁడు నవ్యక్తరూపమును ధరించుట యాతని మాయయై యున్నదనియు, స్పష్టముగఁ జెప్పఁబడినది (గీ. 4.6). ఇంతియ కాదు. ఇఁక నేమన: ప్రకృతియొక్క గుణములచే "మోహము నొందిన మూర్ఖలోకము (అవ్యక్తము, నిర్గుణము నగు) ఆత్మకే కర్తృత్వ మున్నదని యెన్నుచున్నది" (గీ.3.27-29). ఈశ్వరుఁ డేమియు చేయుటలేదు. అజ్ఞానముచే లోకులు బద్ధులగుచున్నారు (గీ. 5.15); అనఁగా; అవ్యక్తమగు నాత్మ, లేక, పరమేశుఁడు మొదట నిర్గుణుఁడుగ నుండెను (గీ. 18 31). అతనియందు కర్తృత్వాది గుణములను మోహముచే నైన నజ్ఞానముచే నైన నారో

పించి యాతనిని నగుణునిగ నవ్యక్తునిగఁ జేయుచున్నారు (గీ.7.24). (1) గీతలయందు పరమేశుని వ్యక్తస్వరూపము విశేషముగ వర్ణింపఁ బడినను, పరమేశుని మూలభూతమును శ్రేష్ఠమునగు స్వరూపము నిర్గుణము నవ్యక్తమునయి యున్నది. మనుష్యులజ్ఞానముచేఁగాని, మోహముచే గాని యతనిని నగుణుఁడని యనుకొనుచున్నారు. (2) సాంఖ్యుల ప్రకృతి, లేక, దానియొక్క వ్యక్తమగు దుకాణము (అనఁగా: సర్వజగత్తు) పరమేశుని మాయయై యున్నది. (3) సాంఖ్యుల 'పురుషుఁడు' (అనఁగా: జీవాత్మ) ప్రారంభమునుండియుఁ బరమేశ్వర రూపుఁడును, పరమేశునివలె నిర్గుణుఁడు నకర్తగ నున్నాఁడు; కాని అజ్ఞానముచే నతనిని లోకులు కర్తగఁ బలంపుచున్నారు. ఇదియే పరమేశ్వర స్వరూప సంబంధములో గీతయొక్క సత్యమగు సిద్ధాంత ముగ నున్నదని పై వివేచనవలన నిష్పన్న మగును. వేదాంతశాస్త్ర సిద్ధాంతము నిదియే. కాని పిదప నుత్పన్నము లైన వేదాంతగ్రంథము లలో నీ సిద్ధాంతమును జెప్పుచు 'మాయాఽవిద్యలకు' రెంటికిని కొంచెము భేదము సెప్పఁబడినది. ఉదాహరణము: పంచదశిలో నాత్మయు, పరబ్రహ్మము నను నీ రెండును ప్రారంభమున నేకస్వరూపమే యగుటచే నీ చిత్స్వరూపమగు బ్రహ్మము మాయయందుఁ బ్రతిబింబితుఁ డయినపుడు సత్త్వరజస్తమోమయగుణ ముగ (సాంఖ్యుల యొక్క మూల) ప్రకృతి సృష్టిగ ముగు ననియు తొలుతఁ జెప్పఁబడినది; కాని, తర్వాత గ్రంథములో నీ మాయకే 'మాయ' యనియు, 'అవిద్య' యనియు, భేదముఁ గల్పించి, "మాయయందుఁ ద్రిగుణములలో శుద్ధమైన సత్త్వగుణము వృద్ధియయినపు డది మాయగానే యుండును. మఱియు నీ మాయయందుఁ బ్రతిబింబించిన బ్రహ్మము సగుణము, అనఁగా: వ్యక్తుఁడగు నీశ్వరుఁడు (హిరణ్యగర్భుఁడు)" అని చెప్పినారు. మఱియు నీ సత్త్వగుణమే కొంచెము 'అశుద్ధ' ముగ నేని యదియే 'యవిద్య' యగును. దానియందుఁ బ్రతిఫలించిన

బ్రహ్మమును 'జీవుఁ' డని చెప్పుదురు (పంచ. 1. 15-17). ఇట్లు విచారించితి మేని పరబ్రహ్మమందుండి 'వ్యక్తమగు నీశ్వరుఁడు' నిర్మితుఁ డగుటకు కారణము 'మాయ' యనియు, 'జీవుని' నిర్మించుటకు కారణ 'మవిద్య' యనియు, స్వరూపమునుబట్టి యొక్కటే యగు మాయకు భేదములు సేయవలసి వచ్చుచున్నది; కాని గీతలలో నిట్లు భేదములు సెప్పఁబడలేదు. భగవంతుఁడు "స్వయముగ, నే మాయచే వ్యక్తమగు (అనఁగా: నగుణమైన) రూపమును ధరించెనో (7.25) లేక, యే మాయచే నష్టధాప్రకృతి (అనఁగా: సృష్టియందలి సకల విభూతియు) యెవరియందుండి యుత్పన్న మగుచున్నదో (4. 6) యా మాయయొక్క యజ్ఞానముచే జీవుఁడు మోహమును బొందు చున్నాఁడు" (7. 4-15) అని గీతలలోఁ జెప్పఁబడినది. అవిద్య యను శబ్దము గీతలలో నెక్కడను లేదు. మఱియు శ్వేతాశ్వతరోపనిషత్తులో మాయామయమగు ప్రపంచమే 'అవిద్య' అని స్పష్టముగఁ జెప్పఁబడినది (శ్వేత. 5.1). కాన నవీన వేదాన్తగ్రంథములలోఁ గేవలనిరూపణా సౌలభ్యముకొఱకుఁ జీవేశ్వరదృష్టిచేఁ జేయఁబడిన యవిద్యయు, మాయయు నను నీ సూక్ష్మభేదము నొప్పుకొనక మాయయు, అవిద్యయు, అజ్ఞానము అనుశబ్దములు సమానార్థకములని చెప్పి యీ త్రిగుణాత్మక మాయయొక్కగాని, అవిద్యయొక్క, లేక, యజ్ఞానమయొక్కయు మోహమయొక్కయుఁ గాని, నిత్యమగు స్వరూపము సామాన్యముగ నేది యనియు, గీతలయందు నుపనిషత్తులయందు నున్న సిద్ధాన్తములకు దానిచే నెటు లుపపత్తి గలుగుననియు నీ విషయములు శాస్త్రరీతిగ సంక్షేపముగ నిప్పుడు వివేచనఁ జేయుదము.

నిర్గుణ-సగుణశబ్దములు, చూపులకుఁ జిన్నవిగఁ గాన్పించి నను వానియం దే యే యర్థము లున్నవో వానిని విచారించితి మేని, నిత్యముగ సర్వబ్రహ్మాండమును కన్నుల యెదుట నిలువఁబడి

యుండును. జగత్తునకు మూలమగు ననాది పరబ్రహ్మ మేకము, నిష్క్రియము, నుదాసీనము నయి యుండఁగ, దానియందే మనుష్యుల కింద్రియగోచరములగు ననేకవిధములగు వ్యాపారములు గాని, గుణములుగాని యుత్పన్నము లయి యీ యఖండము ఖండములు గల, దెటులాయెను? అనియు, లేక, మొదట నేది యొకటిగ నుండెనో యదియే యనేకముగను వేర్వేఱగు వ్యక్త పదార్థములుగను నయి యే విధముగఁ గాన్పించు ననియు, ఏ పర బ్రహ్మమందు నిర్వికార మగుటచే మాధుర్యము, తిక్తము, కటువు, గట్టితనము, పలుచదనము, శీతము, ఉష్ణము మొదలగు భేదములు లేవో, దానియందే, వేర్వేఱగు రుచియు, కొంచె మెచ్చుతగ్గుగ గట్టి తనము-పలుచదనము, లేక, చల్లదనము-వేఁడి, సుఖము-దుఃఖము, వెలుతురు-చీఁకటి, మృత్యువు-అమరత్వము, మొదలగు ననేకవిధ ద్వంద్వము లెట్లు పుట్టు ననియు, ఏ బ్రహ్మము శాంతముగ నిర్వాత ముగ నుండునో దానియందుండి నానా విధములగు ధ్వనులు, లేక, శబ్దము లెట్లు పుట్టునని యు, ఏ పరబ్రహ్మమునందు, లోపల వెలుపల యని కాని, దూరము సమీపము నని కాని భేదములు లేవో దాని యండే, వెనుక ముందు, దూరము దగ్గఱ, తూర్పు పడమర, మొదలగు భేదము లెట్లు కలుగు ననియు, ఏ పరబ్రహ్మము అవి కారియు, త్రికాలాబాధితము, నిత్యము, అమృతము నగునో దాని యందుండి యాయాకాలములలో నాశము నొందు పదార్థము లెట్లు పుట్టు ననియు, దేనికి కార్యకారణరూపస్పర్శయే లేదో యట్టి పర బ్రహ్మము మృత్తిక, ఘటము మొదలగు కార్యకారణరూపములచే మనకు దృగ్గోచర మేల యగుచున్నదనియు, మొదలగు ననేక విషయములు పూర్వోక్తము లగు చిన్న (నగుణ నిర్గుణ) శబ్దముల లోనే యిమిడియున్నవి. లేక, సంక్షేపముగ చెప్పుదు మేని యొకనికే నానాత్వము, నిర్ద్వంద్వునకు ననేకవిధములగు ద్వంద్వములును, అద్వైతమునకే ద్వైతమును, అసంగునకే సంగమును నెట్లు కలిగె

నను విషయ మిచ్చట విచారింపవలయును. సాంఖ్యులు, నిర్గుణుడునగు పురుషుడువలెనే త్రిగుణాత్మకమగు (అనగా: సగుణమగు) ప్రకృతియు, నిత్యమును స్వతంత్రముగ నున్నదని ప్రారంభముననే ద్వైతమును గల్పించుటచే నీయనందర్భము దూరముగఁ దొలంగునట్లు చేసిరి. కావున జగత్తుయొక్క మూలతత్త్వమును శోధించి నిర్ణయించు మనుజునియొక్క స్వాభావిక మనఃప్రకృతికి, ఈ ద్వైతముచే సమాధానము కాకపోవుటయే కాక, యుక్తివాదము నకుఁగూడ నిట్టి ద్వైతము నిలువ నేరదు. కావున ప్రకృతి-పురుషుల కంటె పరముగ విచారించి, సచ్చిదానందబ్రహ్మమునకు సైతము పై సోపానమగు నిర్గుణ బ్రహ్మమే, జగత్తునకు మూలముగ నున్నదని యుపనిషత్కారులు సిద్ధాన్తీకరించిరి; కాని యిప్పుడు నిర్గుణమునందుండి సగుణ మెట్లుత్పన్నమైన దనుదానికి నుపపత్తి చెప్పవలయును. కారణ మేమి యనఁగా: "ఏది లేదో యది లేనే లేదు; దానియందు, ఉండునది యెప్పుడును కలుగ నేరదు?" అని సాంఖ్యము యొక్కయు వేదాన్తము యొక్కయు సిద్ధాన్తము. ఈ సిద్ధాన్తానుసారముగ నిర్గుణమునుండి (అనఁగా: దేనియందు గుణము లేదో యా బ్రహ్మమునందుండి) సగుణములు (అనఁగా: దేనియందు గుణములున్నవో అట్టి సృష్టియందలి పదార్థములు) ఉత్పన్నము లగుట శక్యము కానేరదు. కాని "సగుణ మెక్కడినుండి వచ్చినది? సగుణ మని చెప్పకపోవుదు మేని నేత్రముల కెదుట నెట్లు కాన్పించును? నిర్గుణమువలె సగుణము సత్యమే" యని చెప్పుదు మేని యింద్రియగోచరములగు శబ్దము, స్పర్శము, రూపము, రసము, గంధము మొదలగు సగుణ స్వరూపములు, నేఁ డొక విధముగను, రే పొక విధముగను నెప్పుడును పరిణమించును. కావుననే నాశము నొందునదియు, వికారియు, నశాశ్వతము నగును. కావున సగుణసిద్ధికొఱకైనను (సర్వవ్యాపి యగు పరమేశుఁడు విభాజ్యుఁ డని కల్పించి) నశ్వరుఁడుగ నున్నాఁడని చెప్పవలసి వచ్చును. మఱియు విభాజ్యము సైతము నశ్వర మగుటచే

సృష్టినియమముయొక్క యల్లరిలో నెప్పుడును పరతత్త్వముగ నంచ రించువానిని పరమేశ్వరుఁ డని యెట్లు చెప్పవలయును? ఇంద్రియ గోచరము లగు నకల సగుణపదార్థములు, పంచమహాభూతములయం దుండి నిర్మితములైనవి యని తెలిసికొనవలయును. వేదాన్తులవలెఁ గాని, యాధిభౌతికులవలె గాని యీ సర్వపదార్థములును, వ్యక్తము గాని, సగుణము గాని యగు మూలప్రకృతియందుండి నిర్మితము లయిన వని యనుమానము నైనను జేయవలయు నని సారాంశము. ఏ పక్షమును స్వీకరించిన, నశ్వరములగు గుణము లెంతవఱకు నీ మూలప్రకృతిని వదలిపోవో, యంతవఱకును, పంచమహాభూతములు లేక, ప్రకృతిరూపమగు నీ మూలపదార్థము జగత్తున నశింపనిదియై, స్వతంత్రముగను, లేక, యమృతమగు తత్త్వముగను నున్నదని యనుటకు వీలులే దను విషయము నిర్వివాదముగనే యున్నది. కావున నెవరికి ప్రకృతివాద మిష్టమో వారు పరమేశ్వరుఁడు నిత్యుఁడు స్వతంత్రుఁడు నమృతుఁడుగ నున్నాఁడని చెప్పుటను వదలవలయును. కాదేని, పంచమహాభూతములకంటె, లేక, ప్రకృతికంటె సగుణ మగు మూలప్రకృతికంటె పరముగా నున్న విషయ మేమి యని శోధింప వలయును. ఇంతకన్న రెండవమార్గము లేదు. ఎండమావు లలోని నీటిచే దప్పిపోవుటయు, నిసుకనుండి తైలముఁ దీయుటయు నెట్లు శక్యము కానేరదో, యటులే యేది బాగుగ క్షశ్వరమైయున్నదో దానియందుండి యెప్పుడైన నమృతత్వము నిప్పన్నమగుట యశక్య మగును. కావుననే యెంత సంపద కలిగినను, "అమృతత్వస్య తు నాశాఽస్తి విత్తేన"—సంపదచే నమృతత్వము లభించునని యాశింప వలదు" (బృ. 2 4.2) అని యాజ్ఞవల్క్యులు, మైత్రేయికి స్పష్టముగనే చెప్పిరి. అమృతత్వ మనత్యమందు మేని, రాజిచ్చిన యానాము (బహుమానము) మనకు పిదప మన పుత్రపౌత్రాదులకు నాచంద్రార్కముగ ననుభవింపఁదగినదిగ నుండవలయునని మనుజుఁడు గోరు చుండును. లేక చిరకాలస్థాయి యగు (అనఁగాఃశాశ్వతమగు) కీర్తి

లభించు నవకాశము కలిగె నేని మన జీవితము పోయినను నరియే లక్ష్యము చేయనట్లు కాన్పించుచున్నది. ఋగ్వేదమువంటి యత్యంత ప్రాచీన గ్రంథములో "ఓ యింద్రా! నీవు నాకు 'అక్షితశ్రవము' అనఁగా: అక్షయ్యమగు కీర్తిని, లేక, ధనమును నిమ్ము" (ఋ. 1.9.7) అనియు, "ఓ సోమా! నీవు నన్ను వైవస్వత (యమ) లోకమున నమృతునిగాఁ జేయుము" (ఋ. 9.113.8) అనియు, పూర్వఋషులు ప్రార్థించుచున్నారు. మఱియు నర్వాచీనకాలమునందు నీ దృష్టినే స్వీకరించుటచే "శీఘ్రముగ ననుభవములోనికి వచ్చిన సుఖమును మఱువక ఇప్పు డున్నదియు, ఇఁక ముందు పుట్టఁబోవునదియు నగు మానవజాతికి చిరకాలముండు సుఖమును గలుగఁ జేయుట యనునదియే యీ జగత్తునందు మనుష్యమాత్రునకు నీతిసిద్ధమగు పరమకర్తవ్యముగ నున్న" దని స్పెన్సరు, కాంటువంటి ముఖ్యులగు నాధిభౌతిక పండితులు సెప్పుచున్నారు. తన శక్తి కి (జీవితమునకు) దూరమునందున్న నిరంతరకల్యాణము (అనఁగా: అమృతత్వము) ఎందుండి వచ్చినది? అది స్వాభావిక మని నుడివినచో, ఈ వినాతులగు రెండు వస్తువులకంటెను, పరమున నొక యమృతవస్తు వున్నదని చెప్పవలసివచ్చును. మఱియు నీ యమృతవస్తువు లేదని చెప్పిన యెడల మనకు ప్రత్యక్షముగనున్న మనోవృత్తియొక్క యనుభవమును మఱియొక విధమున నమర్థించుటకు సాధ్యము కానేరదు. ఇట్టి యనుపపత్తి మనస్సున నిడుకొని యీ ప్రశ్న యేనాఁటికిని సమాధానము చెప్పఁదగినది కానేరదు. కావున దానిని విచారింపక, దృశ్యసృష్టియందున్న పదార్థములయొక్క గుణధర్మములకంటె మనస్సును పరువిడనియకూడదని యనేకు లాధిభౌతికపండితు లుపదేశముఁ జేయుచున్నారు. ఉపదేశము సులభముగఁ గాన్పించును, కాని మనుజుల మనస్సునందు, తత్త్వజ్ఞానము కావలయునని స్వాభావికముగఁ గలుగుకోరిక నెవరు మానుపఁ గలరు? మఱియు నీ యధికమగు జిజ్ఞాస (ఎఱుంగవలయు ననుకోరిక) నొకపరి యణఁగ ద్రొక్కినచో విజ్ఞాన

మెట్లు వృద్ధియగును. మనుజుఁడీ భూమియం దవతరించినది మొదలు సర్వదృశ్యవస్తువులకు నశ్వరసృష్టికిని మూలభూతము నమృతము నగు తత్త్వ మేది యనియు, అది నాకెటుల ప్రాప్త మగుననియు విచారము నెప్పుడును చేయుచునే యున్నాఁడు. అధిభౌతికశాస్త్రమెంత వృద్ధిఁ బొందినను, అమృతత్వముయొక్క జ్ఞానము కొఱకైన యీ స్వాభావికప్రవృత్తి సదా మనుష్యునకు తక్కువ కానేరదు. మనుజుని యాధిభౌతిక జ్ఞానము నెంతయైనను వృద్ధిఁ బొందనిమ్ము; ఈ సక లాధిభౌతిక సృష్టివిజ్ఞానముల నొక వైపునకు నెట్టి, తత్త్వజ్ఞానము మనుజుని యెదుట సదా పరువిడుచుండక మానదు. రెండువేలవత్స రంబులకు మును పీ స్థితియే యుండెను. మఱియు నిప్పుడు పాశ్చా త్యుల దేశమునందు సైత మా విధముగనే కాన్పించుచున్నది. వేయేల? మనుష్యబుద్ధియందు కాంక్షతగ్గిన దినమునందే "న వై ముక్తోఽథ వా పశుః"— వాఁడే ముక్తుఁ డగును. కానియెడల పశువగునని చెప్ప వలసివచ్చును.

కానిమ్ము, దిక్కులయొక్కయు కాలముయొక్కయు నియ మము లేనిదియు, అనవచ్ఛిన్నము, అమృతము, అనాది, స్వతం త్రము, ఏకవిధము, నిరంతరము, సర్వవ్యాపకము, నిర్గుణమునగు తత్త్వముయొక్క అస్తిత్వవిషయ మైనను, లేక, యా నిర్గుణతత్త్వము సగుణసృష్టి యెట్లు వచ్చెనను విషయమును గుఱించి యైనను మన నుండి ప్రాచీనములగు నుపనిషద్గ్రంథములలో నుండు నుపపాదన కంటె నధికముగను సయుక్తికముగను నితర దేశములలో నుండు తత్త్వజ్ఞానులు నేఁటివఱకును శోధించియు నిర్ణయింపలేదు. అర్వాచీనుఁ డగు కాంటుతత్త్వజ్ఞుడు బాహ్యసృష్టియొక్క నానాత్వము నేకత్వముగ నెల్లెఱుంగవలయు నని సూక్ష్మముగ విచారించి యీ యుపపత్తి నే యర్వాచీనశాస్త్రరీతిగ స్పష్టముగ ప్రవాసినాఁడు. కాంటుకంటె, 'హెకెల్' ఎక్కువ లోతుగ విచారించినను పిని సిద్ధాన్తము సైతము

వేదాన్తమున కంటె మించలేదు. 'సోఫెన్‌హాయర్' అనువాని విషయమును ఇటులే యున్నది. అతఁడు, లాటిన్‌భాషలో తర్జుమాచేయఁబడిన యుపనిషత్తులను జదువుకొనిన పిదప, "జగత్తులో నున్న వాఙ్మయమునం దీ యత్యుత్తమ మగు గ్రంథమునుండి, మన గ్రంథములలోనికి కొంత విచారము తీసికొనఁబడిన"దని తానే చెప్పినాఁడు. కాని యీ గూఢమగు విచారమును దానికి సాధకబాధకము లగు ప్రమాణములును, వేదాన్తమందలి సిద్ధాన్తములును, కాంటు మొదలగు పాశ్చాత్యతత్త్వజ్ఞానుల సిద్ధాన్తమునకును దీసికిని నెంత సాదృశ్యము కలదో యెంత వైషమ్యము గలదో యదియును, లేక, యుపనిషత్తులు, వేదాన్తసూత్రములు మొదలగు గ్రంథములందున్న వేదాన్తమునకు, తదుత్తరకాలికము లగు వేదాన్తములకును స్థూలసూక్ష్మము లగు భేదము లేవి యనునదియు, మొదలగు విషయముల నీ చిన్న గ్రంథమున సవిస్తరముగ నిరూపించుట శక్యము కానేరదు. కావున గీతల యఁదున్న యధ్యాత్మసిద్ధాన్తములయొక్క సత్యతను, యుక్తిని, మహత్త్వమును తెలియఁజేయుట కావశ్యకము లగు భాగములనే ముఖ్యముగ నుపనిషత్తులయొక్కయు, వేదాన్తసూత్రములయొక్కయు, శాంకరభాష్యముయొక్కయు నాధారమున నిచ్చో నేను దగ్దర్శన న్యాయముననే నిరూపింతును.

ప్రకృతి-పురుషులను సాంఖ్యోక్తమగు ద్వైతముకంటె పరముగ నేమి యున్నదని నిర్ణయించుటకై, సృష్టిని చూచువాఁడును (ద్రష్ట), దృశ్యమగు సృష్టియు ననునీ ద్వైతభేదమునందే నిలచియుండక, మొదట సృష్టిజ్ఞానముయొక్క స్వరూపమేమి? అది దేనిచే నే విధముగఁ గలుగు ననునీ విషయములను సూక్ష్మముగ విచారింప వలసి వచ్చును. బాహ్యసృష్టి యందలి పదార్థములు మనుష్యుల నేత్రముల కెటులు గాన్పించునో యటులే పశువులకు సైతము కాన్పించును; కాని, నేత్రములు, నాసిక మొదలగు జ్ఞానేంద్రియము

లచే మనస్సున నమకూరు సంస్కారముల నొక్కటిగఁ జేయుశక్తి మనుజునియందు విశేషముగ నుండుటచే, మనుజునకు బాహ్యసృష్టి యందున్న యన్నిపదార్థములయొక్క జ్ఞానమును గలుగును. అదియే పశువులకంటె మనుజునియందుండు విశేషము. ఈ విశేషము ఫలము గాఁగల యేకీకరణశక్తి మనోబుద్ధులకంటె పరమగు నాత్మకు సంబంధించినదే యని పూర్వము క్షేత్రక్షేత్రజ్ఞ విచారనులోఁ జెప్పఁబడినది. కేవల మొక పదార్థముయొక్క కార్యకారణభావమే కాక, సృష్టినియమము లనఁబడు నానాపదార్థములయొక్క కార్యకారణ భావము మొదలగు అన్ని సంబంధముల జ్ఞానము సైతము నాత్మ సంబంధ మైనదియే. కారణ మేమన:-ఆ యా పదార్థములు కంటికి కాన్పించినను, వానియందలి కార్యకారణభావాదినంబంధము ప్రత్యక్ష గోచరము కానేరదు. మఱియేమన: ద్రష్ట (చూచువాఁడు) తన మానసిక వ్యాపారముచే వానిని నిశ్చయించుచున్నాఁడు. ఉదాహరణము: ఏదైన నొక పదార్థము మన నేత్రములకుఁ గాన్పించెనేని యా పదార్థముయొక్క రూపమును, గతిని పీక్షించి యది యొక సేనలో నున్న సిపాయి (కాలిబంటు) యని ముందుగ మనము నిశ్చయింతుము. మఱియు నా సంస్కారము మనంబున స్థిరంబుగ నుండును. దీనికి పిదప మఱియొక పదార్థము కంటికిఁ గాన్పించెనేని మరల నా మానసిక క్రియ యారంభ మగుటచే నా పదార్థము మఱి యొక సిపాయి యని మరల నిశ్చయింతుము. ఇటు లొకదాని వెంబడి ఒకటి వేర్వేఱగు లక్షణములతో వేర్వేఱుకాలములయందు మనస్సు నకుఁ గలిగిన యనేక సంస్కారములను స్మరణశక్తిచే జ్ఞప్తికిఁ దెచ్చుకొని వాని నన్నింటి నొక్కటిగఁ జేసిన పిదప పురోభాగమునందుండి సైన్యము నడచిపోవుచున్న దని యెఱుంగుట యీ వేర్వేఱు సంస్కారములచేఁ గలిగిన యేకత్వజ్ఞానమునకు ఫల మగును. ఈ సైన్యము యొక్క వెంబడి వచ్చు పదార్థమును దాని రూపమును బట్టి 'రాజు' అని నిశ్చయించిన పిదప, సైన్య మను వెనుకటి సంస్కారముతో నీ

నవీనసంస్కారము గలియుటచే నీ రాజుయొక్క సైన్యము పోవు చున్నదని మనము చెప్పుచున్నాము. ఇందువలన సృష్టిజ్ఞానము (అనఁగా: ఇంద్రియములకుఁ బ్రత్యక్షముగఁ గాన్పించునది) కేవల జడపదార్థము గానందున, నింద్రియములద్వారా మనస్సునఁ గలుగు ననేక సంస్కారములయొక్క యే యేకీకరణమును ద్రష్టయగు నాత్మ సేయుచున్నదో, దానికి జ్ఞాన మనునది ఫలముగ నున్నదని చెప్పుట న్యాయ్యమయియున్నది. మఱియు నీ కారణముననే భగవద్గీతల యందును "అవిభక్తం విభక్తేషు"— ఏది విభక్తముగ నున్నదో (వేర్వేఱుగనున్నదో) దానియందలి యవిభక్తత్వము లేక, ఏకత్వము దేని మూలమునఁ దెలియునో యదియే నత్యమగు జ్ఞాన మని* జ్ఞాన లక్షణము సెప్పఁబడినది (గీ. 18.20). ఈ యింద్రియములవలన మనస్సునందు మొదటఁ గలుగు సంస్కారమునకుఁ గారణమేమి యని తిరుగ సూక్ష్మవిచారము చేసితిమేని, కన్ను, చెవి, ముక్కు మొదలగు నింద్రియముల మూలమున ప్రతిపదార్థముయొక్క రూపము, శబ్దము, గంధము మొదలగు గుణములు మనకుఁ దెలిసినచో బాహ్యగుణములు గల ద్రవ్యముయొక్క యంతరంగ స్వరూపము మన యింద్రియము లకు గోచరము కానేరదు. తడిమట్టినుండి ఘటు ముత్పన్న మయినట్లు మనము చూచుచున్నను తడిమట్టి యని చెప్పఁబడుపదార్థముయొక్క మూలమగుతాత్త్విక స్వరూప మెద్దియో మనకుఁ దెలియదు. జిగురు, తడియుట, మురికిరంగు, లేక, వక్రుపయాకారము (రూపము), మొదలగు గుణము లింద్రియములవలన మనస్సునకు వేర్వేఱుగఁ దెలిసినపిదప నా సకల సంస్కారములను 'చూచు' నాత్మ యేకీకరణముఁ జేసి "ఇది తడిమన్ను" అని చెప్పుచున్నాఁడు. మున్ని ద్రవ్యముయొక్క గుణములు మనస్సునకుఁ దెలిసినపిదప వాని నేకీక

* Cf. "Knowledge is first produced by the synthesis of what is manifold." Kant's Critique of Pure Reason, p. 64. Maxmuller's translation 2nd. Edition.

రించి (ద్రష్ట చూచువాఁడు) దానిని ఘటమని చెప్పుచున్నాఁడు. ఏ ద్రవ్యముయొక్క తాత్త్వికస్వరూపము మాటినదని చెప్పుట కేమియు కారణము లేకపోవుటచే, వట్రుట, లోతునగు నాకృతియు, గట్టిగఁ వినఁబడు ధ్వనియు, ఎందుట మొదలగు గుణములు మనస్సునకుఁ దెలిసినపిదప వాని నేకీకరించి ద్రష్ట (చూచువాఁడు) దానిని ఘట మని చెప్పును. ఈ మార్పంతయు రూపమునందే యుండుటచే మనస్సునందుఁ బుట్టిన యీ గుణములయొక్క సంస్కారములను ద్రష్ట యేకీకరణముం జేసెనేని, యొక్క మూలద్రవ్యముసకే యనేక నామములు ప్రాపించునని సారాంశము. ఈ యన్నింటికంటె సులభ మగు నుదాహరణ మేమి యని యందు మేని సముద్రము తరంగ ములుగను, సువర్ణ మలంకారములుగ నుండుటయే. కారణ మేమి యన: రంగు, కాఠిన్యము, ద్రవత్వము, బరువు, తేలిక మొదలగునవి యొకవిధముగనే యుండును. రూపము, (ఆకారము) నామము ననునవియే యిచ్చో భేదమును బొందుచుండును. ఆ హేతుపుచేతనే యీ సులభ మగు దృష్టాంతము వేదాన్తమునం దెప్పుడును వచ్చు చుండును. సువర్ణ మొక్కటియే యైనను, దానియొక్క యాకార ములో నా యా సమయములందుఁ బుట్టుభేద మింద్రియముల మూల మున గహించి సంస్కారముల నొక్కటిగఁ జేర్చి (ద్రష్ట) చూచు వాఁడు తత్త్వము నెఱుంగు దృష్టిచే యొక్కటియే యగు మూల ద్రవ్యమున కొకపరి కడియ మని, మఱియొకపరి యుంగర మని, వేఱొకపరి కుండల మని, వేర్వేఱు నామముల బెట్టును. అయిన నా యా కాలములయందు మాఱుచున్న పదార్థముల ఆకృతులును, నామములును నుపనిషత్తులలో నామరూపము లని చెప్పుదురు గాన నితరములగు నన్నిగుణములును నీ నామరూపములలోనే చేరుచున్నవి (ఛా. 6.3 మఱియు 4; బృ. 1.4 7). కారణ మేమియన: (ఏ గుణమును విచారించినను దానికి కొన్నియైనను నామరూపములుండక తప్పవు. ఈ నామరూపములు ప్రతిక్షణమునందు మాఱునవి యైనను వానికి

మూలమైనదియు, నీ నామరూపములకు వేఱుగునదియు, నెప్పుడును మాఱని యొక ద్రవ్యముండును. ఉదకము పై ననేక విధములగు తరంగములు వచ్చునటులే యొక మూలద్రవ్యముపై ననేక నామ రూపము లను తరంగములు వెలువడునని రూఢిగఁ జెప్పనగును. మన యింద్రియములు నామరూపములకంటె వేఱగు నేవిషయమునైనను నెఱుంగఁజాలవు. కావున నామరూపముల కాధార మైనదియు, ఈ నామరూపములకంటె వేఱుగునదియు నగు మూలమునందున్న ద్రవ్య మింద్రియగోచరము కానిమాట నిజమే; కాని సర్వజగత్తునకు నాధార భూత మగు నీ తత్త్వ మవ్యక్త (అనఁగా: ఇంద్రియములకు తెలిసి కొన శక్యము కానిది) మైనను అది 'సత్' (అనఁగా: నత్యముగ, సర్వకాలములందు, ఈ నామరూపము లందును, వీని మూలమందును నుండునదియే) కాని, ఎప్పుడు నుండక పోవునది కానేరదని మనము నిశ్చయముగ నూహింపవచ్చును. కారణమేమి యన: ఇంద్రియ గోచరములగు నామరూపములుదక్క మూలమునం దేమియును లేదని చెప్పితిమేని, కంకెయు, కడియము నను పదార్థములు వేర్వేఱుగ నున్నను అవి యొక సువర్ణముచేతనే నిర్మింపఁబడిన వని మనకుఁ గలుగుజ్ఞానమునకు నేమియు నాధారముండనేరదు. 'కంకెయున్నది, కడియమున్నది' యని మాత్రమే చెప్పఁగలము కాని, కంకె బంగారుకంకె యని చెప్పుటకు వీలులేదు. కావున కంకె సువర్ణ సంబంధ మయినది. ఈ హారము స్వర్ణసంబంధముగ నున్నదను వాక్యములందు 'ఉన్నది' అని శబ్దముంబట్టియే బంగారమునకును, నామరూపాత్మకమగు కంకెకును, లేక, హారమునకును సంబంధము కలిగించు బంగారము, కుండేటికొమ్మువలె యభావరూపము కానేరదు. కావున, సర్వాభరణములకు నాధారభూతములగు ద్రవ్యాంశముల చేతనే 'బంగార' మను శబ్దమునుంచి బోధ యగుచున్నదని యీ న్యాయము వలన ప్రాప్తమగును. ఈ న్యాయమునే సృష్టియందుండు

సర్వపదార్థములకు సంబంధింపఁ జేసితిమేని "ఆయి, ముత్యము, రూప్యము, లోహము, కిట్టెలు మొదలగు మన దృష్టికి కాన్పించు చున్న పదార్థము లన్నియు నేదేని యొక నిత్యద్రవ్యముపై వేర్వేఱుగ నామరూపము లను పైపూఁతతోఁ బుట్టుచున్నవి. పూఁత మొదలగు నిఖిలభేదములు నామరూపాత్మకములుగనే యున్నవి; కాని మూల ద్రవ్యసంబంధము లయినవి కానేరవు. నానాప్రకారము లగు నామ రూపములుగల మూలపదార్థమునందు నొకవిధమగు ద్రవ్యమే యెప్పుడు నుండు" నని సిద్ధాన్త మగును. సర్వపదార్థములందు నిట్లు నిత్యరూపముగ నెప్పుడు నుండుటచే సంస్కృతమునందు 'నత్తా సామాన్య' మని చెప్పుచున్నారు.

మన వేదాన్తశాస్త్రమునందున్న పూర్వోక్తసిద్ధాన్తములె 'కాంటు' మొదలగు నర్వాచీనులగు పాశ్చాత్యతత్త్వజ్ఞానులచే సైత మంగీకరింపఁ బడినవి. మఱియు నామరూపాత్మకమగు జగత్తునకు మొట్టమొదట నుండెడి పదార్థ మేది యైనను, నామరూపములకంటె భిన్నము, నదృశ్యమునగు ద్రవ్యమునకే వస్తుతత్త్వ మనియు, నేత్రాదీంద్రియము లకు గోచరమగు నామరూపములకు పైఁ గాన్పించుటానికి దృశ్య మనియు వారి గ్రంథములలోఁ బేరు పెట్టఁబడినది. *వేదాన్తశాస్త్రము నం దెల్లప్పుడును మార్పునొందెడు నామరూపాత్మకమగు దృశ్యమును 'మిథ్య', లేక, 'నాశవంత' మనియు, మూలద్రవ్యమును 'సత్యము' లేక, 'అమృతము' అనియు చెప్పుట యాచారమై యున్నది.

---

*కాంటు యొక్క Critique of Pure Reason అను పీ గ్రంథమున పీ విచారము చేయఁబడినది. నామరూపాత్మకమగు జగత్తునకు మూలమగు ద్రవ్య మునకు 'డింగ్ అన్ సిఖ్' (Ding an Sich=Thing in itself) అని యతఁడు పేరిడెను. దీనికె వస్తుతత్త్వమని నేను భాషాన్తరీకరించితిని. నామరూపములమ పైకి కాన్పించు దృశ్యమునకు 'ఎరశాయమంగ్' (Erscheinung=appearance) అని కాంటు నామ మిడెను. వస్తుతత్త్వ మజ్ఞేయ మని కాంటు చెప్పుచున్నాఁడు.

సామాన్యజనులు 'చక్షుర్వై సత్యం', అనఁగా: 'కంటికిఁ గాన్పించు నదియే సత్యము' అని సత్యశబ్దమునకు వ్యాఖ్యానముఁ జేయుచుందురు. మఱియు వ్యవహారముఁ జూచితిమేని లక్షరూప్యములు మనకు లభించినటుల కలఁ గనుటయు, లక్షరూప్యము లసి వినుటయు లక్షరూప్యములు ప్రత్యక్షముగ లభించుటయు ననువానిలో నెక్కువగ నెచ్చుతగ్గులున్నవని యెవరికిని చెప్పనక్కఱలేదు. కర్ణాకర్ణికగ నొక కథను వినుటయు దానిని ప్రత్యక్షముగఁ గంటితోఁ జూచుటయు నంభవించినపుడు, దెవియు, కన్నును పీని రెంటిలో దేనియం దధిక శ్రద్ధవహింపవలయునో చెప్పుటకై బృహదారణ్యకోపనిషత్తులో 'చక్షుర్వై సత్యం' అను వాక్యము చెప్పఁబడినది (బృ. ఏ.14.4); కాని, 'రూప్య మను పదార్థము, 'రూప్య' మను దృశ్యమైన పేరుచేతను, రూపముచేతను (అనఁగా: వర్తులాకారముచేతను) సత్య మగునా? కానేరదా?' యని శాస్త్రమునందు నిర్ణయింపవలసినచో సత్యశబ్దము యొక్క యీ సాపేక్షమగు వ్యాఖ్యాన మేమి యుపయోగించును? వ్యవహారమునందును మన మిటులే చూచుచున్నారము. ఏ సమయమం దయినను పరస్పరసంబంధము లేక యొకప్పు డొక మాటయు నాడువాఁ డబద్ధమాడువాఁ డని లోకు లందురు. రూప్యమును నామరూపములకు (లోపలనున్న ద్రవ్యము మాత్రము కానేరదు) ఈ న్యాయము సంబంధించును గాన వానిని సత్యమని యైనను, లేక, మిథ్య యని యైనను ఏల నుడువరాదు? ఇటు లనుటకు కారణమేమి యన: కంటికి నేఁడు కాన్పించెడి రూప్యముయొక్క 'రూప్య' మను నామరూపములను తీసివైచి, దాని స్థానమున 'గొలు' నని, లేక, 'గిన్నె' యని నామరూపములు, రేపు పెట్టుటకు వీలున్నది. అనఁగా: నామరూపములయం దెప్పుడును భేద ముండుననియు, లేక, ఐక్య ముండదనియు మన కన్నులకుఁ గాన్పించుచునే యున్నది. ఇంతియ కాక మన నేత్రములకుఁ గాన్పించునది తప్ప మఱియొక పదార్థము సత్యమైనది లేదని వచించితిమేని, యేకీకరణముయొక్క యే మానసిక

క్రియయందు సృష్టిజ్ఞానము గలుగుచున్నదో యా క్రియయును నేత్రములకు గోచరింపనిదియే కావున నది యనత్య మని చెప్పవలసి వచ్చును. దానినుండి మనకుఁ గలుగుఁ జ్ఞానమంతయుఁగూడ ననత్య మని చెప్పవలసివచ్చును. దీనినైనను, లేక, యిటువంటి యిత రాభ్యంతరముల నైనను గనిపెట్టి 'నేత్రములకు గోచరించునదియే సత్య' మనెడు లౌకికమును సాపేక్షము నగు సత్యలక్షణమును నిజ మనక, యేది యవినాశియో (అనఁగా: ఇతర విషయము నశించి నను ఏది యెప్పుడును నశించునది కాకుండునో) యదియే సత్యమని సత్య శబ్దమునకు సర్వోపనిషత్తులయందును వ్యాఖ్యానము చేయఁబడి నది. మఱియు నందు మూలముననే మహాభారతమునందును-

సత్యం నా మావ్యయం నిత్యం అవికారి తథై వ చ*

(మ.భా.శాం. 182.10)

-- ఏది యవ్యయమును (అనఁగా; ఎప్పుడును నాశమునొందనిది) నిత్యమును (అనఁగా: ఎప్పుడును స్థిరముగనుండునది), మఱియు నవికారియు (అనఁగా: దేనియొక్క స్వరూప మెప్పుడును మాఱ నిదియో) నగునో యదియే సత్యము అని సత్యలక్షణము చెప్పఁ బడినది. ఇప్పు డొకమాటను, క్షణములో మఱియొక మాటను చెప్పు వానిని వ్యవహారములో ననృతమాడువాఁ డనుటకు నిదియె కారణ ముగ నున్నది. సత్యమునకు నీ నిరపేక్షమగు లక్షణము స్వీకరింపఁబడె నేని, నేత్రములకుఁ గాన్పించినను, క్షణక్షణమును మాఱిపోవు నాము రూపము లనత్యము లనియు, వానిచే నాచ్ఛాదితమును, వానికి మూల

* 'గ్రీన్' అను నతఁడు real (సత్తు, లేక, సత్యము) అను దానిని "Whatever anything is really, it is unalterably" అని వ్యాఖ్యానము చేసియున్నాఁడు. (Prolegomena to Ethics § 25) గ్రీను యొక్క యీ వ్యాఖ్యయు, మహాభారతమునందలి యీ వ్యాఖ్యయు, తత్త్వమున కొక్కరీతిగనే యున్నవి.

కారణమును, ఎల్లప్పు డొకతీరుననే యుండు నమృతమగు వస్తుతత్త్వ మనునదియే_ కంటికిఁ గాన్పింపకపోయినను_ నిజమగు నత్యముగ నున్నదనియు, చెప్పవలసివచ్చును. భగవద్గీతలయందు_ "య స్స ర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి" _ సర్వపదార్థములును (అనఁగా; సర్వపదార్థములయొక్క నామరూపాత్మకమగు శరీరమును) నాశము నొందినను నే పదార్థము లేకపోవునది కాదో యదియే యక్షరమగు బ్రహ్మ మగును (గీ. 8.20; 13.27) అని చెప్పఁబడిన పరబ్రహ్మలక్షణమును నిటువంటిదియే.

మహాభారతమునందు నారాయణీయ, లేక, భాగవత ధర్మ ముల నిరూపణయందును నీ శ్లోకము "య స్స ర్వేషు భూతేషు" దానికి మాఱుగ, "భూతగ్రామశరీరేషు" అను పాఠభేదముతో చెప్పఁ బడినది (మ.భా.శాం. 339.28). అటులే గీతలలోని రెండవ యధ్యా యములో నున్న పదునాఱవ పదునేడవ శ్లోకములకు నిదియె తాత్పర్యము. వేదాన్తమునందు అలంకారము 'మిథ్య' మఱియు సువర్ణము 'సత్య' మని చెప్పినప్పుడు, అలంకార ముపయోగము లేనిదని కాని, బొత్తిగ నసత్యమని కాని (అనఁగా: నేఱములకు గాన్పించునది కాదని కాని) లేక, మట్టికి పూఁత వేయఁబడినదని కాని, లేక, మొదటినుండియు నస్తిత్వము లేనిదని కాని యర్థము చేయరాదు. మిథ్యాశబ్ద మిచ్చో పదార్థముయొక్క రంగు, రూపము, మొదలగు గుణములను, ఆకృతిని (అనఁగా: దానిపై దృశ్యమగు రూపమును) ఉద్దేశించి యోజింపఁబడినది కాని, లోనుండు మూల మగు ద్రవ్యము నుద్దేశించి ప్రయోగింపఁబడినది కానేరదు. కారణ మేమియన: తాత్త్వికద్రవ్యము తప్పక సత్యముగనే యున్నదను సంగతి గుర్తుంచుకొనవలయును. వేదాన్తులమతమున ప్రతిపదార్థము యొక్క నామరూపాత్మకమగు ముసుగులో నాదియం దే తత్త్వ మున్నదో విచారింపవలసియుండును; మఱియు తత్త్వజ్ఞానమునకు

నదియే నత్యమగు విషయము. ఒకానొక నగను జేయించుకొనుటకు మనము విశేషము కూలి యిచ్చినను నాపత్కాలమునం దా యా భరణమును వర్తకులకు విక్రయింపవలసి వచ్చినప్పు డా యాభరణ మును 'బంగారు ఖరీదునకు మాత్రమే తీయుదుము. కాని దానికైన కూలి నీయ' మని వర్తకులు మనకు నిశ్చయముగ చెప్పుటను లోక మున మన మనేక పర్యాయములు వినుచున్నాము. వేదాన్తుల పరి భాషతో నీ విచారముఁ దెలుపవలసిన, వర్తకున కాభరణము మిథ్య యనియు, దానియందలి బంగారము మాత్రమే నత్య మనియు చెప్పవలసివచ్చును. క్రొత్త యింటి నమ్ముదు మందుమేని, యా రీతిగనే యా గృహముయొక్క రూపమును, దాని మంచి రచనను, నిర్మించుటకునైన సొమ్ము (కూలి) నంతను విచారింపక యింటికిఁ బట్టిన యిటుకలు నున్నము మొదలగు పదార్థములయొక్కయు, కఱ్ఱసామానులయొక్కయు ఖరీదుఁ గట్ట యింటి నమ్ముమని కొను వాఁడు చెప్పును. నామరూపాత్మకమగు జగత్తు మిథ్య, బ్రహ్మ నత్యము నని వేదాన్తులు చెప్పుటకు నర్థ మిదియే యని చదువరు లెఱుంగ వలయును. దృశ్యజగము 'మిథ్య' యనఁగా: జగత్తు కంటికి నగపడ దని యర్థము చేయరాదు; కాని యొక ద్రవ్యము యొక్క యే నామరూపములనుండి పుట్టిన జగత్తునందు, ఏకములగు స్థలకృతములు గాని కాలకృతములు గాని యగు దృశ్యములు నశ్వర ములుగ నున్నవో యవి మిథ్య యగుటచే, సర్వదృశ్యములయొక్క నామరూపాత్మకమగు మునుఁగు క్రింద నెప్పుడు నుండునదియు, అవి నాశియు, అవికార్యము నగు ద్రవ్య మనునదియే నిత్యమును, నత్యము నని దాని యథార్థమగు నర్థము. వర్తకునకు కడియము, కుండలము, హారము మొదలగు నాభరణములు మిథ్యయనియు, వాని యందున్న బంగారము మాత్రమే నత్య మనియు తోఁచును. కాని సృష్టికిఁ గర్తయను స్వర్ణకారుఁడు, తన కార్యాలయములో నొక ద్రవ్యమునకే వేర్వేఱు నామరూపములను గల్పించి, దానితోనే,

సువర్ణము, ఱాయి, కలప, జలము, గాలి మొదలగు నిఖిలాలంకార ములను జేయుచున్నాఁడు. కావున వేదాన్తి, వర్తకునికంటె నింకను లోతుగ వెళ్లి బంగారము, వెండి, ఱాయి మొదలగు నామరూపముల నలంకారములవలెనే మిథ్య యని తలంచుటచే నీ సర్వపదార్థముల మూల మందున్న ద్రవ్యమే, 'అనఁగా: 'వస్తుతత్త్వ' మను నదియే సత్యమని (అవికారియైన సత్యమని) సిద్ధాన్తమును జేయుచున్నాఁడు. ఈ వస్తుతత్త్వమునకు నామరూపాదికమగు నే గుణమును లేకుండుటచే నది యింద్రియగోచర మగుట కెప్పుడును శక్యము కానేరదు; కాని నేత్రములకుఁ గాన్పింపకపోయినను, ముక్కుచే వాసనఁ జూచి కనుఁ గొనుటకు వీలుకాకపోయినను, చేతులచే స్పృశింపఁబడక పోయినను, అవ్యక్తరూపముచే నది యుండియే తీరవలయునని నిశ్చితమైన యను మానమును జేయుటయే కాక, యెప్పుడును మాఱునది యనియు, జగత్తులోనుండు వస్తువుల కన్నిటికి నిదియే సత్యమగు వస్తుతత్త్వముగ నున్నదనియు, నిశ్చయము చేయవలసివచ్చును. దీనినే జగత్తున మూలభూతమగు సత్య మందురు; కాని సత్యమిథ్యాశబ్దములకు వేదాన్తశాస్త్రము నందున్న యీ పారిభాషికార్థము నెఱుంగ లేక— లేక, సత్యశబ్దమునకు మన కిష్టమగు నర్థముండునా యుండదా యని విచారింపక— "మన నేత్రములకు ప్రత్యక్షముగఁ గాన్పించుచుండు జగత్తు సైతము వేదాన్తి మిథ్యయని చెప్పుచున్నాఁడు. ఏమిచేయుదును?" అని కొన్నిప్రతిబంధములను జూపి పరకీయులును స్వకీయులు నగు కొందఱు పండితమ్మన్యు లద్వైతవేదాంతము నాక్షేపించుచున్నారు; కాని యాస్కుఁడు సెప్పినటుల నంధునకు స్తంభము గాన్పింపక పోవుట స్తంభముయొక్క దోషము కానేరదు. నిత్యము మాఱునవి యగు (అనఁగా: నశ్వరమగు) నామరూపములు నిత్యములు కావు. గాన నెవరికి నిత్యముగ, అనఁగా: నిత్యముగ నుండెడి తత్త్వమును జూడవలయు ననియున్నదో వారి నామరూపములకంటె పరమును విచారింపవలెనని, ఛాందోగ్య (6.1; 7.1), బృహదారణ్యక (1.6.3),

ముండక (3.2.8), ప్రశ్న (6.5) మొదలగు నుపనిషత్తులయం దనేక పర్యాయములు చెప్పఁబడియున్నది. ఈ నామరూపములె కఠ (2.5), ముండ (1. 2. 9) కాద్యుపనిషత్తులలో 'అవిద్య' యనియు, తుదకు శ్వేతాశ్వతరోపనిషత్తులలో 'మాయ' (శ్వే. 4.10) అనియు చెప్పఁ బడినవి; భగవద్గీతలయందును, 'మాయా', 'మోహ', 'అజ్ఞాన' శబ్దముల కా యర్థమే వివక్షితముగ నున్నది.

జగత్తుయొక్క యారంభమునం దుండు నీ పదార్థ మంతయు నామరూపము లేని దనియు (అనఁగా: నిర్గుణము నవ్యక్తమునని యు), పిదప దానికే నామరూపములు గలిగినవి కావున నదియే వ్యక్తము గను సగుణముగ నున్న దనియు బృహదారణ్యక ఛాందోగ్యములలోఁ జెప్పఁబడినది (బృ. 1.4.7; ఛాం. 6.1.2-3). కావున వికారి, లేక, నశ్వరము లగు నామరూపములకే 'మాయ' యని పేరుండుటచే, సగుణము, లేక, దృశ్యసృష్టి యనునది యొక మూలద్రవ్యముయొక్క (అనఁగా: ఈశ్వరునియొక్క) మాయకు సంబంధించిన క్రీడ, లేక, లీలగ నున్నదని చెప్పుదురు. ఇట్టి దృష్టిచేఁ జూచితి మేని సాంఖ్యుల ప్రకృతి యవ్యక్త మైనదైనను సత్త్వరజస్తమో గుణములు గలిగినది కావుననే నామరూపములు గల మాయయే యగును. అందుచే నీ ప్రకృతియందుండి పుట్టునదియు నెనిమిదవ ప్రకరణములోఁ జెప్పఁ బడినదియు వ్యక్తమునగు విశ్వముయొక్క సృష్టి, లేక, దుకాణము నను నవియు నా మాయయొక్క సగుణరూపాత్మకము లగు వికారము లగుచున్నవి. కారణ మేమి యన: ఎట్టి గుణ మయినను ఇంద్రియము లకు గోచరము కాక యుండదు. కావున నామరూపాత్మకముగనే యుండవలయును. అన్ని యాధిభౌతిక శాస్త్రములందు నిటులే మాయావిషయక మగు యుక్తి కలదు.

ఇతిహాసము, భూగోళశాస్త్రము, విద్యుచ్ఛాస్త్రము, రసాయన శాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము మొదలగు నే శాస్త్రమును విచారించి

నను వానియందలి విచారణ లన్నియు నామరూపముల విచారణయే (అనఁగా: ఏ పదార్థమున కైన నొక నామరూపములు పోయి మఱి వేఱగు నామరూపము లెటుల కలిగినను దాని గుఱించియే) యై యున్నది. ఉదాహరణము:- దేనికి జల మని పేరున్నదో దానికి బాష్ప మని పే రెప్పు డెట్లు వచ్చును? లేక, యొక రాక్షసిబొగ్గు రంగు గల నల్లని కణికనుండి, యెఱుపు, పసుపు, నఱుపు మొదలగు ననేక విధ ములగు రంగు (రూపు) లెట్లు కలుగును? ఈ మొదలగు నామరూప ముల భేదముయొక్క విచారమే యీ శాస్త్రములోఁ జేయఁబడినది. కావున, నామరూపములయందే పాతుకొనిపోయిన యీ శాస్త్రముల యొక్క యభ్యాసముచే నామరూపపరముగ నుండు సత్యవస్తువుయొక్క బోధ కానేరదు. సత్య మగు బ్రహ్మస్వరూపమును శోధింపవలయు ననువారు తమ దృష్టి నీ యాధిభౌతికము లగు (అనఁగా: నామరూపా త్మక మగు) నన్ని శాస్త్రములకు పరముగఁ బ్రసరింపఁజేయ వలయునని స్పష్ట మగుచున్నది. మఱియు నీ విషయమే ఛాందోగ్యోపనిషత్తునందలి యేడవ యధ్యాయముయొక్క ప్రారంభమునందున్న కథలో స్పష్ట పఱుపఁబడినది. కథారంభమున, నారదఋషి సనత్కుమారుని యొద్దకు స్కందునియొద్దకుఁ బోయి 'నాకు నాత్మజ్ఞానము చెప్పు' మని యడిగెను; అప్పుడు సనత్కుమారుఁడు, 'నీ వేమి చదివికొంటివో దానిని చెప్పిన పిదప నేను చెప్పుచున్నా' ననెను. అందులకు నారద ఋషి "నేను ఋగ్వేదము మొదలుగాఁ గల నాల్గు వేదములు, ఇతి హాసపురాణ రూపమగు నైదవవేదము, వ్యాకరణము, గణితము, తర్కశాస్త్రము, కాలశాస్త్రము, నీతిశాస్త్రము, వేదాంగములు, ధర్మ శాస్త్రము, భూతవిద్య, క్షత్రవిద్య, నక్షత్రవిద్య, సర్పదేవజనవిద్య, మొదలగు నన్నింటిని జదివితిని; కాని దానిచే నాత్మజ్ఞానము కలుగ మిచే నే నిప్పుడు తమయొద్దకు వచ్చితిని" అని చెప్పఁగా సనత్కుమా రుడు నారదఋషితో "నీ వభ్యసించిన విద్యయంతయు నామరూపా

త్మక మగుటచే సత్యమగు పరబ్రహ్మ మీ నామబ్రహ్మము కంటె మిక్కిలి దూరముగ నున్నది" అని చెప్పెను. పిదప ఏకమ్రక్రమముగ నది ఈ నామరూపములకంటె (అనఁగా: సాంఖ్యుల యవ్యక్తప్రకృతి కంటె) లేక, వాక్కు, ఆశ, సంకల్పము, మనస్సు, బుద్ధి (జ్ఞానము) ప్రాణము నను వానికంటెను పరముగ నున్నదని, క్రమక్రమముగ మెట్లెక్కించినటుల పరమాత్మస్వరూపమగు నమృతతత్త్వమును నారదున కుపదేశించెను.

మనుజులయొక్క యింద్రియములకు, నామరూపవ్యతిరిక్తమయిన దానియొక్క ప్రత్యక్షజ్ఞానము లేకపోయినను, ఈ యనిత్యమగు నామరూపము లను ముసుఁగులో, నేత్రములకు గోచరింపని (అనఁగా: అవ్యక్తమగు) దే దైనను నిత్యద్రవ్య ముండితీరవలయును. మఱియు తన్మూలముననే సర్వసృష్టియొక్క యేకత్వజ్ఞానమును కలుగునని పూర్వమునందలి వివేచనకుఁ దాత్పర్యము. జ్ఞానమంతయు నాత్మకే కలుగును గావున నాత్మ యను నతఁడు 'జ్ఞాత' (అనఁగా: తెలిసికొనువాఁడు). ఈ జ్ఞాతకుఁ గలుగు జ్ఞానమంతయు నామరూపాత్మకమైన సృష్టిసంబంధమే కావున, నామరూపాత్మక బాహ్యసృష్టియే జ్ఞానమై యున్నది (మ.భా.శాం. 306.40). మఱియు నీ నామరూపాత్మక సృష్టికి నారంభము నందున్న వస్తుతత్త్వమే జ్ఞేయమై యున్నది. ఈ వర్గీకరణమునే స్వీకరించి భగవద్గీతలయందు "జ్ఞాత యనఁగా క్షేత్రజ్ఞుఁడగు నాత్మ; జ్ఞేయ మనఁగా నింద్రియాతీతము నిత్యమునగు బ్రహ్మము" (గీ. 13. 12–17) అనియు, పిదప జ్ఞానమును త్రివిధముగ విభజించి భిన్నత్వము, లేక, నానాత్వముచేఁ గలిగెడి సృష్టిజ్ఞానము రాజసమనియు, తుదకి నానాత్వముయొక్క యేకత్వముచేఁ గలుగు జ్ఞానము సాత్త్వికమనియు చెప్పఁబడినది (గీ. 18 20 21). దీనిపై జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము నని త్రివిధముగ భేదములు కల్పించుట న్యాయ్యము కానేరదు. మనకుఁ గలుగు జ్ఞానముకంటె నీ జగ

త్తున వేఱొక తేమి యున్నదో చెప్పుటకు మన యొద్ద పూర్ణమగు సామగ్రి లేదు. అవు, గుఱ్ఱము మొదలగు మనకుఁ గాన్పించు బాహ్య వస్తువు లన్నియు మనకుఁ గలిగిన జ్ఞానస్వరూపములే. మఱియు నీ జ్ఞానము సత్య మయినను నది దేనివలన నుత్పన్న మయినదో చెప్పుటకు జ్ఞానాతిరిక్తమగు మఱియొక మార్గమే లేకపోవుటచే నీ జ్ఞానము కన్న బాహ్యపదార్థ మనఁబడు స్వతంత్రవస్తు వేమైన నున్నదా? ఈ బాహ్యవస్తువుయొక్క ప్రారంభమున నేదైన మఱియొక తత్త్వమున్న దని చెప్పుటకు సాధ్యము కానేరదు. జ్ఞాత లేకపోయె నేని జగ ముండనే యుండదు.

ఈ విధముగ విచారించితి మేని, జ్ఞాతృజ్ఞేయజ్ఞానములలో జ్ఞాన మను మూఁడవ వర్గ ముండదు. కాన జ్ఞాతయు నతనికిఁ గలుగు జ్ఞానము నను రెండే మిగులును. మఱియు నీ యుక్తివాదమునే కొంచెము పైకి పోనిచ్చితి మేని జ్ఞాతయు ద్రష్టయు ననువాఁడు నొకవిధమగు జ్ఞానమే యగుటచేఁ గడపటి జ్ఞానము తప్ప మఱియొక వస్తువే యుండకపోవును. దీనినే 'విజ్ఞానవాద' మందురు. మఱియు దానిని యోగాచారమార్గమం దున్న బౌద్ధులు ప్రమాణముగ గ్రహించుటచే, "జ్ఞాతయొక్క జ్ఞానముతప్ప స్వతంత్రమగు మఱియొక వస్తువు జగమున కానరాదు. వే యేల? జగము లేదు. ఉన్నదంతయు మనుష్య జ్ఞానముగ నున్న"దని బౌద్ధవిద్వాంసులు చెప్పిరి. అంగ్లగ్రంథకారులలోను 'హ్యూము'వంటి పండితులీ విధమగు మతమునకుఁ బ్రాధాన్యము నిచ్చుచున్నారు; కాని వేదాన్తులీ మతము నొప్పుకొనరు. కావున వేదాన్తసూత్రములలో వ్యాసులవారును (వే.సూ.2 2 28-32) ఈ సూత్రముల భాష్యములో శ్రీ మచ్ఛంకరాచార్యులవారును ఈ మతమును ఖండించినారు. మనుష్యునియొక్క మనస్సునందుఁ గలిగిన సంస్కారములే తుద కతనికిఁ దెలియు నను విషయ మేమియు నసత్యము కాదు. దీనినే మనము జ్ఞాన మని చెప్పుచున్నాము; కాని

యీ జ్ఞానముకంటె వేఱుగ వస్తువు వేమియు లే దని యందు మేని గో వనుజ్ఞానము వేఱు, అశ్వ మను జ్ఞానము వేఱు, నే నను జ్ఞానము వేఱు, అను జ్ఞానములయందే మనబుద్ధికిఁ దోఁచుచున్న పృథక్త్వము నకుఁ గారణమేమి? జ్ఞానము పుట్టుట యను మానసికక్రియ యంతట నొకటిగనే యున్నది. ఇంతియకాక మఱియొక కేమియు లేనియెడల ఆవు, గుఱ్ఱము నను భేద మెచ్చోనుండి కలుగును? స్వప్నమునందలి సృష్టివలె మనస్సు స్వయముగనే తన యిచ్ఛానుసారముగ జ్ఞాన భేదము గలుగఁ జేయునని యెవరైనఁ జెప్పినను, స్వప్నసృష్టికంటె భిన్నమగు జాగ్రదవస్థ యందలి జ్ఞానమునందుఁ గాన్పించు నొక విధ మగు సుసంగతత్వమునకు కారణముఁ జెప్పుటకు సాధ్యము కానేరదు (వే.సూ.శా.భా. 2.2 28; 3.2.4). ఇంతియకాక "జ్ఞానాతిరిక్తమగు వస్తువే లేదు కావున 'ద్రష్టయొక్క మనస్సే యా యా పదార్థముల నన్నింటిని నిర్మించుచున్నది' చెప్పినను, ప్రతి ద్రష్టకును 'నా మనస్సు' అని యెన్నుకొను నప్పుడు 'నే నే స్తంభముగ నున్నాను' లేక, 'నే నే గోవుగ నున్నా' నని, సర్వజ్ఞానములు నస్మచ్ఛబ్దపూర్వక ములుగనే యుండవలసివచ్చును; కాని యటులు గాక 'నేను వేఱుగ నుచే నాకంటె స్తంభమును, గోవు మొదలగు పదార్థములును వేర్వేఱు గనున్న' నని యందఱకును ప్రతీతి యుండుటచే ద్రష్టయొక్క మన స్సునఁ గలుగు సర్వజ్ఞానములకు నాధారభూత మగు బాహ్యసృష్టియం దితరమును బాహ్యత్వము నగు నేదైన నొక స్వతంత్రవస్తు వుండవల యును" అని శ్రీశంకరాచార్యులవారు సిద్ధాంతీకరించినారు (వే.సూ శాం.భా. 2.2 28). కాంటుయొక్క మతమును నిదియె కావున, సృష్టి జ్ఞానము కలుగుటకు మనుజుని బుద్ధియొక్క యేకీకరణ మావశ్యక మైనను, ఈ బుద్ధి సర్వవిధజ్ఞానములలోనిది (అనఁగాఁ నిరాధారముగఁ గాని, లేక, నూతనముగఁ గాని పుట్టునది) కాదు. ఆ సృష్టియం దున్న బాహ్యవస్తువుల యపేక్ష యెప్పుడును కలిగియే యుండవల యునని యతనిచే స్పష్టముగఁ జెప్పఁబడినది. "ఇదేమి? శ్రీశంకరా

చార్యులవా రొకప్పుడు బాహ్యసృష్టి మిథ్య యని నుడివి, బౌద్ధుల మతమును ఖండించుచు, తమకు బాహ్యసృష్టియొక్క యస్తిత్వము ప్రత్యక్షయొక్క యస్తిత్వానుసారముగనే సత్యముగ నుండునని చెప్పుదు రేని యీ రెండు పక్షముల కైకమత్య మెట్లు?" అని యిచ్చో నెవర యిన నడుగుదురు; కాని యీ ప్రశ్నకుఁ బూర్వముననే యుత్తరము చెప్పఁబడినది. ఆచార్యులవారు బాహ్యసృష్టి మిథ్యయని కాని యసత్య మని కాని చెప్పినపుడు బాహ్యసృష్టియొక్క దృశ్యము లగు నామ రూపము లనిత్యములే (అనఁగా: నశ్వరములే) యని దాని యర్థమని తెలిసికొనవలయును. కాని నామరూపాత్మకమును బాహ్యము నగు దృశ్యము మిథ్య యయినను దానియొక్క మూలమునం దీంద్రియాతీతము సత్యము నగు నొక వస్తు వున్న దను సిద్ధాన్తము నకు దానిచే నేమియు బాధ రానేరదు. కావున క్షేత్రక్షేత్రజ్ఞవిచారము నందు నశ్వరము లగు దేహేంద్రియాది నామరూపముల కాధారమగు నేదో యొక నిత్యమగు నాత్మతత్త్వ మున్న దని సిద్ధాన్తపఱచినటుల నామరూపాత్మక బాహ్యసృష్టియొక్క యారంభమునందును ఏదో యొక నిత్యమగు తత్త్వ మున్న దని చెప్పవలసివచ్చుననియు, కావు ననే దేహేంద్రియములును బాహ్యసృష్టియు ననుఁ నీ రెండును ప్రతి దినమును మాఱునవి (అనఁగా: మిథ్యాభూతములగు) దృశ్యములు కావున వానికి మూలమున నున్నదియు, నిత్యమైనదియు (అనఁగా: సత్యమగునదియు) నగు నొక పదార్థ మీ రెంటిచే నాచ్ఛాదింపఁబడిన దనియు వేదాన్తశాస్త్రముచే సిద్ధాన్తీకరింపఁ బడినదని సారాంశము. "ఈ రెంటిచే నాచ్ఛాదింపఁబడిన నిత్యమగు తత్త్వము వేర్వేఱుగ నున్నదా? లేక, యేక రూపముగ నున్నదా?" యని ప్రశ్న వెంటనే వెడలును; కాని దీనిని విచారించుటకంటె మున్నీ మతముపై, దాని యొక్క యర్వాచీనత్వవిషయమై రాఁగల యాక్షేపములను గొందెము విచారించెదము.

బౌద్ధులయొక్క విజ్ఞానవాదమును వేదాన్తశాస్త్ర మొప్పుకొనక పోయినను గంటికిఁ గానఁబడు బాహ్యసృష్టియొక్క నామరూపాత్మక మగు స్వరూపము మిథ్య యనియు, దాని కాధారముగనున్న యవ్య యము నిత్యము నగు ద్రవ్యము మాత్రమే సత్యముగ నున్నదనియు నుడువు మాయావాద మనఁబడు శ్రీశంకరాచార్యుల మతము ప్రాచీ నము లగు నుపనిషత్తులలో లేకపోవుటచే వేదాన్తశాస్త్రముయొక్క మూలభాగ మని చెప్పుటకు సాధ్యము కా దని కొంద ఱందురు; కాని యుపనిషత్తులను బాగుగ గమనించి యధ్యయనముఁ జేసితి మేని యీ యాక్షేపములే నిరాధారము లని తోఁపక మానదు. 'సత్య'శబ్దము వ్యవహారములోఁ బ్రత్యక్షముగఁ గంటికిఁ గాన్పించు వస్తువుల విష యమై ప్రయోగింపఁబడు నని పూర్వముననే వచించియున్నాము. కావున సత్యశబ్దమున కీ వ్యావహారికార్థమునే కైకొని యుపనిషత్తుల యం దచ్చటచ్చట నేత్రములకుఁ గాన్పించు నామరూపాత్మక బాహ్య పదార్థము సత్యమనియు, ఆ నామరూపములచే నాచ్ఛాదిత మగు ద్రవ్యమునకు నమృత మనియుఁ బేరు లిడఁబడినవి. ఉదాహరణము- బృహదారణ్యకోపనిషత్తులో (1.6.3) "త దేత దమృతం సత్యేన చ్ఛన్నం"- ఆ యమృతము సత్యముచేఁ గప్పఁబడినది యని చెప్పి యమృతశబ్దములకు వెంటనే "ప్రాణో వా అమృతం నామరూపే సత్యం తాభ్యామయం ప్రాణశ్ఛన్నః"- ప్రాణ మనునది యమృతము. నామరూపము లనునది సత్యము. ఈ నామరూపము లను సత్యముచేఁ బ్రాణ మాచ్ఛాదింపఁబడినది, అని వ్యాఖ్యానము చేయఁబడినది. 'ప్రాణ' మనఁగా: ప్రాణరూప పరబ్రహ్మము అని యిచ్చట నర్థము; మొదట నుపనిషత్తులలో దేనిని 'మిథ్య' యనియు 'సత్య' మనియుఁ జెప్పుచున్నారో, దానికే పూర్వమునం దనుక్రమముగ 'సత్యము', 'అమృతము' నను పేరు లుండెనని దీనివలనఁ గాన్పించుచున్నది. అనేక స్థలముల యం దీ యమృతపదార్థమువలన "సత్యస్య సత్యం"

– కంటికిఁ గాన్పించు నత్యమునకు లోపల నుండునది చరమ నత్య మగును (బృ. ఒ. శ. 6) అని చెప్పఁబడినది. కాని యుపనిషత్తులలోఁ గొన్నిప్రదేశములలో నేత్రములకు గోచరించు సృష్టియే నత్య మనఁ బడినది. ఇంతమాత్రముచేఁ బైఁ జెప్పఁబడిన యాక్షేపము సిద్ధము కానేరదు. కారణ మేమి యనఁగా: బృహదారణ్యకములోనే యాత్మ రూపకమగు పరబ్రహ్మముదక్కఁ నితర మగు నర్వమును 'ఆర్తం' అనఁగా: నశ్వరముగ నున్నదని తుదకు సిద్ధాన్తీకరింపఁబడెను (బృ. 3.7.23). జగత్తుయొక్క మూలతత్త్వమును మొట్టమొదట శోధించు టకుఁ బ్రారంభించినపుడు నేత్రములకుఁ గాన్పించు జగత్తే నత్యమని తొలుత నంగీకరించి దానిలో నున్న మఱియొక సూక్ష్మమగు నత్య మేది యని శోధకులు విచారించుటకు నారంభించిరి. ఏ దృశ్యసృష్టి యొక్క రూపమును మనము నత్యమని యంగీకరించుచున్నామో యది వినాశియగుటచే దానిలో నేదో మఱియొకటి యవినాశి, లేక, యమృతమైన తత్త్వ మున్నదని పిదప స్పష్టముగఁ గాన్పించెను. రెంటి మధ్యనుండు భేదము విశేషము స్పష్టపఱుపఁ బడవలసివచ్చినప్పు డెల్ల 'నత్యామృత' శబ్దముల రెంటికిని మాఱుగ 'అవిద్యావిద్య' లనియు, తుదకు 'మాయానత్యము' లనియు', లేక, 'మిథ్యా నత్యము' లనియు నీ పరిభాష ప్రచారములోనికి వచ్చినది. కారణ మేమి యనఁగా: 'నత్య' శబ్దమునకు 'నిత్యముగ నుండునది' యని ధాత్వర్థము కావున నెప్పుడును మాఱునవి (నశ్వరములు) అగు నామ రూపము లను నత్య మని చెప్పుట యుత్తరోత్తరముగ విశేషము తప్పని తోఁచుటకు నారంభించెను; కాని యీ రీతిఁగ 'మాయా-మిథ్యా' శబ్దములు పిదపఁ బ్రచారములోనికి వచ్చినను జగత్తునందున్న వస్తువులలో మన కంటికిఁ గాన్పించు దృశ్యము, నశ్వరము నసత్యము ననియు, దానికి మూలమగు 'తాత్త్వికద్రవ్యము' మాత్రము నత్తు, లేక, నత్యము ననియు విచారము చాలకాలము క్రిందట నుండి

వచ్చుచునే యున్నది; మఱియు ఋగ్వేదములో "ఏకం సద్విప్రా బహుధా వదన్తి" – మొట్టమొదట నొకటియు, సత్యము (సత్) అగుదానినే విప్రులు (జ్ఞానులు) పలుపేరులతోఁ బిలుతురు (1. 164. 46; మఱియు, 10.114.5). అనఁగా: ఒక సత్యవస్తువే నామరూపము లచే వేర్వేఱుగఁ గాన్పించు నని చెప్పఁబడినది. 'ఒకరూపమునే యనేక రూపములుచేసి చూపించుట' యను నర్థమున ఋగ్వేదమందును 'మాయా' శబ్దము ప్రయోగింపఁబడి యున్నది. "ఇన్ద్రో మాయాభిఃపురురూప ఈయతే" – ఇంద్రుఁడు తన మాయచే ననేక రూపముల నొందుచున్నాఁడు (ఋ. 6. 47. 18) అని చెప్పఁబడినది 'మాయా' శబ్దము తైత్తిరీయసంహితలో నొక స్థలమునందు (తై.సం. 3.1.11) ఈ యర్థముననే ప్రయోగింపఁబడి యున్నది. తుదకు శ్వేతాశ్వతరో పనిషత్తులో సైతము 'మాయా'శబ్దము నామరూపార్థమునునే యున్నది. కాని నామరూపములను బోధించు నభ్యాసము మొదటు శ్వేతాశ్వతరో పనిషత్కాలమునునే రూఢమైనను, నామరూపము లనిత్యములు, లేక, యసత్యములను కల్పన తత్పూర్వమునం దుండియే యున్నది. 'మాయా' శబ్దమునకు విపరీతార్థము చేసి శ్రీశంకరాచార్యులచే నూత నముగఁ గల్పింపఁబడలేదు. ఇంతవఱకును నిర్వివాదముగ నున్నది. నామరూపాత్మకమగు సృష్టిస్వరూపము మిథ్య యని శ్రీశంకరాచార్యుల వలె స్పష్టముగఁ జెప్పుటకు ధైర్యము లేనివారు కాని, లేక, గీతలలో భగవానుఁడు సెప్పినటుల నా యర్థమునందు 'మాయా' శబ్దము నుపయోగించుకొనుటకు భయపడువారు కాని కావలసి యున్నెడల బృహదారణ్యకోపనిషత్తునందున్న 'సత్యామృతము' లను శబ్దము లను సంతోషముగ నుపయోగింపవచ్చును. ఏమి చెప్పినను నామ రూపములు నశ్వరములు. వానిచే నాచ్ఛాదింపఁబడుతత్త్వ మమృతము లేక, అవినాశి యను భేదము ప్రాచీన వైదికకాలమునుండియు వాడు కలోనే యున్నదను సిద్ధాన్తమున కేమియు బాధ రానేరదు.

అటులుండ నిమ్ము. మన యాత్మకు నామరూపాత్మక బాహ్య సృష్టియం దున్న ప్రతిపదార్థముయొక్కయు జ్ఞానము కలుగుటకు నాధారభూతమై, దానిని పరీక్షించుట బాహ్యసృష్టియందున్న నానా పదార్థములకు నారంభమునందే 'ఒకానొక' మూలభూతమగు నిత్య ద్రవ్యముండవలయును. లేనిది యీజ్ఞానము పుట్టుటకు వీలులేదను నది మాత్రము నిశ్చయ మగుటచే నధ్యాత్మశాస్త్రముయొక్క పని సమాప్తము కానేరదు. బాహ్యసృష్టియొక్క యారంభమునుండి ఈ నిత్యద్రవ్యమునే వేదాన్తులు 'బ్రహ్మము' అని చెప్పుచున్నారు; శక్య మగునేని యీ బ్రహ్మస్వరూప మేమి యని నిశ్చయించుటయు నావశ్యకమయి యున్నది. నామరూపాత్మక సర్వప్రపంచారంభము నందు నుండునది నిత్యము నవ్యక్తమగు తత్త్వము గావున దాని యొక్క స్వరూపము నామరూపాత్మకమగు పదార్థమువలె వ్యక్తమును స్థూలము (జడము) నగుటకు వీలులే దను సంగతి స్పష్టముగనే యున్నది; కాని వ్యక్తమును వదలినను స్థూలములు గానట్టి మనస్సు, స్మృతి, వాసన, ప్రాణము, జ్ఞానము మొదలగు ననేకములగు నవ్యక్తపదార్థము లున్నవి. పరబ్రహ్మ మా పదార్థములలో నే దీని యొక స్వరూపముతో నుండుట యశక్యము కాదు. వీనిలో ప్రాణము యొక్కయు, పరబ్రహ్మముయొక్కయు స్వరూప మొక్కటిగనే యున్నదని యనేకులు చెప్పుచున్నారు. జర్మన్‌పండితుఁడు 'షోపెన్ హోయెర్' అనువాఁడు పరబ్రహ్మము వాసనాత్మక మని నిశ్చయించి నాఁడు. వాసన యనునది మనోధర్మ మగుటచే నీ మతానుసారముగ బ్రహ్మము మనోమయుఁడుగ నున్నాఁడని చెప్పవచ్చును (తై. 3.4); కాని యింతవఱకుఁ జేసిన వివేచన యందుండి "ప్రజ్ఞానం బ్రహ్మ" (ఐ. 3.3), లేక, "విజ్ఞానం బ్రహ్మ" (తై. 3.5)— అనఁగా: ఏకత్వ ముచే మనకుఁ గలిగిన జడసృష్టియందున్న నానాత్వముయొక్క జ్ఞానమే బ్రహ్మముయొక్క స్వరూపముగ నుండవలయునని చెప్ప వచ్చును. 'హెకెల్' యొక్క సిద్ధాన్తము సైత మిట్టిదే. కాని యుపని

షత్తులలో చిద్రూపజ్ఞానమువలెనే సత్తునకును (అనఁగా: జగత్తునందలి సర్వవస్తువుల యస్తిత్వముయొక్క సామాన్యధర్మమునకును, లేక, సత్తాసామాన్యమునకును) నానందమునకును బ్రహ్మస్వరూపమునందే యంతర్భావ మగుటచే బ్రహ్మము సచ్చిదానందరూపముగ నున్నదని చెప్పఁబడినది. దీనికి విరుద్ధమగు మఱియొక బ్రహ్మస్వరూపము, ఓంకారము. సకలవేదములు, మొదట ఓంకారము నుండియే వెలువడినవి. అది బయలువెడలిన పిదప నా వేదము నందున్న నిత్యములగు శబ్దములయందుండియే పిదప బ్రహ్మదేవునిచే సర్వసృష్టియు నిర్మింపఁబడినది (గీ. 17.23; మ.భా.శాం. 231.56-58). ఈ హేతువుచే నోంకారముదక్క మూలారంభమునందు మఱియొక కుదియు లేదని సిద్ధ మగుచున్నది. దీనివలన నోంకార మనునదియే సత్యమయిన బ్రహ్మస్వరూపముగ నున్నదని మాండూక్యతైత్తిరీయా పనిషత్తులలో నున్నది (మాండూక్య. 1; తైత్తి. 1.8); కాని శుద్ధమగు నధ్యాత్మ దృష్టితో విచారించితి మేని పరబ్రహ్మముయొక్క యీ సర్వస్వరూపములును కొంచె మించుమించుగ నామరూపాత్మకములుగనే యున్నవని తోఁచును. కారణ మేమి యన: ఈ సర్వస్వరూపములు మనుజులకు నింద్రియగోచరము లగుటచే మనుష్యులీ రీతిగఁ దెలిసికొను విషయమంతయు నామరూపములలోనే చేరుచున్నది. కాని యీ నామరూపములకు మూలమగు నన్నాదియు, లోపలను వెలుపలను నంతట నొకే రీతిగ నిండియున్నదియు, నేకవిధము, నిత్యము, నమృతమునగు తత్త్వము యొక్క (గీ. 13. 12-17) వాస్తవిక స్వరూపమెట్లు నిర్ణయింపఁబడును? ఎప్పుడయిన నీ తత్త్వము మన యింద్రియములకు గోచరముగనుండునదియే యని యనేకులగు నధ్యాత్మశాస్త్రజ్ఞులు చెప్పిరి. 'కాం' టనువాఁ డీ ప్రశ్నను మొదట విచారింపనే లేదు. అటులే యుపనిషత్తులయందును "నేతి నేతి" అనఁగా: "దేని విషయమై యేమియుఁ జెప్పుటకు సాధ్యము కానేరదో" యట్టి

బ్రహ్మము దీనికిఁ బరముగ నున్నది. అది నేత్రములకు గోచరము కానిది. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" – వాక్కు నకును మనస్సునకు నగోచరముగ నున్నది అని పరబ్రహ్మయొక్క, యజ్ఞేయ (తెలియని) స్వరూపము వర్ణింపఁబడినది. అయిన నీ యగమ్యస్థితియందును బ్రహ్మస్వరూపముయొక్క యేకప్రకారము మనుజులకు బుద్ధిచే నిర్ణయించుటకు సాధ్య మగునని యధ్యాత్మ శాస్త్రముచే నిశ్చయింపఁబడినది. వానన, స్మృతి, ధృతి, ఆశ, ప్రాణము, జ్ఞానము మొదలైన పూర్వోక్తావ్యక్తము లగుపదార్థములలో నతిశయముగ వ్యాపక మయినది, లేక, శ్రేష్ఠ మైనది లేదని విచారించి పినియన్నింటిలోను శ్రేష్ఠముగ స్థిరపడినదియే బ్రహ్మస్వరూప మని యంగీకరింపవలయును. కారణ మేమియన: సకలావ్యక్తపదార్థములయందును పరబ్రహ్మము శ్రేష్ఠ మనునది నిర్వివాదమే. ఆశ, స్మృతి, వానన, ధృతి మొదలగు వాని నీ దృష్టితో విచారించితిమేని యివన్నియు మనోధర్మము లగుటచే పినికంటె మనస్సు శ్రేష్ఠము. మనస్సుకంటె జ్ఞానము శ్రేష్ఠము. జ్ఞానముకంటె బుద్ధి శ్రేష్ఠము. తుదకు బుద్ధియు దేనియధీనమై యున్నదో యట్టియాత్మ యన్నింటి కంటె శ్రేష్ఠము (గీ. 3.42) అని క్షేత్రక్షేత్రజ్ఞవిచారప్రకరణములోఁ జెప్పఁబడినది. వానన, మనస్సు మొదలుగాగల సర్వమగు నవ్యక్త పదార్థములలో నాత్మ శ్రేష్ఠ (భూమన్) మగునేని పరబ్రహ్మముయొక్క స్వరూపము నదియే కావలయునని యీ సముదాయమువల్ల తేలును. ఛాందోగ్యోపనిషత్తునందలి యేడవ యధ్యాయమునం దీ యుక్తి వాదమే స్వీకరింపఁబడియున్నది. వాక్కుకంటె మన స్సధికయోగ్యత గలది (భూయస్), మనస్సుకంటె జ్ఞానము, జ్ఞానముకంటె బలము నని యీ రీతిగఁ బైకిఁబోయి పోయి యన్నింటిలో నాత్మ శ్రేష్ఠము (భూమన్) అగుటచే నాత్మయే పరబ్రహ్మముయొక్క సత్యమగు స్వరూప మగునని సనత్కుమారుఁడు నారదులకు వక్కాణించెను. ఆంగ్లేయ గ్రంథకారులలో 'గ్రీ' ననువానిచే నీ సిద్ధాన్తమే స్వీకరింపఁ

బడినది; కాని యతనియు క్తివాదము కొంతవఱకు నుండుటచే దాని నిచ్చో వేదాన్తపరిభాషతో సంక్షేపముగఁ జెప్పుచున్నాను.

"ఇంద్రియముల ద్వారా మన మనస్సునందుఁ గలుగు బాహ్య నామరూపములయొక్క సంస్కారముల నొక్కటిగఁ జేసి మన యాత్మ కలుగఁజేయు జ్ఞానమునకు సంబంధించిన బాహ్యసృష్టియొక్క వేర్వేఱు నామరూపముల మూలమునసైత మేకత్వమునొందు యుండు వస్తుతత్త్వ మేదైన నుండవలయును. లేనియెడల నాత్మయొక్క యేకీకరణమాత్రముచే నుత్పన్న మగు జ్ఞానము స్వకపోలకల్పితము నిరాధారము నగుటచే విజ్ఞానవాదమువలె నసత్య మగును" అని 'గ్రీన్' చెప్పుచున్నాఁడు. ఇందు దేని నైన నొక వస్తువును బ్రహ్మ మని చెప్పుచున్నాము; కాని కాంటుయొక్క పరిభాషను స్వీకరించి దానిని వస్తుతత్త్వ మని 'గ్రీను' చెప్పుచున్నాఁడు. ఇదియే భేదము. ఏమి చెప్పినను వస్తుతత్త్వమును (బ్రహ్మము) నాత్మయు నను పరస్పరసంబంధము గలిగిన రెండు పదార్థములే తుదకు మిగిలి యున్నవి. వీనిలో నాత్మ యనునది మనోబుద్ధులకంఱె బరమైనను (అనఁగా: ఇంద్రియాతీత మయినను) ఆత్మానుభవము ప్రమాణమని యంగీకరించుటచే నీ యాత్మ జడము కానేరదు. చిద్రూపి, లేక, చైతన్యరూపిగ నున్నదని మనము నిర్ణయించుచున్నాము. ఆత్మ స్వరూప మీ రీతిని నిర్ణయించిన పిదప బాహ్యసృష్టియందున్న బ్రహ్మ స్వరూప మేది యని నిర్ణయింపవలసివచ్చును. ఈ బ్రహ్మము, లేక, వస్తుతత్త్వము (1) ఆత్మయొక్క స్వరూప మయి యుండునా? లేక, (2) ఆత్మకంటె వేఱుస్వరూపముగ నుండునా? యను రెండే పక్షము లీ విషయములో సంభవించుచున్నవి. కారణ మేమి యనఁగా: బ్రహ్మము, ఆత్మ యను నీ రెండును గాక మూఁడవవస్తువే యిప్పుడు బొత్తిగ నుండనేరదు; కాని యేవైన రెండుపదార్థములు స్వరూపముం బట్టి వేఱుగ నుండెనేని వానియొక్క పరిణామములు, లేక, కార్య

ములు నభిన్నములుగనే యుండవలయు ననునది మన కనుభవములో నున్నది. కావున పదార్థములయొక్క పరిణామమునందుండియే యీ పదార్థము వేఱుగ నున్నదా? ఒకటిగ నున్నదా? యను విషయము నే శాస్త్రమం దైనను నిర్ణయించుచున్నాము. ఉదాహరణము: "రెండు చెట్లయొక్క వేళ్లు, మోటికలు, చిగుళ్లు, తాఁటు, ఆకులు, పువ్వులు, కాయలు నొకే విధముగ నుండెనేని యీ చెట్లు నొకటె విధమగు చెట్లగును. లేక, వేర్వేఱైయుండె నేని చెట్లు వేఱుగును" అని మనము నిశ్చయించుచున్నారము. ఇటులే ప్రస్తుతమందును విచారించితి మేని యాత్మయు, బ్రహ్మయు నొక స్వరూపముగనే యుండవలయు నని కాన్పించుచున్నది. కారణ మేమి యనఁగా: సృష్టి యందున్న వేర్వేఱు పదార్థములచే మనస్సునం దుత్పన్నములగు సంస్కారములకు నాత్మవ్యాపారముచే నుత్పన్నమగు నేకీకరణమును వేర్వేఱు బాహ్యపదార్థములయొక్క యారంభమందుండు వస్తుతత్త్వము (అనఁగా: బ్రహ్మ) ఈ పదార్థములయొక్క నానాత్వమును లేకుండఁ జేయునట్టి యేకీకరణము, నను నీ రెండును గలిసి యొకదానితో నొకటి సంబంధించి యుండవలయును. లేనియెడల సర్వజ్ఞానములును నిరాధారములు, ననత్యములు నగునని ముందే చెప్పఁబడినది. ఒకవిధమే యగునవియు, నన్నివిధముల నొకదానితో నొకటి సమానమగు నేకీకరణమును జేయునవియునగు తత్త్వములు రెండు ప్రత్యేక ప్రదేశములయందున్నను నవి పరస్పరము భిన్నములుగ నుండుటకు వీలులేదు. వీనిలో నాత్మకు రూప మగునదియే బ్రహ్మమునకును రూపము కావలయు నని తన యంతటనే సిద్ధించును.*

కావున నే తీరున విచారించినను బాహ్యసృష్టి యందుండు నామరూపములచే నాచ్ఛాదిత మగు బ్రహ్మతత్త్వము నామరూపాత్మక ప్రకృతివలెనే జడము కాకపోవుటయే కాక, వాసనాత్మకబ్రహ్మము,

* Green's Prolegomena to Ethics, §§ 26-36.

మనోమయబ్రహ్మము, జ్ఞానమయబ్రహ్మము, ఓంకారరూపియగు శబ్ద బ్రహ్మము అను నీ బ్రహ్మస్వరూపములు సైతము దిగువమెట్టులోనివి యగుటచే, నత్యమగు బ్రహ్మస్వరూపము వీనికంటె పరముగను, వీనికంటె యధిక యోగ్యత గలదిగను (అనఁగా: శుద్ధాత్మస్వరూపముగ) నున్నదని సిద్ధ మగుచున్నదని సారాంశము. గీతలయొక్క సిద్ధాన్తము సైత మిదియే యని యీ సంబంధములో ననేక స్థలముల యందు గీతలలోఁ జెప్పఁబడిన శ్లోకముల యందుండి స్పష్టమగును (గీ. 2. 20; 7. ౨; 8. 4; 13. 31; 15. 7-8; చూడుము). అయినను బ్రహ్మముయొక్కయు, నాత్మయొక్కయు స్వరూప మొక్కటియే యను సిద్ధాన్తమును, కేవల మిట్టి యుక్తి వాదముచేతనే మనఋషులు మొదట శోధించి చెప్పినారని తలఁపరాదు. కారణ మేమి యన: అధ్యాత్మశాస్త్రమునందు కేవల బుద్ధిసాహాయ్యముచే నేయనుమానము లైనను నిశ్చయించుటకు సాధ్యము కానేరదు, అత్మానుభవము దాని కెప్పుడును సంబంధించియే యుండవలయు ననునది యీ ప్రకరణా రంభముననే చెప్పఁబడినది. ఇంతియకాక యాధిభౌతికశాస్త్రమునం దును ననుభవమే మొదటి దయినట్లును, దాని యుపపత్తి వెంబడిదై నట్లును మన మెప్పుడును చూచుచునే యున్నాము. ఇట్లే పూర్వోక్త మగు బ్రహ్మైక్యమునకు బుద్ధి గమ్యమగు నుపపత్తి వెలువడుట కంటె వందలకొలఁది వత్సరంబుల క్రిందట మన పూర్వులగుఋషులు "నేహ నా నాస్తి కించన" (బృ. 4.19; కఠ. 4.11)– ఈ సృష్టియందు గాన్పించుచున్న యనేకత్వము సత్యము కానేరదు. దానికి మూలము నందు నలుగడల నొకటే యగునదియు నమృతము, అవ్యయము, నిత్యము నగు తత్త్వము గలదని (గీ. 18. 20) మొదట నిర్ణయించి తుదకు బాహ్యసృష్టియందలి నామరూపములచే నాచ్ఛాదితము, నవి నాశియు నగు తత్త్వమును, మన శరీరమునం దున్న బుద్ధికంటెఁ బరముగ నున్న యాత్మతత్త్వము నను నీ రెండును నొక్కటియే,

(అనఁగా: ఏకవిధములు, నమరములు, నన్వయములుగ నున్నవి) లేక, బ్రహ్మాండములో నున్న తత్త్వమే పిండమున (అనఁగా: మను ఋని దేహమున) నున్న దను నీ సిద్ధాన్తము వారి యోగ (అంతర) దృష్టిచే శోధించి చెప్పఁబడినది. ఇదియె నర్వవేదాన్తములలోని ముఖ్య మగు సారాంశమని బృహదారణ్యకోపనిషత్తునందు యాజ్ఞవల్క్యులు మైత్రేయికిని, గార్గి, వారుణి మొదలగు వారికిని జనకునకును జెప్పిరి (బృ. 3.6-8; 4.4). "అహం బ్రహ్మాస్మి"- నేనే పరబ్రహ్మముగా నున్నాను అని తెలిసికొనినవారే నర్వము తెలిసినవారుగ నున్నారని యీ యుపనిషత్తులో మొదట చెప్పఁబడినది (బృ. 1.4-10). ఛాందో గ్యోపనిషత్తుయొక్క యేడవ యధ్యాయములో శ్వేతకేతువునకు నతని తండ్రి యద్వైతవేదాన్తముయొక్క యీ తత్త్వమునే యనేక విధము లుగ బోధించినాఁడు. "ఒక మట్టిసుద్దయందున్న పదార్థమును దెలిసి కొనుటచే మృత్తికయొక్క నామరూపాత్మకమగు సర్వవికార మే రీతిగ నెఱుంగఁబడునో యటులె యొక వస్తువుయొక్క విజ్ఞానము కలిగె నేని సర్వవస్తుజ్ఞానము దానిచేఁ గలుగునో యట్టి వస్తువును నాకుఁ జెప్పుము. అది నాకు తెలియదు" అని యధ్యాయారంభమున శ్వేత కేతువు తన తండ్రి నడిగెను; అప్పుడు నదులు, సముద్రము, ఉదకము తీపి మొదలగు ననేక దృష్టాంతముల నిచ్చి "సృష్ట్యారంభమునమన్న ద్రవ్యమును (తత్), నీవును (త్వమ్), అనఁగా: నీ దేహమునందున్న యాత్మ యనునదియును ఒక్కటియే- "తత్త్వమసి"-నీవు నీయొక్క యాత్మ నెఱింగితివేని నీకు సమస్త జగత్తునకు మూలకారణము స్వయ ముగనే తెలియును; మఱియు మాటిమాటికి "తత్త్వమసి"-అదే నీ వగుదువు అని తండ్రి యతనికి వేర్వేఱగు తొమ్మిది దృష్టాంతములతో నుపదేశించెను. మఱియు మాటిమాటికిని, "తత్త్వమసి"-అదే నీవగు దువు-అను బ్రహ్మసూత్రము పునరావృత్తి చేయఁబడినది (ఛాం.6.ర-16). "తత్త్వమసి" యని తొమ్మిదిమాఱులు చెప్పుటచే నభ్యాసమను తాత్పర్యలింగము సూచింపఁబడినది. "తత్త్వమసి" అనునది యద్వైత

వేదాన్తముయొక్క మహావాక్యములలో ముఖ్యవాక్యము. "పిండ మందున్నదియే బ్రహ్మాండమం దున్న" దని "తత్త్వమసి" యని దాని యర్థము.

బ్రహ్మ మాత్మస్వరూపముగనే యున్నదని యిటుల నిర్ణయ మైనది; కాని యాత్మ చిద్రూపి యని యనుటచే, బ్రహ్మమును చిద్రూపిగనే యున్నది యని యనేకు లెన్నుదురు. కావున బ్రహ్మముయొక్కయు, నాత్మయొక్కయు సత్యస్వరూపము నిక్కడ మఱికొంచెము విస్తరించుట యావశ్యకముగ నున్నది. 'చిత్' (అనగా: జ్ఞానము) అనునది యాత్మయొక్క సాన్నిధ్యముచే జడాత్మకబుద్ధియం దుత్పన్నమైన ధర్మము; కాని బుద్ధియొక్క యీ ధర్మము నాత్మయం దారోపించుట ధర్మము కాదు. కావున తాత్త్వికదృష్టితో నాత్మయొక్క మూలస్వరూపమును నిర్గుణము నజ్ఞేయము నని చెప్పవలయును గాన బ్రహ్మ మాత్మస్వరూపిగ నున్నను, నీ రెండును గాని, వీనిలో నేది యయిన నొకటి గాని, చిద్రూపిగ నున్నదని చెప్పుట కొన్ని విధములచే గౌణముగనే యున్నదని యనేకు లెన్నుచున్నారు. కేవల చిద్రూపముపైననే యీ యాక్షేపము జేయుటలేదు. ఇక నేమనగా: "సత్ అను పదము పరబ్రహ్మమునకు విశేషణమనుట సైతమేమియు న్యాయ్యమని తోఁపదు" అని యిటుల మొత్తముమీఁద నేర్పడును. కారణమేమి యన: 'సత్', 'అసత్' అను నీ రెండు ధర్మములు పరస్పరవిరుద్ధములై (అనగా: రెండు వేర్వేఱు వస్తువుల నుద్దేశించి చెప్పఁబడి) యున్నవి. ఎల్లప్పుడును వెలుతురు చూడనివాఁడంధకారము నెఱుంగక పోవుటయే కాక, వెలుతురు, అంధకార మను శబ్దములు సైత మతనికిఁ దెలియవు. 'సత్-అసత్' అను శబ్దద్వంద్వమునకు నీ న్యాయమే వర్తించును. కొన్ని వస్తువులు నశ్వరములగునని తెలిసెనేని, 'అసత్' (నాశముఁ బొందునది), 'సత్' (నాశముఁ బొందనిది) అని సర్వవస్తువులను రెండుగ విభాగింతుము. లేక, నద

నత్తు లను నీ రెండు శబ్దములను దెలియఁజేయుటకు మనుష్యుని కను దోయికి మున్ను రెండు విధములగు విరుద్ధధర్మము లుండవలసివచ్చు ననునది స్పష్టముగనే యున్నది. కాని మూలారంభమున నొకవస్తువే యుండె నేని ద్వైత ముత్పన్నమైన పిదప రెండువస్తువుల నుద్దేశించి ప్రచారములోనికి వచ్చిన 'నదనత్తు'లను సాపేక్షశబ్దములను నీ మూల వస్తువునకు నెట్లు సంబంధింపఁ జేయుదురు? కారణ మేమి యనఁగా: దానిని 'సత్' అందుమేని యా సమయమున దానికి జతగా నింకెద్ది యైన 'అసత్తు'గా నున్నదా యేమి? యని శంక కలుగును. కావున పరబ్రహ్మ మిట్టిది యని చెప్పక "జగదారంభమున 'నత్తు' కాక పోయెను, 'అసత్తు' కాకపోయెను. ఏది యున్నదో యది యొక్క టియే యుండెను. సదనచ్ఛబ్దములయొక్క ద్వంద్వము పిదప వెలు వడినది" అని ఋగ్వేదమునందలి నాసదీయసూక్తమునందు సృష్టి యొక్క మూలతత్త్వము వర్ణింపఁబడినది (ఋ. 10.129). మఱియు, సదనత్తులు, శీతోష్ణములు మొదలగు ద్వంద్వములనుండి ముక్తమయిన బుద్ధికలవాఁ డీ సకల ద్వంద్వములకు పరముగ నున్న (అనఁగా: నిర్ద్వంద్వమగు) బ్రహ్మపదమును బొందుచున్నాఁడని గీతలలోఁ జెప్పఁ బడినది (గీ. 7.28; 2.45). అధ్యాత్మశాస్త్రమునందున్న విచార మెంత గూఢముగను, సూక్ష్ముగ నున్నదియో దీనిం బట్టి తెలియును. కేవల తర్కదృష్టితో విచారించితి మేని పరబ్రహ్మముయొక్క, లేక, యాత్మయొక్క యీ యజ్ఞేయత్వమును దెలిసికొనుటకు వేఱుమార్గ ముండదు; కాని బ్రహ్మ మీ రీతిని అజ్ఞేయమును, నిర్గుణమును కావు ననే యింద్రియాతీత మయినను ఒక్కొక్కనికి తన యాత్మయొక్క సాక్షాత్ప్రతీతి (అనుభవము) యుండుటచే, ఈ నిర్గుణాత్మయొక్క యే యనిర్వాచ్యమగు స్వరూపమును సాక్షాత్కారముచే మన మెఱుం గుచున్నామో, యదియే పరబ్రహ్మముయొక్కయు స్వరూపముగనున్న దని కించదంతి కలుగవచ్చును. దానివలన బ్రహ్మము నాత్మయు నేక స్వరూపులుగ నున్నా రను సిద్ధాన్తము నిరర్థకము గానేరదు. ఈ దృష్టితో

చూచితిమేని "బ్రహ్మము ఆత్మస్వరూపఁడుగ నున్నాఁడు" అనుట కంటె దాని స్వరూప విషయమై యధికముగ నేమియుఁ జెప్పుటకు సాధ్యము కానేరదు. మిగిలిన విషయములో నంతయు స్వానుభవాధీనముగనే యుండవలయును. బుద్ధిగమ్యమును శాస్త్రీయమునగు దానిని స్పష్టపఱచుటలో శబ్దములచే శక్యమయినంత వివరించుట యావశ్యకము. కావున బ్రహ్మ మంతట నొకే విధముగ వ్యాపించిన దయ్యును, అజ్ఞేయము, ననిర్వాచ్యముగనున్నను జడసృష్టియొక్కయు నాత్మస్వరూపియగు బ్రహ్మముయొక్కయు భేదమును స్పష్టపఱచుటకే యాత్మయొక్క సాన్నిధ్యముచే జడప్రకృతియందు మనకు గోచరించు చైతన్యరూపమగు గుణమే యాత్మకు ప్రధానలక్షణ మని చెప్పి యాత్మయు బ్రహ్మము నను నీ రెండును చిద్రూపములు చైతన్యరూపములు నని యధ్యాత్మశాస్త్రమునందుఁ జెప్పుచున్నారు. కారణమేమి యనఁగా: అట్లు చేయనినాఁడు ఆత్మ బ్రహ్మములు రెండును నిర్గుణములు, నిరంజనములు, ననిర్వాచ్యములు నగుటచే వానియొక్క స్వరూపనిర్ణయ విషయమై మౌనముగ నుండవలయును. లేదా, శబ్దముచే నెవ రేమి వర్ణించినను "నేతి నేతి, ఏతస్మా దన్యత్పర మస్తి"- ఇది కాదు. ఇది (బ్రహ్మము) కాదు (ఇవి నామరూపముల). నత్యమగు బ్రహ్మ మింతకంటె మఱియొకఁ డున్నది అని యెప్పుడును లేదు లే దను పాఠమును వల్లించుటకంటె మఱియొక మార్గమేదియును లేదు (బృ. ౪.౫.౬). కావున, చిత్ (జ్ఞానము), నత్ (నత్తామాత్రత్వము, శేక, ఉనికి), మఱియు నానందము ననునవి బ్రహ్మస్వరూపముయొక్క లక్షణములని సామాన్యముగఁ జెప్పుచున్నాఁడు. ఈ లక్షణము లితర లక్షణములకంటె శ్రేష్ఠము లయిన వనుటలో నందేహము లేదు. అయిన నీ లక్షణములు శబ్దముచే నెఱుంగుటకు వీలు కలుగునంతటి బ్రహ్మస్వరూపముయొక్క పరిచయమును కలుగఁజేయు నిమిత్తమయి చెప్పఁబడినవి. నత్యమగు బ్రహ్మస్వరూపము నిర్గుణమగుటచే దాని నెఱుంగుటకు వానియొక్క ప్రత్యక్షానుభవమే యుండవ

లయు నను సంగతి మఱచిపోఁగూడదు. ఈ యనుభవ మెట్లు కలుగ వచ్చును? (అనఁగా: ఇంద్రియాతీతము గావుననే యనిర్వాచ్యమ యిన బ్రహ్మస్వరూపము బ్రహ్మ నిష్ఠున కే విధమున నెప్పు డనుభవము నకు వచ్చును?) అనెడి యీ విషయమై మన శాస్త్రకారులచేఁ జెప్పఁ బడిన వివేచన నీ క్రింద సంక్షేపముగఁ జెప్పుచున్నాను.

బ్రహ్మము, నాత్మయు నొకటి యను నీ నమీకరణమునే "పిండమందుండు నదియే బ్రహ్మాండమం"దున్న దని చెప్పుచున్నారు. మఱియు నీ బ్రహ్మాత్మైక్యమయొక్క యనుభవమైన పిదప జ్ఞాత (చూచువాఁడగు నాత్మ) వే అనియు, జ్ఞేయము (అనఁగా; దృశ్య మగు వస్తువు) వేఱనియు భేద ముండుటకు వీలులే దనునది న్యాయ ముగ సిద్ధ మయినదియే. మనుజుఁడు బ్రతికియుండు నంతవఱకును నేత్రములు మొదలగు నింద్రియములును వానిని వదలిపెట్టలేని గుణ ములును వేఱు, ఇంద్రియములకు గోచరమగు విషయము వేఱు నను నీ భేద మెట్లు వదలిపోవును? ఈ భేదము వదలకపోవునేని పరబ్రహ్మా త్మైక్యానుభవ మెటులు కలుగును? అని యొక సందేహ మీ విషయ ములోఁ బుట్టుటకు వీలుగ నున్నది. మఱియు కేవల మింద్రియ దృష్టితో విచారణఁ జేసినను నీ సందేహము చూచునంతటితోనే న్యాయ విరుద్ధముగఁ గాన్పింపనేరదు; కాని లోతుగ విచారించినయెడల నిం ద్రియములు బాహ్యవిషయములను జూడవలయు ననుకోరిక దాని యంతట నదియే పుట్టనేరదు. "చక్షుః పశ్యతి రూపాణి మనసా న తు చక్షుషా" (మ. భా. శాం. 311. 17)- ఏ వస్తువునైనఁ జూచుటకై (వినుట మొదలగు వానికిని) కన్నులకు (చెవులు మొదలగు వానికిని) మనస్సుయొక్క సాయము కావలసియుండును. మనస్సు శూన్యమైన యెడల వస్తువు కన్నుల యెదుట నున్నను కాన్పింపదని పూర్వమునఁ జెప్పఁబడినది. ఈ వ్యావహారికానుభవ మెఱింగినను, నేత్రాదీంద్రియ ములు వ్యాపారముఁ జేయుచున్నను, మనస్సు నింద్రియముల నమీ

పము నందుండి తొలఁగించితి మేని, యింద్రియములయొక్కయు, విషయములయొక్కయు ద్వంద్వములు బాహ్యసృష్టియం దున్నను తనకు లేనటులే యగును. మఱియు మన స్సనునది కేవల మాత్మ యందే (అనఁగా: ఆత్మస్వరూపియగు బ్రహ్మమందె) యనురక్త మగునేని బ్రహ్మాత్మైక్యముయొక్క సాక్షాత్కారము తన కగునని నహజ ముగ ననుమానింపఁ బడుచున్నది. ధ్యానముదేతను, సమాధిచేతను, ఏకాంతోపాసనచేతను అత్యంత బ్రహ్మవిచారమం దీ మానసికస్థితి యుండువారికి దృశ్యసృష్టియందలి ద్వంద్వములు, లేక, భేదములు కంటియెదుట నున్నను గాన్పింపనివే యగును. మఱియు నద్వైత బ్రహ్మస్వరూపముయొక్క పూర్ణసాక్షాత్కారము స్వయముగనే కలు గును. పూర్ణబ్రహ్మజ్ఞానముచేఁ దుదకుఁ బ్రాప్తమగు నీ పరమావధియగు స్థితియందు జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము నను నీ మూఁడు విధములగు భేదము (అనఁగా: త్రిపుటి) బొత్తిగనే యుండదు. లేక, యుపాస్యో పాసకభావ మను నీ ద్వైతము మిగులదు. కావున నీ యవస్థ యితరుల కెవరికిని చెప్పుటకు సాధ్యము కానేరదు. కారణ మేమి యన: 'రెండవది' యను శబ్దము నుచ్చరింపఁగనే యీ యవస్థ చెడిపోవును. మనుజుఁ డద్వైతమునుండి ద్వైతములోనికి వచ్చు నను సంగతి స్పష్ట ముగనే యున్నది. వే యేల? ఈ యవస్థ నాకు తెలిసినది యని చెప్పుట సైతము కష్టము. కారణ మేమి మనఁగా: నే నని చెప్పినను ఇతరునికంటె భిన్నుఁడని భావన మనస్సునకుఁ గాన్పింపవచ్చును. మఱియు బ్రహ్మాత్మైక్యమగుట కది బాధకముగ నుండును. ఆ కార ణముచే "యత్ర హి ద్వైత మివ భవతి తదితర ఇతరం పశ్యతి .... జిఘ్రతి....శృణోతి ... విజానాతి,.... యత్ర త్వస్య సర్వ మాత్మైవా భూత్ తత్కేన కం పశ్యేత్ ....జిఘ్రేత్ ....శృణుయాత్ ,.... విజానీ యాత్ , విజ్ఞాతార మరే కేన విజానీయాత్ , ఏతావ దరే ఖల్వమృ తత్వ మితి "— మాచవాఁడును, చూడఁబడు పదార్థము నను ద్వైత మెంతవఱకు నుండునో యంతవఱకు నొకఁ డితరుని చూచుచు

న్నాఁడు, వానఁ జూచుచున్నాడు, వినుచున్నాఁడు, తెలిసికొను చున్నాఁడు; కాని యివి యన్నియు నాత్మమయము లయినప్పుడు (అనఁగాఁ: స్వపరభేదము లేనప్పుడు) యెవఁ డెవనిని చూచును, దేనిని వానఁ జూచును, దేనిని వినును, దేనిని తెలిసికొనును? ఓరీ! ఏది తానే జ్ఞాతయో (అనఁగాఁ: తెలిసికొనునదియో) దానినిఁ దెలిసికొను మఱియొక పదార్థము నెచ్చోనుండి తీసికొని రాఁగలము?" అని యాజ్ఞవల్క్యులు బృహదారణ్యకమునం దీ పరమావధిస్థితిని వర్ణించిరి (బృ. 4.5.15; 4.3.27). అందఱు నీ తీరుననే యాత్మభూతులు, లేక, బ్రహ్మభూతులు నయిన పిదప వారి విషయమయి భీతి, శోకము, లేక, సుఖదుఃఖాది ద్వంద్వములు నుండుటకు వీలు కానేరదు (ఈశ. 7). కారణ మేమి యనఁగాఁ: దేని విషయమై భయపడవలసి వచ్చునో, దేని విషయమై శోకింపవలసి వచ్చునో, యది తనకంటె భిన్నముగనుండ వలయును. మఱియు బ్రహ్మాత్మైక్యముయొక్క యనుభవ మయిన పిదప నిట్టి యే భిన్నత్వమునకు నవకాశమే యుండదు. ఈ దుఃఖ శోకవిరహితమగు నవస్థకే యానందమని పేరు. ఈ యానందమే బ్రహ్మమని తైత్తిరీయోపనిషత్తునందుఁ జెప్పఁబడినది (తై. 2.8; 3.6). కాని యీ వర్ణనయును గౌణముగనే యున్నది. కారణమేమి యనఁగాఁ: ఆనందము ననుభవించువాఁడైనను నిప్పు డెక్కడ నున్నాడు? కావున లౌకికానందములకంటె నాత్మానందము చాల విలక్షణముగ నుండునని బృహదారణ్యకోపనిషత్తులోనే వర్ణింపఁబడినది (బృ. 4.3.32). బ్రహ్మ వర్ణన యందు వచ్చుచున్న యానందశబ్దముయొక్క యీ గౌణత్వ మును గమనించియే యితర ప్రదేశములందును, "బ్రహ్మ భవతి య ఏవం వేద"- ఎవఁడు బ్రహ్మమును తెలిసికొనునో వాఁడు బ్రహ్మమే (ముం. 3.2.9) యగుచున్నాఁడని మాత్రమే. (అనఁగాఁ: 'ఆనంద' శబ్దమును దొలఁగించి) బ్రహ్మవేత్తయగు పురుషునియొక్క కడపటి వర్ణన సేయఁబడినది. ఉప్పుకల్లు నీటిలో కరిగిన పిదప నా నీటిలో

నీ భాగ ముప్పగ నున్నదనియు నీ భాగ ముప్పగ నుండలేదనియు భేద ముండనటుల బ్రహ్మాత్మైక్యజ్ఞానము కలిగిన పిదప సర్వము బ్రహ్మమయమే యగునని యీ స్థితి కీ దృష్టాంత ముపనిషత్తులలో నీయఁబడినది (బృ. 2. 4. 12; ఛాం. 6.13); కాని "ఇయాఁచీ వదే నిత్య వేదాంతవాణీ"-ఎవని వాక్కెల్లప్పుడు వేదాన్తమును నుడువునో యని తుకారామబువాగా రీ దృష్టాంతమునకు మాఱుగ-

గోడపడేఁ జైసా గూళ, చైసా దీవ జాలా సకళ,
ఆకాఁ భజీ కోఁపరీ, దీవ సబాహ్య అంతరీఁ.

(తు. గా. 3827)

- ఓ భగవంతుఁడా! బెల్లమున మాధుర్యము లోపలను వెలుపలను సమానముగ నెటు లుండునో యటులే నీ వంతటను వ్యాపించియుండుటచే నే విధముగ విభజించినను నిన్ను భజింపవచ్చును అని గుడము యొక్క మధురిమ దృష్టాంతమును గైకొని తన యనుభవమును జెప్పెను. పరబ్రహ్మ మింద్రియముల కగోచరమును మనస్సున కగమ్యము నయిన నయ్యది స్వానుభవగమ్య మనుట (అనఁగా: వారి వారి యనుభవముచేఁ దెలియఁబడునది యనుట)కిదియే తాత్పర్యము. పరబ్రహ్మమందున్న దనెడి యజ్ఞేయత్వము, జ్ఞాత జ్ఞేయము ననునీ ద్వైతస్థితిలోనిదే కాని అద్వైతసాక్షాత్కారములోనిది కానేరదు. నేను వేఱు, జగత్తు వేఱును బుద్ధి యుండువఱకు నేమి చేసినను బ్రహ్మాత్మైక్యము పూర్ణముగ నెఱుంగుటకు శక్యము కానేరదు; కాని యేఱు సముద్రమునఁ బడుటచే నది సముద్రరూపమును బొందినటుల పరబ్రహ్మములో మునిఁగిన మనుజునకుఁ దదనుభవము కలుగును; మఱియు- "సర్వభూతస్థ మాత్మానం సర్వభూతాని చాత్మని"-సర్వభూతములు తన యందును, తాను సర్వభూతములయందును (గీ. 6.29) అని నటు లతనికి బ్రహ్మమయస్థితి సంభవించును. పూర్ణబ్రహ్మజ్ఞాన మిటులు కేవల స్వానుభవమునే యవలంబించియున్నది యను

నీ యర్థమును తెలియఁ బఱచుటకొఱకు- "అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాత మవిజానతాం"- తనకు పరబ్రహ్మము తెలిసిన దని యను వానికి తెలియలేదు, మఱియు తనకు తెలియదనియును వానికి తెలిసి యున్నది (కేన. 2. 3) అని పరబ్రహ్మస్వరూపము చక్కని విరోధాభాసాత్మకముగ వర్ణితమయినది. కారణ మేమి యన: పరబ్రహ్మము తనకు తెలిసినదని యెవ రయినను చెప్పినప్పుడు తాను(జ్ఞాత)వేఱును తనకుఁ దెలిసిన (జ్ఞేయము) బ్రహ్మము వేఱును అను నీ ద్వైతము మనస్సున నుత్పన్న మగుటచే నతని పరబ్రహ్మైక్యరూప మగు నద్వైతానుభవ మంతవఱకే యై యున్నది. ఈ నమయమున న్యూన మయినది, లేక, యపూర్ణముగ నున్నది యని చెప్పువానికి నిత్య మగు బ్రహ్మము తెలియలేదని యతని మాటచేతనే సిద్ధమగుచున్నది. దీనికి విపరీతముగ తాను బ్రహ్మ మను ద్వైతభేదము లేకపోనుటచే బ్రహ్మైక్యమయొక్క పూర్ణానుభవము కలిగినప్పుడు తన కది 'తెలిసినది (అనఁగా: తనకంటె నితర మగునది యొకటి తెలిసినది) యను మాట యే' యతని నోట వచ్చుటకు వీలులేదు. కావున నీ స్థితియందు (తనకు బ్రహ్మము తెలిసినదని జ్ఞాని చెప్పుటకు ననమర్థుఁడగు స్థితియందు) అతనికి బ్రహ్మము తెలిసిన దని చెప్పవలసివచ్చును. ఈ తీరున పూర్తిగ ద్వైతభావము లోపించుటయు, జ్ఞాత పూర్తిగ పరబ్రహ్మములోఁ గలిసి లయమును బొందుటయు, నిశ్శేషముగ నేకీభావమును బొందుటయును సామాన్యముగ దుష్కరమని తోఁచుచున్నది; కాని యాలోచింపఁగనే కష్టమని కాన్పించెడి యీ 'నిర్వాణ'స్థితి యభ్యాసముచే నైనను, వైరాగ్యముచే నైనను తుదకు మనుజునకు సాధ్యము కాఁగలదని మన శాస్త్రకారు లనుభవముచే సిద్ధాంతముఁ జేసిరి. 'నేను' అను దానియొక్క ద్వైతభావ మీ స్థితియందు, నాశమునో, మరణమునో పొందియుండుటచే నాత్మనాశములో నిది యొక భేదముగ నున్నదని యనేకులు దలఁచుచున్నారు; కాని యీ స్థితి వనుభవించినప్పుడు సాధ్యము కాకపోయినను పిదప నది స్మరణలోనికి

రావచ్చునను విషయము తెలిసె నేని పూర్వోక్తమగు శంక నిర్మూల మగునని యందఱకుఁ దెలియును.* కాని సత్పురుషుల యనుభవము దీనికంటెను బలవత్తరమగు ప్రమాణమైయున్నది. ప్రాచీనులగు సిద్ధ పురుషుల యనుభవవర్ణన యటుండ నిమ్ము: మొన్న మొన్న సైతము భగవద్భక్తశిరోమణియగు తుకారామబువాయును-

ఆపులేఁ మరణ పాహిలేఁ మ్యాఁ డోకాఁ,
తో జాలా సోహళా అనుపమ.

(గా. 3579).

– నేను నా మృత్యువును నా కన్నులతోఁ జూచితి. ఇదియు నొక యనుపమ మగు నుత్సవముగనే యున్నది– అని యీ పరమావధి యగు స్థితి నాలంకారికభాషలో సత్యుత్సాహముతోను, ధన్యతా పూర్వకముగను వర్ణించెను. వ్యక్తము, లేక, యవ్యక్తమగు సగుణ బ్రహ్మము నుపాసించి ధ్యానముచే క్రమముగ గొప్పవాఁ డగుచు నుపానకుఁడు తుద కిట్టి స్థితిని బొందుచున్నాఁడు. అనఁగా: "అహం బ్రహ్మాస్మి"– నేనే బ్రహ్మగ నున్నాను (బృ. 1. 4. 10) అను బ్రహ్మాత్మైక్యస్థితియొక్క సాక్షాత్కార మతని కగుచున్నది. మఱియు నతఁడు దానిలో నే స్థితియం దుండునది, లేక, యీ యనుభవమును బొందుచున్నదియు సైత మతనికి గోచరింపనంత జ్ఞానములో మునిఁగి

* ధ్యానము చేతము, పరిధిచేతము లభించెది యద్వైతమయొక్క కాని యభేదమయొక్క కాని యీ యవస్థ, Nitrous-oxide gas అను పేరుగల యొక విధమగు గాలిని వాసనఁ జూచుటచే సైతము ప్రాప్తమగును. ఈ గాలికే 'లాఫింగ్ గాస్' అని పేరు. Will to Believe and other Essays on Popular Philosophy by William James. pp. 294, 298. కాని యీ యవస్థ కృత్రిమ మైనది; పరిధిచేఁ గలుగు నవస్థ పథ్యమైనది. ఇదియే యీ రెంటిలో నున్న భేదము. అయిన నీ కృత్రిమావస్థయొక్క దృష్టాన్తముచే పరిణామావస్థయొక్క యసత్యవిషయమై వాద మేమియు నుండదు. కాన నిక్కడ దాని వక్తాణించితి.

యుండును. జాగ్రదవస్థ స్థిరముగ నుండుటచే నీయవస్థ స్వప్నమని, లేక, సుషుప్తియని వచించుట యసాధ్యము. మఱియు జాగ్రదవస్థ యందు సామాన్యముగఁ గలుగఁబోవు ద్వైతముయొక్క నిఖిల వ్యవహారములు సాఁగుచున్నవి. కావుననే స్వప్నము, సుషుప్తి, లేక, జాగృతి యను నీ మూఁడు వ్యావహారికావస్థలకంటె వేఱైనది యగు నిదియె యొక నాల్గవయవస్థ, లేక, తురీయావస్థ యని శాస్త్రము లందు వక్కాణింపఁ బడినది. మఱియు నీ స్థితినొందుటకు నిర్వికల్ప సమాధియోగము (అనఁగా: దేనియందు ద్వైతసంబంధము లేశ మాత్రము నుండదో యట్టి సమాధియోగమును) నభ్యసించుట యను నదియే పాతంజలయోగ దృష్టిచే ముఖ్యసాధన మగుటచే గీతయం దున్న యీ నిర్వికల్పసమాధియోగ మభ్యాసముచే సంపాదించు కొనుటకు మనుజుఁడు నిరాశఁ జెందరా దని చెప్పఁబడినది (గీ. 6. 20-23). ఈ బ్రహ్మాత్మైక్యస్థితియే జ్ఞానముయొక్కపూర్ణావస్థ. కారణ మేమియన: సర్వజగత్తును బ్రహ్మస్వరూపము (అనఁగా: ఒక్కటియే) అయిన పిదప "అవిభక్తం విభక్తేషు"-అనేకము నేకత్వముఁ జేయుట అని గీతలయం దున్న జ్ఞానక్రియయొక్క విశేషజ్ఞాన మైనను గలుగుటకు వీలులేదు. అటులే నామరూపములకంటె పరమం దున్న యీ యమృతత్వముయొక్క యనుభవమయిన పిదప మనుజులకు జననమరణ ప్రవాహము సైతము స్వయముగనే నశించుచున్నది. కారణ మేమి యన; జననమరణములును నామరూపముల లోనివే. మఱియ వానికి పరముగనే యితఁ డుండును (గీ. 8.21). ఈ కారణ ముననే తుకారామబువా యీ స్థితిని 'మరణముయొక్క మరణ' మని పేర్కొనెను (గా. 3580); మఱియు యాజ్ఞ్యవల్క్యఁ డీ కారణము చేతనే యీ స్థితి నమృతత్వముయొక్క సీమ, లేక, పరాకాష్ఠ యని నుడువుచున్నాఁడు. ఇదియే జీవన్ముక్తావస్థ. ఈ యవస్థయం దాకాశ గమనము మొదలగు కొన్ని యపూర్వములు నలౌకికములు నగు

సిద్ధులు లభించునని పాతంజల యోగసూత్రములలోను, ఇంక నితర స్థలముల యందును చెప్పఁబడినది (పాతంజల సూ. 2. 16-55). మఱియు నీ కారణముననే యనేకులు యోగాభ్యాసవ్యసనమునఁ బడుచున్నారు. కాని యోగవాసిష్ఠములో వక్కాణించినటు లాకాశ గమనము మొదలగు సిద్ధులు బ్రహ్మనిష్ఠస్థితికి సాధ్యములు, లేక, భాగములు కావు. కావున జీవన్ముక్తుఁడగు పురుషుఁ డీ సిద్ధి నొందుటకు యత్నము చేయఁడు. మఱియు నెప్పుడు నతని కీ యూహయుఁ గలుగదు (యోగ. పా. 89 చూడుము). కావున యోగవాసిష్ఠకారుఁడు మాత్రమే కాక గీతలలో సైత మీసిద్ధి యెచ్చటను చెప్పఁబడలేదు. ఇదియు చమత్కారమే (మాయయొక్క విలాసమే) కాని, బ్రహ్మ విద్య కాదు, అని వసిష్ఠులు శ్రీరాములకుఁ జెప్పిరి. అది సత్యమే యయి యుండును. సత్యము కాదని నేఁ జెప్పను; కాని యేమి చెప్పినను నిది బ్రహ్మవిద్యయొక్క విషయము కా దనునంగతి మాత్రము నిర్వివాదముగ నున్నది. కావున "ఇట్టి సిద్ధులు లభించి నను, లభింపక పోయినను, వానిని లక్ష్యపెట్టక, లేక, వాని నిచ్ఛ యింపక, లేక, వానికై యాశపడక, సర్వభూతములందు నొక యాత్మయే కలదను నీ పరమావధియగు బ్రహ్మనిష్ఠయొక్క స్థితి మనకు నే తీరున ప్రాపించు నని యెన్నుము, దాని నిమిత్తమై మను జుఁడు యత్నింపవలయును. అణిమాదిసిద్ధు లను వ్యసనములోఁ బడరాదు అని బ్రహ్మవిద్య చెప్పుచున్నది. బ్రహ్మజ్ఞాన మనునది యాత్మయొక్క తుద్దావస్థగ నున్నది; కాని కనుకట్టు, లేక, మాయిక చమత్కారము కానేరదు. మఱియు నిట్టి చమత్కారముచే బ్రహ్మ జ్ఞానమునకు మహిమ లేకపోవుటయే కాక బ్రహ్మవిద్యయొక్క మహత్త్వమునకు నీ చమత్కార మనునది పూర్ణముఁ జేయునదియుఁ గానేరదు. పక్షులును, ఇప్పుడు విమానములు కలిగిన జనులును నాకసమునందు పరుగిడుదురు; కాని యంతమాత్రముచే వారిని బ్రహ్మవేత్త లనరు. వేయేల? గమనము మొదలగు సిద్ధులను బొం

దిన కొందఱు పురుషులు మాలతీమాధవీయ నాటకములోని యఘోర ఘంటానివలె క్రూరులుగను, ఘాతుకులుగను కూడ నుండవచ్చును.

బ్రహ్మాత్మైక్యరూప మగు నానందమయస్థితియొక్క యనిర్వాచ్యానుభవ మితరునకు పూర్ణముగఁ జెప్పుటకు శక్యము కానేరదు. కారణ మేమి యన: వాఁ డితరులకుఁ జెప్పవలసి వచ్చినేని 'నేను-నీవు', మొదలగు ద్వైతభాషనే మాటలాడవలసి వచ్చును. మఱియు నీ ద్వైతభాషయం దద్వైతనర్వానుభవమును వ్యక్తీకరించుట సాధ్యము కానేరదు. కావున నుపనిషత్తులలో వర్ణింపఁబడిన యీ పరమావధి స్థితియు అపూర్ణము, లేక, గౌణ మని తెలిసికొనవలయును. మఱియు నీ వర్ణన గౌణ మయినను సృష్ట్యుత్పత్తి, రచన మొదలగువాని దెలియఁ జేయుట కనేక స్థలములం దుపనిషత్తులలో నున్న శుద్ధద్వైతవర్ణనయు గౌణ మనియే నుడువ వలయును. ఉదాహరణ మేమి యన: ఆత్మస్వరూపము శుద్ధము, నిత్యము, సర్వవ్యాపియు, అవికారియు నైయున్నది. ఇట్టి బ్రహ్మమం దుండియే, పిదప హిరణ్యగర్భుఁ డను పేరుగల నగుణపురుషుఁడు, లేక, నీరము మొదలగు సృష్టిలోని వ్యక్త పదార్థములు క్రమక్రమముగ నిర్మితము లైనవి యనియు, లేక, యీ నామరూపముల నిర్మించిన పిదప జీవరూపముగ పరమేశ్వరుఁ డందు ప్రవేశించె ననియు (తై. 2.6; ఛాం. 6.2-3; బృ. 1.4.7) నుపనిషత్తులలోఁ జెప్పఁబడిన దృశ్యసృష్టియొక్క యుత్పత్తి యద్వైత దృష్టిచే యథార్థము కానేరదు. కారణ మేమియన: జ్ఞానగమ్యుఁడగు నిర్గుణ పరమేశ్వరుఁడే నలుదెసల వ్యాపించి యుండెనేని యొకటి, రెండవదానిని బుట్టించె నని చెప్పుటయే తాత్త్వికదృష్టినిబట్టి నిర్మూలమగును; కాని సామాన్యజనులకు సృష్టిరచనను దెలియఁ జేయుటకై వ్యావహారిక (అనఁగా: ద్వైతభాష) మనునదియె ముఖ్యమగుసాధనమగుటచే వ్యక్తసృష్టియొక్క (అనగా: నామరూపములయొక్క) యుత్పత్తిని గుఱించి పైఁ జెప్పిన వర్ణన యుపనిషత్తులలో నున్నది.

అయినను వానియందు సైత మద్వైతభావ మధిక స్థిరముగ నుండు టచే నిట్టి ద్వైతవ్యావహారిక భాష ప్రయోగింపఁ బడినను మూల మం దద్వైతమే సత్యమని యనేక ప్రదేశములందుఁ జెప్పఁబడినది. సూర్యుఁడు తిరుగుటలే దని నిశ్చయజ్ఞానము కలిగినను సూర్యుఁ డుద యించుచున్నాఁడనియు నస్తమించుచున్నాఁడనియు మనము చెప్పు చున్నటులే యొక యాత్మరూపియగు పరబ్రహ్మ మఖండముగ నలు దెనల నిండియుండుటచే నది యవికార్య మనుట నిశ్చయ మని స్థిర మయినను "పరబ్రహ్మము నుండి వ్యక్త మయిన జగత్తు నిర్మిత మైన దను భాష యుపనిషత్తులలో నక్క డక్కడ నున్నది; మఱియు గీతలయందు నటులె 'నాయొక్క సత్యస్వరూప మవ్యయము నజమునై యున్నది' (గీ. 7.25) అని చెప్పుచు, 'నేను సర్వజగమును పుట్టించినాను' (గీ. 4. 6) అని భగవంతుఁడు చెప్పినాఁడు గాన దీని యందలి రహస్యమును కనిపెట్టినయెడల నవి శబ్దమును బట్టి సత్యములుగనే యున్నవి. అవియే ముఖ్యముగ నున్నవి" యని యెన్ని, యనేకులగు పండితులు ద్వైతము, లేక, విశిష్టాద్వైత ముపనిషత్తులలోఁ బ్రతిపాదింపఁబడి యున్నదని సిద్ధాంతీకరించు చున్నారు. అంతట నొక నిర్గుణమగు బ్రహ్మమే వ్యాపించియున్న దని యనునెడల నీ యవికారియగు బ్రహ్మమందుండి వికారియు నశ్వరము నగు నగుణపదార్థ మెట్లు పుట్టిన దను ప్రశ్నకు సమాధాన ముండదు. కారణ మేమి యన: నామరూపాత్మక సృష్టిని మాయ యని చెప్పినను నిర్గుణ బ్రహ్మమందుండి సగుణమగు మాయ పుట్టుటయే తర్కదృష్టిచే శక్యము కాకపోవుటవలన నద్వైతవాదయు క్తి శూన్య మగుచున్నది. వీనికంటె సాంఖ్యశాస్త్రమున చెప్పినటులు నామరూపాత్మకమగు వ్యక్త సృష్టియొక్క ప్రకృతివంటి యొకానొక నగుణము వ్యక్తము నగు రూపము నిత్యమని యొప్పుకొని, యంత్రములోనుండు నావిరి వలె దానిలో నుండునదియు, పరబ్రహ్మరూపమయినదియు నగు మఱి యొక నిత్యమగు తత్త్వము జగమున నోతప్రోతము (పడుగుపేక)గ

నిండియున్న దనియు (బృ. 3. 7) నీ రెంటికిని దానిమ్మపండులోని విత్తులకువలె నైక్యమే యని యంగీకరించుట మిక్కిలి ప్రశస్తముగ నుండుననియు వారు చెప్పుదురు; కాని యుపనిషత్తుల తాత్పర్య మీ రీతిగ నిశ్చయించుట యుక్తముకాదని మా మతము. ఉపనిషత్తులలో నొకానొకప్పుడు ద్వైతమును, మఱియొకప్పుడు, శుద్ధాద్వైతమును వర్ణించుచుండుటచే నీ రెంటికి నేకవాక్యత చేయవలసియె యున్నది; కాని యద్వైతవాదము ముఖ్యమని యంగీకరించి నిర్గుణ బ్రహ్మము సగుణ మగుటకు మాత్రము మాయికమగు ద్వైతము యొక్క స్థితి ప్రాప్తమయినటుల కాన్పించుచున్న దని యంగీకరించుటచే సర్వవచనములకును వ్యవస్థ కుదిరినట్లు ద్వైతపక్షము ప్రధాన మని యంగీకరించిన కుదురదు. ఉదాహరణము: "తత్త్వమసి"—ఈ వాక్యమందున్న పదములయొక్క యన్వయము ద్వైతమతానుసారముగ నెప్పుడును బాగుగ కుదురదు. ద్వైతుల కీ ప్రతిబంధము తోఁపకపోలేదు; కాని, తత్త్వం—తన్యత్వం—అనఁగా: నీ కంటె భిన్నమగు దాని సంబంధుఁడవుగా నీ వున్నావు, వాఁడె నీవు కావు— అని యేదో యొక విధమున నీ మహావాక్యమును సమన్వయించి ద్వైతులు తృప్తిఁ జెందుదురు; కాని కొంత సంస్కృతజ్ఞానముండి, పక్షపాతము లేక విచారించు నెడల యొక్కొక్కనికి నిటులు క్రమము తప్పి చేయుట వలన నేర్పడు నర్థము నత్యము కానేరదని వెంటనే తెలియును. కైవల్యోపనిషత్తున "న త్వ మేవ త్వ మేవ తత్"(కై. 1. 16) అని 'తత్' 'త్వమ్' అను శబ్దములను క్రమము తప్పనటు లొనర్చి పై మహావాక్య మద్వైతపరముగనే యున్నదని సిద్ధాన్తము చేయఁబడినది. వేయేల? మొత్తముపై నుపనిషత్తుల యొక్క మంచి మంచి భాగములను ఛేదించి తాఱుమాఱు సేయని యెడలను, తెలిసియు దానియందు దురుద్దేశమును బొందని యెడలను, ఉపనిషచ్ఛాస్త్రమునం దద్వైతమతము తప్ప వేఱొకరహస్య

మున్న దని నిరూపించుటకు సాధ్యము కానేరదు. కాని యీ వివాద మెప్పుడును సమాప్త మగునది కానేరదు. కావున దాని విషయమై యిక్కడ విశేషము నేను విచారణ జేయుటచే వచ్చు ఫలము లేదు. అద్వైతము గాక యితర మతములు రుచించువారు దానిని సంతోష ముతో స్వీకరింపవచ్చును. మహోత్తులచే నుపనిషత్తులయందు "నేహ నానాస్తి కించన" (బృ. 4.4.19; కఠ. 4.11)- ఈ సృష్టియం దే విధ మయిన నానాత్వము లేదు. ఉన్నదంతయు మూలమునందే "ఏక మేవాద్వితీయమ్" (ఛాం. 6. 2. 2) అని స్వానుభవమును స్పష్టముగ జెప్పి పిదప "మృత్యోః స మృత్యు మాప్నోతి య ఇహ నానేవ పశ్యతి" – ఈ జగత్తున నెవరికి నానాత్వము గాన్పించుచున్నదో వారు జనన మరణము లను చక్రమున పడుచున్నారు" అని చెప్పబడిన మాహా త్మ్యముయొక్క యభిప్రాయ మద్వైతము తప్ప వే ఱొకవిధముగ నుండుటకు సాధ్య మగునని నాకు తోచదు. కాని యనేక వైదికశాఖ లందనేకోపనిషత్తు లుండుటచే మొత్త ముపై నర్వోపనిషత్తులయొక్కయు తాత్పర్య మొక్కటియే యగునా? కా నేరదా? యను విషయమును శంకించుటకు నొకప్పుడు కొంత యవకాశము ప్రాపించును. గీతలలో నట్టి యవకాశము లేదు. గీత యనునది యొక గ్రంథమగుటచే దాని యం దొక విధమగు వేదాంతమే ప్రతిపాద్య మను విషయము స్పష్ట ముగ గాన్పించుచున్నది; అది యేమి యని విచారింప నారంభించితి మేని, సర్వభూతములు నష్టమయినను స్థిరముగ నున్న యొక వస్తువే నిజమయిన (గీ. 8. 20) సత్య మగుటచే పిండమందును బ్రహ్మాండ మందును కలసి యంతటను నదియే నిండియున్న ది (గీ. 13. 31), అనియు నద్వైతపరముగ సిద్ధాంతమును జేయుట యావశ్యకమైనది. వేయేల? గీతలలోఁ జెప్పబడిన యాత్మౌపమ్యబుద్ధి యను నీతితత్త్వ మునకు పూర్ణమగు నుపపత్తి యు నద్వైతముకంటె వేఱొక వేదాంత దృష్టితో కుదురదు. శ్రీశంకరాచార్యులవారి కాలమునను, తదుత్తర కాలమునను, వెలువడిన యద్వైత ప్రతిపాదకములైన యనేకము

లగు కోటీలును, ప్రమాణములును మొదలగునవి యన్నియు గీత యందు ప్రతిపాదింపఁబడినవని చెప్పవలయునని నా యభిప్రాయము కాదు. ద్వైతులు, అద్వైతులు, విశిష్టాద్వైతులును, వీరి సంప్రదాయములను బయలువెడలుటకంటె పూర్వమే గీతపుట్టినది కావున, నే విధమగు సాంప్రదాయిక యుక్తులును గీతలయందుండుటకు వీలులేదని చెప్పుటకు మాకును నిష్టమే. కాని గీతలయందున్న వేదాంతము సామాన్యముగ శాంకరసంప్రదాయమునందున్న జ్ఞానము ననుసరించి యద్వైతపరముగనే యున్నది గాని ద్వైతపరము గాదని చెప్పుట కేమియు బాధకము లేదు; కాని తత్త్వజ్ఞానదృష్టితో గీతయందును శాంకరసాంప్రదాయమునందును, ఇత్తెఱక మత్యముండినను నాచార దృష్టిచేఁ గర్మనన్న్యాసముకంటె, గీత, కర్మయోగమునకు నధికమగు మహత్త్వము నిచ్చినది యగుటచే గీతాధర్మము శాంకరసాంప్రదాయముకంటె వేఱుగ నున్నదని నా మతము; కాని దానిని పిదప విచారింతము. ప్రస్తుతము తత్త్వజ్ఞానముం గూర్చి చర్చించుచున్నాము; మఱియు నీ తత్త్వజ్ఞానము గీతలయందు శాంకరసాంప్రదాయమందు నొకరీతిదే యగుటచే నద్వైతముగ నుండు నని మాత్రమే యిక్కడ చెప్పఁదగినది. ఇతర సాంప్రదాయిక భాష్యములకంటె గీతయొక్క శాంకరభాష్యమునకు నింతయధికమహిమ వచ్చుటకు కారణమిదియే యయి యున్నది.

సమస్తనామరూపములను జ్ఞానదృష్టిచేఁ జూచితి మేని యొక యవికారియు నిర్గుణమునగు తత్త్వమే స్థిరముగ నుండును. మఱియు నా కారణమున పూర్ణము సూక్ష్మమునగు విచారమునం దద్వైత సిద్ధాంతమే స్వీకరింపవలసి వచ్చును. ఇంతమాత్రము సిద్ధమైన పిదప, నిర్గుణము, నవ్యక్తమునగు నొక ద్రవ్యము నందుండి నానావిధమగు నవ్యక్త మైన సగుణసృష్టి యెట్లు కలిగినదియు నద్వైతవేదాంత దృష్టితో వ్యాఖ్యానము చేయవలసివచ్చును. నిర్గుణఁ డగుపురుషుని

వలె త్రిగుణాత్మకమగు ప్రకృతి (అనఁగాఁ సగుణప్రకృతి) యనాదియు స్వతంత్రము నని చెప్పి సాంఖ్య లీ ప్రశ్నను వదలించుకొని రని పూర్వమే చెప్పఁబడినది; కాని సగుణమగు ప్రకృతి యీ తీరున స్వతంత్ర మని చెప్పినను జగత్తునకు మూలతత్త్వములు రెండగును గాన పూర్వము చెప్పఁబడిన యనేక కారణములంబట్టి పూర్ణముగ నిశ్చయింపఁబడిన యద్వైతమతమునకు బాధ వచ్చును; మఱియు సగుణప్రకృతి స్వతంత్ర మైనదని యొప్పుకొన మేని మూలమైన యొక నిర్గుణద్రవ్యమునందుండి నానావిధ సగుణసృష్టి యెట్లుత్పన్న మైనదియో చెప్పుటకు సాధ్యము కాదు. కారణ మేమి యన: నిర్గుణము నందుండి సగుణము (అనఁగా: ఏమియు లేకపోవుటనుండి మఱియొకటి యేదియు) ఉత్పన్న మగుటకు శక్యము కానేర దను సత్కార్యవాదముయొక్క సిద్ధాంతము నద్వైతులు సైత మొప్పు కొందురు. ఇందుమూలమున రెండు పక్షములందును చిక్కుగనే యున్నది. అటులైన నీ చిక్కు వదలు టెట్లు? అద్వైతమును వదలి వేయక నిర్గుణమునందుండి సగుణ ముత్పన్న మగుటకు మార్గము నుడువవలయును. అట్లు నిర్గుణమునందుండి సగుణము వచ్చుట సత్కార్యవాదమునకు విరుద్ధముగఁ గాన్పించును. ఇది గొప్ప చిక్కే! వేయేల? అద్వైతసిద్ధాంతమును స్వీకరించుట కిదియే ముఖ్యమగు ప్రతిబంధక మని యనేకుల యభిప్రాయము.

ఈ కారణముచేతనే ద్వైతమతము వెడలినది; కాని యద్వైతు లగు పండితులు తమ బుద్ధిబలముచే నీ వికటమగు చిక్కును సైతము దాఁటుటకు నయుక్తికమును సాటి లేనిదియునగు సుఖమార్గమును కనిపెట్టిరి. సత్కార్యవాదముయొక్క, లేక, గుణపరిణామవాదము యొక్క సిద్ధాన్తము, కార్యకారణము లను నీ రెండు నొక కోటియందే లేక, యొక వర్గమునందే యున్నప్పుడు సమన్విత మగును. కావున సత్యమును, నిర్గుణమునగు బ్రహ్మము నందుండి యసత్యమును

నగుణమునగు మాయ యుత్పన్న మగుటకు వీలు లేదని యద్వైత వేదాంతులు సైత మొప్పుకొందురు; కాని రెండు పదార్థములును సత్యము లయినప్పుడె యీ విషయము నొప్పుకొందురు. ఎక్కడ నొకపదార్థము సత్యమును రెండవ పదార్థము కేవలము దానికి దృశ్య ముగ నున్నదో యక్కడ సత్కార్యవాదము దానికి సమన్వయము కానేరదు. సాంఖ్యులు పురుషునివలె ప్రకృతి సైతము స్వతంత్రమును, సత్యమునగు పదార్థ మని యందురు. కావున నిర్గుణపురుషుని యం దుండి సగుణప్రకృతియొక్క యుత్పత్తి సత్కార్యవాదానుసారముగ నుపపన్న మని సమన్వయించుటకు సాధ్యము కానేరదు. కాని మాయ యనాది యయినను, నది సత్యమును, స్వతంత్రమును కాదు. గీత యందుఁ జెప్పినటుల 'మోహము', 'అజ్ఞానము', లేక, 'యింద్రియ ములకు గోచరించు దృశ్యము' నై యున్నదని యద్వైతవేదాన్తము యొక్క సిద్ధాంత మగుటచే సత్కార్యవాదము నందుండి యుత్పన్న మగు నాక్షేపణ యీ యద్వైత సిద్ధాంతమునకు తగుల నేరదు.

కుమారుఁడు తండ్రియొక్క గుణపరిణామముచే పుట్టినాఁ డని చెప్పుదుము; కాని తండ్రి యనునాఁ డొక వ్యక్తియే యగుటచే నాతని కొడు కొకానొకప్పుడు బాలునియొక్కయు, తరుణునియొక్కయు, వృద్ధునియొక్కయు, వేషము వేసికొనునెడల నీ వ్యక్తికిని, ఆ కుమా రునియొక్క యనేక వేషములకును గుణపరిణామ రూపమగు కార్య కారణభావ ముండదని మన కెప్పుడును కాన్పించుచున్నది. అటులే సూర్యుఁ డొక్కఁడే యని నిశ్చితమైన పిదప నీటియందుఁ గాన్పించు సూర్యుఁడు భ్రమాత్మకుఁడనియు, గుణపరిణామ మూలముచే నుత్ప న్నుఁడగు వేఱొకసూర్యుఁడు కాఁ డనియు చెప్పుచున్నాము. మఱియు దుర్భిణిచే నే గ్రహముయొక్క యైనను సత్యస్వరూపము నిశ్చయించిన పిదప కంటికి మాత్రమే కాన్పించు నా గ్రహస్వరూపము, కన్నుల యొక్క దుర్భరతచేతను, నడుమ నత్యంతదూర ముండుటచేతను

నుత్పన్నమగు కేవల దృశ్యముగనే యున్నదని జ్యోతిశ్శాస్త్రమున స్పష్ట ముగఁ జెప్పఁబడినది. ఏ విషయమైనను నేత్రాదీంద్రియములకు ప్రత్యక్ష గోచర మైనంత మాత్రముచేతనే యీ విషయము స్వతంత్రమైనదియు సత్యమయినదియు నని యంగీకరించుటకు వీలు లేదని చెప్పుట బాగుగనే యున్నది. మఱియు నా న్యాయమే యధ్యాత్మశాస్త్రము నకును సంబంధింపఁ జేసి, జ్ఞానచక్షుస్స్వరూపమగు దుర్బిణిచే నిశ్చ యింపఁబడిన నిర్గుణపరబ్రహ్మ మనునదియే నత్యమైన దనియు, జ్ఞానశూన్యములగు చర్మచక్షుస్సులకు గోచరము లగు నామరూపము లీ పరబ్రహ్మముయొక్క కార్యములు కావనియు, నింద్రియ దౌర్బల్య ముచే నుత్పన్న మగు కేవలభ్రమ (అనఁగా: మోహాత్మకదృశ్యము) యనియు చెప్పుటకేమి యభ్యంతర ముండును? నిర్గుణము నందుండి నగుణ ముత్పన్నము కానేర దను నాక్షేపణ యిచ్చో సంబంధింప నేరదు. కారణ మేమియన: రెండు వస్తువులు నొకకోటి(వర్గము)యం దున్నవి కావు. ఒకటి సత్యముగను, మఱియొకటి కేవల దృశ్యము గను నున్నవి. మఱియు మూలమునం దొక సత్యవస్తువే యుండినను, చూచువారి దృష్టిభేదముచేఁ గాని, యజ్ఞానముచేఁ గాని, లేక, యం ధత్వముచేఁ గాని యా యొక వస్తువుయొక్క స్వరూపమే మాఱు చున్నటుల మన యనుభవములో నున్నది.

ఉదాహరణము: చెవికి వినఁబడు శబ్దము, నేత్రములకుఁ గాన్పించు రంగు నను రెండు గుణములు చూడుము. వీనిలో చెవికి వినఁబడు ధ్వనిని మిక్కిలి సూక్ష్మముగఁ బరీక్షించి, 'శబ్ద' మనఁగా, గాలియొక్కబరువు, లేక, గతి యని యాధిభౌతికశాస్త్రజ్ఞులచేఁ బూర్ణముగ సిద్ధాన్తము చేయఁబడినది. అటులే చక్షుర్గోచరమగు ఎఱుపు, పసుపు, నలుపు మొదలగు రంగులును మూలమునం దొక సూర్యప్రకాశముయొక్క వికారములే యగుటచే, సూర్యప్రకాశము గూడ నొక విధమగు గతి, లేక, కదలికగనే యున్నదని యిప్పుడు

సూక్ష్మశోధనయందు నిశ్చయింపఁబడినది. "గతి" మూలమునం దొక్కటియే యయినను, ఆ గతిచే కర్ణము శబ్దమును, నేత్రములు రంగును నిశ్చయించు నేని, యీ న్యాయమునే విశేషముగ వ్యాపక మగునట్లు సర్వేంద్రియములకు సంబంధింపఁ జేసినప్పుఁ డేదయిన నొక యవికార్యమగు పదార్థముపై మనుజునియొక్క వేర్వేఱింద్రియ ములు తమంతటు తామే శబ్దరూపా ద్యనేక నామరూపాత్మక గుణముల యొక్క 'అధ్యారోపము' చేసి నానాప్రకారము లగు దృశ్యము లను బుట్టించుచున్నవి. మూలమునం దున్న యొక పదార్థము నందే దృశ్యములగు గుణములు, లేక, నామరూపము లుండవలసిన యవసర మేమియు లే దని సమస్తనామరూపములయొక్క యుత్పత్తి విషయములో సత్కార్యవాదముయొక్క సాయము లేకపోయినను మంచి సమాధానమును జెప్పవచ్చును. మఱియు నీ యర్థమును సిద్ధింపఁ జేయుటకై రజ్జువునందు సర్పముయొక్క, లేక, శుక్తియందు రూప్యముయొక్క భ్రమ యుత్పన్న మగుటయు, లేక, నేత్రములందు చేత్రవేలి నుంచుటచే నొక పదార్థము రెండుగఁ గాన్పించుటయు, లేక, వేర్వేఱగు రంగు గలిగిన యుపనేత్రములను ధరించితి మేని యొక పదార్థమే వేర్వేఱగు రంగులతోఁ గాన్పించుటయు మొదలగు ననేక దృష్టాంతములు వేదాన్తశాస్త్రమునందుఁ జెప్పఁబడినవి.

మనుజుని యింద్రియము లతని నెప్పుడును వదలునవి కావు గావున, జగత్తునందలి నామరూపములు, లేక, గుణములు నెప్పుడును నతనికిఁ గాన్పించునను సంగతి సత్యమే; కాని యింద్రియవంతుఁ డగు పురుషునియొక్క దృష్టిచే జగత్తుయొక్క యే యింద్రియ సాపేక్షమగు స్వరూపము కాన్పించుచున్నదో యదియే యీ జగత్తు నగు మూలమం దుండునది (అనఁగా: నిరపేక్షము నిత్యము నగు స్వరూపము) యని చెప్పుటకు వీలు లేదు. ప్రకృతమునందు మను జున కున్న యింద్రియము లన్నింటికంటె నెక్కువి గాని తగ్గువి కాని

యగు నింద్రియము లుండెనేని, యీ సృష్టి యతనికిఁ గాన్పించు నట్లు కాన్పింపకపోవును. మఱియు నిది నిత్య మగునేని చూచు పురుషులయొక్క యింద్రియాపేక్ష నుంచక, సృష్ట్యారంభమున నున్న తత్త్వముయొక్క నిత్యము నత్యమునగు స్వరూప మెద్దియో చెప్పుమని యెవరయిన నడిగిన, ఆ మూలతత్త్వము నిర్గుణ మగుటచే మనుజునకు నగుణముగఁ గాన్పించుట యతని యింద్రియధర్మముగానే యున్నదని సమాధానము చెప్పవలసి వచ్చును. అధిభౌతికశాస్త్రము నందు కేవల మింద్రియగోచరము లగు విషయములే పరీక్షింపఁ దగినవి యగుటచే నిట్టి ప్రశ్నయే యెప్పుడును కలుగదు; కాని మనుజుఁడును వాని యింద్రియములును నశించిన యెడల పరమేశ్వరుఁడును లేనివాఁడే యగును. లేదా, మనుజున కిది యిట్టిది యని కన్పట్టుటచే నది త్రికాలాబాధితము, నిత్యము, నిరపేక్షమునగు స్వరూపము గానే యుండవలయు నని చెప్పుటకు వీలులేదు. కావున జగదారంభమున నున్న నత్యముయొక్క మూలస్వరూప మేది యను విషయమీమాధ్యాత్మశాస్త్రమునందు విచారించునప్పుడు మనుజునియొక్క యింద్రియముల యపేక్షగల దృష్టిని వదలి కేవల జ్ఞానదృష్టిచే (అనఁగా: శక్య మగునంత బుద్ధి కుశలతచే)ఁ దుదకు విచారింప వలసివచ్చును. అట్లు చేసితిమేని యింద్రియగోచరము లగు సర్వగుణములును స్వయముగ వెలువడిన వనియు బ్రహ్మయొక్క నిత్యస్వరూప మింద్రియాతీత (అనఁగా: నిర్గుణ) మగుటచే నదే యన్నింటిలోను శ్రేష్ఠ మనియు సిద్ధ మగును. నిర్గుణవస్తువుయొక్క వర్ణన నెవఁ డిట్లు చేయును? ఇందువలననే పరబ్రహ్మముయొక్క కడపటి (అనఁగా: నిరపేక్షమును నిత్యమునగు) స్వరూపము కేవల నిర్గుణమే కాక, యనిర్వాచ్యముగనున్న దనియు, నీ నిర్గుణస్వరూపమునందే మనుజునకు నతని యింద్రియములకు మండు సంబంధముచే సగుణమగు దృశ్యవస్తువు కాన్పించుచున్న దనియు నద్వైతవేదాంతమున సిద్ధాంతము చేయఁబడినది.

కాని నిర్గుణమును సగుణముగఁ జేయు నీ శక్తి యింద్రియములకైన నెట్లు వచ్చునని యిచ్చో మఱియొక ప్రశ్న వెలువడును. "మానవజ్ఞానము యొక్క గతి యిచ్చో కుంఠిత మగును గాన నీ యింద్రియములు జ్ఞానశూన్యము లగుటచేత, నిర్గుణపరబ్రహ్మమందు సగుణ జగత్తును, దృశ్య (కన్పట్టునది) మనునది యీ యాత్మ యజ్ఞానము యొక్క పరిణామముగ నున్నది, లేక, యింద్రియము లయినను పరమేశ్వరుని సృష్టియందుఁ గలిగినవే యగుటచే సగుణసృష్టియు (ప్రకృతి), నిర్గుణపరమేశ్వరునియొక్క యేదైన మాయగా నున్నదని మాత్రమే నిశ్చితముగ ననుమానించియే యిచ్చో స్వస్థముగ కూర్చుండవలసి వచ్చును" అని యద్వైతవేదాన్తశాస్త్రమునందు దీనికి సమాధానముఁ జెప్పుదురు (గీ. 7.14). అప్రబుద్ధులగు (అనఁగా: కేవలేంద్రియములచే చూచునట్టి) లోకులకు పరమేశుఁడు వ్యక్తముగను సగుణముగను గాన్పించినను, పరమేశ్వరునియొక్క సత్యమును, శ్రేష్ఠమునగు స్వరూపము నిర్గుణ మగుటచే దానిని జ్ఞానదృష్టిచే తెలిసికొనుటయే జ్ఞానమునొక్క పరమావధి యనునది మొదలుగా గీతలయందు వర్ణింపఁబడిన దానికి ముఖ్యకారణ మిప్పుడు తెలియును. కాని పరమేశ్వరుఁడు మూలమున నిర్గుణుఁడగుటచే నతనియందే మనుజునియొక్క యింద్రియములకు సగుణసృష్టియొక్క వివిధమగు దృశ్యము కన్పట్టు ననునదియు నిటుల నిర్ణయింపఁబడినను, ఈ సిద్ధాంతము 'నిర్గుణ' శబ్దముయొక్క యర్థ మేమి యని తెలిసికొనుటకు మఱికొంత వ్యాఖ్యానముఁ జేయుట యావశ్యకము. "గాలియొక్క తరంగములపై శబ్దరూపాదిగుణములయొక్కయు, లేక, శుక్తియందు రూప్యముయొక్కయు నధ్యారోపము మన యింద్రియములచే చేయఁబడినప్పుడు, గాలియొక్క తరంగములందు శబ్దరూపాదికము గాని, శుక్తియందు రూప్యముయొక్క గుణముగాని లే దను సంగతి యథార్థమే; కాని యధ్యారోపితముల గుణములు దానియందు

లేకపోయినను, వానికంటె నితరములగు గుణములు మూలపదార్థ మున లేనే లే వని చెప్పుటకు వీలు లేదు. కారణ మేమి యనఁగా: శుక్తి యందు రూప్యముయొక్క గుణముకంటె నితరమగు గుణముండు నని మనము ప్రత్యక్షముగఁ జూచుచున్నాము. కాని యింద్రియము లచేఁ దమ యజ్ఞానమూలమున మూలబ్రహ్మమం దారోపింపఁబడిన గుణము లీ బ్రహ్మమందు లే వని చెప్పినను, నితర గుణము లీ బ్రహ్మ మందు లేకపోవుట యెట్లు? మఱియు నుండె నేని యది నిర్గుణమగుట యెట్లు?" అని యొక శంక యిచ్చో నుత్పన్న మగును. మఱియు మిక్కిలి యధికమగు సూక్ష్మదృష్టితో విచారించితి మేని, యింద్రియ ములచే నధ్యారోపితములగు గుణము దక్క మూలబ్రహ్మమునం దితరములగు గుణము లుండు నని యంగీకరించినను నవి మన కెట్లు తెలియును? మనుజునకుఁ దెలియు గుణములన్నియు వాని యింద్రి యముల మూలముననే తెలియును. మఱియు నింద్రియగోచరములు కానివి తెలియనే తెలియ వని తోఁచును.

కావున నింద్రియములచే నధ్యారోపితము లగు గుణములుదక్క పరబ్రహ్మం దే యితర గుణము లుండినను నవి మనకుఁ దెలిసి కొనుటకు శక్యములు కావు; మనకు తెలిసికొనుటకు శక్యముకాని గుణములు పరబ్రహ్మం దున్న వని యనుటయు న్యాయ్యదృష్టిచే యోగ్యము కానేరదు. కావున గుణశబ్దమునకు "మనుజునకుఁ దెలియు గుణములు" అని యర్థము. కావున నీ యర్థమునందు బ్రహ్మము నిర్గుణమే యని వేదాంతులు నిర్ధారణఁ జేయుచున్నారని సారాంశము. మనుజులకు నతర్క్యములగు గుణములు గాని, శక్తులు గాని మూల పరబ్రహ్మ స్వరూపమునందు లే వని యద్వైతవేదాంతులు చెప్పరు. ఇతర వేదాంతులును చెప్పరు. వేయేల? ఇంద్రియములయొక్క పూర్వమునందుఁ జెప్పఁబడిన యజ్ఞానము, లేక, మాయ యనునది యా మూల పరబ్రహ్మముయొక్కయే, యొక యతర్క్యమగు శక్తిగ

నుండవలయు నని వేదాంతులు సైతము చెప్పుచున్నా రని పూర్వము నందే చెప్పబడినది.

త్రిగుణాత్మకమాయ (అనఁగా: ప్రకృతి) స్వతంత్రమగువస్తువు కాదుగాన, నేకవిధము, నేకమునైన నిర్గుణబ్రహ్మమందే మనుజుని యింద్రియము లెప్పుడు నజ్ఞానమూలమున సగుణమగు దృశ్యము నధ్యారోపించుచున్నవి. ఈ మతమునే వివర్తవాద మని చెప్పుచున్నారు. నిర్గుణబ్రహ్మ మొకటియే మూలతత్త్వ మయి యుండఁగా నానావిధమగు సగుణజగత్తు తొలుత నెటుల కలిగె ననుదాని కద్వైత వేదాంతానుసారముగ నీ సమాధానము చెప్పఁబడినది. కాణాద న్యాయశాస్త్రమునం దనంఖ్యములగు పరమాణువులే జగత్తునకు మూలకారణమని సిద్ధాంతీకరింపఁబడినది. కావున నైయాయికు లీ పరమాణువులను నత్యము లందురు. కనుక నీ యనంఖ్యము లగు పరమాణువులయొక్క సంయోగ మగుట ప్రారంభ మగునేని సృష్టి యందలి యనేకపదార్థములు పుట్టుచుండునని వారిచే నిశ్చయింపఁ బడినది. ఈ మతమునందు పరమాణువులకు సంయోగ మారంభ మయిన పిదప సృష్టి నిర్మాణ మగునని చెప్పఁబడుటచే దీనిని 'ఆరంభ వాద' మని చెప్పుదురు. కాని నైయాయికులయొక్క యీ యనంఖ్య పరమాణుకారణమతము నొప్పుకొనక 'ఒక్కటియు, నిత్యమును, త్రిగుణాత్మకము నగు ప్రకృతియె,' జడసృష్టికి మూలకారణముగ నున్న దనియు, ఈ త్రిగుణాత్మక ప్రకృతియం దున్న గుణముల వికానముచేతఁ గాని, పరిణామముచేతఁ గాని వ్యక్తసృష్టి నిర్మితమగు ననియు సాంఖ్యులు చెప్పుదురు. ఈ మతమును గుణపరిణామవాద మని చెప్పుదురు. కారణ మేమి యనఁగా: ఒక మూలమగు సగుణ ప్రకృతియొక్క గుణవికారముచేతనే సర్వవ్యక్తసృష్టియు కలిగిన దని దీనియందు ప్రతిపాదింపఁబడినది; కాని యీ రెండు వాదములను నద్వైతవేదాంత మొప్పుకొనదు. పరమాణువు లనంఖ్యము లగుటచే

నద్వైతమతానుసారముగ జగత్తునకు మూలము కానేరవు. మఱియు ప్రకృతియొక్కటైన నది పురుషునికంటె భిన్నమయినదియు, స్వతంత్ర మయినదియు నను ద్వైతముగూడ నద్వైతసిద్ధాన్తమునకు విరుద్ధ మైనదే; కాని యీ రీతిగ నీ రెండువాదములను వదలితి మేని యొకనిర్గుణ మగు బ్రహ్మస్వరూపమునుండి సగుణసృష్టి యెటులు కలుగు ననుదానికి మఱియొక సమాధాన మేదైనను చెప్పవలసి వచ్చును. కారణ మేమియనఁగా: సత్కార్యవాదానుసారముగ నిర్గుణము నుండి సగుణ ముత్పన్నము కానేరదు. దీనిపై వేదాంతులు సెప్పున దేమనఁగా: సత్కార్యవాదము యొక్క యీ సిద్ధాంతము కార్య కారణములను రెండుపదార్థములును సత్యములగు స్థలమునసే సరి పోవును. మూలపదార్థ మొక్కటియే యగుటచే, దానికేవలదృశ్య రూపము మాఱుచోట నీ న్యాయము సమన్వయింపదు. కారణ మేమి యనఁగా: ఒకపదార్థమే వేర్వేఱు దృశ్యములుగఁ గాన్పించుట యా పదార్థధర్మము కానేరదు. చూచువానియొక్క దృష్టిభేదముచే నీ వేర్వేఱు దృశ్యము లుత్పన్నములు కాఁగల వని తప్పక మనకుఁ దోఁచును. * నిర్గుణబ్రహ్మమునుండి సగుణమగు జగత్తెట్లు వచ్చె ననువిషయమును సైత మీ విధముగనే విచారించితి మేని బ్రహ్మము నిర్గుణమనియు, మనుజునియొక్క యింద్రియముల ధర్మమూలమున దానియందే సగుణమగు దృశ్య ముత్పన్నమగు ననియు చెప్పవలసి వచ్చును. దీనినే వివర్తవాద మందురు. వివర్తవాదమునం దొక్క మూలమగు సత్యద్రవ్యమే యున్నదనియు, దానిపైననే యనేకము లగు ననత్యములగు వానియొక్క (అనఁగా: తప్పకుండ పరిణమించు దృశ్యములయొక్క) యారోప మగు ననియుం జెప్పుదురు. మఱియు గుణపరిణామవాదమున తొలుతనే రెండు సత్యద్రవ్యము

* ఇంగ్లీషుభాషలో నీ యర్థమునే వ్యక్తముఁ జేయవలసి వచ్చినయెడల appearances are the results of subjective conditions viz. the senses of the observer and not of thing in itself.

లున్న వనియు వానిలో నొకదాని గుణములు వికసితము లగుటచే జగత్తున నానా గుణయుక్తములగు నితర వస్తువు లుత్పన్నములగు ననియు నందురు. రజ్జువునందు సర్పభావనయే వివర్తము. నార త్రాడగుటయు, పాలు పెరుగు గగుటయు గుణపరిణామము. ఈ కారణముననే వేదాంతసారగ్రంథముయొక్క యొక ప్రతిలో—

యస్తాత్త్వికో ఽన్యథాభావః పరిణామ ఉదీరితః,
అతాత్త్వికో ఽన్యథాభావో వివర్తః స ఉదీరితః.
(వే. సా. 21)

—ఒకానొక మూలవస్తువునందుండి తాత్త్విక (అనగాఁ: సత్యమే) స్వరూపమగు మఱియొక పదార్థము వెలువడుట (గుణ) పరిణామ మందురు. మూలవస్తువు మిథ్యగనే (అతాత్త్వికముగ) భాసించుట వివర్తమని చెప్పుదురని యీ రెండు వాదలక్షణములు చెప్పఁబడినవి. ఆరంభ వాదము నైయాయికులది. గుణపరిణామవాదము సాంఖ్యులది. వివర్తవాద మద్వైతవేదాంతులది. అద్వైతవేదాంతమునందు పరమాణువులు గాని, ప్రకృతి యనునది గాని సగుణములే గాన నిర్గుణ బ్రహ్మముకంటె వేఱైనవియు, స్వతంత్రము లయినవియు నని యొప్పుకొనరు; కాని యీ సత్కార్యవాదానుసారముగ నిర్గుణమునందుండి సగుణ ముత్పన్న మగుట యశక్య మని యాక్షేపణ వచ్చును గావున నా యాక్షేపణను బరిహరించు నిమిత్తము వివర్తవాదము వెలువడినది. కాని యంతమాత్రముచే గుణపరిణామవాదమును వేదాంతి యెప్పుడు నొప్పుకొనఁడు. ఇఁక ముందొప్పుకొనఁబోఁడు అని యనేకులు పొర పడుచున్నారు. నిర్గుణబ్రహ్మమందుండి సగుణప్రకృతి (అనగాఁ:మాయ) పుట్టుటయే యశక్యమని యద్వైతమతముపై సాంఖ్యులయొక్కయు, లేక, యితరద్వైతులయొక్కయు ముఖ్యమగు నాక్షేపణకు పరిహారము (సరియగు సమాధానము) కానేరదు. ఒక నిర్గుణబ్రహ్మమునందే మాయా వికారములగు ననేక దృశ్యములు మన యింద్రియములకుఁ గాన్పిం

చుటశక్యమని మాత్రమే తెలియఁజేయుట వివర్తవాదమునకు ముఖ్యోద్దేశము. ఈ యుద్దేశము సిద్ధించిన పిదప (అనఁగా: ఒక నిర్గుణ పర బ్రహ్మమందే త్రిగుణాత్మకమగు సగుణ ప్రకృతియొక్క దృశ్యము కాన్పించుట శక్యమని వివర్తవాదముదే సిద్ధమయిన పిదప) నీ ప్రకృతి ముందు విస్తారమగు పరిణామమును బొందినదని యంగీకరించుటకు వేదాంతశాస్త్రముయొక్క యభ్యంతర మేమియు లేదు. 'మూలప్రకృతియే దృశ్యముగ నున్నది, సత్యము కానేరదు' అని మాత్రమే యద్వైత వేదాంతముయొక్క ముఖ్యసిద్ధాంతము. ప్రకృతియొక్క దృశ్యమొక పరి కనఁబడిన పిదప మరల నా దృశ్యమునందుండి పిదప వెలువడు దృశ్యాంతరమును స్వతంత్రమని యొప్పుకొనక, యొక దృశ్యము యొక్క గుణమునందుండి, మఱియొక దృశ్యముయొక్క గుణమును నీ రీతిగ నానాగుణాత్మకములగు దృశ్యములు నుత్పన్నము లగునని చెప్పుట కద్వైతవేదాంతముయొక్క యభ్యంతర మేమియు లేదు. కావుననే 'ప్రకృతియు నా మాయయే' అని గీతలలో (గీ 7.14; 4.6) భగవంతునిచేఁ జెప్పఁబడినను ఈశ్వరాధిష్ఠితమగు (గీ. 9.10) నీ ప్రకృతియొక్క కార్యమగు ప్రపంచమంతయు "గుణా గుణేషు వర్తంతే" (గీ 3.28; 14.23) యను న్యాయముననే యగునని గీతలలోఁ జెప్పఁబడినది. "వివర్తవాదానుసారముగ మూలమగు నిర్గుణపరబ్రహ్మమం దొకప్పుడు మాయావికారమగు దృశ్యముత్పన్నమైన పిదప నీ మాయిక దృశ్యముయొక్క (అనఁగా: ప్రకృతియొక్క) కార్యమగు ప్రపంచము యొక్క యుపపత్తికొఱకు గుణోత్కర్షముయొక్క తత్త్వము గీతలకును మాన్యమయియున్నది" అని యిందువలన స్పష్టమగును. దృశ్యమగు నీ జగత్తే మాయాత్మక మంటిమేని యీ దృశ్యమునం దుండి ఇట్లు రూపాంతరములకు గుణోత్కర్షవంటి నియమ మేమియు నుండ కూడదనియు చెప్పనక్కర లేదు. విశాలమగు మాయాత్మకదృశ్యము సైతము నియమబద్ధమై యున్నదని వేదాంతులొప్పుకొనరు. మూల ప్రకృతివలె నీ నియమములును మాయికములుగనే యున్న వనియు,

పరమేశ్వరుఁ డీ సర్వమాయిక విషయములకు నధిపతి యనియు, వానికంటె పరమునం దుండువాఁడగుటచే నాతని నత్తచేతనే నీ నియమములకు నిత్యత్వము ప్రాప్తమయిన దనియు, త్రికాలాబాధితమగు నియమమును కల్పించు సామర్థ్యము దృశ్యరూపమగు సగుణము కావుననే, వినాశియగు ప్రకృతియం దుండుటకు వీలు లేదనియు మాత్రమే వేదాంతులు సెప్పుదురు.

పూర్వోక్తమగు వివేచనచే జగత్, జీవ, పరమేశ్వరులు, లేక, యధ్యాత్మశాస్త్రపరిభాషానుసారముగ మాయ, (అనఁగా: మాయచే నుత్పన్నమైన జగత్తు), ఆత్మ, పరబ్రహ్మము నను నీ మూఁటియొక్క స్వరూపమును. వీనికిఁ గల పరస్పర సంబంధమును దెలియును. అధ్యాత్మదృష్టిచే, 'నామరూపములును' వాని మునుఁగు క్రింద నున్న 'నిత్యత్వము', అని జగత్తునందు సర్వపదార్థములును రెండు వర్గములుగ నున్నవి. వీనిలో నామరూపములనే సగుణమాయ, లేక, ప్రకృతి యని చెప్పుచున్నారు. కాని, నామరూపములను దూరముగ నుంచితిమేని మిగిలిన 'నిత్యద్రవ్యమే' నిర్గుణముగ నుండవలయును. కారణమేమి యన: గుణమయినను నామరూపములు లేకయుండుటకు వీలు లేదు. ఇది నిత్యమును, నవ్యక్తమునగు తత్త్వమంటి మేని పరబ్రహ్మమే యగును. మఱియు మనుజుని దుర్బలేంద్రియముల కీ నిర్గుణ పరబ్రహ్మము నందుండి సగుణమాయ యుద్భవిల్లుచున్నట్లు కాన్పించుచున్నది. ఈ మాయ సత్యపదార్థము కానేరదు. పరబ్రహ్మము మాత్రమే సత్యము (అనఁగా: త్రికాలాబాధితము. మఱియు ఎప్పుడును పరిణామమును బొందని పదార్థము). దృశ్యసృష్టి సంబంధమైన నామరూపములయొక్క సిద్ధాంతమును గుఱించియు, వానిచే నాచ్ఛాదింపఁబడిన పరబ్రహ్మముయొక్క స్వరూపమును గుఱించియు నీ సిద్ధాంతము సెప్పఁబడినది. ఇప్పుడు మనుజుని స్వరూపమును న్యాయ్యముగ విచారించితి మేని, మనుజుని దేహేంద్రియములను

నవి దృశ్యసృష్టి యందున్న యితర పదార్థములవలె నామరూపా త్మకము (అనఁగా: ననిత్యమగు మాయయొక్క కోటియందుండునవి) లగుట వలన నీ దేహేంద్రియములచే నాచ్ఛాదింపఁబడిన యాత్మ నిత్యస్వరూపమగు పరబ్రహ్మయొక్క కోటిలోని దయినది. లేక, బ్రహ్మము నాత్మయు నొకటే యని సిద్ధమగుచున్నది. బాహ్యసృష్టి నీ హేతువుచే స్వతంత్రము సత్యము నగు పదార్థమని యంగీకరింపని యద్వైతుల సిద్ధాంతమందును, బౌద్ధుల సిద్ధాంతమందును నున్న భేదము చదువరులకుఁ దెలిసియే యుండును. మఱియు వేదాంతశాస్త్ర జ్ఞులు, బాహ్యసృష్టి నిత్యమును, మాయనట్టి నామరూపములవలెనే యనిత్యమును అని చెప్పి, యా బాహ్యసృష్టి యందును, మనుజుని దేహమునందు సైత మొక యాత్మస్వరూపమగు ద్రవ్యమే నిండి యున్నదనియు, ఈయొక యాత్మతత్త్వమే తుదకు సత్యముగ నిలుచు ననియు సిద్ధాంతీకరించుచున్నారు. అటులే సాంఖ్యులను 'అవిభక్తం విభక్తేషు' అను న్యాయమున సృజింపఁబడిన పదార్థమునందలి నానాత్వమునొక్కయేకీకరణము జడప్రకృతి పర్యంతమే స్వీకరించు చున్నారు; కాని వేదాంతులు నత్కార్యవాదులు సేయు నాక్షేపమును దొఱఁగించి 'ఏది పిండమందున్నదో యదియే బ్రహ్మాండమందున్న' దని నిశ్చయించి సాంఖ్యులయొక్క యసంఖ్యపురుషులకును వారి ప్రకృతికిని నొక పరమాత్మయందే యిప్పు డద్వైతముగ, లేక, యవి భాగముగ సమావేశము నొప్పుకొనిరి. శుద్ధాధిభౌతికపండితుఁడగు 'హెకెల్' అనువాఁడును, అద్వైతియే యనునది సత్యమే; కాని యతఁ డొక జడప్రకృతియందే చైతన్యమును సైతము సంగ్రహించుచున్నాఁడు. మఱియు వేదాంతము, జడవస్తువులకు ప్రాధాన్యమునీయక దిక్కాలములదే ననవచ్ఛిన్నము, నమృతము, స్వతంత్రమునగు చిద్రూపపరబ్రహ్మమే సర్వసృష్టికి మూలముగ నున్నదని స్థిరముచేయు చున్నది. ఈ 'హెకెల్' యొక్క జడాద్వైతమునకును, అధ్యాత్మ

శాస్త్రమునందున్న యద్వైతమునకును నడుమ నత్యంతభేద మున్నది. అద్వైతవేదాంతముయొక్క యీ సిద్ధాంతమే గీతలయందుఁ జెప్పఁ బడియున్నది. కావున నొక ప్రాచీన కవీశ్వరుఁడు—

శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః,
బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః.

— కోటిగ్రంథముల సారము నర్ధశ్లోకమునఁ జెప్పుచున్నాను— (1) బ్రహ్మ సత్యము, (2) జగత్తు (అనఁగా: జగత్తునందలి సర్వనామ రూపములును) మిథ్యాభూతములు లేక, నశ్వరములు. మఱియు, (3) మనుజునియొక్క యాత్మయు బ్రహ్మమును మూలమున నొకటి గనే యున్నవి, వేర్వేఱు కావు అని అద్వైతవేదాంత సారమును వర్ణించెను. ఈ శ్లోకమునందలి 'మిథ్యా' శబ్దము బాగుగ లే దనుకొను వారు 'బ్రహ్మామృతం జగ త్సత్యం' అని బృహదారణ్యకోపనిషత్తు నందున్న టుల మూఁడవచరణమునకు సంతోషముగ పాఠాంతరమును జేయవలసివచ్చును. దాని వాచ్యార్థము మాఱుదని పూర్వముననే చెప్పఁబడినది. అయినను దృశ్యమగు సర్వజగత్తును, అదృశ్యము, నిత్యము, మూలతత్త్వమునగు బ్రహ్మమును, నత్తు(సత్యము) అనవల యునా? లేక, అసత్తు (అసత్య=అనృతము) అనవలయునా? యను విషయమై యనేకులగు వేదాంతులు వ్యర్థముగ విశేషవాదమును జేయుచుందురు. కావున నీ వాదములయందున్న సత్యమగు బీజ మేమి? యను దాని నిచ్చో కొంత వ్యాఖ్యానముఁ జేయుచున్నాఁడను. 'సత్' (సత్యము) అను నొక శబ్దముచేతనే వేర్వేఱగు రెండర్థములుస్ఫురించుటచే నీ వాద మారంభ మాయెను. మఱియు 'సత్' అను శబ్దమును ప్రతిమనుజుఁడు నే యర్థమున ప్రయోగించునో యా వైపునకు కొంతదృష్టిని బఱపితిమేని యేమియు వివాదముండనేరదు. కారణ మేమి యన: బ్రహ్మ మదృశ్యమైనను నిత్యము, మఱియు

నామరూపాత్మకమగు జగత్తు దృశ్యమైనను క్షణక్షణమునకు మాఱునది యను నీ భేద మందఱకు నొక రూపముగనే యొప్పుకొనఁదగినదిగ నున్నది. 'సత్' అనునట్టియు 'సత్య' అనునట్టియు శబ్దములు (1) క్రమముగా నేత్రములకు ప్రకృతము స్పష్టముగాఁ గాన్పించు నది, యనఁగాఁ: వ్యక్తము (కాని రేపు దాని దృశ్యస్వరూపము మాఱి నను నరే లేకపోయినను నరే), అని వ్యావహారికార్థము కలవిగను, (2) నేత్రమున కగపడనిది(అనఁగాఁ: అవ్యక్తము) ఐనను దేనియొక్క స్వరూప మెల్లప్పు డేకరీతిగ నున్నదో, యెప్పుడును మాఱదో యట్టిది అని మఱియొక యర్థముఁ కలవిగను నున్నవి. వీనిలో మొదటి యర్థము నిచ్చగించువారు, నేత్రములకుఁ గాన్పించు నామరూపాత్మక మగు జగత్తు నత్య మనియు, పరబ్రహ్మము దానికి విరుద్ధము (అనఁగాఁ: నేత్రములకుఁ గనఁబడనిది కావుననే అనత్తు, లేక, యసత్యము) అనియు చెప్పుచున్నారు. ఉదాహరణము: తైత్తిరీయోపనిషత్తునందు దృశ్యసృష్టికి 'సత్' అనియు, దానికంటె పరమందున్న దానికి 'త్యత్' (అది) అనియు (అనఁగాఁ: పరమం దున్నది), లేక, యసత్యము (కంటికి నగపడనిది) అనియు; 'సత్', 'త్యత్' శబ్దము లను ప్రయోగించి మూలారంభమందుఁ గల బ్రహ్మమును ద్రవ్యమే "స చ త్యచ్చా భవత్, నిరుక్తం చానిరుక్తం చ, నిలయనం చా నిలయనం చ, విజ్ఞానం చావిజ్ఞానం చ, సత్యం చానృతం చ" (తై. 2.6) వత్తు (కంటియెదుట) మఱియు అది (పరమందున్నది), వాచ్యము అనిర్వాచ్యమును, సాధారమును నిరాధారమును, జ్ఞాతము అవిజ్ఞాతమును (అజ్ఞేయము), సత్యము అనృతము- అని రెండు విధములుగ నైనదని తైత్తిరీయమునఁ జెప్పఁబడెను; కాని యిట్లు బ్రహ్మ మనృత మనినను, అనృత మనఁగా, అబద్ధమని కాని యపత్యమని కాని యర్థము కానేరదు. కావున తైత్తిరీయోపనిషత్తు లోనే పిదప "ఈ యనృతమగు బ్రహ్మము జగత్తునకు 'ప్రతిష్ఠ'

(అనఁగా: ఆధారము) యై యున్నది. మఱియొక యాధారము యొక్క యపేక్ష లేదు. దాని నెఱింగినవాఁ డభయమును బొందు" నని చెప్పఁబడినది. దీనివలన శబ్దభేదముచే వాచ్యార్థము మాఱలే దనుమాట స్పష్టముగఁ గాన్పించుచున్నది. అటులె తుదకు "అనద్వా ఇద మగ్ర ఆసీత్" — ఈ సమస్తమైన జగత్తును మొదట అసత్తు (బ్రహ్మము) గనే యుండెను అని యున్నది. మఱియు ఋగ్వేద ములో (10. 129 4) చెప్పినట్లు దానియందుండి పిదప 'సత్' (అనఁగా: నామరూపాత్మకమును వ్యక్తము నైన జగత్తు) వెలువడిన దని చెప్పఁబడెను (తై. 2.7). దీనివలన 'అసత్' అను శబ్దమిక్కడ 'అవ్యక్తము' (అనఁగా: కంటికి నగపడనిది) అను నర్థముననే ప్రయోగింపఁబడినట్లు స్పష్టముగఁ గాన్పించుచున్నది. వేదాంత సూత్రములయందు బాదరాయణాచార్యులవారు పూర్వోక్తము లగు వచనములకు నిటులె యర్థము చేసినారు (వే.సూ. 2.1.17); కాని, 'సత్', 'సత్య' శబ్దములకు, కంటికి నగపడనిది యయినను ఎల్లప్పుడు నుండునది, లేక, నిలువఁబడునది (అనఁగా: పూర్వమున వ్రాయఁబడిన రెండర్థములలో రెండవది) యను నర్థము నిచ్చగించు వారు అదృశ్యమైనను ఎప్పుడును మాఱని బ్రహ్మమే 'సత్' లేక, సత్యము అని యందురు. కావున నామరూపాత్మకమగు మాయను 'అసత్' అనఁగా, అసత్యము వినాశి యని తాత్పర్యము అని చెప్పు చున్నారు. ఉదాహరణము— "నదేవ సోమ్యేద మగ్ర ఆసీత్ కథ మసతః న జ్ఞాయేత"— ఓ నాయనా! సర్వజగత్తును తొలుత సత్తు (బ్రహ్మము)గ నున్నది; ఏది అసత్తో, (అనఁగా: లేకుండునదియో,) దానియందుండి సత్తు (అనఁగా: ఉండునది) యెటు లుత్పన్న మగును అని ఛాందోగ్యములోఁ జెప్పఁబడినది (ఛాం. 6.2 1.2). అయినను ఛాందోగ్యోపనిషత్తునందే యొకచోట నీ పరబ్రహ్మ మవ్యక్తమను

నర్థమున 'అసత్' అని పేర్కొనఁబడినది (ఛాం. 3.19.1).* ఒక పరబ్రహ్మము నుద్దేశించియే వేర్వేఱు సమయములందును, వేర్వేఱగు నర్థములందును నొకపరి 'సత్' అనియు, నొకపరి 'అసత్' అనియు పరస్పరవిరుద్ధములగు పేర్లు పెట్టుటయను (అనఁగా: వాచ్యార్థ మొక్కటియె యైనను శబ్దములను మార్చుటలో మాత్రము సాహాయ్యము చేయు) పద్ధతి పిదప పోయి, తుదకు బ్రహ్మము 'సత్', లేక, 'సత్యము' (అనఁగా: ఎప్పుడు నుండునది), దృశ్య సృష్టి 'అసత్తు' (అనఁగా: నశ్వరము) అని మాత్రమె యొకపరిభాష స్థిరమైనది. భగవద్గీతయం దీ చివరపరిభాష స్వీకరింపఁబడియున్నది. దీని ననుసరించియే రెండవయధ్యాయములో (గీ. 2.16.18) పర బ్రహ్మము 'సత్తు' అనియు, 'అవినాశి' యనియు, నామరూపములు 'అసత్తు' (అనఁగా: నశ్వరములు) అనియుఁ జెప్పఁబడినవి. మఱియు వేదాంతసూత్రముల సిద్ధాంతము సైత మిటులే యున్నది. అయినను దృశ్యసృష్టిని 'సత్' అనియు, పరబ్రహ్మమును 'అసత్' లేక, 'త్యత్' (అది_పరమందున్నది) అనియు జెప్పునట్టి తైత్తిరీయో పనిషత్తునం దున్న ప్రాచీన పరిభాషయొక్క యాకారము నేటికిని బొత్తిగ నశింపలేదు. గీతలలో 'ఓం__తత్__సత్' అని యే పర బ్రహ్మ నిర్దేశముఁ జేయఁబడెనో దానికి మూలార్థ మేమయినదియు నీ ప్రాచీనపరిభాషచే బాగుగ స్పష్టపడును. 'ఓం' అనునది గూఢాక్షరరూపమగు వైదికమంత్రము. ఇది యుపనిషత్తులలో ననేకరీతులుగ

---

* అధ్యాత్మశాస్త్రవిషయము అంగ్లేయ గ్రంథకర్తల యందును Real అనఁగా: 'సత్' అను శబ్దమా, జగత్తత్త్వమ దృశ్యమునకు (మాయకు) వర్తించునా: లేక, వస్తుతత్త్వమునకు (బ్రహ్మమునకు) వర్తించునా: అను విషయమున మత భేదము కలదు. కాంటు దృశ్యమును సత్తు (Real) అనుకొని వస్తుతత్త్వమును అవినాశి యని చెప్పుచున్నాడు. కాని, హెగెల్, గ్రీన్, మొదలగువారు, దృశ్యమును 'అసత్' (unreal) అనుకొని వస్తుతత్త్వమును 'సత్' (Real) అని చెప్పుచున్నారు.

వ్యాఖ్యానము చేయఁబడినది (ప్రశ్న. 5; మాం. 8.12; ఛాం. 1.1). 'తత్' అనఁగా, అది; లేక, దృశ్యసృష్టికంటె దూరమం దున్న యనిర్వాచ్యతత్త్వము, అనియు, మఱియు 'సత్' అనఁగా, కంటి యెదుట నున్న దృశ్యసృష్టి సమస్తము బ్రహ్మముగనే యున్నదనియు నీ సంకల్పమునకు నర్థము. మఱియు నా యర్థముననే "నద సచ్చాహ మర్జున". 'సత్' (అనఁగా: పరబ్రహ్మము) 'అసత్' (అనఁగా: దృశ్యసృష్టి), అను రెండును నే నే" (గీ. 9.19) యని భగవంతుఁడు గీతలలోఁ జెప్పినాఁడు. అయినను గీతలతో కర్మయోగము ప్రతిపాద్య మగుటచే ప్రసంగానుసారముగ 'ఓం తత్సత్' అనుదాని యందున్న 'సత్' అను శబ్దము యొక్క యర్థము లౌకికదృష్టిచే మంచిది (అనఁగా: సద్బుద్ధిచేఁ జేయఁబడినది, లేక, దేనియొక్క ఫలము మంచిది యగునో యా కర్మ) అని యర్థము. తత్=దీనికి పరమం దున్న, లేక, ఫలాశను వదలిచేయఁబడిన కర్మ యని యర్థము చేసికొని యీ బ్రహ్మనిర్దేశముచే సైతము కర్మయోగమునకుఁ బూర్ణ మగు సమర్థన మగునని యేడవయధ్యాయములో కడపటఁ జెప్పఁ బడినది. సంకల్పమునం దేది 'సత్' అని చెప్పఁబడినదో యది దృశ్య సృష్టి (అనఁగా: కర్మ) యే యగుటచే (ముందు ప్రకరణము చూడుము) ఈ బ్రహ్మనిర్దేశమున కా కర్మపరమగు నర్థము మూల భూతమగు నర్థమునం దుండియే సహజముగ నిష్పన్న మగును. ఓం తత్సత్, నేతి నేతి, సచ్చిదానంద, సత్యస్య సత్యం, అనునవియే కాక యింకను కొన్ని బ్రహ్మనిర్దేశము లుపనిషత్తులలోఁ జేయఁబడినవి; కాని గీతార్థము తెలిసికొనుటకు వానియుపయోగము లేకపోవుటచే నవి యిచ్చోఁ జెప్పఁబడవు.

జగత్తు; జీవుఁడు పరమేశ్వరుఁడు (పరమాత్మ) నను వీరికి పర స్పరసంబంధ మితీరున నిశ్చిత మయిన పిదప "జీవము నాయంశము గనే యున్నది" (గీ.15.7) అనియు, "నేనే యొక యంశముచే నర్వ

జగత్తును వ్యాపించి యున్నాను" (గీ. 10. 42) అని భగవంతుఁడు గీతలయందును, బాదరాయణాచార్యులు వేదాంతసూత్రములలోను, చెప్పినదానియందు (వే.సూ. 2.3.43; 4.4.19), లేక, "పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాద స్యామృతం దివి"-స్థావరజంగమములం దెల్ల వ్యాపించియుండు జగదాత్మ దశాంగుళ ప్రమాణుఁడు అని పురుష సూక్తమునందు నుండు 'పాద', లేక, అంశ, అను పదములకు నేమి యర్థమైనది సహజముగ నిర్ణీత మగుచున్నది. పరమేశ్వరుఁడు, లేక, పరమాత్మ సర్వవ్యాపియైనను, నిరవయవుఁడును, ఒక్కఁడును, నామరూపవిరహితుఁడును కావుననే, భేదించుటకు సాధ్యము కాని వాఁడు (అచ్ఛేద్యుఁడు), వికారమును బొందనివాఁడు (అవికార్యుఁడు) నగుటచే నతఁడు వేర్వేఱగు విభాగము లగుటకు (అనఁగాఁ చిన్న చిన్న ముక్కలుగ నగుటకు) వీలులేదు (గీ. 2.25). కావున నలు గడలను నిండియున్న యీ యొక విధమయిన పరబ్రహ్మము యొక్కయు, మనుజశరీరమం దున్నయాత్మయొక్కయు భేదమును జూపుటకు శారీరాత్మ యను నతఁడు పరబ్రహ్మముయొక్క యంశ మని వ్యవహారములోఁ జెప్పవలసివచ్చినను, 'అంశ-భాగ' శబ్దము లకు, 'కోయఁబడిన (అనఁగాఁ వేఱయిన) ముక్క', లేక, 'దాడిమ ఫలముయొక్క యనేక బీజములలో నొక బీజము', అని యర్థముఁ జేయక, "గృహమం దున్నయాకాశము, ఘటమం దున్నయాకాశము (మఠాకాశ-ఘటాకాశములు) ననున వెట్లు సర్వవ్యాపక మగు నొక యాకాశముయొక్క భాగములుగానే యున్నవో యటులే యాత్మ యను నతఁడు పరమాత్మకు భాగముగ నున్నాఁడు" అని తాత్త్విక దృష్టితో దానికి నర్థముఁ జేయవలయును. (అమృతబిందూపనిషత్తును 18 చూడుము). సాంఖ్యుల 'ప్రకృతియు,' హెకెల్ యొక్క యాధి భౌతికజడాద్వైతమునందుఁ జెప్పఁబడిన యేక విధతత్త్వమును, అను వీ రెండును నీ తీరుననే సత్యము నిర్గుణమునగు పరమాత్మయొక్కయే సగుణమగు (అనఁగాఁ పరిచ్ఛిన్న మైన) నంశములుగ నున్నవి.

వేయేల? ఆధిభౌతికశాస్త్రముయొక్క పద్ధతిచే నే వేవి వ్యక్తము, లేక, యవ్యక్తమునగు మూలతత్త్వముగ (కాని, యది యాకాశమువలె నెంత వ్యాపక మయినను సరే) నున్నవో యవి యన్నియు సర్వ స్థలములచేతను, సర్వకాలములచేతను, పరిచ్ఛిన్నము లయిన నామ రూపములు కావుననే నశ్వరములుగ నున్నవి. అవి యున్నంత వఱకును (అనఁగా: ఆ నామరూపము లెంతవఱకు వ్యాపించునో యంతవఱకును) బ్రహ్మము వానిచే నాచ్ఛాదింపఁబడు ననునది సత్యమే కాని, పరబ్రహ్మము వానిచేఁ బరిచ్ఛిన్నము గాక వాని యన్నింటియందు నోతప్రోతముగ (పడుగుపేకలుగ) నిండియుండు టచే నదిగాక నింక వెలుపట నెంత మిగిలియుండెనో తెలియదు. పరమేశ్వరునియొక్క వ్యాప్తి యీ దృశ్యసృష్టిని మించి యెంత యున్నదియో చూపుటకు, దశాంగుల, త్రిపాచ్ఛబ్దములు పురుష సూక్తములోఁ బ్రయోగింపఁబడినను, వానికి ననంత మని యర్థము వివక్షితముగ నున్నది. కారణ మేమియన: యథార్థముగఁ జూచితి మేని, దేశకాలములు, తూనికలు, కొల్తలు, లేక, సంఖ్యయు ననునవియు నామరూపముల భేదములే; మఱియు పరబ్రహ్మ మీ సమస్త నామరూపములకంటె పరముగనే యున్నదని పూర్వమునందుఁ జూపఁబడియే యున్నది. ఈ కారణముననే నామరూపాత్మకమగు నే కాలముచే సర్వము గ్రహింపఁబడినదో యా కాలమును సైతము గ్రసించునది, లేక, పాకము చేయునదియగు తత్త్వ మేది కలదో యదియే పరబ్రహ్మ మని యుపనిషత్తులలో వర్ణింపఁబడినది (మై. 6. 15). మఱియు "న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకఃl" — పరమేశ్వరునియొక్క స్థానమును ప్రకాశింపఁజేయుటకు సూర్య చంద్రాగ్నులవలెఁ బ్రకాశముగల సాధనము లెవ్వియును లేవు గాన నది స్వయంప్రకాశముగనే యున్నది. ఈ మొదలగు వర్ణనలు గీతలలోను, ఉపనిషత్తులలోను (గీ. 15.6, కఠ. వ.15; శ్వే. 6.14) ఉన్నవిs వానికిని నిదియే తాత్పర్యము. సూర్యచంద్రులు, నక్షత్రములు నను

నివి యన్నియు నామరూపాత్మకము లయిన వినాశిపదార్థములుగ నున్నవి. ఏ దేవుని "జ్యోతిషాం జ్యోతిః"- తేజస్సునకు తేజస్సు (కే. 13.17; బృ. 4.4.16) అని చెప్పుచున్నారో యా స్వయంప్రకాశమును జ్ఞానమయమునగు నట్టి బ్రహ్మము, ఈ సర్వమునకును పరముగను ననంతముగను నిండియుండుటచే దానికి నితరములగు ప్రకాశింపఁజేయు పదార్థములయొక్క యపేక్ష లేకపోవుటయే కాక, సూర్యచంద్రాదులకు సైత మున్నప్రకాశ మీ స్వయంప్రకాశమగు బ్రహ్మమం దుండియే వచ్చుచున్న దని యుపనిషత్తులలో స్పష్టముగఁ జెప్పఁబడినది (ముం. 2.2.10). అధిభౌతికశాస్త్రముయొక్క యుక్తిచే నింద్రియగోచర మగునదియు, నతిసూక్ష్మముగఁ గాని, లేక, యత్యంతదూరమునఁ గాని యున్నపదార్థమును విచారించిన, నది సర్వము దిక్కాలాదినియమములయొక్క నిబంధనమునకు లోఁబడిన నామరూపాత్మకమగు జగత్తుగ నున్నది. నత్యమగు పరమేశ్వరుఁడు దానియందుండియు, దానికంటె భిన్నుఁడును, దానికంటె విశేష వ్యాపకుఁడును, నొక్కఁడును నామరూపమయమగు పాశముచే బంధింపఁబడని జ్ఞాఁడును కావుననే, స్వతంత్రుఁడగుటచే, కేవల నామరూపములయొక్క విచారణ మాత్రమే చేయు నాధిభౌతిక శాస్త్రముయొక్క యుక్తులఁగాని, లేక, సాధనములు గాని, యిప్పటి కంటె శతగుణములు సూక్ష్మములుగను, ఫలవ్యములుగను వృద్ధిఁ బొందినను, జగత్తుయొక్క మూలమగు 'అమృతత్వము' యొక్క జాడ వానిచేఁ దెలిసికొనుటకు సాధ్యము కాదు. ఆ యవినాశియు నవికార్యమునగు నమృతతత్త్వ మధ్యాత్మముయొక్క జ్ఞానముచేతనే తుదకుఁ దెలిసికొనఁబడవలయును.

ఇంతదనుక నధ్యాత్మశాస్త్రమునందలి మిక్కిలి ముఖ్యములగు సిద్ధాన్తములును, వానికి శాస్త్రీయరీతిగను సంక్షిప్తముగనున్న యుపపత్తులును జెప్పఁబడినవి. వీనివలన పరమేశ్వరునియొక్క నామరూపా

త్మకమగు సర్వవిధ వ్యక్తస్వరూపము మాయికము ననిత్యము ననియు దానికంటె నవ్యక్తరూప మేల శ్రేష్ఠ మనియు, దానియందును నిర్గుణ మేల (అనఁగా: నామరూపశూన్య మైనది) శ్రేష్ఠమైనది యనియు, నిర్గుణమే యజ్ఞానముచే సగుణముగ భాసించుచున్నదని గీతలలో నేల చెప్పఁబడనిదియు, మొదలగు ప్రశ్నలకు సమాధానము బాగుగఁ దెలియును. కాని యీ సిద్ధాంతము శబ్దములలోఁ గుదిగ్రుచ్చుట యను పని ప్రతిపాదించుట) యదృష్టమువలన కించిత్ జ్ఞానముగల నావంటి యే మనుజుఁడైనను జేయగలఁడు. దానియం దేమియును విశేషము లేదు. ఈ సిద్ధాంతము దెలిసిన పిదప మనస్సున బింబాకృతిం జెంది హృదయమునందు నాటుకొని, యెమ్ముకలందును మాంసమునందును బ్రవేశించి, సర్వప్రాణులయందును నొక పరబ్రహ్మముయొక్క స్వరూపమే నిండియున్నదని తెలిసికొనుటకును, ఆ పరబ్రహ్మము యొక్క భావనతోడనే యాపత్కాలమున సైతము సర్వవిషయముల యందును సమత్వముతో నుండుటకు వీలైన దేహస్వభావము గలుగుటకును, అనేక జన్మములనుండి యార్జింపఁబడిన సంస్కారము, ఇంద్రియనిగ్రహము, దీక్షోద్యోగము, ధ్యానము, నుపాసనయు ననువానియొక్క యావశ్యకత యుండును. కాని యీ యన్నింటియొక్క సాహాయ్యముచే "సర్వభూతములయందును నొక్కటియే యాత్మకల" దను నీ తత్త్వము సంకట సమయమం దయినను ఎవనికి తన ప్రతి కార్యమునందును సహజముగ గోచరించుచున్నదో, యాతనికే బ్రహ్మజ్ఞానముయొక్క సత్యమగు పరిపాక మైన దనియు, నతనికే మోక్షము లభించిన దనియు గీతలలో నున్నది (గీ. 5. 18-20; 6. 21-22). ఇది పూర్వోక్తమగు సర్వసిద్ధాంతముల సారభూతమును, శిరోమణీభూతమునగు నధ్యాత్మశాస్త్రముయొక్క కడపటి సిద్ధాన్తము. ఈ యాచరణ మెవనియందుఁ గన్పట్టునో యతఁడు సంపూర్ణుఁడు కాలే దనియు, నతని మనస్సు ఇప్పటికిని బ్రహ్మాగ్నిహోత్రమునందు బాగుగ పక్వము కాలే దనియుఁ దెలిసికొనవలయును. నిజమగు సాధువునకును.

కేవల వేదాంతశాస్త్రజ్ఞానకు నుండు భేద మిద్దియ. మఱియు నీ యభి ప్రాయముచేతచే గీతలయందు జ్ఞానలక్షణమును జెప్పుచు "జ్ఞాన మనఁగా, బాహ్యసృష్ట్యారంభమున నున్న పదార్థము బుద్ధికి కేవలము తెలియుటయే" యని వ్యాఖ్యానముఁ జేయక "అమానిత్వము, శాంతి, ఆత్మనిగ్రహము, సమబుద్ధి మొదలగు నుదాత్తమనోవృత్తులు విజృం భించుటచే నెవని చిత్తముయొక్క పూర్ణశుద్ధి యాచరణలో నెల్ల ప్పుడును వ్యక్తమగునో యతఁడే సత్యమగు జ్ఞానిగ నున్నాఁడు" అని చెప్పఁబడి నది (గీ. 13. 7-11). జ్ఞానముచే వ్యవసాయాత్మక మగు నెవని బుద్ధి యాత్మ నిష్ఠమైనదో (అనఁగా: ఆత్మానాత్మ విచారమునందు స్థిరమగు టచే నెవని మనస్సునకు సర్వభూతాత్మైక్యజ్ఞానము కలిగినదో) యా పురుషుని వాసనాత్మకబుద్ధియు శుద్ధముగనే యుండవలయు నను విష యమునందు శంక యేమియు లేదు; కాని యెవనిబుద్ధి యెటులున్నదో తెలిసికొనుటకు వాని యాచరణ తప్ప, నితరము లగు బాహ్యసాధ నము లేమియు లేవు గాన, జ్ఞాన సమబుద్ధిశబ్దములలోనే శుద్ధ (వ్యవ సాయాత్మక) బుద్ధియు, శుద్ధవాసనయు (లేక, వాసనాత్మకబుద్ధియు) శుద్ధాచరణము నను నీ మూఁడు శుద్ధవిషయములయొక్కయు సమా వేశము చేయఁబడుననియు, విశేషముగ పుస్తకజ్ఞానమును మాత్రమే విస్తరింపఁజేయు (అనఁగా: అనుభవజ్ఞానము లేని) నే కాలమున నీ విషయమును బాగుగ గుర్తుంచుకొనవలయును. బ్రహ్మవిషయమై శుష్క మగు వాక్పాండిత్యమును జూపువారును, విని 'వహ్వా, వహ్వా' యని తలలూపువారును నాటకశాలలో నున్న సభాసదులవలె 'మరల నదే చెప్పు'మను వారును ననేకులు గలరు (గీ. 2.29; కఠ. 2.7). కాని పూర్వమునందుఁ జెప్పఁబడినటుల నెవఁ డంతర్బాహ్యశుద్ధుఁడు (అనఁ గా: సౌమ్యశీలుఁడు) అగునో వాఁడే సత్యమగు నాత్మనిష్ఠుఁడు, వానికే ముక్తి లభించును. కేవల పండితులకు లభింపదు. వాఁ డెంత బుద్ధి మంతుఁ డైనను నెంత బహుశ్రుతుఁ డైనను లాభములేదు. "నాయ మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా బహునా శ్రుతేన"-అని యుప

నిషత్తులలో స్పష్టముగనే చెప్పఁబడియున్నది (కఠ. 2.22; ముం.3 2.8) కావుననే "ధూలాసి పండిత పురాణసాంగసీ, పరితూఁ సేణసీ మీఁ హేఁ కోణ"- పండితుఁడ వగుదు వేని పురాణముఁ జెప్పుదువు. కాని నీ వెవఁడవో తెలిసికొనలేవు అని తుకారామబువాగారు సైతము వచించిరి (గా. 2599). నాయొక్క జ్ఞాన మెంత యల్పమో చూడుము. 'ముక్తి లభించును' అను మాట సహజముగనే నా నోటినుండి వెలువడు చున్నది' అని యనుటకు నాత్మకంటె ముక్తి వేఱుగ నున్నదని యభి ప్రాయమా ఏమి? బ్రహ్మము-ఆత్మయు ననునవి యొకటిగనే యున్నవి యను జ్ఞానోత్పత్తికి పూర్వము ద్రష్టకును, దృశ్యమగు జగత్తునకును భేద ముండెను. కాని బ్రహ్మాత్మైక్యజ్ఞానము పూర్ణముగ కలిగిన పిదప నాత్మ బ్రహ్మమందుఁ గలిసిపోవుటచే బ్రహ్మజ్ఞాని కూర్చున్న చోటనే తానే బ్రహ్మస్వరూపుఁ డగుచున్నాఁ డనియు, ఈ యాధ్యాత్మికావస్థనే 'బ్రహ్మనిర్వాణ', మనియు 'మోక్ష' మనియుం జెప్పుదురు. కావున వాఁ డేమియు నెవరికి నీయనక్కఱ లేదు. ఎక్కడనుండియు మఱి యొక పదార్థము రా నక్కఱలేదు. దీనికొఱకు మఱియొక లోకము లోనికి వెళ్ళవలసిన నిమిత్తము లేదు అని మన యధ్యాత్మశాస్త్రముచే నిశ్చయింపఁ బడినది. పూర్ణముగ నాత్మజ్ఞాన మెప్పు డెక్కడ కలుగునో యా క్షణమునందే యా స్థలమునందేమోక్ష మున్నది. కారణ మేమి యన: మోక్ష మనునది యాత్మయొక్క మూలభూతమునకు శుద్ధావస్థగ నున్నది. వేఱగు స్వతంత్రవస్తువు గాని, స్థలము గాని కానేరదు.

మోక్షస్య న హి వాసోఽస్తి న గ్రామాంతర మేవ వా,
అజ్ఞానహృదయ గ్రంథినాశో మోక్ష ఇతి స్మృతః.
(శివగీత. 18.32)

— మోక్షమున కొక చోటు లేదు; ఒక యూరును లేదు. అనఁగా: దానికొఱ కెక్కడకును పో నక్కఱ లేదు. తన హృదయమందున్న

కేవల వేదాంతశాస్త్రజ్ఞానకు నుండు భేద మిద్దియ. మఱియు నీ యభి ప్రాయముదేతదే గీతలయందు జ్ఞానలక్షణమును జెప్పుచు "జ్ఞాన మనఁగా, బాహ్యసృష్ట్యారంభమున నున్న పదార్థము బుద్ధికి కేవలము తెలియుటయే" యని వ్యాఖ్యానముఁ జేయక "అవమానిత్వము, శాంతి, ఆత్మనిగ్రహము, నమబుద్ధి మొదలగు నుదాత్తమనోవృత్తులు విజృం భించుటచే నెవని చిత్తముయొక్క పూర్ణశుద్ధి యాచరణలో నెల్లప్పుడును వ్యక్తమగునో యతఁడే సత్యమగు జ్ఞానిగ నున్నాఁడు" అని చెప్పఁబడి నది (గీ. 13. 7-11). జ్ఞానముచే వ్యవసాయాత్మక మగు నెవని బుద్ధి యాత్మ నిష్ఠమైనదో (అనఁగాఁ: ఆత్మానాత్మ విచారమునందు స్థిరమగు టచే నెవని మనస్సునకు సర్వభూతాత్మైక్యజ్ఞానము కలిగినదో) యా పురుషుని వానినాత్మకబుద్ధియు శుద్ధముగనే యుండవలయు నను విష యమునందు శంక యేమియులేదు; కాని యెవనిబుద్ధి యెటులున్నదో తెలిసికొనుటకు వాని యాచరణ తప్ప, నితరములగు బాహ్యసాధ నము లేమియులేవు గాన, జ్ఞాన నమబుద్ధిశబ్దములలోనే శుద్ధ (వ్యవ సాయాత్మక) బుద్ధియు, శుద్ధవాసనయు (లేక, వాసనాత్మకబుద్ధియు) శుద్ధాచరణము నను నీ మూఁడు శుద్ధవిషయములయొక్కయు నమా వేశము చేయఁబడుననియు, విశేషముగ పుస్తకజ్ఞానమును మాత్రమే విస్తరింపఁజేయు (అనఁగాఁ: అనుభవజ్ఞానము లేని) నే కాలమున నీ విషయమును బాగుగ గుర్తుంచుకొనవలయును. బ్రహ్మవిషయమై శుష్క మగు వాక్పాండిత్యమును జూపువారును, విని 'వహ్వా, వహ్వా' యని తలలూపువారును నాటకశాలలో నున్న సభానదులవలె 'మరల నదే చెప్పు'మను వారును ననేకులు గలరు (గీ. 2.29; కఠ. 2.7). కాని పూర్వమునందుఁ జెప్పఁబడినటుల నెవఁ డంతర్బాహ్యశుద్ధుఁడు (అనఁ గాఁ: సౌమ్యశీలుఁడు) అగునో వాఁడే సత్యమగు నాత్మనిష్ఠుఁడు, వానికే ముక్తి లభించును. కేవల పండితులకు లభింపదు. వాఁ డెంత బుద్ధి మంతుఁ డైనను నెంత బహుశ్రుతుఁ డైనను లాభములేదు. "నాయ మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా బహునా శ్రుతేన"-అని యుప

నిషత్తులలో స్పష్టముగనే చెప్పఁబడియున్నది (కఠ. 2.22; ముం.3 2.8) కావుననే "ఝూలాసి పండిత పురాణసాంగసీ, పరితూఁ సేణసీ మీఁ హేఁ కోణ"- పండితుఁడ వగుదు వేని పురాణముఁ జెప్పుదువు. కాని నీ వెవఁడవో తెలిసికొనలేవు అని తుకారాంబువాగారు సైతము వచించిరి (గా. 2599). నాయొక్క జ్ఞాన మెంత యల్పమో చూడుము. 'ముక్తి లభించును' అను మాట సహజముగనే నా నోటినుండి వెలువడు చున్నది' అని యనుటకు నాత్మకంఠె ముక్తి వేఱుగనున్నదని యభి ప్రాయమా ఏమి? బ్రహ్మము-ఆత్మయు ననునవి యొకటిగనే యున్నవి యను జ్ఞానోత్పత్తి కి పూర్వము ద్రష్టకును, దృశ్యమగు జగత్తునకును భేద ముండెను. కాని బ్రహ్మైక్యజ్ఞానము పూర్ణముగ కలిగిన పిదప నాత్మ బ్రహ్మమందుఁ గలిసిపోవుటచే బ్రహ్మజ్ఞాని కూర్చున్న చోటనే తానే బ్రహ్మస్వరూపుఁ డగుచున్నాఁ డనియు, ఈ యాధ్యాత్మికావస్థనే 'బ్రహ్మనిర్వాణ', మనియు 'మోక్ష' మనియుం జెప్పుదురు. కావున వాఁ డేమియు నెవరికి నీయనక్కఱ లేదు. ఎక్కడనుండియు మఱి యొక పదార్థము రా నక్కఱలేదు. దీనికొఱకు మఱియొక లోకము లోనికి వెళ్ళవలసిన నిమిత్తము లేదు అని మన యధ్యాత్మశాస్త్రముచే నిశ్చయింపఁ బడినది. పూర్ణముగ నాత్మజ్ఞాన మెప్పు డెక్కడ కలుగునో యా క్షణమునందే యా స్థలమునందేమోక్ష మున్నది. కారణ మేమి యన: మోక్ష మనునది యాత్మయొక్క మూలభూతమునకు శుద్ధావస్థగ నున్నది. వేఱగు స్వతంత్రవస్తువు గాని, స్థలము గాని కానేరదు.

మోక్షస్య న హి వాసోఽస్తి న గ్రామాంతర మేవ వా,
అజ్ఞానహృదయ గ్రంథినాశో మోక్ష ఇతి స్మృతః.
(శ్రీగీత. 18.32)

— మోక్షమున కొక చోటు లేదు; ఒక యూరును లేదు. అనఁగా: దానికొఱ కెక్కడకును పో నక్కఱ లేదు. తన హృదయమందున్న

యజ్ఞానగ్రంథియొక్క నాశమునే మోక్ష మని చెప్పుచున్నారు అని శివగీతలలో నున్నది. కావున నధ్యాత్మశాస్త్రమునం దుండి నిష్పన్న మగు నీ ఫలితార్థమే "అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్" -ఎవరికి పూర్ణమగు నాత్మజ్ఞానము కలిగినదో వారికి బ్రహ్మనిర్వాణరూప మగు మోక్షము కూర్చున్నచోటనే లభించును (గీ. 5. 26) అనియు, "య స్సదా ముక్త ఏవ సః" (గీ. 5. 28) అనియు భగవద్గీతాశ్లోక ముల యందును, "బ్రహ్మవేద బ్రహ్మైవ భవతి"- బ్రహ్మమును దెలిసికొన్నవారు బ్రహ్మమే యగుచున్నారు (ముం. 3. 2. 9) మొద లగు నుపనిషద్వాక్యముల యందును జెప్పఁబడినది. మనుష్యుని యాత్మకు జ్ఞానదృష్టిచేఁ గలుగు నీ పూర్ణావస్థనే 'బ్రహ్మభూతము' (గీ. 18.54), లేక, 'బ్రాహ్మస్థితి' (గీ. 2.72) యని చెప్పుచున్నారు. ముఱియు స్థితప్రజ్ఞుఁడు (గీ. 2. 55-72), భక్తుఁడు (గీ. 12. 13-20), లేక, త్రిగుణాతీతుఁడు (గీ. 14. 22-27) నగు పురుషుని గుఱించి భగవద్గీతయందును నితర గ్రంథములందు నున్న వర్ణనయంతయు నీ యవస్థను గుఱించియే యై యున్నది. 'త్రిగుణాతీత' అను పదము వలన ప్రకృతి, పురుషులను రెంటిని స్వతంత్రములుగ నంగీకరించి సాంఖ్యులు చెప్పినట్లు 'పురుషునకు కేవలత్వమే మోక్ష' మనునదియే గీతలకు సమ్మత మని యనుకొనఁ గూడదు. ముఱి యే మనఁగా: అధ్యాత్మశాస్త్రమునం దున్న "అహం బ్రహ్మాస్మి"- నేనే బ్రహ్మముగా నున్నాఁడను (బృ. 1.4.10) అను బ్రాహ్మస్థితి యొకానొకప్పుడు భక్తి మార్గముచేతను ముఱియొకప్పుడు చిత్తనిరోధరూపమగు పాతంజల యోగమార్గముచేతను ఇంకొకప్పుడు గుణాగుణవివేచనరూపమగు సాంఖ్యమార్గముచేతను ప్రాప్తమగునని గీతలయొక్క యభిప్రాయము. ఈమార్గములలో నధ్యాత్మవిచార మను మార్గము కేవలము బుద్ధిగమ్య మనియు, సామాన్య మనుజులకు పరమేశ్వర స్వరూపజ్ఞానము కావలసినయెడల భక్తి యనునదియే సులభసాధనముగ నున్నదనియు

గీతలయందుఁ జెప్పఁబడియుండుటచే దానియొక్క సవిస్తరమగు విచారము పదుమూఁడవ యధ్యాయమునందుఁ జేయఁబడును. సాధనమేదైన కానిమ్ము; బ్రహ్మాత్మైక్యమునొక్క (అనఁగా: సత్యమగు పరమేశ్వర స్వరూపమునొక్క) జ్ఞానము కలుగుటచే, జగత్తునందున్న నిఖిల భూతములలోను నొక యాత్మయే యున్నదని తెలిసికొనుటయు, తదనుసారముగ నాచరించుటయు ననునదియే యధ్యాత్మ జ్ఞానమునొక్క పరాకాష్ట యగుటచే నీ స్థితిని బొందిన పురుషులే ధన్యులును కృతకృత్యులు నగుదు రని మాత్రము నిర్వివాదముగనే యున్నది. కారణ మేమి యనఁగా: కేవల మింద్రియ సుఖము మనుజులకును పశువులకును సమానముగ నుండుటచే మనుష్యజన్మము యొక్క సార్థకత గాని, లేక, మనుజునియొక్క మనుష్యత్వము గాని జ్ఞానప్రాప్తియందే యున్నదని పూర్వమున దే చెప్పఁబడియున్నది. సర్వభూతముల యందును మనోవాక్కాయములచే నెప్పుడు నిట్టి సామ్యబుద్ధినుంచి సర్వకర్మలను చేయుటయే నిత్యముక్తావస్థ, పూర్ణయోగము, లేక, సిద్ధావస్థ యనియు చెప్పఁబడినది. గీతలలోఁ జెప్పఁబడిన యీ యవస్థలలో పండెండవ యధ్యాయమునందున్న (జ్ఞా. 12. 18) భక్తునియొక్క వర్ణనకు వ్యాఖ్యానముఁ జేయుచు—

పార్థా జయాచియా రాయాఁ, వైషమ్యాచీ వార్తా నాహీఁ,
రిపుమిత్రా దోహీఁ, సరిసా పాడు.
కాఁ ఘరిచియాఁ ఉజియేడు కరావా, పారఖియాఁ
అంధారు పాడావా, హేఁ నేణేచి గా పాండవా, దీపు జైసా.
జో ఖాండావయా ఘావో ఘాలీ, కాలావడీ జయానేఁ కేలీ,
దోఘాఁ యేకచి సాఉలీ, వృక్షు దే జైసా.

— ఓ పార్థా! ఎవని హృదయమున వైషమ్యము నామమాత్రమైనను లేదో, యెవఁడు శత్రుమిత్రుల నిరువురను సమానముగఁ జూచుచున్నాఁడో; ఓ పాండవా! దీప మేవిధమున 'ఈ యిల్లు నాది గాన

దీనిఁ బ్రకాశింపఁజేయుదును' అని కాని, 'ఇది మఱియొకరి యిల్లు గాన దీనిని ప్రకాశింపఁజేయను' అని, కానియనుకొనుట నెఱుంగదో యా విధమున నెవఁడు భేదభావము నెఱుంగడో; చెట్టు, తన్నునాటిన వానికిని తన్ను నఱుకు వానికిని సమానముగ నీడనిచ్చున ట్లెవఁడు సముఁడుగ నుండునో అనియు తత్పూర్వమునందున్న (భ్ర. 12. 18) యధ్యాయమునందే—

ఉత్తమాశే ధరిజే, అధమాశే అవ్తేరిజే,
హేఁ కాహోఁచ నేటిజే, వసుధా జేవోఁ.
కాఁ రాయాచేఁ దీవా చాఁరూఁ, రంకా పరౌశేఁ గాఁరూఁ,
హేఁ న మ్హణేచి కృపాఁరూ, ప్రాణు పైఁ గా.
గాఁఱుచీ తృషా హరూఁ, కాఁ వ్యాఘ్రా విష హోఁఉని మారూఁ
ఎసేఁ వేజేచి కాఁ కరూఁ, తోయ జై సేఁ.
జైసీ ఆఘవియాఁచి భూతమాత్రీఁ, ఏకపణేఁ జయా మైత్రీ,
కృపేశోఁ ధాత్రీ, ఆపణచి జో.
ఆణి మీ హే భాష నేణేఁ, మాయేఁ కాహీఁచి న మ్హణే,
సుఖదుఃఖ జాణణేఁ నాహోఁ జయా.

— ఎవఁ డుత్తముని సాంగత్యముఁ జేయవలయు ననియు నధముని సాంగత్యముఁ జేయరా దనియు నీ భేదమును భూమివలె నెఱుంగఁడో దయగలవాఁ డగు నెవఁడు రాజును గౌరవింతు ననియు దరిద్రు నవమానింతు ననియు మనస్సున నెన్నఁడో; నీరు అవుయొక్క దప్పిని తీర్తు ననియు పులిని విషమై చంపుదు ననియుఁ దలంపనట్లు సర్వ ప్రాణుల విషయమై యెవని కేకరూపముగ మైత్రి గలదో; యెవఁడు స్వభావముచేతనే దయగలవాఁడో, యెవఁడు సుఖదుఃఖముల నెఱుంగఁడో, వాఁడే ముక్తుఁడు. అధ్యాత్మవిద్యచే తుదకు ప్రాప్తమగునని యింతకంటె నేమియు లేదు అనియు జ్ఞానేశ్వరమహారాజుగా రనేక దృష్టాంతములతో బ్రహ్మభూతునియొక్క సామ్యావస్థను శుద్ధమవ

రాష్ట్రభాషయందు మిక్కిలి నరనముగను చమత్కారముగను నిరూపణ చేసియున్నారు. దానియందు గీతలలోని నాల్గుస్థలముల యందుండు బ్రాహ్మస్థితి సంబంధమగు వర్ణనయొక్క సారాంశ మున్నది యని వచించుట కే యభ్యంతరమును లేదు. అధ్యాత్మవిద్యచే దుదకుఁ బొందఁదగిన ఫల మిదియే.

సర్వమోక్షధర్మములకు మూలమగు నధ్యాత్మజ్ఞానముయొక్క పరంపర మన దేశమున నుపనిషత్తులు మొదలుకొని తుకారామబువా గారి పర్యంతము నవ్యాహతముగ నెట్లు వచ్చుచున్న దనియు నీ పూర్వోక్తమగు పరిశీలన వలనఁ దెలియును. కాని యుపనిషత్తుల కాలముకంటె పూర్వమున సైతము (అనఁగా: అత్యంతమగు ప్రాచీన కాలమునుండియు) ఈ దేశమున నీ జ్ఞానము ప్రాదుర్భవించి యిప్పటికి క్రమక్రమముగ నుపనిషత్తులలోని విచారమూలముగ వృద్ధిఁ జెందిన దను విషయము చదువరులకు లెస్సగఁ దెలియుటకై ఋగ్వేదమందున్న బ్రహ్మవిద్యకు నాధారభూతమగు నుపనిషత్తునందలి యొక ప్రసిద్ధమగు సూక్తము భాషాంతరముతో ముందు వ్రాయఁబడును. సృష్టికి నగమ్యమగు మూలతత్త్వ మేది? దానియందుండి యీ వివిధమగు దృశ్యసృష్టి యెట్లు గలిగియుండును? అను విషయ మీ సూక్తమున నిరూపింపఁ బడినట్లు, ప్రగల్భమును, స్వతంత్రమును మొదలంటఁ జేయఁబడినదియు నగు తత్త్వజ్ఞానముయొక్క సమర్థకవిచారము ధర్మగ్రంథములలో నే మూలగ్రంథమునను స్పష్టముగ విచారింపఁబడ లేదు. ఇంతియ కాక యిట్టి యధ్యాత్మవిచారముతో నిండినదియు, నింత ప్రాచీనమైనదియు నగు గ్రంథ మిప్పటికి నెక్కడను లభ్యము కాలేదు. కావుననే యనేకులగు పాశ్చాత్యులు సైతము ధార్మికమగు నితిహాసదృష్టిచే గూడ నీ సూక్తము మిక్కిలి మహత్త్వముఁ గలదని యెఱింగి యాశ్చర్యచకితులై మనుజుని మనఃప్రవృత్తి నశ్వరమును నామరూపాత్మకమునగు సృష్టికి పరమందున్న నిత్యము నచింత్యము నగు బ్రహ్మశక్తి వైపున కెటుల సహజముగ నొఱగియున్నదియుఁ

దెలియఁజేయుటకై తమతమ భాషలలోనికి దీనిని మార్చుకొనిరి. ఈ సూక్తము ఋగ్వేదమున పదియవమండలము నందలి 129 వది యై యున్నది. సూక్తారంభమునందుండు శబ్దముంబట్టి దీనిని "నాసదీయ సూక్త" మని చెప్పుచున్నారు. మఱియు నిది తై త్తిరీయబ్రాహ్మణము నందు (2.8.9) చెప్పఁబడియున్నది. మహాభారతమునందు నారాయణీయ, లేక, భాగవత ధర్మములందును భగవదిచ్ఛచే తొలుత సృష్టి యెటులయ్యె ననుఁ విషయ మీ సూక్తాధారముంబట్టియే వర్ణితమైనది (మ.భా.శాం. 342.8) సర్వానుక్రమణికా ప్రమాణముంబట్టి యీ సూక్తమునకు ఋషి పరమేష్ఠి ప్రజాపతి, పరమాత్మ దేవత, గలిగి త్రిష్టుప్ ఛందము (అనఁగా: ప్రతిపాదమునకును బదునొకండక్షరములు, నాలుగు చరణములు) గల ఋక్కు లేదు కలవు. 'సత్', 'అసత్' అను శబ్దములు ద్వ్యర్థము లగుటచే, జగత్తుయొక్క మూల ద్రవ్యమును 'సత్' అని చెప్పుటలో నుపనిషత్కారులకుఁ గల దని పూర్వమునం దీ ప్రకరణములోఁ జెప్పఁబడిన మతభేదమే ఋగ్వేదము నందును సృష్టముగఁ గాన్పించుచున్నది. ఉదాహరణము: ఈ మూల కారణ విషయములో నొకచోట "ఏకం సద్విప్రా బహుధా వదన్తి" (ఋ. 1.164.46), మఱియొకచోట "ఏకం సన్తం బహుధా కల్పయన్తి" (ఋ. 10. 114. 5) అని చెప్పఁబడినది. ఏకమును, సత్తును (ఎప్పుడుండునది) అగు దానినే లోకులు వేర్వేఱుగఁ బేర్కొనెదరు. కాని కొన్ని స్థలములయందు దీనికి విపరీతముగనే "దేవానాం పూర్వ్యే యుగేఽసత స్స దజాయత" (ఋ. 10. 72. 7)- దేవతల యుత్పత్తికంటె పూర్వమందు సైత మసత్తునం దుండియే (అనఁగా: అవ్యక్తమున నుండి) సత్తు (అనఁగా: వ్యక్తము) యొక్క సృష్టి యుత్పన్నమైన దని యితర స్థలము లందును జెప్పఁబడినది. ఇంతియ కాక జగత్తుయొక్క మూలారంభమున హిరణ్యగర్భుఁ డుండెను, అమృతము మృత్యువు ననుసీ రెండును నతని ఛాయలే. వానిచే విధప జగత్తంతయు నిర్మింపఁబడినది (ఋ. 10.121.1-2). పురుషుఁ

డాదియందు విరాడ్రూపుఁ డై యుండెను. వానియందుండి యజ్ఞ ములద్వారా సర్వసృష్టియు నుత్పన్న మైనది (ఋు. 10.90). ప్రారంభ మున జల ముండెను. దానియందు ప్రజాపతి పుట్టెను. (ఋు. 10.72. 6; 10.82.6) లేక, ఋతసత్యములు రెండు ప్రథమమున నుత్పన్నము లైనవి. అనంతరము రాత్రి (అంధకారము), సముద్రము (జలము), సంవత్సరము మొదలగునవి యుత్పన్నము లైనవి (ఋు. 10.190.1). ఇట్లేదియో యొక దృశ్యతత్త్వమునుండి సృష్టి యుత్పన్న మైన దని ఋగ్వేదమునందే వేర్వేఱుగ వర్ణింపఁబడి యున్నది. ఋగ్వేదమున వర్ణితమగు నీ మూలద్రవ్యములోనే తొలుత (1) తైత్తిరీయబ్రాహ్మణము నందు "ఆపో వా ఇద మగ్రే సలిల మాసీత్" (తై.భా. 1.1.3.5)- ఈ సర్వమును ప్రారంభమున పలుచనిది యైన జలముగ నుండెను. అని యుదకమయొక్కయు, (2) తైత్తిరీయోపనిషత్తునందు "అస ద్వా ఇద మగ్ర ఆసీత్" (తై. 2.7)-ఇది తొలుత నసత్తుగనే యుండెను అని యసత్పదార్థముయొక్కయు, (3) ఛాందోగ్యములో "సదేవ సో మ్యేద మగ్ర ఆసీత్" (ఛా. 6.2)- ఈ సర్వమును తొలుత సత్తుగనే యుండెను అని సత్పదార్థముయొక్కయు, (4) "ఆకాశఃపరాయణం" (ఛాం. 1. 9)- ఆకాశము సర్వమునకు మూలము అని యాకాశము యొక్కయు, (5) బృహదారణ్యకమందు "నై వేహ కించ నాగ్ర ఆసీ న్మృత్యు నై వేద మావృత మాసీత్ (బృ. 1.2.1)- ప్రారంభమున నిదంతయు లేకుండెను. సర్వముమృత్యువుచేతనే యాచ్ఛాదింపఁబడి నది అని మృత్యువుయొక్కయు, (6) మైత్ర్యుపనిషత్తునందు "తమో వా ఇద మగ్ర ఆసీ దేకమ్" (మై. 5. 2)- ఈ సర్వమును ప్రారంభ మున నొకే తమస్సుగ (తమో గుణి, అంధకారమై) నుండెను. పిదప నందుండి రజస్సును, సత్యమును బుట్టినవి యని తమస్సుయొక్క యనువాదము చేయఁబడినది. అటులే యీ వేదవచనముల ననుస రించి మనుస్మృతిలో-

ఆసీ దిదం తమోభూత మప్రజ్ఞాత మలక్షణమ్,
అప్రతర్క్య మవిజ్ఞేయం ప్రసుప్తమివ సర్వతః.

(మను. 1.5.1)

— ఈ సమస్తమును దొలుత తమస్సుచే (అంధకారముచే) వ్యాప్త మైనందున భేదాభేదముల నెఱుంగుటకు యోగ్యము కామిచే నగమ్య ముగ నిదురించినటు లుండెను. పిదప దానియం దవ్యక్త పరమాత్మ ప్రవేశించి జలమును ప్రారంభమున సృజించెను అని సృష్ట్యారంభము వర్ణితమైనది. . సృష్ట్యారంభమున నున్న మూలద్రవ్య సంబంధ విష యమై యీవిధములగు వేర్వేఱువర్ణనలు, నాసదీయసూక్తమ పుట్టిన సమయమునందును ప్రచలితములుగ నుండవలయును. మఱియు నిం 'దే మూలద్రవ్యము సత్య మని యెఱుంగవలయును?' అను ప్రశ్న యప్పుడే పుట్టియుండును. కారణ మేమి యనఁగా: దానియందు బీజము (అనఁగా: సత్యము) ఏమగు నను విషయమై యీ సూక్తము యొక్క ఋషి యిట్లు వక్కాణించియున్నాఁడు—

నాస దాసీ న్నో స దాసీత్త దానీం
నాసీ ద్రజో నో వ్యోమాపరో యత్,
కి మావరీవః కుహ కస్య శర్మ
న్నంభః కి మాసీ ద్గహనం గభీరమ్. 1

— అప్పుడు అసఁగా: మూలారంభమున, అసత్తు లేకుండెను. సత్తును లేకుండెను. అంతరిక్షము లేకుండెను. దానికంటె పరమందున్న యాకాశము లేకుండెను. (ఈ స్థితియందు) ఎవరు (ఎవరిని) ఆవరించి యుండిరి? ఎక్కడ? ఎవరి సుఖముకొఱకు? అగాధము, గహనమగు జలముసైత మెక్కడ నుండెను? *

* మొదటిమాఱ్కి యొక్క నాలవచరణమున 'అసీత్కిం' అని యున్న యుంది, నే నీ విధముగ వర్థమున ప్రాసినాను. దానికి 'జలము అప్పుడు లే' దని భావార్థము (శై. బ్రా. 8.8.1 చూడుము).

న మృత్యు రాసీ దమృతం న తర్హి
న రాత్ర్యా అహ్న ఆసీ త్ప్రకేతః,
ఆనీ దవాతం స్వధయా తదేకం
తస్మాద్ధాన్య న్న పరః కించ నాస. 2

– అప్పుడు మృత్యువు, అనఁగా: మృత్యుగ్రస్తము, నశ్వరము నగు దృశ్యసృష్టి లేక యుండెను. కావుననే (రెండవది) అమృతము, అనఁగా: అవినాశియగు నిత్యపదార్థము(ఈ భేదమును లేకయుండెను.

తమ ఆసీత్తమసా గూఢ మగ్రే
ప్రకేతం సలిలం సర్వ మా ఇదమ్,
తుచ్ఛేనాభ్వపిహితం యదాసీత్
తపసస్త న్మహినాఽజాయతై కమ్. 3

– అంధకార ముండెను. ఆరంభమునం దిది యంతయు నంధకార ముచే వ్యాప్తమును, (మఱియు) భేదాభేదరహిత జలముగను నుండెను లేక, ఆభు, అనఁగ: సర్వవ్యాపియగు బ్రహ్మము (ఆరంభముననే) తుచ్ఛముచేతనే, అనఁగా: అనిత్యమగు మాయచేతనే, యాచ్ఛాదిత మయినది– అని (యత్) ఏది (చెప్పఁబడుచున్నదో) అది (తత్) మూలమున నొకటియె (బ్రహ్మమే). తపస్సుయొక్క మహిమచే (రూపాంతరముచే)ఁ బిదపఁ బ్రచురమైనది.*

---

* కొంద ఱీ మూఁడవ ఋక్కుయొక్క తొలి మూఁడు పరణములు స్వతంత్రము లని యంగీకరించి, "అంధకారము, దానిచే వ్యాప్తమగు జలము, లేక, తుచ్ఛముచే నాచ్ఛాదితమైన అభువు (శూన్యము)గా నుండెను" అని వానికి విధానార్థకమగు నర్థము జేసిరి. కాని "ఆరంభమున నేమియు లేదు" అని యీ సూక్తమునందలి మొదటి రెండు ఋక్కులయందును స్పష్టముగఁ జెప్పఁబడి యున్నది. మూలారంభమున నంధకారముగాని, జలముగాని యుండెనని పూర్వము చెప్పఁబడిన దానికి విరుద్ధముగ నీ సూక్తమునందే చెప్పఁబడియుండుట యవంథవము గాన వది తప్పని నా యుద్దేశము. ఇంతియకాక యటు లర్థముఁ జేసినను

కామస్త దగ్రే సమవర్తతాధి
మనసో రేతః ప్రథమం య దాసీత్,
సతో బన్ధు మసతి నిరవిందన్
హృది ప్రతీష్యా కవయో మనీషా. 4

– (దీనియొక్క) మనస్సుయొక్క యే రేతస్సు, అనఁగా: బీజము, ప్రారంభమున బయలువెడలెనో, యదే ప్రారంభమున కామము (అనఁగా: సృష్టిని నిర్మించు ప్రవృత్తి, లేక, శక్తి) అయ్యెను. (అదే) అసత్తునందు, అనఁగా: మూలపరబ్రహ్మమందు సత్తుయొక్క అనఁగా వినాశి దృశ్యసృష్టియొక్క (మొదటి) సంబంధ మని జ్ఞాతులు అంతఃకరణమందు విచారించుకొని బుద్ధిచే నిశ్చయించినారు.

మూఁడవ చరణమునందలి 'య'శ్శబ్దము విరక్తః మని చెప్పవలసివచ్చును. అందుచే మూఁడవ చరణమునందలి 'య'శ్శబ్దమునకు నాల్గవచరణములోని తచ్ఛబ్దముతో సంబంధము గలిగి నేమ ప్రాపివల్లగానే యర్థముఁ జెప్పక తప్పదు. 'మూలారంభమున జలము మొదలగు పదార్థము లుండెను' అని చెప్పువారికి సమాధానము చెప్పుట కీ సూక్తమున పీ ఱుత్కుర్వ్నది. మీరు చెప్పినటులు మూలమున తమస్సు జలము మొదలగు పదార్థములు లేవు. ఇఁక నేమవ: ఈ సమస్త ప్రపంచము నొక బ్రహ్మాండం దుండియే పిదప వెలువడిన దని ఋషియొక్క యూహ్యేశ మని చెప్పవలసివచ్చును. 'తచ్ఛము', 'అతు' అను పీ రెండును పరస్పర విరుద్ధార్థములు కావునవే, తచ్ఛమునకు వివరీతమగు గొప్పది, లేక, సమర్థ మయిన దని, 'అతు' శబ్దార్థమును జెప్పవలసివచ్చును. ఋగ్వేదమునం దింతమ వెందు స్థలములలో 'అతు' శబ్దప్రయోగము కాపించుచున్నది (ఋ. 10. 27.1-4). అచో పాయాదాద్యులు సైత మీ శబ్దమున కీ యర్థమునే ప్రాపియున్నారు. పంచదశిలో (చిత్రదీప. 128-130) తుచ్ఛశబ్దమును మాయార్థకముగఁ బ్రయోగించియున్నారు (వృపిం. ఉత్త. శి. చూడుము). చూడఁగా 'అతు' శబ్దమునకు రూఢమని యర్థము కావేరదు. 'పరబ్రహ్మమే' యర్థ మగును. "పరం అతి ఇదమ్". ఇచో 'అతి' (అత్+అస్) అనునది అస్ ధాతువుయొక్క భూతకాలరూపమైనందున దీనికి 'అపేత్' అని యర్థము.

తిరశ్చీనో వితతో రశ్మిరేషామ్
అధఃస్వి దాసీ దుపరి·స్వి దాసీత్,
రేతోధా ఆసన్ మహిమాన ఆసన్
స్వధా అవస్తాత్ ప్రయతిః పరస్తాత్. 5

– (ఇది) రశ్మి, అనఁగా: దారము, మేక, కిరణముయొక్క (లోపల) అడ్డుగ వ్యాపించినది. ఇది క్రిందను మీఁదను వ్యాపించియున్నది. వీనిలో కొన్ని రేతోధాఃఅనఁగా: బీజపదము లాయెను. మఱియు (వృద్ధిఁబొంది) గొప్ప వయ్యెను. వానియొక్క స్వశక్తి యీ వైపునకును, ప్రయతి, అనఁగా: ప్రభావము, ఆ వైపునకును, (వ్యాపించి) ఉన్నది.

కో అద్ధా వేద క ఇహ ప్రవోచత్
కుత అజాతా కుత ఇయం విసృష్టిః,
అర్వా గ్దేవా అస్య విసర్జనేనా
థ కో వేద యత ఆబభూవ. 6

– (సత్తుయొక్క) ఈ విసర్గము, అనఁగా: వ్యాప్తి, యెక్కడనుండి వచ్చెను? లేక, యెవనినుండి వచ్చెను? (దినికంటె) 'ప్ర', అనఁగా: విస్తారముగ, ఇచ్చోఁ జెప్పు వారెవరు? నిశ్చయముగ దెలిసికొను చున్న వా రెవరు? దేవతలు సైతమీ (సత్ సృష్టియొక్క) విసర్గానం తరముననే పుట్టినవారు. మఱి యది యెచ్చోనుండి వెలువడినదియు నెవ రెఱుంగుదురు?

ఇదం విసృష్టి ర్యత ఆబభూవ
యది వా దధే యది వా న దధే,
యో అ స్యాధ్యక్షః పరమే వ్యోమన్
సో అంగ వేద యది వా న వేద.

ఋ. 30

— (సత్తుయొక్క) ఈ వినర్గము, అనఁగా: వ్యాపన మెచ్చోనుండి వచ్చినది? లేక, అది నిర్మించినను నిర్మింపకపోయినను సరే. అది పరమ మగునాకాశమునం దుండెడి నీ జగత్తునకు నధ్యక్షుఁడు నగు (హిరణ్యగర్భుఁడు) వాఁ డెఱింగి యుండును; లేక, యెఱుంగక సైత ముండును! (ఎవరు చెప్పఁగలరు).

నేత్రములకును, లేక, సామాన్యముగ సకలేంద్రియములకును గోచరమును, వికారియు, వినాశియు, నామరూపాత్మకమునగు నానా దృశ్యముల జాలములోనే చిక్కుకొనియుండక దానికి పరమందు వీ దేని యేకము, నమృతమునగు తత్త్వము గలదో దానిని జ్ఞానదృష్టిచేఁ దెలిసికొనుటయే సర్వవేదాంతశాస్త్రముల రహస్యము. మఱియు నీ సారాంశ మనెడి వెన్నముద్ద విషయమై పైసూక్తములోని ఋషి తొలు దొల్తనే యింత తప్పులేని చక్కని యూహను జేయుటచే నాతని యంతర్జ్ఞాన మెంత తీవ్రముగ నున్నదియు స్పష్టముగఁ గాన్పించు చున్నది. మూలారంభమునందు (అనఁగా: సృష్టియం దున్న నానా పదార్థముల యస్తిత్వము కలుగుటకు ముందు) వీది గలదో యది 'సత్తు' గా నుండెనా? లేక 'యసత్తు' గా నుండెనా? మృత్యువుగా నుండెనా? లేక, అమరముగ నుండెనా? అకనముగ నుండెనా? లేక జలముగ నుండెనా? ప్రకాశముగ నుండెనా? లేక, యంధకారముగ నుండెనా? అను మొదలగు ననేక ప్రశ్నలను వేయుటలో వాదము పెట్టుకొనక, యొక్కపరి యీ యన్నింటికంటె మున్ను పరుగిడి యీ ఋషి విచారించున దేమి యనఁగా: "సత్-అసత్, మర్త్యము-అమరము, అంధకారము-వెలుతురు, అచ్ఛాదించునది-అచ్ఛాదింపఁ బడునది, సుఖమిచ్చునది-సుఖమనుభవించునది, అను నీ ద్వైతము యొక్క పరస్పరసాపేక్షమగు భాష, దృశ్యసృష్టి నిర్మితమైన తరు వాతిదియే యగుటచే సృష్టియందలి యీ ద్వంద్వములు పుట్టుటకు ముందు (అనఁగా: ఒకటి-రెం డను భేదములు లేనప్పుడు) ఎవరెవరి

నాచ్ఛాదింతురు? కావున మూలారంభమునం దున్న యేక విధమగు ద్రవ్యమే 'సత్' అనియు, లేక, 'అసత్' అనియు, ఆకాశము, లేక, జలమనియు, ప్రకాశము, లేక, యంధకార మనియు, అమృతము, లేక, మృత్యువు మొదలగు పరస్పర సాపేక్షమగు నే పే రిడుటకును యోగ్యము కానేరదు. ఉండున దేదియో యది సర్వపదార్థముల కంటె విలక్షణ మగుటచే నది యేకాకిగనే యారంభమున తన యపారమగు శక్తిచే నలుదిక్కులయందు స్ఫురించుచుండెను. దానితో సమాన మయినది, లేక, దాని నాచ్ఛాదించున దేదియు రెండవది లేదు" అని యీ సూక్తముయొక్క ఋషి ప్రారంభముననే నిర్భయముగఁ జెప్పుచున్నాఁడు. రెండవ ఋక్కునందు 'అనీత్' అను క్రియాపదమునందున్న 'అన్' ధాతువుయొక్క యర్థము శ్వాసోచ్ఛ్వాసములఁ జేయుట, లేక, స్ఫురణముఁ బొందుట యని యగుటచే, ప్రాణశబ్ద మీ ధాతువులననే వెలువడినది. కాని యేది 'సత్తు'ను 'అనత్తు'ను కానేరదో, అది సజీవ ప్రాణులవలె శ్వాసోచ్ఛ్వాసములను జేయుచున్నదని మాత్ర మెవరు సెప్పఁగలరు? మఱియు శ్వాసోచ్ఛ్వాసములను నడపుటకు వాయువైన నెక్కడనుండి వచ్చును? కావున 'అనీత్' అను పదమునకే 'అవాతం'=వాయువు లేనిదియే, 'స్వధయా'=స్వీయమగు మహిమచే, అను పదములను జతపఱచుటచే జగత్తుయొక్క మూలతత్త్వము జడము కాదను సీ యద్వైతావస్థ యందున్న యర్థము, "అది యొక వాయువుదక్క (అనఁగా: వాయ్వపేక్ష లేక), స్వశక్తి చేతనే శ్వాసోచ్ఛ్వాసములఁ జేయుచున్నది అని ద్వైతమును బోధించునవి వలెనుండు మాటలతో మిక్కిలి యుక్తిగ వర్ణితమయ్యెను. మఱియుం దాని జూడఁగనే కాన్పించు విరోధమంతయు నా యద్వైతతత్త్వమును బోధించు శబ్దములయందలి యసామర్థ్యముచే వెలువడినది. "నేతి నేతి", "ఏకమే వాద్వితీయం", లేక, "స్వే మహిమ్ని ప్రతిష్ఠితః" (ఛాం. 7. 24. 1)– తనయొక్క మహిమచేతనే (అనఁగా: నితరాపేక్ష లేకయే), యేకాకిగనే యుండు

వాఁడు. ఈ మొదలగు నుపనిషత్తు లందున్న పరబ్రహ్మ వర్ణనయం తయు నీ యర్థమునే బలపఱచునదిగ నున్నది. సర్వసృష్టియొక్క మూలారంభమున, ఏ యనిర్వాచ్యతత్త్వము నలుగడల స్ఫురించు చుండెనని యీ సూక్తమునఁ జెప్పఁబడినదో, యదియే సర్వదృశ్యసృష్టి యొక్క ప్రళయ మగునప్పుడు సైత మవశిష్టముగ నుండునని స్పష్ట మగుచున్నది. కావున గీతలయందు, "సర్వపదార్థములు నశించినను నేది నాశ మొందదో" (గీ. 8. 20) అని యీ పరబ్రహ్మమే కొన్ని పర్యాయపదములచే వర్ణిత మైనది. మఱియు "అది సత్తు గానేరదు, అసత్తును గానేరదు" (గీ. 13.11) అని యీ సూక్తము నాధారముగఁ గైకొని స్పష్టముగఁ జెప్పఁబడినది. కాని నిర్గుణపరబ్రహ్మము తప్ప రెండవ పదార్థ మేమియు లేనియెడల "ఆరంభమున జలము, అంధ కారము, లేక, అభువు, తుచ్ఛము నను వానియొక్క ద్వంద్వ ముం డెను" అను మొదలగు వర్ణన వేదాంతమం దుండుటచే నందులకు వ్యవస్థ యెటులఁ జేయనగు నను శంక పొడమును. కావున మూఁ డవ ఋక్కులో నీ కవి "జగదారంభమున నంధకారముండెను, లేక, అభువు (బ్రహ్మము), దాని నాచ్ఛాదించు మాయయు (తుచ్ఛము) వను నీ రెండును ప్రారంభమునందుండి యున్నవి" యని చెప్పియు న్నాఁడు. ఇవి యంతయు నేకాకియు నేకవిధము నగు మూలపరబ్ర హ్మముయొక్క తపోమహిమచేతనే క్రమక్రమముగ వివిధ సంసారము నుత్పన్నమైన పిదప యొనర్చిన వర్ణనగ నున్నది. కేవల మూలా రంభ ప్రతిపాదకము కానేరదు. ఈ ఋక్కునఁ దపశ్శబ్దముచే మూల పరబ్రహ్మముయొక్క జ్ఞానమయమగు విలక్షణశక్తి వివక్షిత మగుచు న్నది. ఈ శక్తియే నాలుగవ ఋక్కున వర్ణింపఁబడెను (ముం.1.1.9 చూడుము). కావున, "ఏతావాన్ అస్య మహిమా2తో జ్యాయాంశ్చ పూరుషః" (ఋ. 10.90.3) అను న్యాయానుసారముగ నీ సర్వసృష్టి యనునది యెవరి మహిమయో యా మూలద్రవ్య మీ యన్నింటి కంటె పరమగను శ్రేష్ఠముగను భిన్నముగ నున్న దని మరల చెప్ప

నక్కఱలేదు. కాని, చూడదగిన వస్తువు-చూచువాడును, భోక్త-భోగ్యము, ఆచ్ఛాదకము-ఆచ్ఛాద్యము, తమస్సు-వెలుతురు, మర్త్యము-అమరము మొదలగు సర్వద్వైతము నీ తీరుననే యొకపర్యాయమే పుట్టించి యేకము, నిర్భయము, చిద్రూపము, విలక్షణము నగు పర బ్రహ్మమే మూలారంభమున నున్న దని నిశ్చయించినను, ఈ యని ర్వాచ్యము, నిర్గుణము, నేకము నగు తత్త్వమునుండి, యాకాశము, జలము మొదలగు ద్వంద్వాత్మకము, వినాశి, సగుణము, నామరూపాత్మకము నగు వివిధసృష్టి గాని, లేక, యీ సృష్టికి మూలభూతమగు త్రిగుణాత్మక ప్రకృతి గాని, యెటు లుత్పన్నమయినవనియు చెప్పవలసిన సమయము తఱుస్థింపఁగనే, మనస్సు, కామము, అసత్తు, సత్తు, అని యిట్టి ద్వైతభాషయే యీ ఋషి యోచింపవలసియుండుటచేఁ దుద కీ విషయము మనుష్యబుద్ధికి గోచరమగు దానికంటె పరమందున్న దని యీ ఋషి స్పష్టముగఁ జెప్పుచున్నాఁడు. నాల్గవఋక్కునం దీ మూలబ్రహ్మమే యసత్తుగఁ జెప్పఁబడినది; కాని దాని 'కేమి లే' దని యర్థము కానేరదు. కారణ మే మనఁగా: రెండవ ఋక్కునందే 'యది యున్న'దని స్పష్టముగఁ జెప్పఁబడినది. ఈ సూక్తముననే కాక మఱియొక స్థలమునందును, దృశ్యసృష్టిని యజ్ఞముతోఁ బోల్చి, 'యీ యజ్ఞ మెనర్పుటకు వలయు నాజ్యము సమిధలు మొదలగు సామగ్రి ప్రారంభమున నెచ్చోనుండి వచ్చినది?' (ఋ. 10.130 శ) అనియు, గృహదృష్టాంతము గైకొని 'మూలమగు నొక నిర్గుణము వలన నేత్రములకుఁ బ్రత్యక్షముగఁ గాన్పించునదియు, నాకాశ పృథ్వీ రూపమగు నదియు నగు నీ భవ్యమగు నింటిని నిర్మించుటకు కలప (మూలప్రకృతి) యెచ్చోనుండి కైకొనఁబడినది?' అనియు-కిం స్విద్వనం క ఉ స వృక్ష ఆస యతో ద్యావాపృథివీ నిష్టతక్షుః - అని వ్యావహారికభాషను స్వీకరించియే ఋగ్వేదమునందును, వాజసనేయసంహితయందును గూఢములగు ప్రశ్నలు వేయఁబడినవి (ఋ. 10.81.7; 10.81.4; వాజసం. 17-20). ఈ యనిర్వాచ్యము, ఏకాకియు

నేకమునగు బ్రహ్మముయొక్క మనస్సునందే 'సృష్టి నిర్మింపవలయు' నని 'కామ' రూపమగు తత్త్వ మెటులో పుట్టెననియు, వస్త్రములో నున్న నూలుపోఁగులవలెను, సూర్యప్రకాశమువలెను, దానియొక్క శాఖయే (అనఁగా: అంశమే) బయల్పడి యంతటను (అనఁగా: క్రిందను పైనను నలుగడల) వ్యాపించి, 'నత్తు' యొక్క సర్వవ్యాప నమును (అనఁగా: అకాశపృథ్వు లనెడు భవ్యమును గృహము) నెట్లు నిర్మించినదియు నీ సూక్తములో నాల్గవ, యేడవ ఋక్కులయందుఁ (వాజస. సం. 22. 74) జెప్పఁబడినది. అంతకన్న విశేషముగ సమా ధానముఁ జెప్పుటకు సాధ్యము కానేరదు. కావున నీ సూక్తమందలి యర్థమునే యుపనిషత్తులలోను "సోఽకామయత బహుస్యాం ప్ర జాయే యేతి" (తై. 2. 6; ఛాం. 6. 2-3)- ఈ పరబ్రహ్మమునకే యనేక మగుదు నని యిచ్ఛ పొడమినది అనియు బలపఱుపఁబడినది (బృ. 1. 4 చూ). అథర్వవేదమందును నీ సర్వదృశ్యసృష్టికిని మూల భూతమగు ద్రవ్యమునందుండియే ప్రారంభమున 'కామము' వెలు వడినట్లు వర్ణితమైనది (అథర్వ. 9. 2. 19). కాని "నిర్గుణమునుండి సగుణమయొక్కయు, అసత్తునుండి సత్తుయొక్కయు, నిర్ద్వంద్వము నుండి ద్వంద్వముయొక్కయు, లేక, యసంగమునుండి సంగము యొక్కయు నుత్పత్తి యెటు లగునో యీ విషయము మనుష్యబుద్ధి కగమ్యముగ నుండుటచే సాంఖ్యులవలె కేవల తర్కవశుఁడై మూల ప్రకృతివలె రెండవ స్వయంభువును స్వతంత్రమునగు తత్త్వ మని యంగీకరింపక యేది తెలియదో దాని నెఱుంగ నని చెప్పుము. కాని దానికొఱకు శుద్ధబుద్ధిచేతను, ఆత్మానుభవముచేతను, నిశ్చితమగు ననిర్వాచ్య బ్రహ్మముయొక్క యోగ్యతను దృశ్యసృష్టిరూపమగు మాయకు నిచ్చి పరబ్రహ్మ విషయమగు నద్వైతబుద్ధిని వదలుట న్యాయము కానేర" దని యీ సూక్తఋషి ప్రతిపాదించుమన్నాఁ డమనదియె యీ సూక్తమునందలి విశేషము. ఇంతియ కాక

ప్రకృతి యనునది త్రిగుణాత్మకమగు రెండవ స్వతంత్రపదార్థ మని యంగీకరించినను, దాని యందుండి సృష్టి నిర్మాణ మగుటకు తొలుత బుద్ధిగాని (మహాన్) లేక, యహంకారముగాని యె ట్లుత్పత్తి యయ్యె నమ ప్రశ్నకు సుత్తర మిచ్చుట సాధ్యము కానేర దని యెఱుంగవల యును. మఱియు నీ దోష మెప్పటికైనను వదలనియెడల ప్రకృతి స్వతంత్ర మని యంగీకరించుటలో లాభ మేమి? మూలబ్రహ్మమునం దుండి ప్రకృతి (అనగా: సత్తు) యెట్లు నిర్మితమయినదో తెలియదని యందుమేని చాలును. దానికొఱకు ప్రకృతి స్వతంత్రమని యంగీక రించుట యావశ్యకము కానేరదు. మనుష్యబుద్ధికి సాధ్యము కా దన నేల? దేవతలకును సత్తుయొక్క యుత్పత్తి యె ట్లని యెఱుంగుటకు శక్యము కాదు. కారణ మేమి యన: దేవతలును దృశ్యసృష్టి యారం భమైన పిదపఁ బుట్టినవారే యగుటచే, వారి యుత్పత్తికంటెఁ బూర్వ మున నున్న పదార్థము వారి కెట్లు తెలియును? (గీ. 10.2 చూ) దేవతలకంటెను హిరణ్యగర్భుఁడు పూర్వుఁడును, శ్రేష్ఠుఁడు నగుటచే నతఁ డొకఁడే యారంభమున "భూతస్య జాతః పతి రేక ఆసీత్" (ఋ. 10.121.1) – సర్వసృష్టికిని పతి (అనఁగా: రాజు, లేక, యధ్య క్షుఁడు) యై యుండెను అని ఋగ్వేదమునందు చెప్పఁబడినది. "అతని కి విషయ మేల యెఱుక పడదు? తెలియు నేని యది దుర్బోధ మని యెట్లు చెప్ప నగు?" నని యెవరయిన నడిగెదరు. కావున నీ ప్రశ్నకు "అగును. అతఁ డీ విషయమును తెలిసికొనియుండును" అని తొలుత గౌణముగ నుత్తరమిచ్చి, వెంటనే "తెలియకుండ సైతముండ వచ్చును. ఎవరు చెప్పగలరు?" అని యుత్తరము నందిగ్ధముగఁ జెప్పుదురు. కారణ మేమి యన: "పరమాకాశమున నుండువాఁ డైనను నతఁడు సైతము సత్తుయొక్క కోటిలోఁ జేరినవాఁడే యగుటచే, నత్, అనత్, ఆకసము, జలము నను పినికంటె సైతము పూర్వమున నుండు విష యములయొక్క నిశ్చితజ్ఞాన మీ జగదధ్యక్షుని కెచ్చోనుండి కలు గును?" అని తన బుద్ధిచే బ్రహ్మదేవుని జ్ఞానసాగరముయొక్క లోఁతును

కనుఁగొన్న యీ ఋషి యాశ్చర్యముచే సాశంకముగఁ జెప్పుచున్నాఁడు; కాని యొక యనత్తునకే (అనఁగా: అవ్యక్తము నిర్గుణమునగు ద్రవ్యమునకే) వివిధ నామరూపాత్మకమగు సత్తుయొక్క (అనఁగా: మూలప్రకృతియొక్క) సంబంధ మెట్లు కలిగినదియు తెలియక పోయినను మూలబ్రహ్మ మొక్కటియే యను తన యద్వైతబుద్ధిని మాత్రము వదలఁడు. అచింత్యవస్తు వనుగహనమున మనుష్యబుద్ధి, సాత్త్వికశ్రద్ధయొక్కయు నిర్మలమగు ప్రతిభయొక్కయు బలముతో సింహమువలె నిర్భయముగ సంచరించి దానియందలి యతర్క్యవిషయములను యథాశక్తిగ నెట్లు నిశ్చయింపవలయునో యెఱుంగుటకిది యొక గొప్ప యుదాహరణము గాన ఋగ్వేదమునం దీ సూక్తముండుట నిజముగనే యాశ్చర్యకరముగ నున్నది. ఈ సూక్తమునందున్న విషయమును తొలుత బ్రాహ్మణమునందును (తైత్తి. బ్రా. 2. 8. 9), ఉపనిషత్తులయందును, పిదప వేదాన్తశాస్త్రగ్రంథములయందును, మన దేశమందున్న వారిచేతను, నర్వాచీనకాలమందు పాశ్చాత్యదేశములయందున్న కాంటు మొదలగు తత్త్వజ్ఞానులచేతను బహు సూక్ష్మముగ విచారింపఁబడినది; కాని ఋషియొక్క శుద్ధబుద్ధి కీ సూక్తమున నే పరమసిద్ధాంతము స్ఫురించినదో యా సిద్ధాంతమునే ప్రతిపక్షులకు వివర్తవాదము వంటి యోగ్యమగు నుత్తరము నిచ్చుటకై మిక్కిలి దృఢమగు దానిగను, స్పష్టమగు దానిగను, తర్కదృష్టిచే నిస్సందేహమగు దానిగను చేయుటకంటె నెక్కువగ నేఁటివరకు నెవ్వరును కార్య మొనర్చి యుండలేదు. ఇంతకంటె నెక్కువగఁ దెలిసికొనవలయు ననుపేక్షయు నుండఁ దగదు.

అధ్యాత్మప్రకరణము ముగిసినది! పిదపనుండు విషయ విచారణకు మున్నుగ సింహావలోకనము తీరున నింతదనుక విచారించిన విషయము నాలోచింతము. కారణ మేమి యనగా: ఇట్లు సింహావలోకనముఁ జేయకపోయితి మేని విషయానుసంధానము వదలి,

కుమార్గమున సంచరించుటకు సంభవ ముండును. గ్రంథారంభమున వాచకులను విషయములోఁ బ్రవేశపెట్టిన పిదప, కర్మజిజ్ఞాసా స్వరూపమును సంక్షేపముగఁ జెప్పి, మూఁడవ ప్రకరణమునం దున్న కర్మయోగశాస్త్ర మును నదియే గీతలయందు ముఖ్యప్రతిపాద్య మని నిరూపింపఁబడినది. పిదప నీ శాస్త్రమునకు నాధిభౌతికోపపత్తి యేకదేశీయ మనియు, నపూర్ణమనియు, నాధిదైవికము కుంటి దనియు, సుఖదుఃఖవివేక పూర్వకముగ నాలుగు, అయిదు, ఆఱవ ప్రకరణముల యందుఁ బ్రతిపాదించిన పిదపఁ గర్మయోగమున కాధ్యాత్మికోపపత్తిఁ జెప్పుటకంటె పూర్వమాత్మ యనఁగ నేమి యని తెలిసికొనుటకు నేడవ ప్రకరణమునందే మొదట క్షేత్రక్షేత్రజ్ఞవిచారణమును, బిదప నేడు, నెనిమిది ప్రకరణములలో సాంఖ్యశాస్త్రమునందలి ద్వైతానుసారముగ క్షరాక్షరములను విచారించి తుద కీ ప్రకరణమున నాత్మస్వరూప మేది యనియు, పిండబ్రహ్మాండముల రెంటియందు నమ్మతము నిర్గుణము నగు నొక యాత్మతత్త్వమే యోతప్రోతముగను (పడుగుపేకగ)నిరంతరముగను నెట్లు నిండియున్నదియు నిరూపింపఁబడినది. మఱియు సర్వభూతములయందు నొక యాత్మయే యను నీ సమబుద్ధి యోగమును సంపాదించి దానిని సర్వదా స్మరణయందుంచుకొనుట యనునదియే యాత్మజ్ఞానమునకును నాత్మసుఖమునకును పరాకాష్ఠ యగుటచేఁ దనబుద్ధి నీ తీరున శుద్ధ మగు నాత్మనిష్ఠావస్థకుఁ దెచ్చుకొనుటలోనే మనుష్యునకు మనుష్యత్వము (అనఁగా: నరదేహమునకు సార్థకత్వము, లేక, మనుజునకు పరమపురుషార్థము)గ నున్నదనియు నిశ్చయింపఁబడినది. మానవజాతికి నాధ్యాత్మికమగుపరమసాధ్య మేది?యనున దీ రీతిగ నిర్ణయింపఁబడిన పిదప జగత్తునఁ దనకుఁ జేయఁదగిన వ్యవహారము లన్నియుఁ దనచే నే ధోరణిచేఁ జేయఁబడవలయునో, లేక, యీ వ్యవహారము లే శుద్ధబుద్ధిచేఁ జేయఁబడవలయునో దాని స్వరూప మెట్టిది?, అనెడి యీ కర్మ

యోగశాస్త్రమునం దున్న ముఖ్యమగు ప్రశ్నకు నిందే సమాధానము న్యాయముగఁ గాఁగలదు. కారణ మేమి యనఁగా: ఈ సర్వవ్యవహార ములును . బరిణామమునందు బ్రహ్మైక్యరూపమగు సముద్ధికిఁ బోషకములో, లేక, యవిరుద్ధములగు రీతిగనే చేయఁబడవలయునని యిప్పుడు చెప్పనక్కఱలేదు. అర్జునునకు భగవద్గీతలలోఁ గర్మయో గమునందలి యీ యాధ్యాత్మికతత్త్వమే యుపదేశింపఁబడినది; కాని కర్మయోగముయొక్క ప్రతిపాదన మింతటితో ముగియదు. నాము రూపాత్మకజగత్తునం దున్న వ్యవహార మాత్మజ్ఞానమునగు విరుద్ధ మగు టచే జ్ఞాని దానిని వదలవలయు నని యనేక స్థలములయందుఁ జెప్పఁ బడినది. ఇది సత్య మగునేని జగత్తునందలి సర్వవ్యవహారములును త్యాజ్యము లని నిర్ణయ మగుటచేఁ గర్మాకర్మశాస్త్రము సైతము నిరర్థక మగును. కావున నీ విషయమును నిర్ణయించుటకై కర్మయొక్క నియ మము లెవ్వి? పరిణామ మేమి? లేక, బుద్ధి శుద్ధమైనను నీ వ్యవహా రము (అనఁగా: కర్మ) నేల చేయవలయును? మొదలగు విషయము లను సైతము కర్మయోగశాస్త్రమునందు విచారింపవలసి యుండును. తదనుసారముగనే భగవద్గీతలయం దా విచారము చేయఁబడియు నున్నది. నన్యాసమార్గీయజనుల కీ విషయములయందలి మహత్త్వ మేమియుఁ దోపకపోవుటచే భగవద్గీతయం దున్న వేదాంతము యొక్కయో, లేక, భక్తియొక్కయో నిరూపణము సమాప్తము కాఁ గానే తఱుచుగఁ దమ పుస్తకములఁ గట్టుటకు నారంభింతురు; కాని యట్లు చేయుట గీతలలోనున్న ముఖ్యవిషయము నలక్ష్యముఁ జేయు టయే యని మా మతము. ఈ విషయమయి భగవద్గీతలలోఁ బూర్వో క్తమగు విషయమునకు నేమి సమాధానము చెప్పఁబడెనో యిప్పుడు క్రమముగ విచారించెదము.

ఇది అధ్యాత్మ మను నవమ ప్రకరణము.





తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాల, తిరుపతి.